మ-రా-శ్రీ, బత్తులపల్లె శేషగిరిరావుగారు, రామరాజుపల్లె, కడప.

,, శాస్త్రపాటి చలపతిరావుగారు, కడప.

,, సముఖము శ్రీనివాసులునాయుడుగారు, ఇంగ్లీషు హెడ్ అసిస్టెంటు.

,, దేవరకొండ సుబ్రహ్మణ్యముగారు.

,, పుట్టమురెడ్డి చలమారెడ్డిగారు, పంచాయితీప్రెసిడెంటు, మంటపంపల్లె.

,, ఆకేపాటి తిరుమలరెడ్డిగారు, తా॥ బో॥ మెంబరు, గ్రామ మునసబు, నందలూరు.

,, పురిగండ్ల చెంగయ్యగారు, నాజరు, నందలూరు.

,, యాదాళ్ల బాలసుబ్బయ్యశ్రేష్ఠిగారు, [illegible]పల్లె.

,, నిట్టూరు లక్ష్మీనారాయణరావుగారు, బి. ఏ., ప్లీడరు, [illegible].

,, సిద్దవరం వేంకటసుబ్బయ్యగారు, బి. ఏ., ,, ,,

,, వి॥ కొప్రేశ్వాచార్యులుగారు, బి. ఏ. బి. ఇ. డి.

,, ఆర్కాటు వేంకోబరావుగారు, [illegible].

,, ఎస్. సుబ్బరావుగారు, బి. ఏ., ప్లీడరు.

,, ఉప్పర్లపల్లె రంగాచార్యులుగారు, పండితులు.

,, వై. కొండలరావుగారు, ఉపాధ్యాయులు.

,, ఓ. ఐ. కొరిరెడ్డిగారు, ఎం. ఏ., బి. ఎల్., వకీలు. తా॥ బో॥ ప్రెసిడెంటు.

,, కే. వేంకటరావుగారు, అనుంపల్లె.

,, మొలకతాళ్ల చిన్నపుల్లయ్యగారు, గాండ్లపాడు.

,, రాచర్ల తిప్పయ్యగారు, బెళగుప్ప.

,, కరణం కృష్ణరావుగారు, బేవినహా .

,, బి. రంగాచార్యులుగారు, కిరికెర.

,, కే. లింగప్పగారు, కరణం, కిరికెర.

మ-రా-శ్రీ, గాదంసెట్టి సుబ్బయ్యశ్రేష్ఠిగారు, కరిచేర.
,, కట్టా ఆత్మారామయ్యశ్రేష్ఠిగారు, హిందూపురము.
,, కట్టా మాధవయ్యగారి నారప్పశ్రేష్ఠిగారు. ,,
,, మాకం సీనయ్యగారి నారాయణయ్యశ్రేష్ఠిగారు.
,, కే. ఎస్. రాఘవాచార్యులుగారు, బి. ఏ., బి. ఎల్., డయు [illegible]
అనంతపురము.

,, మానేపల్లి నారాయణరావుగారు, వకీలు, అనంతపురము.
,, శ్రీకంఠం సుబ్బయ్యగారు, ఆంధ్రవిశ్వకళాపరిషత్సభ్యులు.
,, చిట్టా శేషప్పశ్రేష్ఠిగారు, బళ్లారి.
,, రావుసాహేబు టి. పాపయ్యశ్రేష్ఠిగారు, బళ్లారి.
,, బళ్లారిసెట్టి రంగబ్రహ్మానాయుడుగారు, బి. ఏ., ప్లీడరు,
బళ్లారి [illegible].

,, [illegible] శీనప్పగారు.
,, శ్రీమాన్ వై. రామానుజంగారు. [illegible]గారు, [illegible].
,, జాస్తి రంగయ్యగారు, బి. ఏ., బి. ఎల్., డిస్ట్రిక్టుమున్సిపు [illegible]
,, పుల్లెల వెంకటరామయ్యగారు, [illegible]పురము.
,, కే. జోగయ్యగారు, మదరాసు.

విషయసూచిక.

		పుట.
దేవతాస్తవము	...	1
శ్రీరాముఁడు తల్లికిఁ దనయరణ్యగమనముఁ దెల్పుట	...	11
లక్ష్మణుఁడు కౌసల్య నూఱడించుట	...	40
శ్రీరాముఁడు లక్ష్మణునకు శాంతముగల్గ బోధించుట	...	88
దైవమే బలవత్తరము	...	100
లక్ష్మణుఁడు పౌరుషమే దైవమునకంటె మిన్నయనుట	...	106
వనవాసమునకుఁ గౌసల్య సమ్మతించుట	...	119
కౌసల్య కుమారు నాశీర్వదించుట	...	136
రాముఁడు సీతాదేవికి స్వాభిప్రాయ మెఱిఁగించుట	...	150
సీత రామచంద్రునకు బదులుచెప్పుట	...	163
వనవాసకష్టములను రాముఁడు సీతకుం దెల్పుట	...	186
సీత రామమూర్తితోఁ దా నడవికి రాకమాననని తెలుపుట	...	191
సీతారాముల యవతారసిద్ధాంతము	...	202
వనగమనమున సీతారాములసంవాదము	...	219
రామలక్ష్మణసంవాదము	...	246
శ్రీరాముఁడు పయనముచేయఁబూని దానములిచ్చుట	...	255
సీతాలక్ష్మణులఁ దోడ్కొనిపోవ ననుమతిఁగోర రాముఁడు తండ్రికడ కరుగుట	...	263
శ్రీరాముఁడు తండ్రికడ ననుజ్ఞఁగొనుట	...	270
సుమంత్రుఁడు కైకను నిందించుట	...	285

		పుట.
సిద్ధార్థుఁడు కైకకు హితోపదేశము చేయుట	...	300
శ్రీరామాదులు వల్కలముల ధరించుట	...	308
రాజు వల్కలములు సీతకు నీవలదని కైకను దూషించుట	...	318
వనగమనసన్నాహము, కౌసల్య సీతకు నీతిని దెలుపుట	...	323
శ్రీరామావతారఫలమగు వనప్రయాణము	...	340
అపశకునములు పొడసూపఁగాఁ బ్రజలు దుఃఖించుట	...	368
దశరథుఁడు శోకించుట	...	371
కౌసల్య దుఃఖించుట	...	383
సుమిత్ర కౌసల్య నోదార్చుట	...	385
రాముఁడు పౌరుల నాశ్వాసించుట	...	394
శ్రీరాముఁడు పౌరులకుఁ దెలియకుండఁ బ్రయాణము సాగించుట		406
పౌరులు రాముని గానక యయోధ్య కరుగుట	...	410
మహాజనులు రాముని గూర్చి వగచుట	...	412
శ్రీరాముఁ డడవికిం బోవుచు సుమంత్రునితో భాషించుట	...	415
శ్రీరామమూర్తి గంగాతీరము చేరుట	...	419
గుహుఁడు రాముని దర్శించుట	...	423
గుహుఁడు సౌమిత్రితో భాషించుట	...	441
శ్రీరాముఁడు జడలు దాల్చుట, గంగాతరణము	...	444

శ్రీః.

శ్రీ రామావతారతత్త్వము

అయోధ్యాకాండము.

చతుర్థప్రకరణము.

దేవతాస్తవము.

౧. రామం చందనశీతలం క్షితిసుతామోహాకరం శ్రీకరం
వైదేహీనయనారవిందమిహిరం సంపూర్ణచంద్రాననం,
రాజానం కరుణాసమేతనయనం సీతామనస్స్యందనం
సీతావక్త్రచకోరచారుగండమాలినం వందే సదా రాఘవమ్. ౧

రామం శ్యామాభిరామం రవిశశినయనం కోటిసూర్యప్రకాశం
దివ్యం దివ్యాస్త్రపాణిం శరముఖశరధిం చారుకోదండహస్తం,
కాలం కాలాగ్నిరుద్రం రిపుకులదహనం విఘ్నవిచ్ఛేదదక్షం
భీమం భీమాట్టహాసం సకలభయహరం రామచంద్రం భజేఽహమ్. ౨

రామచంద్రచరితాకథామృతం లక్ష్మణాగ్రజగుణానుకీర్తనం,
రాఘవేశ తవ పాదసేవనం సంభవంతు మమ జన్మజన్మని. ౩

రామో మత్కులదైవతం సకరుణం రామం భజే సాదరం
రామేణాఖిలఘోరపాపనిహతీ రామాయ తస్మై నమః,
రామాన్నాస్తి జగత్త్రయైకసులభో రామస్య దాసోఽస్మ్యహం
రామే ప్రీతిరతీవ మే కులగురో శ్రీరామ రక్షస్వ మామ్. ౪

శ్రీరామచంద్ర తవ కీర్తిసుగంధమస్య
తారాగణస్సుమనసః ఫలమిందుబింబమ్,
మూలం ఫణాధిపతిశం గగనం చ మధ్యం
శాఖా దిశో భువనమండలమాలవాలమ్. ౫

(శ్రీరామకర్ణామృతము.)

భక్తవర్యులారా! సత్సాంప్రదాయులారా!

శ్రీరామాయణపారాయణ తత్త్వమునందలి ముఖ్యమగు ప్రకరణమును భక్తులగు మీసన్నిధానమున సమర్పించు భాగ్యవిశేషము నాకుఁ గలిగినది. ఈ ప్రకరణమున దశరథమహారాజు శ్రీరామాభిషేకముహూర్తము ప్రజలకుఁ దెలుపుటయనునది మొదలు లోపల [illegible] వనవాసమున కంగీకరించినంతవరకుఁ గలకథలు గలవు. సకలసదాచారప్రబోధకములగు నాకథా విశేషములఁ బఠించినవారు భగవంతుని [illegible]. లోకుల కెట్లు న్యాయమును స్వప్రవర్తనముచే [illegible] రాకేకయరాజపుత్రికలచరిత్రసారము. [illegible] యట్లు ప్రవర్తించినదియు మీరు శ్రద్ధగా గ్రహించినచో ధన్యులగువా రనియే నావిశ్వాసము. శ్రీరామచంద్రమూర్తియును మహామాయయగు సీతయుఁ బ్రపంచమున ధర్మసంస్థాపన మెట్లు చేయఁ బూనినదియుఁ దేటతెల్లముగా నాప్రకరణము మీకుఁ దెలుపును. ఒక్కధర్మమును శాశ్వతముగా నిలుపఁబూని యెవ్వ రెవ్వ రెంతెంతకష్టములపాలైనదియు నించుక పరిశీలించిన స్పష్టము కాకపోదు.

తఱచుగా లోకులలోఁ గొందఱు మంథరను గైకను దూఱుదురు. అది మిగులఁ బ్రమాదమని యీప్రకరణము

బోధించుచు. ఎన్నిలోకాపవాదములు కమ్ముకొనినను, ఎందఱెన్నిన్నిరీతులఁ దమ్ము దూషించినను వానిని లెక్కసేయక భగవదాదేశమునకు ధర్మసంరక్షణమహాకార్యమును లక్ష్యముగా నిడికొని దేవయానప్రయాణమార్గమని ప్రసాదించి వారు తమ పనులఁ జక్కఁగా నిర్వహించిరని మన మెఱుంగవలయును. అల్పబుద్ధు లొనరించుచున్నట్టి దూషణములు నచిరకాలమున లయమొందును. భగవదాజ్ఞ శాశ్వతానంద మొసంగునదమ్ము వాసనగునట్టి రీతి కావున సద్గురుని యథామతి నౌన ంచి లోకులకు ధర్మమునకు సహాయకారి మొనరించిన వారు కర్తవ్యము ధర్మము నని స్పష్టమగును. అట్టివారిని యథార్థముగ నెఱుంగక దూషించుట పాపహేతువే గాక మఱే మగును! సద్గురులముఖముగాని భగవంతుని కారుణ్యాగమనము పొసఁగదు. ఆ సాగరంగాని దుష్టజనసంహారము, శిష్టపరిపాలనము సాగదు. దుష్టశిక్షణమహాకార్యమును సాగించుచుండినఁ గొందఱికి సహింపరానిదగును. అట్టి యోగులను కష్టపెట్టినవారి కార్యములను సంపూర్ణముగ నిందింపలేదనుకో, మహర్షులు ... సాధువులు కాలమున ... దూషింపఁబడుదురు.

... భగవత్కార్యము సాగదు ... కొందఱు గలరు. ఇంకొక ... .

"... లేక యున్న గార్య మసాగదు. "... భవత్యసాంవిక" అని భగవంతుఁడే ... గదా. "నహి కారణం వినా కార్యసిద్ధిః" అన్న న్యాయము సుప్ర సిద్ధముకదా. ఇన్ని కారణములంబట్టి ... కారణ ముగ బట్టి వారు నిందింపఁబడుచున్నారో ఆ కారణమునుబట్టి

చక్కఁగా నాలోచించిన వినుతింపఁదగినవారే యని తోఁపక మానదు. ఈవిషయము మహాకవి వాల్మీకిమహర్షి యాయాస్థలముల సూచించెను. ఆవిషయము నందందు వ్రాసితిని. ఆశ్లోకములకు నేను వ్రాసినయర్థము క్రొత్తది కాదనియు సుసంగతమే యనియు నిష్పక్షపాతమతిం బరికించినచో సుస్పష్టమగును. శరణాగతినే రామాయణము తెల్పుచున్నదని వ్రాసినవ్యాఖ్యాతలభావము లిట్టివే యని గ్రహింపవలయును.

కొందఱు మధ్యవైష్ణవులు తమకుఁగల దుర్మతాభిమానావేశమువలన దేవతాసమత్వమును దూషించుచు "తాఁబట్టిన కుందేటికి మూఁడేకాళ్లను" సామెత కుదాహరణభూతులై శ్రీరామచంద్రునకుఁ బరమేశ్వరత్వము స్థాపించుచున్నామను కొనుచు దానిని బాఱఁదోలుచున్నారు. విష్ణుసర్వోత్తమత్వమును దమరు స్థాపించుట కెట్టికారణములుగలవో శివశక్త్యాదిదేవతలసర్వోత్తమత్వమును స్థాపించుట కితరుల కట్టికారణములే కలవు. అసూయ వారిమదినిలిచి రాజ్యము చేయుచున్నందున వారి కితరులు చూపినప్రమాణములు రుచింపకయుండును. శ్రీరామతారకోపాసకుఁ డీశ్వరుఁ డన్నపుడు తమకు సంతోషముకలిగినట్లే శివతారకోపాసకుఁడు రాముఁడన్నపు డితరులకు నట్టిసంతోషమే కలుగునన్నసద్వార్తను వారెఱుఁగరు. అన్యదేవతాదూషణమునఁ గలుగునది పాపమేగాని వేఱుభాగ్యము లభింపఁబోదు. బాహ్యచిహ్నములు భక్తిని దృఢపఱచుటకుఁ బనికిరావు. కొన్నిచిహ్నములుండినఁగాని భగవంతు నారాధింప నర్హులు కాఁజాలరన్న వారలకంటె నజ్ఞులు వేఱెవ్వరు? మనస్సు నిర్మలమైనఁగాని భగవదారాధనము సంపూర్ణఫలము నీయ జాలదు. బాహ్యచిహ్నములు దాంభికత్వమునే వెలిపుచ్చును.

గాని వేఱుఫలము వానివలనఁ గలుగఁబోదు. తోలుదోలుతఁ గేవలమూఢుల కన్ని పనికివచ్చునన్న నొకప్పు డౌనవచ్చును. కాని వానివలనిఫల మత్యల్పము. క్రమముగా నాచిహ్నములు పరమతదూషణమునకుఁ బురికొల్పును. శ్రుతులవ్వానిని బోధింపవు. పురాణములుగూడ నవ్వాని నవకాశమును గల్పింపవు. కొందఱకుఁ దచ్చిహ్నధారణప్రోత్సాహములను ధనలాభము కలిగినఁ గలుగును. కాని యాధనము వారిప్రయోభివృద్ధికి నంతరాయమునే కల్పించును. కాని భగవత్సాయుజ్యమునకును దారిచూపదనుట సిద్ధాంతము.

భగవంతుఁడు శ్రీరామకృష్ణాదిగా నవతరించి భూభారహరణరూపమున ధర్మమును స్థాపించుటయేకాక నాపరమేశ్వరు నారాధించి కృతార్థులు కాఁదగువా రెందరో యాపరమాత్మ నాశ్రయించిరి. వారివారికర్మముల ననుసరించి యాభగవంతుఁడు వారికి ఫలముల నొసఁగును. అంతియ కాని యుల్లపు కొక్కరికిగా ఫలము నీయఁబోఁడు. అది పక్షపాతము కాదా యనరాదు. కర్మము ఫలమునిచ్చును. కర్మమే భగవత్స్వరూపము. దాని నారాధింపఁ బద్ధతులనేకములు. అందు స్వమార్గము ననుసరించి సత్కర్మముల నాచరించుచు వానిఫలములనుగోరక యుండువారలను బరమేశ్వరుఁడు రక్షించును.

"అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్."

అన్న దేకదా భగవంతుని ప్రతిజ్ఞ. "అనన్యాశ్చింతయంతః" అనఁగా "నితరదేవతల నారాధింపక వానినెల్ల నల్పులనుగా భావించి" అని కొందఱర్థము చెప్పుదురు. సెబాసు. చాలబాగు

న్నది. అట్టివారే మధ్యవైష్ణవులని, మధ్యశైవులని, మధ్యశాక్తు లని యిందుఁ జేర్కొనఁబడుదురు. సర్వదేవతాస్వరూపునిగా ననఁగాఁ బరమేశ్వరునిగా సర్వకారణునిగా నన్నెవరు తలంతురో

"సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని,
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః."

అన్నగీతావాక్యము ననుసరించి యెవరు సర్వము నన్నుగాఁ జూతురో వారు ఫలాభిసంధిరహితసత్కర్మాచరణనిపుణులు. కాన వారిని నేనే రక్షింతునని భగవంతుఁడు పలికెను. ఈభావము గలిగిన మతద్వేషమునకుఁ జోటులేదు. దేవతాంతరదూషణ మున కవకాశమే లేదు. అట్లుగాక మారాముఁడే గొప్పవాఁడు. మాశంకరుఁడే యధికుఁడు అని యూహించునెడల వారు భగ వత్కరుణకుఁ బాత్రులుకాఁజాలరు. పాషండులే యగుదురు. సర్వశబ్దవాచ్యుఁడుకదా భగవంతుఁడు. మారాముఁ డనఁగా నర్థమేమి? అహంకారస్వరూపుఁ డీమానవుఁడనియేకదా దాని యర్థము. ఎల్లరకుఁ బరమాత్మ సమానుఁడే. సర్వసాక్షి. కరుణా స్వరూపుఁడు. అట్టిమహాత్ముని నహంకారమున నారాధించిన ఫలము శూన్యమే యగును. భగవంతుఁడు మానవుని బాహ్య చిహ్నములను జూడఁడు. పవిత్రమగుమనస్సునే చూచును. అన్నబుద్ధుని హితోపదేశ మెంతబాగున్నదో చూడుఁడు.

"స్థితిః పుణ్యారణ్యే సహపరిచయో హంత హరిణైః
ఫలైర్మేధ్యావృత్తిః ప్రతిదివసతల్పాని దృషదః,
ఇతీయం సామగ్రీ భవతి హరిభక్తిం స్పృహయతాం
వనం వా గేహం వా సదృశముపశాంతైకమనసామ్." 33

(వైరాగ్యశతకము.)

అన్న భర్తృహరిహిత మెంతసొంపుగానున్నది? మనోదోషములు తొలంగినఁగాని భగవదారాధనము సత్ఫలవంతము కాఁజాలదని తెలెడిని. మనస్సు ధనాశాబద్ధమై యీర్ష్యాదుర్గుణసాంద్రమై యుండఁగా యోగివేషముదాల్చిన కపటనాటకసూత్రధారులు చేయు భగవదారాధనము నిష్ఫలమగుటయేగాక దుష్ఫలము కూడ నగుననుట కేమిసందియము. కావున మనోమలము లనఁబడు కామక్రోధాదులఁ బాఱఁద్రోలి యథాశక్తి న్యాయము ననుసరించి పరమేశ్వరుని భక్తిమెయి నారాధించిన వాని పరాత్ముఁ డనుగ్రహించి యమితానందసుఖము నొసంగును.

భగవంతుఁడు సర్వశక్తియుతుఁడు. బీజాంకురన్యాయము ననుసరించి యుల్లసస్సుస్సులు తద్వశమున నుండును. కాని యాస్థితి యం దాతనమాత్రయే కార్యము నొనరింపఁడు. ప్రకృతిసంపుష్టుఁడై నచో ప్రపంచవిషయకచింతగలవాఁడగును. ఆస్థితియం దా మహానుభావుఁడు సగుణబ్రహ్మ మనంబడును. అనఁగా ప్రకృతిని సర్వకార్యముల నొనరింప నియమించి తాను సర్వసాక్షియై యుండునని భావము. ప్రకృతి యనఁగ స్త్రీగాదు. ప్రకృతిశబ్దము స్త్రీలింగము. ప్రకృతి భగవంతుని యిచ్ఛాశక్తి. ఆప్రకృతి యిచ్ఛాశక్తి యని, జ్ఞానశక్తి యని, క్రియాశక్తి యని పలుకంబడును. ఈమూఁడును భగవంతుని సంకల్పములే. ఉపాసకుని యిచ్ఛ ననుసరించి స్త్రీరూపముఁ దాల్చును భగవంతుఁడు. వాఁడ నుపాసకుని యిష్టము ననుసరించి రూపములు ధరించుఁగదా. అనఁగా నేరూపమున నుపాసనఁ దానిముక్తి కొఱకై భావ యనుదినముఁ జేయునో యారూపమున వాని ననుగ్రహించును. అట్టి ప్రకృతియు నని యెఱుంగఁదగు. ప్రకృతి యని

యుపాసించినను ఆపరమాత్మ నుపాసించినట్లే యని భావము. ఆయిచ్ఛయు నామహానుభావుని దేకదా.

"ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా,
న తే రూపం న చాకారో నాయుధాని న చాస్పదం,
తథాపి పురుషాకారో భక్తానాం త్వం ప్రకాశసే."

అనుప్రాచీనసూక్తు లీయర్థమునే సమర్థించుచున్నవి. కావున భక్తానుగ్రహార్థ మీశ్వరుఁడు రూపమును ధరించుననునదియే సారము. ఇఁకఁ గథాభాగమున నీవిషయమును సమన్వయింతము.

భగవంతుఁడు రామచంద్రరూపమును, మూలప్రకృతి సీతారూపమును ధరించి జగదుపకారము చేయఁబూనిరి. వారి కార్యము నిర్వహింపఁదగువారెల్ల భూలోకమునఁ బుట్టిరి. వారివారికార్యముల నిర్వహింపఁబూనిరి. వారిమూలమున నాయాకార్యములు చేయించుపని ప్రకృతిది. శ్రీరామమూర్తి యీ ప్రకృతికార్యములను బరికించుచు సర్వసాక్షియై నిర్లిప్తుఁడై యుండును. కాని తానుగూడ సర్వకార్యముల నిర్వహించుచున్నయట్లు నటించును. ఎవ్వరెవ్వరేయే కార్యముల మూలమునఁ గీర్త్యపకీర్తుల నొందవలయునో వారు వారట్టి కార్యముల నించుకంతయుఁ బ్రమాదంపడక యొనరించునట్లు చేయవలయునని ప్రకృతి సంకల్పించును. కార్య మట్లేసాగును.

"సత్యం విధాతుం నిజభృత్యభాషితం
వ్యాప్తిం చ భూతే ష్వఖిలేషు చాత్మనః,
అదృశ్యతాత్యద్భుతరూప ముద్వహన్
స్తంభే సభాయాం న మృగం న మానుషమ్." ౧౮

(శ్రీభాగ. ౭ స్కం. ౮ అధ్యా.)

అనువచనము.

"జగత్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే
తిరస్కుర్వన్నేత త్స్వమపి వపు రీశ స్తిరయతి,
సదా పూర్వస్సర్వం తదిద మనుగృహ్ణాతిచ శివ
స్తవాజ్ఞామాలంబ్యక్షణచలితయో ర్భ్రూలతికయోః." ౨౪

(సౌందర్యలహరి.)

అనువచనము పై వ్రాసిన భావమును స్పష్టీకరించుచున్నవి.

ప్రస్తుతము సీతారాములు ధర్మగుణమునకుం బూనిరి. మంథరయుం గైకయు నాకార్యము సాగింపఁ బ్రధానకార్య మనంజాలు నట్లగముగనుటనేఁ బోషించిరి. దశరథునిదీనాలాపములు కైకేయికి రుచింపకపోయెను. ఎంత ప్రార్థించిన నామె నన పట్టు వదలకపోయెను. ఏలః సీతాదేవి సంకల్పరూపశక్తి కైకేయి హృదయమును నావేశించినది. అందుచేఁ గఠినశక్తి యుదయించినది. పతివచనము మిథ్యాభూతమన్న భావముగల సాధ్వియే కైకయగును. ఐనను బహుదేవతాసంకల్ప మామెను బలాత్కరించినది. పతివచనము గ్రాహ్యమా? ధర్మగుణప్రయత్నము ముఖ్యమా? అని మనము విచారింపవలయును. సామాన్యదృష్టిచేఁ బతివాక్యము రీతి నుండుటయే ధర్మమని తోఁచును. ఇట్టియే సిద్ధాంతమైన యెడలఁ గర్మసిద్ధాంతమునకుం బారమార్థికప్రమాదము కావలసి వచ్చును. ఎట్లనఁగాఁ జిత్తగింపుఁడు. దశరథుఁడు పూర్వకారణమునఁ బుత్రవియోగదుఃఖమున మృతినొందిన సిద్ధుఁడైయున్న వాఁడు. విధాతృశాసనములు దాఁటుటకు జాలని వాఁడు శక్తుఁడై యున్నవాఁడు. ఈకర్మఫలములకన్నింటికిఁ గైకపట్టు వలయే

ప్రధానము. దశరథునిభార్యల కందఱకు వైధవ్యదుఃఖానుభవకాలము సమీపించియున్నది. గుహుండు లోనగుభక్తులకు శ్రీరామదర్శనమహాభాగ్యము లభించుకాలము వచ్చియున్నది. ఇన్ని కర్మములు ఫలింపనుండఁగాఁ గైక యెట్లు పతివచనము నంగీకరించును? అంగీకరించు నవకాశముకలదా? ఆమెయుఁ గర్మపాశబద్ధురాలేకదా. కర్మసిద్ధాంతము బలవత్తరమని భగవంతుఁడే "గహనాకర్మణోగతిః" అన్న వాక్యముచేతఁ దెలిపియే యున్నాఁడు. కాఁబట్టి కైక పతివ్రతాశిరోమణియే యగును. దశరథుఁడు సత్యవాదియే యగును. కాని కర్మము త్రిప్పలగు లోనుకానివాఁ డెవ్వఁడు ప్రపంచములయం దెంతవైనఁగలఁడా? ఇట్లుండఁ గైకేయిని మంథరను దూషించుట కర్మసిద్ధాంతమునకు విరుద్ధముకాదా. కావున దైవకార్యమునకుఁ దోడ్పడి లోకములకు మహోపకారమొనరించిరని వారిని మనము భావింపవలయు. మఱిమఱి సంభావింపవలయును. దాని చేఁ గర్మగతి యిట్టిదని యెఱుంగనగును. దాన నహంకారము నశించును. అయ్యది భక్తికిఁ ద్రోవచూపు. అదియే భగవత్కృపకుఁ బాత్రులనుగా మనల నొనరించును. ఈవిషయమును బలుసారులు మననముచేయుచుండినచో మనోమలము లనంబడు కామక్రోధాదులు తొలఁగును. పిదప

"మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః."

అన్నసూక్తి స్వానుభవరూపసత్ఫలము నొసంగును. ఇఁక శ్రీరామచంద్రుఁడు ప్రకృతియు నెట్లు ప్రవర్తించి ధర్మరక్షణము చేసి రనువిషయమును బరికింతము.

శ్రీరాముడు తల్లికి వనయరణ్యాగమనముం జెల్పుట.

* శ్రీరామమూర్తి తల్లిదండ్రులకు నమస్కరించి తన వనగమనాంగీకారమును దెలిపి యంతఃపురమునుండి వెలుపలికి రాఁగా నంతఃపురపురంధ్రు లొక్కపెట్టు రోదనము గావించిరి. వారెల్ల విలపించుచు శ్రీరాముడు తండ్రి యాజ్ఞాపింపక యున్నను దాను తల్లు సేయు కార్యములు కావలయునని వానినెల్లఁ దానే యెఱింగి చేయుచుండువాఁడు. అట్టి మహానుభావమూర్తి యయోధ్యను విడిచి యడవులకుఁ బోవుచున్నాఁడు కదా. తల్లి కౌసల్య నెట్లు సేవలు చేయుచుండెనో యట్లే మనలనెల్ల సుప్రీ-పలు చేయుచుండెడు. [illegible] నను రాముడు కోపమునొందఁడు. [illegible] గట్టి [illegible] పనుల [illegible] చేయును అక్కటా! [illegible] కనే సకల భూతములకు సుఖము [illegible] శ్రీరాముడు [illegible] కొంచెపు [illegible] చున్నాఁడు. అని యిట్లు [illegible] కొనుచు దాను దూఱుచు [illegible] విలపించిరి. [illegible] పురకాంతలయేడ్పు వినఁబడెను [illegible] శయ్యపైఁ బడియుండు రామచంద్రుడు [illegible] నాలకించి సంకటము నొందెను. శ్రీరాముడు [illegible] బట్టి తన్ను గని తల్లి కడకుం బోయెను. [illegible]

* అయోధ్యాకాండమున నిరువదియవసర్గమున [illegible] గలదు. అధ్యాత్మ రామాయణకర్తయు నిం దంతర్యామముగనుండు.

నున్న వృద్ధుఁడు ద్వారపాలాధిపతి యందుండఁగాఁ గాంచెను. అందుఁగలవారెల్లరు లేచి నిలువంబడి జయజయశబ్దరూపమున నాశీర్వదించిరి.

శ్రీరామమూర్తి తొలుతటికక్ష్యఁ బ్రవేశించి యవ్వల రెండవకక్ష్యనొంది వేదవిదులగు వృద్ధబ్రాహ్మణులం గాంచెను. వారికి నమస్కరించి యవ్వలికక్ష్యం బ్రవేశించి యందుఁ గావలి యుండుముదుసలిస్త్రీలను బాలికలను దిలకించెను. వారెల్లరు నానందమున నాశీర్వదించి లోపలి కరిగి రామచంద్రాగమన మును గౌసల్య కెఱిఁగించిరి. ఆమె రాత్రియంతయు నియమ మున జాగరణమొనరించి యుదయముననే పుత్త్రునను మేలు గోరి విష్ణుమూర్తి నారాధించెను. ఆమె ప్రాచీనాచారపరాయణు రాలు. శ్వేతవర్ణముగలకౌశేయమును దాల్చి శుభాలంకారములు గలదియై హోమము విప్రులవలనఁ జేయించుచుండెను. ఆసమయ ముననే శ్రీరాముఁ డంతఃపురముం బ్రవేశించి తల్లిని దర్శిం చెను. అందుఁగల దేవపూజోపకరణములం గాంచెను. దధి అక్ష తలు లోనగుమంగళద్రవ్యములు రామమూర్తికి గోచరించెను భగవత్పూజానిరతిగలిగి దేవతవలెఁ బ్రకాశించుతల్లిని దర్శిం చెను. ధ్యాననిరతయున్న యాకౌసల్య కొంతసేపునకుఁ బిమ్మట స్మృతి రాఁగాఁ దనగారాబుకొడుకు రాకం గాంచి యుప్పొంగి యెదు రేగెను. రామమూర్తి నమస్కరింపఁ గౌఁగిలించుకొని శిరము మూర్కొనియె. ఆమె వాత్సల్యము వర్ణనాతీతమున పలికెను. రామచంద్రా! మహాధార్మికులు వృద్ధులు నగు రాజర్షులవలె నీవు పూర్ణాయుష్యమును విశాలకీర్తిని గులోచితధర్మమును బొందుము. నీతండ్రి చెప్పినమాట తప్పువాఁడు కాఁడు. కాన నింక నభిషేకమునకుఁ బ్రయత్నింపలేదే యని సంశయము

వలదు. నిన్నిపుడె యభిషేకించుఁజుమీ యని హితముగాఁ బలికెను.

తల్లి భోజనార్థము పిలిచి పీఠముచూపఁగా నితఁడు లోసంగునాసనమునఁ గూరుచుండకయున్న హస్తమునస్థానఁ దాఁకవలయు నన్న నియమము ననుసరించి దానిని స్పృశించి యాదరణమునఁ బలుకుచున్న తల్లికి నడవికిఁబోవుదునని యేరీతిఁ దెలుపుదునా యని లజ్జించి యంజలిబంధించి మిక్కిలి వినయముతోఁ దనవనయనమున కనుజ్ఞ వేఁడఁబూని యిట్లు పలికెను. తల్లీ! ఇప్పటికి మహాభయ మొక్కఁడు నిశ్చయముగా నున్నది. అది నీవు తెలుసుకొనలేదు. ఈమాట సీతాలక్ష్మణులకు నీకును దుఃఖమును గల్గించును. అయినఁ జెప్పక మానవలయుత గాదు. నేను దండకారణ్యమునకుఁ బోవుచున్నవాఁడను గదా. అ నా కీపాటి ... సింహాసనమునఁ గూరుచుండఁదగినకాల మిప్పుడు వచ్చినది. ఇక, మూలములు, ఫలములు భక్షించుచు నంటువాసి ... మునివలె నిర్మానుష్యమగు మహారణ్యమునఁ బదునాలుగు సంవత్సరములు కాపురము చేయఁబోవుచున్నాఁడను. రాజేంద్రుఁడు భరతునకు రాజ్యమొసంగెను. నన్ను మాత్రము మునివలె దండకారణ్యమునకుఁ బోవునట్లు కట్టడ చేసినాఁడు. తల్లీ! నేను దండకారణ్యమునకుఁ బదునాల్గేండ్లు వానప్రస్థకర్మముల నాచరించుచు ఫలమూలములఁ దినుచుఁ గాలముఁ ద్రోయుచు నాలుగు ... వనసిమిని నగుదర్భాసనములు నివసించి యుందును

అని సుమిత్రానందనుఁడు పలుకఁగా విని యారాణి భరింపరాని శోకము ప్రక్రమ్మఁగాఁ గానఁ బరశుధారాహతం బై విరిగిపడిన

వృక్షమువలె, స్వర్గమునుండి క్రిందఁబడిన దేవతాస్త్రీచందమునఁ దటాలున మూర్ఛిల్లి పుడమిం బడియెను. దుఃఖమును భరింపఁ జాలని యాతల్లి యరఁటిమ్రానుకూలినట్లు నేలం బడఁగాఁ గాంచి లేవనెత్తి రామచంద్రుఁడు శుశ్రూష చేసెను. మహాభారమును వహింపఁజాలక క్రిందఁబడిన గోడిగవగిదిఁ గ్రిందఁబడి యారాముఁడు లేవనెత్తఁగా నాదుఃఖభారమునకుఁ దాళఁజాలక ధూళింబొరలినతనువుతో నెట్లో కూరుచుండఁగా రామమూర్తి యాధూళిఁ బోవఁ దుడిచెను. అత్తఱి నాకౌసల్య తనచెంతనుండి పరిచర్య చేయుకుమారునిం గని సౌమిత్రి వినుచుండఁగా నిట్లు పలికెను.

నాయనా! నన్ను దుఃఖములపాలు చేయుటకే నీవు పుట్టితివి. నీవు నాకడుపునఁబుట్టకయుండిన వంధ్యనై యాదుఃఖమునే యనుభవింతును. అంతకంటె నధికదుఃఖము నాకుఁ గలుగదు. వంధ్యాదుఃఖ మంతమాత్రమే కదా. కొడుకు నెడఁబాసి నేలఁబొరలుచు ననుభవించుదుఃఖమువంటిది వేఱొకటి లేదు. పతి మహానురాగమున రంజింపఁజేయ నలరఁదగిన నేను పెద్దభార్యకుఁదగిన యేమంగళముగాని, యేసుఖముగాని యింతదనుక ననుభవించియెఱుంగను. కొడుకుగలిగినపిదపనైన నాబలమునన్నైన ననుభవింతునన్నయూహచే నింత కాలము నుంటిని. ఇఁక నాకంటెఁ గనిష్ఠలగుసపత్నులు నామనస్సు శకలములగునట్లు సహింపరానిమాటలాడుచుండఁగా నాజ్యేష్ఠ్యము త్రుటింపవినవలయుఁగదా. సపత్నీవాగ్బాణాహతికంటె వేఱుదుఃఖము స్త్రీలకుఁగలదా. కనుక నాదుఃఖము నావిలాప మింతయని వచింపరానిదే. బలశాలివగు నీవు చెంతనుండఁగ నన్నిట్లు తిరస్కరించుచుండుట నీవును జూచుచుందువు కదా. ఇట్లుండఁ

నీవు చెంతలేకపోఁగా నిఁక వచింపవలసిన దేమి? మరణమున కంటె వేఱుగతి నాకు లేదు. పతి నన్ను నిరంతరము నిరాకరించు వాఁడే కనుక నామేలు నశింపఁజేసి నన్ను నవగణించినాఁడు. ఈ కారణమున నేను కైక, దాసికలతో సమానురాలనో తక్కువదాననో యైతిని. కైకకొడుకు రాజైనందున నన్నింత కుఱుం జెప్పఁడైన నాశ్రయించినను, అనుసరించినను వాఁడు కూడ రాజభయమున నిఁక నాతోఁ బలుకనైనఁ బలుకఁడు. కైకయున్నను నిరంతరము నాపైఁ గోపముగలది. కనుక మొగము చిట్లించి యనరానిమాటలు లనుచుండును. ముందే యిట్టులుండఁగ నిఁక మిక్కుటముగాఁ బలికినదాన నైననాకు దాని మొగముఁజూచి శ్రీరామా! యెట్లు తాళఁగలను. దానిమాటల కెట్లు తాళుదును.

శ్రీరామచంద్రా! నీవు జన్మించిననాఁటినుండి పదునేడు వత్సరములుగా నీవు రాజవైన నాదుఃఖము తీరఁగునని దినములు గడపితిని. ఇంతకాలము సవతులు పలుకు నిష్ఠురపుమాటలకుఁ బ్రాణము బలముగ సహింపఁగ నేర్చుకొంటిని. ఇఁక వారి తిరస్కారములవలని యవమానదుఃఖము చాలకాలము సహింపఁ జాలను. పున్నమచంద్రునిఁబోలు నీముద్దుమోమునుగానక దీనస్థితియందుండి యెట్లు బ్రదుకఁ గల్గుదును? నిన్నుఁ బుట్టించుటకై నేను వ్రతములు నుపవాసములుఁజేసి దేవతల నారాధించి యెంతోకష్టముతో నిన్నుఁ బడసినందున నీ యరణ్య గమనమున వ్యర్థము చేసితిని. వానకాలమున నదీప్రవాహ మునుపటికంటెఁ బెరుగుచునుండు రీతి నాదుఃఖ మెక్కువగుచున్నది దుఃఖవార్తవిని నామనస్సు బ్రద్దలు కాకున్నది. అందువలనే నా మనస్సు దృఢతరపాషాణమయమని తలంతును. సింహాసను దుఃఖ

పడుచున్న హరిణమును జంపునట్లు నన్నుఁ గాలుఁడు వెంటనే చంపకయున్నాఁడే. దానంజేసి చావే లేదని తోఁచెడిని. నేనుం డుటకు యమలోకమున స్థలమే లేదని తోఁచుచున్నది. నాతను హృదయము లిట్టి ఘోరదుఃఖ మొక్కసారి యలముకొనఁగా శకలములై నేలఁబడకయున్నవి. లోహనిర్మితములు కాఁబల యును. భగవంతుఁడు నియమింపనికాలమునఁ జావు రాదనుట నిశ్చయమే. ఇఁక నీదుఃఖమున మృతి నాకెట్లువచ్చును? సంతాన వాంఛ నేనుజేసిన దానోపవాసవ్రతాదులు నిరర్థకములైనవి. నాతపస్సంతయు నూషరక్షేత్రమున నాటినబీజమువలె ఫల రహితమైనది. ఈదుఃఖము పూర్వ మనుభవించినది కాదుకదా. నిర్భరదుఃఖముకలుగఁగాఁ గాలము రాకున్న నెవ్వఁడుకాని ప్రాణములను వదలఁజాలు నేని దూడను బసిలిన ధేనువుపగిది నీయెడఁబాటునోర్వక యిపుడే మృతినొంది యమునింట నుందును. రామభద్రా! నా కకాలమరణము లేకున్నదే. పూర్ణచంద్రసమానమగు నీమోమును గన్నులకఱవుదీరఁ గాంచుభాగ్యమైన లేక యుండె నీచపుబ్రదుకు బ్రదుకుటవలనఁ బ్రయోజన మేమైనఁగలదా చెప్పుము. ధైర్యములేక ధేనువు దూడవెంబడిపోవునట్టులు నేను నీవెంట నడవులకువత్తును. ఈ రీతి నాకౌసల్య దుఃఖమునకుఁ దాళఁజాలక రాము నెడఁబాసి సపత్నులంగూడి వారివలనఁ గలుగనున్న మహావ్యసనముల నాలో చించియు సత్యపాశబద్ధుఁడై రాముఁడుండుటయుం గాంచి పర బద్ధుఁడగు కొడుకుం గాంచి కిన్నరాంగన విలపించినట్టులు తా నెంతయు రోదనముచేసెను.

మహాశయులారా! ఈభాగము విమర్శింపఁదగినదే. ఎన్నియో రహస్యము లిందుఁగలవు. వాని నెఱుంగక కథను జదివిన లాభమేమి?

"కృత్యేష్వచోదితః పిత్రా సర్వస్యాన్తఃపురస్య చ,
గతిర్యశ్శరణం చాపి స రామోఽద్య ప్రవత్స్యతి. ౨
కౌసల్యాయాం యథా యుక్తో జనన్యాం వర్తతే సదా,
తథైవ వర్తతేఽస్మాసు జన్మప్రభృతి రాఘవః. ౩
న క్రుధ్యత్యభిశప్తోఽపి క్రోధనీయాని వర్జయన్,
క్రుద్ధాన్ ప్రసాదయన్ సర్వాన్ స ఇతోఽద్య ప్రవత్స్యతి." ౪

అని మూలము. అంతఃపురాంగనలు 'రామమూర్తి యడవికిం బోదునని జననీజనకులకడ సెలవుతీసికొని పోవుచుండఁగాఁ బలికినమాట లివి. ఇవి శ్రీరామచంద్రుని పరమేశ్వరత్వమును దెలుపుచున్నవి. తండ్రి కెందఱు భార్యలు గలరో వారిని వారి పరిచారికలను గూడఁ జననులఁగా నూఱడించుచు రామమూర్తి తండ్రి యాజ్ఞాపింపకముందే వారియోగక్షేమముల నరయుచుండువాఁడు.

"గతిర్భర్తా ప్రభుస్సాక్షీ నివాసశ్శరణం సుహృత్,
ప్రభవః ప్రళయస్థానం నిధానం బీజమవ్యయమ్." ౧౮. అ. ౯.

అన్న భగవద్గీతావాక్యము ననుసరించి సర్వేశ్వరుఁడు రాముఁడనునర్థము తేలెడిని. తల్లిని సేవించునట్లు లందఱిని సేవించును. పుట్టినదాదిగా నట్లే చేయువాఁడు.

"సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః,"

అన్న శ్రీకృష్ణవాక్యమున కీరామప్రవృత్తియే యాధారమని తేలెడిని. ఒరులు దూషించిన నాగ్రహింపఁడు. క్రోధహేతువు

లగుకర్మములను వదలును. కోపవంతులను బ్రసన్నులనుగాఁ జేయును.

భగవద్దర్శనమున నింద్రియకర్మములు మాఱువలయును గదా. అట్టిదియే భగవద్రూపము. అనఁగాఁ బరిపక్వాంతఃకరణులే యారూపమును గాంచఁగలరు. దాన దుర్వాసనలు నశించును. మనస్సు నిర్మలమగును. భగవత్తేజస్సు భక్తమనస్సు నలముకొనును. అకారణమున నందుఁగల క్రోధాదులు మార్పునొందును. సద్వాసనలు పెంపొందును.

"మయా ప్రసన్నేన తవార్జునేదం రూపం పరం దర్శితమాత్మయోగాత్,
తేజోమయం విశ్వమనంతమాద్యం యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్."
(౪౭. అధ్యా. ౧౧)

అనుగీతావాక్యమును బరికించిన నీయర్థము తేటపడును. సామాన్యముగా రాజతేజ మెల్లరను భయపెట్టునది.

"యస్మాదేషాం సురేంద్రాణాం మాత్రాభ్యో నిర్మితో నృపః,
తస్మాదభిభవత్యేష సర్వభూతాని తేజసా." (౪. మను. ౭ అధ్యా.)

భగవత్తేజ మట్టిది కాదు. సర్వభూతములను దర్శనమాత్రమున మార్చివేయునది. మహాత్ముల తేజముగూడ నట్టిదే యగునుగదా. కణ్వాదిమునులు తమ తేజోబలమున సహజవైరముగలజంతువుల మనోవృత్తులను మార్చి సహజసౌహార్దములనుగా నొనరించినట్లు పురాణాదులు తెలుపుచుండఁగా వినుచుము కదా. అట్టికృత్యము నొనర్చునది యేది? నిర్మలమగు వారితపోమహత్త్వమున నలవడినభగవత్తేజోలవమే కాక మఱేది? ఎవ్వారిమనస్సున నీర్ష్యాదిదుర్గుణములు లేవో వారియందే భగవత్తేజ మావ

హించును. దుర్వాసనలు గలిగిన నున్న కొంచెముకూడ నచ్చోట నుండదు.

"అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ,
నిర్మమో నిరహంకారస్సమదుఃఖసుఖః క్షమీ. ౧౩
సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః,
మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్తస్స మే ప్రియః. ౧౪
యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః,
హర్షామర్షభయోద్వేగైర్ముక్తో యస్స చ మే ప్రియః. ౧౫
అనపేక్షశ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః,
సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః. ౧౬
యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి,
శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః. ౧౭
... ...
తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేనకేనచిత్,
అనికేతస్స్థిరమతిర్భక్తిమాన్ మే ప్రియో నరః." ౧౯

(గీత. ౧౨ అధ్యా.)

అను నీభగవద్గీతావాక్యములలో భక్తలక్షణములను దెలుపుచున్నవి. పైనివ్రాసినయర్థము శ్రీకృష్ణమూర్తి వాక్కులే స్పష్టపఱచుచున్నవి. ఈలక్షణములు లేనివాఁడు భక్తుఁ డెంతమాత్రము కాఁడు. సర్వభూతములను ద్వేషింపరాదనునది ప్రథమలక్షణముగ భగవంతుఁడు తెలిపెను. ఇఁక దేవతలనే దూషించువా రెట్టివారో యూహింపవచ్చును. ఎవ్వరు దేవతల దూషింతురో వారియందు భక్తి నిలువఁ జోటు లేదనియే యిటఁగలసారము. పరమతసహనము, సర్వలోకారాధ్యులు దేవతల నిందింపకయుండుటయు ననుసద్గుణము సామాన్యులకు లభించునదియా? పూర్వపుణ్యపరిపాకవశముననే లభించును.

కొందఱు వేషధారులు ధనార్జనమున నాసక్తిమెయి, దాసులమని, యోగులమని, సన్న్యాసులమని యింకనెన్ని యో పేరులు పెట్టుకొని తిరుగుచుఁ బరమతముల దూషించుచు విశేషించి శంకరునే నిందించుచు దేవాలయముల నుద్ధరింతుమని, సత్రములఁ బెట్టుదుమని, మఠముల నిర్మింతుమని, యిట్టివే యగు పెక్కుపేరులను బెట్టుకొని ధనమును గూర్తురు. మఱొకకార్యముల కద్దాని నిష్టానుసారము వ్యయింతురు. ఉపన్యాసవేదికల యందుఁ దమమిథ్యాజ్ఞానమును వెల్లడింతురు. వారివేషములఁ గాంచియు మాటల వినియుఁ బాపము! పామరులు మోసపోయి ధనమిత్తురు. వారిమూలముననే దేవతాదూషణము, మతదూషణము పామరులకుఁ బట్టుపడును. అట్టివారికి భగవదనుగ్రహ మెన్ని జన్మములకైనఁ గలుగదని శ్రీహరివాక్యములే మనకుఁ దెల్పుచున్నవి.

"వృద్ధానాం ధర్మశీలానాం రాజర్షీణాం మహాత్మనాం,
ప్రాప్నుహ్యాయుశ్చ కీర్తిం చ ధర్మం చోపహితం కులే. ౨౩
సత్యప్రతిజ్ఞం పితరం రాజానం పశ్య రాఘవ,
అద్యైవ హి త్వాం ధర్మాత్మా యౌవరాజ్యేఽభిషేక్ష్యతి." ౨౪

అని మూలము. కౌసల్యావాక్యము లివి. వృద్ధులు ధర్మశీలురు మహాత్ములు నగు రాజర్షులకుఁగల యాయుస్సును గీర్తిని గులోచితధర్మమును బొందుమని దీవించెను. అనఁగా లోకానుభవము కలిగి ధర్మశీలముగలిగి సర్వభూతసములైనవారు చిరకాలము జీవింతురనియుఁ గీర్తి నొందుదురనియు మన మెఱుంగవలయును. "పాపీ చిరాయుస్సుకృతీ గతాయుః" అన్నసూ_ సామాన్యమేగాని విశేషవిధి కాదనియు నెఱుంగందగు. కుల

ధర్మము నొందుననఁగా భావమేమి? కులోచితధర్మము లర్థాని వరించుననియు, నవి సనాతనములనియుఁ గాక మఱేమి? సనాతనములగు నాకులధర్మముల ననుష్ఠింపవలయును. వానిని విడనాడరాదు. వదలిన నరకము లభించును. కులధర్మములు కులదేవతలు సర్వథా ఆరాధ్యములు, ఆరాధ్యులు నగుదురు.

"కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాస్సనాతనాః,
ధర్మే నష్టే కులం కృత్స్నమధర్మోఽభిభవత్యుత. ౪౦
ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన,
నరకే నియతం వాసో భవతీత్యనుశుశ్రుమ." ౪౪

అని భగవంతుని ప్రశ్నించెను.

"దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః,
పరస్పరం భావయంతశ్శ్రేయః పరమవాప్స్యథ. ౧౧
ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః,
తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః. ౧౨
యజ్ఞశిష్టాశినస్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః,
భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మకారణాత్." ౧౩

గీత. 3 అధ్యా.

అని భగవంతుఁడు బదులిచ్చెను. దేవతలకొఱకుఁ గాక తనకొఱకని పాకము చేయరానిదని కదా యిందలి సారము. అనఁగాఁ గులదేవతారూపమున భగవంతునకు సర్వము సమర్పింపవలయునని సారము. భగవదారాధనబుద్ధితో నేపనినైనఁ జేయవలయు ననియుఁ దనకొఱకుగా నేపనియుఁ జేయరాదనియుఁ గదా దీని యర్థము. లక్ష్యము భగవంతుఁడు. దానిమఱచి యేకార్యము

చేయరాదని మనము గ్రహింపవలయును. కులధర్మముల వదల రాదనియు మన మెఱుంగవలయును.

> "ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః,
> తస్మాద్ధర్మో న హంతవ్యో మానో ధర్మో హతోఽవధీత్. ౧౫
> వృషో హి భగవాన్ ధర్మస్తస్య యః కురుతే హ్యలం,
> వృషలం తం విదుర్దేవాస్తస్మాద్ధర్మం న లోపయేత్." ౧౬ అధ్యా. ౮

అని మనుస్మృతి బోధించెడిని. కావునఁ గులధర్మములు తప్పక యనుష్ఠేయములే. కాని ధర్మానుష్ఠానము ఫలము గోరి చేయ రాదు. భగవత్స్వరూపమని తదారాధనమునఁ బరమేశ్వరుఁడు తృప్తుఁడగుననియుఁ జేయఁదగినది.

> "సత్యప్రతిజ్ఞం పితరం రాజానం పశ్య రాఘవ,
> అద్యైవ హి త్వాం ధర్మాత్మా యావరాజ్యేఽభిషేక్ష్యతి." ౨౪

అని మూలము. దశరథుఁడు సత్యప్రతిజ్ఞుఁడే యగునని యెఱుంగు మనుట ప్రతీతికార్థము. దశరథుఁడాడితప్పనివాఁడన్న కౌసల్య వాక్యము సార్థకము. పూర్వాపరవాగ్దానములలో దేనినను సరించినను సత్యవాదియేకదా. కైక కోసంగినవరమును జెల్లించుటంజేసి యసత్యప్రతిజ్ఞుఁడు కాఁజాలఁడు. ఆవరదానమెఱుంగనివా రట్లూహింపఁజాలిరి. మహాకవి వాల్మీకి దశరథునిప్రవర్తన మెట్టిదని లోకులకుఁ దెలియవలయుననియే కౌసల్యనోట సత్యవాదియే యని పలికించెను. ఆపఱ కెన్నఁడునాడితప్పనివాఁడనుభావము నీవాక్యమే తెలుపును. జనులను బాలించు రాజు సత్యపాలకుఁడుగా నుండవలయునను నీతి నీవాక్యము తెలుపుచున్నది. సత్యముం నారాధించినఁగాని ప్రజారంజనకార్యమునఁ

కృతార్థుఁడు కాఁజాలఁడని మన మెఱుంగవలయును. సత్య పాలన మొకతపస్సనియు నెఱుంగందగు.

"ఋతం తపస్సత్యం తపశ్శ్రుతం తపశ్శాంతం తపో దమస్తపశ్శమస్తపో దానం తపో యజ్ఞం తపో భూర్భువస్సువర్బ్రహ్మైతదుపాస్యైతత్తపః."

—ఆరణ్యకము.

అని శ్రుతి బోధించుచున్నది. సత్యము ననుసరించువారు మును లనఁదగుదురు. ఈశ్రుతులలోఁ దెలిపినవన్నియుఁ బరబ్రహ్మవాచ్య ములే. దీని నారాధించినను భగవంతుఁడు తృప్తుఁడగునని సారము.

"దత్తమాసనమాలభ్య భోజనేన నిమంత్రితః,
మాతరం రాఘవః కించిద్వ్రీడాత్ప్రాంజలిరబ్రవీత్." అయో.

అని మూలము. తల్లి రామచంద్రుని భుజింపఁ బంచి యాసన మిప్పించెను. రామమూర్తి భుజింపక యాపీఠమును గరమున స్పృశించెను. వనవాసమునకుఁ బిలిచి యన్నము పెట్టి యాసన మీయఁగా భుజింపవలెనుగాని యున్నను వారిచ్చినపీఠమును దాఁకవలయును. దాని నాగ్రహపూర్వకముగ తృప్తుఁడగునన్న సదాచారమును శ్రీరామమూర్తి మనకుఁ దెలిపెనని యెఱుంగవలయును. సదాచారములన్నియు రామచంద్రప్రవర్తనమునుండి మనము గ్రహింపవలెను. ఆదరించినవారిని గౌరవింపవలయును గాని తిరస్కరింపరాదనునదియే యిందుఁగలసారము.

"దేవి నూనం న జానీషే మహద్భయముపస్థితం,
ఇదం చ తవ దుఃఖాయ వైదేహ్యా లక్ష్మణస్య చ." అయో.

అనునది శ్రీరామవాక్యము. సామాన్యార్థము స్పష్టము. రామ మూర్తి సత్త్వము దీనిమూలమున వెల్లడించెను. ఎట్లు?

దేవీ! మహాభయము రానున్నదని నీవు నిక్కముగా నెఱుంగవు. ఇది తొలుత నీదుఃఖముకొఱకు, పిదప సీతకు నామీఁద లక్ష్మణునకు నగును. ఆభయము నీదుఃఖమున కగుననఁగా నభిప్రాయమేమి? మహారాజమరణము పుత్త్రవియోగము ననునవి రెండు నీకు వైధవ్యము మనశ్చింతను గల్గించును. వైదేహికి నామీఁద భర్తృవియోగము పరగృహావాసమునను దుఃఖమును గల్గించును. లక్ష్మణునకు నకార్యకరణరూపదుఃఖమును గల్గించును. అని భావిఫలములను శ్రీరామమూర్తి యెఱింగించె ననునదియే యిద్దానఁగలవిశేషము. "ఉదర్కస్య కాలో బలీ" అన్న కేశవదైవజ్ఞోక్తి యీవిషయమునే తెల్పుచున్నది.

"గమిష్యే దండకారణ్యం కిమనేనాశనేన చ,
విష్టరాసనయోగ్యో హి కాలోఽయం మాముపస్థితః. ౨౮
చతుర్దశ హి వర్షాణి వత్స్యామి విజనే వనే,
మధుమూలఫలైర్జీవన్ హిత్వా మునివదామిషం." ౨౯

అని మూలము. శ్రీరామమూర్తి తనయవతారఫలమును దల్లికిం దెల్పుచున్నాఁడు. ఈకాలము విష్టరాసనయోగ్యముకదా. అది నన్నుఁ బొందినది. కనుక దండకారణ్యమునకుఁ బోవుచున్నాను. ఈయాసనమున నాకేమిలాభము? మునులు కూర్చుండు దర్భాసనముపైఁ గూరుచుండఁ దగినకాల మిది నాపాలఁబడినదని రామభద్రుఁ డెఱిఁగించెను. ఇందుఁగలవిశేష మేమి?

లోకమున నొక్కమహాకార్యము చేయఁబూనువారు తొలుదొలుతఁ దానికిం దగినయోగ్యతను సంపాదించుకొనవలయును. యుద్ధము చేయఁబూను రాజు తనదుగూనునకు బలమును గూర్చుకొనవలయును. మహాకార్యము చేయఁబూనిన

ముని సమాహితచిత్తముగలవాఁడు కావలయును. ప్రకృతమున శ్రీరామమూర్తి దుష్టరాక్షససంహారరూపమునఁ బాపమును నిర్మూలించి శిష్టరక్షణరూపమున ధర్మమును స్థాపింపవలయును. దానికిఁ దగినమనశ్శక్తి కావలయును. అది నియమసాధ్యము. ఆనియమము భగవద్ధ్యానరూపముగ నుండును. యోగాభ్యాసమునకుఁ దగినయాసన ముండవలయును. పరిశుద్ధస్థలము గావలయును. పరిశుద్ధస్థలమనఁగా మనస్సును బాధించునట్టి వికారములు లేనిదని భావము. నిమ్నోన్నతములు గలది గాక యుండవలయు.

"శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః,
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజినకుశోత్తరం. ౧౧
తత్త్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేన్ద్రియక్రియః,
ఉపవిశ్యాసనే యుంజ్యాద్యోగమాత్మవిశుద్ధయే. ౧౨
సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః,
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్. ౧౩
ప్రశాంతాత్మా విగతభీర్బ్రహ్మచారివ్రతే స్థితః,
మనస్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః. ౧౪
యుంజన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః,
శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి." ౧౫

గీత. ౬. అధ్యా.

అను గీతావాక్యములు పైని వ్రాసినయర్థమును దెలుపుచున్నవి. ఇట్లు యోగము నభ్యసించినఁగాని మనశ్శక్తి రానేరదు. ఆశక్తి సంపాదించుకొనినఁగాని మహాకార్యము సాధ్యముకాదు. రావణాదులు సామాన్యులు కారు. తపశ్శక్తిసంపన్నులు. కాని, వారు

పరహింసారూపదుష్కార్యమునఁ బ్రవర్తించినందున వారితపశ్శక్తి ఫలవంతము కాదయ్యెను. ఎట్టిసత్కార్యములైనను హింసాకర్మపరములయ్యెనేని సత్ఫలము నీయఁజాలవనుట సిద్ధాంతము. కనుక నట్టిదుష్టకార్యరతుల వధింపఁబూనిన రామమూర్తి తదనురూపశక్తిమంతుఁడు కావలయును. కాఁబట్టియే ముని వృత్తి నుండవలయునని కైకను బ్రోత్సహించి యామెచేఁ జెప్పించి యామాటరీతిగాఁ దాను వర్తించినట్లు నటించెను. శ్రీరామమూర్తి పరమేశ్వరుఁడౌట దుష్టసంహారార్హమగు శక్తిసంపన్నుఁడు కాఁజాలఁడా. మరలఁ దచ్ఛక్తిసంపాదనమున కేల ప్రయత్నింపవలయును? అను ప్రశ్నము చేయవచ్చును.

"యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః"

అన్న గీతాప్రమాణము ననుసరించి లోకులకు సదాచారమును నేర్పుటకే యవతరించినందునఁ దాను బ్రతికార్యము చేసియే బోధింపవలయునుగాని వాగ్రూపమునఁ దెలుపరాదు. కాఁ బట్టియే దర్భాసనమును గూరుచుండఁదగిన కాల మిదియగును గాని మణిమయాసనమునఁ గూరుచుండఁదగినది కాదని తెలి పెను.

"విష్టరాసనయోగ్యో హి"

అన్న మూలమునకు,

"విష్టరో నామ పంచవింశతి దర్భనిర్మితో తాపసాసనవిశేషః, పంచాశద్భిర్భవేద్బ్రహ్మా తదర్థేన తు విష్టర. ఇతి స్మృతేః."

అని గోవిందరాజులు,

"విష్టరాసనం నామ అవిచ్ఛిన్నాగ్రపంచవింశతిదర్భనిర్మితాసన మిత్యర్థః"

అని మహేశ్వరతీర్థులు వ్రాసిరి.

"విష్టరస్తు సార్ధద్వితయవామావర్తవలితాగ్రోముఖాగ్రా అసంఖ్యాతదర్భాః.
తథా చ గృహ్యసంగ్రహః.—

"ఊర్ధ్వకేశో భవేద్బ్రహ్మా లంబకేశస్తు విష్టరః." ఇతి.
ఛందోగపరిశిష్టమ్.

"దర్భసంఖ్యా న విహితా విష్టరాస్తరణేష్వపి,
ఏవంచ.

పంచాశద్భిర్భవేద్బ్రహ్మా తదర్ధేన తు విష్టరః." ఇతి.

"యది సమూలం తదాశాఖ్యంతరీయం, ఏతేన విష్టరే పంచవింశతి సంఖ్యా, భవదేవభట్టోక్తా నిరస్తా. ఏవం విష్టరగ్రహణం హస్తాభ్యామపి యదుక్తం తదపి నిరస్తం.

"యత్రోపదిశ్యతే కర్మ కర్తురంగం న చోచ్యతే,
దక్షిణస్తత్ర విజ్ఞేయః కర్మణాం పారగః కరః."
ఇతి ఛందోగపరిశిష్టం ఇతి సంస్కారతత్త్వమ్."

అని శబ్దకల్పద్రుమము.

ఇరువదియైదు దర్భలచే నిర్మింపఁబడినది విష్టరమనుట నియమము కాదని సారము. తపోనిష్ఠయుండి భగవదనుగ్రహపాత్రుఁడైనఁగాని మనశ్శక్తిగలవాఁడు కాఁడనువిషయము ఈభాగమునుండి మనము గ్రహింపవలయును. భగవద్ధ్యానమునఁగాని యేగొప్పకార్యము సాధింపఁబడ దనునూహ యెపుడు కలుగునో యపుడే యహంకారము తొలఁగునని భావము. అపుడే మనస్సు నిర్మలముగా నుండఁగలదనియే తాత్పర్యము.

నాలుగుపదియును నగుసంవత్సరములు దండకారణ్యవాసమని శ్రీరామచంద్రుఁడు తెలిపెను. దీనఁగలసి శేషమేమి? ఊహాస.

కుఁడు ఇష్టదేవత నారాధించుచుండినఁ దదనుగ్రహము పండ్రెండుసంవత్సరములకుఁ గలుగుననియు నీలోపలనే కలుగ వచ్చును. కాని పండ్రెండుసంవత్సరము లుపాసించుట మహా నియమమని పెద్దలభావము. దీనికే మహాదీక్షయనియు నామాం తరము గలదు. తరువాతి రెండుసంవత్సరములు తత్ఫలమగు దుష్టసంహారమనియు నెఱుంగందగును. "విజనే వనే" అనునవి యీతపోనియమమును దెలుపుచున్నవి. ఏకాంతసంస్థితి యోగి సమ్మతమనుట ప్రసిద్ధమేకదా.

తేనె కందమూలఫలములు నాహారముగా మునివలె నుందును. వంటవాండ్రు పెక్కుభంగుల సంస్కరించినమాంస విశేషమును వదలుదును. అని రామమూర్తి పలికెను. దీనిసార మేమి?

"ఆయుస్సత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః,
రస్యాస్స్నిగ్ధాస్స్థిరా హృద్యా ఆహారాస్సాత్త్వికప్రియాః." రా
గీత ౧౭. అధ్యా.

అన్నభగవదుక్తి ననుసరించి సత్త్వగుణమును వృద్ధిచేయునాహా రము మునులయాహారమని ప్రసిద్ధము. కాన నట్టియాహారమునే భుజించువాఁడనని రామునాశయము. ఆమిష శబ్దమునకు వంట వాండ్రు పెక్కుభంగుల వండినమాంసమనియే యర్థమని వ్యాఖ్యాతలు వ్రాసిరి.

"ఇదం మేధ్యమిదం స్వాదు నిష్టప్తమిదమగ్నినా,"

అని సూక్తి. ముందు రామాయణమునందే కేవలమాంసగ్రహ ణము చెప్పఁబడును. కావుననే యీయర్థము సుసంగతమే. "మధుమూలఫలైః" అనుమూలమునఁ గలమధుశబ్దమున

మద్యముకూడ నర్థమని కొందఱందురు. 'మధు మద్యే పుష్పరసే' అని యున్నదికదా. మద్యము గ్రహింపననునర్థము పలుకరాదని కొందఱాక్షేపింతురు. క్షత్రియాదులకు కొన్నిమద్యములు పానార్హములే యగును.

"న మాంసం రాఘవో భుంక్తే న చాపి మధు సేవతే." ౪౧.

సుందరకాం. ౩౬-సర్గము.

అని హనుమంతుఁడు సీతాదేవికిం జెప్పెను. ఇందు మద్యమే మధుశబ్దార్థముగాని తేనె కాదు.

"పైష్టికం తాళజం క్షైరం మాధూకం గుడసంభవమ్.
తృతీయాది త్రివర్ణానామాసవం పేయముచ్యతే,
స్త్రీణామపి తృతీయాద్యా పేయం స్యాద్బ్రాహ్మణీం వినా.
అభర్తృసన్నిధౌ నారీ మద్యం పిబతి లోలుపా,
ఉన్మాదినీతి సా ఖ్యాతా తాం త్యజేదంత్యజామివ." బ్రహ్మాండపురాణము.

అని ప్రమాణము కలదు. దీనింబట్టిచూడఁగా సీతావియోగానంతరము మద్యమాంసములను వర్జించెననియు, నంతకుముందు విధివిహితములగు మద్యమాంసములఁ బరిగ్రహించువాఁడనియుఁ దేలెడిని. మధుశబ్దమునకు మద్యమిట నర్థము కాదను వాదము సాధువా కాదా యని పండితు లూహింతురుగాక. మద్యపానము చేయువారికి మనఃప్రసన్నత్వ మలవడునా. అట్టివారిచ్చుపూజను బరమేశ్వరుఁడు గ్రహించునా యని ప్రశ్నించువారు కలరు. కాని,

"యదన్నం పురుషో భుంక్తే తదన్నం తస్య దేవతాః."

అన్నసూక్తని వారెఱుంగరు. కులోచితాచారము భగవదనుమోదితమేకాని వేఱుకాదు. విధివిధించినయాహారము దుష్టము కానేరదు. కనుకనే

"బ్రాహ్మణో మదిరాం దత్వా బ్రాహ్మణ్యాదేవ హీయతే."
అన్న కాళీవాక్యము సుసంగతమయ్యెను కులాచారముల విడనాడక కులదైవతముల నారాధించుచుఁ గులధర్మముల ననుసరించువారు భక్తిగలవారలైనచో భగవదనుగ్రహమునకుఁ బాత్రులేల కారో తెలియరాకున్నది. ఈఘట్టమునుఁ బేర్కొనుచు వారిభావ మరయుదము.

"చతుర్దశ హి వర్షాణి వత్స్యామి విజనే వనే,
మధుమూలఫలైర్జీవన్ హిత్వా మునివదామిషమ్."

అని మూలము.

"అత్ర ఆమిషశబ్దేన సూదైస్సంస్కృతం మాంసముచ్యతే, కేవలం మాంస స్వీకారస్యోత్తరత్ర వక్ష్యమాణత్వాత్."
అని గోవిందరాజవ్యాఖ్య.

"ఆమిషశబ్దేన సూదైస్సంస్కృతం మాంసభక్ష్యభోజ్యాదికం లక్ష్యతే. 'ఇదం మేధ్యమిదం స్వాదు నిష్టప్తమిదమగ్ని' నేతి ఉత్తరత్ర కేవలమాంసస్వీకారస్య వక్ష్యమాణత్వాత్."
అని మహేశ్వరతీర్థులు.

క. "మునివలె విజనంబగున
వ్వనమున నివసింపఁబోవువాఁడను మాంసం
బును వంటవాండ్రు పచనం
బును జేసినదానిఁ దినఁగఁ బోలదు సుమ్మీ."

(ఆంధ్రశ్రీమద్రామాయణము.)

"పాటిలె మౌనిరీతి మధుపక్వఫలంబుల మెక్కి మాంసము
న్నాట దలంపకుండుఁ బదునాలుగువర్షము లేఁ దపస్విస్త్రై"

(వావిలికొలనురామాయణము.)

ఆమిషశబ్దమునకుఁ బెద్దలు సిద్ధాంతము చేసినది వ్రాయుట మేలో, మానుట మేలో పెద్దలు నిర్ణయింపఁగలరు. విమర్శకులు పక్షపాతమునఁ బొగడినందునను, నాపద్యములఁ దెగడినందున నీవిషయము వ్రాయవలసివచ్చెను. వేఱు కారణమునఁ గాదని పాఠకమహాశయు లూహింతురుగాక.

"సా బహూన్యమనోజ్ఞాని వాక్యాని హృదయచ్ఛిదాం,
అహం శ్రోష్యే సపత్నీనామవరాణాం వరా సతీ." ౩౮

అని మూలము. రామచంద్రునకుం గౌసల్య తెలుపుమాట లివి. ఇది కేవలము స్త్రీస్వభావమును బోధించెడిని. ఎల్లరయం దెక్కుడుదాననయ్యు నేనుఁ గాంచ దొలిభార్యనయ్యుఁ దక్కువ వారగు సపత్నులాడు కఠోరవాక్కుల వినుట విశేషదుఃఖకర మని తల్లి కొడుకునకుం జెప్పెను. తొలిభార్య కొడుకునకు రాజ్యము లభింపకుండుటయే కాదు పెద్దభార్యయగుటఁ గలశ్రేష్ఠత్వము. ఎంతశాంతముగలవారైనను స్త్రీలు మాత్రము సపత్నులతోఁ గలిసియుండఁజాలరు దానిని మన మెఱుంగవలయును.

"దశ సప్త చ వర్షాణి తవ జాతస్య రాఘవ,
అసితాని ప్రకాంక్షంత్యా మయా దుఃఖపరిక్షయం." ౪౧

అని మూలము కౌసల్య రామునకుఁ జెప్పెనని సంగ్రహార్థము. ఇందు రామునివయోనిర్ణయము చేయు నవకాశము కలదు. వాల్మీకిరామాయణమున సంబంధించు నీవిషయము కలదు. ఒక్క దానికి నింకొకటి విరుద్ధముగ నుండును. కావునఁ గొందఱు వాల్మీకిరామాయణమున ననేకు లనేకభాగములు చేర్చినా రనియుఁ గనుకనే యిట్టిపూర్వాపరవిరుద్ధములు గలవనియుఁ జెప్పుదురు కాఁబోలు. పనిలేనిమంగలి పిల్లితలఁ గొరిగెనన్నట్లు

పరిశీలకుల మనుపేర నాక్షేపించువారనియే వారినిగూర్చి మనము చింతింపవలయును. విరుద్ధములగు నీవిషయముల సమర్థించుటెట్లు? వినుఁడు.

ఆర్ష గ్రంథములన్నియు మతసిద్ధాంతములపై నాధారపడియుండును. నాలుగుజాతులుగా విభజించినవారలలో మొదటి మూఁడుజాతులవారికి ద్విజులని పేరు.

"వైదికైః కర్మభిః పుణ్యైర్నిషేకాది ర్ద్విజన్మనాం,
కార్యశ్శరీరసంస్కారః పావనః ప్రేత్య చేహ చ. ౨౬
గార్భైర్హోమైర్జాతకర్మచౌడమౌంజీనిబంధనైః,
బైజికం గార్భికం చైనో ద్విజానామపమృజ్యతే. ౨౭
స్వాధ్యాయేన వ్రతైర్హోమైస్త్రైవిద్యేనేజ్యయా సుతైః
మహాయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః." ౨౮

మను. ౨ అధ్యా.

"మాతుర్యదగ్రే జాయంతే ద్వితీయం మౌంజిబంధనాత్,
బ్రాహ్మణక్షత్రియవిశస్తస్మాదేతే ద్విజాస్స్మృతాః. ౩౯
యజ్ఞానాం తపసాం చైవ శుభానాం చైవ కర్మణాం,
వేదఏవ ద్విజాతీనాం నిశ్శ్రేయసకరః పరః." ౪౦

యాజ్ఞవల్క్యస్మృతి. ఆచారకాండము.

"సంక్రాంతౌ విషువే చైవ స్వజన్మత్రితయేఽయనే,"

లలితాసహస్రనామస్తోత్రము.

స్వజన్మత్రితయ మనఁగా జననము, ఉపనయనము, దీక్షాస్వీకారము అనునవి మూఁడును స్వజన్మత్రితయ మనంబడును.

ద్విజులనఁగా సాధారణముగా రెండుజన్మములుగలవారనియే యర్థము. జననము, ఉపనయనము అనునవియే

రెండుజన్మములు. జనన మెల్లరకు సమానజన్మము. ఉపనయనము విశేషించి బ్రహ్మక్షత్రియవైశ్యులకు జననమనము. ప్రాయశః పెద్దలుపనయనాదిగా వయస్సు లెక్కింతురు. కొందఱు జననాదిగా లెక్కింతురు. ఈ రెండువిషయములు మనస్సున నునుచుకొనిన నీశంకలు గలుగునవకాశము లేదు. విరుద్ధవిషయము లేవనఁగా:—

దశ సప్త చ వర్షాణి = కౌసల్య (పదునేడేండ్లు)
ఊనషోడశవర్షో = దశరథుఁడు (పదాఱేండ్లు నిండలేదు.)
ఉషిత్వా ద్వాదశ సమా ఇక్ష్వాకూణాం నివేశనే=సీతాదేవి.
(అయోధ్యలోఁ బండ్రెండు వత్సరము లుంటిని.)

"మమ భర్తా మహాతేజా వయసా పంచవింశకః,
అష్టాదశ హి వర్షాణి మమ జన్మని గణ్యతే." సీతాదేవి.
(నామగనికి ఇరువదైదు వత్సరములు. నాకుఁ బదునెనిమిది.)

దశరథమహారాజు విశ్వామిత్రునితోఁ నాకొడుకునకు నింకను బదియాఱుసంవత్సరములు నిండలేదే యనియెను. ఆసంవత్సరమునందే సీతాకల్యాణము సాగెను. సీత యయోధ్యయందుఁ బండ్రెండు వత్సరము లుంటినన్నందునఁ బదునాఱు పండ్రెండును కలిపిన నిరువదెనిమిదిసంవత్సరములగును. అడవికిఁ బోవునప్పటికి రాముని వయస్సు ఇరువదైదువత్సరములు నాకుఁ బదునెనిమిదేండ్లు. అని సీతయే పలికెను. కౌసల్య పదునేడువర్షము లనియెను. ఈ మూఁడును నొకదానికొకటి సరిపడవు. ఇవి సరిపడువిధము కౌసల్య ఉపనయనమునుండి వయస్సుపరిగణించెనని యూహింపందగు. కౌమార్యబ్దములని చెప్పఁబడిన యుపనయన కాలమునందు నెనిమిదవయేఁట నుపనయనము సాగినదనుకొనందగు. కౌసల్యచెప్పిన పదియేడేండ్లు ఈరితిగా నంగీకరింపవలయును.

జన్మాదిగా నెనిమిదేండ్లకు జేర్చి సీత రామునినయస్సినవాడై దని పలికెనని నిశ్చయింపవలయు. దశరథుఁడు మునితోఁ బదాఱు వత్సరములు నిండనిబాలుఁడు మా రాముఁడనియెను. విశ్వామిత్రయజ్ఞకాలమున మారీచుఁడు రామునిచేఁ గొట్టఁబడియెను. మారీచుఁడు రావణాసురునకు రామునిమహత్త్వమును దెలుపుచు

"బాలో ద్వాదశవర్షోఽయమకృతాస్త్రశ్చ రాఘవః."

అని వయోనిర్ణయముం దెలిపెను. కావున దశరథుఁడు రామునకుఁ బదాఱువత్సరములు నిండలేదనఁగాఁ బండ్రెండువర్షములని పరిగ్రహింపవలయును. ఇట్లుగానున్న వీనింబట్టి తర్కింపఁగా శ్రీరామునకు నెనిమిదవవత్సరమున నుపనయనము పండ్రెండవయేఁట వివాహము. పిదప ద్వాదశసంవత్సరములయోధ్యానివాసము. ఇరువదైదవయేఁట దండకారణ్యప్రయాణమని తేలెడిని.

"నాభర్తకు నిరువదైదుసంవత్సరములు నాకుఁ బదునెనిమిదియేండ్లు" అని సీత చెప్పినవిషయమునఁ గొన్నిసంశయములు గలవు. పెండ్లినాఁటికి సీత యైదేండ్లబాలికయని స్పష్టమగును. ఆఱవసంవత్సరమున సీతకుఁ బండ్రెండవయేఁట రామునకు వివాహము సాగెననికదా దీనిభావము.

"రామస్తు సీతయా సార్ధం విజహార బహూనృతూన్,
మనస్వీ తద్గతస్తస్యా నిత్యం హృది సమర్పితః."

.౨౫

బాలకాం. 22 సర్గము.

అనువాక్యముంబట్టి చూడఁగా నయోధ్యానగరప్రవేశానంతరమునందే సీతారాములవిహారము స్పష్టముగాఁ దోఁచును.

ఆవయస్సున వివాహము సంగతమా యన్న దృష్టశరీరులకు సంగతమే యని కొందఱు వ్రాసిరి. అయ్యది యుపహాస్యభాజనముగాఁ దోఁచును. ఇఁక సమాధాన మేలాగు? అన్న ప్రశ్నము చక్కనిది. సీత యయోనిజాత యనునది యంగీకరించువారల కిది యచ్చెరువు కలిగింపదు. రామమూర్తికన్న వయసున సీత పెద్దదిగానే తోఁచును. సీతారాములు ప్రకృతిపురుషులు గాన నీవయఃపరిమాణము వారికిం జెల్లదు. సీత తనవయస్సు పదునెనిమిదియనుట లోకులకు విశ్వాసార్థము కాని వేఱు గాదు. పదునెనిమిదియేండ్లనారీమణిగా నెల్లరకు దర్శనమిచ్చెను. శ్రీరామమూర్తి కౌసల్యాగర్భసంభూతుఁడు గాన నా శ్రీరాముని వయస్సు సరిగనే యున్నది.

"అనన్యపూర్వికాం కాంతామసపిండాం యవీయసీమ్." యాజ్ఞవల్క్యము.
"యవీయసీం వయసా ప్రమాణతశ్చ న్యూనామ్."

అనుస్మృతివాక్యము ననుసరించి వరునివయస్సుకంటెఁ గన్యకవయస్సు తక్కువగా నుండవలయుననుట స్పష్టము. దానినను సరించి సీతారాములవివాహము శాస్త్రసమ్మతము కాదనవలయును. ఆదిమదంపతులగు సీతారాముల లోకసామాన్యవిధుల సమన్వయము చేసి యూహింపరాదు. కావున, సీతారూపిణి యగు మహాప్రకృతి మానుషాకారార్థము పదునెనిమిదేండ్ల ప్రాయముగలదిగాఁ గనఁబడినదనియు, సామాన్యశాస్త్రనియమము లౌకికదంపతులవివాహవిషయమున నన్వయింపఁ దగినదనియు మనము నిర్ణయించుకొనవలయును. భగవచ్చరిత్రము చదువునపుడు దానిసారమునే యూహింపవలయును. దాననే మనకు లాభము కలుగును. సామాన్యధర్మములు విశేషధర్మ

ములచే నడఁగఁద్రొక్కంబడునుగదా. ఈవచనమున కావచనము, ఆవచనమున కీవచనము విరుద్ధమనియుఁ, గాన నొక్కఁడు చేసినకావ్యముకాదనియు వాదములుచేయుచు, నదియే పరమపురుషార్థముగా భావించువారలు భగవత్తత్త్వము నెఱుంగఁజాలరనుట సిద్ధాంతము. సీతారాములప్రవృత్తియు, దాని మహత్త్వము,వారు చేయుమహాకార్యములు నెట్టివని పరికించుటుత్తమము. రామాయణము ననుసరించి యాలోచించినను వయోనిర్ణయ మసంగతముకాదు. సీతంగూడి రామమూర్తి విహరించె ననుతావున సమాధానమేమనఁగా "స్మరణం కీర్తనం కేళిః" అనుప్రమాణము ననుసరించి విహారాష్టకమును యుక్తకాలమున ననుభవించెననుటయే సమాధానము. అయోధ్యయందున్న పండ్రెండుసంవత్సరములలో నాలుసంవత్సరములు సీతవయస్సునఁ గలుపఁగాఁ బండ్రెండు దాఁటును. ఆనలియాఱుపత్సరములు దాంపత్యసుఖానుభవకాలమని నిర్ణయింపవచ్చును. ఈసమాధానమున నసంగతముల కాధారము గాన రాదు.

"అపశ్యంతీ తవ ముఖం పరిపూర్ణశశిప్రభం,
కృపణా వర్తయిష్యామి కథం కృపణజీవికాం." ౪౭

అని మూలము. కౌసల్యవాక్య మిది. సామాన్యార్థము స్పష్టము. సకలజగదాహ్లాదకరమగు భగవంతునిమోము చూడకయుండువాఁడు కృపణుఁడు. ఆతనిజీవనము దుఃఖజీవనము. శ్వేతవర్ణము ముక్తిప్రదము. శ్వేతవర్ణముగా భగవంతుని ధ్యానించువారు ముక్తికాములని యెఱుంగవలయు.

"ముక్తా ...యా శశిజ్యోత్స్నా ధవళాకృతిరంబికా. ౭౧
రక్తసంధ్యకరోచిస్స్యాద్వశీకరణకర్మణి,

శవిత్వే విశదాకారా స్ఫటికోపలనిర్మలా. ౨౨
ధనలాభే సువర్ణాభా చింత్యతే లలితాంబికా,
సర్వసంపత్తిలాభే తు శ్యామలాంగీ విచింత్యతే. ౨౩
నీలా చ మూకీకరణే పీతా స్తంభనకర్మణి,
ఆమూలమాబ్రహ్మబిలం జ్వలన్మాణిక్యదీపవత్. ౨౪
యే ధ్యాయంతి మహాపుంజం తే స్యుస్సంసిద్ధసిద్ధయః,
ఏవం బహుప్రకారేణ ధ్యానయోగేన కుంభజ. ౨౫
విభావయంత శ్రీదేవీం భజంతే మహతీం శ్రియం,
ప్రాప్యతే సద్భిరేవైషా నాసద్భిస్తు కదాచన." ౨౬

లలితోపాఖ్యానము. ౪౧-అధ్యా.

అను నీప్రమాణవాక్యములం బరిశీలించినచోఁ బై విషయము స్పష్టమగును. భగవంతుని దేజోరూపునిగా ధ్యానింపనివారి జీవనము దుఃఖజీవనమని భావము.

"యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి
చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః,
బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తస్సతతం భవ."

అను నీభగవద్గీతావాక్యములు పై భావమునే సూచించెడిని. కావున, శ్రీరామచంద్రుని శ్వేతవర్ణవిశిష్టునిగా ధ్యానించి మనఃకమలమునందు నెలకొల్పిన యారూపమును జూచుచుండినచో నట్టిభక్తుని దే సుఖజీవనము. అనఁగా నాతనియానందమే నిజముగా నానంద మనంబడును. దీనిచేతఁ బూజ యనఁగా మానసికపూజయే యుత్తమమనియు, విగ్రహారాధన ముత్తమము కాదనియు, నయ్యది కేవలపామరులకొఱకు నిర్మింపఁబడినదనియుఁ దేలెడిని.

"మమైవ నూనం మరణం న విద్యతే న చావకాశోఽస్తి యమక్షయే మమ,
యదంతకోఽద్యైవ న మాంజిహీర్షతి ప్రసహ్యసింహోరుదతీం మృగీమివ."

అని మూలము. ఇదియుఁ గౌసల్యపలుకువాక్యమే. మహాముని కౌసల్యనోట నొకరహస్యవిషయమును వెల్లడించెను. ఎట్లనఁగా భగవద్దర్శనము చేసి ప్రీతితో నారాధించి నిరంతరము మనస్సునఁ దత్కళ్యాణరూపమును జూచుచుండువారికి మరణ మెక్కడిది? వారికి యమలోకమున జోటుండునా? యముఁడు వారలఁ గన్నెత్తియైనఁ జూడఁగలఁడా? అనఁగా వారిదివ్యశరీరము శాశ్వతమని భావము. పాంచభౌతికశరీరము స్థిరముగ నుండునా యని ప్రశ్నింపవచ్చును. అట్టివారు కోరరు. కాని వారి కించుక కోరికకలిగిన నీపాంచభౌతికశరీరమే యక్షయముగా నిలుచును. పరమేశ్వరుఁడు చేయఁజాలనిపని యుండునా? భక్తులు సాధారణముగాఁ గోరికకలవారు కారాదు. భగవద్దర్శనానందానుభవమే వారలకు ముక్తి. వారలే యోగులనఁబడుదురు. ధ్యేయమూర్తిని మనమునఁ గాంచుచుందురు.

"యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి,
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి." ౩౦ అధ్యా. ౬.

అన్న గీతావాక్యము కలదుకదా. భగవంతుని చెంతనుండు టనఁగా భావమేమి? కనఁబడుసకలపదార్థములు భగవద్రూపములుగా నాతనికిం గనంబడునని తాత్పర్యము.

"ఇదం తు దుఃఖం యదనర్థకాని మే
వ్రతాని దానాని చ సంయమాశ్చ హి,
తపశ్చ తప్తం యదపత్యకారణా
త్సునిష్ఫలం బీజమివోప్తమూషరే." గీ.

ఇదియుఁ గౌసల్యావాక్యమే. ఇందొక్కవిశేషాంశము కలదు. ఇందలి యపిత్ర్యశబ్దము సర్వకామ్యఫలత్యాగమని యెఱుంగ వలయు. ఐహికసుఖముం గోరి చేయు వ్రతములు దానములు ధ్యానాదులు తపస్సు నిష్ఫలములగును. అనఁగా వానికిఁ దగి నంతఫలము చేకూరదని భావము. స్వల్పసుఖముం గోరి చేయు భగవత్పూజ చవుటనేలలోఁ నిడినవిత్తనముం బోలి నిష్ఫల మగును.

"చతుర్విధా భజంతే మాం జనాస్సుకృతినోఽర్జున,
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ. ౧౬
తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే,
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమహం స చ మమ ప్రియః. ౧౭
ఉదారాస్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతం,
ఆస్థితస్స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిం." ౧౮

గీత. ౭ అధ్యా.

"విహాయ కామాన్యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః,
నిర్మమో నిరహంకార స్స శాంతిమధిగచ్ఛతి." ౭౧

గీత. ౨ అధ్యా.

అను నీ గీతావాక్యములు నిష్కామకర్ముఁడే భగవదనుగ్రహ పాత్రమని బోధించుచున్నవి. స్వార్థబుద్ధి [illegible] లోన రించిన నపు [illegible] చవుటనేల నిత్తనమువలె [illegible] మగును. ఈ గీతార్థమే [illegible] కౌస [illegible] మహర్షి [illegible] ఇట్టి గీసర్గము [illegible] కనేకవిషయములను దెలుపుచున్నది. ఇఁకఁ [illegible] బఠింతము.

లక్ష్మణుఁడు కౌసల్య నూఱడించుట.

*ఆరీతిగాఁ గౌసల్య వగచుచుండఁగా సౌమిత్రి దీనుఁడై యామె వగలడంపఁబూని తత్కాలోచితముగా నిట్లు పలికెను. ఆర్యా! ఒక్కస్త్రీమాటలకు లోనై రామచంద్రుఁడు రాజ్యము వదలి యడవికేగుట నీకుమాత్రముకాక నాకుంగూడ సమ్మతము కాదు. మహారాజు కడు వృద్ధుఁడు. ఆతనిమనస్సు తాఱు మాఱయియున్నది. మఱియు విషయలోలుఁడు. కామవశం గతుఁడు. కనుకఁ గైక ప్రోత్సహింప నింక నేమాట చెప్పక యుండును? అయుక్తము లెన్నియైనఁ జెప్పును. కావున నాతని వాక్య పాటింపరాదు. ఇది రాజుదోషము కాదు. రాముని దోషమే యగునందువేమో అవి సరికాదు. రాజ్యము వదలి యడవినుండ వెడలఁగొట్టఁదగిన రాజద్రోహముగాని, యింక నేమహాపాతకముగాని రాముఁడు చేసినట్లు నాకుఁ దోఁపలేదు. (ముదుసలియై తండ్రి దుర్విషయలోలుఁడై స్త్రీచెప్పినట్లు సిగ్గుమాలి యిట్లు చేయుచున్నాఁడు. కనుక ధార్మికుఁడు కాని రాజును వధించురీతి నే నాతని వధింతును.) రాజు రామునకు మిక్కిలి పగవాఁడు. రామునిచే నవమానింపఁబడినవాఁడు కాని మఱెవ్వఁడు కాని చాటుననైన రామునియం దీదోషముకలదని చెప్పఁగా నేను విననేలేదు. కనుక రామునియందే దోషముకలదని సంశయింపరాదు. దేవతలంబోలి కౌటిల్యములేక. గురువులవలన సుశిక్షితుఁడై జితేంద్రియుఁడై శత్రువులయందుఁగూడఁ బ్రేమునించి, ధర్మస్వరూపుఁడునైయున్న శ్రీరామమూర్తి నిర్దోషుఁడనుట

* ఇత్యాది యిరువదొకఁడవ సర్గమునుండి కైకొనఁబడినది. అధ్యాత్మరామాయణ కథాసాంగముకూడ నిందు నిమిడియుండును.

ప్రత్యక్షముగాదా. అట్టిసత్పుత్రుని దోషముగాని కారణము
గాని లేక లోకమున నేధార్మికుఁడు విడనాడును? శ్రీరాముని
నిష్కారణముగా విడనాడిన దశరథుఁడు ధార్మికుండగునా?
దుర్మతి యగుట నతనిమాటఁ బాటింపరాదు. ముదివగ్గయ్యును
మరల బాలత్వ మలవడినట్లు కామమునకు లోఁబడియున్న రాజు
శాసించినయసంగతవాక్యమును రాజనీతిననుసరించి యూహించి
నచో నేనుమూరుఁడైన మనస్సున నొప్పుకొనునా? అన్నా!
రామచంద్రా! నిన్నడవులకుఁ బంపువిషయ మెవ్వరికిఁ దెలియక
మునుపే నాతోఁగూడి యీ రాజ్యమంతయు వశపఱచుకొనుము.
ధనుర్ధారినై నేను పార్శ్వమున రక్షకుఁడనై యుండఁగా
యమునింబోలి యొరులకుఁ గన్పట్టుచున్న నీకంటె విశేషపౌరు
షము చూపువాఁ డీలోకమున నెవ్వఁడు గలఁడు? నీయానతి
నెవ్వఁడు మీఱును? పురుషోత్తమా! ఈపౌరులు నీకుఁ బ్రతి
కూలమగుదానిని దేనినేఁ జేయఁబూనిరేని వారిని నానిశితవిశిఖ
ముల రూపఱఁజేసి పురము నిర్మానుష్యముగా నొనరింతును.
ఇఁక భరతునిపక్ష మూనినవారుగాని, వారికి మేలుగోరువారు
మఱెవ్వరుగాని యొకఁడైన గనంబడిన వారినెల్ల వధించెద.
మృదుమానసుల నెల్ల దమనింతును. కావునఁ గాఠిన్యమూని
యే పనిని సాధింపవలయును.

అన్నా! తండ్రి కుమతియై కైక ప్రోత్సహింపఁగా నామె
మాటలను విశ్వసించి మనకు శత్రువై విరోధము చేయునేని
అట్టితండ్రి నాలసింపక వధింతము. అంతటి క్రూరకార్య
మాయందువేని కట్టివేయుదము. ఇట్లు చేయవచ్చునా యందు
వేని చేయఁదగుననుటకుఁ బ్రమాణము కలదు. జనకుఁడైనను
గర్వించి కామాదులకు లోఁబడి కార్యాకార్యము తెలియంగక

హద్దుమీఱి చెడుత్రోవను ద్రొక్కునేని యాతని దండింపవల యును. మహాత్మా! ఆమాట యటుండనిమ్ము. ధర్మమునను సరించి నీకు లభింపనున్నయీ రాజ్యమును, దశరథుఁడు నిన్నడంపఁ జాలుబల మేది తనకుఁ గలదని, తగినకారణ మేది కలదని యూహించి నీకొసంగక కైకేయికి నీయఁగోరుచున్నవాఁడు? రాజున కట్టిబలముగాని కారణముగాని లేదు. శత్రుసూదనుఁడ వగు నీతోడను నాతోడను కాదనక విరోధము గలిగించుకొని భరతునకు రాజ్యమిచ్చుట కతని కేమి యధికారముకలదు? అని పలికి కౌసల్యం గాంచి యిట్లు పలికెను.

అమ్మా! నేనును భరతునివలె జ్ఞాతినే కదా. అయిన నాహృదయమునందు భ్రాతయగు రామునిపై ననురాగము కలదు. ఈమాట నీయెదుట నేను సత్యముపై ధనుస్సుపై దానముపై దేవతార్చనాదులపైఁ బ్రమాణము చేసెదను. తల్లీ! మండుచుండు నగ్నినిగాని యరణ్యమునుగాని శ్రీరాముఁడు ప్రవేశించునేని నేను నతనికంటె ముందే ప్రవేశించితినని యే నిశ్చయింపుము. సూర్యుఁడుదయించి కిరణసమూహము చేత నంధకారము నడంచుచందమున నేనుంగూడఁ బరాక్రమమున నీదుఃఖమును మాయింతును. నాపరాక్రమముఁ దల్లియు నన్నయు నిపుడు కనుఁగొందురుగాక. అని మహాత్ముఁడగు లక్ష్మణుఁడు పల్కినది విని కౌసల్య దుఃఖించుచు, నీదుఃఖము తొలఁగునా యని కోరుచు రామునితో నిట్లు పలికెను. వత్సా! తమ్ముఁడు చెప్పుచుండు పలుకుల వింటివి కదా. అది నీకు సమ్మతములగునేని యింకఁ జేయఁదగుపని నొనరింపుము. నాసపత్ని ధర్మవిరుద్ధముగాఁ జెప్పినపలుకు విని దుఃఖములపాలగుచున్న నన్నువదలి నీవిచ్చోటు వదలి పోరాదు. ధర్మముల నెఱుంగు

దువు. పరమధార్మికుఁడవగు నీవు ధర్మమునే యాచరింపవలయు నని కోరినయెడల నిందేయుండి నాకు సేవలు చేయుచు నసమానమగు నీధర్మమును సమాచరింపుము. తల్లికి శుశ్రూషలు చేయుటకంటె నుత్తమధర్మము వేఱొకటి లేదుకదా. మున్ను కశ్యప కుమారులలో నొక్కఁడు తల్లికిఁ బరిచర్యలు చేయఁదలఁచి దానిచేత మహాతపస్సును బొంది స్వర్గముఁ బ్రాపించెను. నీతండ్రి దశరథుఁడు గౌరవముచే నెట్లు పూజ్యుఁడో యట్లే నేనును దల్లి నగుటఁ బూజ్యురాలనే. కావునఁ బితృవాక్యమునట్లెఁ దల్లిమాటను నీ వంగీకరింపవలయును. నీ వడవులకుఁ బోవ నే నంగీకరింపను. అడవికి నీవెంటమాత్రము పోరాదు. నిన్ను నెడఁబాసిన నాకీబ్రదుకేటికి? సుఖములేల? నీవు వెంటనుండఁగ నేనిందు సకలభోగముల ననుభవించుటకంటె నీతోడ వచ్చి తృణభక్షణము చేయుచుండుటయు మంచిదియే. దుఃఖించుచుఁ దల్లడిల్లు నన్ను విడిచి యడవులకుఁబోవుదు వేని నేనిందే ప్రాయోపవేశముఁబూని యన్నపానములు వదలి ప్రాణములఁ ద్యజింతును. అంతియకాని బ్రదికియుండనోపను. నీకొఱకు నేను బ్రాణముల వదలినయెడల మున్ను సముద్రుఁడు పిప్పలాదుల విషయమున నధర్మము నాచరించి బ్రహ్మహత్యాతుల్యపాతకము నొందిన చందమున లోకములనెల్ల వ్యాపించినట్లు నీవును దుర్గతిని బొందఁగలవు.

అని యిట్లు విలపించుచు దీనురాలై యున్న తల్లిని గాంచి శ్రీరామచంద్రుఁడు ధర్మజ్ఞుఁడు గాన ధర్మసహితము లగు వాక్యముల నిట్లనియె. తల్లీ! నీయానతిరీతి మెలఁగవలసినదే. అయినయు నీమాటకంటెఁ దండ్రిమాట మిగుల ఘనముగనుండును. ఉత్కృష్టమైనది. కాఁబట్టి పితృశాసనమును మీఱునంతసాహ

సము చేయఁజాలను. నీపాదములు తలసోఁకునట్లు నమస్కరించి
ప్రార్థింతును. ప్రసన్నురాలవుకమ్ము. తండ్రిమాట ప్రకారమడ
వికిఁ బోవఁగోరెదను. అనుజ్ఞనొసంగుము. తండ్రివలెనే తల్లి
వగు నీవును బూజ్యురాలవే. మున్ను జ్ఞానియుఁ బండితుఁడు
వ్రతపరాయణుఁడు నగు కండుమహర్షియుఁ బితృశాసనము
నెఱవేర్పఁబూని గోవునుగూడ వధించెను. అంతియకాక మన
వంశమునందుఁగూడ సగరకుమారులెల్లఁ దండ్రియాజ్ఞచేత
భూమిని ద్రవ్వుచు భయంకరవధమునొందిరి. పరశురాముఁడు
జనకునిమాట నెఱవేర్పఁబూని తల్లిని రేణుకను దానే చంపెను.
ఇట్లు గోవధము, ఆత్మవధము, జననీవధము ననువానినైన నొన
రించి పిత్రాజ్ఞను బాలింపవలసియున్నదికదా. ఇట్టులుండఁ దల్లికిఁ
గొంతకాలము దుఃఖమునుమాత్రము కల్గించుటకుఁ బ్రాలు
మాలి మహోత్కృష్ట మనఁదగుతండ్రియానతి నతిక్రమించి
యడవికిం బోవక యెట్లుండుదును? అమ్మా! కండుముని మొద
లగు వారు దేవసమానులుకదా. వారు మఱికొందఱును జేసినట్లే
నేనుగూడ నాతండ్రికి హితముగా నతనివాక్యమును సార్థకము
చేయుదుంగాని వ్యర్థముచేయను. లోకమున నేనొక్కఁడనే
తండ్రియానతిఁ జేయఁబూనువాఁడను గాదుకదా. దాని నొన
ర్చినమహాత్ములను దెల్పితిఁగదా. నీకు దుఃఖముకలిగింపవలయు
నని నేను మున్నెన్నఁడును లేని పూర్వాచారవిరుద్ధమగు
నూతనధర్మము నాచరింపఁబూనలేదు. మహానుభావులెందఱో
యాచరించినపితృవాక్యపరిపాలనరూపధర్మమార్గము ననుసరించి
వర్తింతునుగాని వేఱుకాదు. భూలోకమున ముఖ్యముగాఁ
బితృవచనము సమాచరణీయము. కాన దాని మాన నామానస

మంగీకరింపదు. తల్లి లోనగువారికి దుఃఖ మొకప్పుడు కలిగినను జనకునివాక్య మనుసరించువాని కేకష్టము కలుగదు.

అని యిట్లు వాగ్విశారదులందును ధనుష్మద్వర్యులందు నుత్తముఁడగు రామమూర్తి తల్లి కిట్లుత్తరమిచ్చి యవ్వల సోదరుం గాంచి యిట్లు పలికెను. సౌమిత్రీ! నాయందు నీకుఁ గలమైత్రి యసమానము. నీబలపరాక్రమప్రతాపము లెవ్వరికి నుండవు. నా కీవిషయములు తెలిసినవే. నాయనా! నాతల్లి సత్యశాంతులస్వరూప మెఱుంగనిది. కాన విశేషదుఃఖాక్రాంతు రాలయ్యెను. వానినెల్ల నెఱింగిన నీవేటికో యిట్లు పలుకు చున్నాఁడవు? సకలపురుషార్థములందు లోకమున ధర్మమే యుత్తమము. ఏటికంటువా? ధర్మమునందే సత్యమున్నది. పితృ వాక్యపరిపాలనముగూడ నాధర్మమునే యాశ్రయించినది. కాన దీని మిక్కిలి ధర్మము గల్గును. ధర్మమునందు నియతిగలిగి యదియే ఫలముగాఁ గోరువాఁడు తల్లిదండ్రులనుఁగాని విప్రులనుఁగాని చెప్పినట్లు చేసెదనని వాగ్దానముచేసి తప్పనిచ్చునా? అట్లే నేనుగూడఁ దండ్రికిఁ జెప్పినట్లు చేసెదనని ప్రతినచేసిన వాఁడను. కాన దానిని మీఱిపోఁజాలను. కైకయాసతిగాని తండ్రియాజ్ఞ యేమి? అని యందువేమో తండ్రిమాట ననుసరించియేకదా కైక నన్నడవికిఁ బొమ్మన్నది. కావునఁ దండ్రిని జంపి రాజ్యము నిత్తుననుదుష్టరాజధర్మము నాధారముచేసి కొనిన యీదుష్టబుద్ధిని మానుము. ధర్మమునే యాశ్రయింపుము. ఇంక నెప్పుడుగాని యిట్టిక్రూరత్వమును బూనకుము. నాబుద్ధి ననుసరించి ప్రవర్తింపుము.

అని యిట్లు తమ్మునకు హితము నుపదేశించి మరలఁ దల్లిం గాంచి శిర స్సామెపాదములు స్పృశించునటుల నమస్కరించి

యంజలింబట్టి తల్లీ! నేను గానన మున కరుగుచున్నాఁడను. పోయిరమ్మని యనుమతినొసంగుము. నాప్రాణములతోడుసుమీ. పోవలదని పలుకకుము. శుభముగాఁ బోయిరమ్మని మాకు స్వస్త్యయనముల నొనరింపుము. నాయాజ్ఞ మీఱకుమా యని మాత్రము పలుకకుము. తొలుతఁజెప్పిన తండ్రిమాట ప్రకారముగాఁ గాననమునకుఁబోయి నాప్రతిన నెఱవేర్చి పూర్వము స్వర్గమునువదలి మరల దానింజెందినయయాతిమహారాజుచందమున నడచియుండి మరల నయోధ్య కరుదెంతును. అమ్మా! హృదయముననే వగనడంపుము. నలువురు తెలిసికొనునట్లు దుఃఖింపకుము. పితృవాక్యమురీతి వనవాసము ముగించి మరల నిచ్చటికివత్తును. తండ్రియానతిఁ దీర్చుభారము నాయొక్కనిది కాదు. వానిని నీవును నేనును సీతయు సౌమిత్రియుఁ జక్కఁగా నెఱవేర్పవలసినవారము. ఆభారము మనయందఱపైనున్నది. ఇది సనాతనధర్మము కాని నేనుగాఁ గల్పించినదిమాత్రము కాదు. ఇంక నీ వీపూజాద్రవ్యములను వదలి మనోదుఃఖము నడంచికొని వనవాసమునకుగా నేఁబూనినబుద్ధిని నీవుంబూని నన్నుఁ బంపుము. ఈబుద్ధి పితృవాక్యపాలనరూపధర్మముతోఁ గూడినది. కావున నీకు ననువర్తింప నర్హము.

ఇట్లు శ్రీరాముఁ డత్యంతధర్మహితముగను మహాధైర్యయుక్తముగను దృఢప్రయత్నయుక్తముగను బలికిన విని మూర్ఛిల్లినట్లున్న యాపట్టపురాణి తెలివినొంది మరల రామునితో నిట్లు పలికెను. కుమారా! నిన్నుఁబెంచెడు మాధర్మమును బట్టియుఁ బ్రీతిననుసరించియు దేహసంబంధము నాశ్రయించియు నీకుఁ దండ్రి యెట్లు పూజ్యుఁడో యట్లే నేనుగూడఁ బూజ్యురాలనే. కనుక జనకవాక్యమురీతి జననీవాక్యముకూడ

నెఱవేర్పఁదగినదే కాని పరిత్యజింపఁదగినది కాదు. కాన, నేను నీవనగమనమున కనుజ్ఞ నీయను. మహాదుఃఖమున గ్రుంగిన నన్ను వదలి నీవుపోవుట తగవు కాదు. నీవు లేకయున్న నేనిందు బ్రదుకనేల? తక్కిన భోగంబు లేటికి? పరలోక మేటికి? పితృలోకమునకుం బోయి స్వధ నిక్కినను లాభ మేమి? స్వర్గలోకమున నమృతము దొరకిన నద్దానిం గ్రోలినను లాభ మేమి? ఆనందమునకు స్థానమగు మహర్లోకము లోనుగాఁగల యూర్ధ్వలోకములఁగల ప్రాణినివహ మెల్ల [illegible] గనుభవించు నానందము మహాత్మా మాత్రము నాయనుభవించు సుఖమునకు సమానము కాదు. మానవు[illegible]లచేఁ [illegible]ంచి [illegible] యరికట్టును లెక్కచేయక తాఁబోయి [illegible]మునే మహలఁ బ్రవేశింపుచుండఁగ [illegible]మునఁ గౌసల్యను లక్ష్మణుండును హితవాక్కులు పలికి నలువన్నను ధర్మమార్గమునే రాముండు పూనుటం జేసి తల్లి మిక్కిలి దయగలుగునట్లు [illegible]గా నాలకించియు మఱింత గాఁ బననట్లు [illegible] [illegible]. అంత యూర్ధ్వమునింగి నట్టున్నట్లుగ దుఃఖ[illegible]మున్న [illegible] గాంచి ధర్మము నందే స్థిరంగాంచి యున్న రాముండు మహాధర్మసంకటకాలమున నట్టివారికే తగినమాటల నిట్లు పలికెను.

లక్ష్మణా! నాయందు నీకుఁగల భక్తియు నీపరాక్రమము నేను నిరంతర మెఱుఁగుదును. నీవు ధర్మమునందే స్థిరుఁడవై యుండవలయునుసుమీ. నాయాశయము [illegible] తల్లిం గూడి మిక్కిలి దుఃఖములు గలుగుచున్నను నన్నుఁ గలవర పెట్టుచున్నాఁడవు. వత్సా! ధర్మసంభూతములగు సుఖములఁ గల్గించుటను [illegible] ధర్మార్థకామములని నిశ్చయింపఁబడి నవి. ఆపురుషార్థము లెల్ల నాధర్మమునందే నెలకొనియున్నవి.

అన్నింటి కాధర్మమే యాధారము. సందియములేదు. ఒక్క భార్యయే, పతికనుకూలరాయై ధర్మమును, ప్రియురాలై కామమును, సత్పుత్త్రునిం గాంచి యాపుత్త్రునదృష్టముచే నర్థము నేరీతిఁ గల్గించునో, యట్లే యొక్క ధర్మము ననుష్ఠించినయెడల సౌఖ్యమునుగల్గించు నర్థకామాదిసర్వపురుషార్థములు లభించు. దేనియందు ధర్మార్థకామములు మూఁడును గలుగవో యట్టి కార్యమునకుఁ బూనరాదు. ధర్మము సిద్ధించుకార్యమునకే పూనవలయును. లోకమునందుఁ గేవలార్థపరాయణుఁడగు వాఁడు లోకులచే ద్వేషింపఁబడుచున్నవాఁడు కేవలకామపరాయణత్వము ప్రశస్తముకాదుకదా. మనకు దశరథుఁడు ఆచార్యుఁడు, రాజు, వృద్ధుఁడు,తండ్రియునగు. అట్టిరాజు కోపముననొండె సంతోషముననొండె, కామముననొండె, తాఁజేసిన ప్రతిన పాలింపవలయునన్న ధర్మము నాశ్రయించి యేదో కార్యము నొకదాని నాజ్ఞాపించునేని క్రూరవర్తనములేనివాఁ డెవ్వఁడైనఁ జేయకయుండునా? నేను క్రూరుఁడను గాను. తండ్రి భరతునకుఁ బట్టాభిషేకము నాకు వనవాసము నియమించెను. అట్టితండ్రిశపథమును బూర్ణముగను, యథార్థముగను జేయక యుండనోపను. వత్సా! దశరథుఁడు నాకు భరతునకును ఆజ్ఞ చేయుటకుఁ బ్రభువు. తల్లియగుకౌసల్యకు భర్త. కాఁబట్టి యతనియాజ్ఞ మీఱరాదు. కౌసల్యకు భర్తతోడిదే గతి. ఆతనిచెంత నుండుటయే ధర్మము. భర్తయగుదశరథుఁడే పరలోకశ్రేయస్సాధనము. ధర్మమునడపువాఁడై పూర్వరాజులకంటె విశేషించి తనకు నియమితమగుమార్గమున వర్తించుచుఁ దనకు గతియైయున్న యట్టిభర్త జీవించియేయున్నవాఁడు. తల్లియో పట్టపురాణి తానగును. ఇప్పగిదినుండఁగా

నీవు కొడుకు ననుసరించి పోఁగూడదు. విధవస్త్రీయైన యట్లు కొడుకు వెంటఁ బోవలయును. నాతోఁ బడి నవనవలను రాఁ జెల్లునే? రాఁగూడ దనుట సిద్ధాంతము. భర్త జీవించియున్న తల్లి నా వెంట రాఁదగదు. కావున నా కనుమతి కిచ్చి నన్ననుజ్ఞ యియ్యవలయును. తల్లీ! దాపిని త్రుంచుకుని చెప్పినట్లు యయాతి మొదలగు స్వర్గమునుండినట్లుగా నేనును బదునాలుగేండ్లు వనవాసము సాగించి యనంతరము సుఖముగా మరలి వచ్చునట్లు మాకు నాశీర్వచనము లొసంగుము. నేను ధర్మమార్గమును బరిత్యజించి తుచ్ఛరాజ్యము కొఱకు మహాపాతకము నొనర్చి యపకీర్తిని బడయుటకు శక్తుఁడను గాను. జీవితకాలము మిక్కిలి స్వల్పము. ఇందువలన నధర్మము నవలంబించి తుచ్ఛమగు భూమి నిప్పుడు సంపాదింప నే నెంతమాత్రము కోరను. అని యాపుణ్యపురుషుండు జనని ధర్మమునం బ్రవర్తింపఁజేసి [illegible] వేగముగాఁ గలిగిపోవునని తనను నమస్కరించిన [illegible] కారుణ్యమున నతని సుతు యింతయు నాశీర్వదించి స్వస్తివాచనము చదివించి ప్రాణముగా సంతోషించెను.

మహాశయులారా! ఈసర్గము చాల ముఖ్యము. శ్రీరామ చంద్రుని నాయకుఁడు నేటివఱకు మనవి యనుభోగము మనకు చెప్పును. ఇంతవరకు సీతమ్మయొక్క ధర్మశాస్త్రమున కీర్తి స్వరూపము మనకు చెప్పును. శ్రీరామచంద్రుఁడు తనయొక్క ఫలమును దాఁ జేయుచుండు కార్యమును గనుక సత్పురుషుల మార్గమని యందో దాని నిలుపఁ జేయుచుండును. ఇంకనేకవిషయములు వినువారికి ముఖ్యములు గలవు. వానిని జాలువిడిన మనస్సు నొప్పును. గ్రంథము పెరిగిపోవునేమో యని భయము పొంద

చూపుచున్నది. తెలిసినవిషయములను దాఁపక వ్రాయవలయునన్న పేరాశ బాధించుచున్నది. కావునఁ గొన్నింటినైన విమర్శింతును. నాయోగ్యత ననుసరించి వ్రాయుదును. విశేషాంశములు పెద్దలే తెలుపఁగలరు.

"త్యక్త్వా రాజ్యశ్రియం గచ్ఛేత్ స్త్రియా వాక్యవశం గతః. 2
విపరీతశ్చ వృద్ధశ్చ విషయైశ్చ ప్రధర్షితః,
నృపః కిమివ న బ్రూయాచ్చోద్యమానస్సమన్మథః. 3

అనునివి లక్ష్మణవాక్యములు. క్రోధాతిరేకమునఁ బలికినవాక్యములయందు విశేషమేమియుండునని యూహింపరాదు. వాల్మీకి మహాముని యొక్కొక్కరిమాటలమూలమునఁ గొన్నినీతులను మనకుఁ దెలుపును. కావున, మన మిందుఁగల నీతులఁ బరిశీలించి తెలిసికొనఁదగును. సాధారణముగా మానవుఁడు చంచలమనస్కుఁడు కానితఱి యోజించిననే సద్విషయము తోఁచును. ఇంద్రియసుఖములఁ గోరినతఱి మనస్సు విశేషించి చంచలత్వమొందును. అట్టిసమయమున నూహించినది నీతిబాహ్యముగనే యుండును. కావున, దశరథునియాజ్ఞ నీతిబాహ్యమని లక్ష్మణుఁడు పలికెను.

"విపరీతశ్చ వృద్ధశ్చ విషయైశ్చ ప్రధర్షితః, స్త్రియా వాక్యవశంగతః"

అనుకారణములను దెల్పెను. విపరీత మనఁగా బుద్ధి తాఱుమాఱుగా నుండుట యని యర్థము. దశరథుఁడు సనాతనాచారమును మానెనని భావము. కారణము వృద్ధుఁడగుటయే. వార్ధక్యమున బుద్ధి భ్రంశము కలుగుట స్వభావము. ఈ రెండు కారణములే కాక విషయములకు లోఁబడెననునది మూఁడవకారణము. ముదుసలితనమున విషయములు మఱింత కలవరపెట్టునని

భావము. ఈమూఁడే చాలును. పైఁగాఁ గామినీవాక్యము పురి కొల్పుట నాల్గవకారణము. ఇట్టి యిక్కట్టులకు లోఁబడినరా జేమి చెప్పినను జెప్పును. ఇన్నింటికి ముఖ్యకారణము "సమన్మథః" అనునది. కామము భయపెట్టుచున్నదని తాత్పర్యము. ఇట్టి రాజుమాటలు గ్రాహ్యములాయని లక్ష్మణుఁ డడుగుచున్నాఁడు. ఈప్రశ్నమునకుఁ దగినవని చెప్పిన కారణములన్నియు న్యాయ్య ములే యని భావింపవలయును.

"యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః,
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః. ౬౦
తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః,
వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా. ౬౧
ధ్యాయతో విషయాన్ పుంసస్సంగస్తేషూపజాయతే,
సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే. ౬౨
క్రోధాద్భవతి సమ్మోహస్సమ్మోహాత్స్మృతివిభ్రమః,
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి. ౬౩
రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్,
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి. ౬౪
ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే,
ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి. ౬౫
నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా,
న చాభావయతశ్శాంతిరశాంతస్య కుతస్సుఖం. ౬౬
ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే,
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి." ౬౭

గీత. ౨. అధ్యా

అను నీభగవద్వాక్యములు ఇంద్రియసుఖములను గోరి వానినే తలంచుచుండువారలబుద్ధి నిర్మలముగా నుండదనియుఁ గాన నాతలంపు మానిన నయ్యది ప్రసన్నమగుననియు, విషయలోలు రగువారలకు మనశ్శాంతి కలుగదనియు, అశాంతి లేకయున్న సుఖమే లేదనియుఁ దెలుపుచున్నవి. దశరథున కివి సమన్వయము చేయవచ్చును. ఈకారణములే లక్ష్మణుఁడు తెలిపెను.

"సోఽసహాయేన మూఢేన లుబ్ధేనాకృతబుద్ధినా,
న శక్యో న్యాయతో నేతుం సక్తేన విషయేషు చ. ౩౦
శుచినా సత్యసంధేన యథాశాస్త్రానుసారిణా,
ప్రణేతుం శక్యతే దండస్సుసహాయేన ధీమతా. ౩౧
అతస్తు విపరీతస్య నృపతేరజితాత్మనః,
సంక్షిప్యతే యశో లోకే ఘృతబిందురివాంభసి." ౩౨

మను. ౭ అధ్యా.

అను నీమనుస్మృతియు జితేంద్రియుఁడు కానిరాజు పరిపాలకుఁడు కారాదని తెలుపుచున్నది. కావున, లక్ష్మణుఁ డారోపించినదోషములు న్యాయ్యములే. పితృదూషకుఁడుకదా లక్ష్మణుఁడని మనము భావింపరాదు. వాల్మీకిమహర్షి యొక్కొక్కరిమూలమున నొక్కొక్కధర్మమును దెలుపుచుండును. ఈ లక్షణములు రాజునం దుండరాదని చెప్పుట కేలాంటిబాధలు నుండవు. వాస్తవముగా లక్ష్మణుఁడు పితృభక్తుఁడు కాకపోలేదు. పితృభక్తుఁ డైనచో,

"(అహం హనిష్యే పితరం వృద్ధం కామవశం గతం,
స్త్రియా యుక్తం చ నిర్లజ్జం ధర్మాపయుక్తం నృపం యథా")

అని చెప్పియుండునా యని కొంద అడుగవచ్చును. ఈశ్లోక

మధ్యకపాఠమని కుండలీకరణము చేయఁబడినది. వ్యాఖ్యాతలు దీనిని వదలిరి. ఎవరో చేర్చిరని వారిభావమై యుండనోపు. లక్ష్మణుఁ డింతమాట యనునా యని శంకించియుందు రేమో. కాని యివి మూలమున నున్నవే యనుకొందము. తప్పేమి? లక్ష్మణుఁడు దురాత్ముఁడు కాఁడా యనిగదా యితరు లడుగుదు రని భయపడవలయును. దానివల నేమనఁగా ధర్మవిరుద్ధముగాఁ బ్రవర్తించిన రాజు వధింపఁదగినవాఁ డనునదియే. మహామునులు వేనుని వధించిరికదా. వారు పాపాత్ములా? ధర్మధ్వంసకుని వధించినను బాపము లేదనునిశ్చయమే యిద్దానినుండి మనము గ్రహింపఁదగునది వాల్మీకియును లక్ష్మణునినోట నీసామాన్యశాస్త్రవిహితధర్మములను బలికించి శ్రీరామునినోట విశేషధర్మమును బలికించెను. ఈరెండును మన మెఱుంగవలయుననియే మహర్షిభావము. అట్లు కానిచో నిది సామాన్యధర్మమును బోధింప నవకాశమే లేకపోవును. అని మనము గ్రహించిన నీలాటిసందేహాల కవకాశ ముండదు. లక్ష్మణుఁడు దురాత్ముఁడే యనుదురే నట్టివానిం గూడిన రామమూర్తియు దుష్టుఁడే యనవలసివచ్చును. ఈకావ్యమూలమున సకలధర్మములు నుపదేశింపఁబూనినవాఁడు వాల్మీకిమహర్షి. కావున నానాయుక్తుల నాయాపాత్రల మూలమున నానాధర్మములు నుపదేశించెనని మనము గ్రహించుటయే సముచితము.

"న తం పశ్యామ్యహం లోకే పరోక్షమపి యో నరః,
స్వమిత్రోఽపి నిరస్తోఽపి యోఽస్య దోషముదాహరేత్." ౫

అను మూలమున నభ్యుక్తి కలదు. మిత్రుఁడు కాని, రామునిచే నేదో యపరాధవ్యాజమునఁ దిరస్కరింపఁబడినవాఁడు గాని

పరోక్షమునందును రామునియం దీదోషముగలదని చెప్పఁగా వినలేదు. అనఁగా సమక్షమునందు గుణములు ప్రకటించుచుఁ బరోక్షమున దోషములు ప్రకటించువారు దుష్టులు. సమక్షమున మోమోటమిలేక యున్నదోషములం దెలిపి పరోక్షమున గుణములఁ బ్రకటించువారు సజ్జనులు. అనఁగా మనమేలు కోరినవారని భావము.

"పాపాన్నివారయతి యోజయతే హితాయ
గుహ్యం చ గూహతి గుణాన్ ప్రకటీకరోతి,
ఆపద్గతం చ న జహాతి దదాతి కాలే
సన్మిత్రలక్షణమిదం ప్రవదంతి సంతః." 23

అని భర్తృహరి తెల్పిన మిత్రలక్షణములు రామాయణమునఁ జెప్పఁబడినవే యని మన మెఱుంగవలయును. రామునిసద్గుణ ప్రశంసారూపమున లక్ష్మణవాక్యములనుండి మహాకవి మన కీ నీతిని దెలిపెను. రామాయణమును బఠించునపుడిట్టివిషయ రత్నములను గ్రహింపవలయును. కథమాత్రము తెలిసికొని తృప్తిచెందిన విశేషలాభము లుండవు.

"దేవకల్పమృజుం దాంతం రిపూణామపి వత్సలం,
అవేక్షమాణః కో ధర్మం త్యజేత్పుత్రమకారణాత్." ౬

అనునదియు లక్ష్మణవాక్యమే. ఈయది శ్రీరామచంద్రునిసర్వ సమత్వమును బోధించుచున్నది. దేవసమానుఁడనఁగా స్వర్గ వాసులతో సమానుఁడని కాదు. పరిశుద్ధుఁడని భావము. దాంతుఁ డనఁగా నంతరింద్రియనిగ్రహముకలవాఁడని కాదు. గురువులచేఁ జక్కఁగా శిక్షింపఁబడినవాఁడని భావము. శత్రు

వులవిషయమునందును వాత్సల్యముగలవాఁడనఁగాఁ గరుణా స్వరూపుఁడని భావము.

"సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః,
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్." ౨౯
గీత. ౯ అధ్యా.

అను శ్రీకృష్ణపరమాత్మోపదేశము "రిపూణామపి వత్సలమ్" అనుదానిసారముకదా. భగవంతుఁడు శత్రుమిత్రభావములు లేనివాఁడుకదా!

"తదిదం వచనం రాజ్ఞః పునర్బాల్యముపేయుషః,
పుత్త్రః కో హృదయే కుర్యాద్రాజవృత్తమనుస్మరన్." ౩

అని మూలము. ఇదియు లక్ష్మణవాక్యమే. వయోవృద్ధుఁడైనను వృత్తిచే బాలునివలె నుండెనేని అనఁగాఁ దెలివితక్కువగాఁ బ్రవర్తించునేని యట్టితండ్రిమాట కుమారుఁడు గ్రహింపరాదని సారము. గుణవంతునిమాటయే గ్రాహ్యముకాని గుణహీనునివచనము గ్రాహ్యముకాదని భావము. సుభాషితము వయోవృద్ధునివలననేగాక బాలునినుండియు గ్రహింపఁదగును. సుభాషితము గానిచో వృద్ధుఁడు చెప్పినను గ్రహింపరాదని సారము.

"విషాదప్యమృతం గ్రాహ్యం బాలాదపి సుభాషితం,
అమిత్రాదపి సద్వృత్తమమేధ్యాదపి కాంచనమ్." ౨౩౯
మను. ౨ అధ్యా.

అని స్మృతి విధించుచున్నది. ఈయర్థమే రామాయణమునఁ గలదు. సకలస్మృతిసారము రామాయణమని తేలుచున్నది గదా.

"భరతస్యాథ పక్ష్యో వా యో వాస్య హితమిచ్ఛతి,
సర్వానేతాన్ వధిష్యామి మృదుర్హి పరిభూయతే." ౧౧

ఇదియు సౌమిత్రి వాక్యమే. ఇందొక్క నీతి కలదు. రామాయణకాలమునందు నిప్పటియాచార మొక్కటి కలదని యీ శ్లోకము తెలుపుచున్నది. "మృదుర్హి పరిభూయతే" (నోరు మెత్తగానున్నవాని నెల్లరు దూలనాడుదురు) ఏ కాలమునందును గట్టిగా మాటలాడువాని నెవ్వరు నేమనను భయపడుదురు.

"మౌనాన్మూకః ప్రవచనపటుర్వాతులో జల్పకో వా
ధృష్టః పార్శ్వే వసతి చ సదా దూరతశ్చాప్రగల్భః,
క్షాంత్యా భీరుర్యది న సహతే ప్రాయశో నాభిజాతః
సేవాధర్మః పరమగహనో యోగినామప్యగమ్యః."

అనుభర్తృహరిసూక్తి ప్రసిద్ధమే కదా. సౌమిత్రులుగూడ రామాయణమునుండియే గ్రహింపవలసి యున్నవి.

"గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమజానతః,
ఉత్పథం ప్రతిపన్నస్య కార్యం భవతి శాసనమ్." ౧౩

ఇదియు సౌమిత్రి వాక్యమే. గర్వించి కార్యాకార్యములు తెలియంగక యధర్మమార్గమున బ్రవర్తించుచున్నయెడ గురువును శిక్షింపవలయునని భావము. ఇది న్యాయ్యమగా కాదని విచారింతము.

"య ఆవృణోత్యవితథం బ్రహ్మణా శ్రవణావుభౌ,
స మాతా స పితా జ్ఞేయస్తం న ద్రుహ్యేత్కదాచన. ౧౪
ఉపాధ్యాయాన్ దశాచార్య ఆచార్యాణాం శతం పితా,
సహస్రం తు పితౄన్మాతా గౌరవేణాతిరిచ్యతే." ౧౫

మను. ౨ అధ్యా.

అను నీమనుస్మృతివాక్యమే సామాన్యశాస్త్రమనందగు. పితృవాక్యము గ్రాహ్యమని తెలుసు. గౌరవార్హుఁడనునదియే యిందు లక్షం గలకారణము.

"గురోర్యత్ర పరీవాదో నిందా వాపి ప్రవర్తతే,
కర్ణౌ తత్ర పిధాతవ్యౌ గంతవ్యం వా తతోఽన్యతః. ౨౦౦
పరీవాదాత్ఖరో భవతి శ్వా వై భవతి నిందకః,
పరిభోక్తా కృమిర్భవతి కీటో భవతి మత్సరీ." ౨౦౧

మను. ౨ అధ్యా.

ఈవాక్యములు గురునింద చేసినవారికి గలుగు దుష్ఫలములఁ దెలుపుచున్నవి. ఈ మొదలగు సనేక ప్రమాణములు సామాన్య శాస్త్రము లనునట్టి భావముఁ జేయును.

"అస్వర్గ్యదండనం స్వర్గకీర్తిలోకవినాశనం,
సమ్యక్తు దండనం రాజ్ఞస్స్వర్గకీర్తిజయావహమ్. ౩౫౭
అపి భ్రాతా సుతోఽర్ఘ్యో వా శ్వశురో మాతులోఽపి వా,
నాదండ్యో నామ రాజ్ఞోఽస్తి ధర్మాద్విచలితస్స్వకాత్. ౩౫౮
యో దండ్యాన్ దండయేద్రాజా సమ్యగ్వధ్యాంశ్చ ఘాతయేత్,
ఇష్టం స్యాత్క్రతుభిస్తేన సమాప్తవరదక్షిణైః." ౩౫౯

యాజ్ఞవల్క్యస్మృతి. ఆచారకాండము.

"అభ్యుత్థాతార ఆచార్యాః." అని విజ్ఞానేశ్వరుఁడు.

ఇది విశేషవిధి. రాజునకు దండ్యులు కానివారు లేరని దీని భావము. స్వధర్మత్యాగము చేసినవారిని దండింపక తప్పదని స్మృతి రాజునకు ధర్మము విధించుచున్నది. ఈధర్మమునే లక్ష్మణుఁడు బోధించుట చేసినను లక్ష్మణుఁడు పితృభక్తుఁడు కాఁడన

వలనుపడునా? సామాన్యధర్మమునకు రాజధర్మమునకు విశేష భేదము కలదు. సౌమిత్రి రాజధర్మము ననుసరించి తండ్రియం దిట్టిదోషములు కలవని కావున శిక్షార్హుఁడని తేటపఱచెను. తండ్రినని న్యాయమార్గమునకు విరుద్ధముగాఁ బ్రవర్తింపరా దనియు, నట్లు ధర్మవిరుద్ధమార్గము నవలంబించినపుడు కుమారుఁ డాతనిమాటను దాఁటవచ్చునన్నన్యాయమును మహర్షి లక్ష్మణుని వాక్యములమూలమున మనకుఁ దెలిపెనని మన మెఱుంగ వలయును.

"ధర్మజ్ఞ యది ధర్మిష్ఠో ధర్మం చరితుమిచ్ఛసి,
శుశ్రూష మామిహాస్థస్త్వం చర ధర్మమనుత్తమం. ౨౨
శుశ్రూషర్జననీం పుత్రస్స్వగృహే నియతో వసన్,
పరేణ తపసా యుక్తః కాశ్యపస్త్రిదివం గతః. ౨౩
యథైవ రాజా పూజ్యస్తే గౌరవేణ తథా హ్యహం,
త్వాం నాహమనుజానామి న గంతవ్యమితో వనం." ౨౪

అని మూలము. ఇది కౌసల్య రామునకుఁ జేయునుపదేశము.

"పితుర్భగిన్యాం మాతుశ్చ జ్యాయస్యాం చ స్వసర్యపి,
మాతృవద్వృత్తిమాతిష్ఠేన్మాతా తాభ్యో గరీయసీ." ౧౩౩

మను. ౨ అధ్యా.

అనుస్మృతివచనము ననుసరించి తనమాట మీఱక యుండ వలయునని పుత్త్రునకుఁ గౌసల్య తెలిపెను. ఇది పితృవాక్యమునకంటె మాతృవాక్యము శ్రేష్ఠమనునర్థమును బోధింపదు. ఇందుఁ జెప్పఁబడినవారిలోఁ దల్లి యుత్తమురాలనియే బోధించును. కనుకనే రామమూర్తి చెప్పఁబోవుసమాధానము విశేషవిధిగా

గ్రహింపందగును. వనగమనమునకు నే నంగీకరింపనని కౌసల్య తెలుపుచు "ధర్మజ్ఞ" అని రాముని సంబోధించెను. కావుననే రామమూర్తి ధర్మమురీతినే ప్రవర్తించెను. దీనింబట్టి తల్లి చెప్పినది సామాన్యశాస్త్రమని గ్రహింపందగును.

"యది త్వం యాస్యసి వనం త్యక్త్వా మాం శోకలాలసాం,
అహం ప్రాయమివాసిష్యే న హి శక్ష్యామి జీవితుం. ౨౬
తత స్త్వం ప్రాప్స్యసే పుత్త్ర నిరయం లోకవిశ్రుతం,
బ్రహ్మహత్యామివాధర్మాత్సముద్రస్సరితాం పతిః." ౨౭

అనునివియుఁ గౌసల్యపలికినవాక్యములు. నన్ను వదలి యడవులకుం బోవుదువేని నే నిందుఁ బ్రాయోపవేశము చేసి ప్రాణముల వదలుదును. దానివలన నీవు నరకముగలుగును. సముద్రుఁ డిట్లే బ్రహ్మహత్య నధర్మమునఁ బొందెనని కౌసల్య రాముని భయపెట్టెను. సముద్రునకు బ్రహ్మహత్య యనుపాపము రాలేదు. ఒకముని కృత్యను బుట్టింపగాఁ దానిబాధను సముద్రుఁడు పొందెను. ఎట్లనఁగా:—

దధీచికుమారుఁడు పిప్పలాదుఁడు. ఇతనితల్లి సువర్చ. దేవతలు దధీచిమునియెముకకు నడిగినతఱి నాముని భార్యను గృహములోనికిం బొమ్మని ప్రాణముల వదలెను. ఎముకలు దేవతల కబ్బెను. సువర్చ వచ్చిచూచి విలపించుచు దేవతలారా! మీరు పశువులు కావలసినదని శపించి సహగమనము చేయఁ బూనెను. అశరీరవాణి నీవు చితి నెక్కకుము. నీకడుపులోఁ గుమారుఁడున్నవాఁడు. అని వినవచ్చెను. అయిన నామె లెక్కచేయక చితినెక్కెను. అపుడు గర్భమునుండి బాలుఁడు క్రిందఁ

బడియెను. ఆతఁడే పిప్పలాదుఁడు. పిప్పలవృక్షముక్రింద వానిం బెట్టి యామె చితనెక్కి మృతినొందెను. చంద్రుని యమృతకిరణములు సోఁకినందున నతఁడు బ్రదికి పెద్దవాఁడయ్యెను. పిప్పలవృక్షముక్రింద నుండినందున నాతనికిఁ బిప్పలాదుఁ డను పేరు ప్రసిద్ధమయ్యెను. ఆతఁడు పెద్దవాఁడై పితృమరణమునకు దేవతలే కారణమని తెలిసికొని వారిని జంపఁబూని చంద్రునితో నాలోచించి యతఁడు సదుపాయము తెలుప గోదావరీతటమున శివుని వినుతింప నామహాదేవుఁడు తోఁచి యొకకృత్యనొసఁగెను. దేవతలం జంపిరమ్మని పిప్పలాదుఁ డాజ్ఞాపించెను. ఆవిధ మెఱింగి దేవతలు వడఁకుచు శివుని గానఁబోయి ప్రార్థించిరి. శంకరుఁ డాకృత్యను బడబారూపమున గంగలోనుండుమని చెప్పి పిప్పలాదునికడ కరిగి దేవతల నేల బాధింపఁబూనెదవు? వారు మరణించినంగూడ నీతండ్రి బ్రదుకఁడుకదా. ఆయత్నము మానుమని చెప్పెను. అనఁగానే పిప్పలాదుఁడు కృత్య నాపుటకు నాకు శక్యముగాదు. నాప్రయత్నమును మానుదును. పితృలోకమున నాతల్లిదండ్రులం గనుఁగొనునట్లు నాకు వరమిమ్ము. అన శంకరుఁ డట్లే యనెను. దేవతలు కృత్యను బ్రార్థించిరి. ఆమె బడబారూపమున గంగలో నుండనిసియెను. బంగారుకలశమున నాకృత్య నునిచి గంగకడకుఁ దీసికొని పోయిరి. గంగ యొకతె యాకృత్యను భరింపఁజాలక యమునయందు సరస్వతియందును గూడ నామె నునిచెను. నానదములావు రును భరింపఁజాలక సముద్రములో నామె నునిచిరి. ఆబాధ నాతఁడుగూడ ననుభవించె ననుసీకథ శివపురాణమున నున్నది. సముద్రునివలె నీవును నరకము నొందఁగలవని కౌసల్య తెలి

పెను. అనఁగాఁ దండ్రిమాటకంటెను తల్లిమాటయు గ్రాహ్యమని యామె తేటఁబఱచెను.

తండ్రియానతి యవశ్యములకుం బాధ్యునియుం దల్లి యాజ్ఞ యవశ్యములకుం బాలించునుండఁగా శ్రీరామచంద్రుఁడు చేయఁదగు కార్యమేమి యని యాలోచింపవలయును. ఈ రెండింటిలో నేది ప్రథమగణ్యమని శ్రీరాముఁడు సిద్ధాంతము చేయునో యది శాస్త్రసమ్మతమో కాదో యని విచారింతము. తల్లి ప్రాయోపవేశనము చేసి ప్రాణముల నవలునని వచించున్నది. తండ్రి యట్టులు శపథములు పల్కలేదు. తల్లి యాజ్ఞాప్రకార కార్యము చేయుట గావించి జేయుట రామునకుఁ బ్రధాన కార్యము. ఎట్టి రెండు కార్యములను సాధించునో ధర్మనిర్ణయ మేలాగు చేయునో చూతముగాక. దీనింబట్టి శ్రీరాముని యనుమానఘనము తీరును.

“ఉవాచ రామో ధర్మాత్మా వచనం ధర్మసంహితం. ౨౮
నాస్తి శక్తిః పితుర్వాక్యం సమతిక్రమితుం మమ,
ప్రసాదయే త్వాం శిరసా గంతుమిచ్ఛామ్యహం వనం. ౨౯
ఋషిణా చ పితుర్వాక్యం కుర్వతా వ్రతచారిణా,
గౌర్హతా జానతా ధర్మం కండునాపి విపశ్చితా. ౩౦
అస్మాకం తు కులే పూర్వం సగరస్యాజ్ఞయా పితుః,
ఖనద్భిస్సాగరైర్భూమిమవాప్తస్సుమహాన్ వధః. ౩౧
జామదగ్న్యేన రామేణ రేణుకా జననీ స్వయం,
కృత్తా పరశునారణ్యే పితుర్వచనకారిణా. ౩౨
ఏతైరన్యైశ్చ బహుభిర్దేవ దేవసమైః కృతం,
పితుర్వచనమక్లీబం కరిష్యామి పితుర్హితం. ౩౩

న ఖల్వేతన్మయైకేన క్రియతే పితృశాసనం,
ఏతైరపి కృతం దేవి యే మయా తవ కీర్తితాః. ౩౪
నాహం ధర్మమపూర్వం తే ప్రతికూలం ప్రవర్తయే,
పూర్వై రయమభిప్రేతో గతో మార్గోఽనుగమ్యతే. ౩౫
తదేతత్తు మయా కార్యం క్రియతే భువి నాన్యథా,
పితుర్హి వచనం కుర్వన్న కశ్చిన్నామ హీయతే.'' ౩౬

అనునివి శ్రీరామచంద్రునిధర్మ వాక్యములు. శ్రీరామమూర్తి లోకులకుఁ దెలిపిన ధర్మోపదేశవాక్యము లివి. కాన, సావధానముగాఁ బరిశీలింపవలయు. తల్లిదండ్రులయానతి యొకదాని కొకటి విరుద్ధమగుచో నేదానిని సత్పుత్త్రుఁ డనుసరింపవలయు ననునదియే యిటఁ బ్రశ్నము.

''ఉత్పాదకబ్రహ్మదాత్రోర్గరీయాన్ బ్రహ్మదః పితా,
బ్రహ్మజన్మ హి విప్రస్య ప్రేత్య చేహ చ శాశ్వతం. ౧౪౬
కామాత్మాతా పితా చైనం యదుత్పాదయతో మిథః,
సంభూతిం తస్య తాం విద్యాద్యద్యోనావభిజాయతే. ౧౪౭
ఆచార్యస్త్వస్య యాం జాతిం విధివద్వేదపారగః,
ఉత్పాదయతి సావిత్ర్యా సాసత్యా సా జరామరా. ౧౪౮
అల్పం వా బహు వా యస్య శ్రుతస్యోపకరోతి యః,
తమపీహ గురుం విద్యాచ్ఛ్రుతోపక్రియయా తయా. ౧౫౦
మాతురగ్రేఽధిజననం ద్వితీయం మౌంజిబంధనే,
తృతీయం యజ్ఞదీక్షాయాం ద్విజస్య శ్రుతిచోదనాత్. ౧౬౯
తత్ర యద్బ్రహ్మజన్మాస్య మౌంజీబంధనచిహ్నితం,
తత్రాస్య మాతా సావిత్రీ పితా త్వాచార్య ఉచ్యతే. ౧౭౦

వేదప్రదానాదాచార్యం పితరం పరిచక్షతే,
న హ్యస్మిన్ యుజ్యతే కర్మ కించిదామౌంజిబంధనాత్." ౧౭౧
మనుస్మృతి. ౨ అధ్యా.

జననమునకంటె నుపనయనజన్మ ముత్తమ మైనది. వేదపఠనాధికార ముపనయనమునఁ గలుగును. అది చేయువాఁడు తండ్రి. అతఁడే ఆచార్యుఁడు. అట్టితండ్రిమాట ప్రధానమని యీవాక్యములసారము. జననమునకుఁ గారణముగుతల్లికంటెఁ బై కారణములవలనఁ దండ్రియే యత్కృష్టుఁడనికదా భావము. తండ్రి స్వతంత్రుఁడు. తల్లి స్వతంత్రురాలు కాదు. తండ్రి యాజ్ఞరీతిగా వర్తింపవలసినది. "న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అన్నదియుఁ మనువాక్యమే. తల్లికింగూడ నాజ్ఞ చేయువాఁడు తండ్రి యగును. కావునఁ దల్లిమాటకంటెఁ దండ్రిమాట గురుతరమని తేలెడిని.

తల్లీ! తలసోఁక మ్రొక్కి నిన్ను వేఁడుచున్నాఁడను. తండ్రిమాట మీఱుటకు నాకు శక్తిలేదు. వ్రతమునూని పండితుఁడగుకండుమహర్షి ధర్మజ్ఞుఁడయ్యుఁ దండ్రిమాట ననుసరించి ధేనువును వధించెను. సగరతనయులు మనవంశపూర్వులు గదా. వారు తండ్రిమాట చేయఁబూని భూమిని ద్రవ్వుచు నొక్కసారి మృతికిఁ బాలుపడిరి. పరశురాముఁడు జనకుని యాజ్ఞంగొని తల్లినే వధించెను. వీరుగాక యింక నెందఱో మహాత్ములు తండ్రిమాట నాదరించి యొనరించి కృతార్థులైరి. ఈయుదాహరణములంబట్టి నాకంటె బూర్వు లెందఱో పితృశాసనము ననుసరించిరని స్పష్టముకదా. నేను నట్లే పితృనానతినే యనుసరింతును. నీకుఁ బ్రతికూలముగా నుండవలయు

నని శ్రోత్రధర్మము ననుసరింపలేదు. పెద్దలు త్రొక్కినత్రోవనే ప్రవర్తించువాఁడను. తండ్రిమాట ననుసరించినవాఁడు కీడు నొందలేదు. ఈమాటలే శ్రీరాముఁ డుపదేశించినవి. వీనిసార మేమి?

“వృషో హి భగవాన్ ధర్మ స్తస్య యః కురుతే హ్యలం,
వృషలం తం విదుర్దేవా స్తస్మాద్ధర్మం న లోపయేత్.” మను. ౮ అధ్యా.

ధర్మము నాస్వరూపము. దానిసత్యము నేనెఱుంగుదును. దాని యందేమాత్రము కొదువఁగలిగింపఁబూనను.

“అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్,
ప్రకృతిం స్వామవష్టభ్య సంభవామ్యాత్మమాయయా. ౬
యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థానమధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహం. ౭
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం,
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.” ౮

గీత. ౪ అధ్యా.

అన్నప్రతిజ్ఞ ననుసరించి తండ్రిమాట నెపముగా నడవులకుం బోవువాఁడను. దానిని మీఱ నాకు శక్తిలేదు. శ్రోత్రమార్గము త్రొక్కను. మున్నే నిర్ణయించినమార్గమిది. దాని నించు కంతయు నతిక్రమింపఁజాలను. అనఁగా సృష్ట్యాదిప్రళయాంతము నేయేకార్యమెట్లెట్లు ఎప్పుడెప్పుడు చేయ నిర్ణయించితినో దాని నేమాత్రము దాఁటరాదు. నేను మీఱిన నందఱు ధర్మసేతువును మీఱుదురు.

"ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహం,
సంకరస్య చ కర్తా స్యాముపహన్యామిమాః ప్రజాః." ౨౪
గీత. 3 అధ్యా.

అన్న నాయాశయము నీవెఱుంగవు. కావుననే నిన్ను వేఁడు చున్నాఁడను. వనగమనమున కనుమతింపుము. అనియేకదా.

లోకమున స్త్రీలు స్థిరమనస్కలు గారు. దూరపుటాలోచనము వారికి నుండదు. కనుకఁ గుమారుఁ డేరీతి లోకమునఁ బ్రవర్తింపవలయునో తల్లి యెఱుఁగదు. తండ్రి స్వానుభవమునఁ గొంత యెఱుంగును. కావునఁ దండ్రిమాటయే ప్రధానముగా నంగీకరింపవలయుననియే యిందుఁగలసారము. ధర్మమార్గము మిగుల సూక్ష్మము. మదుక్తమగు నామార్గమును బూర్వులెందఱో యంగీకరించిరి. ఇపు డామార్గముననే నడుపఁ బూనితిని. దాని మాని క్రొత్త మార్గము నంగీకరింపఁజాలను. అడవులకుం బోవుటయే నాపని. అని శ్రీరామచంద్రుఁడు స్వాభిప్రాయ మును దెలిపెనని మన మెఱుంగవలయును. జననీజనకులకు శుశ్రూష చేయుటలోఁ దండ్రికంటెఁ దల్లి గొప్పది, కావున జనని యావిషయమున మిగుల గౌరవార్హురాలు. కార్యాకార్య నిర్ణయమునందుఁ దండ్రి యెక్కుడు కావునఁ దల్లిమాట కంటెఁ దండ్రిమాట మిక్కిలి గౌరవింపఁదగినదని శ్రీరాముఁడు బోధించిన ధర్మమార్గమని మన మెఱుంగవలయును.

"తామేవముక్త్వా జననీం లక్ష్మణం పునరబ్రవీత్,
వాక్యం వాక్యవిదాం శ్రేష్ఠశ్శ్రేష్ఠస్సర్వధనుష్మతాం. 32

అని మూలము. శ్రీరాముని యాశయ మిందు స్పష్టముగఁ గనం బడును. మాటనేర్పరులయందు మేటియగు రాముఁ డిట్లు పలికె

ననుట సుసంగతముగ నున్నది. ధనుర్ధారులలో నుత్కృష్టుం డనుట యేల? పాదపూరణవాక్యమా? కాదు. మహాకవి యట్లు ప్రయోగింపఁడు. సిద్ధవాక్కులుగదా మహర్షివి. శ్రీరాముఁడు లక్ష్మణునకుం దెలుపఁబోవువాక్కులు ధనుస్సాధ్యములు. దుష్టశిక్షణమునకై ప్రయాణముచేయ నుద్దేశించితని. నీకు నాపని యందు భాగము కలదని రామునియాశయమని యెఱుంగ వలయుననియే వాల్మీకిమహర్షి యీపదముల నందుఁ గూర్చెను. శ్లోక మెట్లో పూర్తిచేయవలయునని కాదు.

"లౌకికానాం హి సాధూనామర్థం వాగనువర్తతే,
ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోఽనుధావతి."

అనుసూక్తి భవభూతిమహాకవి తెలిపెను. పూర్వమహాకవుల హృదయ మెట్టిదో తేటపడియెనుగదా.

"ధర్మో హి పరమో లోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితం,
ధర్మసంశ్రితమేతచ్చ పితుర్వచనముత్తమం. ౪౦
సంశ్రుత్య చ పితుర్వాక్యం మాతుర్వా బ్రాహ్మణస్య వా,
న కర్తవ్యం వృథా వీర ధర్మమాశ్రిత్య తిష్ఠతా. ౪౧
సోఽహం న శక్ష్యామి పితుర్నియోగమతివర్తితుం,
పితుర్హి వచనాద్వీర కైకేయ్యాహం ప్రచోదితః. ౪౨
తదేనాం విసృజానార్యాం క్షత్రధర్మాశ్రితాం మతిం,
ధర్మమాశ్రయ మా తైక్ష్ణ్యం మద్బుద్ధిరనుగమ్యతాం." ౪౩

అనునివి శ్రీరామునివాక్కులు. లక్ష్మణుఁడు రాజధర్మము నాశ్రయించి పలికెను. ఆవాక్కులు రాజధర్మవిరుద్ధములుగావు. కాని బహువిధములగుధర్మభేదములందు నేది సూక్ష్మమార్గమని యెఱుంగుటయే బుద్ధిమంతులలక్షణము. దుర్మతిరై తంత్రి

కుమార్గమునఁ బ్రవర్తించినపుడు తదాజ్ఞను మీఱుట కుమారునకుఁ దప్పుగాకపోవచ్చును. ఆశాస్త్రము దశరథునివిషయమున నన్వయించునా యని యూహింపవలయును. దశరథుఁడు మతిచెడి కుమార్గమున వర్తింపలేదు. కామమునకు లోఁబడి కైకమాటలకు లొంగలేదు. రాజధర్మమునే యాశ్రయించి

"వినీతస్సత్వసంపన్నః కులీనస్సత్యవాక్శుచిః,"

అన్నస్మృతిప్రమాణము ననుసరించి సత్యపాశబద్ధుఁ డయ్యెను. అదియు రాజధర్మమే. ఆమార్గముననే హరిశ్చంద్రాదులు ప్రవర్తించి యపార యశోలక్ష్మి నార్జించిరి. స్థిరయశఃకాయులైరి. కావున దశరథునభిప్రాయము రాజధర్మవిరుద్ధమని కైకమాటలకు లోఁబడియెనని లక్ష్మణుఁ డభిప్రాయపడియెను. ఆ యభిప్రాయము మంచిదికాదని తమ్మునకు శ్రీరాముఁడు ధర్మసూక్ష్మములను బోధించెను.

ధర్మమే లోకమున నుత్కృష్టము. దానియాధారముననే సత్యము నిలిచియున్నది. తండ్రివాక్యము ధర్మాశ్రితమే. ధర్మమెఱింగినవాఁడు తండ్రికిఁగాని తల్లికిఁగాని బ్రాహ్మణునకుఁగాని చెప్పినట్లే యాచరింతునని మాట యిచ్చి వేఱువిధముగాఁ బ్రవర్తింపరాదు. కైకకదా యాజ్ఞాపించినది. తండ్రికాదే యను నీయభిప్రాయము మంచిదిగాదు. తండ్రివాక్యము ననుసరించియే తల్లి నన్నడవులకుఁ బొమ్మని ప్రోత్సహించెను. కావున నయ్యది పితృవాక్యమే యని విశ్వసింపుము. తండ్రినిగూడ వధించి రాజ్యమేలఁజేసెద నన్ననీబుద్ధి యధర్మము నాశ్రయించినది. ఆర్యసమ్మతము కాదు. ధర్మమెఱుంగని కేవలశూరసమ్మతము గాన రౌద్రమైనది. దానిని వదలుము. ధర్మమునే యాశ్రయిం

పుము. ఇంకనైన నిట్టి క్రూరత్వమును మానుము. నాబుద్ధి ననుస రించి వర్తింపుము. అని రాముం డుపదేశించెను. దీనిసారమేమి?

లక్ష్మణా! సత్యసమ్మతమగుధర్మమును మనము స్థాపింప వలయును. చెప్పినమాటను దప్పరాదు. కైకేయి నన్నుం బురి కొలిపెను. అనంగా నిర్లిప్తుండనగు నేనాస్థితిని వదలి ప్రకృతి బద్ధుండనై యున్నాను. కావున స్త్రీమూలముననే నేనీకార్య ములు నిర్వహింపవలయును. ఇప్పటి యీయూహ యార్య సమ్మతముకాదు. అనంగా ఆర్యు లిపుడు నన్ను రాజ్యమును బాలింపుమని కోరరు. కావున నద్దానికి నిపుడు ప్రయత్నింప కుము. ఆకాలము రాంగలదు. ఇప్పటి యీ క్రూరత్వమును దశరథునివిషయమున వదలుము.నాబుద్ధి ననుసరింపుము. అనంగా నాతోడ నడవికి రాందగును. అని స్వాభిప్రాయమును గూఢ ముగాం దమ్మునకుం దెలిపె ననునదియే యిందుంగలసారము.

అని తెలిపి యింకం దడవు చేయరాదని తలంచి తల్లి కిట్లు తెలిపెను:—

"ఉవాచ భూయః కౌసల్యాం ప్రాంజలిశ్శిరసా నతః. ౪౪
అనుమన్యస్వ మాం దేవి గమిష్యంతమితో వనం,
శాపితాసి మమ ప్రాణైః కురు స్వస్త్యయనాని మే. ౪౫
తీర్ణప్రతిజ్ఞశ్చ వనాత్పునరేష్యామ్యహం పురీం,
యయాతిరివ రాజర్షిః పురా హిత్వా పునర్దివం. ౪౬
శోకస్సంధార్యతాం మాతర్హృదయే సాధు మా శుచః,
వనవాసాదిహైష్యామి పునః కృత్వా పితుర్వచః. ౪౭
త్వయా మయా చ వైదేహ్యా లక్ష్మణేన సుమిత్రయా,
పితుర్నియోగే తవ్యమేవ ధర్మస్సనాతనః. ౪౮

అంబ సంహృత్య సంభారాన్ దుఃఖం హృది నిగృహ్య చ,
వనవాసకృతా బుద్ధిర్మమ ధర్మోऽనువర్త్యతాం." ౪౯

అని మూలము. ఈమాటలవలన శ్రీరామమూర్తి తనయవతార ఫలమును దెలుపుచున్నాఁడు. ధర్మోపదేశమున నామె పట్టుదల మానదు. అని. తల్లీ! ఇదె యడవికింబోవనున్నాను. సమ్మతింపుము. నాప్రాణములతోడుసుమా. కొడుకుప్రాణములపైఁ దల్లికిఁ బ్రీతి మెండు. కనుక వానితోడు. ఇఁక మాటలాడకు మనుచున్నాఁడు. ప్రతినదీర్చి యనఁగాఁ బదునాల్గవసంవత్సరమునఁ జివరభాగమున రావణునివధించి మరలి యయోధ్యం జేరుదును. తల్లీ! దుఃఖమును హృదయమున నడంచుకొమ్ము. ఎల్లరకుఁ దెలియునటులు శోకింపకుము. అనఁగా దశరథున కంతకాలము సమీపించినది. దుఃఖించి లాభములేదు. నీవంటియోగ్యురాలు దుఃఖించిన విని నలువు రేమనుకొందురో అని రామచంద్రుఁడు తల్లికిం దెల్పెను. వనవాసము సలిపి తండ్రియానతి నెఱవేర్చి మరల వత్తును. నీవు నేను సీతయు లక్ష్మణుఁడు సుమిత్రయు తండ్రియానతిం బూనికమీఱ నొనర్పవలసినవారము. అనఁగా నేను సీతాలక్ష్మణులతో నడవులకుం బోనఁగా నన్నుఁ గూర్చి నీవును లక్ష్మణునిగుఱించి సుమిత్రయు దశరథశాసనమున వెతలఁబడసిన వారలగుదురు. భరతశత్రుఘ్నులిందే యుందు రనుభావము సూచించెనని మన మూహింపవలయును. ఇట్లు మనము రాజునాజ్ఞఁ బాలించుటయే సనాతనధర్మము. అనఁగా మనమిల్లు రాజాజ్ఞ నెఱవేర్చినఁగాని ధర్మమును స్థాపింపఁ జాలమని తాత్పర్యము. ఇందుఁగలసార మేమనఁగా లక్ష్మణునకుఁ దల్లి యగుసుమిత్రయు నాతల్లివగు నీవును రాజునాజ్ఞను శిరసా.

వహించి మీరు వనములకుఁ బోవవలదని మాకు నాజ్ఞనీయక యుండిన సనాతనధర్మరక్షణము సాగదనియు, ధర్మసంస్థాపన మునకై మీరును మావనగమనమున కంగీకరింపవలయుననియు శ్రీరామమూర్తి యొఱింగించెననియే దీనిసారము. ఈభావమును

"వనవాసకృతా బుద్ధిర్మమ ధర్మ్యానుమన్యతాం"

అనుమూలము దృఢపఱచుచున్నది. అని రాముఁడు తల్లికిం దెల్పెను.

ఇదియే శ్రీరామోపదేశము. పితృనాజ్ఞ యని తల్లిని దుఃఖములపాలు చేయక ధర్మోపదేశరూపమున నూఱడించి సమ్మతింపఁజేయవలయుననియు, వారిసమ్మతియే పురోవృద్ధికి హేతువనియు మన మెఱుంగవలయు. ప్రతివాక్యమునందును శ్రీరాముఁడు ధర్మము ప్రధానమని తెలిపెను. కావునఁ గేవల ధర్మసంరక్షణార్థమే శ్రీరామునిప్రవృత్తి యనియే మనము నిశ్చయింపవలయును. అనఁగా ధర్మము నను సరించఁగోరువారు శ్రీరామప్రవృత్తి నుదాహరణముగా గ్రహింపవలయుననియే దీనిసారము.

"కిం జీవితేనేహ వినా త్వయా మే
లోకేన కిం వా స్వధయామృతేన,
శ్రేయో ముహూర్తం తవ సన్నిధానం
మమేహ కృత్స్నాదపి జీవలోకాత్." ౫౨

అనునది కౌసల్యావాక్యము. నీవు చెంత లేకపోయిన నాకీ బ్రదుకేల? పితృలోకప్రాప్తివలన స్వధ యబ్బినను లాభమేమి? స్వర్గలోకప్రాప్తిచే నమృతము దొరకినను ప్రయోజనమేమి? ఒక్కముహూర్తకాలము నీసన్నిధి నుండిన నదియే చాలును.

మహర్లోకాదిసకలలోకములఁ గలజీవులు నాయెదుట నుండినను నాకుఁ దృష్టిలేదని కౌసల్య పలికెను. కౌసల్యాముఖమునుండి వాల్మీకిమహర్షి యీగూఢార్థోపబృంహితము లగుపలుకులఁ బలికించెనని మన మెఱుంగవలయును. దీనియందుఁగల విశేషార్థమేమి? పితరులనఁగా వసురూపము నొందినవారు. పితామహులనఁగా రుద్రరూపము నొందినవారు. ప్రపితామహులనఁగా నాదిత్యరూపము నొందినవారు.

"వసూన్ వదంతి తు పితౄన్ రుద్రాంశ్చైవ పితామహాన్,
ప్రపితామహాం స్తథాదిత్యాన్ శ్రుతిరేషా సనాతనీ." ౨౮౪

మను. ౩ అధ్యా.

"పిత్రాదయో వస్వాదిరూపేణ ధ్యేయా ఇతి విధిః కల్ప్యతే. అత ఏవ పైఠీనసిః. య ఏవం విద్వాన్ పితౄన్ యజతే వసవో రుద్రా ఆదిత్యా శ్చాస్య ప్రీతా భవంతి"

అని కుల్లూకభట్టు. పితృదేవతలఁ బూజించిన వసువులను దేవతలు ప్రీతినొందుదురనఁగా భావమేమి? వసువులను దేవతలు పితృదేవతారూపమున మానవుల మేలుఁగోరుచుందురనియేకదా. చచ్చిపోయినవా రెల్ల వసులోకమున నుందురని కొందఱందురు. అది పరిహాసాస్పదము. వసులోకము పితృలోకమని మనమూహింపందగు. రుద్రలోకము పితామహులది. ఆదిత్యలోకము ప్రపితామహులది. ఈలోకము లొకదానిపై నొకటిగా నుండునవి కావని యెఱుంగవలయు. ఆదిత్యలోకమునఁ బ్రపితామహులుందురనఁగాఁ దేజోరూపులని భావము. స్వకీయతేజస్సంవ్యాప్తి నితరులయందుఁ గలమలినవాసనలఁ బోఁగొట్టి నిర్మలాత్మ

...గా నారింతురని భావము. తేజోలోక మాదిత్యలోక ... నిర్వివాదాంశము.

...ణాతి దేవానమృతేన సూర్యస్సోమం సుషుమ్ణేన చ వర్ధయిత్వా,
తు పూర్ణం దివసక్రమేణ తం కృష్ణపక్షే విబుధాః పిబంతి. ౩౮
తం చ సోమం చ కలావశిష్టం కృష్ణక్షయే రశ్మిభిరక్షరంతం,
సుధామృతం తత్పితరః పిబంతి దేవాశ్చ సౌమ్యాశ్చ తథైవ కావ్యాః. ౩౯
సూర్యేణ గోభిశ్చ సముజ్ఝితాభిరద్భిః పునశ్చైవ సముద్ధృతాభిః,
వృష్ట్యాభివృద్ధాభిరథౌషధీభిర్మర్త్యాః క్షుధం త్వన్నపానైర్జయంతి. ౪౦
తృప్తిశ్చ శుక్లే సుధయా సురాణాం పక్షే చ కృ . సుధయా పితౄణాం,
అన్నేన శశ్వచ్చ దధాతి మర్త్యాన్ సూర్యస్తపంస్తాన్ సుబిభర్తి గోభిః. ౪౧

బ్రహ్మాండపురాణము. ౨౩ అధ్యా.

అను నీప్రమాణములు సూర్యమహాత్త్వమును దేజోరాశిత్వమును బోధించుచున్నవి. ధనదాతలు వసువులు. శత్రుబాధానివారకులు రుద్రులు. మనఃపావనత్వాపాదకు లాదిత్యులని యూహింపవచ్చును. ఉత్తరోత్తరోత్కృష్టు లీమువ్వురనుట పొరపాటుగాదు. ఈమూఁడులోకములయందుఁ గలుగుసుఖము లల్పములని రాముని నొక్కముహూర్తకాలము గూడియుండు నదియే యుత్తమమని కౌసల్యభావము. దీనింబట్టి భగవద్దర్శన సహాస్థితు లొక్కక్షణకాలమైనను మహానందజనకమనియేకదా దీనిసారము.

"శ్రేయో ముహూర్తం తవ సన్నిధానం మమేహ,
కృత్స్నాదపి జీవలోకాత్."

అనుమూల ముపాస్యదేవతామహిమమును దెల్పుచున్నదని యెఱుంగవలయును. ౹రాముఁడు లలితాకృతికదా. ఈధ్యా

నము సహస్రారచక్రగతప్రకృతిపురుషులదే యగును. సహస్ర కమలమనఁగా జ్యోత్స్నామయమగు లోకము.

"క్షితౌ షట్పంచాశద్ద్విసమధికపంచాశదుదకే
హుతాశే ద్వాషష్టిశ్చతురధికపంచాశదనిలే,
దివి ద్విషట్త్రింశన్మనసి చ చతుష్షష్టిరితి యే,
మయూఖాస్తేషామప్యుపరి తవ పాదాంబుజయుగం." ౧౪

సౌందర్యలహరి.

"ఏవం సోమసూర్యానలాః పిండాండబ్రహ్మాండే ఆవృత్త్య వర్తంతే పిండాండబ్రహ్మాండయోరైక్యాత్. పిండాండావృత్తిరేవ బ్రహ్మాండవృత్తిరితి రహస్యం. ఏవం పిండాండమావృత్త్య వర్తతే సహస్రకమలం. తచ్చ జ్యోత్స్నామయో లోకః. తత్రత్యచంద్రమా నిత్యకళః.

"తేషామనంతకోటీనాం మయూఖానాం మహేశ్వరి,
మధ్యే షష్ట్యుత్తరం తేఽమీ త్రిశతం కిరణాశ్శివే.
బ్రహ్మాండం వ్యశ్నువానాస్తే సోమసూర్యానలాత్మనా,
అగ్నేరష్టోత్తరశతం షోడశోత్తరకం రవేః.
షట్త్రింశదుత్తరశతం చంద్రస్య కిరణాశ్శివే,
బ్రహ్మాండం భాసయంతస్తే పిండాండమపి శాంకరి.
దివా సూర్యస్తథా రాత్రౌ సోమో వహ్నిశ్చ సంధ్యయోః,
ప్రకాశయంతః కాలాంస్తే తస్మాత్కాలాత్మకాస్త్రయః.
షష్ట్యుత్తరం చ త్రిశతం దినాన్యేవ మహాయనః,
హాయనాత్మా మహాదేవః ప్రజాపతిరితి శ్రుతిః.
ప్రజాపతిర్లోకకర్తా మరీచిప్రముఖాన్మునీన్,
సృజంత్యేతే లోకపాలాస్తే సర్వే లోకరక్షకాః.
సంహారశ్చ హరాయత్త ఉత్పత్తిర్భవనిర్మితా,

రక్షాతు మృదసంలగ్నస్సృష్టిస్థితిలయేషు చ.
నియుక్తః పరమేశాన్యా జగదేవం ప్రవర్తత"

ఇతి చంద్రజ్ఞానవిద్యాతంత్రమ్.

"తమేవ భాంతమనుభాతి సర్వం తస్య భాసా సర్వమిదం విభా"తీతి శ్రుతి. అని వ్యాఖ్య.

ప్రత్యర్థోఽనూదితః."

దీనింబట్టిచూడఁగాఁ బ్రకృతిపురుషులగు సీతారాములను సహస్రారచక్రమున ధ్యానించుట ప్రధానమని తేలెడిని.

"మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం
స్థితం స్వాధిష్ఠానే హృది మరుతమాకాశముపరి,
మనోఽపి భ్రూమధ్యే సకలమపి భిత్వా కులపథం
సహస్రారే పద్మే సహ రహసి పత్యా విహరసి." ౯

అను నీశ్లోకమునందు శ్రీశంకరభగవత్పాదాచార్యులు వివరించిరి. కావున భగవతిని భగవంతుని ననఁగా సీతారామచంద్రులను సహస్రారకమలమున ధ్యానించి, యందు ముహూర్తమాత్రము తద్దీపము నాంతరదృష్టిని దర్శించినచో దానఁగలుగునానంద మమృతపానమునకంటె నానందదాయకమని యెఱుంగుటయే యీశ్లోకార్థము నెఱుంగుట. ఇదియే యందుఁగలసారము.

సహస్రారకమలమున ధ్యానము సామాన్యదృష్టి నాలోచింప ముహూర్తకాలమే చేయ సాధ్యమగును. చిరంతనయోగాభ్యాసమున నంతకంటె మించినకాలము సాధ్యమగునేమో. లంబికాదియోగసిద్ధిగలవారలకు నెంతకాలమైన నయ్యది సాధ్యముకాఁగలదు. అట్టివారిని గుఱించియే,

"ధన్యానాం గిరికందరే నివసతాం తేజః పరం ధ్యాయతా
మానందాశ్రుకణాన్ పిబంతి శకునా నిశ్శంకమంకేశయాః.

అని భర్తృహరి వచించెను. కావునఁ గౌసల్య ముహూర్త మాత్రము రామునిసన్నిధానము సర్వాతిశయఫలదమని పలికెను. ఆవిషయమునే మహర్షి వాల్మీకి మహాయోగి కావునఁ గౌసల్యనోటఁ బలికించెను. ఈరహస్యము నెఱిఁగి భక్తులు శ్రీసీతారాములను ధ్యానముచేయుచు వారిపాదారవిందముల యందు మనస్సును యథాశక్తి న్యాయము ననుసరించి నిలిపి యది యభ్యసింపవలయును. దానికంటె మించినపూజ లేదు. "యోగిహృద్ధ్యానగమ్యం వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథమ్" అనుసూక్తి యున్నదియేకదా.

"తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః,
ఉపవిశ్యాసనే యుంజ్యాద్యోగమాత్మవిశుద్ధయే. ౧౨
సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః,
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్. ౧౩
ప్రశాంతాత్మా విగతభీర్బ్రహ్మచారివ్రతే స్థితః,
మనస్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః. ౧౪
యుంజన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః,
శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి." ౧౫

గీత. ౬ అ.

అను నీశ్రీకృష్ణవాక్యములు యోగాభ్యాసమునే ప్రధానమనుచున్నవి. బాహ్యపూజ కేవలము పామరులకే యని తెలుపుచున్నవి.

"తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః,
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున."

అను నీభగవద్గీతావాక్యమే పైవ్రాతను సిద్ధాంతము చేయుచున్నది. ఇన్నివిషయములు ఉపదేశించిన శ్రీవారి దేవాలయములమాహాత్మ్యమును దెలిపినా యని యూహింతము. కేవల పామరులకుగాఁ బాషాణగృహము లేర్పడినవి. ఈనాఁటి కాలమున దొరతనమువారు క్రొత్తమార్గముల నియమించి బీదలను బోషించినట్లు లుబ్ధులగు ధనవంతులను బురికొలిపి, దేవాలయములఁ గట్టించి శిల్పులను బీదవారిని బోషించుట దేవాలయములకు ఫలమనవలయును. తన్మూలమునఁ గొందఱకు జీవనము సాగుచున్నదికదా యందు లేని యట్టివే ఫలములుగాని, యవియే ముక్తినొసంగునను కపటనాటకసూత్రధారులకపటోక్తులు నిరర్థకములుగాక మఱేమగును? ఎన్నియోనియమముల నేర్పఱిచి యాపాషాణవిగ్రహముల నెంతపరిశుద్ధమనస్కుఁడుగూడ ముట్టుకొనరాదనియు, నర్చకుఁడు నఖస్నానము చేసివచ్చి ముట్టుకొన్నను భగవంతుఁడు తృప్తినొందునని కల్పించియు, దానిమూలమున ధనము నార్జించు వేషధారుల కృత్రిమోక్తులకు మోసపోవక, బుద్ధిమంతుఁడు ధనలంపటులుగాక, లోకోద్ధరణతత్పరులగు పెద్దలకడ భక్తిమార్గమును దెలిసికొని యోగాభ్యాసము చేసి పరమేశ్వరుని నిరుపమాన తేజోరూపమును ధ్యానింపవయులనని వాల్మీకిమహర్షి యీశ్లోకరూపమున మన కుపదేశించెనని, యీయర్థమునే భగవద్గీత సిద్ధాంతము చేయుచున్నదని మన మెఱుంగవలయును.

"స మాతరం చైవ విసంజ్ఞకల్పామార్తం చ సౌమిత్రిమభిప్రశస్తం,
ధర్మేస్థితో ధర్మ్యమువాచ వాక్యం యథా సవివార్హతి తత్ర వక్తుం." ౫౪

అనునిది వాల్మీకివాక్యము. శ్రీరామచంద్రునిపూన్కిని దెలుపు చున్నది. ధర్మమునందే యుండువాఁడు. అనఁగా "వృషో హి భగవాన్ ధర్మః" అన్నమనుస్మృతివాక్యమురీతిగా ధర్మమే తానైనవాఁడు. "తత్ర వక్తుం స ఏవార్హతి" అనఁగా నట్టికట్టిడి కాలమునందు ధర్మమార్గమును జక్కఁగాఁ దెలుపుట కతఁడే తగినవాఁడు ఇతరుఁడు కాఁడని "ఏవకా" రార్థము. దీనింబట్టి భగవంతుఁడగు రామమూర్తియే ధర్మసూక్ష్మములను దెలుపఁ దగినవాఁడని వాల్మీకిమహర్షి భావము. ఏకాలమున నెట్టిధర్మ మార్గమును లోకులకుఁ దెలిపి వారాచరించునట్లు చేయుచు వారల కుదాహరణభూతుఁడు తానేయై చెప్పినట్టులాచరించుచు వెలయువాఁడు భగవంతుఁడు తప్ప నింకెవ్వఁడుండును? అనఁగా సర్వజ్ఞుఁడు తప్ప ధర్మస్వరూపము నెఱుంగఁదగువాఁడు లేఁడని భావము. కనుకనే శ్రీరాముఁడు లోకులకు ముఖ్యధర్మములను దెలిపి వానిని దానాచరించి యితరులకు మార్గదర్శకుఁడయ్యె ననియు నాకారణమున శ్రీరామునిప్రవృత్తియే ధర్మస్వరూప మనియు మన మెఱుంగవలయును.

"మమ త్వభిప్రాయమసన్నిరీక్ష్య మాత్రా సహాభ్యర్దసి మాం సుదుఃఖమ్." ౫౫

అని శ్రీరామమూర్తి లక్ష్మణున కుపదేశించెను. నాయభిప్రాయ మిట్టిదని తెలిసికొనక యనఁగా ధర్మైకతత్పరము నాయాశయ మని యెఱుంగవైతివే యని భావము. అందువలననే దుఃఖపడు చున్నావు. నన్నును గాఱియపెట్టుచున్నాఁడవు. ఇది తగదని భావము. అనఁగా నాపూన్కి ధర్మమునందే నెలకొనియుండును. దానిని మరల్ప వలనుపడదని రామాభిప్రాయము. ధర్మమునకు

విరుద్ధమగు దాని నాచరింప నామనస్సొప్పదని రామచంద్రుఁడు స్పష్టముగాఁ దెలిపెనని మన మెఱుంగవలయును.

"ధర్మార్థకామాః ఖలు తాత లోకే సమీక్షితా ధర్మఫలోదయేషు
తే తత్ర సర్వే స్యురసంశయం మే భార్యేవ వశ్యాభిమతా సుపుత్రా." ౫౬.

ఇదియే శ్రీరామచంద్రోపదేశసారము. సుఖము గలుగుటకు హేతువులు ధర్మార్థకామములనుట స్పష్టము. అందర్థకామములు ధర్మమునందే నెలకొనియున్నవి. నిస్సంశయము. కావున నొక్కధర్మము నాచరించినఁ దక్కిన రెండింటిని యథాశాస్త్రముగా నాచరించినట్లే యగును. అనఁగా ధర్మము నాచరించిన నన్నింటి నాచరించినట్లే. ధర్మమే ప్రధానమని భావము.

"శ్రుతిస్స్మృతిస్సదాచారస్స్వస్య చ ప్రియమాత్మనః,
సమ్యక్సంకల్పజః కామో ధర్మమూలమిదం స్మృతం. ౭
ఇజ్యాచారదమాహింసాదానస్వాధ్యాయకర్మణాం,
అయం తు పరమో ధర్మో యద్యోగేనాత్మదర్శనమ్." ౮

యాజ్ఞ. ఆచారకాండము.

ఇజ్యాదీనాం కర్మణామయమేవ పరమో ధర్మః యద్యోగేన బాహ్యచిత్తవృత్తినిరోధేనాత్మనో దర్శనం యాథాత్మ్యజ్ఞానం. యోగేనాత్మజ్ఞానే దేశాదినియమో నాస్తీత్యర్థః. తదుక్తం. యత్రైకాగ్రతా తత్రావిశేషాత్ ఇతి పాతంజలే. అని విజ్ఞానేశ్వరస్వామి.

"ఏక ఏవ సుహృద్ధర్మో నిధనేఽప్యనుయాతి యః,
శరీరేణ సమం నాశం సర్వమన్యద్ధి గచ్ఛతి." ౧౭ మను ౮ అధ్యా.

అను నీమొదలగుస్మృత్యభిప్రాయమే రామాయణాభిప్రాయము. శ్రీరామచంద్రుని యాశయము స్మృతిసిద్ధమైనదే కాని క్రొ[illegible]ది

కాదని తెలియవచ్చెడిని. ధర్మము ప్రధానమని దానినారాధించినఁ దక్కినయర్థకామము లనఁగా సుఖములు తమయంతనఁ గలుగు ననియు భావము. పురుషార్థములనఁగా ధర్మార్థకామమోక్షములు. ఈనాలుగింటిలో ధర్మము నారాధించినఁ దక్కినవాని నారాధించినట్లే. దీనిసార మేమనఁగా. ఒక్కొక్క దేవత నొక్కొక్కకోరికకై యారాధించుట యుత్తమమార్గము కాదనియు నొక్కభగవంతునే యారాధించినఁ దక్కినవారినెల్ల నారాధించినట్లేయగుననియు సారమని యెఱుంగవలయును.

"అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం. ౨౨
యేఽప్యన్యదేవతాభక్తా యజంతే శ్రద్ధయాన్వితాః,
తేఽపి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకం. ౨౩
అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ,
న తు మామభిజానంతి తత్త్వేనాతశ్చ్యవంతి తే. ౨౪
యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః,
భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినోఽపి మాం. ౨౫
పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి,
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః. ౨౬
యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణం." ౨౭. గీత. ౯ అ.

అను నీశ్రీకృష్ణవాక్యములు పైనవ్రాసిన యభిప్రాయమునే తెలుపుచున్నవి. అంతియగాక భగవదారాధనక్రమమును బోధించుచున్నవి. కర్మానుసారము మానవు లాయాయి దేవతల నుపాసింతురనియు నాయారాధనము నన్నుఁగూర్చి యని వా

రెలుంగరనియుఁ దేటపఱచుచున్నవి. నన్నే యాశ్రయించిన వారివాంఛలను వారడుగకపోయినను నేనే యొసంగుదునని భగవంతుఁడు తెలిపెనని స్పష్టపఱచుచున్నవి. వీనిసారమేమి? ఫలాభిసంధిరహిత సత్కర్మానుష్ఠానము ముఖ్యమనియే కాని వేఱొండుకాదు. ఇట్లే ధర్మము నొక్కదాని నారాధించినఁ దక్కినవాని నన్నింటిని జక్కఁగా నారాధించినట్లే యగునని యీయుదాహరణమునుబట్టి గ్రహింపవలయును. ఈయర్థము నకుఁ జక్కనియుదాహరణమును శ్రీరాముఁడు తెలిపెను.

"భార్యేవ వశ్యాభిమతా సుపుత్రా."

పూర్వజన్మకృతపుణ్యవిశేషమున లభించినభార్య అనుకూలయై ధర్మమును, ప్రియయై కామమును, సత్పుత్త్రులంగాంచి వారి యదృష్టవిశేషమున నర్థమును గల్గించును. ధర్మార్థకామముల కెట్లు భార్య కారణమో యట్లే ధర్మముకూడ నర్థకామములం గల్గించును. అనఁగా నన్నింటికి ధర్మమే ప్రధానమని భావము.

ఈఘట్టమున నాంధ్రీకరణము లెట్లున్నవో పరికింతము.

"భార్యేవ వశ్యాభిమతా సుపుత్రా." గో.

"యథా భార్యా వశ్యా అనుకూలా సతీ ధర్మం జనయతి, అభిమతా ప్రియా కామం, సుపుత్రా సతీ అర్థం."

అని గోవిందరాజులు

"సీ......ఒక్క,

భార్యయే వశ్యయై పరమధర్మంబును
ననుకూలయై కామమును సుపుత్ర

తే. వతియు నయి యర్థము నదెట్టిభంగిఁ గలుగఁ
జేయునో యొక్కధర్మ మట్లే యనుష్ఠి

తమయి సౌఖ్యదములగునర్థంబుఁ గామ
ముఖ్యపురుషార్థముల సిద్ధిఁబొందఁజేయు."

ఆంధ్రశ్రీమద్రామాయణము.

చ. "ధర్మిణియైనభార్యగడుధర్మముఁగూరుచుఁ బ్రేమఁగామపున్
శర్మముగూర్చునర్థమునుసత్సుతుమూలముగాఁగఁగూర్చెడున్."

వావిలికొలనువారి రామాయణము.

విమర్శకుల స్తుతిపాఠములను సమదర్శను లెఱుంగుదురు గాక.

"యస్మింస్తు సర్వే స్యురసన్నివిష్టా ధర్మో యతస్స్యాత్తదుపక్రమేత
ద్వేష్యో భవత్యర్థపరో హి లోకే కామాత్మతా ఖల్వపి న ప్రశస్తా. ౫౭
గురుశ్చ రాజా చ పితా చ వృద్ధః క్రోధాత్ప్రహర్షాద్యది వాపి కామాత్,
యద్వ్యాదిశేత్కార్యమవేక్ష్య ధర్మం కస్తం న కుర్యాదనృశంసవృత్తిః.
స వై న శక్నోమి పితుః ప్రతిజ్ఞామిమామకర్తుం సకలాం యథావత్,
స హ్యావయోస్తాత గురుర్నియోగే దేవ్యాశ్చ భర్తా స గతిస్స ధర్మః. ౫౮
తస్మిన్ పునర్జీవతి ధర్మరాజే విశేషతస్స్వే పథి వర్తమానే,
దేవీ మయా సార్ధమితోఽపగచ్ఛేత్కథం స్విదన్యా విధవేవ నారీ. ౬౦
సా మానుమన్యస్వ వనం వ్రజంతం కురుష్వ నస్స్వస్త్యయనాని దేవి,
యథా సమాప్తే పునరావ్రజేయం యథా హి సత్యేన పునర్యయాతిః."

అనునివి శ్రీరామునివాక్యములు. వీనిసారమేమి? ధర్మార్థకామములు మూఁడును గలుగనట్టికార్యము చేయఁబూనరాదు. ధర్మము సిద్ధించుకార్యమేదో దానికే పూనవలయును. కేవలార్థపరుఁడగువాఁడు లోకులచే ద్వేషింపఁబడును. కామపరాయ

ణత్వ మొక్కటిమాత్రము మంచిదికాదు. అనఁగాఁ బ్రధానము ధర్మముకాన నది సిద్ధించుపనిని జేయఁబూనవలయును. సకలభంగులఁ బూజ్యుఁడగు దశరథుఁడే కారణమున నాజ్ఞాపించిన నది ధర్మమగునని తలంచి చేయవలసినదే కాని మానరాదు. భరతునకు నాకు నాజ్ఞాపించుటకుఁ బ్రభువు. తల్లియగు కౌసల్యకు భర్త. కాన నట్టిపూజ్యునియాజ్ఞ మీఱరాదు. పతిం గూడియుండుటే సతికి ధర్మము. భార్యకు భర్తయే సర్వవిధముల శాసించువాఁడు. అని తమ్మునితోఁ జెప్పెను. జననీజనకులు పూజ్యులే యైనను జననిమాటకంటె జనకుని పలుకు ప్రధానము. జనని కాజ్ఞాపించుటకుంగూడ నతఁడే యధికారముగలవాఁడు. కనుకఁ దండ్రిమాట యుత్కృష్టము. క్రూరచిత్తుఁడే తండ్రియానతి మీఱువాఁడు. నేనట్లు మీఱను. కౌసల్యకు భర్తయాజ్ఞ శిరసావహింపఁదగును. కావున నావనగమనమున కామె యంగీకరించి దీవించి పంపవలెను. ప్రతిజ్ఞ నెఱవేర్చి మరలివత్తునని ధర్మవిహితముగ శ్రీరామచంద్రుఁ డుపదేశించెను. దీనింబట్టి యాలోచింపఁగా శ్రీరామునకు ధర్మమునందుఁగల యాదరణము తేటపడియెడిని. ధర్మేతరవాక్యము శ్రీరామునోటనుండి వెడలదని స్పష్టమగును.

"దేవీ మయా సార్థమితోఽపగచ్ఛేత్కథంస్విదన్యా విధవేవ నారీ"

అన్నమూలము మనకొకనీతిని బోధించెడిని. పుత్రునింగూడి యడవికి సువాసిని పోఁగూడదనియు భర్తృవిహీనయైన స్త్రీ మాత్రమే యట్లు పోవచ్చుననియు, భావము. అనఁగా

"పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే,
రక్షంతి స్థవిరే పుత్రా న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి." 3మను ౯ అధ్యా.

అన్న స్మృతివాక్యమునఁ గలయర్థమే యీరామవాక్యార్థమని తేటపడియెడిని. ముదుసలితనమునందు భర్త తురీయాశ్రమ మును స్వీకరించినపుడే పుత్త్రులు రక్షింపవలయునని భావము. దీనింబట్టి స్త్రీ యొంటరిగాఁ దిరుగరాదనియు, తండ్రి భర్త తన యులు లోనగుసంబంధుల సంరక్షణము స్త్రీలకు ముఖ్యమనియే శ్రీరాముని భావమని మన మెఱుంగవలయును. గతభర్తృక పుత్త్ర విహీనయైన నెట్లుండవలయు నన్న ప్రశ్నము రావచ్చును. తండ్రి వంకవారుగాని తత్తుల్యులుగాని రక్షకులుగా నుండవలయునే కాని సాహసించి యొంటరితిరుగరాదనునర్థము సిద్ధమగును.

"కాలేఽదాతా పితా వాచ్యో వాచ్యశ్చానుపయన్పతిః,
మృతే భర్తరి పుత్త్రస్తు వాచ్యో మాతురరక్షితా. ౪
సూక్ష్మేభ్యోఽపి ప్రసంగేభ్యః స్త్రియో రక్ష్యా విశేషతః,
ద్వయోర్హి కులయోశ్శోకమావహేయురరక్షితాః. ౫
ఇమం హి సర్వవర్ణానాం పశ్యంతో ధర్మముత్తమం,
యతంతే రక్షితుం భార్యాం భర్తారో దుర్బలా అపి." ౯ మను ౯ అధ్యా.

అను నీమనుస్మృతిభావమునే సంగ్రహించి "అనాథ విధవేవ నారీ" యని శ్రీరామమూర్తి మన కెఱిఁగించెను. పూర్వ కాలమునందుఁ గూడ స్త్రీరక్షణమునం దెంతయాదరమును పెద్దలు చూపిరో యెఱుంగనగు.

"న కశ్చిద్యోషితశ్శక్తః ప్రసహ్య పరిరక్షితుం,
ఏతైరుపాయయోగైస్తు శక్యాస్తాః పరిరక్షితుం." ౧౦

అను నీమనుస్మృతివాక్యము ననుసరించి పూర్వులు స్వానుభవ మున స్త్రీరక్షణమున నెన్నియుపాయములు కనిపెట్టి రక్షించిరో స్పష్టమగును. "కురుష్వ నస్స్వస్త్యయనాని దేవి" అని శ్రీరామ

మూర్తి ప్రార్థించెను. సీతకు లక్ష్మణునకు నాకు నాశీర్వచనముల దయసేయవమ్మా యని ప్రార్థించెను. లక్ష్మణునియనుగమనము నెఱింగెను. సీతరాక నెఱుంగఁడు. కావున లక్ష్మణునకు నాకు నాశిషము లిమ్మని యడిగెనని కొందఱి యభిప్రాయము. గోవింద రాజులుకూడ నిట్లే వ్రాసిరి. కాని యీగ్రంథము సర్వజ్ఞుఁ డయ్యు శ్రీరాముఁడు మానవుల ననుసరించునట్లే నటించు ననువిషయమే ప్రధానముగాఁగలది. గావున నాయభిప్రాయము నంగీకరింప నవకాశము లేదు. సీతయూహించినట్లే శ్రీరాముఁడు ప్రవర్తించును. భగవంతు నిచ్ఛ ననుసరించియే జానకి యూహించును. శ్రీరాముఁడు నిర్లిప్తుఁడు. సీత సర్వకార్యకర్త్రి. అన్న భావమే యిందుఁగలముఖ్యవిషయము. కావున మామువ్వురకు శుభముకలుగ ననుగ్రహింపుమని శ్రీరాముఁడు ప్రార్థించెననియే గ్రహింపవలయును.

"యశో హ్యహం కేవలరాజ్యకారణాన్న పృష్ఠతః కర్తుమలం మహోదయం,
అదీర్ఘకాలేన తు దేవి జీవితే వృణేఽవరామద్య మహీమధర్మతః." ఉ

అనుమూలమున శ్రీరాముఁడు తనయవతారఫలమును దెలిపెను. యశస్సు మహాఫలముగలది. రాజ్యకారణమున నట్టి యుత్తమఫలమును వదలఁజాలను. జీవితము క్షణభంగురము. అట్టిదానిని నమ్మి యధర్మమార్గమునఁ దుచ్ఛమగు రాజ్యమును గోరనని శ్రీరాముఁడు పలికెను. దీనిభావమేమి? యశస్సు ధర్మమూలమైనది. శాశ్వతము. దానిని సంపాదింపక యుండరాదు. బ్రదుకు క్షణభంగురము. అట్టిదానిని నమ్మి యధర్మమూలమున రాజ్యము లభించునేని గోరరాదనియే తెలియుందగు. అనఁగా ధర్మమునే యారాధింపవలయును. దానఁ గలుగుఫలము శాశ్వ

తము. ధర్మమూలముగా దొరకు రాజ్యమును గోరవచ్చును. అధర్మమూలమగునేని రాజ్యసుఖము నాశింపరాదు. అనఁగా నేను ధర్మమునే యాశ్రయించి దాన లభించుయశస్సు నార్జింతును. అయ్యది నాచరిత్రరూపమున స్థిరముగా జగంబున నెలకొనును. దాన ధర్మస్వరూపము తేటపడును. దాని నెఱింగినవారు నాదయకుఁ బాత్రులగుదురు. అనునదియే యిటఁగల సారము. రాక్షససంహారము ధర్మమూయందు లేని ధర్మధ్వంసకులగుటచే వారు వధ్యులైరి. ధర్మసమారాధకులగుట విభీషణాదులు కృపాపాత్రులైరి. కావున యుద్ధమున నధర్మప్రవర్తకులం బొలియించుట న్యాయ్యమే. కనుకనే క్షత్రియవంశమున నవతరించను. తదుచితమైన యాచారములు ధర్మములే.

"స్వధర్మమపి చాపేక్ష్య న వికంపితుమర్హసి,
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్క్షత్రియస్య న విద్యతే. ౩౧
యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతం,
సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశం. ౩౨
అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి,
తతస్స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి. ౩౩
అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయాం,
సంభావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే. ౩౪" గీత. ౨ అధ్యా.

అను నీశ్రీకృష్ణోపదేశవాక్యములు శ్రీరామచంద్రునివే యని యెఱుంగవలయును. శ్రీరామావతారము సంగ్రహముగాఁ దెల్పినవానినే శ్రీకృష్ణావతారమున భగవంతుఁడు విస్తరించి తెల్పెనని యెఱుంగందగు. ఈశ్రీరామునివాక్యముల ననుస

రించి ధర్మమువలన యశస్సు నార్జింపవలయుననియుఁ దుచ్ఛమగు సుఖమును గోరరాదనియు మన మెఱుంగందగు. ఫలాభిసంధి రహితకర్మానుష్ఠానము మంచిదన్నందుల కిది విరుద్ధముకాదా యందురేని యిట్టి యశస్సంపాదన మితరులకు ధర్మకర్మాసక్తిని గల్గించునదికావున సత్కర్మమే యనఁబడునని తెలియవలయును. ఈవాక్యమునందు శ్రీరాము నభిప్రాయమేమి? అను ప్రశ్నము కలదు. నేను ధర్మరక్షణమూలక మగుయశస్సు నార్జింప నవత రించితిని. ఈయవతారముననే యొల్లప్పుడుండఁబూనను. కావున నిపుడు రాజ్యము గోరను. రాక్షసనాశానంతరము ధర్మము వెలయుఁగాన నపుడు కొంతకాల మంగీకరింతును. అన్నదియే శ్రీరామచంద్రునభిప్రాయము.

"ప్రసాదయన్నరవృషభస్స మాతరం పరాక్రమాజ్జిగమిషురేవ దండకాన్,
అథానుజంభృశమనుశాస్యదర్శనం చకారతాంహృదిజననీంప్రదక్షిణం." ఉ.3

అను నీమూల మొక విశేషమును దెలుపుచున్నది. పురు షోత్తముఁడిట్లు తల్లి నాశ్వాసించి పరాక్రమమున దండకారణ్య ముల జయింపఁగోరియే పోవ నెంచెను. లక్ష్మణునకు ధర్మరహస్య మును జక్కఁగాఁ దెలిపి తల్లికిఁ బ్రదక్షిణము చేసి మనస్సునఁ బోవ నిశ్చయించెనని ప్రాతీతికార్థము. విశేషమేది? అనఁగా వినుఁడు.

ఇంతదనుక శ్రీరామమూర్తి శాంతమునే యాశ్రయించి యుండెను. ఇఁకఁ బరాక్రమమును జూపఁదగుసమయ మరు దెంచును. కావునఁ దదుచితమగుశౌర్యమును బూని దండ కాటవులజయింప నిచ్ఛయించియే పోవ నెంచెను. అనఁగా విరాధ ఖరదూషణత్రిశిరోదనుకబంధాదులఁ బొలియింపఁ దగుసమయ

మాసన్నమగుచున్నది. లక్ష్మణుఁడు రాజ్యము తనకు నిప్పింపఁ గోరి తల్లింగూడి దుఃఖించుచున్నవాఁడు. దుఃఖము శాంతింపఁ జేయునంత యవకాశము లేదు. కావున నపుడు పరాక్రమ ప్రదర్శనోచితస్వరూపమును గనఁబఱిచెను. మిక్కిలి యను శాసించి యనఁగా నిఁక బదులాడకుమని హెచ్చరించెను. తల్లికిఁ బ్రదక్షిణము చేసెను. ప్రయాణముచేయ మనసున నూల్కొనియెను.

"ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరం,
మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి. ౭
న తు మాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా,
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరం." ౮

గీత. ౧౧ అధ్యా.

అను గీతోపదేశము ప్రకారము స్వరూపదర్శన మొసంగెను. ఆ తేజోమయరూపదర్శనమున నెట్టివారైనను దద్వశంవదులగు దురని యెఱుంగునది. లక్ష్మణునిమూలమునఁ గావలసిన కార్యము లనేకము లున్నవి. కావున నాతని క్రోధదుఃఖావరణములనుండి మరలించె ననుసరి యే యిందు గ్రహింపఁదగును. తన తేజస్సును లక్ష్మణునియందుఁ గొంత చేర్చెననియుఁ గొందఱందురు. ఇట్టి లీభాగము శ్రీరామచంద్రునియుపదేశసారములచే సంభరిత మైనది.

అధ్యాత్మరామాయణమునం దీభాగ మెట్లున్నది పరి కింతము. కౌసల్యవచనసారమున నిందు విశేషము లేదు. లక్ష్మ ణునివాక్యములయందు

"ధనుష్పాణిరహం తత్ర నిహన్మ్యాం విఘ్నకారిణః."

అనియే కలదు.

ఇతి బ్రువంతం సౌమిత్రిమాలింగ్య రఘునందనః. ౨౭
శూరోఽసి రఘుశార్దూల మమాత్యంతహితే రతః,
జానామి సర్వం తే సత్యం కింతు తత్సమయో న హి. ౨౮
యదిదం దృశ్యతే సర్వం రాజ్యం దేహాదికం చ యత్,
యది సత్యం భవేత్తత్ర ఆయాసస్సఫలశ్చ తే. ౨౯
భోగా మేఘవితానస్థవిద్యుల్లేఖేవ చంచలాః,
ఆయురప్యగ్నిసంతప్తలోహస్థజలబిందువత్. ౩౦
యథా వ్యాళగళస్థోఽపి భేకో దంశానపేక్షతే,
తథా కాలాహినా గ్రస్తో లోకో భోగానశాశ్వతాన్. ౩౧
కరోతి దుఃఖేన హి కర్మతంత్రం శరీరభోగార్థమహర్నిశం నరః,
దేహస్తు భిన్నః పురుషాత్సమీక్ష్యతే కోవాత్ర భోగః పురుషేణ భుజ్యతే.

అను మొదలగు వాక్యరత్నము లుపదేశింపఁబడినవి. రామాయణమున సంక్షేపరూపమున నున్న విషయము లిందు విస్తరింపఁబడినవి. విషయసారమున నేభేదము కనఁబడదు. ప్రవృత్తిప్రధానముగ వాల్మీకి రామచరిత్రమును దెలిపెను. ఉపదేశప్రధానముగా నధ్యాత్మ రామాయణము విస్తరిల్లెను. సారగ్రాహకుల కర్థానుసారముగఁ దత్సారము గ్రహింపఁబడుచుండును. ఇంకఁ దరువాతి శ్రీరామచంద్రప్రవృత్తిని బరికింతము.

శ్రీరాముఁడు లక్ష్మణునకు శాంతముగల్గ బోధించుట.

*అత్తటి దుఃఖము పైకొనఁగా దాని నాపుకొనఁజాలక వేఁడినిట్టూర్పులుపుచ్చుచుఁ గోపాతిశయమునఁ గన్నులు పెద్దవి

*ఇయ్యది యిరువదిరెండవ సర్గమునుండి గ్రహింపఁబడినది. అధ్యాత్మ రామాయణసారముకూడ నిందుండును.

కాఁగాఁ బెనుసర్పముభంగి బుసగొట్టుచు నుండు ప్రియానుజుని గాంచి మనోనిగ్రహముగల శ్రీరాముఁడు మనోవికారమును బయలుపడనీయక యడంచికొనుచు నిట్లనియె. లక్ష్మణా! నీవు కోపమును శోకమును బట్టాభిషేకము నిలిచిపోయె నన్నయవమానము వదలి ధీరుఁడవై యుండుము. సంతుష్టుఁడవు కమ్ము. నాయభిషేకార్థము సమకట్టినయలంకారాదుల వదలుము. నిరపాయకార్యమునకుఁ బ్రయత్నింపుము. నావనవాసమునకు ననువగుయత్నము చేయుట మంచిది. నావిషయమున నీకుం గల యుత్సాహము నీయభిషేకమును నిలిపి వనమున కరుగఁదగిన వల్కలాదుల నేకరించుటయందు వ్యాపింపఁజేయుము. నాకీయభిషేకోత్సవము సాగునేమో యని సంతాపమునొందు తల్లికిఁ గైకకు నీవిపుడు నన్నుఁగూడి యాలోచించుటవలన నేసందియముగాని డెందమునఁ గలుగకయుండ వర్తింపుము. అభిషేకభంగ మాయె నన్నదుఃఖమునఁ బరితపించు నాతల్లికిఁ గౌసల్యకుఁ దండ్రియానతి మీఱరానిది గనుక మాయన్న వనముల కరిగి పదునాలుగుసంవత్సరము లుండివచ్చునుగదా. ఈయల్పకాలమున కేల విచారించెదవని నాశోకను గూర్చి సంశయము నొందకయుండఁ దగుభంగిఁ బలికి యూఱడింపుము. కైకకుఁగాని కౌసల్యకుఁగాని శంకామయదుఃఖము రవంతసేపు కలిగినను నేనోర్వఁజాలనుజుమీ. ఇంతవనుక జననీజనకుల కెప్పుడైన నెఱిఁగియే నెఱుఁగకయే నపకారము చేసినట్లు నాకుఁ దోఁపదుసుమీ. తండ్రి యనృతములాడఁడు. పలికినమాటను దప్పఁడు. అమోఘపరాక్రముఁడు. భూలోకమున నెందు నా తండ్రికి భయమే లేదు. ఇప్పుడు భయంపడియుండుట చెప్పిన మాట చెల్లింపకపోయినఁ బరలోకదూరుఁడ నగుదునే

యనియుఁ బరలోకమున శ్రమంపడవలసివచ్చుననియు నూహ చేతఁగాని వేఱుగాదు. అట్టిభయము నాతండ్రికి లేకయుండుఁ గాక. ఈప్రయత్నము నిలుపక మనము సాగించితిమేని కైకకుఁ దానిచ్చినవర మసత్యమగు ననుపరితాపము తండ్రికిం గలుగక మానదు. అట్లు కలిగిన నయ్యది నాకుం గల్గును. కనుక వత్సా! అభిషేకార్థములగు నీయలంకారముల వదలి యిచటనుండి యిపుడే యడవుల కరుగ నెంచుచున్నాఁడను.

ప్రియసోదరా! నాప్రయాణము సాగఁగా నాకైక యనుమానము మాని భరతునకు నభిషేకమహము సాగింపఁ గలదు. వల్కలాజినముల ధరించి జడలుదాల్చి నే నడవుల కరిగినతర్వాతఁ గైకకు మనస్తృప్తి కలుగును. నేనిందుండునంత దనుక నిది యామెకుఁ గలుగదు. నాకు వనగమనేచ్ఛ కలిగినది. తద్విషయమున మనస్సును గట్టిపఱచుకొంటిని. ఆలసించి మనస్సునకు లేనితొందఱలఁ గల్గింపరాదు. సత్యపాలనార్థము నన్నడవులకుఁ బంపఁగోరి నాతండ్రి యెట్టకేలకుఁ దనమనస్సు దృఢము చేసికొనియున్నాఁడు. అట్టితండ్రికి మనోదుఃఖము నామూలమునఁ గల్గరాదు. నాయభిషేకవిఘ్నమునఁ బ్రయత్నము చేసినవారలకెల్ల దుఃఖము గలుగరాదు. కనుక సత్వరంబ వనమునకుఁ బోవలయు. నన్నడవులకుఁ బంపుటకుఁగాని, నాకు లభించినరాజ్యమును దప్పించుటకుఁగాని కైక కారణము కాదు. దైవమే కారణము. కైకకీయభిప్రాయము దైవము పురికొల్పఁ గలిగినది. అట్లుకాకయున్నఁ జిన్నతనమునుండి నాయందు మిగుల వాత్సల్యము గలిగియుండు నాతల్లికి నిపుడు నన్నుఁ గష్టముల పాలుసేయవలయు ననునూహ యెట్లు కల్గును? మృదుమనస్కుఁడవు. నా యీమాటలఁ జక్కఁగా నాలోచింపుము. లక్ష్మణా!

నేనింతదనుక జనని యని సవతితల్లి యని భేదము పాటించిన వాఁడను గానని నీవే యెఱుంగుదువుకదా. ఆకైకకుంగూడ నాయందును భరతునియందును భేదభావము లేదనియు నీవెఱుంగుదువు. ఇట్టితఱి నంతవాత్సల్యము నాయందుఁగల కైకకు దైవప్రోత్సాహమే లేకపోయిన నిట్టిభేదభావ మేలాగు కలుగును? ఇంతకాల మామె దయారసవిశేషము ననుభవించు చున్న నన్నుఁ బట్టాభిషేకము మాని యడవికిఁ బొమ్మని వచింప రానిభయదవాక్యము లాకైక పలుకుట నాలోచింపఁగా నిందు లకు దైవమే తప్ప మఱియొక్కటి కారణమని నిర్ణయింపఁజాల కున్నాఁడను. దైవకారణము తప్ప నామెవాత్సల్యము దూర మగుట కింకొక్క కారణమే లేదు.

వత్సా! లక్ష్మణా! కైక నిజముగా సాధుస్వభావము కలది. ఉత్తమక్షత్రియకులసంజాత. అందులకుఁ దగినదయాది సద్గుణములు కలది. అట్టి యాకైక దుష్టప్రకృతిగలస్త్రీవలెఁ బ్రాణనాథునెదుట నన్ను బాధించుమాటలు పలుకునా? పలుక దనుట నిస్సంశయము. పలికెఁగదా యందువేమో. అందులకు దైవమే కారణమని విశ్వసింపుము. దైవమహత్త్వ మిట్టిదని యూహింప నలవియే కాదు. సకలభూతములలో నెద్దానియందుఁ గాని దైవము చేయఁబూనిన కార్యమునకుఁ బ్రతిహతమే లేదు. ఇది సుస్పష్టము. వేఱు తార్కాణము లేల? నాహస్తగతమగు రాజ్యము తప్పిపోయినది. కైకకు నాయందుఁ జిరంతనమగు ప్రేమము మాఱినది. లక్ష్మణా! నాస్థితియు నామెబుద్ధియుఁ దటా లునఁ దాఱుమాఱయ్యెఁగాదే. కావున దైవమునకుఁ బ్రతి హతమే లేదని నమ్ముము. దైవమున్నదని యెట్లు పలుకవచ్చు నని, ఉండెనేని పురుషకారమున దాని నాపఁగూడదా యనియు

నడుగుదువేమో సమాధానము నాలకింపుము. మనము చేయుచుండు కార్యముల ఫలములనుబట్టియే దైవముకలదని తెలిసికొనవచ్చును. మనము పట్టుదలతోఁ జేయు కార్యములయందుఁ గొన్నింటికి ఫలమే కలుగదు. అశ్రద్ధతో నెందులకో చేసిన కార్యములందుఁ గొన్నింటికి ఫలము కలుగుచున్నది. ఈఫలములకు దైవముతప్ప మఱొక్కటి కారణమని చెప్ప వలనుపడదు. కనుకనే దైవమున్నదని యనుమానము కలుగుచున్నది. చేసిన కార్యములు ఫలించుటచేత నేతప్ప వేఱుసాధనము దైవమున్నదని యెఱుంగుటకు లేదు. ఈ హేతువుచేత దైవమున్నది. దైవమనునది ఫలమునకుఁ బూర్వమే తెలియునదిగా నుండునేని ప్రతికూలమని తోఁచినయెడల దాని కేదైన ప్రాయశ్చిత్తము ముందుగనే చేసికొనవచ్చును. కాని ఫలమునకు ముం దెంత మాత్ర మయ్యది తెలియరాదు. ఫలమునకు ననంతరమే తెలియునట్టి బలవత్తమమగు నాదైవముతోఁ బ్రతిఘటించి దాని యత్నము నిలుపుట కెవ్వఁడు యత్నించును? వత్సా! ఈరీతిగానే యాదైవము ఫలముచేత ననుమానించి తెలిసికొనఁదగినదిగా నుండుటంజేసి యత్యంతబలీయమే యనఁదగినదికదా. కావున నట్టిదైవమును బురుషకారముచేత నాపుట యశక్యము. సుఖదుఃఖములు, శాంతికోపలాభనష్టములు జననమరణములు లోనగునట్టి కారణము తెలియరాని కార్యములన్నియు దైవకార్యములే యని నమ్ముము. ఘోరతప మ్మొనరించుచు నింద్రాది దేవతలంగూడ లెక్కసేయని విశ్వామిత్రాదులగుమునులుకూడ నాదైవముచేఁ బీడింపఁబడి పూని చేయుచున్న వ్రతోపవాసప్రముఖతీవ్రనియమములను వదలి కామక్రోధములకు లోఁబడి ఋషిత్వమునుండి దూరముగ నుండఁదగినవారరైరి. ఈభూలో

కమునందు నారంభించినకార్యము నాపి, తత్పూర్వము మనస్సునందైన నెప్పుడేఁ దలంపనైనఁ దగనికార్యము క్రొత్తది యాకస్మికముగా ఫలించుచున్నదికదా. అది దైవకార్యమే యని యెఱుంగుము.

లక్ష్మణా! ఇపుడు నేను నీకుపదేశించిన యీబుద్ధి సత్యము సుమీ. ఆబుద్ధిచేత నామనస్సును నేనే యాపియున్నాఁడను. పట్టాభిషేకము నిలిచిపోయినను దాన విచారము నాకుఁ గలుగకయున్నది. దైవశక్తి బలవత్తమము కాఁబట్టి నా తెలిపిన యీ బుద్ధి యోగబలమున నీవును బరితాపమును బోఁదోలి నా యీమతమునే యనుసరించి యభిషేకసంభారముల నిలుపుము. వత్సా! ఇప్పటి యీమంగళకుంభోదకం బంతయు నాకుఁ గావున్నను దాపసులకు నర్హమగువ్రతము నేఁ బూనినపుడు చేయఁదగుస్నానమునకుఁ బనికివచ్చునుగాక. ఈజలము స్నానమునకు నే నుపయోగించిన రాజ్యార్థము చేసితినని తల్లి సందియము నొందునేమో. ఇది రాజద్రవ్యము. ఇది రాజ్యోపయుక్తములగుమంగళద్రవ్యము లనేకములు గలిగియున్నది. కాన నీజలము నాకెందులకు? నేనే తెచ్చుకొన్న జలములచే స్నానముచేసి వ్రతనియమమును సాగింతును. ప్రియసోదరా! సంపద తలక్రిందులయ్యెఁగదా యని పరితాపపడకుము. రాజ్యమును యథావిధిగాఁ బాలించిన నత్యంతధర్మము కలుగును. వనవాసముచేఁ దపస్సు లభించును. ఇవి రెండును సమానములే. చక్కఁగా నాలోచించి చూడఁగా రాజ్యలాభమున మానవులకు వలయు కార్యాకార్యచింతయుఁ గష్టము విశేషించి యుండును. వనవాసమున నట్టికష్టము లుండవు. అంతియకాక తండ్రి మాటపాలించిన ధర్మముకూడ సిద్ధించును. కాఁబట్టి వనవాసమే

మిక్కిలి ఫలము నిచ్చునది. అంతియకాక యయ్యది మహాభ్యుదయమునకు సాధనముగా నున్నది. ఇపుడు నేఁబూనినకార్యమునకు విఘ్నము గలుగఁజేయఁ బిన్నతల్లి కారణమని యనుమానింపకుము. అయ్యది సరిగాదు. కైక దైవప్రోత్సాహమున నప్రియము పలుకుచున్నది. అంతియగాని వేఱుకాదు. అట్లు ప్రోత్సహించిన దైవమనఁగా నంతటిమహాప్రభావము కలదని నేను జెప్పితినిగదా. కావున నీకును దెలిసియే యున్నది. దైవము కారణముగా నున్నదానికై తల్లి యగుకైకను నిందించుట మంచిదిగాదని శ్రీరామమూర్తి బోధించెను.

మహాశయులారా! ఈసర్గము విశేషప్రయత్నమున విమర్శింపఁదగినది. దీనియందలిసార మెఱింగితి మేని యహంకారము మొదలంట నశించును. ఇఁక వినుఁడు. శ్రీరామచంద్రుఁడు పూర్వము తెలిపినదంతయు ధర్మముపాస్యమని. లక్ష్మణున కంతమాత్రమున నహంకారము తుదముట్ట నశింపలేదు. మన ప్రయత్నమున నీకార్యము కొనసాగదా యన్నయూహ కలదు. ఆయూహ ముందుముందు వృద్ధినొంది యహంకారమును బెంచును. శ్రీరాముని సేవించువారలకయ్యదియుండ రానిదియకదా. అట్టియహంకారమును దొలఁగించి కర్మసిద్ధాంతము మదినాటునట్టు లొనరింప శ్రీరామమూర్తి యెంచెను. భగవదారాధనము చేయువారలు కర్మబద్ధులముకాని స్వతంత్రులముకాము. అనుభావము గలవారలుగా నుండఁదగుదురు. గర్వమున కెవ్వారి మనస్సునఁ జోటులేదో వారలే యీశ్వరారాధనమునకు నర్హులు. తన్ను నమ్మినవారల కట్టిదుర్గుణము లేకుండఁజేయ నీశ్వరుఁడు తలంచును. సత్కర్మానుష్ఠానఫల మదియేకదా. అట్టియుపదేశము నీభాగమున శ్రీరాముఁడు తమ్మునకుఁ జేసెను. కావున

సకలపురుషార్థసాధనమగు నహంకారధ్వంసనరూప సద్విషయ మిందుఁ గలదని మన మెఱింగి దాని ననుష్ఠింపఁ బ్రయత్నింప వలయును.

"శ్వసంతమివ నాగేంద్రం రోషవిస్ఫారితేక్షణం,
ఆసాద్య రామస్సౌమిత్రిం సుహృదం భ్రాతరం ప్రియం,
ఉవాచేదం స ధైర్యేణ ధారయన్ సత్త్వమాత్మవాన్."

అని మూలము. "సత్త్వం చిత్తావికృతిం" అని వ్యాఖ్య. విశేషార్థ మేమనఁగా లక్ష్మణునకుఁ గోపము నశింపలేదు. పట్టాభిషేకము నిలిచిపోయెనే అన్నయవమానము మదిఁ బాదుకొన్నది. ఈ రెండింటిని దొలఁగింప నెంచెను. కావున శ్రీరామమూర్తి తన చిత్తావికారము ననఁగా నేకాలమునందు నేపనియందు మార్పు గొందని చిత్తవృత్తిని ధరించినవాఁడై 'ఆత్మవాన్' అనఁగా నిర్మలాంతరంగుఁడు. సర్వము ప్రకృతియధీనము చేసి మహానందము ననుభవించువాఁడని సారము. తనమనోవృత్తిని బయలు పడనీయక చేయఁబూనిన కార్య మితరులకుఁ దెలియనీయక యని చెప్పరాదు. దానిచే భగవచ్ఛక్తి నశింపఁజేసినట్లగును. బ్రహ్మాదులే నెఱుంగరాని తనమహత్త్వమును లక్ష్మణునకుఁ దానై తెలుపక యిట్లు పలికెనని మన మీభాగమునుండి గ్రహింపవలయును. ఇట్లేల శ్రీరాముఁడు పలికెనని ప్రశ్నింతురు. "సుహృదం ప్రియం భ్రాతరం" అనుమూలము బరిశీలింపుఁడు. మంచిహృదయముకలవాఁడు. తనమేలుకోరినవాఁడు. మానవదృష్టిచే సోదరుఁడు కావున నతనికిఁగల కోపమును నశింపఁజేయఁబూనెను. నిర్మలాంతఃకరణులకుంగూడ నేవో లోపము లుండును. వానిని భగవంతుఁడు తొలఁగించి తనపదము నొసంగును.

"అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్,
సాధురేవ స మంతవ్యస్సమ్యగ్వ్యవసితో హి సః." 30 గీ. 9 అధ్యా.

అన్నగీతాప్రమాణము ననుసరించి ప్రారబ్ధవశమున నేవో కొన్ని లోపములు లేశములవలె నుండినను భగవంతుని సాంద్ర భక్తిచే నమ్మి సేవించిన నయ్యవి తొలఁగఁజేసి పరమేశ్వరుఁడే కాపాడునని యూహింపవలయును. దురాచారుఁడు భగవంతుని సేవించునా యని ప్రశ్నింపరాదు. దుష్కర్మలేశము లేని సత్కర్మము చేసినవారే యుండరనవచ్చును. ఒక్కొక్కజన్మమునందును సత్కర్మము నాచరించుచు రాఁగా దుష్కర్మములు నశించుచుండఁగా నెన్నియోజన్మములకు యోగసిద్ధుఁడగును.

"ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః,
అనేకజన్మసంసిద్ధస్తతో యాతి పరాం గతిం." 45 గీత. 6 అధ్యా.

అను నీగీతావాక్యమే పైవ్రాసినదానిని సిద్ధాంతము చేయుచున్నది. కావునఁ బాపలేశము లేనివారే భగవంతుని సేవింతురనుట పొరపాటు. పాపములు భగవత్సేవచేఁ దొలఁగవలయును. అదిలేకున్న నివి తొలంగు టెట్లు? కావున సత్కర్మానుష్ఠానమే అనఁగా ఫలాభిసంధిరహితముగా సత్కర్ముల నాచరించుటయే భగవత్సేవ. ఫలములను గోరి భగవంతు నాశ్రయించుట భగవత్సేవ యనంబడదు. అట్టివాఁడు భగవదనుగ్రహమునకుఁ బాత్రుఁడు కాఁజాలఁడు. అది కృత్రిమభక్తి. అట్టివారే వేషధారు లనఁబడుదురు.

"జటిలో ముండీ లుంఛితకేశః కాషాయాంబరబహుకృతవేషః."

అని శ్రీశంకరభగవత్పాదాచార్యశిష్యులు తెలిపిరి. అట్టివారు భగవదనుగ్రహమును బొందఁజాలరనుట నిక్కము.

"నిగృహ్య రోషం శోకం చ ధైర్యమాశ్రిత్య కేవలం,
అవమానం నిరస్యేమం గృహీత్వా హర్ష ముత్తమమ్.
ఉపక్లృప్తం హి యత్కించిదభిషేకార్థమద్య మే,
సర్వం విసర్జయ క్షిప్రం కురు కార్యం నిరత్యయం." ౮

అని మూలము.

"జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః,
శీతోష్ణసుఖదుఃఖేషు తథా మానావమానయోః." ౭ గీత ౬ అధ్యా.

అన్నగీతావాక్యము ననుసరించి యోజించిన నీశ్రీరామోపదేశము చక్కఁగాఁ దోఁచును. కర్మసిద్ధాంతము నెఱుంగని వారికే రోషాదు లుండఁగలవు. ఏలన తనకర్మమే తనకుశుభాశుభ ఫలముల నొసంగుచున్న దని కర్మయోగి నమ్మును. ఇతరులు కర్మ ప్రోత్సాహితు లగుదురన్న విశ్వాసము వారలకు నుండును. ఇతరులను నష్టుగాక మనుజులు హాని చేయుదు రనుతలంపు గల్గును. కావున వారికి రోషాదులు నశింప నవకాశము లేదు. ఇట్టి మహానర్థములు కర్మసిద్ధాంతము నెఱుంగనివారికిం గల్గును. శ్రీరాముఁడిపుడు లక్ష్మణునకుఁ గర్మసిద్ధాంతమునే యుపదేశించుచున్నాఁడు. లక్ష్మణునకుఁ గండ్రియందు రోషము కలదు. ఏల? పెండ్లముమాటలకుఁ గామాతురుఁడై లోఁబడినవాఁడు కదాయని. కర్మగతుల నెఱింగినవాఁడు దూషింపఁడు. తన కర్మ మితరులఁ బ్రోత్సహించి తన్మూలమున నీఫలము తనకుఁ గల్గించెనని తలంచును. అట్టి జ్ఞానికి నితరులయందు రోషముండుట కవకాశము లేదు. రాముఁ డడవులపాలగుఁగదా యన్నశోకము సౌమిత్రికిఁ గలదు. కాని ధర్మసంస్థాపనార్థమై ప్రకృతిపూరుషు లవతరించిరన్న భావ మాతనికి లేదు. ఈ రెండిం

టిని వదలుమా యని శ్రీరామమూర్తి తెలిపెను. చక్రిని ధైర్యము కలుగవలయునన్న యెడల రోషశోకము లుండ రాదు. తదభావముననే ధైర్యము పాదుకొనును. అభిషేకము నిలిచి పోఁగా మీఁదు మిక్కిలి వనగమనముకూడఁ గలిగెనే యన్న యవమానము తొలఁగింపుమని తెల్పెను. దీని చేత నహంకార త్యాగ ముపదేశించెనని యెఱుంగవలయు. సత్యపాలనరూప మునఁ దండ్రిని గారవించితి మనునదియే హర్షము. భగవ త్స్వరూపమే సత్యము. దాని నారాధించుట యనఁగా భగ వంతుని సేవించుట. అది గలిగెనేని యంతకన్న హర్ష మెందుఁ గలదు. అట్టిహర్ష ముత్తమముగాన నయ్యది గలుగవలయును. ఈమాటలచే దేలినభావ మేమి?

"కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః,
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్." 37 (గీ. 3 అధ్యా.)

అన్న భగవదుక్తి ననుసరించి రోషాదుల వదలినఁగాని యానం దము కలుగదనియు నట్టియానందము గలిగినఁగాని నావెంట రాఁదగదనియు సారముకదా. నిరత్యయకార్యమునకుఁ బ్రయ త్నింపుమనఁగా నాశరహితకార్యమునకుఁ బూనుము. నాశ రహితకార్య మేది? ధర్మరక్షణము. దానికిఁ దగినట్లు ప్రయత్నిం పుము. నాయవతార మందులకే కావున నట్టికార్యమునకుఁ దగినవనగమనమునకుం బూనుమనియేగాక మఱేమి? ఈయుప దేశముచేత శ్రీరామచంద్రుని సర్వజ్ఞత్వము ప్రకటింపఁబడియె నని మన మెఱుంగవలయును.

"సౌమిత్రే యోఽభిషేకార్థే మమ సంభారసంభ్రమః,
అభిషేకనివృత్త్యర్థే సోఽస్తు సంభారసంభ్రమః." 8

అని మూలము. దీనిభావమేమి? నాపట్టాభిషేకనిమిత్తము వస్తు సంగ్రహణమున నెంతయుత్సాహము నీకుఁ గలదో యభిషేక నివృత్తికొఱకు నది యగుఁగాక. అట్లే వనవాసోచితవస్తువుల సంగ్రహణమున నుత్సాహవంతుఁడవు కమ్ము. అనఁగా

"యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ,
సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే." ౪౮

(గీత. ౨ అధ్యా.)

అన్న గీతావాక్యము ననుసరించి హర్షవిషాదములను సమముగా భావింపుమని భావము తేలెడిని. లాభాలాభములు జయాజయ ములు సుఖదుఃఖములు సమానములుగా భావించువా రెవ్వరో వారే భగవదనుగ్రహపాత్రులు. వారలే సంసారబంధవిముక్త లగుదురు.

"సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ,
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి." ౩౮

(గీత. ౨ అధ్యా.)

అన్న భగవదుక్తి స్పష్టదానిని దృఢముగాఁ జేయుచున్నది.

"యస్యా మదభిషేకార్థే మానసం పరితప్యతే,
మాతా మే సా యథా న స్యాత్సవిశంకా తథా కురు. ౬
తస్యాశ్శంకామయం దుఃఖం ముహూర్తమపి నోత్సహే,
మనసి ప్రతిసంజాతం సౌమిత్రేఽహముపేక్షితుం." ౭

అని మూలము. దీనిసారమేమనఁగా జగములకు మహోప కారము నామూలమునఁ జేయఁబూనినది కైక నాతల్లి. ఆమెకు సంశయము కలుగరాదు. అనఁగా నీపని సాగునో లేదో యన్న సందేహము కలుగరాదు. సాగుననియే యామె నమ్మవలయును.

అట్టిప్రయత్నము చేయమనఁగా వేవేగ వల్కలాజినములం గూర్పుము. నీమాటలకు బేలుపోయి నిరర్థకమగు నాసబూని నది నాతల్లి కౌసల్య. కావున మన యీసంభాషణము కైకకు మఱింత శంక కలుగఁజేయును. అట్టిశంక యామెకుం గల్గక యుండఁజేయమని శ్రీరాముఁ డుపదేశించెనని మనము గ్రహింప వలయును. దీనిచేత శ్రీరాముని సర్వసమత్వము తేటపడియెడిని.

దైవమే బలవత్తరము.

"కృతాంతస్త్వేవ సౌమిత్రే ద్రష్టవ్యో మత్ప్రవాసనే,
రాజ్యస్య చ వితీర్ణస్య పునరేవ నివర్తనే. ౧౫
కైకేయ్యాః ప్రతిపత్తిర్హి కథం స్యాన్మమ పీడనే,
యది భావో న దైవోయం కృతాంతవిహితో భవేత్. ౧౬
జానాసి హి యథా సౌమ్య న మాతృషు మమాంతరం,
భూతపూర్వం విశేషో వా తస్యా మయి సుతేఽపి వా. ౧౭
సోఽభిషేకనివృత్త్యర్థైః ప్రవాసార్థైశ్చ దుర్వచైః,
ఉగ్రైర్వాక్యైరహం తస్యా నాన్యద్దైవాత్సమర్థయే." ౧౮

అని మూలము. శ్రీరామచంద్రుఁడు సౌమిత్రికి నుపదేశించు నెపమునఁ గర్మసిద్ధాంతతత్త్వమును మనకుఁ దెలుపుచున్నాఁడు. లక్ష్మణా! నన్నడవులకుఁ బంపుటకు లభింపనున్న రాజ్యము లభిం పకయుండఁజేయుటకుఁ గైక కారణము కానేకాదు. దైవమే కారణము. నాయందుఁ బ్రీతిగలకైకకు నిట్టిభావము గలుగు నట్లుచేసినది దైవమే. కాకయున్న నింతలో నిట్టిమార్పామె మదిఁ గల్గ నేమి కారణము? నాకుఁ దల్లులందఱియందు సమబుద్ధి గల్గియుండుట నీవే యెఱుంగుదువుకదా. ఆమెకు నాయందు

భరతునియందు సమానప్రీతి యుండుటయు నీవే యెఱుంగు దువు. అని రాముఁడు తెలిపెను. దీనిసారమేమి? కర్మము బల వత్తరము. దైవమన్న నదియే. దైవమునకన్న నెక్కుడు లేదు. మానవులభావములు విపరీతముగా మార్పునొందుచుండును. ఏల? కర్మము ఫలానుభవమునకుఁ దగినరీతిగాఁ బ్రాణులబుద్ధుల మార్చుచుండును. ఆకర్మపాశములు దృఢతమములు. వానిసం బంధము గల్గినతఱి నెవ్వఁడుకాని దప్పించుకొనఁజాలఁడు. కాని కర్మము తన్నిట్లు త్రిప్పుచున్నదనిమాత్ర మెవ్వఁడుగాని యాలోచింపఁడు. తనశక్తిచేఁ గార్యానుగుణముగాఁ దన ప్రవృత్తి యున్నదనియే యూహించును. కావుననే దైవము బలవత్తమము. దానికంటె బలమైనది లేదు. అనియే యీయుప దేశసారము.

"యద్యహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే,
మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి. ౫౯
స్వభావజేన కౌంతేయ నిబద్ధస్స్వేన కర్మణా,
కర్తుం నేచ్ఛసి యన్మోహాత్కరిష్యస్యవశోఽపి తత్." ౬౦

గీత. ౧౮ అధ్యా.

అను నీశ్రీకృష్ణపరమాత్మవాక్యములు పై రామచంద్రవాక్య సారమునే తెలుపుచున్నవి.

"కథం ప్రకృతిమాపన్నా రాజపుత్రీ తథాగుణా,
బ్రూయాత్సా ప్రాకృతేవ స్త్రీ మత్ప్రీడాం భర్తృసన్నిధౌ. ౧౯
యదచింత్యం తు తద్దైవం భూతేష్వపి న హన్యతే,
వ్యక్తం మయి చ తస్యాం చ పతితో హి విపర్యయః." ౨౦

అని మూలము. దీనిసారమేమి? ఎట్టిసత్కులమునఁ బుట్టినను సకలసద్గుణములు కలిగినను దైవము వానినెల్ల మార్చివేయఁ గలదు. కర్మపాశబద్ధులు యుక్తాయుక్తములం బరికింపక కేవల విద్వాంసులైనను మూర్ఖులే యనఁబడుచు నసంగతముగా మాటలాడుదురు. సకలభూతములలో దేనియందైనను దైవము చేయు కార్యమున కడ్డముగలుగఁజాలదు. ఇది సత్యము. దృష్టాంతము క్రొత్తది చెప్పనక్కఱలేదు. నాచేతికివచ్చినరాజ్యము తప్పిపోయినది. ఆమెకు నాయందుఁగలప్రీతి మాఱినది. నా స్థితియుఁ దలక్రిందులైనదికదా. ఇంకేమికావలయు? అనఁగా దైవముచేయుకార్యమునకుఁ బ్రతిహతిని గల్పించువా రెవ్వరు లేరు. దాని నెదుర్కొనఁజాలినదే లేదు. దానిగతి యిట్టిదని తెలిసికొనువారుకూడ లేరు. కావున కైక నాకపకారముచేసె నని యూహించుట తప్పు. ఎవ్వారి కీయూహా స్థిరపడునో వారిత రులను దూషింపరు. దైవము తమసంపద్విపత్తులకుఁ గారణమని తలంతురు. అనువిషయమునే మన మీభాగమునుండి నేర్చుకొనఁదగును.

> "కశ్చిద్దైవేన సౌమిత్రే యోద్ధుముత్సహతే పుమాన్,
> యస్య న గ్రహణం కించిత్కర్మణోఽన్యత్ర దృశ్యతే. ౨౧
> సుఖదుఃఖే భయక్రోధౌ లాభాలాభౌ భవాభవౌ,
> యచ్చ కించి త్తథాభూతం నను దైవస్య కర్మ తత్. ౨౨
> ఋషయోఽప్యుగ్రతపసో దైవేనాభిప్రపీడితాః,
> ఉత్సృజ్య నియమాం స్తీవ్రాన్ భ్రంశ్యంతే కామమన్యుభిః." ౨౩

అని మూలము. మఱియు శ్రీరామమూర్తి దైవము బలవంత మని లక్ష్మణునకుఁ దెలుపుచున్నాఁడు. దైవయత్నమును బురుష

కారముచే నాపఁగూడదా? దైవమున్నట్లు నమ్ముట యెట్లు? అని లక్ష్మణునకు సందియముగలదేమో యని యూహించి తన్మూలమున లోకులకట్టిసంశయములు గలుగకుండఁజేయఁబూని యీయుపదేశము చేసెను. మానవులు చేయు కార్యముల ఫలముల ననుసరించియే దైవమున్నదని తెలియవలయును. ఎట్లనఁగా నెంతయో పట్టుదలతోఁ జేయు కార్యములకుఁ గొన్నింటికి ఫలము కల్గదు. పట్టుదలలేక చేసిన కార్యములకు ఫలము మిక్కిలి కల్గును. అట్లు కలుగఁ గారణమేమి? దైవముతప్ప దానికి వేఱు కారణము చెప్ప వలనుపడదు. ఈయనుమానము చేత దైవమున్నదనియు నది మనకు లోఁబడదనియుఁ గనఁబడదనియుఁ దెలియవలయును. కార్యఫలముతప్ప దైవము నెఱుంగుటకు నింకొక్కసాధనమే లేదు. కార్యఫలమునకు ముందే తెలియఁ బడినదైన నేదైనఁ బరిహారము చేయవచ్చును. అట్లుగాక ఫలానంతరము తెలియును గానఁ బురుషప్రయత్నమున దాని నాపుటకవకాశమే లేదు. అట్టిదైవముతో నెవ్వఁడు పోరాడఁగలఁడు? కావునఁ బురుషకారము దానిముందఱఁ బనికిరాదు. సుఖదుఃఖాదికారణములెల్ల దైవకార్యములే. ఇట్లు చెప్పుటకు దృష్టాంతమేమని ప్రశ్నించినచో సమాధానమేమనఁగా మహానుభావులగు మునులు తీవ్రనియమముంబూని తపస్సు చేయుచుందురు. ఆతపస్సునకు విఘ్నములు గలుగును. వానికి లొంగి తపస్సు మానుకొందురు. శాంతముఖములమాని యుదకుఁ గామక్రోధాదులకు లోఁబడుదురు. దానిచేఁ దమఋషిత్వమును బోఁగొట్టుకొందురు. దీనింబట్టి యాలోచింపఁగా బురుషప్రయత్నము దైవముమ్రోల వ్యర్థమని తేలుచున్నది. ఈవిషయము నెఱింగిన నహంకారము నశించును. అచోట శాంతము పాదు

కొనును. అయ్యది భగవత్సాక్షాత్కారమునకు హేతువగును. కావున నీసిద్ధాంతమును జక్కఁగా నెఱుంగవలయును.

"అసంకల్పితమేవేహ యదకస్మాత్ప్రవర్తతే,
నివర్త్యారంభమారబ్ధం నను దైవస్య కర్మ తత్. ౨౪
ఏతయా తత్త్వయా బుద్ధ్యా సంస్తభ్యాత్మానమాత్మనా,
వ్యాహతేఽప్యభిషేకే మే పరితాపో న విద్యతే. ౨౫
తస్మాదపరితాపస్సన్ త్వమప్యనువిధాయ మాం,
ప్రతిసంహారయ క్షిప్రమాభిషేచనికీం క్రియాం." ౨౬

అని మూలము. దృష్టాంతము నొసంగి కర్మసిద్ధాంతమునే శ్రీరామమూర్తి మఱియు నుపదేశించుచున్నాఁడు. లోకమున నొక్కఁడొక కార్యము చేయ మొదలుపెట్టును. అది నిష్కారణముగా నిలిచిపోవును. తలంపనిపని యాకస్మికముగా నెఱవేఱును. అయ్యది దైవకార్యముగాక మఱెవ్వరిది? ఈవిషయము సత్యము. ఈబుద్ధిచేత నెవ్వరిమనస్సును వారే యుద్విగ్నముగాకయుండ నిలుపుకొనవలయును. అట్లు చేసినఁ గష్టములు కలిగినపుడు పరితాపము కలుగకయుండును. ఇంతకంటెఁ గావలసినదేమి? అనఁగా గర్మసిద్ధాంతము మనస్సున నెవ్వారికిఁ జక్కఁగా నాటునో వారికి సుఖదుఃఖములయందు సమత్వము కుదురును. అదికల్గినవారు ఫలాభిసంధిలేనిసత్కర్మముల నాచరింతురు. వారు భగవత్కృపకుఁ బాత్రులగుదురు.

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన,
మా కర్మఫలహేతుర్భూర్మా తే సంగోఽస్త్వకర్మణి. ౪౭
యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ,
సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే. ౪౮

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ,
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః. ౪౯
బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే,
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలం." ౫౦

గీత. ౨ అధ్యా.

అను నీగీతావాక్యములయర్థసారము శ్రీ రామోపదేశనీతి సారముగాక మతేమిటి?

"మా చ లక్ష్మణ సంతాపం కార్షీర్లక్ష్మ్యా విపర్యయే,
రాజ్యం వా వనవాసో వా వనవాసో మహోదయః." ౨౯

అని మూలము. ఇంతవఱకు సీతాదేవి యడవుల కరుగునని సౌమిత్రి యెఱుఁగఁడు. కావున నన్న యొంటిగా నడవులకుఁ జనుచున్నవాఁడని దుఃఖించుచున్నవాఁడని యెఱింగి యాపరితాపమును బోఁగొట్టుచుఁ దనప్రభావమును శ్రీరాముఁడు తెలుపుచున్నవాఁడు.

"లక్ష్మ్యాః విపర్యయే సంతాపం మాకార్షీః."

అని యన్వయము. లక్ష్మణా! లక్ష్మీదేవి నన్ను వదలిపోవునని పరితపింపకుము. అనఁగా మాకిరువురకు శాశ్వతానుబంధమని భావము. లక్ష్మియుఁ దోఁడ నగునాకు రాజ్యముగాని వనవాసముగాని సమానమే. ఐనను వనవాసమే మహాఫలదము. అని తెలిపెను. ఇందుఁగలవిశేషమేమి? శ్రీరామమూర్తి వనవాసమే మహాఫలప్రద మనియెను. ఈవాక్యరూపమున లోకులకుఁ దెలిన మహావిషయమేది? ఎవ్వరుగాని యొకమహాకార్యమును జయఁబూనినయెడల నేకాంతస్థలమునఁ గూరుచుండి భగవద్ధ్యానము చేయవలయును. సామాన్యులకు నెన్నియో సంసర్గ

దోషము లుండును. నిస్సంగుఁడై యోగము నభ్యసింపవల యును. "యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ" అన్నది యిదియేకదా. అట్లు లేకాంతస్థలమునుండి యోగము నభ్యసించినవారియందు భగవత్కళ సంక్రమించును. అధిక తేజశ్శాలియై యతఁడు యత్నించినపని నెఱవేర్పఁగలఁడు. దైవ తేజస్సు సంక్రమించినఁగాని యదివఱకు గలతేజస్సు నిర్మలము కాదు. నిర్మలతేజస్సుండినఁగాని సత్కార్యముల నాచరింప నెట్టి వారును సమర్థులు కాఁజాలరు. ఆకారణముచేత వనవాసమనఁగా మానవబాహుళ్యముగానిచోటు. అను నీవిషయమునే మన మత్యంత శ్రద్ధతో నెఱుంగవలయును. వనవాసమే మహాఫలద మని శ్రీరామమూర్తి తెలుపుటంజేసి స్వావతారఫలమును దెలిపెనని మన మెఱుంగుట తెఱంగు.

ఇట్లు లీభాగము మనకుఁ గర్మసిద్ధాంతమును బోధించి "గహనా కర్మణో గతిః" అనువిషయమును సిద్ధాంతముచేయు చున్నది. దీనింబట్టి శ్రీరామచంద్రునియభిప్రాయము కర్మసిద్ధాంత మున నాస్తికలదియే యని యేర్పడుచున్నది. ఇఁక నధ్యాత్మ రామాయణ మీభాగమున ముందువ్రాసినట్లే వైరాగ్యమును దెలిపెను. దైవపౌరుషములవిషయము వాల్మీకిమహర్షికే వదలి నది. ఇఁకఁ దరువాతివృత్తాంతమును బఠింతము.

లక్ష్మణుఁడు పౌరుషమే దైవమునకంటె మిన్న యనుట.

* శ్రీరామమూర్తి పెక్కుచందములను జెప్పుచుండ సౌమిత్రి యాధర్మము తనకు సమ్మతముకానందున శిరస్సువంచి విని యన్నకుఁ గలధర్మపరాయణత్వమునకు సంతోషము, రాజ్య

* ఇయ్యది యిరువదిమూఁడవసర్గమునుండి కైకొనంబడినది.

భ్రంశమునకు దుఃఖము ననునీ రెండు మనస్సు నలంపఁగా, వాని యంతరమునఁబడి సుడివడుచుండెను. అంత నతఁడు దుఃఖమున రోష ముప్పొంగఁగాఁ గుటిలభ్రూకుటి యదరఁగాఁ బేటికాంతర్గతమహాసర్పమురీతి నిశ్వాసములు వెడలించెను. అత్తఱి నాతనిమోము భ్రూకుటిచే భయదమై చూడరాక క్రోధము నొందిన సింహవక్త్రమురీతిఁ గనంబడుచుండెను. మదగజము తన తొండము విదుల్చురీతి నాసౌమిత్రి ముంజేతిని నిర్భరకోపమున విదుల్చుచు నాత్మకంఠము నడ్డముగను క్రిందుగను మీఁదుగను దేహమును దాఁకునట్లు త్రిప్పుచుఁ గ్రీఁగంటిచూపు లడ్డముగా వ్యాపింపఁజేయుచు నన్నంగాంచి యిట్లు పలికెను.

శ్రీరామచంద్రా! నీవు పితృవచనపరిపాలనరూపధర్మమునకు హానికలుగునని నాయశ్లీ లోకులు దాని నాచరింపరని తలంచి వనగమనమునకు నుద్యమించు టెంతమాత్రము తగదు. ఇదియ సమయము. దైవమునుగూడ మీఱఁజాలినమహాశూరుఁడ వగు నీవు దుర్బలమగుదైవమును బ్రబలతరముగా నిర్వచించితివి. దీనింబరికింపఁగా నీవు భ్రాంతినొందితివని తోఁచెడిని. భ్రాంతియే కాకయున్న నీయట్టివాఁ డిట్టులేల చెప్పును? దైవము దుర్బలులకుఁ బట్టుగొమ్మ. అయ్యది యొక్కరి నాశ్రయించి తనకోర్కె తీర్చుకొనును. కాన నది దీనమైనది. తానుగనే పని చేయుటకుఁ గాని, పురుషకారమునుమీఱి పనిచేయఁగాని శక్తికలది కాదు. అట్టిదాని నేమేమో పొగడితివే.

కైకయు దశరథుఁడును బాపాత్ములని నీకేల సందియము కలుగలేదో, పాపులమాట ననుసరింపమి నీకేధర్మహానియుఁ గలుగదు. ఎట్లు పాపాత్ములని వారినంటివందువేమో. లోకమునఁ బైకిమాత్రము ధర్మమును వ్యాజముగాఁ గనఁబఱచి

తన్మూలమునఁ దమరు చేయఁదగుదుష్కార్యములను సాధించుకొందురో, ధర్మము నాచరించునట్లు వేషమూని దానిచేతఁ దమదోషములఁ గనఁబడకయుండఁజేయువారో అట్టివారు పెక్కండ్రుగలరు. వారివలెనే యీతల్లిదండ్రులని నీవు పేర్కొన్న కైకేయీదశరథులు పట్టాభిషేకము నీకుఁజేయునట్లు ధర్మమును నామమాత్ర మభినయించిరి. కాని వాస్తవమున రహస్యముగా నీకపకారము చేయువారే. కనుక మనకుఁ జేయఁబూనినయభిషేకమును నిలుపఁగోరి యందుల కనుగుణముగ నీదురాలోచనము చేసినారు. ఇది లోకమెఱుంగకయుండునా. శ్రీరామా! వారీదురాలోచనమును మున్నే చేసినారు. ఇది నిశ్చయము కాకపోయినయెడల నెంతకాలముక్రిందనో వరమిచ్చునట్లు చెప్పినరాజు దాని నింతదనుక నీయకుండఁ గారణమేమి? తొలికొడుకవగు నిన్నుమాని చిన్నవాని కభిషేకము చేయ నుపక్రమించుట యెల్లరు ద్వేషింపఁదగినపనికదా. అట్టిదుష్కార్యమును వారు చేయఁబూనిరే. దీని నోర్వఁజాలను. దీని నీవు మన్నింపవలయును.

తండ్రిమాట మీఱకుండుట గొప్పధర్మమంటివి. మతిమంతులలో నీవగ్రగణ్యుఁడవగు నీవేధర్మము ననుసరించి రాజ్యముఁబాలింపనుండిన బుద్ధి నడవులకుఁ బోవలయునని వేఱుగాఁ ద్రిప్పితివో, ఏధర్మము నాచరింపకున్న మహాపాపము గల్గునని మోహము చెందియున్నవాఁడవో తెలియకున్నాను. జనకవాక్యపాలనమన్న యీధర్మము నాకు సమ్మతముగాకున్నది. రవంతయే నిష్టపడకున్నది. నేను భ్రాంతి నొందితినా యని యడుగుదువా? పురుషకారముచేత బదులు చేయఁదగినవాఁడవు. తండ్రి కామినీమోహవాగురులకుఁ జిక్కి మహాధర్మము లోక

నిందితము నగునాజ్ఞ నీయఁగా, ధీరుఁడవగు నీవద్దానిని దిరస్క రింప శక్తిగలవాఁడవయ్యు దాని నాచరింపఁజూచెదవే? ఏల? ఇట్టిది మోహమునొందినఁగాక చేయఁబూనుదువా? వారు కపటవరములఁ గల్పించి యీయుత్సవమునకు భంగముగల్పించిరి. ఇది యిట్టిదని నీకేల తోఁచలేదు? దీనికే నాకు దుఃఖము గలుగుచున్నది. కామపరతంత్రుఁడగు తండ్రిమాట యనుసరింపఁదగునన్న ధర్మముకూడ లోకనిందితమేకాని యాచరింపఁదగదు. కామోద్రేకమున నీకు నపకారముచేయఁగోరుచు జననియని జనకుఁడని పేరుపెట్టుకొనియున్న యాశత్రువులు వాంఛింపరానిది వాంఛింపఁగా దానిని ఫలింపఁజేయవలయునని నీవు మనస్సునఁగూడఁ దలంపరాదు. వారల కీకార్యమున నిట్టి బుద్ధిపుట్టుటకుఁ గారణము దైవమే. అంతియకాని వారిస్వభావమునఁ గల్గినదికాదని నీవు తలంచుచున్నావుకదా. అయిన నీవీయాశయముగలవాఁడవు కారాదు. నాకుమాత్రము దైవము ప్రమాణమనువాదము రుచింపదు. భయస్వభావుఁడును వీర్యహీనుఁడు నగువాఁడే దైవమును నమ్మును. పరాక్రమశాలురు దృఢమనస్కులు నగుధీరులు దైవము నాశ్రయింపరు. తమ యంతనే కార్యములను సాధించుకొందురు. పురుషకారమున దైవమును మించఁజాలుపురుషుఁడెవ్వఁడును దైవమునే నమ్మి స్వకార్యమును బోఁగొట్టుకొని విచారమునఁ గుందఁడు. ఇప్పుడే లోకులు దైవపౌరుషములశక్తులను గన్నులార జూడఁగలరు. దైవపురుషకారములలో నేది బలవత్తరమో వానిరెండింటికిం గలతారతమ్య మెంతయో నేనిత్తఱినే యెల్లరనుఁ జక్కఁగాఁ దెలియఁజేసెదను. పట్టాభిషేకవిఘ్నము గావించినదని నీ వేదైవమును నమ్మియున్నావో యాదైవమునే నాపౌరుషమున నడం

షఁగా నందఱు చూచి తత్తత్త్వము నెఱుంగఁగలరు. అంకుశము లెక్కచేయక శృంఖలములఁ ద్రెంచుకొని మదమత్తతఁ గన్ను మిన్నుఁగానక యథేచ్ఛముగాఁ బరుగిడుగజమును దక్షుఁడగు మావటివాఁడు మరలించులాగున నెవరును మరల్పఁజాలరని నీవు పల్కినదైవమునే నాపౌరుషమున మరలించెదను. దిక్పాలకులు గుమిగూడివచ్చినను, త్రిలోకవాసు లొక్కటిగ వచ్చి నన్ను మార్కొనినను, నేనిపుడు సాగింపఁబూనిన శ్రీరామాభిషేకమును నివారింపఁజాలరనుట నిక్కము. ముదుసలితండ్రి యిఁక నేమియుఁ జేయఁజాలఁడని వేఱుగాఁ జెప్పవలయునా! శ్రీరామా! నీవిపుడు మహారాజవేయైతివి. రహస్యముగ నాలోచించి నీకరణ్యాగమనము నీకుఁ గల్గించినయాపాపాత్ములు నీకుఁ గల్పించినపదునాలుగేండ్లు తమరే యడవుల నుండఁజేసెద. మఱియు నీపట్టాభిషేకమును భంగపఱచి కొడుకునకు రాజ్యమిప్పింప నెవ్వతుక కోరెనో యామెకుఁ దండ్రికిని మనస్సులఁగల మహాశను దూలించెదను.

దైవబలముగలతండ్రిని నీపురుషకార మేమిచేయఁగలదందువేమో వినుము. అన్నా! నాపౌరుషము నెదుట దైవము నిలువఁజాలదని నమ్ముము. తండ్రికిఁగాని నాతోఁ బగఁగొన్న మఱెవ్వరికిఁగాని నాపౌరుషము దుఃఖము కలిగించును. కాని దైవము సుఖము కల్గింపఁజాలదు. నాపౌరుషమునకు నెవ్వఁడు చిక్కునో వానిని విడిపింప దైవమునకు శక్తిచాలదు. ధర్మమూని నీవు ప్రజలఁబాలించి రాజ్యసుఖము లనుభవించుచు సహస్రవర్షములు సాగింపఁగా నవ్వల నీవు వానప్రస్థాశ్రమమువూని వనములకుఁ బోవఁగా నీపుత్త్రులు రాజ్యపాలనము చేయుదురు. అంతియగాని భరతుఁడు పాలింపఁజాలఁడు. శమం

తుఁడై రాజ్యమును బాలించి కొడుకులకు దాని నిచ్చి ప్రజలను గన్నబిడ్డలభంగిఁ గాపాడ నియమించి పూర్వపు రాజర్షులను ంచినరీతి వనవాసము నడపఁబోవలయునని శాస్త్రము విధించుఁగదా. ధర్మనిరతా! శ్రీరామభద్రా! రాజచిత్తము చంచలమయ్యెను. ఇపుడు సాహసమూని రాజ్యము స్వాధీనము చేసికొన్నయెడల నెన్నియో కలహములు (భేదములు) కలుగును. వానిని సరిచేయుట శ్రమము. అని యనుమానించి రాజ్యమువలదందువా. ఆవిషయము నాకుం దెల్పుము. రాఘవా! నీవో మహావీరుఁడవు. నేను నీకు బాసటనై నిలిచెద. సముద్రము నేలాగు వేల నిలుపునో యట్లే రాజ్యమున నేకలహములు లేకయుండఁ గాపాడెదను. ఈచెప్పినచందమున నేను జేయకున్న వీరలోకమునకుఁ దప్పినవాఁడనగుదును. ఇదియే నాశపథము. నీవిపుడు వసిష్ఠాదులంగూడి మంగళవస్తువులం గూడినపావనజలములఁ బట్టాభిషేకము చేసికొమ్ము. ఆలసింపక యాపనికిం బూనుము. రాజు లెవ్వరుగాని నీమీఁదికివచ్చిన యెడల వారల నోడింప నేఁజాలుదును. నాయీకరములు రెండు నీదేహమున కలంకారార్థ ముండునవికావు. ధనుస్సును గరములకు భూషణముగా నేఁ బట్టుకొనలేదు. ఈనిశితకృపాణము వీరభూషణముగా వ్యర్థముగ మధ్యభాగమున వ్రేలాడఁగట్టుకొన్నదికాదు. ఈబాణములన్నియు నెదుటనున్నవారిని స్తంభింపఁజేయ నుండునవికావు ఈయాయుధచతుష్కము దక్కుంగలసాధనములు శత్రుసంతతి నడంపనున్నవే కాని యింకొక్కనికిఁగావు. నామ్రోలఁ బగవాఁ డెవ్వఁడు నిలుచునో వాఁడు ప్రాణుఁడై యుండ నేను సహింపఁజాలను. శత్రువు దేవరాజుగా-న్ము. నిశాతఖడ్గమున కావాలిచేయకమానను. నాయీఖడ్గ

ప్రహారములచేత గజాశ్వపదాతులయవయవములు శకలములు కాఁగా నవి భూమిపై నిండియుండఁగా నయ్యది సాంద్రా రణ్యముభంగి యడుగుపెట్ట సందులేక యుండఁగలదు. శ్రీ రాఘవా! చూడుము. ఇత్తటిసే యీఖడ్గధారాఘాతములకు గుఱియై దానినుండి వెడలుమిడుఁగుఱులతోఁ గూడినవియగుచు శత్రుదంతావళములు మండిపోవుకొండలవలెను, విద్యుల్లతా న్వితములగుమేఘములరీతిని గనఁబడుచు నేలఁ గూలఁగలవు. గోధాంగుళిత్రాణము (ఉడుముతోలుతిత్తిని) వ్రేళ్లకుందొడుగు కొని చాపము ధరించి యెదురొక్కని నిలువఁగా నేపురుషుఁడు నన్ను మార్కొనఁగలఁడు? ఎల్లశూరులు స్త్రీలవలెఁ బాఱిపోవఁ గలరు. పెక్కండ్రు మార్కొన్న నీవొక్కఁడవే పోరాడఁ గలవా. అందువేమో. వినుము. బలశాలి నొక్కని ననేకబాణ ములను ఒక్కబాణమునఁ బెక్కండ్ర నెగురఁగొట్టుచుఁ జతు రంగబలముల మర్మములునాట బాణములఁ బ్రయోగింతును. జగదీశా! నాయస్త్రప్రభావము రాజును బ్రభుత్వహీనునిగాఁ జేయుటకు, నీకుఁ బ్రభుత్వము నిచ్చుటకుఁ జాలును. అన్నా! చందనచర్చలకును, కేయూరధారణమునకును, ధనములు దానముచేయుటకును, మిత్రులఁ బాలించుటకు నా యీబాహు వులు సమర్థములు. ఐన నట్టిబాహువు లిపుడు వానినెల్ల మాని నీయభిషేకభంగము గావించినవారినెల్లఁ దూలించుకార్యము నకుఁ బూనంగలదు. నీశత్రుఁ డెవ్వఁడో తెల్పుము. ఇపుడే వాని జముప్రోలి కనిపెద. వానికీర్తి మాయించెద. వాని మిత్రులం బాఱఁదోలెద. రాజ్యమంతయు నీయధీనమున నుండఁ జేసెద. నాకు నుత్తరువిమ్ము. దానికై వేచియున్నవాఁడను. నీ కింకరుఁడనేకాని యన్యుఁడఁగాను. కరుణచే సెలవిమ్ము.

అని యనేకభంగులఁ బ్రార్థింపఁగా రఘుకులాలంకార భూతుఁడు శ్రీరామచంద్రుఁడు సౌమిత్రి వచించినదంతయు నాలకించి కన్నీరు వదలి యదియెల్లఁ దనకు సమ్మతము గాక యుండుటం జేసి కన్నీటిధారలు వెడలఁగాఁ దుడుచుకొని పెక్కురీతుల శీతలమృదూక్తుల నాతని నాశ్వాసించి యాతనిం జక్కఁ బరికించి ప్రియసోదరా! నీవు సర్వదా మృదుహృదయుఁడవు. ఇపు డిక్లేల కోపమునొందితివి? పితృవాక్యమునం దే స్థిరముగా నిలువఁబడువాఁడనుగాని యించుకంతయు మీాఱువాఁడను గానుజుమీా. ఇది మది నెఱుంగుము. పరమధర్మ మనఁగా నిదియేసుమా యనియెను.

మహాశయులారా! వాల్మీకిమహర్షి లక్ష్మణునిమూలమునఁ గుమతులగువారలభావమును దెలిపెను. అనఁగా దైవము ప్రధానము కాదనువారలయభిప్రాయములఁ దెలిపెనని మన మెఱుంగఁదగు. లక్ష్మణుఁ డంత| యవివేకి కాఁడు. శ్రీరాముని యుపదేశముకూడఁ బడసినవాఁడు. అట్టి బుద్ధిమంతుఁడు ప్రత్యక్ష ప్రమాణవాదుల యభిప్రాయములఁ దెలుపఁడు. ఈరామాయణమూలమున మహర్షి పూర్వపక్షసిద్ధాంతరూపముగా లోకులకు సన్మార్గముం దెలుపఁబూనెను. కావున నీవాదమునకుఁ జోటుదొరకినందున సౌమిత్రిమూలమునఁ బూర్వపక్షమును దెలిపెను. శ్రీరామచంద్రునిమూలమున ముందు సిద్ధాంతమును బోధించును. ఈసర్గమున లక్ష్మణుఁడు దైవమే లేదన్నంత దృఢమగు పూర్వపక్షముచేసెను. ఇదియు నొక్కతరుణమున సిద్ధాంతతుల్యమగును. అనఁగా రాజధర్మములయం దిట్టివి చెల్లఁదగినవే. న్యాయమార్గమును మీాఱినచో నెవ్వనిమీా

టయు వినరాదన్నదియు నీతియే. ఆనీతి యెల్లెడల నుపయోగింపరాదు.

“యథా దైవమశౌండీరం శౌండీరక్షత్రియర్షభ,
కిం నామ కృపణం దైవ మశక్తమభిశంససి. ౭
యద్యపి ప్రతిపత్తిస్తే దైవీ చాపి తయోర్మతం. ౧౫
తథాప్యుపేక్షణీయం తే న మే తదపి రోచతే,
విక్లబో వీర్యహీనో యస్స దైవమనువర్తతే. ౧౬
వీరాస్సంభావితాత్మానో న దైవం పర్యుపాసతే,
దైవం పురుషకారేణ యస్సమర్థః ప్రబాధితుం. ౧౭
న దైవేన విపన్నార్థః పురుషస్సోఽవసీదతి,
ద్రక్ష్యంతి త్వద్య దైవస్య పౌరుషం పురుషస్య చ. ౧౮
దైవమానుషయోరద్య వ్యక్తావ్యక్తిర్భవిష్యతి,
అద్య మత్పౌరుషహతం దైవం ద్రక్ష్యతి వై జనాః. ౧౯
యద్దైవాదాహతం తేఽద్య దృష్టం రాజ్యాభిషేచనం,
అత్యంకుశమివోద్దామం గజం మదబలోద్ధతం. ౨౦
ప్రధావితమహం దైవం పౌరుషేణ నివర్తయే. ౨౧
మద్బలేన విరుద్ధాయ న స్యాద్దైవబలం తథా,
ప్రభవిష్యతి దుఃఖాయ యథోగ్రం పౌరుషం మమ.” ౨౪

అను నీసౌమిత్రివాక్యములు పురుషకారమే బలవత్తరమని దైవము దుర్బలమని తేటపఱచుచున్నవి. ఇవి యుక్తాయుక్తములు కావనరాదు. వీనివలన నేయుపకారము లేదనియుఁ జెప్పరాదు. పురుషకారము దుర్బలమనువాదము జ్ఞానులకే యుపకరించును. పామరులకుఁ బౌరుషము దైవము సమానమనువిష

యమే యవసరము. లేకున్న సోమరులగుట కవకాశ మేర్పడును.

"దైవం నిహత్య కురు పౌరుషమాత్మశక్త్యా
యత్నే కృతే యది న సిద్ధ్యతి కోఽత్ర దోషః."

అన్నసూక్తి యందఱెఱుంగుదురుకదా.

దైవపౌరుషములు సమానములని శ్రీమహాభారతము చాటుచున్నది. ఈసౌమిత్రిమాటలమూలమున వాల్మీకి మనకుఁ దెలిపిన యీభాగమునుండి తేలినసార మేమనఁగా పురుష ప్రయత్నము చేయఁదగినది. దాన ఫలము గలదని నమ్మియే చేయవలయును. లేకయున్న నుత్సాహము నశించును. ఇది పామరులకు ననుకూలమగుమార్గము. పురుషకారము చేయుచు ఫలసిద్ధి దైవాధీనమని నమ్మవలయును. ఇది మధ్యముల కనుకూలమగుమార్గము. ధర్మమనియే పురుషయత్నము చేయవలయు. దైవము బలవత్తమమని పురుషకారము దుర్బలతమమని నమ్మవలయును. సిద్ధ్యసిద్ధులయందు సమభావముగలవారుగ నుండవలయును. ఇది జ్ఞానులకు ననుకూలమగుమార్గము. ఈమూఁడుమార్గములు లోకమున నుపకారమును గల్గించు నవియేకాని యపకారమును గల్గింపవు. ఇన్నిత్రోవలేల? అన్న ప్రశ్నమునకు నుత్తర మాలకింపుఁడు. కర్మము బహువిధముల వ్యాపించియున్నది. ఉత్తమ మధ్యమాధమ ఫలప్రదములగు కర్మముల నాచరించినవారు లోకమునఁ గలరు. వారల కందఱకు నొక్కమార్గ మనుకూలము కాదు. బహుమార్గముల వారు ప్రవర్తింతురు. ఏమార్గమున వర్తించినను దుదకు గమ్యస్థాన మొక్కటియే. వారివారికర్మముల కనురూపముగా నాయా

మార్గముల వారువారు ప్రవర్తింతురు. దైవము లేదని పురుష యత్నమే ఫలప్రదమని కొందఱునమ్ముదు రనుకొందము. ఒక్క కార్యార్థము గట్టిప్రయత్నము చేయుదురు. అది ఫలింపక పోవును. అల్పప్రయత్నము చేసినది ఫలించును. కొన్నిసారు లిట్లు చేయఁగాఁ జేయఁగా యత్నములు ఫలింపకపోవుచుండఁ గాఁ దుదకు దైవము ప్రబలమని పురుషకారము దానిమ్రోల వచింపరానియంత తుచ్ఛమని వారు నమ్ముదురు. అప్పుడు వారు జ్ఞానులలోఁ జేరుదురు. మొదటినుండి పురుషకారము నిరర్థక మన్నభావము గలిగినచో వారెల్ల నలసులగుదురు. కనుక నీభావముకూడ మంచిదే యనవలయును. కొందఱ కీమార్గము మేలు కలిగించును. ఈవిషయమునే యీభాగమునుండి తేలిన సారముగా నంగీకరింపవలయును.

"కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః,
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః." ౧౭. గీ. ౪ అ.

అన్నభగవద్వాక్యము నీవిషయము సిద్ధాంతము చేయుచున్నది. లోకమున ననేకవిధములగుకర్మములు వెలయుట కిదియే కారణము.

"అద్య మేఽస్త్రప్రభావస్య ప్రభావః ప్రభవిష్యతి,
రాజ్ఞశ్చాప్రభుతాం కర్తుం ప్రభుత్వం తవ చ ప్రభో." 3౭

అని మూలము. సౌమిత్రి తనప్రతాపమును బొగడుకొనెను.

"యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే,
హత్వాపి స ఇమాన్ లోకా న్నహంతి న నిబధ్యతే." ౧౭. గీ. ౧౮ అ.

అను నీగీతావాక్యమునకు సౌమిత్రిభావము కేవల విరుద్ధము. కావుననే శ్రీరామచంద్రుఁడు కన్నీరువద లెనని ముందు తెలియ

గలదు. సౌమిత్రి యిన్నిదినములుగా సేవచేయుచు నహంకార మును వదలలేదే యన్న విచారమే రామమూర్తి కన్నీరువదలు నట్లు లోనరించెను. ఎవ రహంకారముగలిగి భగవంతుని ద్వేషింతురో వారిని నరకమునఁ బడవేయుదుననియే భగ వంతుని ప్రతిన.

"అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః,
మామాత్మపరదేహేషు ప్రద్విషంతోఽభ్యసూయకాః. ౧౮
తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్,
క్షిపామ్యజస్రమశుభానాసురీష్వేవ యోనిషు. ౧౯
త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః,
కామః క్రోధస్తథాలోభస్తస్మాదేతత్త్రయం త్యజేత్. ౨౧
ఏతైర్విముక్తః కౌంతేయ తమోద్వారైస్త్రిభిర్నరః,
ఆచరత్యాత్మనశ్శ్రేయస్తతో యాతి పరాంగతిం." భ.గీ. ౧౬ అధ్యా.

అను నీగీతావాక్యములు భగవంతు నాశయమును దెలుపు చున్నవి. లక్ష్మణుఁడు శ్రీరాముని ద్వేషింపలేదు. దశరథాదులు ద్వేషించిరనియు వారిని నివారించి శ్రీరామమూర్తికి మేలుచే కూర్పవలయుననియు లక్ష్మణునిభావము. కావున నట్టిసోదరునిం గాంచి భగవంతుఁడు వాత్సల్యబలమున మనస్సు మృదుతమము కాఁగాఁ గన్నీరువదలెననియే యిందుఁగలతాత్పర్యము. ఎవ్వారు నిరహంకారులో కామక్రోధలోభదూరులో వారినే భగ వంతుఁడు మిగులఁ బ్రేమించునని మన మెఱుంగవలయును. భగవంతుఁడు కరుణాస్వరూపుఁడైనను గ్రోధయుక్తునిగాఁ జేయునవి కామక్రోధాదులే. కాన భక్తుఁడు వానిని వదల వలయును. అపుడే నిర్మలుఁడగును. వేషభాషలచేత భగవంతుని

మెప్పింపఁ దరముఁ కాదు. భూతదయాది సద్గుణములచేతనే మెప్పింపవలయుననియు మనము తెలిసికొనవలయును. ఇంత దనుక సౌమిత్రిమాటలు వినరానివియే. కాని కడపట

"యథా తవేయం వసుధా వశేభవే త్తథైవ మాం శాధి తవాస్మి కింకరః." ౪౦.

అని తనభావమును దేటపఱచెను. ఈయహంకారమంతయుఁ దనకు మేలుచేయఁగోరి సౌమిత్రి వహించెనని భగవంతుఁడు గ్రహించెను. కావుననే యీఘట్టమున

"విమృజ్య బాష్పం పరిసాంత్వ్య చాసకృత్స లక్ష్మణం రాఘవవంశవర్ధనః,
ఉవాచ పిత్ర్యే వచనే వ్యవస్థితం నిబోధ మామేవ హి సౌమ్య సత్పథః."

అని మహర్షి వాల్మీకి వచించెను. పాదసేవకుఁ డగు లక్ష్మణుఁడు తనకొఱ కింతటిదారుణకార్యము చేయ సాహసించెఁగదా యన్నయాదరము, నాయవతారతత్త్వ మెఱుంగక యిట్లు వదరుచున్నాఁడే యన్నవిచారము, ధర్మము బోధించిన నందలి సార మెఱుంగలేదే యన్నపరితాపము ననునీమూఁడును శ్రీ రామునిచిత్తము శోకాధీనముగా నొనర్చెను. భక్తుల నుద్ధరించుటయే పరమేశ్వరునికార్యము. కావునఁ బెక్కుసారు లాసోదరు నాశ్వాసించెను. కన్నీటిని దుడుచుకొనియెను. ఈచోట మహాకవి "రాఘవవంశవర్ధనః" అన్నవాక్యమును బ్రయోగించి తనయాదికవి ప్రఖ్యాతిని నిలుపుకొనియెను. సౌమిత్రి పితృదూషకుఁడని యాగ్రహించినఁ గార్యము చెడును. తానవతరించినది రఘువంశమును వృద్ధినొందించుటకేకదా. కానఁ గోపమున కవకాశమే లేదు. కరుణచూపుట కనేకమార్గములు కలవు. మహోపన్యాస మేల యని ముందొక్కమాట యనెను. "తండ్రి మాట మీఱనని నన్నెఱుంగుము" అనునదియే యావాక్యము.

దీనియందెంతయో అర్థమిమిడియున్నది. ఇదియే భగవంతుఁడు చేయుపరీక్షను దెలుపును. ఎట్లనఁగా ధర్మసూక్ష్మమనునది తల్లి మాటకంటెఁ దండ్రిమాట యెక్కుడనువిషయము. పితృవాక్య వ్యాజమున నరణ్యములకుఁ బోవనే యవతరించితిని. దానిని మాననయితిగాదు. మానిన నాయవతారఫలము లోకములకుఁ గల్గదు. పితృవాక్యపాలనమే సన్మార్గము. దానిని మించఁజాలినది లేదు. ఈయుపదేశమున ధర్మాచరణము ప్రధానమనియు, దాని నాచరించి లోకులకుఁ గనఁబఱచి వారిచే నాచరింపఁజేయుటకే యవతరించితిననియు, నీచట్టి నాపూన్కి నెఱుంగవనియు సారము. ఈయుపదేశమే లోపలఁ దమ్మునకుఁ దెలిపినసద్ధర్మ సారమని మన మెఱుంగవలయును. ఇట్టు లీభాగము శ్రీరామ లక్ష్మణులసంవాదమూలమున మన కనేకవిషయములఁ దెలుపు చున్నది. ఇప్పట్టున నధ్యాత్మరామాయణమునుండి తెల్పఁదగిన విశేషములు లేవు. ఇఁకఁ దరువాత శ్రీరామచంద్రచరిత్రముం బఠింతము.

వనవాసమునకుఁ గౌసల్య సమ్మతించుట.

*అంతఁ గౌసల్య తనకుమారుఁడు పితృవాక్యపాలనాద రుఁడని నిశ్చయించి యశ్రుజలములచే గద్గదకంఠయగుచు ధర్మయుక్తముగా నిట్లు పలికెను. ఇంతదనుక రాముఁడు దుఃఖ వార్త నెఱుఁగఁడు. ధర్మాత్ముఁడు. ప్రియహితభాషణుఁడు. చక్రవర్తికుమారుఁడు. ఇట్టిరామమూర్తి విధిదుర్విపాకమున భూమిమీఁద రాలినగింజల నేరుకొనుచు దాని నేతిని తిని యెట్లు

* ఇయ్యది యిరువదినాల్గవసర్గమునఁ గలదు. అధ్యాత్మరామాయణ విషయముకూడ నిందుండును.

జీవింపఁగలఁడు? రామునికింకురులే మృష్టాన్నమును దిందురు గదా. అట్టిప్రభువగురాముఁ డడవుల మూలఫలముల నెట్లు భక్షించి యెట్లుండును? గుణవంతుఁడు కోమలాంగుఁడు నగు కుమారు నడవులకు రాజు పంపుచున్న వాఁ డనువార్త విన్న వారుకూడ నమ్ముదురా? నమ్మఁదగనిమాటకదా యది. ఎవరైన నమ్ముదురేని రా జిట్టికుమారునే యడవులకుం బంపుచున్న వాఁడే మనల నిట్లే కానలకుఁ బంపకుండునా యని యతని యెడ భయముకలిగియుందురు.

రామచంద్రా! దిక్పాలకామోదకరుఁడవయ్యు విధివశమునఁ గానకుఁబోవనున్నావుకదా. దీనింబట్టి పరికింపఁగా నెట్టివారికైన నీలోకమున సకలవిధసుఖదుఃఖములఁ గల్గించునది దైవమేయని యేర్పడును. మఱియు నయ్యది ప్రబలమనియుఁ దేటపడుచున్నది. కుమారా! నీయెడఁబాటుచే నా దేహమున శోకానల ముప్పతిల్లును. దాని నెసఁగొల్పుగాలి నీయదర్శనమే. నిన్ను స్మరించి స్మరించి పలవించుట యనునదియే దారువులు. నాదుఃఖాశ్రుజలమే యాయగ్నియందు హోమముచేయునాహుతి. నిన్నుఁజూడని విచారముచే మనస్సున నుడుకువేఁడి యావిరిపొగ. నిట్టూర్పులు దానిని బెంపొందింప నాచేయు పురుషకారము. ఇట్లుండు నీశోకాగ్ని నాతనువున జనించి శిశిరర్తువునందు హిమముచేఁ దడిసినపొదను దావానలము వరుసగా వాడునట్లుచేసి యుదకమురీతిఁ జల్లార్చు నిన్నువదలి యొంటిగా నిందున్న నన్ను శుష్కింపఁజేసి కాల్పఁజాలును. గోవు తనదూడ వెంటపోవక యెట్లుండును? అట్లే నేనుగూడ నిన్నుఁ గూడి వచ్చెదను.

అని తల్లి పలుకఁగా నాలకించి పురుషోత్తముఁడు మిక్కిలి పరితపించు నాకౌసల్యం గాంచి యిట్లు పలికెను. తల్లీ! దశరథుఁడు మొదటనే కైకచే వంచితుఁడయ్యెను. నేనడవికిఁబోవుచున్నాఁడను. నీవుకూడ నాతోఁడవచ్చినఁ దండ్రి జీవింపఁడనుట నిక్కము. స్త్రీలకు భర్తను విడుచుట యత్యంతక్రూరకార్యము కదా. నీవంటిపూజ్యురా లట్టిక్రూరంపుఁబని చేయఁదగదు. చేయఁదలంపరాదు. నాజనకుఁ డెంతదనుక జీవించియుండునో యంతదనుక నీవు శుశ్రూష చేయుచుండుము. అదియే పురంధ్రులకు శాశ్వతధర్మము. అని శ్రీరాముఁడు తెలుపఁగా నాకౌసల్య బుద్ధిచమత్కృతిగల యన్నుమిన్నగాన నామాటల కెంతయో సంతోషించి దుఃఖమును దొలఁగంద్రోచుకుమారరత్నమును బరికించి వత్సా! నీవు చెప్పినట్లే చేయుదుననియె. ధర్మాత్మురాలగుతల్లి యిట్లు పలుక నాలకించి నగచుచున్నయామెం గని అమ్మా! నేనొక్కఁడనే కాదు. మనమిరువురము తల్లియానతి నాచరింపవలయును. ఆతఁడు మన కధిపతి, రక్షకుఁడు, ఆచార్యుఁడు, నియామకుఁడు, ప్రభువు కనుక, మన కెల్ల నాతనియాజ్ఞ శిరోధార్యము. నే నడవులలో నైదుతొమ్మిదివత్సరములు మాత్రము సుఖముగాఁ గడపి తరువాత మహాసంతోషమున నీయాజ్ఞరీతి మెలంగుదును. అని రాముఁడు పలుకఁగా విని పుత్రవాత్సల్యముప్పొంగుచుండఁ గన్నులనుండి యశ్రుజలములు స్రవింపఁగాఁ గడుంగడు నగచుచుఁ బ్రియపుత్త్రునిం గని యిట్లు పలికెను.

కుమారా! నన్ను ద్వేషించు నీసపత్నులచెంతనుండుట న్యాయము కాదు. నీవు పితృశాసనమురీతి నడవుల కరుగనెంచితివేని వనహరిణింబోలె నన్ను నడవికిం గొనిపొమ్ము. అని పలికి

మాటరాక దుఃఖించుచున్న తల్లింగాంచి రాముఁడుకూడదుఃఖించుచు నిట్లుపలికెను. తల్లీ! స్త్రీలకు బ్రతికియుండుదనుక భర్తయే దైవము, ప్రభువు కనుక, నాకెట్లో నీకు నట్లే రాజు నియమించువాఁడు. లోకమునకెల్ల నాథుఁడై యుండ మనకుమాత్రము గాకపోవునా? అట్టిప్రభువుండఁగా మన మనాథులమగుదుమా? మనకు భయ మెట్లుకలుగును? సపత్నులవలన భయము కలుగు నంటివే. వినుము. ప్రభువుగానున్న భరతుఁడు ధర్మాత్ముఁడు. ప్రియభాషణుఁడు. తల్లివగు నీకతఁ డప్రియము చేయునా? తల్లిమాటచేఁ జేయునని యనుమానింతువేమో. భరతుఁడు ధర్మైకనిరతుఁడు. కనుక నెవ్వరేమేమి చెప్పిన వినఁడు. నిన్ననుసరించి సేవించుచుండును. నేనడవులకరుగ నీవేమియుఁ బ్రమాదంపడక పుత్త్రదుఃఖమున రాజు కుందకయుండ నాశ్వాసింపవలయును. సేవలు చేయవలయు. నిరంతరవ్రతోపవాసనిరతయైనను స్త్రీమాత్రము త్తమరాలనుఖ్యాతిగాంచినను భర్తననుసరించియుండకపోయిన యామె పాపాత్మురాలే యగును. ఆర్యులకు నమస్కరింపక దేవతల నర్చింపకయున్న స్త్రీయును భర్తకు సేవచేయుచునుండిన నుత్తమురాలనఁబడి స్వర్గసుఖములం గాంచును. వనితమాత్రము నిరంతరము పతిప్రియకార్యనిరతయై శుశ్రూష చేయుచుండవలయును. ఈధర్మము పూర్వమునుండి శిష్టాచారమువలన నెల్లరకుఁ దెలియుచున్నది. వేద మిట్లే తెలియఁజేసెడిని. వేదార్థమునే స్మృతులుకూడ నుపదేశించుచున్నవి. అమ్మా! నేను క్షేమముగా మరలివచ్చుటకొఱకు శాంతికపౌష్టికాదిహోమములు చేయించి దేవతలఁ బూజింపవలయును. నియతవ్రతులగు బ్రాహ్మణుల నర్చింపవలయును. ఇట్లొనరించిన నావచ్చునంతదనుక నీకుఁ జక్కఁగాఁ గాలము గడ

చును. సుఖముగా నగరమునకు నేను రావలయునని మదిం గోరుచు స్నానాదినియమము నాశ్రయించి నిషిద్ధవస్తుత్యాగ ముచేసి సాత్వికము వంశోచితమునగు నాహారమును గ్రహిం చుచు నారాక కెదురుచూచుచుండుము. నేవచ్చినపిదప రాజు సప్రాణుఁడై యుండెనేని నీవాంఛిత మెల్లఁ బడయఁజాలుదును.

అని శ్రీరామచంద్రుఁడు చెప్పఁగా విని కౌసల్య వగచుచు గన్నీరు మోమునఁ బ్రవహింపఁగాఁ గొడుకుతో నిట్లు పలికెను. శూరాగ్రణీ! వత్సా! వనగమనమున శ్రద్ధగలవాఁడవైతివి. మరలింపఁజాలను. కాలమహత్త్వ మిది యనవలయును. కాలమునుమీఱుఁ దరముగాదనుట నిక్కము. స్థిరబుద్ధిగలవాఁ డవై వనముల కరుగుము. నీవు ప్రభువవు. నీకు నిరంతరము మంగళములే కలుగుచుండును. మరల నీవు రాఁగా నాకష్టములు తీఱును. సుఖము గల్గును. పితృవాక్యము చెల్లించి ధన్యుఁడవై పితౄణము దీర్చుకొని వనమునుండి రాఁగానే యత్యంతసౌఖ్య మొందుదును. రఘువంశోద్ధారకా! భూలోకమున దైవగతి యిట్టిదని యూహింప శక్యమే కాదు. అది యట్టిది కావుననే మాతృవాక్యముంగూడఁ బాటింపక వనముల కరుగవలయునని నిన్నుఁ బ్రోత్సహించినది. కుమారా! మహాబాహుఁడవగు నిన్నె వ్వరును మార్కొనఁజాలరు. కాననిపుడు ప్రయాణము చేయుము. కుశలముగా నిచ్చటికివచ్చి మంచిమాటల నాకు సంతోషమును జేకూర్పఁగలవు. పదునాలుగువత్సరములు గడువఁగా జటావ ల్కలముల ధరించి నీవు రాఁగా నిన్నుఁ జూచునదృష్టము నాకె ప్పుడే కలుగునాయని వగచెను. తనకుమారుఁడు తండ్రివచనము ననుసరించి యడవుల నుండఁబోవుచున్నాఁడని యెఱింగి కౌసల్య

మహోదరమున సర్వశుభలక్షణలక్షితుఁడగుట యెఱింగినదికాన నాశీర్వచనము లొసంగఁగోరెను.

మహానుభావులారా! ఈసర్గమున నొకటిరెండువిషయములు విమర్శింపఁదగినవి కలవు. వానిం దెలిపెదను.

"అదృష్టదుఃఖో ధర్మాత్మా సర్వభూతప్రియంవదః,
మయి జాతో దశరథాత్కథముంఛేన వర్తయేత్. ౨
యస్య భృత్యాశ్చ దాసాశ్చ మృష్టాన్యన్నాని భుంజతే,
కథం స భోక్ష్యతే నాథో వనే మూలఫలాన్యయం." 3

అని కౌసల్యనోట మహర్షి వాల్మీకి పలికించెను. శ్రీరాముఁ డడవుల కరుగుచున్నాఁడు. పదునాలుగుసంవత్సరములకుఁ జూడ నవకాశము సామాన్యదృష్టి నప్పు డాలోచింపఁగా లేదు. ఆభావముగలకౌసల్య రామునిం గాంచినంతనే యామె తానేమిచెప్పుచున్నదో యెఱుఁగకపోయెను. పుత్త్రప్రేమమున పలికెను. కాని భగవద్దర్శనమునఁ దదనుకూలముగా నామాటలు దొరలెను. వానిభావము శ్రీరాముఁడు భగవంతుఁడనియే. 'అదృష్టదుఃఖః సర్వభూతప్రియంవదః' అనునీవాక్యములు శ్రీరాముని భగవంతుఁడనియే తెల్పుచున్నవి.

"న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన,
నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి." ౨

అనుగీతావాక్యప్రకారము పొందఁదగినది పొందనిదేదియు భవంతునకు లేదు. ఇఁక దుఃఖ మెక్కడిది?

"సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః,"

అన్నగీతాప్రమాణము ననుసరించి యప్రియవాక్కు లెట్లు వెలును? 'అదృష్టదుఃఖః' అనఁగా నేయవతారమునందుఁగా

దుఃఖమే యెఱుంగఁడనుట. అట్టివాఁ డెవ్వఁడు? పరమేశ్వరుఁడే. ఈమాటలు పలికెనుగాని జన్మమున కనుగుణమగు భావమామె విజ్ఞానము నాచ్ఛాదించెను. ఇట్టి రాముఁ డుంఛవృత్తి నెట్లు జీవించును? అని వగచెను. ఉంఛవృత్తి యనఁగా

"కుసూలకుంభీధాన్యో వా త్ర్యైహికో౽శ్వస్తనో౽పి వా,
జీవేద్వాపి శిలోంఛేన శ్రేయానేషాం పరః పరః." ౧౨౮

యాజ్ఞవల్క్యస్మృతి. ౧ కాం.

"శాల్యాదినిపతితపరిత్యక్తవల్లరీ గ్రహణం శిలం. ఏకైకస్య పరిత్యక్తస్య కణస్యోపాదానముంఛః." అని మితాక్షర.

వరివెన్నులు పడియుండఁగా వానిని దెచ్చుకొనుట శిల మనఁబడు. పైరుకోసినపిదప నందుఁ బడియున్నగింజల నేఱికొని తెచ్చుట ఉంఛ మనంబడును.

"ఋతముంఛశిలం జ్ఞేయమమృతం స్యాదయాచితం,
మృతం తు యాచితం భైక్షం ప్రమృతం కర్షణం స్మృతం. ౫
సత్యానృతం తు వాణిజ్యం తేన చైవాపి జీవ్యతే,
సేవా శ్వవృత్తిరాఖ్యాతా తస్మాత్తాం పరివర్జయేత్." ౬

మను. ౪ అధ్యా.

"అబాధితస్థానేషు పథి వా క్షేత్రేషు వా ప్రతిహతావకాశేషు యత్ర యత్రౌషధయో విద్యంతే తత్ర తత్రాంగుళిభ్యాం ఏకైకం కణం సముచ్చయిత్వేతి శాఖాయనదర్శనాత్ ఏకైకధాన్యాది గుటికోచ్చయముంఛః, మంజర్యాత్మకానేకధాన్యోచ్చయనం శిలః." అని కుల్లూకభట్టు.

ఈస్మృతులప్రకార మీవృత్తి రామునియందుఁ గౌసల్యయారోపించెను. ఇది సరిపడదు. అడవులలో వరిపండు క్షేత్రము లెందుండును? కావున నిట నుంఛ మనఁగా వృక్షములక్రిందఁ

బడియున్న పండ్లు వెదురుపొదలక్రింద రాలినధాన్యము మొదల గునవి అని యర్థము చేయవలెను. పట్టభద్రుఁ డిట్టి నీచవృత్తి జీవింపవలసివచ్చెఁగదా యనియే కౌసల్య యాశయము. రాముని సేవకులు మృష్టాన్నమును భుజింతురుగదా. అట్టినాథుఁడు వనముల మూలఫలముల నెట్లు భుజించునని కౌసల్య వగచెను. ఇపుడు కౌసల్యను మహామాయ యావరించినది. కాని భగవద్దర్శనమహాఫల మూరకపోలేదు. ఆమాటలసందడిలో నాథుఁడు అను లోనగుపదములు దొరలెను. భగవంతునకు నెల్లపదార్థములు ప్రియములేకదా యనుభావ మామెకుఁ బొడకట్టదయ్యెను.

"కైకేయ్యా వంచితో రాజా మయి చారణ్యమాశ్రితే,
భవత్యా చ పరిత్యక్తో న నూనం వర్తయిష్యతి. ౧౧
భర్తుః కిల పరిత్యాగో నృశంసః కేవలం స్త్రియాః,
స భవత్యా న కర్తవ్యో మనసాపి విగర్హితః. ౧౨
యావజ్జీవతి కాకుత్స్థః పితా మే జగతీపతిః,
శుశ్రూషా క్రియతాం తావత్సహి ధర్మస్సనాతనః." ౧౩

అని రాముఁడు తల్లికిం దెల్పెను. ఈపల్కులు శ్రీరాముని సర్వజ్ఞత్వమును ధర్మనిరతిని దెల్పుచున్నవి. తల్లీ! కైక రాజును వంచించెను. నేనడవుల కరుగుచున్నాఁడను. నీవుకూడ నాయనను వదలిపెట్టి నాతోడవచ్చిన మృతినొందును. నిజము. అనఁగా భావమేమి? కైకేయీవచనరూపమునఁ దండ్రి కర్మమే వంచించెను. నేనిట నుండను. నీవును నావలెనే వదలిపెట్టరాదు. తండ్రి జీవింపఁడు. నిశ్చయము. పుత్త్రశోకమున మృతినొందుమన్న శాపరూపకర్మ మూరకపోదు. నే నాకారణమున ననఁగా నేను జెంతనుండఁగా మృతినొందుసత్కర్మమును దశరథుఁడు

చేయలేదని తాత్పర్యము. నీవు నాతోడవచ్చు కర్మముచేయ లేదు. పతి మృతిం గాంచి దుఃఖించుదుష్కర్మము నొనరించితి వని సారము. నేనడవులకుఁ బోయినతర్వాతఁ దండ్రి మృతి నొందును. నీవు చెంతనుందువు. అనియేకదా శ్రీరాముని యుప దేశము. ఈధోరణిలో లోకులకు నీతిని దెల్పుచున్నాఁడు. పతిని విడనాడుట స్త్రీలకుఁ బాపహేతువు. అట్టిపాపకార్యము పెద్దలు గర్హించుదానిని దల్లి నీవు మనస్సుచేతను జేయరాదు. అనఁగా నీవడవులకుఁ బోవలయునని మనస్సునఁగూడ నాలోచింపకుమని భావము ఈవాక్యమే

"ఉన్మత్తం పతితం క్లీబమబీజం పాపరోగిణం,
న త్యాగోఽస్తి ద్విషంత్యాశ్చ న చ దాయాపవర్తనం." ౭౯

మను. ౯ అధ్యా.

"స్త్రీభిర్భర్తృవచః కార్యమేష ధర్మః పరస్త్రియాః,
అశుద్ధేస్సంప్రతీక్ష్యో హి మహాపాతకదూషితః." ౭౭

యాజ్ఞవల్క్యము.

"గృహవాసస్సుఖార్థోఽహి పత్నీమూలం చ తత్సుఖం,
సా పత్నీ యా వినీతా స్యాచ్చిత్తజ్ఞా వశవర్తినీ. ౭
అనుకూలా త్వవాగ్దుష్టా దక్షా సాధ్వీ పతివ్రతా,
ఏభిరేవ గుణైర్యుక్తా శ్రీరేవ స్త్రీ న సంశయః. ౧౨
ప్రహృష్టమనసా నిత్యం స్థానమానవిచక్షణా,
భర్తుః ప్రీతికరీ యా తు భార్యా సా చేతరాజరా. ౧౩
శిష్యో భార్యా శిశుర్భ్రాతా పుత్రో దాసస్సమాశ్రితః,
యస్యైతాని వినీతాని తస్య లోకే హి గౌరవం. ౧౪
ప్రథమా ధర్మపత్నీ తు ద్వితీయా రతివర్ధినీ,
దృష్టమేవ ఫలం తత్ర నాదృష్టముపపద్యతే. ౧౫

ధర్మపత్నీ సమాఖ్యాతా నిర్దోషా యది సా భవేత్,
దోషే సతి న దోషస్స్యాదన్యా భార్యా గుణాన్వితా. ౧౬
దరిద్రం వ్యాధితం చైవ భర్తారం యావమన్యతే,
శునీ గృధ్రీ చ మకరీ జాయతే సా పునః పునః." ౧౭

దక్షస్మృతి. ౪ అధ్యా.

అనునీ మొదలగుస్మృతులకు నాధారమని తెలియును. భర్త ప్రాణములతో నుండునంతదనుక నీవు శుశ్రూష చేయుచుండ వలయును. అదియే సనాతనధర్మము. అను నీవాక్యసారమేమి? నీయింటనే నాతండ్రి మరణించును ప్రాణములుపోవుదనుక సేవ చేయుచుండుము. నీయాచారమే సనాతనధర్మము కాఁగల దనియే ఇదియే స్త్రీధర్మరూపమగు శ్రీరామోపదేశము. దీనినే స్మృతులు గ్రహించినవి. ఈయుపదేశరూపధర్మము వివాహ కాలమునందే కన్యలమది నెలకొన్నచో దాన నెంతసౌఖ్యము వారలకుంగల్గునో యోజించినఁ దేటపడఁగలదు. వీఁడు పోయిన మఱియొకఁడు మగఁడు దొరకునన్నభావము నెలకొనిన నాదాంపత్యమున నేమాత్రము సుఖముండునో తెలియఁగలదు. పతిక్షేమమునే కోరుటకుఁ బ్రధానకారణము పత్యంతరా లాభమేగాక మఱేమి?

"ఏవముక్తా తు రామేణ కౌసల్యా శుభదర్శనా,
తథేత్యువాచ సుప్రీతా రామమక్లిష్టకారిణం." ౧౮

అని మూలము. శుభదర్శనా = శుభప్రదమగు దర్శనముకలది. అనఁగా భగవద్దర్శనముకంటె శుభ మెద్ది?

"సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ,
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః." ౫౨

అన్న గీతావాక్యఫల మిదియేకదా. ఆఫలము ననుభవించినది కనుకనే కౌసల్య యట్లే యొనరించెదనని మహాప్రీతిచే వచించెను. అక్లిష్టకారిణమ్ = కష్టమును గల్గింపనివాఁడు. అనఁగా సంసారసంతాపములు భక్తులకు నంటకయుండఁ జేయువాఁడనుట.

"అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః,
మామాత్మపరదేహేషు ప్రద్విషంతోఽభ్యసూయకాః. ౧౮
తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్,
క్షిపామ్యజస్రమశుభా నాసురీష్వేవ యోనిషు." ౧౯

గీత. ౧౬ అధ్యా.

అన్న భగవద్వాక్యము ననుసరించి తన్ను నాశ్రయింపక కేవలాహంకారాది దుర్గుణవిశిష్టులగువారల ననఁగాఁ బరహింసాదిరూపానేకదుష్కర్మముల నాచరించినవా రధఃపతితులగుదురనియు నట్లుగాక సత్కర్మముల నాచరించుచు ఫలములను గోరనిభక్తులను సంసారకూపమునుండి యుద్ధరించువాఁడనియు సారము తేలుచున్నది. కనుకఁ బరాత్పరు నాశ్రయించినవారలకు సంసారదుఃఖము లంటవని భావము. అట్టి శ్రీరామునిగన్న కౌసల్య కాకుమారుఁడు కష్టములను గల్గించునా?

"ఆసాం రామసపత్నీనాం వస్తుం మధ్యే న మే క్షమం,
నయ మామపి కాకుత్స్థ వనం వన్యాం మృగీం యథా." ౧౯

ఇది కౌసల్య పలికినవచనజాలము. దీనిసార మేమనఁగాఁ దనయందీర్ష్యగలవారినడుమ నుండుటకంటె నరణ్యగమనమే బాగుననదియే. పరస్పరదర్శనము లేకపోయిన మది నలముకొనియున్న క్రోధాదులు క్రమముగా ణించును. చూచుచు

నుండిన నితరేతరదుష్కర రక్షులు పెనఁగి మఱింత బాధించును. కావుననే కౌసల్య రికడ నుండుటకంటె నడవులకుఁ బిలుచుకొనిపొమ్మని యాచించెను. అందు జింక యడవియం దెట్లు సుఖముగా నుండునో నేను సుఖముగా నుందును. దీని సారమేమి? ఏవ్యక్తి తన కీర్ష్యాదులు కలుగఁజేయునో అట్టివ్యక్తి లేనితావున నుండుటయే సుఖము. అనఁగా నీర్ష్యాదులు లేక యుండుకాలమే సుఖమని సారతరార్థము. అయోధ్యలోనుండి భర్తకు సేవచేయుదునని చెప్పిన కౌసల్య మరల నిట్లు పలుకు టసంగతముకాదా యని ప్రశ్నింపవచ్చును. ఇది రామచరిత్రము. ఈకావ్యమూలమున నెన్నియోనీతులను లోకులకుఁ దెలుపుటయే మహర్షికృత్యము. పైనవ్రాసిననీతి వేఱొకమార్గమున దెలుప వలనుపడలేదు. కావున నామె పుత్త్రవాత్సల్యమున రామచంద్రుని వదలియుండఁజాలక యడిగె నను కారణమున నీనీతి లోకులకుం దెలిపెనని మనము గ్రహింపవలయును. ఈ యర్థము దీనికిఁబూర్వమునఁ గలశ్లోకమున

"ఉవాచ పరమార్తా తు కౌసల్యా పుత్త్రవత్సలా."

అని మహర్షి ప్రయోగించియే యున్నందున నద్దానిమూలమున మనము గ్రహింపవచ్చును.

"తాం తథా రుదతీం రామో రుదన్ వచనమబ్రవీత్." ౨౦

అని మూలము. ఇది శ్రీరామునిమానవత్వమునే ప్రకటించుట లేదా యని కొందఱు ప్రశ్నింపవచ్చును. వారు లోకస్వభావ మెఱుంగనివారే యనవలయు. దుఃఖమున విలపించుతల్లి తన వలెనే దుఃఖించుప్రియపుత్త్రునిదుఃఖము నోర్వఁజాలదు. తా నాదుఃఖము నడంచుకొని కొడుకు నాశ్వాసించును. ఇది ప్రత్య

తుము. కావున శ్రీరాముఁడు స్వీకృతదుఃఖము నభినయించెను. అంతియకాని శ్రీరామునకు దుఃఖమెక్కడిది? మాయామానుషవేషుఁడుకదా రాముఁడు. ఈవిషయమును మది నెంచినచోఁ బై ప్రశ్నమున కవకాశమే దొరకదు.

"జీవంత్యా హి స్త్రియా భర్తా దైవతం ప్రభురేవ చ,
భవత్యా మమ చైవాద్య రాజా ప్రభవతి ప్రభుః. ౨౧
న హ్యనాథా వయం రాజ్ఞా లోకనాథేన ధీమతా,
భరతశ్చాపి ధర్మాత్మా సర్వభూతప్రియంవదః. ౨౨
భవతీమనువర్తేత స హి ధర్మరతస్సదా,"

అని మూలము.మరలమరలఁ గౌసల్యకు స్త్రీధర్మములను రాముఁడుపదేశింపఁబూనెను. సపత్నులనడుమ నుండఁజాల నన్నమాటకు బదులుచెప్పెను. భరతుఁడు ధర్మాసక్తిగలవాఁడు. కావున నిన్ననుసరించి వర్తించును. అనఁగా నీయాజ్ఞానువర్తియే యగునని భావము. అనఁగా రాజుగా నుండఁడని సారము. పాదుకాపట్టాభిషేక మీమాటచే రాముఁడు సూచించెనని కొందఱందురు.

"యథా మయి తు నిష్క్రాంతే పుత్రశోకేన పార్థివః. ౨౨
శ్రమం నావాప్నుయాత్కించిదప్రమత్తా తథా కురు,
దారుణశ్చాప్యయం శోకో యథైనం న వినాశయేత్. ౨౩
రాజ్ఞో వృద్ధస్య సతతం హితం చర సమాహితా,"

అని మూలము. భావికాలగతి నీమూలమునఁ దెలిపెను. నేనడవులకుంబోవుదును. కుమారులలో నొక్కఁడైనఁ జెంతనుండక పోగా నాదుఃఖమున రాజు శ్రమమునొందక యుండునట్లు స్థిరమనస్సుకలదానవై యాశ్వాసింపుము. ఈవిషయమునఁ బ్రమా

దపడకుము. అని రాముఁడు హెచ్చరించెను. దీనిచే భరతశత్రు
ఘ్నులు రాకమునుపే నేను లక్ష్మణుఁడు నడవులకుఁ బోఁగా
రాజు మృతినొందఁగలఁడు. నీవు యోగనిష్ఠగలదానవు. కనుక
మనశ్శక్తి నుపయోగించి యతనికి శ్రమము కలుగక యుండఁ
జేయుమనియే రామచంద్రుఁడు తెలిపెననియే యిటఁగలసా
రము. ఈవిషయమున నప్రమత్తురాలవుకమ్మని తల్లిని శ్రీరా
ముఁడు హెచ్చరించెను. అనఁగా నీయింటనే యుండుము. ఏమి
కష్టముకలిగినను నీవే హితభూతురాలవగుదువు. కావున మర
ణకాలమున రాజుచిత్తము శ్రమంపడక యుండఁజేయుము.
తల్లీ! పుత్త్రశోకము దుర్భరముసుమీ. ఆరాజును దహింపక
యుండ నాశ్వాసింపుము అందును వృద్ధువు మృతినొందుదనుక
హితమొనరింపుము. అనునదియే యీభాగమునఁ గలముఖ్యా
ర్థము. "పుత్త్రమంతే చ కర్మణి" అన్న సూక్తి రాజునందు వ్యర్థ
మయ్యెను. మేము నలువురము కొడుకులముండియు నతఁడు
మరణకాలమున మమ్ముఁ దలంచుకొనుచు దుఃఖింపవలసినఘోర
కర్మము నొనరించెను. తత్ఫల మనుభవింపక వదల సాధ్యము
కాదు. అనుటచేఁ గర్మఫల మెంతవారికే ననుభవమునకు రాక
తప్పదని తెలుసు. ఈయుపదేశమున శ్రీరామమూర్తి తనసర్వ
త్త్వమును కర్మఫలానుభవమహత్త్వమును దేటపఱిచెను.

వ్రతోపవాసనిరతా యా నారీ పరమోత్తమా. ౨౫
భర్తారం నానువర్తేత సా తు పాపగతిర్భవేత్,
భర్తృశుశ్రూషయా నారీ లభతే స్వర్గముత్తమం. ౨౬
అపి యా నిర్నమస్కారా నివృత్తా దేవపూజనాత్,
శుశ్రూషామేవ కుర్వీత భర్తుః ప్రియహితే రతా. ౨౭
ఏష ధర్మః పురా దృష్టో లోకే వేదే శ్రుతస్స్మృతః."

అని స్త్రీధర్మముల శ్రీరామమూర్తి యుపదేశించెను. దీనిసార మేమనఁగా నెవతుకగాని ప్రధానధర్మమునుమాని యప్రధాన ధర్మముల నెన్నింటి నాచరించినను ఫలము శూన్యమనియుఁ, బ్రధానము నాచరించి యప్రధానముల వదలినను ఫలము కలుగుననియు నీభాగమునఁ గలసారము. స్త్రీలకుఁ బతిహితకర్మ సమాచరణమే ప్రధానము. దాని మాని యెన్నియుపవాసాది వ్రతముల నాచరించినను బుణ్యము కలుగకపోఁగాఁ దుదకుఁ బాపమే కలుగును. పెద్దల గౌరవింపక దేవతలఁ బూజింపక భర్తకు శుశ్రూష వదలక చేసిన నుత్తమగతి కర్హురాలగును. ఇదియే ధర్మము. వేదవిహితము స్మృతిసమ్మతము. లోకమున నెందఱో పతివ్రత లాచరించినట్లు కనఁబడును. అని శ్రీరామమూర్తి యుపదేశించెను. పలుసారు లీధర్మముల నారాముఁ డుపదేశించుటచేత స్త్రీమూలము ధర్మమని తెలియఁగలదు.

"స్వాం ప్రసూతిం చరిత్రం చ కులమాత్మానమేవ చ,
స్వం చ ధర్మం ప్రయత్నేన జాయాం రక్షన్ హి రక్షతి. ౭
ప్రజనార్థం మహాభాగాః పూజార్హా గృహదీప్తయః,
స్త్రియశ్శ్రియశ్చ గేహేషు న విశేషోఽస్తి కశ్చన. ౨౬
అపత్యం ధర్మకార్యాణి శుశ్రూషారతిరుత్తమా,
దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ. ౨౮
పతిం యా నాభిచరతి మనోవాగ్దేహసంయతా,
సా భర్తృలోకానాప్నోతి సద్భిస్సాధ్వీతి చోచ్యతే. ౨౯
వ్యభిచారాత్తు భర్తుస్స్త్రీ లోకే ప్రాప్నోతి నిన్ద్యతాం,
సృగాలయోనిం చాప్నోతి పాపరోగైశ్చ పీడ్యతే." ౩౦

మను. ౯ అధ్యా.

అను మనుస్మృతివాక్యములసారము కూడ శ్రీరామోక్తిసార మేకదా.

"అధర్మాభిభవాత్కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః,
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః." ४०.

అని యర్జునుఁడుకూడ స్త్రీలు వ్యభిచరింతురే యని భయపడెను. శ్రీకృష్ణమూర్తి దాని నంగీకరించెను. బదులుచెప్పక పోవుటయే యందులకు నిదర్శనము.

లోకమున స్త్రీలమూలముననే ధర్మము నిలువవలయును. సదాచారములు నశ్లే పురుషులు ధర్మమూలభూతు రాండ్రగు స్త్రీలను గడుజాగరూకులై కాపాడవలసియుండును. వారికిఁ గఱపువిద్యకూడ ధర్మవిధ్వంసనక్షమమైనదిగ నుండరాదు. దైవభక్తి పెంపొందింపఁజేయునదిగా నుండవలయును. దాన సదాచారములు రూపుమాయక నిలుచును. నీతి సదాచార మూలము. సదాచారములు నశించిన నీతియు నశించును. దాన వంశగౌరవములు ‑ణించును. అది మానవత్వమునే నిర్మూలించును. కావునఁ దోఁచినట్లు ధర్మమును దాఱుమాఱుచేయఁ బూనరాదు. సదాచారము లేల యని బలవంతముగనైన స్త్రీలకనాచారములు నేర్పరాదు. దూరదృష్టిలేక యిష్టానుసారముగ ధర్మములను మార్చినఁ దీఱనిచేటు వాటిల్లును. కనుక నీకాలపువారు శ్రీరామోపదేశమునైన మది నిలిపి హితముగాఁ బ్రవర్తిల్లుట శ్రేయోదాయకమని యీభాగమునుండి నేర్చుకొనవలయును.

"గచ్ఛ పుత్ర త్వమేకాగ్రో భద్రం తేఽస్తు సదా విభో,
పునస్త్వయి నివృత్తే తు భవిష్యామి గతక్లమా.

ప్రత్యాగతే మహాభాగే కృతార్థే చరితవ్రతే. 34
పితురానృణ్యతాం ప్రాప్తే త్వయి లప్స్యే పరం సుఖం,
కృతాంతస్య గతిః పుత్ర దుర్విభావ్యా సదా భువి. 35
యస్త్వాం సంచోదయతి మే వచ ఆచ్ఛిద్య రాఘవ.''

అని మూలము. కౌసల్య రాము నాశీర్వదించుచున్నది. వత్సా! మనోవ్యాకులముల నొందకపొమ్ము. ఇక్కడిదుగఖమునకుఁ జోటీయక సంతుష్టమనస్కుఁడవై పొమ్మని భావము. సర్వదా నీకు మేలగుఁగాక. నీవు మరలి రాఁగా నాకష్టములు నివర్తించును. పితృఋణముతీర్చుకొని నీవు రాఁగాఁ గాంచి నిరుపమానసుఖము నొందుదును అనఁగా నిన్నుఁ గన్నులారఁ గాంచుటయే మహానందమని భావము. నాయనా! నామాట జవదాఁటని నిన్ను మార్చివేసినదే. ఇఁక దైవగతికంటె మిక్కిలి యేది గలదు? అనఁగా సారమేమి? లోకమున దైవగతినాపగల దేదియులేదు. దైవగతి యనఁగాఁ గర్మఫలమనియే భావము. దాని నాపువా రెవ్వరుండుదురు? సర్వేశ్వరుఁడు కర్మస్వరూపుఁడు. తదితరులు కర్మబద్ధులు. కావునఁ గర్మగతి దుర్నివారకమని తాత్పర్యము. "గహనా కర్మణో గతిః" అన్న సూక్తి భగవంతునిదేకదా. ఎన్ని విధముల నూహించినను పౌరుషమునకంటె దైవమే యుత్కృష్టతమ మనువిషయమే మనము గ్రహింపఁదగును. ఇట్టు లీభాగము మనకెన్నియోవిషయములను బోధించుచున్నది. కావున శ్రద్ధగాఁ బఠించి యందలిసారమును గ్రహించి దాని నెంతదనుక మనయలవాటున నుండఁజేయ శక్యమో యట్లు చేసికొనవలెను. అదియే రామాయణఫలము. కాని పారాయణ మాత్రమున సంపూర్ణఫలము చేకూరదు. ఇఁకఁ దరువాతి కథను బఠింతము.

౩ కౌసల్య కుమారు నాశీర్వదించుట.

*మంచిమనస్సుగల యాకౌసల్య దుఃఖానుభవమువలని యాయాసమున గలిగిన యశుచిత్వమును బోఁగొట్టుకొనఁగోరి జలముల నాచమనముచేసి కుమారు నాశీర్వదించెను. రఘువంశోద్ధారకా! నిన్ను నిందే నిలుపుటకు నాకు శక్యముకాలేదు. నీవు కోరినట్లే యడవుల కరుగుము. నియతకాలము దాఁటగనే యాలసింపక రమ్ము. పిదపఁ గ్రమముగాఁ బెద్దలయాచారము ప్రకారము పట్టాభిషిక్తుఁడవుకమ్ము. రామా! కోఱంతవడనినియమమున నీ వేధర్మము ననుసరింప నెంచితివో యాధర్మమే సకల దిశల నిన్ను రక్షించుఁగాక. నీవు చైత్యములయందు దేవాగారములయం దే దేవతలకు నమస్కరించుచుందువో వారే వనముల ఋషులతోఁగూడ నెల్లభంగుల నిన్నుఁ గాపాడుదురుగాక. ప్రతిభాశాలియగు విశ్వామిత్రుఁడు నీకు నుపదేశించిన మహాస్త్రములన్నియు నిన్ను సంరక్షింతురుగాక. నీపితృమాతృశుశ్రూషలు సత్యవ్రతము నీకేకష్టములు గలుగకయుండఁ గాపాడుఁగాక. దీర్ఘాయుష్మంతుఁడవగుము. వనముల సంచరించునపుడు ప్రమాదమున నీవలనఁగలిగిన ప్రత్యవాయము నోర్చుకొనుచు నందుఁగల తటగుల్మలతాదులు వనస్పతులు పక్షులు సర్పములు పర్వతాదులు నిన్ను రక్షించుఁగాక. సాధ్యులు లోనగు దేవతాభేదములు నీకు శుభములిచ్చుఁగాక. ధాతృవిధాతలు సృష్టికర్తయగు బ్రహ్మాయు నీకఖిలశుభముల నిత్తురుగాక. సూర్యద్వాదశకమునఁ గలపూషయు భగార్యములు నీకు శుభము లొసంగుదురుగాక. ఇంద్రాదిదిక్పాలకులు నీకు సర్వదా శుభ

* ఇయ్యది యిరువదియైదవసర్గమునుండి కైకొనఁబడినది.

ప్రదులగుదురుగాక. ఋతుపక్షమాససంవత్సర దివారాత్రిరూప కాలము నిన్ను రక్షించుచుఁగాక. కుమారా! ధ్యానము పరిపక్వ మగుయోగము ధర్మము నిన్నెల్లభంగులఁ గాపాడుఁగాక. కుమార చంద్రబృహస్పతులు సప్తర్షులు నారదాది దేవర్షులు నిన్నెల్లతావులఁ గాపాడుదురుగాక. దిక్కులు దిక్పాలకులు నాచేయుస్తుతులకు దయగలిగి వనముల నిన్నే మఱక రక్షింతురుగాక. కులపర్వతసముద్రములు కుబేరవరుణులు భూమ్యాకాశములు నదులు నక్షత్రములు కుజాదిగ్రహములు వానియం దభిమానముగల దేవతలు నహోరాత్రములు సంధ్యలు నడవుల నిన్నే మఱక కాచుచుందురుగాక. పవిత్రములగుఋతువు లాఱు మాససంవత్సరములునీకు సుఖమొసంగుదురుగాక. మతిమంతుఁడవై జనకు నసుమతిం గొని మునివేషమును దాల్చి గహనమునఁ జరించు నీకు సురాసురులు మేలుగూర్తురుగాక.

శ్రీరామచంద్రా! క్రోధాటోపమున, క్రూరకర్మరతిగలిగిన రాక్షసపిశాచములవలన మఱియుఁ గ్రూరమృగంబులవలనను నీకు భీతి రాకుండుఁగాక. అరణ్యానియందు వానరములు వృశ్చికములు వనమక్షికములు దోమలు పాములు నితరకృములు నిన్నుఁ బీడింపకయుండుఁగాక. కుమారా! వన్యగజసింహవ్యాఘ్ర భల్లూకప్రముఖదంష్ట్రాయుధమృగములు నీకు నపకారము చేయకయుండుఁగాక. మాంసభక్షణాదవృత్తిగల యితర క్రూరజంతువులు నాదేవతారాధనమున నానందించి నిన్ను హింసింపకుండుఁగాక. రామభద్రా! త్రోవలన్నియుఁ గందమూలఫలాదులతో సుఖప్రదములే యగుంగాక. అప్రతిహత పరాక్రమము చెల్లుఁగాక. శుభములం గాంచుచు నడవికిం

బొమ్ము. అంతరిక్షమునఁ దిరుగు దేవతలవలనను దక్కిన దేవతల వలనను నీకు శుభములుగలుగుఁగాక. శత్రువులవలనను నీకు క్షేమే లేకలుగుఁగాక. నేను బూజించుచుండఁగా సంతసిల్లి బృహస్పతి లోనగువారు నీకు మంగళప్రదులగుదురుగాక. నదీస్నానకాలమున నగ్నియు వాయువు హోమాగ్నిధూమము విశ్వామిత్రోపదిష్టమంత్రములు నిన్నుఁ గాపాడుఁగాక. లోకనాథుఁడగు బ్రహ్మయు సర్వప్రాణిపోషకుఁడగు నారాయణమూర్తియు ఋషులు తక్కంగలదేవతలు వనవాసవ్రతమూనిన నిన్నుఁ గాపాడుఁగాక.

అని యీరీతి నాకౌస్యల శ్రీరాము నాశీర్వదించి పూలదండలొసంగి యుచితరీతి దేవతలఁ బూజించెను. రామాభ్యుదయార్థము హోమముచేయించెను. హోమార్థము శ్వేతపుష్పహారములు, సమిధలు, తెల్లనియావాలు తెప్పించి యీయఁగా నావిప్రుఁడు కష్టఫలనిరసనార్థము విశేషించి యారోగ్యప్రాప్త్యర్థము విధ్యుక్తముగా హోమముచేసెను. శిష్టహవిస్సుచేత బహిర్బలిగావించెను. తేనె లోనగుపదార్థములను బ్రాహ్మణుల కొసంగి పుణ్యాహవాచనముచేయించి వనమున మంగళములు గలుగఁజేయుమంత్రములం జదివించెను. కీర్తిమంతురాలగు నా కౌసల్య యాఋత్విజునకు వాంఛానురూపదక్షిణల నొసంగి కుమారునితో నాయనా! దేవతానమస్కృతుఁడగు దేవేంద్రునకు వృత్రాసురుఁడు నశింప నేమంగళమొదవెనో యామంగళములు నీకుం గలుగుంగాక. పూర్వము వినతకుమారుఁడు గరుత్మంతుఁడు దేవలోకమున కమృతముం దీసికొనిరాఁబోవుతఱి నే యాశీర్వచనముచేసెనో యది నీకు లభించుఁగాక. సముద్ర

మథనమున నదితి కుమారుఁడు దేవేంద్రునకు రాక్షససంహారార్థ మేదీవనల నొసంగెనో ఆశుభాశీర్వాదఫలము నీకిపుడు గలుగుఁగాక. శ్రీమహావిష్ణువు త్రివిక్రమావతారమునందు మూఁడడుగు లిచ్చునపు డేయాశిషము లొసంగెనో యాశుభాశీర్వచనఫలము నీకుంగలుగుంగాక. శుభవస్తువులను మఱియు శుభవంతములుగాఁ జేయు వసంతాదిషడృతువులు సముద్రములు ద్వీపములు వేదములు స్వర్గలోకాదులు దిశలు నీకు మేలుఁగూర్చుఁగాక.

ఇట్లు లావిశాలాక్షి కొడుకును దీవించి యతనితలపై నక్షతలునిచి గంధముపూసి విశల్యకరణి యనుమూలికనురక్షగా రామునికరమునకుం గట్టెను. ఆమూలిక ఫలముగలిగించునంత శక్తికలది. లోనఁగలశల్యములను వెలుపలికిఁ దీయఁగలదియు నగు. ఆరక్షను రక్షామంత్రముల నభిమంత్రించెను. దుఃఖవశంవదయైనను బ్రయాణముచేయునపు డది యమంగళమగునని తలఁచి మనస్సున సంతోషములేకున్నను వాక్కున నానందించు నట్లు గనంబడుచు గద్గదవాక్కుల నారాముని యుత్తమాంగము వంచి మూరుకొని యాలింగనముచేసికొని వత్సా! ధన్యుఁడవై సుఖముగాఁ బొమ్ము. నిరోగుఁడవై సుఖముగా నయోధ్యకునచ్చి రాజ్యమును స్థిరముగాఁ బాలించుచుండఁగాఁ గన్నులారఁ గాంచఁగలను. నీవు మరలి రాఁగా నాదుఃఖములెల్ల నశించి మోమున సంతోషము నివ్వటిల్ల సంపూర్ణచంద్రబింబము తోఁచినట్లు నిన్నుఁ జూడఁగలను. పితృనానతి నెఱవేర్చి యడవి ండివచ్చి సింహాసనము నధిష్ఠించియుండ నానందమునఁ జూడఁ గలను. వనమునుండి యరుదెంచి రాజోచితములగువస్త్రాభరణ

ములఁ దాల్చి నీవు నాకును నాకోడలికిని సర్వదా సంతోష మును గలిగించుచుండుము. ఇప్పుడు దండకాటవుల కరుగుము. నేనిపు డారాధించు దేవతలు లోనగువారెల్లఁ దృష్టినొంది వనమునకరుగు నీకుఁ జిరకాలము హితముగోరుచుందురుగాక. అని యిట్లు లాకౌసల్య కన్నీటిధారలు ప్రవహింపఁగా నాశీర్వ దించి రక్షార్థ మాతనిచుట్టును దిరిగి కౌఁగిలించుకొనియె. అంత రామచంద్రుఁడు తల్లిపదములు మరలమరల నమస్కరించి మానవతను సహజమగువిచారముకలిగినను నిరుపమానతేజో రాశి గావున నించుకయు మోముకాంతి తగ్గకయుండఁగా సెలవుతీసికొని సీతాదేవికడకుం బోయెను.

మహాశయులారా! ఈభాగమున మన మెఱుంగఁదగిన విషయములు కొన్నిగలవు. వాని నెఱుంగుటయే ముఖ్యము. కౌసల్య రామునకు మేలుగలుగవలయునని దీవించెను. భగ వంతుఁడని యెఱింగియుమాయామోహితయగుట సామాన్యుఁ డనియే భావించి మాత గావున దీవించెను. ఇందన్నియుఁ బునరుక్తతాదోషమున కుదాహరణములుగ నే కన్పట్టును. కాని యది పుత్రునియందుఁ గలవాత్సల్యాతిశయమునను దద్విరహ వేదనచేతను బలికినపలుకులని భావించుచో నాదోష మదృశ్య మగును. ఇందుఁగలవిశేషము లేవని విచారింతము.

"శ్రీఘ్రం చ వినివర్తస్వ వర్తస్వ చ సతాం క్రమే.
యం పాలయసి ధర్మం త్వం ధృత్యా చ నియమేన చ,
స వై రాఘవశార్దూల ధర్మస్త్వామభిరక్షతు." 3

అని మూలము. 'సతాం క్రమేచ వర్తస్వ' అనునది విధివాక్య ముగా గ్రహింపఁదగు. నీపూర్వు లేరీతిగా నడచిరో యా

మార్గమునసే. అనఁగా భరతుఁడే రాజ్యమేలుఁగాక యని యనరాదు. జ్యేష్ఠుఁడు పట్టాభిషిక్తుఁడు కాఁదగునన్నదియే పూర్వమార్గము. దాని ననుసరింపుమని హెచ్చరించెను.

"స్వధర్మమపి చావేక్ష్య న వికంపితుమర్హసి,
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే. 31
యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతం,
సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశం." 32

గీత. 2 అధ్యా.

అను నీగీతావాక్యములుకూడ నీయర్థమునే తెలుపుచున్నవి.

"సహజం కర్మ కౌంతేయ సదోషమపి న త్యజేత్,
సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః." 48 గీ. 18 అ.

అన్న శ్రీకృష్ణవాక్యము పైనివ్రాసినభావమునే తెలిపెడిని. నిరంతరప్రీతిచే నియమముచే నీవేధర్మమును బాలించుచున్నాఁడవో యది నిన్నుఁ గాపాడుఁగాక.

"ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః,
తస్మాద్ధర్మో న హంతవ్యో మానో ధర్మో హతోఽవధీత్." 15

మను. 8 అ.

అను నీమనుస్మృతిభావమునే రామాయణ ముపదేశించెను. ఇట్టు లాకౌసల్య తెల్పెనుగదా. ఇందుఁ గలవిశేషమేమి? భగవంతుఁడు ధర్మస్వరూపుఁడు. ఇతరు లెవరు రక్షింతురు? ఆపరమేశ్వరు నతఁడే రక్షించుకొనును. అనఁగా ధర్మమే నీయాకారము. నిన్నొరు లెవరు రక్షింపఁగలరు? అనుభావ మిందుఁ గలదు.

"వృషో హి భగవాన్ ధర్మ స్తస్య యః కురుతే హ్యలం,
వృషలం తం విదుర్దేవా స్తస్మాద్ధర్మం న లోపయేత్." ౧౬ మ. ౮ అ.

అనుస్మృతి పై భావమును దృఢపఱచెడిని.

"యేభ్యః ప్రణమసే పుత్త్ర చైత్యేష్వాయతనేషు చ,
తే చ త్వామభిరక్షంతు వనే సహ మహర్షిభిః." ౪

అని మూలము. చైత్యమనఁగా నాలుగుత్రోవలు కలియుచోట నున్నమహావృక్షము. దానిచుట్టు వేదికనిర్మించియుందురు. వానికి బ్రదక్షిణక్రమమునఁబోవుట శ్రీరామునలవాటులలోనొకఁడు. మహావృక్షముల నాశ్రయించి దేవతలుందురు.

"యే వృక్షేషు సస్పింజరా నీలగ్రీవా విలోహితాః."

అని వేదము తెల్పుచున్నది. అట్టితావులఁ గ్రీడాదులు జరపరాదనియు నట్టియకృత్యముల నొనరించినచో నందుఁగల దేవతలు వారల హింసింతురనియు భావము. అట్టి మహావృక్షములం గాంచినపుడు శ్రీరామమూర్తి నమస్కరించుట యితరుల కాసదాచారము నేర్పుటకే. దేవమందిరములకుఁగూడ నట్లే నమస్కరించును. అట్టివెల్ల నిన్నుఁ గాపాడుఁగాక యని యాశీర్వదించెను. లోకమున కుపకారముచేయువస్తువులెల్ల భగవన్మయములే. అనఁగా నందు భగవత్కళ విశేషించి యుండునని భావము.

"యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి,
తస్యాహం న ప్రణశ్యామి స చమే న ప్రణశ్యతి." ౩౦ గీత. ౬ అ.

అన్న శ్రీకృష్ణోపదేశ మిదియే. శ్రీరాముఁ డాచరించిచూపెను. శ్రీకృష్ణుఁ డద్దానినే యుపదేశించెను. వృషాదులనుగూడ భ

వన్మయములుగా భావించువాఁడే యోగి. అట్టి యోగసిద్ధి లేకపోయినచో విద్యవలన లాభము లేదని సారము.

"తద్బుద్ధయ స్తదాత్మాన స్తన్నిష్ఠా స్తత్పరాయణాః,
గచ్ఛంత్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః. ౧౭
ఇహైవ తైర్జితస్సర్గో యేషాం సామ్యే స్థితం మనః,
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తే స్థితాః." ౧౯
గీత. ౫. అ.

అను నీగీతావచనములు పైభావమునే విస్తరించుచున్నవి. పూర్వులు చెట్లకుఁ గొండలకు మ్రొక్కుదురని దూషించువారు విజ్ఞానసంపద్విరహితులని తేలకపోదు. సర్వము భగవన్మయముగా భావించుటయే వారిలక్ష్యము. పాషాణవిగ్రహములయందు భగవంతుఁడు వెలసియున్నవాఁడని విశ్వసించువారికంటె వృక్షాదులు భగవన్మయములని నమ్మువా రుత్తములే యనవలయును. ఈయర్థమునే ఈక్రింది రామాయణశ్లోకములు తేటపఱచుచున్నవి.

"సమిత్కుశపవిత్రాణి వేద్యశ్చాయతనాని చ,
స్థండిలాని విచిత్రాణి శైలా వృక్షాః క్షుపా హ్రదాః,
పతంగాః పన్నగాస్సింహాస్త్వాం రక్షంతు నరోత్తమ." ౭

ఈమొదలగునవియన్నియు నీవిషయమును బోధించునవియే. కాన మరలమరల వ్రాయనక్కఱలేదు.

"గంధైశ్చాపి సమాలభ్య రామమాయతలోచనా,
ఓషధిం చాపి సిద్ధార్థాం విశల్యకరణీం శుభాం. ౩౦
చకార రక్షాం కౌసల్యా మంత్రైరభిజజాప చ."

ని మూలము. రామమూర్తికిఁ దల్లి గంధము పూసి విశల్య రణి యనునోషధిని రక్షార్థము కట్టి మంత్రముల జపించెను.

అనఁగా నేమి! దేవతాధ్యానము చేయునపుడు సాధకుఁడలం కృతగాత్రుఁడై యుండవలయునని శాస్త్రము విధించెడిని- "కృప్తాకల్పస్సంకల్పాకల్పోవా" అని. దీనిచేత నిర్మలినత్వము ముఖ్యమని తేలెడిని. దేహనైర్మల్యమునకంటె మనోనిర్మలత్వము ప్రధానమని సారము. మూలికనుగుఱించి విచారింతము.

"సర్వాకరేష్వధీకారో మహాయంత్రప్రవర్తనం,
హింసౌషధీనాం స్త్ర్యాజీవోఽభిచారో మూలకర్మ చ. ౬౩
ఫలదానాం తు వృక్షాణాం ఛేదనే జప్యమృక్శతం,
గుల్మవల్లీలతానాం చ పుష్పితానాం చ వీరుధాం. ౧౪౨
కృష్ణజానామోషధీనాం జాతానాం చ స్వయం వనే,
వృథాలంభేఽనుగచ్ఛేద్గాం దినమేకం పయోవ్రతః." ౧౪౪

మను. ౧౧ అధ్యా.

అను నీస్మృతివాక్యములననుసరించి యోషధుల నశింపఁజేయుట యుపపాతకమని తెలియనయ్యెడిని. వానియుపయోగముల గుఱించి యించుక వ్రాయఁదగు. ఓషధుల కొక్కొక్కదాని కొక్కొక్క దేవత గలదు. ఆదేవత నారాధింపకయున్న నా యోషధివలన లాభము కన్పట్టదు. దేవతారాధనముల జప ముత్తమము. జపము మంత్రాధీనము. కావున నోషధులవలని లాభములఁ బడయఁగోరువారు తదధిష్ఠానదైవము దగుమంత్ర మును జపించి తదుక్తనక్షత్రవారతిథులు గలిసినకాలమునందు నాయోషధిని బూజించి తదుక్తకాలమునఁ దీసికొనవలయును. అయ్యది ఫలవంతమగును. కొన్ని పగటివేళలయందును గొన్ని రాత్రికాలములయందును వీర్యవంతములుగ నుండును. విపరీత కాలములయందు గ్రహించినను నిష్ఫలములే యవి యగును.

సర్పవృశ్చికాదిబాధలు క్షుత్పిపాసలు రోగములు దుష్టపిశాచ బాధలు మూలికాసంపర్కమున నుండవు. మూలికాప్రయోగ మున సర్పవిషతాపము శాంతించుట సర్వజనవిదితమే. అట్టిశక్తు లనేకములు గలవని నమ్మవలయును. మూలికాప్రయోగపద్ధతి యీకాలమున నడుగంటినది. అదియే ప్రజాదౌర్భాగ్యము. దానిని విడనాడరాదని మన కీభాగము బోధించుచున్నది. ఈవిషయము వరాహమిహిరాచార్యాదులు పెక్కుతెఱంగుల బోధించియేయున్నవారు. ఈవిషయములన్నియుఁ గ్రొత్తవి కావని యీరామాయణమే మనకుఁ దెల్పుచున్నది ఈపూర్వాచా రమునఁ గలుగుఫల మేమనఁగా భగవద్భక్తియే. మూలికాధి ష్ఠానదేవత నారాధించుట భక్తిచేతఁగదా. అది విశ్వాసమూల ముగాదా. ఇట్లు మనపూర్వులయాచారములన్నియు దైవభక్తి మార్గము లగుచుండును. కావున మన మవ్వానిని విడనాడరా దని దృఢసంకల్పులము కావలయును.

"అవదత్పుత్ర సిద్ధార్థో గచ్ఛ రామ యథాసుఖం,
అరోగం సర్వసిద్ధార్థ మయోధ్యాం పునరాగతం. ౪౧
పశ్యామి త్వాం సుఖం వత్స సుస్థితం రాజవర్త్మని,
ప్రణష్టదుఃఖసంకల్పా హర్ష విద్యోతితాననా.
ద్రక్ష్యామి త్వాం వనాత్ప్రాప్తం పూర్ణచంద్రమివోదితం." ౪౨

అని మూలము. ఇది కౌసల్య తెల్పినమార్గము. భగవత్సంకల్పము ఫలోన్ముఖమైనదని యీవాక్కులే తెల్పుచున్నవి. "గచ్ఛ రామ యథా సుఖమ్" ఎట్లు లోకములకు సుఖముగల్గునో యట్టి ప్రయోజనము ఫలించునట్లు పొమ్ము. అనఁగా నీప్రయాణము లోకసుఖము గల్గించునని భావము. సర్వసిద్ధార్థమ్మనఁగా సర్వ

ప్రయోజనములు ఫలింపఁగా నని భావము. నీయవతారప్రయోజనము సఫలముకాఁగా మరలి యయోధ్యకు రాఁగా నిన్నుఁ జూతునని కౌసల్య పలికెను. కుమారా! నాదుఃఖసంకల్పములు నశింపఁగా సంతోషమున నామోము వికసింప వనమునుండి వచ్చిన నిన్ను నుదయించినచంద్రబింబమునువలెఁ జూడఁగలను. అనఁగా సారమేమి? నాకు రాఁగలవైధవ్యాదిదుఃఖములు తుచ్ఛసంకల్పములు నశించును. హర్షముప్పొంగును. నామనస్సు చల్లనగును. అనియే. లోకమున దుస్సంకల్పములు పరమేశ్వరునిధ్యానించువారలకు వరుసఁగా క్షీణించును. అవి క్షీణించినఁగాని హర్షముదయింపదు. అది కలిగినఁగాని మనస్సు చల్లఁబడుట యనఁగా శాంతినొందదు. ఇష్టిఫలములు కలుగుటకుఁ బ్రధాన కారణము పరమేశ్వరునిధ్యానమే.

"ధ్యాయతో విషయాన్ పుంసస్సంగస్తేషూపజాయతే,
సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే. ౬౨
క్రోధాద్భవతి సమ్మోహస్సమ్మోహాత్స్మృతివిభ్రమః,
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి. ౬౩
రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్,
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి. ౬౪
ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే,
ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే. ౬౫
నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా,
న చాభావయతశ్శాంతిరశాంతస్య కుతస్సుఖం." ౬౬ గీత. ౨ అధ్యా.

అను నీగీతావాక్యములు పైవ్రాసినభావమును స్పష్టపఱచుచున్నవి. కౌసల్య భగవంతునిదృఢసంకల్పము తనదుఃఖమును

దోలఁగింపఁగా నిర్మలస్వాంతయై యిట్లు పలికెను. అంతకుముం దున్న దుఃఖము తొలఁగెను. ఆచోట శాంతము పొడుకొని యెను. కావున మానవప్రయత్నమునకంటె దైవమే ప్రబలమని మన కీవాగ్ధోరణి తెల్పుచున్నది.

"మంగళైరుపసంపన్నో వనవాసాదిహాగతః,
వధ్వా మమ చ నిత్యం త్వం కామాన్ సంవర్ధ యాహి భో." ౪౪

అని మూలము. కుమారా! వనవాస మొనరించి పిదప నీయ యోధ్య కరుదెంచి సీతకు నాకును సుఖముం గూర్పుము. ఇఁకఁ బొమ్ము. సీతకు నాకును గలవాంఛల ఫలింపఁజేయు మనఁగాఁ దాత్పర్యమేమి? దుష్టసంహారము శిష్టపరిపాలనము ననుకార్య ములు నెరవేర్చిన సీతాదేవికి విశ్రాంతి చేకూర్పుము. నాకును మనశ్శాంతిని బ్రసాదింపుము. ఇఁకఁ బొమ్ము. అనఁగా నీవు వన వాసముచేసి వచ్చినఁగాని మా యాకోర్కులు ఫలింపవు. కావునఁ ద్వరితముగా నడపులకుం బొమ్మని కౌసల్య తేటపఱి చెను. ఇదియే యిందుఁగలసారము.

"ప్రదక్షిణం చైవ చకార రాఘవం పునః పునశ్చాపి నిపీడ్య సస్వజే." ౪౬

అని మూలము. కౌసల్య రామునకుఁ బ్రదక్షిణము చేసెను. అనఁగా నాలుగు ప్రక్కలు నిర్భయములగుఁగాక యనుసంకల్ప ముతోఁ దిరిగెను. రక్షాబంధనమనఁగా నిదియే. ఇది సంకల్పశక్తి ప్రభావమును దెలిపెడిని. పెద్దలు పిన్నవారి నాశీర్వదించునపుడు నిర్మలమనస్సుతో భగవంతుని ధ్యానించి పిదప నాశీర్వదింపవల యును. ఆధ్యానశక్తిచే మేలుగలుగవలయునుగదా. కావుననే ప్రతికార్యమునందును దొలుత భగవంతుని ధ్యానింపవల యును. పెద్దలయాచారము లిట్టివే. వానిని దృణీకరింపరాదు.

ఏది ప్రధానమో దానిని వదలి తరువాతి కార్యమును జేయఁబూనుట మంచిదికాదు. సంధ్యావందనాదిసత్కర్మముల నాచరించునపుడు తొలుతఁ బ్రాణాయామము చేయవలయు ననువిధి కలదు. మంత్రము నుచ్చరించుచు ముక్కుపట్టుకొనిన లాభమే లేదు. ప్రాణాయామఫలము మనస్సు స్థిరముగా నుండనభ్యసించుటయే. దానిని మాని వేదమంత్రములఁ జక్కఁగా నుచ్చరించిన సంధ్యావందనాదిసత్కార్యములఫలము గలుగఁజాలదు. స్వల్పఫలమే కలుగును. సంకల్పము దృఢము కావలయును. అనఁగా మనస్సు నిర్మలమై యుండవలయుననియే సారము. ఇట్టి సద్విషయముల నందందు నుచితరీతిని వాల్మీకిమహర్షి మనకుఁ గథారూపమున బోధించెనని యెఱుంగవలయును. ఇట్టివిషయములను గ్రహింపక కథనుమాత్రమే తెలిసికొనిన లాభములేదు.

"తథా చ దేవ్యా కృతప్రదక్షిణో
నిపీడ్య మాతుశ్చరణౌ పునః పునః,
జగామ సీతానిలయం మహాయశాః
స రాఘవః ప్రజ్వలితస్స్వయా శ్రియా." ౪౭

అను నీమూలము మనకొకరహస్యమును దెలిపెడిని. దానిం బరికింతము. రాముఁడు తల్లి రక్షాబంధనకార్యము నిర్వర్తింపఁగా నామెకు నమస్కరించి సీతయింటికింబోయె ననునది సామాన్యార్థము. ఇచ్చో మహాకవివాల్మీకి "మహాయశాః" అనువిశేషణము ప్రయోగించెను. నిరుపమానవిఖ్యాతిని గోరినవాఁడనికదా దీనియర్థము. యశస్సు సత్కర్మానుష్ఠానమున గల్గును. అధర్మధ్వంసనమే సత్కర్మము. దానినిమించిన సత్కర్మము జగములయందు లేదు. దేనియాధారమునఁ బ్రపంచములున్నవో

దేని నవలంబించినవారు చెడుదురో యవి ధర్మాధర్మము లనఁబడును. భగవత్స్వరూపమేధర్మము. భగవత్స్వరూపనివారకమే యధర్మము. ఒకటి యారాధింపఁదగినది. వేఱొకఁడు నివారింపఁదగినది. అని భావము. అట్టివాంఛగలవాఁడు శ్రీరామమూర్తి. అనఁగా ధర్మము నశింపకయుండ నధర్మము తలయెత్తకయుండ నొనరింపఁబూనెనని భావము. "స్వయా శ్రియా" అని మూలమునఁ గలదు. దీనివాస్తవార్థమేమి? అనపాయినియగు శ్రీదేవితోఁ బ్రకాశించుచు ననియే దానియర్థము. అనఁగాఁ బ్రకృతి విశిష్టుఁడై యని భావము. శ్రీదేవిం గూడినఁగాని యనఁగా మూలప్రకృతిం జేకొనినఁగాని యే కార్యమును జేయఁజాలఁడు. శక్తిలేక కాదు. సంకల్పశక్తిలేక యేకార్యము సాగదు కావునఁ దన నిర్వికల్పత్వమును మానెననియే తాత్పర్యము. కనుకనే తల్లిసెలవుపొంది తన ప్రయత్నమును నెఱవేర్పనున్న సీతాగృహమున కరిగెను. లోకమునందును భార్యతో నాలోచింపక యే కార్యము పురుషుఁడు చేసి ఖ్యాతిని గాంచఁజాలఁడు. ఈయాచారము సనాతనము. దానినే భగవంతుఁడు కార్యరూపమున మనకుఁ దెలిపెను. కావున మూలప్రకృతి నాశ్రయింపక యెవ్వాఁడు కాని తమోరూపతిరస్కరణిని దాఁటి భగవంతుని నిర్మలతేజస్వరూపమును గాంచలేఁడని తేటపడియెడిని. ఒక్కగంతున భగవంతుని జేరఁగల మనువారే పామరులు. విద్యవచ్చినను వారు పామరులే. విద్య వారికి ఫలము నీఁజాలదని భావము. "తదను ప్రధానద్వారా రాజదర్శనం కర్తవ్య" మ్మనున్యాయము ప్రసిద్ధమేకదా. కనుక భగవంతు నిచ్ఛాశక్తిని దొలుత నారాధించి రజస్తమోగుణముల జయించి శుద్ధసత్వ ముద్దీపింప భగ

వంతుని దేవోరూపునిగా ధ్యానింపవలయునని మన మీభాగ మునుండి నేర్చుకొనవలసియే యుండును. అట్లుగాక దుర్మతాభిమానమూని స్వలాభార్థ మేవో యిందు రహస్యార్థము లున్న యట్లు నటించి శిష్యులకు బోధించుచు దేవతాద్వేషమును గలిగించుచు ధనార్జనము చేయు కపటయోగులమాటలకు లోబడి నిర్మలమగుభక్తిని బోగొట్టుకొనరాదు. ఇంకఁ దరు వాతి శ్రీరామచరిత్రమును బఠింతము.

రాముఁడు సీతాదేవికి స్వాభిప్రాయ మెఱిఁగించుట.

* శ్రీరాముఁడు తల్లి యాశీషములొంది యత్యంత ధర్మమార్గము నవలంబించి యడవుల కరుగఁబూని తనప్రభల రాజమార్గమును వెలిఁగించుచుఁ బోయెను. జనులు రాముని గనినంతనే తత్సుగుణసంపత్తి యత్యంతప్రీతులుగా వారిఁ జేయఁజాలెను. అభిషేకార్థము వ్రతనియతింగాంచినసీతాదేవికి నభిషేకవిఘ్నము లోనగువార్త లేవియుఁ దెలియవు. నాఁ డభిషేకోత్సవము సాగుననియే యామె తలంచుచుండెను. పట్టభద్రుఁ డగుభర్తకుఁ దాఁ జేయఁదగుమర్యాదల నెఱింగియే యుండెను. రాజచిహ్నము లిట్టివనియు నెఱుంగును. ఆనాఁడు పట్టాభిషిక్తుఁడైన భర్తకు నభ్యుదయమునుగోరి దేవతాపూజలఁ గావించి మహోత్సవానంతరము వచ్చునాథునకుఁ దగుపూజల నొనరింప సిద్ధపడి రాజచిహ్నములతో వచ్చు శ్రీరామునింగాంచ నువ్విళ్లూరుచుండెను.

* ఇది యిరువదాఱవసర్గమునుండి గ్రహింపఁబడినది. అధ్యాత్మరామాయణకథయం దిం దిమిడియుండును.

అట్టితఱి శ్రీరామమూర్తి సీత కీదుఃఖవార్త నెట్లు తెలుపవలయు ననుసిగ్గుచేఁ దలవంచి సంతుష్టజన నిబిడమగు నంతఃపురమును బ్రవేశించెను. సీత త్వరపడి లేచి భయకంపితాంగియై శోకతప్తుఁడగు శ్రీరామునిం గాంచెను. ధర్మాత్ముఁడగుట రాముఁడు సతిం గాంచఁగనే దుఃఖము నాపుకొనఁజాలకపోయెను. కనుక నాతఁడు దుఃఖపడెను. మోము కాంతిహీనముకాఁగా మేను చెమటబిందువులం దడియఁగా నాపుకొనరానిదుఃఖమునఁ గలఁతనొందు రామునిం గాంచి దుఃఖార్తయై ప్రాణేశా! ఇదియేమి? బృహస్పతి యధిదేవతగాఁగలిగి సంపత్కరమై నీయభిషేకమునకు నర్హమగు పుష్యనక్షత్రమువచ్చినదని మహాప్రాజ్ఞులగు బ్రాహ్మణులు పల్కిరిగదా. ఈశుభతమసమయమున నీ వేల యిట్లు కుందుచున్నావే. ఏల? శ్వేతాతపత్త్రము పట్టికుండుటం జేసి నీమోముచందురుఁడు ప్రకాశింపక యున్నాఁడే. ఏల? చామరు లేల వీవ లేదు? వాగ్విశారదులగు వందిమాగధాదులు నిన్ను వినుతింపకయున్నారేల? వేదాంతవేత్తలగు బ్రాహ్మణులు శిరస్స్నానముచేసి శుద్ధుఁడవుగానున్న నీశిరస్సుపై యథాశాస్త్రముగఁ దిధ్ధోదకాదులచేత నభిషేకింపకయున్నారే. ఏల? మంత్రిప్రముఖులు, పౌరముఖ్యులు, జానపదులు నలంకృతులై నిన్ననుసరించి రాలేదే. ఏల ? బంగరుచే రంగారుచు నాల్గుగుఱ్ఱములు గట్టియున్నరథవర్యము నీముందు రాకయున్నదే, ఏల ? నీలమేఘముభాతిఁ బర్వతమువలె నగపడుచు ంగళలక్షణలక్షితమైయుండు భద్రదంతావళము నీప్రయాణమున నీకు ముందు రాకయున్నదే. ఏల? సుందరాకారా! శ్రీరామభద్రా! శూరులు కనకరత్నసింహాసనము మున్నిడుకొని పోవు

చుండగా నీవు రావలయుఁగదా. అట్లేల రావైతివి? పట్టాభిషేక మెంతసంతోషమున నాయత్తమైనదో యంతదుఃఖముగా మున్నెన్నఁడులేని యీఛాయ నీముఖమునఁ గలిగియున్నది. సంతోష మదృశ్యమైనది. ఏటికో! అని ప్రశ్నించెను.

ఈరీతిఁ బ్రశ్నించుచు వగచుచున్న జానకిం గాంచి రామచంద్రుఁడు సీతా! ఆర్యులగు నాతండ్రిగారు నన్నీయయోధ్యనుండి యడవికిం బంపుచున్నారు. జానకీ! ఉత్తమవంశసంభూతురాలవు. ధర్మ మెఱింగినదానవు. ధర్మాచరణపరాయణవు. జ్ఞానధనుఁడగు జనకచక్రవర్తికుమారికవు. కావునఁ బామరులవలె వేగమున ధర్మము నతిక్రమింపవు. ఇఁక నావనవాసక్రమము నాలకింపుము. పలికినమాట విడనాడని నాతండ్రి పూర్వము నాతల్లి కైకకు వరద్వయ మొసంగెను. ఇత్తఱి రాజు ప్రయత్నపూర్వకముగా నాకభిషేకము చేయసిద్ధపడియుండఁగా నాజనని యావరములఁ బ్రార్థించెను. మాట తిరుగని రాజు ధర్మజ్ఞుఁడుగాన ధర్మవశంగతుఁడై యాదేవికి లోఁబడెను. నేను దండకారణ్యములఁ బదునాలుగేఁడులు మాత్రము నివాసము చేయుట యొకవరము. భరతునకుఁ బట్టాభిషేకము నాతండ్రి చేయుట రెండవవరము. అను నీవరముల కనుగుణముగాఁ దండ్రి యాజ్ఞాపింప నే నిపుడే నిర్మానుష్యమగువనమున కరుగ నిశ్చయించి నిన్నుఁజూచిపోవ నిచ్చటికి వచ్చితిని. భరతునిచెంత మాత్రము నన్నెపుడుగాని నీవు కొనియాడకుము. సంపద్వృద్ధిఁ బొందినపురుషులు ప్రాయికముగా నితరుల నుతింపనోర్వరుగదా. ఆన్యాయము ననుసరించి భరతునిచెంత నాగుణవర్ణనము చేయకుము. నాతమ్ముఁడు నలువురతో సమానముగా నిన్నుఁ బోషిం

పడగుభారము కలవాఁడేకాని విశేషవిధి ననుసరించి నిన్నుఁ బోషించుభారము వానికి లేదు. అట్లులగుట సీతోడికోడండ్ర కన్న మిన్నగాఁ బోషణము నీవు వానిం గోరఁదగదు. నీవు భరతున కనుకూలముగానుండిననే నీవాతనికడ నుండఁజాలుదువు. కాని ప్రతికూలముగా నుండ సాధ్యముగాదు. అదేల యందు వేమో వినుము. పూర్వమునుండివచ్చు యువరాజత్వమును రాజు భరతునకే యిచ్చెను. జానకీ! కావున నీవాభరతునకు విశేషించి దశరథునకు నేమాత్రము మనస్సునకుఁ గలఁతలేని చందమునఁ బ్రవర్తింపవలయును. పితృనానతి నెఱవేర్ప నే నిపుడే యడవి కరిగెదను. నీవు దృఢచిత్తవు. కాఁబట్టి నాయందలిదృఢతమాను రాగమునకుఁ గొఱంతరానీయక యుండుము. కల్యాణీ! మహర్షినివాసయోగ్యమగువనమున కరిగినపిదప నీవు వ్రతోపవాసనిరతవై యుండుము. నిత్యము నుషఃకాలమున మేల్కని యథోచితముగ దేవతలం బూజించి మానవులఁ బాలించు రాజునకు నమస్కరించి ధర్మమునే యాశ్రయించి సంతాపపరితప్తయయియున్న వృద్ధురాలగు నాతల్లిని సత్కరింపవలయును. మిగిలిన నాతల్లులు నాయందుఁ గలస్నేహమునను బ్రేమమునను బాలించువిషయమునను నాకు సమానలే యగుదురుగాన వారలకెల్లరకు నీవు నమస్కరింపవలయును. నాకుఁ బ్రాణసమానులుసుమీ భరతశత్రుఘ్నులు. వారిని మిక్కిలి నీసోదరులను బుత్రులను జూచుకొనురీతిఁ గాంచుచుండుము. భరతుఁడనఁగా దేశమునకేకాక మనవంశమునకు రాజు ప్రభువునగుఁగాన నీవతని కప్రియకార్యము నెద్దానిం జేయరాదు. సామాన్యముగా రాజులందఱు తమకను

కూలముగా నడుచుకొనుచు నాలస్యముచేయక ప్రయత్నపూర్వకముగఁ దమ్ము సేవించువారియందే ప్రసన్నులై యుందురు. విపరీతముగ వర్తించువారిపైఁ గోపమూనుదురు. ప్రభువులు ధర్మపత్నియందుఁ బడసినకొడుకులైనను విరోధముగా వర్తించిరేని వదలివేయుదురు. బంధువులుగాకున్న యితరులనుగూడ శక్తిగలిగి హితముచేయువారైనఁ బరిగ్రహింతురు. మంగళాంగీ! భరతుఁడు రాజు గావున నతని కనుకూలముగఁ బ్రవర్తింపకయున్న నెన్నియోకష్టములుగలుగును. అట్లుకాకయుండ ననుసరించి వర్తింపుము. ధర్మనిరతవై సఫలవ్రతముల నాచరించుచు నిందే యుండుము. ప్రేయసీ! నేను గహనముల కరిగెదను. ఆయడవులు నీవంటిస్త్రీ రాఁదగినవి కావు. కనుకనే నీవిక్కడనుండఁదగుదువుకదా. అనుకూలవర్తనము నీకుఁ బ్రధానము. నా యీమాటలు నీమనసున నెలకొనఁదగినవి. అని పలికి యూరకుండెను.

మహాశయులారా! ఈఘట్టమున ననేకవిషయములు విమర్శింపఁదగినవికలవు. వానిని వదలనయితిగాదు.

"దేవకార్యం స్వయం కృత్వా కృతజ్ఞా హృష్టచేతనా,
అభిజ్ఞా రాజధర్మాణాం రాజపుత్త్రం ప్రతీక్షతే." ౪

అని మూలము. ఇందలివిశేషార్థ మిది.

"రాజధర్మాణామభిజ్ఞా అత ఏవ రాజపుత్త్రం ప్రతీక్షతే."

అని యన్వయక్రమము.

"బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప,
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః. ౪౧
శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనం,

దానమీశ్వరభావశ్చ క్షాత్త్రం కర్మ స్వభావజం. ౪౩

స్వే స్వే కర్మణ్యభిరతస్సంసిద్ధిం లభతే నరః,
స్వకర్మనిరతస్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు. ౪౫

యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతం,
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః. ౪౬

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్,
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్." ౪౭

గీత. ౧౮ అధ్యా.

అను నీగీతావాక్యప్రమాణము ననుసరించి క్షత్త్రియార్హ మగు దుష్టనిగ్రహశిష్టపరిపాలనరూపధర్మము నెఱిఁగినదిగాన యాలోకమాత రాజపుత్త్రుఁడుగా నున్నభగవంతునిరాకకై వేచియుండెనని యెఱుంగవలయును. దీనికి హేతువేమనఁగా నాలకింపుఁడు. "దేవకార్యం స్వయం కృత్వా" దేవతాకార్య మగు భూభారహరణమును దానే యొనరించి అనఁగా నేకార్య మేరీతిగాఁ జేయవలయునని యాలోచించి యని భావము. "కృతజ్ఞా" ఇంతకుముం దెన్ని యోసాగులు తాను జేసియున్న యట్టి యనేక కార్యములనెఱింగి యనవతరము వానినే తలంచు నది యని భావము. "హృష్టచేతనా" అనఁగాఁ దానొనరింపఁ బూనినకార్యము లెల్ల ఫలించును గాన సంతోషస్వాంత యయ్యె నని తాత్పర్యము. ఇట్టు లీశ్లోకమునర్థముం బరిగ్రహింపఁ గారణమేమి? అన్న ప్రశ్నమునకు సదుత్తరము వినుఁడు. భగ వంతుఁడు నిర్లిప్తుఁడు కాన నేకార్యము తానే చేయఁబూనఁడు. తనసాన్నిధ్యమున మూలప్రకృతియే సకలకార్యముల నవలీల నొనరించుచుండఁ దాఁ జూచుచుండును. ప్రపంచకర్త్రి ప్రకృ

తియే. తత్సంకల్పమే యీజగద్రోషము. కావున శ్రీరామమూర్తి తననిర్లిప్తత్వమును దేటపఱుపంబూని తనసంకల్పశక్తి యగు సీతాగేహమునకుం బోయెను. ఆమెయుం దాం జేయంబూనినకార్యమునకు శ్రీరామాగమనము ఫలముగాన నాపరాత్పరుని రాకకై వేచియుండెను. సర్వదా యానందస్వరూపిణియగు నాసీత యెప్పుడు వచ్చునా రాముండని తలంచుచుండెను. దుఃఖాభినయము ప్రపంచార్థమని యెఱుంగవలయును.

"జగత్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే
తిరస్కుర్వన్నేతత్స్వమపి వపురీశస్తిరయతి,
సదా పూర్వస్సర్వం తదిదమనుగృహ్ణాతి చ శివ
స్తవాజ్ఞామాలంబ్య క్షణచలితయోర్భ్రూలతికయోః. ౨౪
విరించిః పంచత్వం వ్రజతి హరిరాప్నోతి విరతిం,
వినాశం కీనాశో భజతి ధనదో యాతి నిధనమ్,
వితంద్రీ మాహేంద్రీ వితతిరపి సమ్మీలితదృశా,
మహాసంహారేఽస్మిన్విహరతి సతి త్వత్పతిరసౌ." ౨౬

అను శ్రీశంకరభగవత్పాదాచార్యవర్యకృత సౌందర్యలహరి వాక్యములు పైభావమును దృఢపఱుచుచున్నవి. ఇట్టి శ్లోకముల కర్థమును గ్రహించుచో శ్రీరామావతారప్రయోజనము తేటపడును. లేకయున్న శ్రీరాముని పరమేశ్వరత్వము చక్కంగా నవగతము కానేరదు.

"ప్రహృష్టజనసంకీర్ణం హ్రియా కించిదవాఙ్ముఖః. ౫
అథ సీతా సముత్పత్య వేపమానా చ తం పతిం,
అపశ్యచ్ఛోకసంతప్తం చింతావ్యాకులితేంద్రియం." ౬

అను మొదలగుశ్లోకములయందలిభావమును సీతారాములు మానవత్వము నభినయించి తదనురూపముగాఁ బ్రవర్తించి రనియు, వాస్తవముగా వారి కట్టిదుఃఖము లేదనియు గ్రహింప వలయును. లేకయున్న మున్ను చెప్పియున్న శ్రీరాముని సత్య పరాయణత్వము లోనగునవి యెగిరిపోవును. కనుక నాదంప తులు మానవధర్మము ననుసరించి దుఃఖము నభినయించిరనియే మనము గ్రహింపవలయును.

"అద్య బార్హస్పత శ్శ్రీమాన్యుక్తః పుష్యోఽను రాఘవ,
ప్రోచ్యతే బ్రాహ్మణైః ప్రాజ్ఞైః కేన త్వమసి దుర్మనాః." ౯

అనునది సీతాప్రశ్నము. ప్రాజ్ఞులనఁగా

"స్మృతిర్వ్యతీతవిషయా మతిరాగామిగోచరా,
బుద్ధిస్తాత్కాలికీ జ్ఞేయా ప్రజ్ఞా త్రైకాల్యగోచరా."

అనుప్రమాణము ననుసరించి త్రికాలజ్ఞానసంపన్నులని యర్థము. అట్టి బ్రాహ్మణులు పుష్యనక్షత్రము నీకు సకలైశ్వర్యప్రదమని పలికిరిగదా. నీవేటి కిట్లు మతి గౌరవము విడనాడితివని సీత యడుగుచున్నది. దీనత్వమున కవకాశమే లేదే. నీయవతార ఫలము లోకములకుం గలిగించుసత్కాలముకదా యిది. ఏల యింక నాలస్యముచేసెదవని మహాప్రకృతి పరమపురుషుని హెచ్చరించుచున్నది.

"ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః,
భూతగ్రామమిమం కృత్స్నమవశం ప్రకృతేర్వశాత్. ౮
న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ,
ఉదాసీనవదాసీనమసక్తం తేషు కర్మసు." ౯ గీత. ౯ అ.

అను గీతావాక్యముల ననుసరించియు,

"శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం,
న చేదేవం దేవో న ఖలు కుశలస్స్పందితుమపి."

అను శ్రీశంకరభగవత్పాదాచార్యవరోక్తి ననుసరించియు నాలోచింపఁగా, నిర్లిప్తుఁ డగుభగవంతుఁడు ప్రకృతిసహాయముఁగాని కార్యనిర్వహణమునకుఁ జూలఁడని తేలెడిని. ఉదాసీనుఁడగుట సర్వసాక్షియే యగు. కావుననే ప్రకృతి యాతనిఁ బురికొలిపెనని తెలిసికొనందగును.

"ఇతీవ విలపంతీం తాం ప్రోవాచ రఘునందనః,
సీతే తత్రభవాంస్తాతః ప్రవ్రాజయతి మాం వనం. ౧౯
కులే మహతి సంభూతే ధర్మజ్ఞే ధర్మచారిణి,
శృణు జానకి యేనేదం క్రమేణాభ్యాగతం మమ." ౨౦

అని మూలము. "విలపంతీం ఉద్వేగేనపృచ్ఛంతీం" అని వ్యాఖ్య. ఏడ్చుచున్నదని యర్థము కాదు. ఆతురంపడి యడుగుచున్నదని యర్థము ఇచ్చోట మహాకవి వాల్మీకి శ్రీరాముని పరమేశ్వరత్వము నానందమయుఁడగుటను దెలుపఁజూని "రఘునందనః" అని ప్రయోగించెను. రఘువంశమున కానందముఁగూర్చువాఁడనఁగా లోకోపకార మొనర్చుటయే రఘువంశసంభూతులకుఁ బ్రధానకర్మమని భావము. అట్టికులోచితమహాకార్యము నాచరించువారిం దలంచి పితృదేవత లానందింతురు. ఇచ్చోట శ్రీరాముఁడు తనసర్వజ్ఞత్వమును మాటుపఱచి లోకానుగుణవర్తనము ననుసరించుచున్నాఁడు. స్త్రీలస్వభావ మాతురంపడుట. సీత యాధర్మము నవలంబించి తండ్రి నేమేని దూషించునేమో యని యూహించి సీతాదేవీ! పూజ్యుఁడగునాతండ్రి నన్నడవులకుం బంపుచున్నాఁ డనెను. భర్తకుఁ బూజ్యుఁడగువాఁడు

సాధ్వియగు భార్యకుంగూడఁ బూజ్యుఁడే యగును. అసతి యైనచో నీన్యాయము విపరీతమగును.

"సోఽహం త్వామాగతో ద్రష్టుం ప్రస్థితో విజనం వనం." ౨౩

అనునది శ్రీరామవాక్యము. నిర్జనారణ్యమునకుం బోవనున్న నేను నిన్నుంజూడవచ్చితిని. అనఁగా నీసాయముఁగోరివచ్చితి నని సారము. నిర్గుణుఁడ నగునేను సగుణుఁడను గావలయునుగదా. కాన నీచెంత కరుదెంచితినని శ్రీరాము నాశయము. ఇఁక శ్రీరామమూర్తి సీతకుఁ దెలుపునెపమునఁ గొన్ని మంచియలవాటుల లోకులకుఁ దెలుపుచున్నాఁడు.

"భరతస్య సమీపే తు నాహం కథ్యః కదాచన. ౨౪

ఋద్ధియుక్తా హి పురుషా న సహంతే పరస్తవం,

తస్మాన్న తే గుణాః కథ్యా భరతస్యాగ్రతో మమ." ౨౫

అని మూలము. రామమూర్తి యుపదేశించునీతి యిది. ఇది సీతాదేవికొఱకని భ్రాంతిపడరాదు. రాజులు ప్రాయశః పరస్తుతి నంగీకరింపరు. సామాన్యులయందు నిది వర్తించును. సంపదలతో వర్ధిల్లువారు పరస్తుతి నోర్వరు. కావున బుద్ధిమంతులు పరస్తుతుల నొనరించునపుడు చక్కఁగా నాలోచించి వినువారిచిత్తవృత్తుల నరసియే చేయవలయునని యెఱుంగవలయును.

ఈఘట్టమున సీతకు రామమూర్తి తెలుపుధర్మము లన్నియు భరతునిస్వభావమును దెలుపక లోకాచారములనే తెలుపునవియనియు, నొకరిననుసరించి వర్తించునపుడు మిక్కిలి మర్యాదలఁ గోరరాదనియు నీమొదలగునీతులను రామచంద్రుఁడు బోధించెనని మనము గ్రహింపవలయును. "సమా హి మమ మాతరః" అను శ్రీరామవాక్యము మనము మది నిలుపు

కోనవలయును. తల్లులందఱు నాకు సమానలే. అనఁగా వారి యందు నాకు సమబుద్ధిగలదని భావము. దీనఁ గలవిశేషమేమి? కైక నావనగమనమునకుఁ గారణమని లోకులు భావింతురేమో. అయ్యది పొరపాటు. నాకు నుపకారముచేయుటకే యాకె యవతరించెను. కాన నాకు నామెయందుఁ గౌసల్యవిషయమున నెట్టిసద్భావమో యట్టిదియే కలదని రాము నభిప్రాయము. దీనిని

“సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః,
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహం.” ౨౯

అను నీగీతావాక్యము దృఢపఱచుచున్నది.

“భ్రాతృపుత్త్రసమా చాపి ద్రష్టవ్యౌ చ విశేషతః,
త్వయా భరతశత్రుఘ్నౌ ప్రాణైః ప్రియతరౌ మమ.” 33

అనుమూలము శ్రీరామమూర్తి సద్భావమును దెలుపుచున్నది. భరతుఁడు సీత నడిగియున్న నిత్తునే యన్న వాక్యము రామాయణమునఁ గలదు. దాని నాధారముగాఁ జేసికొని పండితమ్మన్యులెందఱో విపరీతార్థములు పలికిరి. అవి తుచ్ఛతమములనియు రాము నభిప్రాయ మయ్యదికాదనియు నీవాక్యము తెలుపుచున్నది. జానకీ! భరతశత్రుఘ్నుల నిరువురను నీవు సోదరులుగను బుత్త్రులుగను భావింపుము. వారు నాకుఁ బ్రాణములకంటె నధికులుసుమీ యనెను. అనఁగా వారే నాయవతారఫలమును లోకులకుఁ గల్గించినవారిలో నుత్తములు, నాకు భక్తులు నగుదురని రామభద్రుఁడు స్పష్టపఱచెను. ఇట్టితావులఁ జక్కఁగఁ బరిశీలింపక యొక్కొక్కతావునఁ గలభావమును విమర్శించి రాము నభిప్రాయ మిదని తెలుపరాదు.

"సా త్వం వసేహ కల్యాణి రాజ్ఞస్సమనువర్తినీ,
భరతస్య రతా ధర్మే సత్యవ్రతపరాయణా." 32

అని మూలము. సామాన్యార్థము స్పష్టము. కల్యాణి! జగన్మంగళకారిణివగు నోమహాప్రకృతీ! రాజ్ఞః భరతస్య= రాజగుభరతునకు ననుకూలముగాఁ బ్రవర్తించుచు ధర్మమునం దాసక్తి గలిగి యిందే యుండుము. సత్యవ్రతపరాయణురాలవు కమ్ము. అనఁగా నీవు సర్వవ్యాపకురాలవు. కావున నిందు భరతునకు ధర్మపరిపాలన కార్యమునందుఁ దోడ్పడుచు సత్యవ్రతమునం దాసక్తిగలిగి యనఁగా లోకమున సత్యము నిలుచునట్లు సంకల్పించుచు నిందుండుము. నన్నుఁగూడియుండుటచే నిందుఁ గలధర్మములకు లోపము రానీయరాదు. కాన నిందు నందును దోడ్పడుమనియే విశేషార్థము. సత్యవ్రతపరాయణాత్వము జగమునకు క్షేమముగోరుట ధర్మమునం దాసక్తి స్త్రీలకుఁ బ్రధానములని రామమూర్తి యుపదేశించిననీతులు.

"అహం గమిష్యామి మహావనం ప్రియే త్వయా హి వస్తవ్యమిహైవ భామిని,
యథా వ్యళీకం కురుషే న కస్యచిత్తథా త్వయా కార్యమిదం వచో మమ."

అనుమూలము పైనవ్రాసినభావమునకు బాధాకరముకాదా యని కొందఱందురు. కాదని మన మూహింపవలయును. ఎట్లనఁగాఁ బరికింపుఁడు. ప్రియేభామిని = ప్రియమునే కలిగించు నోకాంతాలలామమా, త్వయా=నీతోడ, అహం=నేను, మహావనంగమిష్యామి=దండకారణ్యములకుఁ బోవుదును. "కస్యచిద్వ్యళీకం యథా న కురుషే తథా ఇహైవ వస్తవ్యం త్వయా. ఇదంకార్యం మమ వచశ్చ కార్యం" ఎవ్వనికేనప్రియ మేలాగు కలుగకయుండునట్లుగా నీకార్యమునందు వర్తింపుము. ఇదియే

చేయఁదగినది. నామాటయు నిట్టిదియే. అనఁగా నిం దెవ్వరికి నప్రియము కలుగకయుండునట్లు నీవు చూచుకొనవలయు. ఈ కార్యమునందే నీవు బద్ధానురాగవై యుండవలయును. ఇదియే నీవు చేయఁదగినపని. నావాక్యమీయర్థమునే తెలుపును. సారమేమనఁగా. ఇచ్ఛాశక్తివిగాన నీవిందుఁ గలవారల కెవ్వరికి నేవిధముగనైన నప్రియము కలుగరాదని సంకల్పింపుము. భరతునియందుఁ గాని మఱెవ్వరియందుఁగాని యెవ్వారికైన నప్రియము కలుగకయుండవలయునని సంకల్పింపుము. ఇకార్యమునందే బద్ధానురాగవగుము. నీసంకల్పమున నీసకలకార్యములు ఫలించును. నీవిపుడు చేయఁదగున దిదియే. నావచనసారముకూడ నిదియే. "ఇచ్ఛామాత్రం ప్రభోస్సృష్టిః" పరమేశ్వరుఁడు సంకల్పించినంతనే యాకార్యము నెఱవేఱును. అనఁగాఁ బరాత్పరుఁడు సంకల్పించును. తదిచ్ఛానుసారమే ప్రకృతి యెల్లకార్యములను క్షణమాత్రమున నొనరించును. నిర్లిప్తుఁడగుభగవంతుఁడు సర్వసాక్షియై యుండును. అనియే యిటఁగలసారమని గ్రహింపవలయును. దీనిచేతఁ బ్రజలకు భరతునియందుఁ గైకేయియందును భరతాదులకుఁ బ్రకృతులయందు నేలాటియప్రియము కలుగకయుండవలయునని శ్రీరాముఁడు మూలప్రకృతి కాజ్ఞాపించె ననుభావము సూచితమగుచున్నది. ఇట్టు లీఘట్టమున ననేకార్థములు గలవు. వీనిని గ్రహించిననే శ్రీరామచంద్రతత్త్వము తేటపడును. మానవమాత్రుఁడు రామమూర్తి యన్నభావము దూరమగును. ఈఘట్టమునఁ గలయథార్థ్యాత్మ రామాయణవిషయము పైసర్గమునందు వ్రాసెదను. తరువాతికథను బరికింతము.

సీత రామచంద్రునకు బదులుచెప్పుట.

* ప్రియమునకే తగి ప్రియముగా మాటలాడునట్టి స్వభావముగల యాసీత వినుట కింపుగానియట్లు కనఁబడు మాటలు శ్రీరామమూర్తి పలుకఁగా స్నేహభారమున నాగ్రహము కలదానివలె నటించి ప్రాణనాథున కిట్లనియె. శ్రీరామా! నీవు రాకొమరుఁడవు. ఇప్పని న్యాయసమ్మతముగాదని నీకే తెలియును. నావంటివనితకుంగూడఁ బరిహసింపఁదగినమాట చెప్పితివికదా ఇదియే చిత్రము. ఇంతదనుక నీవిట్టిమాట నాకుం దెల్పఁగా నేను వినియుండలేదు. ధనుర్విద్యావిశారదులగు రాజకుమారుల కేమాత్రము తగనిది, అపకీర్తికరమైనదియు నగును. గాన నీయది వినఁదగినదే కాదు. అద్దానిం జెప్పుట యెట్లు? ప్రాణేశా! తల్లిదండ్రులు సోదరులు కొడుకులు వారిభార్యలు వీరెల్లరుతమతమసుకృతదుష్కృతముల ననుభవించుచుఁ దత్ఫలభూతములగు శుభాశుభరూపకర్మముల నాచరింతురు. భార్య యనఁగా భర్తకు సగము శరీర మనఁదగినది. కనుక ఆమె యొక్కతుకయే భర్తకుఁ గలుగుభాగ్యములనే తాను ననుభవించుచున్నది. కావున నిన్ను వనమునుండ శాసించుటచేత నే నన్నుఁగూడ శాసించినట్లేకదా. స్త్రీలకు గతి తల్లిదండ్రులు తనయులు చెలికత్తియలు కారు. వారు తమకుఁ దమరే స్వతంత్రలు కానేరరు. వారికి భర్తయొక్కఁడే యిహాపరలోకముల యందు సర్వకాలము గతియగు. మఱొక్కఁడు కాఁడు. రాఘవేశ్వరా! నీవు మహారణ్యములకుఁ బ్రయాణమగుదువేని నేను

* ఈయది యిరువదేడవసర్గమునుండి గ్రహింపఁబడినది. అధ్యాత్మ రామాయణమునఁ గలసార మిందు వివరింపఁబడును.

నీపురోభాగమునందుఁ గుశకంటకముల నడఁగఁ ద్రొక్కుచుఁ బోయెదను. వెనుక నరుదెంచు నీవు వానిపై సుఖముగా నడుగులిడవచ్చును. నావంటి స్త్రీ నొంటరిగా నడవులకుఁ దీసికొని పోయి కాపాడుటెట్లని నీవంటిశూరాగ్రణి భయంపడరాదు. రావలదన్న వచ్చుచున్నదేయనియు,నన్ననుసరించి యీమె చరితార్థురాలగుచున్నదనియు నీవూహించి యౌార్వమిగలవాఁడవైనను, నామాటవినక వనముల ఫలమూలాదుల భక్షింప సాహసించుచున్నదికదా యని రోషమొందినను, ఉచ్ఛిష్టోదకమును వదలునట్లు లాభావములఁ బరిత్యజించి నాయందు విశ్వాసముంచి నన్నుఁగూడఁ దీసికొనిపొమ్ము. నీవట్లు లొనరించిన , నాకుఁ బతి నెడఁబాసి జీవించుపాతకము కలుగదు.

శ్రీరామచంద్రా! దివ్యసౌధములవదలి మహారణ్యములకు రానేల? అని యనకుమా. సౌధాగ్రములయందును విమానములయందు నుండుటకంటె అణిమాద్యష్టసిద్ధులం గాంచి యాకసమునఁ దిరుగుటకంటె సర్వావస్థలయందును భర్తను గూడి పాదసేవ చేయుచునుండుటయే యుత్కృష్టకార్యము. పతివిషయమున నెట్లు వర్తింపవలసినదియు నాతల్లిదండ్రులు బహుభంగులుగా బోధింప నెఱిఁగియున్నదానను. కనుక నెవ్వరు నాకావిషయము నిపుడు నేర్పనక్కఱ లేదు. అరణ్యము ప్రవేశింప సాధ్యముకానిదనియు, నిర్జనమనియు, వ్యాఘ్రాది జంతునిబిడమనియు నెఱింగియుఁ దప్పక నిన్నుఁగూడి యచ్చటికి వత్తును. ఈపట్టుదల శ్రమముకలిగించునదియే కాని సుఖకరము కాదే యని పలుకుదువేమో. శ్రీరామా! త్రిలోకాధిపత్యము లభించినను నేను లెక్కింపక భర్తృశుశ్రూషావ్రతముతప్ప

నితరము నూహింపక జనకగృహమున నున్నయట్లు నిన్నుంగూడి యడవుల సంతోషముతో నుందును. శూరాగ్రేసరా! నిరంతరము నీకు శుశ్రూష లాచరించుచు నింద్రియనియమము నూని దానిచేఁ గామమును భోగములను వర్జించి మకరంద పరిమళముల విలసిల్లుకాననములందు నిన్నుంగూడి విహరించుచుందును. మర్యాదాపరిపాలకా! అనన్యశరణ్యులగు నితరులఁ గూడ నడవుల బాలింపఁజాలిన నీవు నన్నుఁ బాలింపఁజాలవా? ఆవిషయము చెప్పనేల? ఇపుడు నీతోడ నడవులకు వత్తును. సందేహము లేదు. రాఁదలఁచిన నన్ను నిట నిలుప నీకును శక్యముకాదు.

మంచియాహార మట లభింపదే. ఏల వత్తువందువేమో. నేనందు ఫలమూలములను గందములను దినుచునుందును. మంచియాహారము నాకునక్కఱలేదు. ఆహారమునందును బానమునందును నీకు నేను గష్టమును గల్గింపక కూడియుందును. మహాబుద్ధిశాలివి. ప్రాణేశ్వరుఁడవు. నీవు కూడనుండ నేను భయలేశమైన లేక యటఁగల నదులను గొండలను నీటిపట్టులను గాననముల నన్నింటిని గనుఁగొనఁ గోరుచున్నాను. మహాశూరుఁడవగు నిన్నుంగూడి యేభీతియులేక మిగుల సుఖముగా హంసకారండవాదిజలపక్షినిబిడములై వికసించినపూవులుగలిగి సొంపుగూర్చుచున్నసరస్సులను గన్నులపండువుగాఁ జూడఁగోరుచున్నాను. దృఢయత్నమూని యాసరస్సుల జలకములాడెదను. స్నానార్థ ముష్ణోదకములను వాంఛింపను. అట్టికమలాకరముల యందు నిన్నుఁగూడి మహానందమునఁ గ్రీడింతును. వనమునందు నిట్లు నిన్నుఁ గూడి కాలము పుచ్చితినేని లక్షవత్సరము

లైనను నాకుఁ దెలియకయుండును. పదునాలుగేండ్లనఁగా నిక నెంత? నీవు లేనిస్వర్గమునుగూడ నేనుగోరను. పురుషోత్తమా! స్వర్గసుఖవాసము లభించినను నీవు లేకయున్న నేను దాని నొప్పుకొనను.

శ్రీరామభద్రా! అరణ్యము ప్రవేశింపరానిదేయైనను, వానరములు గజములు లోనగుమృగములుండినను, భయంపడక వచ్చెదను. నీమమున నీపాదములఁ జేపట్టి జనకునింటనుండునట్లు హాయిగా నుందును. నీపాదముల నాశ్రయించిన నాకు భీతి యెట్టిది? నీయందుఁ దక్క వేఱొకచో మనస్సు నునుపనిదానఁ గదా. మహానురాగము నాకు నీయందే కలదు. నన్ను వదలి పోయితివేని మృతినొంద నిశ్చయించుదానను. కాన నన్నడవికిఁ దీసికొనిపొమ్ము. నా వేఁడికో లంగీకరింపుము. నా తాకవలనఁగాని నావలనఁగాని నీకేమాత్రము భారము కలుగదు. పురుషలలాముఁడగు శ్రీరామమూర్తి ధర్మప్రియుఁడుకావునఁ దనయర్ధాంగి శ్రమములకునోర్వక యామె యెంత వేఁడుకొనుచున్నను వనగమనమున కంగీకరింపకపోయెను. ఆమె నందే నిలుపుటకు వనవాసశ్రమములఁ బెక్కింటిని దెలిపెను.

మహాభక్తులారా! ఈభాగమునఁ బెక్కురహస్యవిషయములు గలవు. వానిని విమర్శింతము. ఇందు సీతపలికినమాటల వలన బాహ్యదృష్టిం బరిశీలించిన విపరీతముగాఁ దోఁచును. శ్రద్ధమైఁ బరిశీలించిన నాదేవి మహామాయ యనియు జగదుద్ధరణముకొఱకు నవతరించెననియుఁ దేటపడును. కావున నోపికగఁ బరికింతము.

"ఏవముక్తా తు వైదేహీ ప్రియార్హా ప్రియవాదినీ,
ప్రణయాదేవ సంక్రుద్ధా భర్తారమిదమబ్రవీత్." ౧

అని మూలము. ప్రియములకే తగినది. అనఁగా నాశ్రయింపఁ దగినది. విరోధించి సాధింపరానిదనుట. ప్రియముగా మాట లాడునది. అనఁగా వరములనొసంగుటయే యామెమాటలు. అట్టి యాసీత పరమపురుషుఁ డిట్లు నీవిందే నిలువవలయునని పలుక (నవ్వి ప్రణయవాక్యములగుట) వానితత్త్వ మెఱింగినది కానఁ బ్రణయమువలననే కోపమూని యిట్లు పలికెను. 'భర్తా' రమ్మనుసార్థకపదము మహాకవి ప్రయోగించెను. తన్ను భరించు వాఁడు. అనఁగాఁ బ్రకృతిపురుషుల కవినాభావసంబంధమనుట. తన్నెల్లప్పుడు భరించువాఁడు. తనమూలముననే రూపవంతుఁ డగుననుట. కావుననే స్నేహాతిశయమునఁ గోపమూని సీత రామచంద్రున కిట్లు బదులుచెప్పెను. రామునివాక్యము లెట్లు గూఢార్థములుగ నుండునో సీతవాక్కు లట్లే యుండునని మన మెఱుంగవలయు.

"కిమిదం భాషసే రామ వాక్యం లఘుతయా ధ్రువం,
త్వయా యదపహాస్యం మే శ్రుత్వా నరవరాత్మజ." ౨

అని మూలము.

"లఘుతయా ధ్రువం వాక్య మిదం కిం భాషసే."

అని యన్వయము. చక్కఁగా నాలోచింపక వీల యిట్లు పలుకు చున్నావు? రాజేంద్రపుత్త్రుఁడవుకదా! నాకుఁగూడ నీమాట నవ్వు పుట్టించుచున్నదే. శ్రీరామా! ఏమి యీలోకవిడంబ నము? అనఁగా నేను లేక నీవే కార్యము నిర్వహింతునను చున్నావే యింతకంటెఁ బరిహాసపాత్రమగు వాక్కుగలదా? అని భావము. నిర్గుణుఁడవు సర్వసాక్షి అగునీవు ప్రకృతి నగు నాసహాయములేక యేపని చేయఁగలవు?

"ఉదాసీనవదాసీనమసక్తం తేషు కర్మసు"

అనుభగవదుక్తి ననుసరించియు,

"శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం,
నచేదేవం దేవో న ఖలు కుశలస్స్పందితుమపి."

అనుశంకరభగవత్పాదాచార్యోక్తి ననుసరించియు నాలోచింపఁగా, నిర్గుణుఁడు సగుణుఁడైనఁగాని అనఁగాఁ బ్రకృతి విశిష్టుఁడైనఁగాని యేపనియుఁ జేయఁజాలఁడనుసారమును గ్రహింపవలయును. ఈయర్థము. "యదపహాస్యం మే" అన్నవాక్యమున నిమిడియున్నది.

"ఆర్యపుత్త్ర పితా మాతా భ్రాతా పుత్త్రస్తథా స్నుషా,
స్వాని పుణ్యాని భుంజానా స్వం స్వం భాగ్యముపాసతే. 3
భర్తుర్భాగ్యం తు భార్యైకా ప్రాప్నోతి పురుషర్షభ,
అతశ్చైవాహమాదిష్టా వనే వస్తవ్యమిత్యపి. ౪
న పితా నాత్మజో నాత్మా న మాతా న సఖీజనః,
ఇహ ప్రేత్య చ నారీణాం పతిరేకో గతిస్సదా." ౫

అని మూలము. ఈసంభాషణమూలమున సీతాదేవి లోకమునఁగల స్త్రీలకు ధర్మోపదేశము చేయుచున్నది. తల్లిదండ్రులు లోనగువారు తమరుచేసికొన్న పుణ్యపాపఫలముల ననుభవించువారు. భార్య యొక్కతుకయే పతిభాగ్యమునే పొంద నర్హురాలు. కావున నిన్నడవికిఁ బొమ్మనుమాటయందే నన్నుఁగూడ నడవికింబొమ్మను నర్థ మిమిడియున్నది. సీతను బిలుచుకొనిపొమ్మని వేఱుగాఁ జెప్పనక్కఱలేదు. స్త్రీలకు గతి యీలోకమునందుఁ బరలోకమునందుఁ బతియే గతి. అనువిషయమే యిటఁగలసారము.

"నాస్తి స్త్రీణాం క్రియా మంత్రైరితి ధర్మే వ్యవస్థితిః,
నిరింద్రియా హ్యమంత్రాశ్చ స్త్రియోఽనృతమితి స్థితిః. ౧౮
భర్తుశ్శరీరశుశ్రూషాం ధర్మకార్యం చ నైత్యకం,
స్వా చైవ కుర్యాత్సర్వేషాం నాస్వజాతిః కథంచన." ౮౬

మను. ౯ అధ్యా.

మనుస్మృతి మొదలగు ప్రమాణగ్రంథముల ననుసరించి మన మాలోచించిన నీసీతోపదిష్టధర్మములే స్మృతులయందును పురాణాదులయందును గలవని తెలిసెను. ప్రకృతిపురుషు లెట్లు ప్రవర్తింతురో యట్లే భార్యాభర్తలు ప్రవర్తింపవలయును. ఈలోకమున నీయుదాహరణమును గొని భగవత్తత్త్వము నెఱుంగందగును. అనఁగా భార్య గృహకార్యములనెల్ల నిర్వహించును. పతియనుమతిమాత్రము గలిగియుండును. ధర్మకార్యములనెల్ల నామెయే నడపించును.

"అపత్యం ధర్మకార్యాణి శుశ్రూషారతిరుత్తమా,
దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చహ." ౨౮ మను ౯ అధ్యా.

("ధర్మకార్యాణి అగ్నిహోత్రాదీని' అని కుల్లూకభట్టువు.) అను నీమనుస్మృతి ననుసరించి భార్యయే గృహకార్యములనెల్ల నాచరింపవలయును. ప్రకృతి పరమపురుషు నాజ్ఞ నొందునట్లు భార్య భర్తయనుమతినిమాత్రము కైకొనవలయును. అట్లుప్రవర్తించిన కుటుంబ మెంతహాయి ననుభవించునో వచింపవలయునా? పతిని విడిచిన గతి స్త్రీలకు లేదనుమాట యొక్కటియే యిందుఁ బ్రధానము. భరతఖండమున నీధర్మమే సనాతనము. అది సడలినచో నన్నిధర్మములు నశించినట్లే యనవచ్చును. ఇక్కాలమునఁ గ్రమముగా నీయుత్తమధర్మము నశింపఁజేయుయత్నములు

సాగుచున్నవి. కాని కొంతకాలమున కీప్రయత్నములు ఫలింపక యథాపూర్వపద్ధతి చేకూరునని మనము నమ్మవలయును.

"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థా మధర్మస్య తథాత్మానం సృజామ్యహం." ౭ గీత. ౪ అ.

అను నీ శ్రీకృష్ణపరమాత్మోపదేశము వ్యర్థము కాదుకదా.

"ఈర్ష్యారోషౌ పరిత్యజ్య భుక్తశేషమివోదకం,
నయ మాం వీర విస్రబ్ధః పాపం మయి న విద్యతే." ౭

అని మూలము. ఇందొక్కనీతియు సదాచారము కలదు. పతి శ్రమపడుచుండఁగా భార్య యాకష్టమునఁ బాల్గొనక తానింట నుండుట తగదనునదియే నీతి. త్రాగిననీటిని బాఱఁబోయవలయు ననునది సదాచారము. భోజనాదికాలములయందు నీటిని గొంత త్రాగి కొంత మఱొకసారి త్రాగుట దురాచారమని మనము గ్రహింపవలయును. ఈస్థలమునఁ గలసారమేమనఁగా, శ్రీరామా! నిశ్శంకముగా నన్నుఁ బిలుచుకొని పొమ్ము. నాయందుఁ బాపము కలుగదు. వదలిపోయితివేని పాపము కల్గును. పతివ్రత పతి నెడఁబాసి యుండరాదని భావము. వనములకు నన్నుఁ బిలుచుకొనిపోవుట కనుమానింపకుము. అనఁగా నామూలముననే నీయవతారఫలము సాగవలయునని సారము.

"అనుశిష్టాస్మి మాత్రా చ పిత్రా చ వివిధాశ్రయం,
నాస్మి సంప్రతి వక్తవ్యా వర్తితవ్యం యథా మయా." ౯

అని మూలము. రామచంద్రా! నాతల్లిదండ్రులు పతి నేయేవిధముల నాశ్రయింపవలసినదియు ననఁగా సేవింపవలసినదియు నాకుఁ దెలిపిరి. మరల నాకెవ్వరు నుపదేశింప నక్కఱలేదు.

"ఇయం సీతా మమ సుతా సహాధర్మచరీ తవ,
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా."

అనువాక్కులరూపమున నన్ను నీకొసంగునపుడు పలికిరని భావము. ధర్మాచరణమున నాసాయము నీకత్యంతావసరమనియే సారము. పురుషుఁడెట్టిధర్మకార్యములుచేయుచున్నను భార్యం గూడియే చేయవలయునని స్మృతులాజ్ఞాపించుచున్నవి. భార్యను వదలిచేసిన సత్ఫలదములు కావనియేకదా యిందుఁగలయాశయము. కావున నన్ను వదలి యొట్లడవుల కరుగుదువని సీత ప్రశ్నించుచున్నది. ఈప్రశ్నము ప్రకృతిపురుషులకుం గలయవినాభావసంబంధమును దేటపఱచుచున్నది.

"అహం దుర్గం గమిష్యామి వనం పురుషవర్జితం,
నానామృగగణాకీర్ణం శార్దూలవృకసేవితం. ౧౦
సుఖం వనే నివత్స్యామి యథైవ భవనే పితుః,
అచింతయంతీ త్రీన్ లోకాన్ చింతయంతీ పతివ్రతం. ౧౧
శుశ్రూషమాణా తే నిత్యం నియతా బ్రహ్మచారిణీ,
సహ రంస్యే త్వయా వీర వనేషు మధుగంధిషు." ౧౨

అని మూలము. రామమూర్తి పూర్వసర్గమున

"కులే మహతి సంభూతే ధర్మజ్ఞే! ధర్మచారిణి"

అని సంబోధించి

"వస్తవ్యం దండకే మయా ప్రస్థితో విజనం వనమ్"

అని హెచ్చరించెను. నిర్జనారణ్యముల కరుగుచున్నాఁడ నఁగా నవి భయంకరములుగా నుండుననియేకదా రామునిభావము. దాని కిట సీత బదులిడుచున్నది.

"చింతయంతీ పతివ్రతమ్ త్రీఀల్లోకా నచింతయంతీ శుశ్రూషమాణా నియతా బ్రహ్మచారిణీ."

అనునదియే "ధర్మజే ధర్మచారిణి" అనుదానికి సమాధానము. ఇఁక నిందుఁగలవిశషమేమి ? పురుషశబ్దము మానవజాత్యుప లక్షణము. రామచంద్రా! సింహవ్యాఘ్రాదులగుక్రూరజంతువులు నావాహనములు సుమీ నాకడ నవి పరమసాధుజంతువులే యని యెఱుంగుము. తండ్రియింట నున్నయట్లే యుందును. అనఁగా శివశరాసనవ్యాజమున నీయాగమనమును గోరుచుంటిని. అట్లే యడవులయందు నీయాగమనము కోరుకార్యమున నాసక్తురాల నయియే యుందును. అనఁగా రావణాసురునింట నిన్ను రప్పించుటకే యుందును. అదియు నానామృగగణాకీర్ణమే. సింహవ్యాఘ్రాదిక్రూరజంతుసాంద్రమే. అనఁగా భయంకరజంతువులు దానవులకు వాహనములు. తక్కినవి వారి భక్ష్యములు. కావున నయ్యదియు వనసమానమే. అదియు నిర్జనమే, దుర్గమమే. అయిననందు సుఖముగా నుందును. నే నుండినఁగాని నీవు రావలనుపడదనిసారము. నియతురాలనై యనఁగా నొక్క సంవత్సరకాలమున రాక్షసులఁ జంపవలయునన్న పట్టుపలకల దాననై యని భావము. బ్రహ్మచారిణి అనఁగా భగవంతుం గూడియే చరించుదానను. అనఁగా నిన్ను వదలనని భావము. అది యెట్లు? నీవెంటనుండియు నితరులకు రావణునింట నున్న యట్లు కనఁబఱచుచు నందు నిందును సుగ్రీవాదులయందు నెల్లెడల వ్యాపించియుందునని భావము. పరమాత్మవగు నీవెట్లు సర్వాంతర్యామివో నేనట్లే యని సారము. వీరుఁడవగు నిన్నుం గూడి విహరింతును. అనఁగా నీవు చెంతనున్నఁజాలును. దుష్టరాక్షసులఁ ద్రుంతునని భావము. ఈయర్థ మెట్లు పొసఁగునందు

రేని "వీర" అనుసంబోధన మిందుఁగలదు. వీరుఁడవగు నీతోఁడ విహరింతుననఁగా నీచెంతనుండి నేనే వీరవిహారము సలుపుదునని భావము. ఇట "మధుగంధిషు వనేషు త్వయా సహ రంస్యే" అని కలదు. ఇందొక విశేషార్థ మిమిడియున్నది. వసంతర్తువునందుఁ బరదేవి నుపాసింతురు. ఆదినము లాపరమేశ్వరికి సంతోషదాయకములని వారిభావము. శరన్నవరాత్రములు యుద్ధదినములు. వాసంతనవరాత్రములు విహారదినములు. నవరాత్రములనఁగాఁ దొమ్మిదినిశలే యనికాదు. వసంతర్తువునందు దేవి నారాధించువారు యథాశక్తి న్యాయము ననుసరించి యారాధింతురు. వసంతర్తువంతయు నామహాకార్యమునందే యాసక్తులై యుందురు. అట్టి యారాధనము భక్తులకు విశేషఫలదాయకమగును. ఆకాలమునందే యాటవికులు దేవియాగము చేయుదురు. వారు కూడ నాదినములు పరమాహ్లాదకరములని భావించియే దేవికి జాతర చేయుదురు. కావున దండకారణ్యవాసులకెల్లరకు దర్శనమొసంగి వారి నుద్ధరించుటకు వారివలనఁ బూజలంది నినుఁగూడి విహరింతు ననునాశయమును సీత వెలిపుచ్చెను. మహాకవిపదములకూర్పెంత సరసముగ నున్నదో మహాశయులు గ్రహింతురుగాక.

"లౌకికానాం హి సాధూనాం మర్థం వాగనుధావతి,
ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోఽనుధావతి."

యన్న మహాకవిప్రయోగము వ్యర్థము కాదుకదా. ఇట్టు ఘట్టమున నర్థవిశేషములఁ బరికింపవలయును.

"త్వం హి శక్తో వనే కర్తుం రామ సంపరిపాలనం,
అన్యస్యాపి జనస్యేహ కింపునర్మమ మానద."

"సహ త్వయా గమిష్యామి వనమద్య న సంశయః,
నాహం శక్యా మహాభాగ నివర్తయితుముద్యతా." ౧౪

అని మూలము. విశేషార్థ మిం దిట్లు గ్రహింపఁదగు. మానద! మర్యాద నొసంగువాఁడవు. ఏయేభక్తు లెంతమర్యాద కర్హులో వారి కంతమర్యాద నిత్తువు. వారిని గాపాడుదువు. "కింపునర్మమ" నామాట చెప్పనేల? అనఁగా సకలభువననిర్మాణపరిపాలన సంహారరూపమర్యాద నాకొసంగితివి. నీవిచ్ఛగించినంతన నొకక్షణమాత్రమున నేనెల్లకార్యముల నొనరించుచున్న దానను. అట్టి నన్నుఁ బాలింప నేల యనుమానించి రావలదందువని సీత ప్రశ్నించుచున్నది. మహాభాగ! శ్రీరామా! కావున నిన్నుఁగూడి యడవికి వత్తును. సంశయమే లేదు. "ఉద్యతాహం నివర్తయితుం న శక్యా" రాఁదలంచిన నన్ను మరలింప శక్యమే కాదు. అనఁగా నాసంకల్ప మమోఘమని యెఱుంగుము. ఈవాక్యము సీతాదేవి మహామాయయే యని స్థిరపఱచుచున్నది. కొందఱీవాక్యము సీతాపాతివ్రత్యమునకు భంగమని పలుకుదురు. "సహ త్వయా గమిష్యామి" అన్న వాక్యమేల ప్రయోగించెనో మహాకవి యని వారెఱుంగరు. భగవత్సాన్నిధ్యమున భగవతి యేకార్యమునైనఁ జేయఁజాలునని మన మెఱుంగవలయు.

"హరిస్త్వామారాధ్య ప్రణతజనసౌభాగ్యజననీం,
పురా నారీ భూత్వా పురరిపుమపి క్షోభమనయత్."

అని మహాత్ము లుపదేశించిరి. పరమేశ్వరు నిచ్ఛాశక్తి నారాధించియే త్రిమూర్తులు సృష్టిపాలనసంహారక్రియాదక్షులైరని మన మెఱుంగవలయును.

"ఫలమూలాశనా నిత్యం భవిష్యామి న సంశయః,
న తే దుఃఖం కరిష్యామి నివసంతీ సహాత్వయా. ౧౫
ఇచ్ఛామి సరితశ్శైలాన్ పల్వలాని వనాని చ,
ద్రష్టుం సర్వత్ర నిర్భీతా త్వయా నాథేన ధీమతా." ౧౬

అని మూలము. భగవతి యారాధనక్రమము నుపదేశించు చున్నది. ఆరణ్యమే కాంతస్థలము. అనఁగా నుపాసనార్థము. భక్తుఁడు పరమైకాంతస్థలమునఁ గూరుచుండి యిష్టదైవము నారాధింపవలయును. భక్ష్యభోజ్యాద్యమూల్యపదార్థములు లేక పోయెఁగదా యని కొఱంతనొందఁ బనిలేదు. దొరకినపదార్థ ములనే సమర్పింపవచ్చును. దాన నిష్టదైవ మానందించును. జపయోగ్యస్థలములు మహానదులు పర్వతాదులు. అందుపాసకు నకు విఘ్నములుగలిగించువా రుండరు. కావుననే సీతాదేవి పర్వతనదీప్రముఖస్థలముల నిన్నుఁ గూడి విహరింతునని తెలి పెను. కావున భగవతి కేయేస్థలములు విహారార్థములో ఆస్థల ములయందే భక్తుఁడు నిలిచి దృఢభక్తి నారాధించిన నా దవి సంతుష్టురాలగు. భక్ష్యవిశేషములు లేవని కొఱంతపడువాఁడు భక్తుఁడు కాఁడు.

"ప్రదీపజ్వాలాభిర్దివసకరనీరాజనవిధి
సుధాసూతేశ్చంద్రోపలజలలవైరర్ఘ్యరచనా,
స్వకీయైరంభోభిస్సలిలనిధిసౌహిత్యకరణం
త్వదీయాభిర్వాగ్భిస్తవ జనని వాచాం స్తుతిరియం."

అని శ్రీశంకరభగవత్పాదాచార్యులవారు తెలిపిరి. కావున నభీష్టదేవతను విజనస్థలమునఁ గూరుచుండి యుపాసించి యందు దొరకినపదార్థముల నర్పించుచు నారాధింపవలయును. అద్దియే

చక్కనిసేవ. అట్టివానిపై నిష్టదేవత యుంచుకయే నాగ్రహింపక పరమానందమున వాని నుద్ధరించును. అను నీరహస్య విశే- ఘట్టము మనకుఁ దెలుపుచున్నది. "త్వయా ధీమతా నాథేన నిర్భితా" "బుద్ధిమంతుఁడవు నాథుఁడవునగు నీతో" అనునర్థము నిస్సారము. ఇంగితజ్ఞుఁడవని యర్థము చెప్పవలెను. అనఁగా నాయత్నము నెఱింగినవాఁడ వనుభావము తేలెడిని. అట్టినాథుఁ డవు నీవు చెంతనుండఁగా నిర్భయముగా నన్ని కార్యములు సాధింతునని సీతాహృదయము.

"హంసకారండవాకీర్ణాః పద్మినీస్సాధుపుష్పితాః,
ఇచ్ఛేయం సుఖినీ ద్రష్టుం త్వయా వీరేణ సంగతా. ౧౬
అభిషేకం కరిష్యామి తాసు నిత్యం యతవ్రతా,
సహ త్వయా విశాలాక్ష రంస్యే పరమనందినీ." ౧౭

అని మూలము. ఉపాసకుఁడు సాధువులగుపక్షులం గాంచుచు భగవత్యారాధనమునకు యోగ్యములగుపద్మములుగల కమలా కరములం బరికించుచు మనస్సంతోషము గలిగియుండవల యును. ఆరాధనవిశేషమునకు హోమమునకుఁ గమలములు మిక్కిలి యోగ్యములు. ఇష్టదేవతను గమలములఁ బూజించుచు హోమమును గమలములతోఁ జేసిన మంత్రసిద్ధి యగును. అందు నాదిమదంపతులను బూజించుట యత్యుత్తమము.

"ఇయమంబా జగద్ధాత్రీ పురుషోఽయం సదాశివః."

అన్నభావమున సంసారయాత్ర సాగింపవలయునని చెప్పఁబడి నది. సగుణోపాసనమునందు నిష్టదేవతారాధనమున సతీపతు లను బూజించు టత్యుత్తమమని పెద్దలమతము. కమలాకర

ముల స్నానము చేయుటయు మంచిది. ఈయర్థ మీఘట్టము నుండి గ్రహింపవలయును.

"ఏవం వర్షసహస్రాణాం శతం వాహం త్వయా సహ,
వ్యతిక్రమం న వేత్స్యామి స్వర్గోఽపి న హి మే మతః." ౧౯

అనునీమూాల ముపాసకుని మంత్రసిద్ధిరూపానందమును దెలియఁ జేయుచున్నది. యోగి భగవత్తేజోరూపమును హృదయాకాశమునఁ గాంచుచు శతవర్షములు, సహస్రవర్షములు మేను మఱచియే యుండును. ఆయానందము ననుభవించుయోగి స్వర్గసుఖమును దలంపనైనఁ దలంపఁడు. పరమేశ్వరుఁ డానంద రూపుఁడు భక్తుఁడు తన్మయుఁడై యానందమయుఁడే యగును గదా. ఆస్థితియందా యోగికిఁ గాలపరిమితి తెలియకయుండును.

"ధన్యానాం గిరికందరే నివసతాం జ్యోతిః పరం ధ్యాయతా
మానందాశ్రుజలం పిబంతి శకునా నిశ్శంకమంకేశయాః,
అస్మాకం తు మనోరథోపరచితప్రాసాదవాపీతట
క్రీడాకాననకేలికౌతుకజుషామాయుః పరం క్షీయతే." ౧౦౨

అనియు,

"కౌపీనం శతఖండజర్జరతరం కంథా పునస్తాదృశీ
నిశ్చింతం సుఖసాధ్యభైక్ష్యమశనం శయ్యా శ్మశానే వనే,
మిత్రామిత్రసమానతాతివిమలా చింతాథ శూన్యాలయే
ధ్వస్తాశేషమదప్రమాదముదితో యోగీ సుఖం తిష్ఠతి." ౧౦౦

అనియు భర్తృహరి బోధించియే యున్నాఁడు. కావున నే భక్తునిమనస్సు కాలభేదమును గనుఁగొనక యిష్టదేవతాజ్యోతీ రూపమునే కాంచుచుండునో యాతఁడే యోగి, ఆతఁడే సిద్ధుఁడు. ఇదియే మంత్రసిద్ధికి లక్షణము. అనువిషయ మీా

భాగమునుండి మన మెఱుంగవలయును. ఇం దొక్క విశేషము కలదు. ఉపాసకుఁడు స్వేష్టదేవతారూపమును ధ్యానించుపద్ధతి యెట్టిదని యెఱుంగుటయే విశేషము. కేవలస్తోత్రములు పఠించుట దేవతాచరిత్రములు పారాయణము చేయుట యనునవి సిద్ధి నీయఁజాలవు. ధ్యానమే మంత్రసిద్ధి నీఁజాలును. బాహ్యపూజాదులు ప్రారంభమునఁ బనికివచ్చును సర్వదా వాని యాచరించుచుండిన నిరర్థకము. కనుకనే శ్రీశంకరాచార్యుల వారిష్టదేవతాధ్యానలక్షణము నిట్లు తెలిపియున్నారు.

"సుధాసింధోర్మధ్యే సురవిటపివాటీపరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చింతామణిగృహే,
శివాకారే మంచే పరమశివపర్యంకనిలయాం
భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీం."

ఆరాధనక్రమము రెండువిధములు. సమయాచారమని కౌళాచారమని వానిపేరులు. సమయాచారమనఁగా ఆంతరపూజానిరతి. కౌళాచారమనఁగా బాహ్యపూజానిరతి. సమయమతమే యోగమతము. అందు నిష్టదేవతాధ్యానమే పూజ యని యెఱుంగవలయు. అట్టివారు సిద్ధిగాంచుట యనఁగా నిరంతరము ధ్యేయవస్తువును దేహోమయముగాఁ జూచుటయే. అవ్యయానంద మనుభవించుచు బాహ్యప్రపంచమును మఱతురు. ఆస్థితి నుండువారలకు స్మృత్యుదితాచారములు పనికిరావు. దివానిశముల భేదములుకూడ వారెఱుంగరు. ఆస్థితి కలుగుటకే సిద్ధి యని పేరు.

దేవాలయములయందుఁగల పాషాణాది ప్రతిమల నారాధించినవారికి ఫలము ప్రసాదమే. ప్రసాదమనఁగా దయ యని

కాదు ఆహారపదార్థమే. వంచకులు కొందఱు విగ్రహములం జూపి యిది యనాదియని వినుతించి ధనము నార్జింతురు. అట్టి కపటనాటకసూత్రధారులగు కుయోగులవేషమునకు మోసపోవక భగవంతుని ధ్యానింపవలయును. కొంతకాలమునకా ధ్యానమే మనోనిర్మలత్వమునాపాదించును. భగవదనుగ్రహమద్దాననే కలుగును. నిరంతర మాయోగి పరమేశ్వరు నిష్టరూపుని ధ్యానించును. ఈపూజయం దాసక్తులగువారలకుఁ దుచ్ఛబుద్ధులకుఁ గలదేవతాభేదము లుండవు. కావున ధ్యానము త్తమోత్తమము.

"అహం గమిష్యామి వనం సుదుర్గమం మృగాయుతం వానరవారణైర్యుతం,
వనే నివత్స్యామి యథా పితుర్గృహే తవైవ పాదావుపగృహ్య సంయతా.

ఈమూలమునకు గోవిందరాజులు విశేషార్థము వ్రాసిరి.

"అత్రేదమవధేయం. వనే మారీచమృగో భవిష్యతి; తత్ప్రసంగేనావయోర్వియోగస్స్యాత్. తత్ర కో వా పునర్ఘటకః? కథం త్వం తు మయా వినా స్థాతుం శక్తాసీతి చింతయంతం రామం ప్రతి సీతా సూచయతి వానరవారణైరిత్యాది. తథాహి.—మృగో మారీచః వానరవారణైర్వానరశ్రేష్ఠైః, సుగ్రీవాదిభిః పునర్వ్యగ్రహణాద్వనేఽపి అశోకవనేఽపి వత్స్యామి. పునస్తవైవ పాదావుపగృహ్య సంయతా నియతా భవిష్యామీతి."

ఇది వారివ్యాఖ్య. దీని నించుక విమర్శింతము. వనములకు సీతను బిలుచుకొనిపోయిన మృగరూపమున మారీచుఁడు వచ్చును. వానిమూలమున నాకును సీతకు వియోగము సంభవించును. నన్ను వదలి యెట్లుండఁగలదు? అని యాలోచించుచుండు శ్రీరామునకు సీత సూచించుచున్నది. ఏమని? అశోకవనమున నుందును. మనకిరువురకు మరల సంగతిని గల్పించువారు సుగ్రీ

వాదివానరశ్రేష్ఠులు. నేనాయశోకవనమున నీపాదములు తలంచుచు నియతురాలనై యుందును. అని.

మహాశయులారా! వీరియాశయమునుబట్టి పరికింపఁగా రాఁగలకష్టములన్నియు నిరువురకుఁ దెలిసినవే యని తేలెడిని. అప్పుడు సీతారాములు ప్రకృతిపూరుషు లనుట కేసంశయములు లేవుకదా. ఇట్లు లుండఁగా మధ్వవైష్ణవులు కొందఱు, నేను శాస్త్రము ననుసరించి యర్థము వ్రాసితినని, యది రామాయణాభిప్రాయము కాదని సూచించిరి. సీతారాములకు భావికాలజ్ఞానము లేదందురేని యీవ్యాఖ్యకుఁ దిలోదకము లీవలసివచ్చును. దీనిని బ్రమాణము కాదనరు. దీని నంగీకరించినచో నావ్రాసినయర్థము నంగీకరింపక తప్పదు. కావున మధ్వవైష్ణవుల యభిప్రాయము సమంజసము కాదనియే సిద్ధాంతము. ధనార్జనవ్యగ్రమనస్కు లితరులభావము లెంత సద్భావములైన నంగీకరింతురా? ఇఁక నిందలివిశేషముల నించుక పరిశీలింతము. శ్రీరామా! మృగరూపమున మారీచుఁడు నీమూలమున సత్పదమునొంద నువ్విళ్లూరుచున్నాఁడు. వానరేంద్రులగుసుగ్రీవాదులు నీకుఁ దోడ్పడి నీసంగతి నానంద మనుభవింప వాంఛించియున్నారు. తండ్రియింట నున్నట్లే నీయందు ననుపమానభక్తిగలరావణునియింట నశోకవనమున నుండఁగలను. నాకడకు నీవు రాఁగలవు. తండ్రియింట నే నుండఁగాఁ బిలువనిపేరింటముగా నీవు రాలేదా. నీరాకవలనఁగాని రావణాదిభక్తులకు శాపవిముక్తియు ముక్తియుఁ గలుగదు. నే నందుండియే నీపాదారవిందములను గ్రహింతును. ఎట్లు? నియతురాలనై అనఁగా నీపాదారవిందములు లంకాద్వీపమును స్పృశించునట్లు నియతించూని యొనరింతును. నేనున్నతావుకు నీవు రాక తప్పదనుభా

వముసూచింపబడినది. కావున నేను నీవెంట రావలయును. నీకంటె ముందే దండకారణ్యమును బ్రవేశింతును. నాకారణమున నే విరాధాదిదనుజులు సత్వరమునొందుదురు. అని సీత పలికెను.

జనపదవాసులు నగరవాసులు మనల దర్శించి తరింతురు. వనజంతువులందును బరిపక్వజీవులు కొందఱుందురు. వారా రూపమును బాపవశమునం గాంతురు. వారుగూడఁ బాపఫలానుభవము ముగియఁగా మిగిలినపుణ్యమున మనలఁ గాంచి తరింపవలదా? గజములు వానరములు నితరమృగములుకూడ నస్మద్దర్శనమునఁ దమపుణ్యము ఫలింపఁగా ముక్తింగాంచవలయును. నేను లేకయున్న నీకు రూపమే లేదు. నిన్నెట్లు చూడఁగలవు? కావున నన్నుంగూడి నీనడవులకరుగుటయే యీయవతారఫలమని సీత హెచ్చరించెనని మనము గ్రహింపవలయును. అశోకవనమున నీపాదముల ధ్యానించుచు నియతి నుందుననికదా సీతాదేవి పలికెను. సంవత్సర మేల యుండవలయును? అని కొందఱు ప్రశ్నింపవచ్చును.

"సుపరీక్షితశిష్యాయ దేయం వత్సరవాసినే."

అను ప్రమాణము కలదు. పండ్రెండువత్సరములుకొని పండ్రెండు నెలలదనుక శిష్యునిఁ బరీక్షింపవలయు ననునియమములు కలవు. రావణాసురుఁడు పరమశివభక్తుఁడు.

"యోఽహం సత్వం జగచ్చేదం సదేవాసురమానుషం,
మత్తో నాన్యదశేషం యత్తత్త్వం జ్ఞాతుమిహార్హసి. ౪౦
అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః,
వదంతి భేదం పశ్యంతి చావయోరంతరం హరః." ౪౧

విష్ణు. ౫ అంశము. 33 అధ్యా.

అన్న విష్ణుపురాణవాక్యము ననుసరించి పరమవిరక్తభక్తుఁడనియే భావము. అట్టిభక్తుని బరీక్షించి ముక్తినొసంగఁగోరియే ప్రకృతి లంకాపురమునఁ బండ్రెండునెలలు నివసించెను. శాపకారణమున ద్వేషించినట్లు రావణాసురుఁడు నటించినను, మహాభక్తుఁడు సకలవేదవేదాంగపారంగతుఁడు కావునఁ, దద్దర్శనమున గృతకృత్యుఁడయ్యెను. రావణునంతఃకరణము స్త్రీమోహానిబిడమే యైన నరకకూపమునఁ బడవలసినవాఁడే. సనత్కుమారుని హితోపదేశమువలన నట్టి పాపకార్యమునకుఁ గడంగెనని రామాయణమే తెల్పుచున్నది. త్రిలోకములఁగల స్త్రీలలో నెవ్వరెవ్వరు కారాగృహవాసము నొందఁదగు దుష్కర్మము నాచరించిరో వారెల్లఁ గర్మప్రేరితుఁడగు రావణాసురునిమూలమునఁ గారాగారశిక్ష ననుభవించిరి. వారలకెల్లరకు విముక్తికాలము రావణవిముక్తికాలము సమానకాలమే యయ్యెను. కావున సీతారూపమునఁ గనంబడుమహామాయ లంకానగరమునఁ బండ్రెండునెలలు నివసించెనని మన మెఱుంగవలయును. "పాదావుపగృహ్య సంయతా" అనువాక్యముధోరణింబట్టి భక్తుఁడు స్వేష్టదేవతాపాదారవిందములను నియతుఁడై మనశ్శిపదమున నిలుపుకొనవలయు ననువిషయమును గ్రహింపవలయును.

"అనన్యభావామనురక్తచేతసం త్వయావియుక్తాం మరణాయ నిశ్చితాం,
నయస్వ మాం సాధు కురుష్వ యాచనాం న తే మయాఽతో గురుతా భవిష్యతి."
—ఐ.

అని మూలము. ఇది సీతాదేవి చేయఁబూను కార్యమును బోధించుచున్నది. 'త్వయా అవియుక్తామ్' అని పదవిభాగ మిా

యర్థమునఁ జేయవలయు. ఇతరభావములేక యనఁగా నీవేమి సంకల్పించితివో దానినే నేనును సంకల్పించితినని భావము. అనురక్తచేతసం సులభము. త్వయా అవియుక్తాం=నీతోటి యెడఁబాటులేనిదాన నని భావము. మరణాయనిశ్చితామ్ = మరణరూపలాభము గలుగునను నిశ్చయము కలదాన నని భావము. 'ఆయ'మనఁగా లాభము. అనఁగా దుష్టమారణరూపలాభమును నిశ్చయించియున్నదాన నని సారము. అట్టి నన్నుఁ దోడుకొని పొమ్ము. నా ప్రార్థనమును సఫలము చేయుము. అనఁగా నాకోరిన కార్యము నొనరింప సమ్మతింపుము. నావలన నీకుఁ గష్టము కలుగదు. నాకు శక్యముగానిపని లేదుగాన నీవు ప్రయత్నించి చేయఁదగుపని లేదని తాత్పర్యము. లోకమునఁ దనయందనురక్తి గలిగి యనన్యభావ గ్రైయుండు భార్యను వదలి యేధర్మకార్యము చేయరాదనియు, నెట్టితీర్థయాత్రలు చేయరాదనియు నీతిని గ్రహింపవలయును. ధర్మపత్ని యనుభావమును భర్త మఱువరాదనియే యర్థము. ప్రకృతిలేక భగవంతుఁడు భార్యను వదలి భర్తయు నేకార్యము చేయఁజాలరనియే యిటఁగల సారము. ఇట్టు లీఘట్టము భగవతియగు సీతాదేవి సద్భావమును వెల్లడించుచు గురుశిష్యధర్మములను దెలుపుచు నుపాసకుని కృత్యములఁ దేటపఱచుచున్నది ఇఁకఁ నధ్యాత్మరామాయణభాగముం బరిశీలింతము.

"తస్మాద్భద్రే గృహే తిష్ఠ శీఘ్రం ద్రక్ష్యసి మాం పునః,
రామస్య వచనం శ్రుత్వా సీతా దుఃఖసమన్వితా. ౨౦
ప్రత్యువాచ స్ఫురద్వక్త్రా కించిత్కోపసమన్వితా,
కథం మామిచ్ఛసే త్యక్తుం ధర్మపత్నీం పతివ్రతాం. ౨౧

త్వదన్యా మదోషాం మాం ధర్మజ్ఞోఽసి దయాపరః,
త్వత్సమీపే స్థితాం రామ కో వా మాం ధర్షయేద్వనే. ౭౨

... ...

బాల్యే మాం వీక్ష్య కశ్చిద్వై జ్యోతిశ్శాస్త్ర విశారదః. ౭౫
ప్రాహ తే విపినే వాసః పత్యా సహ భవిష్యతి,
సత్యవాదీ ద్విజో భూయాద్గమిష్యామి త్వయా సహ. ౭౬
అన్యత్కించిత్ప్రవక్ష్యామి శ్రుత్వా మాం నయ కాననం,
రామాయణాని బహుశశ్శ్రుతాని బహుభిర్ద్విజైః. ౭౭
సీతాం వినా వనం రామో గతః కిం కుత్రచిద్వద,
అతస్త్వయా గమిష్యామి సర్వథా త్వత్సహాయినీ. ౭౮
యది గచ్ఛసి మాం త్యక్త్వా ప్రాణాంస్త్యక్ష్యామి తేఽగ్రతః,
ఇతి తం నిశ్చయం జ్ఞాత్వా సీతాయా రఘునందనః.'' ౭౯

అధ్యాత్మ. ౫ సర్గము.

ఇందలి సీతాసంభాషణమును బరికింతము. దైవజ్ఞుఁడొకఁడు చిన్నివయసున సీతం గాంచి పెనిమిటితో నడవుల నివసింతువని పలికెను. ఆతఁడు సత్యవాది కావున నామాట తప్పదు. కనుక నీతో వత్తునని పలికి మరల నిట్లు చెప్పెను. రామచంద్రా! పెక్కు రామాయణములు వింటిని. అందెందును సీతను వదలి రాముఁ డడవికిఁ బోయినట్లు చెప్పఁబడలేదు. ఎప్పుడైన నేను నింటనుండ నీవు పోయితివా? చెప్పుము. కావున నెల్లప్పుడు నీకు సాయపడుచు నుందును. కాన నన్నుఁ దోడ్కొని పొమ్ము. ఇదియే యిటఁగలసారము. ప్రతియుగమునందును రామాయణము గలదా? ఆపక్షమున నెల్లరకు రామచరిత్రము తెలిసియే యుండవలదా? వాల్మీకియే యాచరిత్రముల రచించెనా? వేఱొక్క కవియా? అని కొందఱు ప్రశ్నింతురు. కాని వారు చక్కఁగ

నాలోచించి ప్రశ్నము చేసినవారు కారని తోఁచెడిని. ప్రతిత్రేతా యుగమునందును రామావతారము సీతాపహరణాదులుండవు. ఈచరిత్ర మీయుగమునకు ముందు రెండవయుగమున సాగినదే. ఆచరిత్రమునే పెక్కండ్రు విషయము నించుక మార్చి వ్రాసిరి. కొందఱు కథాప్రధానముగ వ్రాసిరి. కొందఱు తత్త్వమే ప్రధానముగ వ్రాసిరి. మఱికొంద ఱించుక కథను మార్చి వ్రాసిరి. వారివారిభక్తిననుసరించి బహువిధములుగా వ్రాసిరి. ఎన్నివిధములగుమార్పులున్నను సీతను బురమునవదలి రాముఁ డొక్కఁడే యడవులకుం బోయినట్లు మార్పుఁబూనలేదు. బహుశః అనఁగాఁ బెక్కుసారులని యర్థము. కాని అనేకములు జరిగినవని యరము కాదు. కనుక నిట్టిశంకలు కలుగ నవకాశమే కనఁబడదు. 'సర్వథా త్వత్సహాయినీ" అను నీసీతా వాక్యమున నొకరహస్యార్థము కలదు. సర్వప్రకారముల చేతను సాయపడుదును. అనఁగా భావమేమి? రామా! నిమిత్తమాత్రముగ నీవుండుము. నీసన్నిధినుండి సర్వకార్యములను నేనే సాధింతును. ఇది సీత మూలప్రకృతి యని స్థిరపఱచుటలేదా? ట్టిఘట్టములనైన నేను నిలిచి యాకార్యమును సాధింతునని కదా దీనిభావము. ఈయథార్థ్యాత్మ రామాయణముకూడ శ్రీరాముని నిర్లిప్తత్వమును, ప్రకృతి సర్వకార్యకర్త్రి యనుభావమును దేటపఱచును. భగవదనుగ్రహము నొందెననఁగాఁ బ్రకృతి కృపకుఁ బాత్రుఁ డయ్యెననియు, దాన భగవత్సాయుజ్యము నందుననియు భావము. ఈయర్థమునే

"త్వదన్యః పాణిభ్యామభయవరదో దైవతగణ
స్త్వమేకా నైవాసి ప్రకటితవరాభీత్యభినయా,

భయాత్త్రాతుం దాతుం ఫలమపి చ వాంఛాసమధికం,
శరణ్యే లోకానాం తవ హి చరణావేవ నిపుణౌ."

అను నీశ్లోకరూపమునఁ దేటపఱచిరి. అనఁగా భక్తరక్షణము, అసాధుశిక్షణము ప్రకృతిస్వభావములు. తదనుగ్రహపాత్రులగు దేవతలు, త్రిమూర్తులు లోనగువారు తత్కింకరులు. వారిచ్చుఫలము లత్యల్పములు. కావున నారాధనమునఁ బ్రకృతియే ప్రధానముగా నుండుననిని తేలెడిని. ఇట్టి లీసీతాభిప్రాయమును మనస్సున నిల్పినఁగాని రామాయణసత్యార్థము బోధపడదు. కావున నీఘట్టమున సీతాదేవి వచియించిన ప్రతివాక్కునందును మహార్థ మిమిడియున్నదని యెఱుంగవలయును. ఇఁకఁ దరువాతికథాభాగమును బరిశీలింతము.

వనవాస కష్టములను రాముఁడు సీతకుం దెల్పుట.

* రామచంద్రుఁడు ధర్మస్వరూపము నెఱింగినవాఁడు. కావున సీత పట్టుదలఁబూని యిట్లు పలుకుచున్నను వనవాసకష్టములఁ దలంచుచు నామె నడవులకుం బిలుచుకొనిపోవ నంగీకరింపకపోయెను. అశ్రుపూర్ణలోచనయై యుండుసీత నాశ్వాసించుచు నయోధ్యయందే నిలుపఁబూని యిట్లు పలికెను. జానకీ! సద్వంశసంభూతురాలవు. ధర్మజ్ఞురాలవు. కనుక నిందే యుండి ధర్మముల నాచరింపుము. నీమనస్సుఖమునే కోరకుము. నామాట నాలకించుట నీకు ధర్మముసుమీ. కనుక నీమనస్సునకు సమాధానమగునట్లు చేయఁదగుధర్మములను జక్కఁగా నాచరింపుము. నీ వబలవు. కనుక నాచెప్పినట్లు నీవాచరింపవలయుఁగాని

*ఇది యిరువదెనిమిదవసర్గమునుండి సంగ్రహింపఁబడినది. అధ్యాత్మరామాయణార్థము నిం దిమిడియుండును.

స్వాతంత్ర్యమును బూనకుము. వనములఁగలకష్టముల నెఱుంగవు. వానిం దెల్పెదను. ఆలకింపుము. వనవాసబుద్ధిని వదలుము. మహారణ్యముల ననేకశ్రమములు కలవని యెల్లరు పలుకుదురు కాదే. ఈమాట నేను నీక్షేమము నాశించియే పలుకుచున్నాఁడను. నిన్ను భరించుట కష్ట మనునభిప్రాయమున నిట్లు పలుకలేదుసుమీ.

వనముల నెల్లప్పుడు సుఖమే కలుగదు. దుఃఖమే కలుగును. నని నాభావము. సెలయేళ్ల చప్పుడులు గుహాలయందుండు సింహముల భీషణనాదములు విన శక్యమా? కనుకనే వనవాసము కష్టమంటిని. మనుష్యసంచారము లేనితావుల భయమన నెఱుంగక స్వేచ్ఛగా విహరించుచుఁ గ్రొవ్వినసింహవ్యాఘ్రాదిమృగములు మనలం గాంచి మున్ను చూడనికతన ద్వరపడి వధింప నెదురు వచ్చును. అట్టివనమున నుండుట శ్రమము కాదా? నదులు మకరములంగూడి పంకముతోఁగూడి మదించినయేనుఁగులుకూడ దాఁట శక్యము గానియట్టు లుండును మార్గములు సుగమములుకావు. తీఁగెలల్లుకొని కాళ్లకుఁ జుట్టుకొనును. ముండ్లు గుచ్చుకొనును. అడవికోళ్లు భయము నొదవించునట్లు కూయుచుండును. కనుక వననివాసము కష్టము. నీరు దొరకదు. ప్రవేశింపఁ దరమేకాదు. పగలెల్ల నాహారముకొఱకు తిరుగవలయు. ఆకష్టమున దేహ మలసటఁజెంది రాత్రులయందుఁ గ్రిందరాలిన యాకులం బఱచుకొని శయనింపవలయును. కాన నడవినుండుట కష్టము. జానకీ! దివానిశములు పరిపక్వములై రాలినఫలములను తినవలయును. దాన సంతుష్టినొందవలయును. ఇతరవిధమగు నాహారము మఱెద్దియు లభింపదు. కనుకనే వనవాసము కష్టము. ంతియ కాదు. ఓపినకొలఁది నడవుల నుపవాసములు సలుపం

దగును. నారచీరలు కట్టుకొని జడలఁ దాల్పవలయును. నిరంతరము దేవతలకుఁ బితృదేవతలకు నపుడపుడు వచ్చుచుండునతిథులకుఁ బూజచేయవలయును. నియమమునే సర్వదా పూనవలయును. త్రికాలములయందు స్నానము చేయవలయును. అట్లుండుట కష్టముకాదా? వానప్రస్థులవలెనే తానే పూవులం దెచ్చి నిత్యమగ్ని వేదికయందు బలికర్మము చేయవలయును. వనవాసులు నియతాహారులై యుండవలయును. ఫలము లెన్ని దొరకినవానితోఁ దృప్తినొందవలయును.మిక్కిలికోర రాదు.అది కష్టముకదా? వనవాతములు హెచ్చుగా వీచుచుండును. రాత్రులయం దంధకారము దట్టముగా నుండును. ఆఁకలి హెచ్చుగాఁ బొడసూపును. ఇవి యన్నియు భయంకరములు కావా? కనుక నడవి నుండుట మిక్కిలి కష్టము. కొండచిలువలకు దేహము చాలఁ బెద్దది. అవి మడించి యందందుఁ బొరలాడుచుండును వానిం గనినంత నీవంటియాఁడువారికి భయముకలుగకమానునా? నదులయం దేయుండి వానివలెనే వంకరగాఁ బోవునట్టి పాములు త్రోవకడ్డముగాఁ బండుకొనియుండును. మిడుతలు తేళ్లు పురుగులు నడవియీఁగలు లోనగునవి యెల్లవేళల బాధించుచునుండును. ఆబాధలకు నీ వోర్వఁజాలవు. కంటకద్రుమములు గడికలుతెల్లు పెరిగియుండును. చెట్లకొమ్మలొండొంటం బెనచుకొనియుండును. అడుగు పెట్టుటయుం గష్టమే. అడవి నుండువారి కెన్నియోకష్టములు గల్గుచుండును. భయములెన్నో యోవిధముల గల్గును. కనుక నడవి భయంకరమే. అందుఁ గోపము లోభమును వదలవలయు. తపస్సునందే తలంపు లుండవలయును. భయంకరములగు సింహాదిక్రూరజంతువులు కనఁబడినను భయంపడరాదు. కనుక నీకు వనగమ

నా సక్తి చాలును. నీవంటికాంతకు వనము తగినదికాదు. ఎంత యాలోచించినను వనవాసము కష్టమనియే నాకుఁ దోఁచెడిని. అని శ్రీరామమూర్తి పలుకఁగా నాతనితలంపు తనను బిలుచుకొనిపోరాదని యుండు టెఱింగి సీత యామాటల నాదరింపక దుఃఖించుచు నారామచంద్రునిం గాంచి యిట్లు పలికెను.

మహాశయులారా! ఈభాగమున విమర్శింపఁదగినవిషయములు లేవు. ఒకటిరెండుతావులు విమర్శనార్హములు. వానిం బరిశీలింతము.

"క్రోధలోభౌ విమోక్తవ్యౌ కర్తవ్యా తపసే మతిః,
న భేతవ్యం న భేతవ్యే నిత్యం దుఃఖమతో వనం." ౨౪

అని మూలము. ఈఘట్టమున సీతను రామమూర్తి పరీక్షించుచున్నాఁడు. భయకారణములు తోఁచినపు డవ్వానిని లెక్కచేయనివారే యకార్యమున నర్హులు. కనుక వనమునఁ గల కష్టముల నన్నింటిని రాముఁడు తెలిపెను సీతమానస మురియాడునో లేదో యనియే రామమూర్తితలంపు. ఇదేటికి? అందురేని యీనెపమున స్త్రీలను బరీక్షించుపద్ధతుల లోకులకు నుపదేశించెనని మన మెఱుంగవలయును. ప్రాయికముగా స్త్రీలు సుఖమునే కోరువారు. సుఖభంగహేతు వేది యుండిన దాని వదలుదురు. అట్టివారెల్లరు లోకోపకారరూపధర్మమున నుపఁజాలరు. అట్టికష్టముల లెక్కింపక యుండువారే ధర్మరక్షణమహాకార్యమున నిలువఁదగినవారు. సకలకష్టములలో నగణ్యాము క్రోధమును జయించుట. మహాకష్టము.

"కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః,
మహాశనో మహాపాప్మా వి‌ద్ధ్యేన మిహ వైరిణమ్." ౩౭

అన్నగీతావాక్యము ననుసరించి క్రోధమును జయించుట మహా కష్టమని తేలెడిని. అట్టిక్రోధమును దానివంటిలోభమును వదల వలయునని రాముఁడు బోధించెను. అంతియగాక తపస్సనంగ మనస్సు నుడుపవలయు ననియె. ఈమూఁడును దఱచుగా స్త్రీలకు సాధ్యములుగానేరవు అట్టివి సాధ్యములు కావలయు నని రాముని యుపదేశము. దీనిసారమేమి? భగవంతు ననుగ్రహ మునుగోరువా రెవ్వరైనను క్రోధలోభాదిదుర్గుణములను వదల వలయును. అవి వదలి పరమైకాంతస్థలమునుండి యారాధింప వలయును. భయకారణములగు సింహవ్యాఘ్రాదులు కనఁబడి నను భయంపడరాదు. అనఁగా,

"సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని,
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః."

అన్నగీతాప్రమాణము ననుసరించి భయకారణమగు క్రూర జంతువు భయకారణము కాదనియు, నందున్న జ్యోతి భగవత్కళయనియు, నదియే తనయందు నున్నదనియు భావింపఁదగును. అట్టి సమదర్శనుఁడే నాయనుచరుఁడు కాఁదగినవాఁడు. వానినే నే నుద్ధరింతును. అని రాము నాశయమని మనము తెలిసికొన వలయును. ఇది మానసికపూజనే బోధించును. తపస్సు మనోనిగ్రహప్రధానకర్మము. తపస్సు చేయువారు స్వేష్టదేవతా మూర్తిని మనఃపీఠమున నిలుపుకొందురు. దానినే యోగ దృష్టిని బరీక్షించుచు బాహ్యప్రపంచమునే మఱచియుందురు. వారే యోగులనఁబడుదురు. విగ్రహములఁ బూజించుచు ధనా ర్జనముచేయుయోగులు వేషధారులు. కపటనాటకసూత్రధా రులు. అట్టివారిని భగవంతుఁడు విరోధులనుగా భావించును

కాని వారికిమాత్రము దేవాలయములయందు శర్కరాన్నము
గవత్ప్రసాదముగా దొరకును. అదియే వారికి ముక్తిసోపా
నము. మానసిక పూజ నాచరించువారి కట్టి ప్రసాదముదొరకదు.
అదృశ్యఫల మేదియో కలుగును. దాని నాశించువారే ముము
క్షువు లనంబడుదురు. అట్టివారు వనవాసము నే కోరుదురు. విజన
స్థలమే తపోయోగ్యము. నిస్సంగులే తపోనిష్ఠ కర్హులు. సత్సహ
వాసమే నిస్సంగత్వమును గలిగించును.

"సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహిత్వం,
నిర్మోహిత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః."

అని శ్రీశంకరభగవత్పాదాచార్యులుగారు బోధించిరి. కావున
విజనస్థలమునఁగూర్చుండి క్రోధలోభములవదలి యిష్టదైవము
నారాధింపవలయుననియు, మనస్సు సర్వభూతములయం దంత
ర్యామిగ నుండుభగవంతుని సమదృష్టిం గాంచవలయుననియు,
నట్టిస్థితియందుండుయోగి భగవత్కరుణకుఁ బాత్రుఁడగుననియు
నీశ్రీరామోపదేశము తెలుపుచున్నయది. ఇతరజంతువులవలన
మనకు బాధకలుగు నను భీతిని వదలవలయుననియుఁ దేటపఱచు
చున్నది. ఇఁకఁ దరువాతి సీతాదేవియాశయమును బరికింతము.

సీత రామమూర్తితోఁ దా నడవికి రాకమాననని తెలుపుట.

*శ్రీరాముని పలుకులకు సీత దుఃఖము పొంగిపొరలఁగాఁ
గన్నీరు మోమునుండి కాలువలుగట్టునట్లు ప్రవహింపఁగాఁ బ్రా
ణేశుం గాంచి మెల్లగా నిట్లు పలికెను. రామభద్రా! వనవాస

*ఈభాగము ఇరువదితొమ్మిదవసర్గమునఁ గలదు.

మున నేయేదోషములు కలుగునని చెప్పితివో అవియెల్ల నీస్నేహమునకుఁ బాత్రురాలనై నిన్నుంగూడియుండు నాకు దోషములే కావు. విశేషించి గుణములేయగును. మోహనాకారా! సింహవ్యాఘ్రాదిజంతువులు నీవంటి నిరుపమానాకారముగలవానిమున్నెన్నఁడు చూడనికతనఁ దటాలున నిన్నుం గాంచినంతన భయంపడి దూరముగాఁ బాఱిపోఁగలవు. అంతియకాని యెదురువచ్చి చంపునన్నది యంత యుక్తముకాదు. భయకారణము గలుగ నెల్లరు భయంపడుదురు. వానివలన నాకు భయముకలుగదు. నిన్ను నడవికిఁ బొమ్మన్నదియే నన్నుఁ బొమ్మని చెప్పినట్లే. మీపితృనానతి ననుసరించి నీతో నడవులకు నేనును బోనవలసినదాననే. నన్నువదలిపోదువేని నీవిరహమునకుఁ బ్రాణములు వదలవలసినది ధర్మమే. నీచెంతనున్ననన్ను దేవేంద్రుఁడైనఁ దిరస్కరించి తేజముదక్కించుకొనఁజాలునా? పతి నెడఁబాసిన సతి మాత్రము బ్రదుకఁజాలదు. ఈవిషయము నీవు విశేషించి బోధించియేయున్నవాఁడవు. రామా! నీవు ప్రాజ్ఞులలో నుత్తమోత్తముఁడవు. నాభావము నించుక యాలకింపుము. తండ్రియింటనుండఁగా నాకువనవాసముకలుగునని దైవజ్ఞులు చెప్పఁగా వింటిని. ఇది సత్యము. సాముద్రికశాస్త్రజ్ఞులగు బ్రాహ్మణులవలన వనవాసము నాకుఁ గలుగఁగలదని విని నాటంగోలె నెపుడు కానకుఁబోవుదునా యని యత్యుత్సాహముతో నున్నదానను. పెద్దలు నిర్ణయించినట్లే నేను గాననమునఁ గొంతకాలము నివసింపవలసిన దేకదా. పెద్దలడవికిఁబోవలసినదిగా నిర్ణయించినపుడు నేను నీతోడఁ బోవలయునేకాని వేఱొండురీతిని దానిం జెల్లింపవలనుపడదుకదా. మహనీయులయాజ్ఞానుసారము వచ్చుచున్నానుగాని నాయిచ్ఛచేతఁగాదు. నేనా పెద్దలమాటల సార్థకము

లను జేయ నీతోడ వచ్చెదను. దాని కనురూపముగాఁ గాలము వచ్చినది. కనుక నిఁక నీతోడ నరుదెంతును. ఆ పెద్దలవాక్కు సూత్రమే యగుఁగాక.

వనవాసమునందుఁ గష్టములు కలుగునని నేను నెఱుంగుదును జుమీ. వీరుఁడగు నీకవ్వి కలుగవు. మనోధైర్యము లేని వారికే యవి కలుగును. నేను గన్యకనై జనకునింటనుండి నా తల్లి కడనుంటిని. మంచియాచారములుగల యొకానొక తాపసస్త్రీ నన్నుం దిలకించి నీకుఁ గొంత కాలము వనవాసము కలుగునని పలికెను. ఆమాట వినియున్న దానను. అయోధ్యకు వచ్చినపుడు గంగాతీరగతతపోవన ప్రముఖములయందుఁ గొంత కాలము నివసింపవలయునని కోరుచుంటినిగదా ఈవాంఛ తీర్పుఁడని నాథా నిన్నెంతయుఁ బ్రసన్నునిగా మున్నే చేసికొనియున్న దానను. వనగమనము నాకుఁ బెద్దపర్వముగానున్నది. నీకు శుభముగలుగుంగాత. శూరాగ్రగణ్యుఁడవగు నీవు వనముల నుండఁగా నీకు శుశ్రూష చేయు కుతూహలము నాకెంతయో గలదు. నీవో యసూయాదులు లేని నిర్మలాత్ముఁడవు. నేను ప్రీతితోడ నాథుఁడవగు నిన్ను వెనుకొని యాశ్రయించి నాపాపముల నిర్మూలించుకొందును. ఇందే నిలిచి కులదైవములఁ బూజించినఁ బాపములు పోవునే యని యందువేమో. నాకుఁ బతియే దైవము. అంతకన్న మిక్కిలి దైవము లేఁడు. ఇహలోకమునందుంబలెఁ బరలోకమునందును నాకు నవిచ్ఛిన్నముగ నీతోడిసంగతి కలిగియే యుండును.

జనకుఁడు లోనగువారలే పురుషునకు నేకన్యకను స్వవర్ణాచారము ననుసరించి యుదకపూర్వకముగా నిత్తురో ఆ స్త్రీ పరలోకమునందు నాభర్తను గూడియే యుండును. అని ప్రావన

మగు నీ వేదవాక్యము మహాత్ములగు భూసురోత్తములు చెప్పఁగా వివియున్నదానను. సదాచారములుగలిగి పతివ్రతయునై జల ధారాపూర్వకముగాఁ బరిగ్రహించిన యీభార్యను నన్ను నీవు వనములకుఁ బిలుచుకొని పోనొల్లక యుండుటయేల? నీయం దత్యంతభక్తిగలదానను. సాధ్విని. నన్ను వదలిపోవుదు వోకో యని దుఃఖపడుచున్నదానను. సుఖదుఃఖములుగలిగినను నీయెడ సమానముగాఁ బ్రవర్తించుదానను. నీతోడిసుఖదుఃఖ ములే కలదానను. ఇట్టి నన్ను వదలిపోవరాదు. పిలుచుకొని పోవుటే నీకు నర్హము. ఇట్లు కోరు నన్ను వదలిపోయితివేని విషముభక్షించియో యగ్నింబడియో జలములంబడియో ప్రాణ ములఁ ద్యజించెదను. అని యాజానకి పెక్కురీతులఁ బ్రార్థించి నను రామమూర్తి నిర్జనారణ్యములకు సుకుమారయగు నా లేమ సంచరించుట కష్టమని తలఁచి తోడ్కొనిపోవ నంగీక రింపఁడయ్యెను. ఆమెయుఁ బతిభావ మెఱింగి కన్నీటిధారలచే భూమిని దడుపుచు దుఃఖించెను. అంతఁ గోపశోకంబులు పైకొనఁగాఁ గెమ్మోవి మఱియు నెఱ్ఱఁబాఱుచుండ నాసీతం గాంచి శ్రీరాముఁడు వనములకు రావలదని యెంతయు నాశ్వా సించెను.

మహామతులారా! ఈఘట్టమున సీతాదేవిమాటలు విమ ర్శింపఁదగియున్నవి. వాని నించుక యరయుదము.

"యే త్వయా కీర్తితా దోషా వనే వస్తవ్యతాం ప్రతి,
గుణానిత్యేవ తాన్ విద్ధి తవ స్నేహపురస్కృతాన్."

అని మూలము. నీస్నేహము నాపైనుండఁగా నరణ్యములఁగల్గు నన్నకష్టములు సుఖములే యని యెఱుంగుము. అనఁగా భావ

మేమి? సతీపతులు స్నేహరసపూరితాంతఃకరణులై యొందున్నను ఎన్నికష్టములు గలిగినను అవి సుఖములే యగును. ఈభావ సారమేమి? దంపతు లిరువురు నెడఁబాటులేక కష్టములను సుఖముల ననుభవింపవలయుననియే. భర్తతోడ ననుభవించుకష్టము సుఖముగఁ దలంపవలయును. అదియే పతివ్రతాలక్షణము. ఈయర్థమే మనుస్మృతియందు.

"పతిం యా నాభిచరతి మనోవాగ్దేహసంయతా,
సా భర్తృలోకా నాప్నోతి సద్భిస్సాధ్వీతి చోచ్యతే. ౨౯
వ్యభిచారాత్తు భర్తుః స్త్రీ లోకే ప్రాప్నోతి నింద్యతాం,
సృగాలయోనిం చాప్నోతి పాపరోగైశ్చ పీడ్యతే." ౩౦ అధ్యా. ౯.

అని చెప్పఁబడినది. అనఁగా స్మృతులకు రామాయణమునకు ధర్మోపదేశవిషయమున నైక్యమే కలదని మన మెఱుంగవలయును.

"పక్షిణస్సృమరాశ్చైవ యే చాన్యే వనచారిణః. ౩
అదృష్టపూర్వరూపత్వా త్సర్వే తే తవ రాఘవ,
రూపం దృష్ట్వాపసర్పేయుర్భయే సర్వేహి బిభ్యతి. ౪
త్వయా చ సహ గంతవ్యం మయా గురుజనాజ్ఞయా,
త్వద్వియోగేన మే రామ త్యక్తవ్యమిహ జీవితం." ౫

అని మూలము. భయంకరసింహవ్యాఘ్రాదులు పైఁబడి మనలఁ జంపఁజూచు నన్న రామచంద్రునివాక్యమునకు బదులిది. శ్రీరామా! అడవులఁగలక్రూరజంతువులు మున్నెన్నఁడుగానని యత్యద్భుత తేజోపబృంహితదివ్యసుందరవిగ్రహమును గాంచి భయంపడి పాఱిపోవును. ఎల్లజంతువులకు భయము తోఁచి పుడు పరుగెత్తుట స్వభావముకదా. అని సీత పలికెను. దీని

భావమేమి? మహానుభావా! ఎన్నియోజన్మములనుండి పాప కర్మముల నొనరించినకతన సింహవ్యాఘ్రాదిరూపము లలవడున్న అట్టి పాపజంతువులు సర్వపాపక్షయదక్షంబగు నీదివ్యమూర్తి దరి జేరఁగలవా? భక్తిలేనికతన వానికి నీరూపము వికారముగాఁ గనంబడును. కాన నవి భయంపడి పరుగెత్తును. భయ మెల్లరకు సమానఫలమునే యిచ్చునుగదా.

"శరీరజైః కర్మదోషైర్యాతి స్థావరతాం నరః,
వాచికైః పక్షిమృగతాం మానసైరంత్యజాతితాం. ౯
స్థావరాః కృమికీటాశ్చ మత్స్యాస్సర్పాస్సకచ్ఛపాః,
పశవశ్చ మృగాశ్చైవ జఘన్యా తామసీ గతిః. ४२
హస్తినశ్చ తురంగాశ్చ శూద్రా మ్లేచ్ఛాశ్చ గర్హితాః,
సింహా వ్యాఘ్రా వరాహాశ్చ మధ్యమా తామసీ గతిః." ४३

మను. ౧౨ అధ్యా.

"మహాపాతకజాన్ ఘోరాన్నరకాన్ ప్రాప్య దారుణాన్,
కర్మక్షయాత్ప్రజాయంతే మహాపాతకినస్త్విహ. ౨౦౬
మృగాశ్వసూకరోష్ట్రాణాం బ్రహ్మహా యోనిమృచ్ఛతి,
ఖరపుల్కసవేనానాం సురాపో నాత్ర సంశయః. ౨౦७
కృమికీటపతంగత్వం స్వర్ణహారీ సమాప్నుయాత్,
తృణగుల్మలతాత్వం చ క్రమశో గురుతల్పగః." ౨౦८

యాజ్ఞ. 3 కాండము

అను నీస్మృతులు వ్యాఘ్రాదిదుష్టమృగజన్మహేతువులం దెలుపుచున్నవి. ఇట్టి పాపములనొనరించినవానికి నీదివ్యదర్శన మానందజనకముగాక భయజనకమే యగును. కాన నవ్వి పాఱిపోవును

"సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ,
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః. ౫౨
నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా,
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా." ౫౩

గీత. ౧౧ అధ్యా.

అన్నగీతావాక్యప్రకారము దేవాదులకుంగాని నీరూపము చూడ గోరిక పొడమదు. క్రూరమృగము లట్టి నీరూపమును జూడఁగలవా. వానిపాపమే భయమును గలిగించి దూరముగాఁ దొలంగఁజేయును. అంతియ కాని యవి మనల బాధింపఁజాలవని సీత తాత్పర్యము. అర్ధశరీరముగలదానను గాన నిన్ను వనములకుం బొమ్మన్నపుడు నన్నును బోవలయునని యాజ్ఞయిచ్చినట్లే భావింపవలయును. కాని వేఱుగ నాకాజ్ఞ సేయనక్కఱ లేదు. ఈఘట్టమున గ్రహింపఁదగు విశేషవిషయ మేది ?

భగవత్కళ విశేషించి యేయేకోశముల నుండునో యావ్యక్తులం గాంచినతోడనే క్రూరబుద్ధులుగల వ్యక్తులన్నియు భయపడి తొలఁగిపోవుచుండును. అనఁగా నవి చేసికొన్న పాపమే భయముగొలిపి యాభగవత్కళను జూడకయుండఁ దొలఁగించునని భావము. ఇది సిద్ధాంతమే. ఏవ్యక్తి భగవత్కళాశేషమును బ్రీతితో గనుఁగొనఁగలదో యావ్యక్తి పాపకర్మము ణింపఁగాఁ బుణ్యకర్మము ఫలోన్ముఖముకాఁగా నుండఁదగు తి నున్నదని మన మెఱుంగవలయును. భగవత్కళావిశేషము కృతాత్ములకే చూడఁదగియుండునని సారము. మహాత్ములను ంచి కొందఱు నిందింతురు. ఏల? వారి తేజము వీరికి సహ్యము గాఁజాలదు. కావుననే ఏవగింపుగలిగి వారిని దూఱుదురు.

సుకృతవంతులు వారిం గాంచినంతన మహానందము నొందు దురు. ఇది యెల్లర కనుభవమే. ఐన నియ్యది యందులకనిమాత్ర మాలోచింపరు. ఊహించిన నెఱుంగరానివిషయ మిదికాదు. ప్రకృత మనుసరింతము. సీతాదేవి శ్రీరామునకు నీవిషయమునే తెలిపెను. మృగములు లోనగునవి నీదివ్యతేజస్సు గాంచినంతన దూరముగాఁ బరుగిడునుగాని చెంత నుండఁజాలవు. అట్టివారి నుండి నాకు భయ మెట్లు కలుగునో యెఱుంగఁజాలనని సీత ప్రశ్నించెను.

"న చ మాం త్వత్సమీపస్థామపి శక్నోతి రాఘవ,
సురాణామీశ్వరశ్శక్రః ప్రధర్షయితుమోజసా." ౬

అని మూలము. ఇచ్చట సీత తనతత్త్వమును దేటపఱచెనని మనము తలంపవలయును. పరమేశ్వరా! నీచెంతనున్న నన్ను నింద్రుఁడైనఁ దిరస్కరింపఁజాలఁడు. అనఁగా నతనితేజస్సు నామ్రోల నత్యల్పమని భావము. ఇందలిసారమేమి? ప్రకృతి పరమపురుషునినుండి బహిర్గతమైనపుడు అనఁగా భగవంతుఁడు ప్రవృత్తిమార్గమునఁ బ్రవేశింప నిష్టపడినపుడు తదిచ్ఛాశ రూపము కలదగును. ఆవ్యక్తియే సగుణబ్రహ్మమనంబడును. పురుషుఁడు తద్విశిష్టుఁడై తనసర్వసాక్షిత్వమును బ్రకటించుచు నుండును. మహాప్రకృతి త్రిమూర్తులంబుట్టించి సర్వబ్రహ్మాండ ములసృజించును. అట్టి ప్రకృతి నింద్రాదులు ఆచూడఁ జాలరు. భగవంతుఁడు నివృత్తిమార్గమునఁ బ్రవర్తింపఁబూను నపుడు ప్రకృతి యాతనియందు విలీనమగును అనఁగా నిచ్ఛలేక యతఁడుండును. కావున నెవ్వఁడుగాని భగవదిచ్ఛను జయింపఁ గలఁడా? ప్రకృతిని దూషించువారు తత్త్వము నెఱుంగఁజా-

రనియే సారము. ప్రకృతమున మన మెఱుంగఁదగువిషయమేది? రామా! నీవూరకయుండినను నన్ను నింద్రాదులుకూడఁ జూడఁ జాలరు. ఇఁకఁ గ్రూరమృగములమాట యిటనేటికి? అనఁగా సర్వకార్యములు నేనే యొనరించుచుందును. నీవు సర్వసాక్షివి కావున నాకార్యములం గాంచుచుండుమని సీత తెలిపెను. ఇదియే మన మెఱుంగఁదగుసారము.

"పతిహీనా తు యా నారీ న సా శక్ష్యతి జీవితుం,
కామమేవం విధం రామ త్వయా మమ విదర్శితమ్. ౭
అథ చాపి మహాప్రాజ్ఞ బ్రాహ్మణానాం మయా శ్రుతం,
పురా పితృగృహే సత్యం వస్తవ్యం కిల మే వనే. ౮
లక్షణిభ్యో ద్విజాతిభ్యశ్శ్రుత్వాహం వచనం పురా,
వనవాసకృతోత్సాహా నిత్యమేవ మహాబల. ౯
ఆదేశో వనవాసస్య ప్రాప్తవ్యస్స మయా కిల,
సా త్వయా సహ తత్రాహం యాస్యామి ప్రియ నాన్యథా. ౧౦
కృతాదేశా భవిష్యామి గమిష్యామి సహ త్వయా,
కాలశ్చాయం సముత్పన్నస్సత్యవాగ్భవతు ద్విజః." ౧౧

అని మూలము. ఈభాగము సీతారూప మహాప్రకృతి కార్యములను దేటపఱచుచున్నది. పరికింపుఁడు.

పతిహీనయగు పురంధ్రి బ్రదుకఁజాలదు. ఈవిషయము నీవే నాకుఁ బెక్కుసారు లుపదేశించితివి. అని సీత యనియెఁ గదా. దీనిభావమేమి? భగవంతుఁ డెందో భగవతి యందే యుండుననియు, వారికింగల యవినాభావసంబంధ మట్టిదనియు, వారిరువు రెడఁబాయు టసంభవమనియు, నీపద్ధతి యెఱుంగని వారు భగవత్తత్త్వమే యెఱుంగరనియుఁ దాత్పర్యము. శ్రీరామా! నీవు మహాప్రాజ్ఞుఁడవు. అనఁగాఁ "బ్రజ్ఞాత్రైకాల్య

గోచరా" యన్న న్యాయానుసారము త్రి కాలవే_త్తలలో నీవంటి వాఁడు లేఁడని యర్థము. అనఁగా నో భగవంతుఁడా యని తాత్ప ర్యము. బ్రాహ్మణులనఁగా బ్రహ్మము నెఱింగినవారు త_త్త్వవే లనుట. అట్టివారు నేను జనకునింటనుండఁగా నీసీత వనమున వసియింపఁదగును. అని పలికిరి. వారు లక్షణముల నెఱింగినవారు. అనఁగా నాయుత్ప_త్తి నాశరీరసౌభాగ్యము నెఱింగినవారు కను కనే నాయవతారము నెఱింగిరని భావము. అది నే విన్న నాఁటి నుండి నిరంతరము వనముల నివసింప నుత్సాహవంతురాలనై యున్న దాననని యర్థము. ఆ పెద్దలయాదేశము వ్యర్థము కాదు కదా. అడవుల నుండఁదగిన ట్లవతరించిన నేను నిన్నుఁగూడి యనఁగా ధర్మసంరక్షణార్థ మవతరించిన నిన్నుఁగూడి పోవఁ దగునుగదా? అందుల కిది తగినయదను అద్విజుఁడు సత్యవచనుఁ డగుఁగాక. అనఁగా ముఖ్యార్థమేమి? మనమిరువురము భూలోక మున నేల యవతరించితిమో ఆ కార్యము నెఱవేర్పఁదగినసమయ మొదవినది. ఇఁక నాలసింప నేల? పోవుదము. నాచిన్నతనమున నే మహాత్ములు బ్రాహ్మణులు నానివాసము కొంత కాలము వనముల యందని నిర్ణయించిరి. లోకసమ్మతముగా నావనవాసము చెల్లును. నిన్నుంగూడి యందుండవలయును. అనఁగా మనయిరువురమూల మునఁగాని యీమహాకార్యము సాగదు. నీచెంతనున్న నన్ను సేవించినఁగాని యా రావణుఁడు శాపవిము_క్తి నొందఁడు. నేనిందే యున్న నీయవతారమునకు ఫలము గలుగునా? అని సీత శ్రీరా మునిఁ బ్రశ్నించెను. నిన్నుంగూడి యుందుననఁగా సీతారాము లకు వా_స్తవమైన యెడఁబాటు లేదనియు నది భ్రాంతియే యనియు మన మెఱుంగవలయును. అగ్నికి దాహకశ_క్తికి నెట్లు వేఱుపాటు గల్పింప శక్యముకాదో యట్లే సీతారాములకు నెడఁ

బాటు లేదని సిద్ధాంతము. ప్రకృతియే కార్యకరణదక్షురా లనియుఁ, బరాత్పరుఁడు సాక్షిమాత్రుఁడుగ నుండుననియుఁ, దత్సాన్నిధ్యబలము లేకయుండఁ బ్రకృతి వేఱుగ నుండ దనియు, నాప్రకృతిం గైకొన్నపుడుగాని పరమపురుషుఁడు రూపవంతుఁడు కాఁడనియు నిటఁగలసారము. ఈవిషయమునే

“శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చేదేవం దేవో న ఖలు కుశలస్స్పందితుమపి,
అతస్త్వామారాధ్యాం హరిహరవిరించాదిభిరపి
ప్రణంతుం స్తోతుం వా కథమకృతపుణ్యః ప్రభవతి.”

అని శ్రీశంకరభగవత్పాదాచార్యులుగారు తేటపఱచిరి.

“వనవాసేఽభిజానామి దుఃఖాని బహుధా కిల,
ప్రాప్యంతే నియతం వీర పురుషైరకృతాత్మభిః.” ౧౨

అని మూలము.

“అకృతాత్మభిః అశిక్షితమనస్కైః ప్రాప్యంతే న తు మాదృశైర్జ్ఞై రితి భావః.” అని గోవిందరాజులు.

“అకృతాత్మభిః అజితేంద్రియైః విషయలోలుపైః నతు త్వాదృశా దృశైర్జ్ఞైరిత్యర్థః.” అని మహేశ్వరతీర్థులు.

సామాన్యార్థము స్పష్టము. వనవాసదుఃఖములు జితేంద్రియులు కానివారలకే కాని జితేంద్రియులకుఁ దోపవని తాత్పర్యము. ఇఁక విశేషార్థ మిం దేమని విమర్శింతము. శ్రీరామచంద్రా! వనవాసమునఁ గలుగనున్న దుఃఖముల నేనెఱుంగక లేదు. అవి రాక తప్పవు. అవి జితేంద్రియులు కానివారలకు నఁగా సామాన్యమానవులకు దుఃఖములుగాఁ దోఁచును.

మనఁబోంట్లకు నవి సుఖములే యగును. అనఁగా మనమిరువుర మవతరించినది దుఃఖము లనుభవించునట్లు నటించి లోకులకు సుఖము ధర్మరక్షణము చేయుటకేకదా. విరాధాదిదానవులకు శాపమోక్షము ననుగ్రహించుటయు, మనదర్శనముకొఱకు వేచి యున్నమునులకు వారితపఃఫలముగా దర్శన మొసంగుటయు, మనల దర్శించి యూర్ధ్వలోకముల కరుగనున్న మునివరులకు దర్శనభాగ్యము లభింపఁజేయుటకే కాదా. ఇవన్నియు నెట్లు మాన్పఁగలము? వారివారికర్మఫలముల నొసంగుట మనపని కావున నడవుల దుఃఖములు కలుగునని నాకుం దెల్పుట నన్ను సిద్ధముగానుండుమని హెచ్చరించుటకే కాక మఱెందులకు? అని సీతాదేవి రామునితోఁ బల్కెను. ఇప్పట్టున నీయిరువురు ప్రకృతి పురుషులా, లేక త్రిమూర్తులలో నొకరుగ గణింపఁబడు నారాయణమూర్తియు లక్ష్మీదేవియు సీతారాములుగ నవతరించిరా యనువిషయ మించుక విచారింపఁదగియున్నది. పలుతావుల నీవిషయము చర్చించుట కవకాశము కల్గినను విమర్శించి యున్నను సంపూర్ణముగా విమర్శించుట మంచిదనితోఁచినందున వ్రాయుదును.

సీతారాముల యవతార సిద్ధాంతము.

ప్రాయికముగా వైష్ణవులు వైకుంఠవాసియగు శ్రీమన్నారాయణమూర్తి లక్ష్మీసహితుఁడై సీతారాములుగా నవతరించె నందురు. ఏలయనఁగా విష్ణువే సర్వోత్తముఁ డనియు శివుఁడు తద్భక్తులలో నొక్కఁడనియు వారిమతము. దానిని సిద్ధాంతము చేయుటకై వారెన్నియో పాట్లుపడుదురు. ప్రధానముగా శివుని దూషింతురు. ఈశివదూషణమహాకార్యమునం దుత్త

ములు మధ్వవైష్ణవులు. అందును శిలామండపములు శిలావిగ్రహములు మోక్షమొసంగు ననువా రుత్తమోత్తములు. అట్టివారే శిష్యులను జేర్చుకొని శివదూషణము చేయుచుందురు. వారికి శ్రీవిష్ణువునందు భక్తియున్నదో లేదో దైవ మెఱుంగును. కాని విష్ణుప్రసాద మనంబడుభక్ష్యమునందు మహాభక్తి కలదనుట నిర్వివాదము.

భగవంతుఁడు పరతత్త్వమని, నిర్గుణుఁడని, అద్వితీయుఁడని యుపనిషత్తులు ఘోషించును. ఈవిషయమున భేదాభిప్రాయమే లేదు. విష్ణుశబ్దము రాఁగానే యెగిరిపడువారే మధ్వవైష్ణవులు. విష్ణువు లిరువురు గలరు. శంకరు లిరువురు గలరు.

"ఆదిత్యానామహం విష్ణుర్జ్యోతిషాం రవిరంశుమాన్,
రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్." ౨౧. గీత. ౧౦ అ.

అని గీతాప్రమాణము గలదు. ద్వాదశాదిత్యులలో నొకవిష్ణువు కలఁడు. ఏకాదశరుద్రులలో నొక్కశంకరుఁడు కలఁడు.

"అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ."

అనుగీతావాక్యమున కర్థమేమి? సృష్టిస్థితిసంహారములు నేనే. అనఁగా బ్రహ్మావిష్ణుశివులు నేనే యనికదా. ఈ చెప్పినవాఁడెవ్వఁడు? భగవంతుఁడే కదా.

"యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున,
న తదస్తి వినాయత్స్యాన్మయా భూతం చరాచరం." ౩౯ గీత. ౧౦ అ.

అన్నవాఁడు భగవంతుఁడుకాక మఱెవ్వఁడగును? ఈ శ్రీకృష్ణోపదేశము మనకేమి తెల్పుచున్నది? భగవంతుఁడు ప్రకృతిసంబంధమున లోకప్రవృత్త్యర్థము త్రిమూర్తులుగా నవతరించె ననునదియే. విష్ణువెక్కుడనుట కవకాశ మేమికలదు? దురహంకార

మునఁదప్ప వేఱువిధముగా నవకాశము లేదు. శ్రీభాగవతము ప్రమాణమని వైష్ణవు లంగీకరింతురు. విష్ణుపురాణము హరివంశముకూడఁ బ్రమాణములనియే వారిమతము. తక్కినవి తామసపురాణము లందురు. అట్లు చెప్పినఁగాని వారివాదము నిలువదు. పాపము వారేమి చేయుదురు? బుద్ధిమంతు లన్ని పురాణములు ప్రమాణములే యందురు. ఏ దేవతారూపమునం దెవ్వరికి భక్తి చక్కఁగా నుండునో వా రారూపవంతుఁడే పరమాత్మ యనుకొనవచ్చును. ఉపాసనమున నాబుద్ధియే వారికి దృఢముగనుండిన వారు తరింతురు. ఎల్లమూర్తులుగ నాపరమాత్మయే కదా యుండును.

"వదంతి తత్తత్త్వవిద స్తత్త్వం యద్జ్ఞానమవ్యయం,
బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి కథ్యతే. ౧౨
తచ్ఛ్రద్దధానా మునయో జ్ఞానవైరాగ్యయుక్తయా,
పశ్యంత్యాత్మని చాత్మానం భక్త్యా శ్రుతగృహీతయా. ౧౩

శ్రీభాగవతము. ౧ స్కం. ౨ అధ్యా.

బ్రహ్మ యని పరమాత్మ యని భగవంతుఁ డని ఆమహాతత్త్వమే పిలువఁబడును. ఆతత్త్వమునే మహర్షు లాత్మయందుఁ జూతురు. అనఁగా జ్ఞానదృష్టి దర్శింతురని భావము.

"ధామ్నా స్వేన సదా నిరస్తకుహకం సత్యం పరం ధీమహి. ౧

శ్రీభా. ౧ స్కం. ౧ అధ్యా.

సత్యం పరం అనుశబ్దములచే భగవంతుని వ్యాసమహర్షి పేర్కొనెను

"స్థిత్యుద్భవప్రళయహేతురహేతురస్య
యత్స్వప్నజాగరసుషుప్తిషు సద్బహిశ్చ,

దేహేంద్రియాసుహృదయాని చరంతి యేన
సంజీవితాని తదవేహి పరం నరేంద్ర." 3౭

శ్రీభా. ౧౧ స్కం. 3 అధ్యా.

సృష్టిస్థితిలయములకు హేతువనియు హేతువు కాదనియుఁ జెప్పఁబడునది పరతత్త్వ మొక్కఁడే యని సారము.

"యత్కాయ ఏష భువనత్రయసన్నివేశో
యస్యేంద్రియైస్తనుభృతాముభయేంద్రియాణి,
జ్ఞానం స్వతశ్శ్వసనతో బలమోజఈహా
సత్త్వాదిభిస్థ్సితిలయోద్భవ ఆదికర్తా. ౨౪
ఆదావభూచ్ఛతధృతీరజసాస్య సర్గే
విష్ణుస్థ్సితౌ క్రతుపతిర్ద్విజధర్మసేతుః,
రుద్రోఽప్యయాయ తమసా పురుషస్స ఆద్య
ఇత్యుద్భవస్థితిలయాస్సతతం ప్రజాసు. ౫

శ్రీభా. ౧౧ స్కం. ౪ అధ్యా.

పరమాత్మయే సర్వమనియు నాతత్త్వమే బ్రహ్మవిష్ణురుద్రులుగా సృష్టిపాలనసంహార కార్యములకొఱ కవతరించెననియు సారము. ఈప్రమాణముల ననుసరించి యాలోచింపఁగా భగవంతుఁ డొక్కఁడే త్రిమూర్తులుగా నవతరించెనని తేలెడిని.

"అహం భవో యజ్ఞ ఇమే ప్రజేశా దక్షాదయో యే భవదాదయశ్చ,
స్వర్లోకపాలాః ఖగలోకపాలాన్నృలోకపాలా స్తలలోకపాలాః. ౪3
లీలావతారాన్ పురుషస్య భూమ్నః." ౪౩

బ్రహ్మ యనఁబడు నేను శివుఁడు విష్ణువు దికాల్పకాదులెల్లరు భగవంతునిలీలావతారములే యనంబడువారమని బ్రహ్మ తెలిపెను.

శ్రీభగవాన్:—

"అహం బ్రహ్మా చ శర్వశ్చ జగతః కారణం పరమ్,
ఆత్మేశ్వర ఉపద్రష్టా స్వయం దృగవిశేషణః. ౫౦
ఆత్మమాయాం సమావిశ్య సోఽహం గుణమయీం ద్విజ,
సృజన్ రక్షన్ హరన్ విశ్వం దధ్రే సంజ్ఞాం క్రియోచితాం. ౫౧
తస్మిన్ బ్రహ్మణ్యద్వితీయే కేవలే పరమాత్మని,
బ్రహ్మరుద్రౌ చ భూతాని భేదేనాజ్ఞోఽనుపశ్యతి. ౫౨
యథా పుమా న్న స్వాంగేషు శిరఃపాణ్యాదిషు క్వచిత్,
పారక్యబుద్ధిం కురుత ఏవంభూతేషు మత్పరః. ౫౩
త్రయాణామేకభావానాం యో న పశ్యతి వై భిదాం,
సర్వభూతాత్మనాం బ్రహ్మన్ స శాంతి మధిగచ్ఛతి." ౫౪

౪ స్కం. ౭ అధ్యా.

త్రిమూర్తులు భగవదవతారములనియు, భేదము వీరియందుఁ బాటింపఁగూడదనియు, నాపరతత్త్వముగనే భావింపవలయు ననియు దీనిసారము.

ప్రజాపతయ ఊచుః:—

"గుణమయ్యా స్వశక్త్యాస్య సర్గస్థిత్యప్యయాన్ విభో,
ధత్సే యదా స్వదృగ్భూమన్ బ్రహ్మవిష్ణుశివాభిధామ్. ౨౩
త్వం బ్రహ్మ పరమం గుహ్యం సదసద్భావభావనం,
నానాశక్తిభిరాభాత స్త్వమాత్మా జగదీశ్వరః. ౨౪
త్వం శబ్దయోనిర్జగదాదిరాత్మా ప్రాణేంద్రియద్రవ్యగుణస్వభావః,
కాలః క్రతుస్సత్యమృతం చ ధర్మ స్త్వయ్యక్షరం యత్త్రివృదామనంతి. ౨౫
... ...
న తే గిరిత్రాఖిలలోకపాల విరించవైకుంఠసురేంద్రగమ్యం,

జ్యోతిః పరం యత్ర రజస్తమశ్చ సత్వం న యద్బ్రహ్మని రస్తభేదం.3౧
శ్రీ భా. ౮ స్కం. 2 అధ్యా.

ప్రకృతి త్రిగుణమయియగు. ఆమహాప్రకృతింగొని నీవే బ్రహ్మ విష్ణురూపుఁడవై తివని శంకరుని ప్రజాపతులు నుతించిరి.

మహామతులారా! శ్రీభాగవతమునుండియే యీప్రమాణములు చూపఁబడియెఁగదా? వీనింబట్టి యూహింపఁగా పరతత్వ మొక్కటియే త్రిమూర్తులుగా నవతరించెనని స్పష్టము. త్రిమూర్తులు ప్రకృత్యధీనులు అనువిషయము తేలెను. మఱియు శంకరుని బ్రహ్మావిష్ణుస్వరూపుఁడవు నీవే యని వినుతించినట్లు స్పష్టమాయెను. నేను బ్రహ్మాయు శంకరుఁడును బరతత్వాంశభూతులమే యని విష్ణువే తెలిపినట్లు కనఁబడియెను. వీనిసార మేమనఁగా నిర్గుణబ్రహ్మమే మహాప్రకృతింగూడి సగుణబ్రహ్మమగుచు సృష్టిస్థితిలయముల నొనర్ప రజస్సత్వతమోగుణప్రధానులుగ బ్రహ్మావిష్ణురుద్రుల సృజించెననియు, వారు తదాజ్ఞచే నాయాకార్యము లొనరింతురనియు, వారిమువ్వురియం దొక్కింతయు భేదభావము లేదనియు, నట్లు భేదబుద్ధిగలవారజ్ఞులనియు సారము. శ్రీభాగవతము ననుసరించి హరిహర బ్రహ్మలకు భేదములేదని సిద్ధాంతము.

నారాయణః:—

"త్వత్సంభూతా భూతకృతో వరేణ్యాగోప్తారోఽస్య భువనస్యాది దేవ,
అపి ఇమాం ధరణీం యేఽభ్యరక్షన్ పురా పురాణీ తవ దేవ సృష్టిః.

... ...

అస్తోషం త్వాం తవ సమ్మానమిచ్ఛన్ విచిన్వన్ వై సదృశం దేవవర్య,
సుదుర్లభాన్ దేహి వరాన్ మ...ష్టానభిష్టుతః ప్రవ్యకార్షీశ్చ మాయాం

భగవాన్ శంకరః:—

మత్ప్రసాదాన్మనుష్యేషు దేవగంధర్వయోనిషు,
అప్రమేయబలాత్మా త్వం నారాయణ భవిష్యసి. ౧౪
న చ త్వాం ప్రసహిష్యంతి దేవాసురమహోరగాః,
న పిశాచా న గంధర్వా న నరా న చ రాక్షసాః. ౧౫

... ...

కశ్చిత్తవ రుజం కర్తా మత్ప్రసాదాత్కథంచన,
అపి చేత్సమరం గత్వా భవిష్యసి మమాధికః.” ౧౮

మహాభారతము, ద్రోణపర్వము, ౨౦౨ అధ్యా.

మహావిష్ణువు తపస్సుచేసి శంకరుననుగ్రహమున వరములు పొందెను. సకలప్రపంచరక్షకుఁడవు నీవే యని నారాయణస్తుతి సారము. ఈఘట్టముననే యర్జునునకు వ్యాసమహర్షి యుపదేశించిన శివప్రభావము గ్రంథవిస్తరభీతి మానితిని. సర్వమునకు శివుఁడే కారణమని తెలుపఁబడినది.

“సంతి నో బహవో రుద్రాశ్శూలహస్తాః కపర్దినః,
ఏకాదశస్థానగతా నాహం వేద్మి మహేశ్వరం. ౨౦

దధీచిః:—

సర్వేషామేవ మంత్రోఽయం యేనాసౌ న నిమంత్రితః,
యథాఽహం శంకరాదూర్ధ్వం నాన్యం పశ్యామి దైవతం.
తథా దక్షస్య విపులో యజ్ఞోఽయం న భవిష్యతి.” ౨౧

శాంతిపర్వము, ౨౮౩ అధ్యా.

ఈఘట్టమున రెండువందలయెనుబదియైదవయధ్యాయమువఱకుఁ గలశివమాహాత్మ్య మత్యద్భుతము. బ్రహ్మవిష్ణ్వాదులు తత్స్వరూపులనియే స్పష్టము.

"స ఏష భగవాన్ దేవస్సర్వసత్త్వాదిరవ్యయః,
సర్వస్తత్త్వవిధానజ్ఞః ప్రధానపురుషః పరః. 3౫౦.
యోఽసృజద్దక్షిణాదంగాద్బ్రహ్మాణం లోకసంభవం,
వామపార్శ్వాత్తథా విష్ణుం లోకరక్షార్థమీశ్వరః. 3౫౧.
యుగాంతే చైవ సంప్రాప్తే రుద్రమీశోఽసృజత్ప్రభుః,
స రుద్రస్సంహరన్ కృత్స్నం జగత్స్థావరజంగమం." 3౫౨.

విష్ణుః:—

"నమోస్తు తే శాశ్వతపుణ్యయోనే బ్రహ్మాధిపం త్వామృషయో వదంతి,
త్వామేవ నారాయణశబ్దసంజ్ఞం పరం చ సత్యం ప్రవదంతి సంతః. ౪౧౨.
త్వం వై బ్రహ్మా చ రుద్రశ్చ వరుణోఽగ్నిరనుర్భవః."

అనుశాసనపర్వము, ౧౪ అధ్యా.

శంకరుఁడు దేహదక్షిణభాగమున బ్రహ్మదేవుని వామపార్శ్వముసుండి విష్ణువును సృజించెను. సృష్టిపాలనముల నొనరింప వారి నాజ్ఞాపించెను. రుద్రుని సృజించి సంహారాధికార మొసంగెను. అని పైదానిసారము. విష్ణువే శంకరా! నీవే నారాయణశబ్దవాచ్యుఁడ వనియెను. సర్వకారణుఁడు శివుఁడే యని సారము.

"రుద్రో నారాయణశ్చైవ సత్త్వమేకం ద్విధా కృతం,
లోకే చరతి కౌంతేయ వ్యక్తిస్థం సర్వకర్మసు." ౨౭

శాంతిపర్వము 3౪౨ అధ్యా.

ఒకవ్యక్తియే రుద్రనారాయణు లనఁబరఁగెనని సారము. ఇట్టి వెన్ని యోచూపవచ్చును. 'అతి సర్వత్ర వర్జయేత్' అని యున్నదిగాన మానితిని. ఉపనిషత్తులు శ్రీభాగవతాదిపురాణములు హరివంశ మహాభారతాదులు పరిశీలించిన నేర్పడుసిద్ధాంత మేమనఁగా భగవంతుఁ డొక్కఁడే కార్యభారముల ననుసరించి యనేకరూప

ములఁ దాల్చుననియు, నాపరమపురుషుఁడే ప్రపంచోన్ముఖుఁడై ప్రకృతివిశిష్టుఁడై త్రిమూర్తులఁ దనయంశమువలన నిర్మించెననియు, వారు తమతమ కార్యములగు సృష్టిపాలనసంహారములను జేయుచున్న వారనియు, వారికంటెఁ దక్కువ కార్యముల నింద్రాదులు చేయుచుందురనియు, వారెల్లఁ బ్రకృతిబద్ధులేయనియు, నిందెవ్వరుగాని స్వతంత్రులు కారనియు జెప్పుచున్నది. త్రిమూర్తు లనఁబడు బ్రహ్మవిష్ణుశంకరులలో నుత్తమమధ్యమాధమభేదములే కానరావు. ధర్మరాజు శివమాహాత్మ్యమును దెలుపుమని భీష్మునడుగ శ్రీకృష్ణుఁడు తప్ప దానిం జెప్ప నర్హులే లేరని బదులుపల్కెను. శ్రీకృష్ణుఁడు శివునిచరిత్రమును దెల్పెను. శివుఁడు కొన్నిపురాణములయందు శ్రీవిష్ణువును గొనియాడెను. అనఁగా నర్థమేమి? వీరిరువురు బ్రహ్మయు స్వతంత్రులుగారనియు, నాభగవంతునియంశములే యనియు భావము. భక్తుఁ డేమూర్తిని ధ్యానించినను బరాత్పరునిగా ధ్యానించిన నాపరాత్పరుఁ డెల్లరూపములుగలవాఁడుగాన నాతని దరింపఁ జేయును. కనుకనే భక్తుఁడు కాని తనమనఃపద్మమున నిష్టదేవతాకల్పితరూపము నుపాసించునపుడు పరతత్త్వమనియే దానిని భావింపవలయును కాని వేఱుగా భావింపరాదు. మహాప్రకృతి యొకవ్యక్తి కాదనియు నయ్యది భగవంతుని సంకల్పమే యనియు నెఱుంగవలయును. నిర్గుణుఁడగుభగవంతుఁడు కార్యోన్ముఖుఁడగుతఱి నామహాప్రకృతి యాతని రూపముగలవానినిగాఁ జేయును. సగుణుఁడనుపేరాసమయముననే కల్గును. ప్రకృత్యతీతుఁ డాపరమాత్మయే కాని యితరులు కారు. త్రిమూర్తులు లోనగువారెల్లఁ బ్రకృతికి లోఁబడినవారలే.

కొందఱు త్రిమూర్తులలో నొకఁడగువిష్ణువును శివ బ్రహ్మలకంటె నధికుఁడందురు. విష్ణువు శివునేల పరమేశ్వరునిగాఁ దెలిపెనన్న శివనామములన్నియు విష్ణుపరములే యందురు. కాని విష్ణునామములు శివపరములేల కావో యోజింపరు. ఇన్నినామము లాభగవంతునకు నొక్కనికే చెల్లును. విష్ణుసర్వోత్తమత్వము గలదనువారు విష్ణురూపమున నాభగవంతుఁడే వెలసెనని భావించుచో దోషము లేదు. అట్లే శివసర్వోత్తమత్వము గలదనువారు శివరూపముగల భగవంతుఁడని భావింపవలయును. వైకుంఠవాసియుఁ బ్రపంచరక్షణకార్యకర్తయు నగువిష్ణువు శంకరునికన్న శ్రేష్ఠుఁడనువాదము నిస్సారము. దుర్మతాభిమానపిశాచమే వారి నట్లు పలికించునని మన మూహించుట మంచిది. భగవంతుని తత్త్వ మెఱుఁగవలయు ననువార లిట్టి మతాభిమానావేశము గలవారు గాకుండవలయు. మతములనునవి దురహంకారమును బుట్టించి కొందఱను సత్యదూరులనుగాఁ జేయుచున్నవి. దేవతాదూషణము వారిచేఁ జేయించుచున్నవి. వారిదుష్కర్మమే యిట్టి మతాభిమానపిశాచరూపమున వారిని ద్రిప్పుచున్నదని మన మెఱింగి వారిని దూషింపక వారినిగూడఁ దరింపఁ జేయుమా యని పరమేశ్వరుని బ్రార్థింపవలయును. శివసహస్రనామములయందు విష్ణునామములు గలవు. విష్ణుసహస్రనామములయందు శివనామములు గలవు. అవి రెండు నాభగవంతుని దెలుపుచు నభేదమును సూచించుచుండఁగా నంతమాత్ర -ఱుంగక యందొక్కరుని దూషించువారిని మన మేమని వింపవలయుననఁగా వారి కయ్యది భగవద్భజనము చేయఁ దగుజన్మము కాదని తలంపవలయును. కర్మము త్రిప్పులకు లోను

గానివా రెవ్వరు? ఈపైవ్రాసిన ప్రమాణములననుసరించి సీతా
రాములు ప్రకృతిపూరుషులేకాని వైకుంఠలోకమునకుమాత్ర-
మధిపతులగు లక్ష్మీనారాయణులుకారు. భగవంతుఁడు వైకుంఠ
మున కధిపతికాఁడా యని కొందఱు ప్రశ్నింతురు. వైకుంఠ
మునకేకాదు సకలబ్రహ్మాండములకు నధిపతియే. కాని యా
పరమేశ్వరుని నివాసము వైకుంఠమే కాదు. ఎల్లతావుల
నుండును. ఎల్లనామము లాయనకుం జెల్లును. కావున నాభగ
వంతుఁడే ధర్మరక్షణమును జేయఁబూని దానికి విరుద్ధముగా
ప్రవర్తించురావణాదులను వారికర్మగతుల ననుసరించి శిక్షింపఁ
దనప్రకృతిని సీతారూపమున నుండఁబంచి తాను మానవ
రూపమున శ్రీరామనామమున నవతరించి తన యవతారమును
సఫలముచేయఁబూనెనని మనము భావింపవలయును. ఇఁక
రామాయణమును బఠించి విశేషార్థములం గనుఁగొందము.

"కన్యయా చ పితుర్గేహే వనవాసశ్శ్రుతో మయా,
భిక్షిణ్యాస్సాధువృత్తాయా మమ మాతురిహాగ్రతః. ౧౩
ప్రసాదితశ్చ వై పూర్వం త్వం వై బహువిధం ప్రభో,
గమనం వనవాసస్య కాంక్షితం హి సహ త్వయా." ౧౪

అని మూలము. ఇందలివిశేషార్థమేమి? రామచంద్రా! విదేహనగ
రమున నేనున్నపుడే యొకబ్రహ్మచారిణి వచ్చి నాతల్లి విను
చుండ నీసీత వనముల వసించునని తెలిపెను. ఆమె త్రికాల
వృత్తముల నెఱుంగును. నేనయోధ్యకు వచ్చినతర్వాత వన
ములఁ జూచుకోరిక కలదనియు నన్నుఁబిలుచుకొనిపొమ్మని నిన్ను
యాచించియుంటిని. ఈవనగమన మీనాఁటిది కాదు కదా. కాన
నన్నేల రావలదనియెదవు? నిన్నుఁగూడి వనవాసము చేయుటకే

కదా నేను బుట్టినది? అని సీత యాశయము. దీనినుండి మనము నేర్చుకొనఁదగినదేది? మానవులు భవిష్యత్కాలఫలముల కనుగుణానుగుప్రవర్తనము కలవారగుదురు [illegible]. జ్ఞానులవ్వారి గతుల నెఱుంగఁజాలుదురు. సాధువులు కానివారల విషయము నెఱుంగఁజాలరు. గొప్పదశ ననుభవించుకర్మములు గలవారలైనచో నాఫలముల కనుగుణములుగఁ బ్రవర్తింతురు. దుర్దశయందు నట్లే. కొంతకాల మొక్కరీతిగాఁ బ్రవర్తించుచుండటాలునఁ దద్విరుద్ధప్రవర్తనము కలవారలగుటఁ గొందఱ మనము చూచుచున్నాము. అట్టివా రప్పటికన్న వేఱువిధములగుఫలముల ననుభవింపవలసినవారే యగుదురు వారిప్రవృత్తి ననుసరించి సాధువు లావిధము నెఱుంగుదురు. అజ్ఞులగు వారు కర్మగతుల నెఱుంగక వారిని దూషించుటో భూషించుటో యనుకార్యముల నొనరింతురు. 'గహనా కర్మణో గతిః' అనువిషయ మెఱుంగుటయే వివేకము. మన మెఱుఁగఁదగువిషయమిదియే. పై సీతావాక్యముల ననుసరించి ఆలోచింపఁగాఁ దమ రెండుల కవతరించిరో వా రెఱుంగుదురనియు దుఃఖానుభవము నటనమే యనియు మన మెఱుంగవలయును.

"కృతక్షణాహం భద్రం తే గమనం ప్రతి రాఘవ,
వనవాసస్య శూరస్య చర్యా హి మమ రోచతే. ౧౫
శుద్ధాత్మన్ ప్రేమభావాద్ధి భవిష్యామి వికల్మషా,
భర్తారమనుగచ్ఛంతీ భర్తా హి మమ దైవతం. ౧౬
ప్రేత్యభావేఽపి కల్యాణ సంగమో మే సహ త్వయా."

అని మూలము. పై నవ్రాసినభావము నీసీతావాక్యములు సిద్ధాంతము చేయుచున్నవి. రాఘవ! రఘువంశమున నవతరించిన

యోపరమేశ్వరా! 'గమనం ప్రతి కృతక్షణా' వనముల కరుగ వలయునని యాకాల మెప్పుడెప్పుడు వచ్చునని తొందఱపడు చున్నాను. భద్రంతే=నీకు మేలు గలుగును. వనముల నివసించుచు విక్రమమునుజూపు నీయొక్కచర్యయే నాకు సమ్మతము. సేవచేయుటని సామాన్యార్థము. అనఁగా నిఁక నాలసింపరాదు. నేను త్వరపడుచున్నాను. మనము చేయఁదగుకార్యములకు విలంబము పనికిరాదు. నీవు పరాక్రమింపఁదగుకాలము వచ్చెడిని. దానినిజూడ వేడుకపడుచున్నాను. అనుటచే నానిమిత్తమున నీవు పరాక్రమము చూపవలసియున్నది. విరాధాదులు నీవలన ముక్తినొందవలసినవా రున్నారనుట యీమాటలమూలమున సూచింపఁబడినది.సీతనెత్తుకొనిపోవువిరాధుని రాముఁడు సంహరించును. సీత రామవిక్రమమును జూచుచుండును. నీకు మేలు గలుగును. అనఁగా నీకీర్తి జగముల వ్యాపించును. అని సారము. శుద్ధాత్మన్=పరిశుద్ధాత్మస్వరూపా! అని యర్థము. నన్ను భరించునిన్ను ననుసరించివచ్చుచుఁ బ్రేమభావమున ననియర్థము. వికల్మషాభవిష్యామి=కల్మషరహితురాల నగుదును.అనఁగా నగ్నిశుద్ధిని గాంతునని భావము. భర్తయందుఁ బ్రేమముగలపురంధ్రీమణి నగ్నికాల్పఁజాలదన్నభావము నెల్లవారలకుం గల్గింతునని సారము. నాకు నీవే దైవతమవు. అనఁగా సకలలోకములు లోకేశులు నాయధీనులు. ప్రకృతిబద్ధులనుట. ఇట్టి నన్ను భరించువాఁడవు నీవే. ప్రకృత్యతీతుఁడవనుట. సర్వదా నేను నీసంకల్పరూపిణిగా నుండుననుట సారము. నీకంటె దైవతము నాకు వేఱులేదనియేకదా విశేషము.-ఈయర్థమునే యీక్రిందిశ్లోకము దృఢపఱచుచున్నది. పరమేశ్వరా! పరలోకమునందును నీతోడి

సంగమరూపమగుమంగళము గలుగుఁగాక. అనఁగా మానవలోకమునఁ గలపనులు తీఱఁగనే నిన్నుఁగూడియుండు భాగ్యమనఁగా నిట్లు స్త్రీపురుషరూపభేదములేక యభేదముగా నుండు భాగ్యము కలుగుఁగాక యని సీతాదేవి స్వాభిప్రాయమును విశదీకరించెను. మనవిరువురము మానవలోకమునఁ జేయఁగలకార్యములుతీర్చి ధర్మమును స్థాపించి ప్రజాసుఖమును గల్గఁజేసి మఱొకకార్యమునకుం గడంగుదమనియే యిందుఁగల సారతరార్థము. ఈభాగమునుండి తేలినధర్మమేది? ఏకాంత ప్రేమమున భర్తననుసరించి యతని దైవతమనియే భావించి ప్రవర్తించునో, యాకాంత విగతకల్మష యనంబడును ఆసాధ్వి పరలోకమునందు నావ్యక్తింగూడియే మంగళములఁ గాంచును. పతివ్రతయన నామెయే. స్త్రీలకుఁ బతికన్న మిన్నయగుదైవతము లేదు. అనఁగాఁ బతిని దైవముగా భావింపవలయును. అనునదియే యిందుఁ గల ధర్మము. ఈయర్థమే

"పతిం యా నాభిచరతి మనో వాగ్దేహసంయతా,
సా భర్తృలోకానాప్నోతి సద్భిస్సాధ్వీతి చోచ్యతే." ౧౬౫

మను. ౫ అధ్యా.

అని మనుస్మృతి చాటుచున్నది. ఈధర్మమును స్త్రీలకొఱకు మహాయోగి వాల్మీకి సీతావాక్యరూపమునఁ దెలిపెను. కావున స్మృత్యర్థమే రామాయణము తెల్పుచున్నదని మన మెఱుంగవలయును. కేవల కావ్యమనుబుద్ధి యుంపఁ గూడదు. ధర్మసారమనియే తలంప వలయును.

"శ్రుతిర్హి శ్రూయతే పుణ్యా బ్రాహ్మణానాం యశస్వినాం,
ఇహ లోకే చ పితృభిర్యా స్త్రీ యస్య మహామతే,

అద్భిర్దత్తా స్వధర్మేణ ప్రేత్యభావేఽపి తస్య సా. ౧౮
ఏవమస్మాత్స్వకాం నారీం సువృత్తాం హి పతివ్రతాం,
నాభిరోచయసే నేతుం త్వం మాం కేనేహ హేతునా. ౧౯
భక్తాం పతివ్రతాం దీనాం మాం సమాం సుఖదుఃఖయోః,
నేతుమర్హసి కాకుత్స్థ సమానసుఖదుఃఖినీం.” ౨౦

అనుమూలము పతివ్రతాధర్మములను బోధించుచున్నది. “మహామతే!” యని సీత రామచంద్రుని సంబోధించుచున్నది. “మతి రాగామిగోచరా” అన్న న్యాయము ననుసరించి రాఁగలకాలమునకుఁ బనికివచ్చుటకే నే నీధర్మములను దెలుపుచున్నదాన నని భావము. సామాన్యార్థము స్పష్టము. ధర్మోపదేశ మిది యని తెలియందగు. తమజాతికిఁ జెప్పఁబడినధర్మముల ననుసరించి యుదకధారాపూర్వకముగాఁ దల్లిదండ్రులు కన్యను వరునకు దానముచేయవలయును. ఆమె భర్తననుసరించి వర్తించునేని పరలోకమునందు నాపురుషుఁడే భర్తగా నుండును.అనఁగా నట్టి వారికిం గలసంబంధ మవిచ్ఛిన్నమని భావము. ఈధర్మము వేద విహితము. అట్లు నేను నీకును భార్యగా నీయఁబడితిని. సాధు వర్తనము గలదానను. అనఁగా సాధువుల రక్షించుకొఱకే వర్తించుదానను. ఈలోకమున నవతరించితినని భావము. పతివ్రతను. నీయాజ్ఞాకరణమే నాకు వ్రతమని యర్థము. ఇట్టి నన్ను వెంటఁగొనిపోవ నేల సమ్మతింపకయున్నావు? లోకమున నేపురుషుఁడు గాని పతివ్రతను వదలి తానెచ్చటికిని బోరాదనుధర్మ మిందు సుపదేశింపఁబడినది. భక్తురాలనసఁగా నిన్నే సేవించుదానను. దీనాం=నీవు విడనాడినచో నాకు దిక్కులేదని యర్థము. సుఖదుఃఖయోస్సమాం=ద్వంద్వములగు శీతోష్ణసుఖదుఃఖాదుల

నీతోడ సమముగా ననుభవించుదానను. అనఁగా నిరువుర మొక దేహమే కాన నీకుఁ గలుగుసుఖదుఃఖములు నాకునుం గలుగుచున్నవని భావము. ప్రాం = లక్ష్మీగేహిని. అనఁగా నీకు లక్షణములఁగూర్చుదానను. నావలననే నీకు రూపసంపదలుగలుగునని భావము. సమానసుఖదుఃఖినీం=ఈయవతారమున నీతో సమానముగా సుఖదుఃఖముల ననుభవింపవలసినదాననే యని భావము. ఇట్టి నన్ను నేతుమర్హసి=పిలుచుకొనిపోవఁదగుదువు. అనఁగా నేను లేకయున్న నీ వేకార్యములు చేయఁజాలవు. నీవిందు నేను లంకలో సమానముగా దుఃఖమనుభవించునట్లు నటింపవలయునే. ఇట్టి నన్నేల వలదందువయ్యా యని జానకి యడుగుచున్నది. ఈభాగము మన కెట్టిధర్మమును బోధించుచున్నది? అనువ్రతయయి పతిప్రేమమునఁగూడి సుఖదుఃఖములను బతితోడ ననుభవించుస్త్రీ సాధ్వి యనంబడును. ఆమెతోఁ గూడియుండక పురుషుఁ డేధర్మములను జేయరాదు. ఏయాత్రలు చేయరాదు. ఏధర్మకార్యములు చేయరాదు. అను ధర్మము మరల నిందుఁ జక్కఁగాఁ జెప్పఁబడినది. అట్టిభార్య దీనురాలుగా నుండరాదు. దీనురాలుగా నుండుటకు భర్తయే కారణమగును. ఏసాధ్వి దుఃఖించునో యాయింట లక్ష్మి నివసింపదు. కావున సాధ్వియగుభార్యను భర్త సంతుష్టురాలినిగా నొనరింపవలయును. అను నీధర్మమును మన మీభాగమునుండి గ్రహింపవలయును. ఈనీతినే

"పితృభిర్భ్రాతృభిశ్చైతాః పతిభిర్దేవరైస్తథా,
పూజ్యా భూషయితవ్యాశ్చ బహుకల్యాణమీప్సుభిః. ౫౫
యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః,

యత్రైతాస్తు న పూజ్యంతే సర్వా స్తత్రాఫలాః క్రియాః. ౫౬

శోచంతి జామయో యత్ర వినశ్యత్యాశు తత్కులం, —

న శోచంతి తు యత్రైతా వర్ధంతే తత్ర సర్వదా. ౫౭

జామయోయాని గేహాని శపంత్యప్రతిపూజితాః,

తాని కృత్యాహతానీవ వినశ్యంతి సమంతతః. ౫౮

తస్మా దేతా స్సదా పూజ్యా భూషణాచ్ఛాదనాశనైః,

భూతికామై ర్నరైర్నిత్యం సత్కారేషూత్సవేషు చ. ౫౯

సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవచ,

యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్ర వై ధ్రువం.'' ౬౦

మను. 3 అధ్యా.

(పూజ్యాః=గౌరవింపఁదగినవారని యర్థము.) అని మనుస్మృతి తేటపఱచెను. స్మృతి ధర్మముల నాయాయితావుల రామాయణము తెల్పుచున్నదని మన మెఱింగి దానిం బఠింపవలయును.

''యది మాం దుఃఖితా మేవం వనం నేతుం న చేచ్ఛసి,

విషమగ్నిం జలం వాహమాస్థాస్యే మృత్యుకారణాత్ .'' ౨౧

అనుమూలము భావికార్యములఁ దెల్పుచున్నది. శ్రీరామా! నిన్నుఁగూడి రావలయునని తత్తఱపడుచున్న నన్నుఁ బిలుచుకొనిపోవ నిచ్ఛగింపవేని విషాగ్నిజలములలో నొకదాని స్వీకరింతును అనుటచేఁ గాఁగలయగ్నిప్రవేశము సూచింపఁబడినది. మఱియు నొకసంవత్సరకాల మగ్నియందు నేనుండి నాప్రతికృతిని లంకలో నుంతును. అన్నభావ మిట సూచింపఁబడినదని యెఱుంగందగు. ఇట్టి లింగము మనకు సీతావాక్యము.మూ.మున నారివహత్త్వమును తేటపఱచుచున్నది. ఈభాగమునఁ గలయధ్యాత్మరామాయణమునఁ గలవిషయము

పూర్వసర్గముననే వ్రాయఁబడినది. విశేషవిషయ మిందు దెలుపఁ దగినది లేదు. కథాంశము రెంటియం దేకరీతిగా నున్నది. ఇఁకఁ దరువాతికథాభాగమును బఠింతము.

వనగమనమున సీతారాముల సంవాదము.

* జానకి తన్ను నిట్లు శ్రీరాముఁ డాశ్వాసించుచుండఁగా నేవిధముననైన వనములకుఁ బిలుచుకొనిపొమ్మని యడుగఁ బూని కులవర్ధనుఁడగు రాముని గని స్నేహబలమున నభిమానమున నీవిధమునఁ దర్కింపసాగెను. రామచంద్రా! నీయందు సౌందర్యవిశేషముమాత్రమే కలదు. దానిం గాంచి యెల్లవారు ప్రీతిమయి ననుభవించుచున్నారు. కాని పౌరుషమను నదియే లేదు. మిథిలానగరపాలకుఁడు విదేహవంశవర్ధనుఁడగు నాతండ్రి జనకుఁడు నన్నొకతుకను గాపాడఁజాలక విడిచి నీ వొక్కడవే దండకారణ్యములకుఁ బోయితివని తెలిసినయెడల నిన్ను నాసమయమునందు నాయల్లుఁడగు శ్రీరామమూర్తి సత్యమునను స్త్రీయే. పైకిఁ బురుషవేసముఁ దాల్చి వచ్చి నా కుమారికను బెండ్లియాడెనని తలంచునుగదా. అక్కటా! ఈ లోకులెల్లఁ బ్రజ్వలించుసూర్యునియం దెట్లో యట్లే శ్రీరామునియందు మిక్కిలి తేజస్సుకలదని యజ్ఞానమునఁ జెప్పుదురు. అది యనృతము. ఉండినయెడల సూర్యునియం దెట్లు కనఁబడునో యట్లేల నీయందుఁ జూడఁబడదు? అకార్యములు సహస్రముచేసినదైనను భార్యను భరింపవలెనని యార్యులు చింతురు. నీవో నన్ను నడవులకుఁ దోడుకొనిపోవువిషయమున నకార్యముచేసినరీతి నీవేల విషాదమునొందుచున్నాఁ.

* ఇయ్యది ముప్పదియవసర్గమునుండి సంగ్రహింపఁబడినది.

డవు? ప్రళయకాలానలునివంటి కోపముగల నీకు భయ మేరీతిఁ గలుగును? అనన్యచింతగలదాననై నీయందే యాసక్తిగలిగి యున్న నన్ను విడిచిపోవ నూహించుటకుఁ గల హేతువేమో కనఁబడకున్నది.

శ్రీరామచంద్రా! మనస్సున నేతలంపుగలిగి యిట్లు విచారపడుచున్నావో యూహింపఁజాలకయున్నాను. భయ విషాదములచే నన్ను విడిచిపెట్టి నీవే పోఁగోరుచున్నావు. ద్యుమత్సేనునికుమారుఁ డగుసత్యవంతుని ననుసరించుట ప్రధానవ్రతముగాఁగల సావిత్రిచందమున నన్నుంగూడ నిన్నే యనుసరించి వర్తించుదానిగా నెఱుంగుము. మహాత్మా! అట్లు తలంప కులపాంసనురాలగు దుష్టవనితవలె నేనెప్పుడుగాని మన మునఁగూడ నిన్నుఁదక్క వేఱొక్కని దలంచుదానఁగాను. ఆకారణమున నిన్నుంగూడి వనములకు వత్తునేకాని యిందుండఁజాలను. ఇట్టి దృఢసంకల్పముగల పతివ్రతనని తలంచియు నన్ను రావలదందువా? మంచిదే. కుమార దశయందే నిన్నుఁ జెట్టవట్టితిని. చిరకాలము నిన్నుం గూడి యున్నదానను. సాధ్విని. నీకు భార్యను. ఇట్టి నన్ను శైలూషునిచందమున నీవే పరులకొసంగఁగోరుచున్నావు. ఎవ్వా రికి హితము సేయుమనియు, నెవ్వరికి శుశ్రూషలుచేయ నన్నిందు నిలుపవలయుననియుఁ గోరుచున్నావో, ఆతెల్లులకు ననుకూలుఁడవై వారుచెప్పినపనులు నీవే చేయుచుండుము. నీవడవుల కరిగిన నేనుమాత్రము నీవెంట రాకమానను. ఇంత యనుక నెవ్వరికి హితోపదేశముచేసితివో, ఎవ్వరికై యింత విచారపడితివో, అట్టిదానను నేనే కాన నాయీమాటను నీవు

వినవలయును. నేను జెప్పినయట్లు వనములకుఁదోడ్కొనిపొమ్ము. ఎవ్వనివిషయమున హితప్రవర్తనము కలదానవు కమ్మంటివో, ఎవ్వనియభిషేకోత్సవమునుబట్టి జనకునిచే నిగ్రహింపఁబడితివో, అట్టి భరతుని యిష్టము ననుసరించి వర్తించుచు నీవే యతఁడు పనుచునట్లు చేయుచుండుము. నేను నిన్నే యనుసరింతును. నన్ను మాత్రమే యట్లు భరతహితకార్యముల నొనరింపుమని పలుకకుము. సకలధర్మవేత్తవగు నీవు నన్నిటనుంచి యడవికిఁబోరాదు. తపమాచరించుటయో, వనములనుండుటయో, ఇవిలేక స్వర్గవాసమో ఇందేదియైన సీతోడనే నాకుఁ గలుగుంగాక. నీకు లేనిది నాకేదియు వలదు. నేను నిన్నుంగూడివచ్చుచుండఁగాఁ ద్రోవయందు నా కేకష్టములు కలుగవు. ఆ రామముల విహారము సల్పునట్లు, పుష్పశయ్యల శయనించుచందమున, నడవులు హాయిగానే నాకు నుండఁగలవు. త్రోవలంగల కంటకాదులు నీవెంటఁబోవుతఱి దూదివలె హరిణచర్మము లోనగువానిరీతి ముట్టుకొన హాయిగా నుండును. ప్రాణేశ్వరా! వనుల ఝంఝామారుతములకు నెగసి నాపైఁ నావరించుధూళిని మనోహరపరిమళవంతమగు శ్రీచందనచూర్ణముభంగి భావింతును.

వనములయందు నీవుండఁగా నందుఁగల లేఁతపచ్చికగల భాగములందు శయనించుటకంటె మృదుతమవస్త్రములు పఱచినశయ్యయందుఁ బవ్వళించుట యెంతయో సుఖముగా నుండునా? నీవడవులఁ గందమూలాదులలో వేనిని ప్రియముగా నీచేతులార నిత్తువో యవి యమృతమువలె నాకు నుండును. ఋతువుల ననుసరించి పూయుచుండుపూవులఁ బెట్టికొనుచు యాయిఫలములం దినుచు హాయిగా నాతల్లిదండ్రులఁగాని,

సౌధములఁగాని యించుకంతయుఁ దలంపను. నాతోడ నడవులకు నీవరిగినపిదప నందు నావలన నీకేదియుఁ గష్టముగాఁ దోఁపదు. పెక్కుమాటలేల? ఒక్కమాట వచింతు నాలకింపుము. శ్రీరామభద్రా! నిన్నుంగూడి యుండుటే స్వర్గము. నీవిరహమే నరకము. నీపై నాకుఁగల ప్రీతి నిన్ను వదలియుండఁ జాలనంత దృఢమైనదని యింతదనుక ననేకఘంగుల ననుభవమునఁ దెలిసికొంటివికదా! కనుక నన్నుం బిలుచుకొనియే యడవికిం బొమ్ము. నిర్భయముగా నడవికివచ్చుటకు నిశ్చయించుకొనియున్న నన్ను రావలదందువేని, నీవిచ్చటనుండునప్పుడే నీయెదుట విషపానమునఁ బ్రాణములను ద్యజింతును. జ్ఞాతుల వశమున నుండఁజాలను. పరమేశ్వరా! ఇపుడు చావకయున్నను నీవడవికిఁబోయినతరువాతనైన దుఃఖాతిశయమున నసువులు నాశరీరమున నుండవనుట నిశ్చయము. దుఃఖమున మృతినొందుటకంటె నిన్నుఁ జూచుచుఁ బ్రాణత్యాగముచేయుటే యుత్తమము. నిన్నుఁ బాసినయెడల నాదుఃఖమున నిమేషమైన జీవింపఁజాలను. నామత మిది. తొలుతఁ బదివత్సరములు. మరల మూఁడు. ఆమీఁద నొక్కటియు నిట్లు పదునాలుగుసంవత్సరములు నీవియోగమును సహించుట యెట్లు?

అని పలుకుచు శోకావేశమునఁ జూచువారికి జాలి గలుగునట్లు విలపించుచు నంత నాథుని బిగియార నాలింగనము చేసికొని గట్టిగా నేడ్చెను. ఆమె రామోక్తులు చెవుల కహితములై ముండ్లవలెఁ గ్రుచ్చుకొనఁగా విషలిప్తబాణము తనువునఁ గ్రుచ్చుకొనఁగా స్త్రీగజమువలె నొచ్చి యరణి యనఁబడు యజ్ఞపాత్రమును మథింపఁగా నెంతోసేపు లోపలనిమిడియున్న

యగ్ని నాపాత్రము వెడలఁగ్రక్కినట్లు మాటలసందడిని లోపల నడఁగియున్న యశ్రుజలముల నాసీత వెడలించెను. అట్టితఱి నాసీతాదేవి నేత్రములనుండి దుఃఖవేగమునఁ బుట్టి సందులేక కాఱుటంజేసి యంజనపంకమంతయుఁ బోవ స్ఫటికరీతిఁ దేటగానున్న కన్నీరు కమలమునుండి మకరందమువలె స్రవించుచుండెను. నిర్మలచంద్రబింబమువలెఁ జెలంగుచు విశాలములగు నేత్రములతో నలరుచున్న సీతమోము సంతాపోష్ణమున నీటినుండి వెడలించినకమలము సూర్యకిరణముల వాడినచందమున నెంతయు శోషిల్లెను. అత్తఱి నా రామచంద్రుఁడు మిగుల వగ మూర్ఛనొందినట్లున్న యాకోమలాంగిని దీర్ఘబాహువులం బిగియఁబట్టుకొని యత్యంత విశ్వాసపాత్రములగుమాటల నిట్లనియె.

దేవీ! నీకు దుఃఖము కలుగునేని నాకు లభించుస్వర్గము కూడ నిష్టము కాదు. జంతుసంతతి సృజించి పోషించి త్రుంచు స్వయంభువునకు దేనినుండియు భయములేనట్లు నాకు నెవ్వాని వలనను భయము కలుగదు. పూర్ణచంద్రసుందరవదనా! నిన్ను వదలియుండనివాఁడనయ్యును నిర్భయుఁడనయ్యు నిన్నడవులఁ గాపాడఁదగినశక్తి గలవాఁడనయ్యు నీమనోభావము సంపూర్ణముగా నాకుఁ దెలియకయున్నందున నన్నుఁగూడివచ్చి వనమున వసియింప నంగీకరింపకయుంటిని. మైథిలీ! నన్నుఁగూడి వనవాసముచేయనే నీవు సృజింపఁబడితివి. అందులకై సిద్ధముగ నుండియున్న దానవు. కనుక నెట్టికట్టిడి కాలమునందును జలింపని మనస్సుగలవాఁడు కీర్తిని విడనాఁడఁజాలనిరీతి నిన్ను నేను వదలియుండఁజాలను. సుశ్రోణీ! తొల్లి రాజర్షులు భార్యలం

గూడియే వానప్రస్థవ్రతమును సల్పిరి. సువర్చల భాస్కరు నను సరించియే యుండెఁగదా. అట్లే నేనును బూర్వులయాచారమునే-యనుసరించి నిన్నడవులకుఁ దోడుకొనిపోయెదను. సూర్యుని సువర్చల యనుపురంధ్రీమణివలె నీవు నన్ననుసరించి రమ్ము. జనక తనయా! పితృచరణులు నన్నడవికిఁ బొమ్మన్నదొక్కటియే కాదు. ఆరీతివర్తింతునని నేనుఁ బలికితిని కావున నాతండ్రి పలుకు మిక్కిలి బలీయము. ఆమాటయే నన్నడవికిఁ బిలుచుకొనిపోవుచున్నది. కాన దాని మానన యితకాదు. తప్పక పోవనున్నాను.

పవిత్రురాలా! జనకులకు విధేయుఁడై యుండుటను నదియే ధర్మము. దానిని మించినధర్మమే లేదు. కాఁబట్టి జనక వాక్పరిపాలనమునకుఁ బూనియున్న నేను నట్టిధర్మమును దాఁటి జీవింపనొల్లను. దైవము నారాధించుచు నిందే యుండఁ-గూడదా. అదియు ధర్మమేకదా. యందువేమో వినుము. జననీ జనకులు గురువుననెడు మూవ్వురు ప్రత్యక్షదైవతములు మన కాజ్ఞచేసి మనపూజలకు లోఁబడుదురు. దైవము ప్రత్యక్షముగా మనకాజ్ఞసేయఁడు. మన మారాధింప వశ్యుఁడుకాక స్వతంత్రుఁడై యుండును. అట్టిదైవము నెట్టులారాధింప శక్యమగును? విశాలా! జననీజనకులు గురువను నీమూవ్వురే మూఁడులోకములు. ఈముప్పురిని బూజించిన ముల్లోకములను వశముచేసికొనవచ్చును. వీరికి సేవచేసినఁ ద్రిలోకముల దేవత లను బూజించినఫలము కల్గును. కనుక నీపూజవలెఁ బావనమైనది వేఱొక్కటిలేదు. కాఁబట్టియే నేను వీరలనే యారాధించు చున్నాఁడను. సీతా! పితృసేవ పరలోకమునొందుట కెట్లు

తోడ్పడి మేలు కలిగించునో యట్లు సత్యదానమానములు, పూర్ణదక్షిణలతోడియాగములు పరలోకప్రాప్తికిఁ దోడ్పడఁజాలవు. గురుసేవ చేయువారలకు స్వర్గము, ధనధాన్యములు, విద్య, పుత్రసుఖములు మఱేవిగాని కోరినఁ గలుగును. దాన సాధ్యము కాని దేదియుఁ గానరాదు. విరామములేక తల్లిదండ్రులను బ్రీతితో సేవించుమహాత్ములు దేవగంధర్వగోలోకములను, మఱియు నితరములగు పుణ్యలోకములను బొంది క్రమముగ బ్రహ్మలోకమును జేరుదురు. స్వతంత్రుఁడగునట్టితండ్రి సత్యధర్మములను దృఢముగా గ్రహించి నన్నే రీతి నాజ్ఞాపించునో యట్లే ప్రవర్తింపఁ గోరుచున్నాఁడను. అదియే శాశ్వతధర్మము. జానకీ! ఇంతదనుక నీభావము నాకు స్పష్టముగాఁ దెలియనందున దండకారణ్యములకు నిన్నుఁగొనిపోవ బుద్ధి నాకుఁ జనింపలేదు. నీవే యడవుల నుందునని చెప్పి నాతోడ రా నిశ్చయించుకొన్నావు. దాన నీసద్భావము నాకిప్పుడు స్పష్టమైనది. కనుక నిన్నుఁ దోడ్కొని పోవుదు.

అనవద్యాంగీ! హరిణాక్షీ! జానకీ! అరణ్యముల నన్నుఁ గూడియుండుటకు దైవమే నిన్నుఁబుట్టించెఁగదా. భీరువవయ్యు నాతోడరమ్ము. నీకే భయము కలుగదు. అందు నాతో ధర్మముల నాచరించుచుండుము. భర్త ననుసరింపవలయునన్న నిశ్చయము నీకు నెంతయుఁ గలదు. ఇయ్యది మనయిరువురవంశములకుఁ దగినది, శుభమైనదియు నగు. ఇఁక జాగుసేయక వనవాసమునకుఁ దగిన కార్యముల నొనరింప నారంభింపుము. నీవిఁక లేకున్న నాకు స్వర్గముకూడ హితముకాదు. బ్రాహ్మణులకు వివిధరత్నములు, భిక్షుకులకు నీకుఁదోఁచినట్లు భోజనము నొసంగుము. మఱియు

నెవ్వరెవ్వ రేదేది కోరుదురో యది వ్యర్థము చేయక వారల కొసంగుము. ఆలసింపకుము. త్వరపడవలయుంజుమీ. బ్రాహ్మణులకు దానమిచ్చిన పిదప నమూల్యాభరణములను, మేలగువస్త్రములను, వేడుకగా నాడుకొనుబొమ్మలను, మఱియుఁ గలవస్తువులను, పాన్పులను శిబికాదియానములను మనయుభయులకు సంబంధించినవానిలో వేనినిగాని భృత్యుల కొసంగుము. జానకియుఁ దనయనుగమనమునకు రామమూర్తి సమ్మతించినందుల కానందించి వెంటనే తదాజ్ఞానుసారము దానములు చేయ మొదలిడెను. కీర్తిమంతురాలగు నామహాదేవి భర్తయనుజ్ఞననుసరించి మహానందమున నితరచింతల మాని ధార్మికులకు ధనములను రత్నములను సంతృప్తిగా దానము చేయ మొదలిడెను.

మహాశయులారా! ఈఘట్టము పూర్వసర్గములయందు నేవ్రాసినవిశేషార్థము సత్యమని దృఢపఱచుచున్నది. సీతారాములసంవాదము వారు మూలప్రకృతిపరమపురుషులనునర్థమును సిద్ధాంతముచేయుచున్నది. మఱియుఁ బతివ్రతాధర్మవిశేషముల [illegible] పుచ్చుచున్నది. కావునఁ జక్కఁగా విమర్శింపవలయు. దుర్మతాభిమానమును బాఱఁదోలినఁగాని తత్త్వము తెలియ వలను పడదు. ఈశ్వరానుగ్రహము దుర్మతావలంబకులకు దూరమగుచుండునని యెల్లరెఱింగినవిషయమే కదా.

"సా తము త్తమసంవిగ్నా సీతా విపులవక్షసం,
ప్రణయాచ్చాభిమానాచ్చ పరిచిక్షేప రాఘవమ్." ౨

అని మూలము. తానెన్నిభంగులఁ బ్రార్థించినను శ్రీరామమూర్తి తనపట్టు వదలనట్లు నటించెను. కావున మహాప్రకృతి చేయఁ

దగుకార్యమునకుఁ దనయనుగమనము ప్రధానమని స్మృతికిం దగులఁజేయఁబూని యిట్లు పలుకుచున్నది. ఉత్తమసంవిగ్నా=ఉత్తమకార్యమగు దుష్టశిక్షణపూర్వక ధర్మసంస్థాపనవిషయమున వడంకుచున్నదిగానే యని యర్థము. అనఁగాఁ ద్వరపడుచున్నదని భావము విపులవక్షసం=విశాలహృదయము గలవానిని యర్థము. అనఁగా గొప్పమనస్సుగలవాఁడని భావము. ప్రణయాత్=విశేషనీతివలనను అనఁగా న్యాయమునందలి యాదరమువలన నని భావము. అభిమానాచ్చ=విశేషమర్యాద వలన నని యర్థము. పతివ్రతలకు నుపదేశింపఁదగుమర్యాద వలన నని తాత్పర్యము. పరిచిక్షేప=ప్రేరేపించెను; క్షిప్ ప్రేరణే అని. చేయవలసినపను లనేకము లుండ వానికన్నింటికి నేనే మూలమయియుండ నన్నేల రావలదని యాలస్యము చేయుచున్నావు. త్వరపడుమని హెచ్చరించెననియే యిటఁ గలసారము. అయోధ్యలో నిఁక మనము నిలువరాదు. విరాధాదులశాపవిముక్తికాలము సమీపించుచున్నది. మాటలతో నిఁకలాభము గలుగదు. పయనము సాగింతును. వేవేగ నారాకకు సమ్మతింపుమని సర్వేశ్వరునకు భావికార్యముల నొనరింపఁ బురికొల్పెనని మన మెఱుంగందగు. భగవంతుని బ్రకృతి యేల ప్రోత్సహింపవలయు నను వారు గొందఱుందురు. సగుణుఁడనఁగా నర్థమేమి? ప్రకృతింగూడి జగత్కార్యకరణమునకుం బూనెననియే యర్థము. అపుడుకూడఁ బ్రకృతియే సర్వకార్యములఁ దత్సాన్నిధ్యమున నొనరించును. పరమేశ్వరుఁడు సాక్షిమాత్రుఁడై యుండును. ఈయర్థమునే శంకరభగవత్పాదులు

"జగత్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే

తిరస్కుర్వన్నేతత్స్వమపి వపురీశ స్తిరయతి,
సదా పూర్వస్సర్వం తదిదమనుగృహ్ణాతి చ శివ
స్తవాజ్ఞామాలంబ్య క్షణచలితయో ర్భ్రూలతికయోః." ౨౮

అనువాక్యరూపమునఁ దేటపఱచిరి. కనుకనే భగవతి నిర్లిప్తుఁడగు భగవంతుని బురికొలిపెననియే యిటఁగల యర్థవిశేషము. ఆప్రోత్సాహ మెట్టిదో యీ క్రిందిశ్లోకము తెలుపుచున్నది.

"కిం త్వామన్యత వైదేహః పితా మే మిథిలాధిపః,
రామ జామాతరం ప్రాప్య స్త్రియం పురుషవిగ్రహామ్." ౩

అను నీమూలమునకు నెన్నియో యర్థములు వ్యాఖ్యాతలు వ్రాసిరి. ఇందు వ్రాయఁదగిన యర్థమును దానిసారము నెట్లు గ్రహింపఁదగునో యాపద్ధతిని వ్రాసెదను. తన్నడవికిఁ దోడ్కొని పోలేదన్నకోపమున సీత ___ము నాక్షేపించుచున్నది. రామా! నీవేమో పురుషశ్రేష్ఠుఁడవని నన్ను నీకు భార్యగా నొసంగినవాఁడు కాని పురుషాకారము స్త్రీస్వభావము కలవాఁడని యెఱింగియుండిన నాతండ్రి నీకునొసంగియుండఁడు. అనఁగా నడవులకు నన్నుఁ బిలుచుకొనిపోయిన నెన్నియో కష్టములు కలుగునన్నభయము గలవాఁడవైతివే. ఇది పురుషునకుఁ దగునా యని సీతభావము. ఇది కథననుసరించిన సామాన్యార్థము. ఈగ్రంథమునఁ దెలుపఁదగిన విశేషార్థ మేది యనఁగా వినుఁడు.

"కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః,
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి." ౨౦. గీత 3 అధ్యా.

అన్న శ్రీకృష్ణోపదేశముప్రకారము జనకచక్రవర్తి విదేహవంశసంభూతుఁడు. ఆవంశమున జన్మించినవారు కర్మసిద్ధుల నెఱింగిన

జ్ఞానులు. మిథిలానగరము జ్ఞానుల కునికిపట్టు. ఆనగరమునకుఁ బ్రభువు. అనఁగా జ్ఞానులలో నుత్తముఁడు. అట్టి నాతండ్రి జనకచక్రవర్తి పురుషవిగ్రహముగల స్త్రీనిగా ననఁగా సగుణ బ్రహ్మమునుగా పలుపోయఁడాయేమి? కన్యాదానకాలముననే నీవంటియల్లునిం గాంచి జ్ఞానధనుఁడగు నాతండ్రి మూలప్రకృతివశుఁడవని తెలియఁడనుకొనుచున్నావాయేమి? సకలకార్యములు స్త్రీమూలములుగా నీయవతారమున సాగించుచు సాక్షీమాత్రుఁడవై యుండు భగవంతుఁడవని యెఱుంగును. కనుకనే

"సహధర్మచరీ తవ. భద్రంతే పాణిం గృహ్ణీష్వ పాణినా."

అని పలికినమాట మఱచితివా యేమి? ఈసీత నీకు సహధర్మచారిణి. మేలు నీకుం గలుగును. అనఁగా సకలధర్మకార్యములను నిన్నుఁగూడి యాచరించును. లోకమున సకలవిధములగు ధర్మముల నిలుపును. దాన నీయవతారమునకు మేలు గలుగును. నిర్లిప్తుఁడవగు నీ కీభార్యవలన నేకష్టములును గలుగవు సుమీ. నీహస్తమున నీమెహస్తమును గ్రహింపుము. మన మిరువుర మొక్కటియే యన్నభావము గాంచుము. అనఁగా నీసీతకు నీకు భేదము లేదు. అనఁగా నవినాభావసంబంధమే. అనికదా నాతండ్రి హెచ్చరించెను. అట్టిపలుకు నంగీకరించి నన్ను గ్రహించితివి. ఇపుడు నన్ను రావలదందువే యేల? నేను రాకయున్న వనముల నీవేమి చేయుదువు? సర్వము నామూలమునఁగదా కాఁదగును? అట్టి నన్ను రావలదనుచున్నావే? అని సీత ప్రశ్నించుచున్నది. ఇదియే గ్రహింపఁదగినవిశేషము. 'స్త్రియం పురుషవిగ్రహామ్.' ప్రకృతి కార్యార్థము పురుషాకార

మును దాల్చును. అనఁగా నేరూపమున నేకార్యము సాధింప వలయునో యారూపమును ధరించునని భావము. ప్రకృతి శబ్దము స్త్రీలింగము కాన స్త్రీయనరాదు. బ్రహ్మశబ్దము పరమాత్మ వాచకమైనపుడు నపుంసకలింగము. కానఁ బరమాత్మ షండుఁ డనరాదు. ఈమూఁడును గానివాఁడనియు మూఁడునైనవాఁ డనియు భావము.

"ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా."

అనుసూక్తి కలదు.

"స ఏవ వాసుదేవోఽయం సాక్షాత్పురుష ఉచ్యతే,

స్త్రీప్రాయమేతత్తత్సర్వం జగద్బ్రహ్మ పురస్సరమ్."

అను విష్ణుపురాణవచనము కలదు.

"సత్యం విధాతుం నిజభృత్యభాషితం

వ్యాప్తిం చ భూతేష్వఖిలేషు చాత్మనః,

అదృశ్యతాత్యద్భుతరూపముద్వహన్

స్తంభే సభాయాం న మృగం న మానుషం." స్కం ౭ అధ్యా ౮.

అను శ్రీభాగవతవచనము కలదు. వీనిం బరికింపఁగాఁ గార్య మునకుఁ దగినట్లు రూపమేకాని యీరూపము భగవంతునకు శాశ్వతముగా నుండునది లేదని స్పష్టమగును. భగవంతున కెట్లో తత్ప్రకృతికి నట్లే యని యెఱుంగందగు. ఈప్రమాణ ముల ననుసరించి మహామాయ పురుషాకృతింగాని రామనామ మున వెలసి సీతారూపముగ జగములయాచారమును బాటిం నొప్పెనని భావము.

వాసుదేవోఽయం సాక్షాత్పురుషః = అనఁగా వైకుంఠ లోకవాసి యగునారాయణుఁడు. సర్వాంతర్యామి యగుభగ

వంతుఁడని యర్థము. వాసుదేవనారాయణశంకరాదినామము లెల్ల నాపరతత్త్వమునకుం జెల్లు. బ్రహ్మాపురస్సరంజగత్=అనఁగా బ్రహ్మదేవుఁడు లోనుగాఁగలవారెల్ల నామహాప్రకృతికి లోఁబడినవారని, విష్ణువు ప్రకృత్యతీతుఁడనియుఁ జెప్పునర్థము వాస్తవము కాదు. బ్రహ్మను జెప్పఁగనే తత్తుల్యులగు విష్ణుశంకరు లుపలక్షణవిధి గ్రహింపఁబడుదురు. విష్ణువు భగవంతుఁడన్న నౌనన వచ్చును. కాని బ్రహ్మశంకరు లావిష్ణువు కాదు. అన్న నిస్సీయనవలయును. ఆరూపములు తద్భిన్నములనఁగా నీవిష్ణువు భగవంతుఁడు కాకపోవలయును. ఎల్లరూపములు తానైనవాఁడే భగవంతుఁడు. ఏభక్తు లేరూపమున నేనామమునఁ బూజించినను సంతృప్తినొందువాఁడే పరమాత్మ. ఒక్కరూపము నొక్కపేరు నాతనికిఁ జెల్లదన్నను, బ్రియము కాదన్నను, భగవంతునకుఁ గలపరమాత్మత్వ మూడిపోవును. ఆదుర్వాదమునకేభక్తుఁడును బూనరాదుకదా 'పురుషవిగ్రహం స్త్రియం' అనఁగాఁ బురుషవిగ్రహముగల స్త్రీ ననునర్థముచెప్పిన బహువ్రీహిసమాసము కాన "విగ్రహామ్" అని యుండవలదా యని కొందఱందురు. అట్లుండవలయుననుట విధి కాదు. కొన్నిచోవుల నట్లుండ నక్కఱలేదని ప్రయోగములు కనఁబడియెడిని "పురుషవిగ్రహమివ పరిదృశ్యమానాంస్త్రియమ్" అని యర్థము చెప్పవలయును. లేకున్నఁ బ్రాతీతికార్థముకూడఁ జెడును. కావునఁ బైవ్రాసినయర్థము సుసంగతమే యగును. దీనినుండి గ్రహింపఁదగుసార మేమనఁగా శ్రీరామచంద్రా! ఏల నన్నిట్లు పలుభంగుల రావలదని హెచ్చరించెదవు? కన్యాదానకాలమున ధర్మచర్యల యందు నిన్నుఁ గూడియుండ నిశ్చయింపఁబడితినిగదా. ఈవన

వాసము పితృవాక్యానుసారము చేయవలయుననియు, నదియే ధర్మమనియు బహుభంగులఁ జెప్పితివికదా. అది ధర్మమే యగునేని నన్ను వదలి నీవెట్టు లాచరింతువు? నాతండ్రి భావము నన్ను విడనాడి నీ వేధర్మకార్యము చేయ రాదనియే. నీవు శక్తిహీనుఁడవని నాతండ్రి తలంపలేదు. శక్తి నగు నన్నుంగూడియే వనములకుం బోవవలయును. అని సీతయాశయము నుదాహరణపూర్వకముగా శ్రీరామునకుఁ దెలిపెనని మనము గ్రహింపందగు. ఈభాగము మన కేనీతులను దెలుఁపును?

వివాహకాలమున నేయేనియమములకు లోఁబడి భార్యను భర్త గ్రహించునో యానియమముల నించుకంతయు మీఱరాదు. సాధ్వియగుభార్యను వదలి యేధర్మకార్యములు చేయరాదు. చేసినచో నవి "అవిధినా కృతమకృత" మ్మను న్యాయము ననుసరించి చేయనట్లే యగును. అగ్నిసాక్షికముగా సహధర్మచారిణి యని గ్రహించినభార్యలచెంత లేక ధర్మకార్యము లొనరించిన

"యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః,
న స సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాం గతిమ్."

అన్న శ్రీకృష్ణవాక్యము ననుసరించి నిష్ఫలములగును. కావున భార్య సమ్మతము గొనక యేధర్మకార్యములను భర్త చేయరాదు. సాధ్వియు భర్తయనుమతి మీఱి యేకార్యము చేయరాదు. ఇరువురు సమ్మతించియే ధర్మకార్యములు చేయవలయును. తీర్థయాత్రాదికములు భార్య నింట వదలి పతి చేయరాదు. ఈనీతుల నీభాగము బోధించునని మన మెఱుంగవలయును.

మఱొక్క విశేష మిందుఁగలదు. రామ! పరంథాముఁడవగు త్వా=నిన్ను, జామాతరమ్ = అల్లునిగా, ప్రాప్య=పడసి, (నాతండ్రియగు మిథిలాధిపతి) స్త్రియం = భార్యనుగుఱించి, పురుషవిగ్రహామ్ = పురుషునితోటికలహామును, అమన్యత కిం=తలంచినాఁడేమి? అనఁగా నీయంతటివాఁ డల్లుఁడు కాఁగానీక నామూలమున నీకొకపురుషునితోడ యుద్ధమగునని తలఁపలేదని భావము. దీనిచేఁ గొంతకాలమునకు నన్నుఁగూర్చి యుద్ధముసాగునే అని సీత హెచ్చరించెను. భగవత్సాన్నిధ్య బలమునఁగదా ప్రకృతి యెల్ల కార్యముల నొనరించును. కావున నన్ను వదలి నీవుపోయిన నేమి చేయఁగలవు? నామూలముగా యుద్ధము కావలసియుండఁగా వలదనుచున్నావే. అని సీత రామమూర్తికి స్మృతిగోచరమగునట్లు లొనరించెననియే తాత్పర్యము. రామమూర్తి మాయామానుషవిగ్రహుఁడు కాన నొకరు విషయమును దెలిపినఁగాని త్వరఁబూనఁడని మన మెఱుంగవలయును. సాక్షిమాత్రుఁడు నిర్లిప్తుఁడు నగుభగవంతుని దత్ప్రకృతి పురికొలుపు టుచితమే కదా.

"అనృతం బత లోకోఽయమజ్ఞానాద్యద్ధి వక్ష్యతి,
తేజో నాస్తి పరం రామే తపతీవ దివాకరే."

అని మూలము సీత లోకాపవాదమును నిరసించుచున్నది. మండుచుండు మార్తండునందుఁబలె నీయందు శ్రీరామా! తేజస్సు లేదని లోకము చెప్పుచుండును. అది యనృతమే. బత! అనునది లోకులంగూర్చిననింద. సూర్యతేజస్సుతో నీ తేజస్సును బోల్చువా రజ్ఞానులని భావము

"దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా,

యది భాస్సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః. ౧౨
తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్త మనేకధా,
అపశ్యద్దేవదేవస్య శరీరే పాండవస్తదా.” ౧౩ గీత. ౧౧ అధ్యా

అన్న గీతాశాస్త్రము ననుసరించి యనేకసూర్యు లొక్కసారి యుదయించిన నెట్టితేజస్సుండునో యట్టిదని సామాన్యబుద్ధి నిర్ణయింపఁదగినది భగవత్తేజస్సు. అట్టిదాని నొకసూర్యుని తేజస్సుతోఁ బోల్చుట యదికూడ లేదనుట యజ్ఞానముకదా. అయ్యో! లోక మెంతమూఢమైనదని సీత విచారించుచున్నది. అనఁగా నీదివ్యతేజస్సు లోక మెఱుంగదు. నే నెఱుంగుదును. అట్టి నీ వేల నన్ను రావలదందువో తెలియఁజాలకున్నదాన నని జానకి తనవిచారమును దెలిపెను. దీనిచే భగవంతుని తేజోరూపము లోకుల కెఱుంగఁదరముగానిదనియు, జ్ఞానధను లకే యది యెఱుంగ సాధ్యమనియు సారము.

“కిం హి కృత్వా విషణ్ణస్త్వం కుతో వా భయమస్తి తే,
యత్పరిత్యక్తుకామస్త్వం మామనన్యపరాయణాం.” ౫

అని మూలము. రామమూర్తిని సీత మఱియుఁ బురికొలుపు చున్నది. రామచంద్రా! ఏమి యీనటనము! ఏమి యీవింత భయము! లోకమున నకార్యముచేసినవారు విషణ్ణులు కావలయు. అశక్తులు భయంపడవలయును. ధర్మస్వరూపునకు నీకు విషాద మెక్కడిది? లయకాలమున సకలజగములను క్షణకాలమున భస్మముచేయు రుద్రరూపుఁడవగు నీకు భయ మెత్రోవ నుండి వచ్చును? ఛాయవలె నిన్నే యెడఁబాయని నన్నుఁ గాపాడఁజాల ననుభీతిపొంద హేతువేమో తెలియఁజాలక

యున్నాను. లోకమోహనవ్యాపార మింకఁ జాలును. అని సీత భావమని మనము గ్రహింపవలయును.

"ద్యుమత్సేనసుతం వీర సత్యవంతమనువ్రతాం,
సావిత్రీమివ మాం విద్ధి త్వమాత్మవశవర్తినీం." ౬.

అని మూలము. ఇందు సత్యవంతుని సావిత్రిని దృష్టాంతముగాఁ జెప్పుట లోకమునఁ బతివ్రతలవర్తనము బోధించుటకే యని యెఱుంగందగు.

"న త్వహం మనసాప్యన్యం ద్రష్టాస్మి త్వదృతేఽనఘ,
త్వయా రాఘవ గచ్ఛేయం యథాన్యా కులపాంసనీ. ౭
స్వయం తు భార్యాం కౌమారీం చిరమధ్యుషితాం సతీం,
శైలూష ఇవ మాం రామ పరేభ్యో దాతుమిచ్ఛసి." ౮

అని మూలము. సీత పతివ్రతల మర్యాదలఁ దెలుపుచున్నది. ఏస్త్రీ యితరుని బ్రీతిచేఁ గాచునో యామె కులపాంసిని యనంబడును.

"వ్యభిచారాత్తు భర్తుస్స్త్రీ లోకే ప్రాప్నోతి నింద్యతాం,
సృగాలయోనిం చాప్నోతి పాపరోగైశ్చ పీడ్యతే. ౩౦
స్వాం ప్రసూతిం చరిత్రం చ కులమాత్మానమేవ చ,
స్వం చ ధర్మం ప్రయత్నేన జాయాం రక్షన్ హి రక్షతి." ౩

మను. ౯ అధ్యా.

అని మనుస్మృతి చెప్పినచొప్పునఁ గులగౌరవము భార్యాధీనము. ఆమర్యాద నెవ్వతుక నాశముచేయునో యాతన్వి కులపాంసిని యనంబడును. పితృభర్తృవంశముల రెండింటికి హానిగల్గించునని భావము. అనఁగా పుట్టినయింటికిఁ జొచ్చిన యింటికి మర్యాదామర్యాదలను దెచ్చునది స్త్రీయని తేలెడిని.

పతివ్రత ఉభయకులానందదాయిని యగు. దుర్వృత్తిగలస్త్రీ కులపాంసిని యగు. అట్టికులపాంసినివలె నితరుని నేఁ జూడఁగోర నని సీత హెచ్చరించుచున్నది. మనస్సునఁగూడఁ గోరనని సీత పలికెను. శరీరదోషములకన్న మనోదోషము లెక్కుడుగఁ బరిగణింపఁదగినవని దీనిభావము. మనోవాక్కాయములచే శుద్ధ ప్రవర్తనముగలకాంతయే పతివ్రత యనఁబడును.

"విప్రియం న చ కర్తవ్యం భరతస్య కదాచన."

అని శ్రీరామమూర్తి యింతకుముందు పలికెను. వానికి బదులు సీత యుత్తరిఁ దెల్పుచున్నది. కౌమారీం = చిన్నియస్సుననే పెండ్లియాడితిని. చిరమధ్యుషితాం=పండ్రెండుసంవత్సరములు నీచెంత నున్నదానను. భార్యాం = నీవు భరింపఁదగియున్న వాఁడవు. నేను భరింపఁదగినదానను. శైలూష ఇవ=భార్యవంక బ్రదుకువాఁడని సామాన్యార్థము. వేషధారియని విశేషార్థము. అట్టివానివలె నిట్టి నన్నితరుల కొప్పింపఁబూనెదవు. ఇది నీకుఁ దగదుసుమా యని కథానుసార మగునర్థము. విశేషార్థమేమి? కౌమారీం = కుత్సితుల మరణము నొందింప నవతరించినదాన నని యెఱుంగుము. చిరమధ్యుషితాం = అఖండకాలము అనఁగాఁ బరిమితిలేనికాలము నీతోడ నున్నదానను. భార్యాం= నన్ను భరింపఁదగినవాఁడవు నీవే. అనఁగాఁ బరతత్త్వము నీవే. కనుకఁ దక్కినవారెల్ల నాచే భరింపఁదగినవారని భావము. స్వయంశైలూషః = నీవే వేషధారివి. భార్యాజీవనుఁడవు. అనఁగా నామూలముననే నీబ్రదుకు విఖ్యాతిం గాంచును. నేను లేకున్న నీకు నామరూపము లెక్కడివి? నేను దోడ్పడిననే నీవొకవ్యక్తిత్వము నొందుదువు. మామ్ = లక్ష్మిదేవిని అనఁగా

నీయైశ్వర్యము నేనే యని యర్థము. ఇట్టి నన్ను పరేభ్యో దాతుమిచ్ఛసి = శత్రువులుగా లోకదృష్టికిం దోఁచు రావణాది రాక్షసుల కీయఁదలఁచుచున్నావు. అనఁగా మానవవేషమును ధరించిననన్ను శత్రువులవలె నున్న రావణాదుల కొసంగి యావ్యాజమున ధర్మరక్షణము నొనరింపఁగోరుచున్నావు. అని కాఁగలసీతాపహరణ మిందు సూచితము. నీతియేమనఁగా తన్ననుసరించి వర్తించుసాధ్వి నితరులకడనుంచి తానే ధర్మకార్యము నిర్వహింప బ్రయత్నింపరాదనియే యీభాగమునుండి మనము గ్రహింపఁదగును.

"న దేవి తవ దుఃఖేన స్వర్గమప్యభిరోచయే,
న హి మేఽస్తి భయం కించిత్స్వయంభోరివ సర్వతః." ౨౭.

అని మూలము. స్వయంభువుశబ్దము నారాయణపరమని గోవిందరాజులు, బ్రహ్మపరమని మహేశ్వరతీర్థులు వ్రాసిరి.

"స్వయంభోః నారాయణస్య న చతుర్ముఖస్య,
తస్య మధుకైటభాదిభ్యో భయసంభవాత్."

అని గోవిందరాజులు వ్రాసిరి. మతావేశమున నిట్లు పలికిరి. నారాయణునకుఁ ద్రిపురాసురులవలన భయముకలిగెనని తలంపరైరి. కాన నిట స్వయంభువనఁగాఁ బరాత్పరుఁడగు భగవంతుఁడే యర్థము.

"మా తే వ్యథా మా చ విమూఢభావో
దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదం,
వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం
తదేవ మే రూపమిదం ప్రపశ్య." ४९. అధ్యా. ౧౧.

అన్న భగవద్వాక్యము ననుసరించి యితరులవలన భయమను

నది యెఱుంగనివాఁ డొక్క భగవంతుఁడే కాని త్రిమూర్త్తులలో నెవ్వరుకాదని యెఱుంగందగు. నారాయణుఁడనఁగా నట్టి భగవంతుఁడే యందు రేని యాక్షేపములేదు. నారాయణశంకరాదినామము లాపరతత్త్వమునకుం గలవు. కావుననే "అకుతోభయః" అన్న ప్రసిద్ధి యొక్క పరమేశ్వరునకుం గలదు. ఈభాగమున శ్రీరామమూర్త్తి తన సర్వేశ్వరత్వమును వెల్లడించుచున్నాఁడు. నాకెందును భయములేదు.

"స్వయంభో స్త్మే సర్వతః కించిద్భయం నహి."

అని యన్వయక్రమము. భగవంతుఁడనగు నాకెవ్వరివలనను భయముకలుగదని సారము.

"తవ సర్వమభిప్రాయమవిజ్ఞాయ శుభాననే,
వాసం న రోచయేఽరణ్యే శక్తిమానపి రక్షణే. ౨౦
యత్సృష్టాసి మయా సార్ధం వనవాసాయ మైథిలి,
న విహాతుం మయా శక్యా కీర్తిరాత్మవతా యథా." ౨౯

అని మూలము. శ్రీరాముఁ డీభాగమునఁ దమయిరువురకుంగల సంబంధమును బ్రకృతిపురుషత్వమును దేటపఱచెను. నీయభిప్రాయమెల్ల నిట్టులని తెలియక యేను వనవాసము నిచ్ఛగింపనైతిని. రక్షింప శక్తిగలవాఁడనే. అనఁగా నేనేకార్యములెట్టులెట్టులు చేయవలయునో యవి నీవలన విన్గోరి వలదంటినని భావము. దీనిచే భగవంతుని నిర్లిప్తత్వము స్పష్టము.

"మైథిలి మయా సార్ధం వనవాసాయ సృష్టాసి.
యత్ యస్మాత్కారణాత్ అతః మయా విహాతుం న శక్యా."

అని యన్వయక్రమము. వనవాసముకొఱకే సృజింపఁబడితివి. కాన వదలశక్యమా? వనవాసమువలననే మనయవతారప్రయో

జనము తేటపడనలయును. కనుక నిన్నెట్లు వదలుదును? ఇట్లను టంజేసి ప్రకృతిపురుషుల కవినాభావసంబంధము స్థిరమయ్యెను.

"ఏష ధర్మస్తు సుశ్రోణి పితుర్మాతుశ్చ వశ్యతా,
అతశ్చ తం వ్యతిక్రమ్య నాహం జీవితుముత్సహే. ౩౨
అస్వాధీనం కథం దైవం ప్రకారైరభిరాధ్యతే,
స్వాధీనం సమతిక్రమ్య పితరం మాతరం గురుం. ౩౩
యత్రయం తత్త్రయో లోకాః పవిత్రం తత్సమం భువి,
నాన్యదస్తి శుభాపాంగే తేనేదమభిరాధ్యతే. ౩౪
న సత్యం దానమానౌ వా న యజ్ఞాశ్చాప్తదక్షిణాః,
తథా బలకరాస్సీతే యథా సేవా పితుర్హితా. ౩౫
స్వర్గో ధనం వా ధాన్యం వా విద్యాః పుత్రాస్సుఖాని చ,
గురువృత్త్యనురోధేన న కించిదపి దుర్లభం. ౩౬
దేవగంధర్వగోలోకాన్ బ్రహ్మలోకాంస్తథా నరాః,
ప్రాప్నువంతి మహాత్మానో మాతాపితృపరాయణాః. ౩౭
స మా పితా యథా శాస్తి సత్యధర్మపథే స్థితః,
తథా వర్తితుమిచ్ఛామి స హి ధర్మస్సనాతనః." ౩౮

అని మూలము. ఇందు శ్రీరాముని ధర్మోపదేశము కలదు.

"ఆచార్యో బ్రహ్మణో మూర్తిః పితా మూర్తిః ప్రజాపతేః,
మాతా పృథివ్యా మూర్తిస్తు భ్రాతా స్వోమూర్తిరాత్మనః. ౨౨౬
తేషాం త్రయాణాం శుశ్రూషా పరమం తప ఉచ్యతే,
న తైరభ్యననుజ్ఞాతో ధర్మమన్యం సమాచరేత్. ౨౨౯
త ఏవ హి త్రయో లోకాస్త ఏవ త్రయ ఆశ్రమాః,
త ఏవ హి త్రయో వేదాస్త ఏవోక్తాస్త్రయోఽగ్నయః. ౨౩౦
త్రిష్వప్రమాద్యన్నేతేషు త్రీన్ లోకాన్ విజయేద్గృహీ,
దీప్యమానస్స్వవపుషా దేవవద్దివి మోదతే. ౨౩౨

ఇమం లోకం మాతృభక్త్యా పితృభక్త్యా తు మధ్యమం,
గురుశుశ్రూషయా త్వేవం బ్రహ్మలోకం సమశ్నుతే. ౨౩౩
సర్వే తస్యాదృతా ధర్మా యస్యైతే త్రయ ఆదృతాః,
అనాదృతాస్తు యస్యైతే సర్వాస్తస్యాఫలాః క్రియాః. ౨౩౪
త్రిష్వేతేష్వితి కృత్యం హి పురుషస్య సమాప్యతే,
ఏష ధర్మః పరస్సాక్షాదుపధర్మోఽన్య ఉచ్యతే." ౨౩౫

మను. ౨ అధ్యా.

అను నీమనుస్మృతిభావమే రామాయణమునఁ గలదు. అప్రత్యక్షముగా నుండుదైవము నారాధించుటకంటెఁ బ్రత్యక్షముగా నుండుపితరుల నారాధించు టుత్తమము. అనఁగాఁ దనయుల మేలుగోరి సర్వవిధములఁ బాటుపడు తల్లిదండ్రుల నారాధింపక యున్నఁ దక్కినయారాధనములు నిష్ఫలములని భావము. మనుస్మృతియు నీయభిప్రాయమునే సిద్ధాంత మొనరించెను. మాతృపితృశుశ్రూషయే పరమధర్మమని శ్రీరామమూర్తి సిద్ధాంతము. సత్యదానమానయజ్ఞాదులు పరలోకప్రాప్తికిఁ దల్లిదండ్రులసేవ యెట్టిసాయము చేయునో యట్లు సాయపడఁజాలవని భావము. అనఁగాఁ దల్లిదండ్రుల సేవింపనివాఁడు చేయునితర ధర్మములు వ్యాజప్రధానములని తాత్పర్యము. ఇప్పట్టున నొక విషయము తేలెడిని. శ్రీభాగవతమున గోలోకము ప్రస్తావమే లేదనియు శ్రీకృష్ణుఁడు గోలోకవాసి యన్నమాట ప్రమాణము కాదనియు రాధ లేదనియుఁ గొందఱు మధ్వవైష్ణవులు వాదింతురు. గోలోకమున్నయట్లు శ్రీరామమూర్తియే తెల్పెను. గోలోకమున్నదని తెల్పుపురాణములే ప్రమాణములే కావని

కొందఱిమతము. వారు శ్రీరామోక్తి తుచ్ఛమందురో లేక ప్రమాణమందురో యెఱుంగరాదు. మనకు హితముకాని విషయమంతయు నప్రమాణమే యనుట యల్పబుద్ధులస్వభావమని మన మెఱింగిన వారిదుర్వాదముల వినునంతటి దుష్కర్మము తొలంగును. పితరులశాసనము సనాతనధర్మమని శ్రీరామోపదేశసారము.

ఈభాగమునుండి మన మెఱుంగఁదగినచరిత్ర మేది? త్రేతాయుగము కొసభాగమున మానవులు దేవతాంతరముల నారాధించుచుఁ దమవిధియగు మాతాపితృశుశ్రూషల మానిరి. స్వధర్మముల మాని పరధర్మముల నాచరించువారే మెండుగ నుండిరి. తల్లిదండ్రులయాజ్ఞ సాధారణధర్మమనికూడఁ బరిగణింపఁబడకయుండెను. దానంజేసి యుపధర్మములే ప్రధానములై ప్రధానధర్మము లుపధర్మములుగా మార్పునొందెను. మఱియుఁ దల్లిదండ్రులశాసనమునందుఁ బ్రధానమేది? అనువిషయమున భేదాభిప్రాయము లుండెను. ధర్మసూక్ష్మము లివియని నిర్ధారణ మొనర్చువారు లేకయుండిరి. తోఁచినధర్మములెల్లఁ బ్రధానములని పొగడువారు పెక్కండ్రుండిరి. అట్టి యిక్కట్టుకాలమున నీధర్మసందేహములఁ దీర్ప శ్రీరామమూర్తి యవతరించి యీసందేహములఁ దీర్చెను. అందు తల్లిదండ్రులయం దెవ్వరియాజ్ఞ ప్రధానమనువిషయ మింతదనుక శ్రీరామోపదేశమునను సత్ప్రవర్తనమునను దేటపడియెను. అను నీచరిత్రవిషయము మన మూహింపవచ్చును.

"సా హి సృష్టానవద్యాంగీ వనాయ మదిరేక్షణే,
అనుగచ్ఛస్వ మాం భీరు సహధర్మచరీ భవ. ౪౦

సర్వథా సదృశం సీతే మమ స్వస్య కులస్య చ,
వ్యవసాయమతిక్రాంతా కాంతే త్వమతిశోభనం. ౪౧
ఆరభస్వ శుభశ్రోణి వనవాసక్షమాః క్రియాః,
నేదానీం త్వదృతే సీతే స్వర్గోఽపి మమ రోచతే." ౪౨

అని మూలము. శ్రీరాముఁ డిందు స్వాభిప్రాయమును సిద్ధాంతము చేయుచున్నాఁడు. 'అనవద్యాంగీ' అనునది అయోనిజత్వమును 'మదిరేక్షణే' యనునది విరాధాది దానవప్రవృత్తిని 'భీరు' అనునది యనుగమనప్రయోజనమును 'సహధర్మచరీ భవ' అనునది అవినాభావసంబంధమును సూచించుచున్నవి. వనములకు నన్నుఁ గూడి రావలయునన్న ప్రయత్నము నీకు గట్టిగాఁ గలిగినదే. ఇది నీకులమునకు నాకులమునకు సదృశమైనది. ఇది యత్యంత శుభదాయకము. అనఁగా మనయిరువురజన్మములకు సర్థ్వము. ఈప్రయత్నము నీవు చేయక యిందే యుండ నంగీకరించియున్న మనపుట్టుక నిష్ఫలమే యగునని భావము. కావున నీప్రయత్నము జగన్మంగళదాయకమనియే సారము. సీతాప్రోత్సాహమున రామమూర్తియుఁ దృరపడుచున్నాఁడు. వనవాసమునకు ననుకూలములగు కార్యముల నారంభింపుము. ఇత్తఱి నీవు లేకున్న స్వర్గముకూడ నాకు నిష్టపడదు. అనఁగా

"సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ,
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్ర వై ధ్రువం. ౬౦
స్త్రియాం తు రోచమానాయాం సర్వం తద్రోచతే కులం,
తస్యాం త్వరోచమానాయాం సర్వమేవ న రోచతే." ౬౨

మను. ౩ అధ్యా.

అను నీమనుస్మృతిప్రమాణముల ననుసరించి పతి ననుసరించు

భార్యయు, భార్యనానందింపఁజేయుభర్తయుఁ గుదిరిననే సంతోషము, కార్యసాధనము కల్గును. ఇపుడు సీత రాకమాననని పట్టుపట్టెను. రామమూర్తి రానంగీకరించెను. ఇపుడేకదా రామావతార ప్రయోజనము లోకములకుఁ గల్గించునవకాశము కలిగెను. కావున రామచంద్రుఁడానందించి వనవాసమునకుఁ బోవుటకు జేయఁదగు కార్యముల నారంభింపుమని యనుమతి నొసంగెను.

లోకమున నెవ్వారు కాని యొకమహాకార్యమునకుం బూనినయెడల ముందు త్యాగబుద్ధి గలిగియుండవలయును. మనోబలము గలుగుట కయ్యది ప్రధానము. "త్యాగాయ సంభృతార్థానామ్" అని కాళిదాసు తెల్పెను. స్వార్థత్యాగము చేసినఁగాని మనోమాలిన్యములు తొలఁగవు. మనస్సు నిర్మలముగనుండినఁగాని ధర్మము తోడ్పడదు. అది తోడ్పడినఁగాని కార్యసిద్ధి గలుగదు.

"ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః,
తస్మాద్ధర్మో న హంతవ్యో మా నోధర్మో హతోఽవధీత్." ౧౫

మను. ౮ అధ్యా.

అని మనుస్మృతి తెల్పుచున్నది.

"యదా వినియతం చిత్తమాత్మన్యేవావతిష్ఠతే,
నిస్స్పృహస్సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా."

అన్నగీతావాక్యముకూడఁ బైయర్థమునే దృఢపఱచుచున్నది.

"మనఃప్రసాదస్సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః,
భావసంశుద్ధిరిత్యేత త్తపో మానసముచ్యతే. ౧౬
శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్త్రివిధం నరైః,

ఆఫలాకాంక్షిభిర్యుక్తైస్సాత్త్వికం పరిచక్షతే." ౧౭ గీత. ౧౭ అధ్యా. అన్న యీశ్రీకృష్ణవాక్యములు పైనివ్రాసినభావమునే సిద్ధాంతము చేయుచున్నవి. సీతారాములు ధర్మాభివృద్ధికొఱ కవతరించిరి. అధర్మము నడంపవలయును. అనఁగా నధర్మమార్గప్రవర్తకుల రూపడంచినఁగాని ధర్మమార్గము నవలంబించినవారలకు మేలులేదు. కావున నధర్మము వృద్ధియగునట్లు చేయుదానవులను సంహరింపవలయును. ఆకార్యమునిర్వహింపఁబూని దానికొఱకు మనస్సును నిర్మలమగునట్లుచేయఁ బ్రయత్నించిరని భావము. భగవంతునకుఁ గూడఁ బ్రయత్నింపవలసినయవసరము కల్గెనాయని ప్రశ్నింపరాదు. లోకుల కట్టిసీతిని దెల్పుటకే శ్రీరామమూర్తి సీతాదేవికి వనవాసమునకు యోగ్యములగుక్రియల నొనరింపుమని యాజ్ఞాపించెను. కావున మన మీవిషయము నుండి పైవ్రాసినయట్లు మహాకార్యము సాధింపఁబూనునపుడు ముందుగాఁ ద్యాగబుద్ధిని సంపాదించుకొనవలయు. అదియే మానసతప స్సనంబడును. తపోబలములేక యేకార్యమును సాధింపరాదు. ఇన్నింటికిం బ్రధానము మనస్సుగదా. దానిని లోఁబఱచుకొనుటకే యిన్నితపస్సులని సారాంశము. అది కర్మాధీనమై, కొందఱకు సులభసాధ్యమై, కొందఱకుఁ గష్టసాధ్యమై, మఱికొందఱకుఁ దుర్లభమై యుండును. ఆవిషయ మాతని ప్రవృత్తి ననుసరించి యూహింపం దగియుండును. కర్మసిద్ధాంతమే యీభాగము మనకు స్పష్టముగా బోధించెనని యెఱుంగవలయును.

"బ్రాహ్మణేభ్యశ్చ రత్నాని భిక్షుకేభ్యశ్చ భోజనం,
దేహి చాశంసమానేభ్య స్సంత్వరస్వ చ మా చిరం. ౪౩

... ...

దేహి స్వభృత్యవర్గస్య బ్రాహ్మణానామనంతరం." ౪౫

అని మూలము. ఇది దానలక్షణమును పాత్రాపాత్రవివేకమును దెలుపుచున్నది. రత్నములనఁగా నమూల్యవస్తువు లర్థమని కొందఱిమతము. భిక్షుకులనఁగా సంసారమును ద్యజించిన సన్న్యాసులు. వారికి ధన మీయరాదనియు నట్లొసంగిన నది పాపహేతువనియు స్మృతి తెలుపుచున్నది.

"అధ్యాత్మరతిరాసీనో నిరపేక్షో నిరామిషః,
ఆత్మనైవ సహాయేన సుఖార్థీ విచరేదిహ." ౪౯ మను. ౬ అధ్యా.

అన్న యుత్తమధర్మము మనుస్మృతి తెలుపుచున్నది. కావున యతులకు ధనమీయక యన్నముమాత్రమే పెట్టవలయునని యేర్పడుచున్నది. 'బ్రాహ్మణానామనంతరమ్' తొలుత బ్రాహ్మణులకు నొసంగి పిదప సేవకులకు మన మనుభవించు నమూల్యవస్తువులగు శయ్యాభూషణాదుల నొసంగుమని శ్రీరామమూర్తి భార్యకుం జెప్పెను. మతధర్మములఁ బాటింపవలయునని మన కీభాగము తెల్పుచున్నది. శ్రీరామచంద్రుని కాలమున నందఱు బ్రాహ్మణులు వేదాభ్యాసముచేయుచుఁ దదుక్తక్రియల నిర్వర్తించువారగాన నట్టిసమ్మానమునకుఁ బాత్రులైరని తేలెడిని.

మహానుభావులారా! ఈసీతారామసంభాషణము మనకు వారియవతారతత్త్వమును దెలుపుచున్నది. వారు ప్రకృతిపురుషులనియుఁ,ద్రిమూర్తులలో నొక్కరగు విష్ణుమూర్తియుఁ దత్పత్నియగు లక్ష్మియుఁ గారనియు, ధర్మరక్షణమునకుగా నవతరించిరనియు మన కీసంభాషణము తేటపఱచుచున్నది. ఇంకఁ గథాభాగమే ప్రధానముగా నుండును. ఈభాగమునుండి తత్త్వము నిశ్చయించుకొని తరువాతఁ గథను బఠించిన రామా

యణము సర్వము చక్కఁగా బోధపడును. కేవల కథాసారము నెఱింగినంతనే విశేషలాభము లేదు. మహర్షి వాల్మీకి యం దందుఁ దెలిపినధర్మములను మన మెఱుంగవలయును. సదాచారములను నీతులను రాజధర్మముల నెఱుంగవలయును. ఈవిషయములను దెలిసికొని తదుక్తప్రకార మారాధించి భగవంతుని దయకుఁ బాత్రులము కావలయును. అధ్యాత్మ రామాయణము నుండి యీభాగమున వ్రాయఁగలవిశేషములు లేవు. ఇఁకఁ దరువాతికథను బఠింతము.

రామలక్ష్మణసంవాదము.

* లక్ష్మణుఁడు కౌసల్యయంతఃపురమునుండి మునుపే వచ్చియున్నవాఁడు. కనుక నాసంభాషణము నాలకించి రాముఁడు సీతాదేవిని దోడ్కొనిపోవుటకే యింతకష్టముపైన సమ్మతించెనుగదా. ఇఁక నావిషయమై యంగీకరించునా, నాగతి యెట్లు? అని విచారించి వగపెల్లునఁ దొరఁగుకన్నీటిధారలు దృష్టిని నిరోధింపఁగాఁ బట్టరానిదుఃఖమున మహాయశస్కుఁడుగాన శ్రీరామపాదములను గట్టిగాఁబట్టుకొని సీత నుద్దేశించియు మహావ్రతుఁడు రాఘవు నుద్దేశించియు నిట్లు పలికెను. రామభద్రా! వనముల కరుగ నిచ్ఛగింతువేని మృగములు వనగజములు నిండియుండుటంజేసి నేను జాపమును ధరించి నీకు ముందుగాఁ బోవుదును. అందులకై నిన్ననుసరించి వచ్చెదను. నీవు నన్నుంగూడి మృగపక్షులనినాదములు చెలరేఁగువనములఁ దిరుగవచ్చును. నీవు చెంతలేకున్న స్వర్గముగాని దేవత్వముగాని నేనొల్లను. త్రిలోకములఁ గల యైశ్వర్యముకూడ

* ఈభాగము ముప్పదియొకఁడవసర్గమునఁ గలదు.

నాకు వలదు. వనగమనమునఁగల నిశ్చయమున లక్ష్మణుఁ డిట్లు పలుకఁగా విని రామమూర్తి మెల్లగ వత్సా! నీ విందుండుము. వనములకు రావలదనెను. లక్ష్మణుండు మరల నిట్లు పలికెను.

అన్నా! నాయనుగమనమునకు మున్నే నీ వనుమతించితివి. ఇపుడు నన్ను రావలదనుచున్నావే; ఏల? నిర్దోషుఁడవగు నో శ్రీరామా! నిన్నుంగూడి నేను రాఁ గోరుచుండఁగా వలదనఁ గారణమేమి? దానిం దెలిసికొనఁ గోరుచున్నాఁడను. నే నేయపరాధము నిపుడు చేసితినో యనుసందియము మదిఁ గలదు. దానిందీర్పుము. అని ప్రశ్నింపఁగా మహాతేజుఁడగు రామచంద్రుఁడు ముకుళితహస్తుఁడై యుండి తనకంటె ముందుగా నడవికింబోవ నిశ్చయించుకొనియున్న వీరుని దమ్ముని బిలుచుకొని పొమ్మని వేఁడుచున్న భక్తునిం గని యిట్లు పలికెను. సౌమిత్రీ! నీకు నాయందుఁ బ్రీతి మెండుగఁ గలదు. ధర్మాసక్తుఁడవని వీరుఁడవని సన్మార్గవర్తనుఁడవని బ్రియుఁడవని ప్రాణతుల్యుఁడవని వశ్యుఁడవని సఖుఁడవని సోదరుఁడవని నేనెఱుంగుదు. ఇట్టి నీవు నాతోడవత్తువేని యన్నివిధములఁ దోడ్పడంజాలుదువు. నీరాక నాకు నెంతో సౌఖ్యము.

వత్సా! నీవు నాతోడ వత్తువేని కౌసల్యాసుమిత్రల నిందరయువా రెవ్వరు? ఆకార్యముకొఱకే రావలదంటిని. అప్పుడు నీరాకకు సమ్మతించుట యాకాలమున కనుకూలముగా నిన్నాజ్ఞ డించుటకేకాని వేఱు గాదు. తండ్రియే వారిని బోషించును. నేనేల? అందువేమో పర్జన్యుఁడు భూమిపై వర్షించునట్లు తనవారివాంఛలన్నియు ఫలింపఁజేయురాజు కైకకు లోఁబడి కామవశుఁడై తపించుచున్నాఁడుకదా. ఆతఁ డెట్లు వారిని

భరింపఁజాలును? అశ్వపతితనయ యగుకైక యీరాజ్యమెల్లఁ జేకొన్న మీఁద వగలఁ బొగులుసవతుల కేమాత్రమైన మేలు చేయఁగలదా? భరతుఁ డుండుఁగదా. తల్లుల కేమి లోపముం డును? అనెదవేమో. అతఁడుకూడ రాజ్యప్రాప్త్యనంతరము తల్లిమాటలకే లోఁబడి వర్తింపఁగలవాఁడు. కాన వగలఁగుం దు మనతల్లులఁ దలంచునా? నావలన నేమి లాభము తల్లుల కుం గలుగును? అని ప్రశ్నింతువేమో! నీవిందే యుండి రాజా నుగ్రహము నార్జించి పూజ్యురాండ్రగు తల్లులఁ బోషింప వచ్చును. వీనికి బదులు పలుకకుము. నే నేమని చెప్పితినో యట్లే చేయుము.

వత్సా! నన్నే సేవింపఁగోరుదువని యెఱుంగుదుఁజుమీ. ధర్మవేత్తవు. నా చెప్పినరీతి నొనరింతువేని నాయందు నీకున్న భక్తి మిక్కిలి స్పష్టమగును. మాతృసేవ ధర్మములయం దుత్త మము. అదియుఁ గల్గును. ఇట్టికార్యమున రఘువంశజనితులం దఱు నానందింతురు. కాన నాకొఱకు నీవిందుండుము. మనము లేకయున్నఁ దల్లులకు మనస్సుఖ మెంతమాత్రము కలుగదు సుమా. వాగ్విశారదుఁ డగురామమూర్తి పలుకఁగా వాక్య విశారదుఁ డగుసౌమిత్రి హితముగా నన్నపలికినది విని యిట్లు బదులు పల్కెను శ్రీరామా! వీరుఁడవు. నీప్రతాపమునకు భయంపడి భరతుఁడు కౌసల్యాసుమిత్రలను జక్కఁగాఁ బోషింపఁగలఁడు. నిస్సంశయము. కౌసల్యను సేవించి జీవించు వారే తదనుగ్రహమున ననేకగ్రామములను సంపాదించి యున్నారు. అట్టి తల్లి నావంటివారి నెందఱినేఁ బోషింపఁజాలును. కాన మహాకీర్తిమంతురాలగు కౌసల్య నన్ను, సుమిత్రను,

మఱియు నన్యాదృశుల నెంచఱనో బోషింప సమర్థురాలే యగును. అనుచరునిగా నన్నుఁ గావింపుము. దాన ధర్మహాని లేదు. నేను కృతార్థుఁడనగుదును. వనములఫలములు మొదలగువానిం దెచ్చియిచ్చుటంజేసి నీకుఁ బ్రయోజనము కలదు. శరశరాసనములు పట్టుకొని గడ్డపాఱ గంపను దీసికొని ముందుగాఁ ద్రోవ చూపుచుఁ బోవుదును. ప్రతిదినము ఫలమూలాది మున్యాహారములను దెచ్చి యిచ్చుచుందును. ఈసేవ చేయుభాగ్యము నాకుఁ బ్రసాదింపుము. రామా! సీతంగూడి నీవు శైలసానువుల యందు విహరింపవచ్చును. నీవు మేలుకొనియుండుతఱి నిద్రించుసమయమునను గాపుగా నెల్లకార్యములను జేయుచుందును.

అని లక్ష్మణుఁడు పలుకఁగా రాముఁడానందించి సౌమిత్రీ! అది నీపూనిక యేని నీవిపుడేపోయి నీమిత్రులకుం దెల్పి యనుమతింగొని రమ్ము. జనకచక్రవర్తియాగమునందు వరుణదేవుఁడు భయంకరములగు దివ్యచాపములు రెండు, నభేద్యకవచములు రెండు, నక్షయబాణతూణీరములు, బంగరురంగుపూసి సూర్యదీప్తిగలిగి వెలయు రెండుఖడ్గములు తానై మనకు నొసంగెను గదా. వీని నేను బూజించి యాచార్యుఁడగు వసిష్ఠమునియింట నుంచితిని. నీవు వానిం గైకొని త్వరగా రమ్ము లక్ష్మణుం డాపలుకుల నాలించి వెడలి మిత్రులయనుమతి నొంది కులగురువు నింటికిం బోయి యాయాయుధములను గైకొని వచ్చెను. పూజింపఁబడుచున్న యాయాయుధముల రామభద్రునకు గనఁబఱచెను. ధీరుఁడు రాముఁడు వానిందీసికొనివచ్చిన తమ్మునిం జూచి సంతసమున సౌమ్యా! నీరాకకై వేచియుంటిని. సకాల

మునకే వచ్చితివి. పరంతపా! నిన్నుఁగూడి సాధనమంతయుఁ దపస్వులకు బ్రాహ్మణులకు నీఁగోరెదను. విప్రప్రవరులు నన్నా శ్రయించియున్నారు. అట్టివారలకు సాధనము వలసిన ట్లియ్యఁ గోరెద. నీవరిగి బ్రాహ్మణవర్యులను మునిపతి యగువసిష్ఠుని సుతుని సుయజ్ఞునిమాత్రము పిలుచుకొనిరమ్ము. సుయజ్ఞుని విప్రవరులను బూజించి యరణ్యమునకుంబోయెద నని యు_్రర్వ్ చేసెను.

మహాత్ములారా! ఈభాగమునఁ గొలఁదివిషయము లే విమర్శనార్హములు గలవు. వాని నాలకింపుఁడు.

"స భ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః,
సీతాముచాచాతియశా రాఘవం చ మహావ్రతం."

అని మూలము. ఇందుఁ బ్రాతీతికార్థము స్పష్టము. విశేషార్థ మేమనఁగా నాలకింపుఁడు.

"అతియశాః రఘునందనః సః భ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య సీతాం మహావ్రతం రాఘవం చ ఉవాచ."

అని యన్వయక్రమము. మహాయశాః, గొప్పయశస్సుగల సౌమిత్రి యని యర్థము. సీతారాములు ప్రయాణము సాగింప నున్నారని యతఁ డెఱుఁగును. సీతను రాఘవునిగుఱించి యిట్లు పలికెనని భావము. సీత యనుపదప్రయోగమును బరికించి శరణాగతి యిందు బ్రతిపాదితమని వ్రాసిరి. ఇరువురిదయను సంపాదింపఁగోరియే సౌమిత్రి పలికెను. సీత వలదన్నను రాముఁడు వలదన్నను దనప్రయాణము నిలిచిపోవునని తెలిసికొని లక్ష్మ ణుఁడు వారిరువురనుగుఱించి యిట్లు ప్రార్థించెననుట సమంజస మగునర్థము. సీతాశబ్దము తొలుత నున్నందునఁ గాఁబోలు

నేవేవో భావములు కనఁబఱచుచు వ్రాసిరి. ఇట్టివారు ప్రకృత్యు పాసనము పనికిరాదందురు. ఏటికో? శాక్తమనఁగా నట్టివారలకే తలనొప్పి. భగవత్కారుణాఫలము లక్ష్మీమూలకముగా లభించు నన్నవారే శాక్తమనఁగా భయంపడుదురు. లక్ష్మణుఁ డడిగినట్లే సీతయు రాము నడిగెను. అది శరణాగతి కాదు కాఁబోలు. ఔరా! వ్యర్థమతాభిమానము!!

కొందఱు మధ్యవైష్ణవులు కుటుంభరులై ధనము నార్జింపఁగోరి, శరణాగతి ప్రధానమనియుఁ, గర్మముల నాచరించుట సంసారహేతువనియు నుపదేశించుచు, నేదోమంత్రము నుపదేశించుచు, నూర్ధ్వపుండ్రధారణము చేయనిచో భగవదనుగ్రహము లభింపదనియుఁ, గలధనమెల్ల నాచార్యాధీనమొనరించి కైంకర్యము చేయుచుండవలయుననియు శిష్యుల కుపదేశింతురు. దీనిఫలము శిష్యులు కర్మభ్రష్టులగుటయు, నాచార్యునకు ధనము చేకూరుటయు నగు. బాహ్యచిహ్నములు ప్రధానములు కావనియు, నయ్యవి కేవలమూఢులకుఁ దొలుత నించుక భక్తిని గల్పింపఁ దోడ్పడుననియుఁ, దరువాత నవి నిరర్థకములే యనియు శాస్త్రము లుద్ఘోషించును. ఊర్ధ్వపుండ్రత్రిపుండ్రాదులు ధరింపనివారిని భగవంతుఁడు ప్రేమింపఁడనువాదము తుచ్ఛతమము. భగవంతుఁడు నిర్మలమగుమనస్సును బరీక్షించి ప్రేమించును. బాహ్యచిహ్నములను జూడఁడు. అయ్యవియే ప్రధానములనువారు పామరులలో శిరోమణు లనవచ్చును. వారిమోసపుమాటలకు లొంగి ధనము పోఁగొట్టుకొనరాదు. వారిం గూర్చియే

"అనేకగురవస్సంతి శిష్యవిత్తాపహారకాః."

అని పెద్దలు వచించిరి. ఊర్ధ్వపుండ్రములేక భగవన్మంత్రము జపింపరాదనుట హేయము. పెద్ద లూర్ధ్వపుండ్ర త్రిపుండ్ర ధారణము మత మిదియని తేటపడఁ గల్పించిరి. పామరు లివ్వానివలనఁ దృప్తినొందుదురు. భక్తిబీజము నది తొలుతఁ బుట్టింపఁ దోడ్పడు ననవచ్చునేమో. అదియే ప్రధానమని దాననే పరమేశ్వరుఁడు తృప్తిపడునని వచించువారు జగద్వంచకులను బిరుదమున కెంతయుఁ బాత్రులు.

ప్రకృతవిషయ మేమనఁగా సీతారాము లరణ్యమునకుఁ బోవ నిశ్చయించిరని లక్ష్మణుఁ డెఱింగినవాఁడు కావున, వారిరు వురను దల్లిదండ్రులనుగా భావించువాఁడు కావున, నం దెవ్వరిష్ట పడకపోవుదురో తనవనగమన మాగిపోవునో యనుసంశయము కలుగ, సీతారాములను బ్రార్థించె ననునదియే యిటఁగల సారము. ఉపాసకుఁడు సగుణము నుపాసింప నర్హుఁడు కావునఁ, బ్రకృత్యతీతమగు మహాతత్త్వముమనోదుర్గమమగుటఁ,దొలుత వ్యక్తి నిచ్ఛానుసారము కల్పించుకొని మనోవీథి నెలకొల్పి దానిం దిలకించుచు ధ్యానించును. అయ్యది సిద్ధింప నవ్వలఁ గేవలతేజోరూపముగా నాపరతత్త్వమును భావింపవలయును. ప్రకృతియు నం దిమిడియే యుండును ఇదియే యీభాగమున మనము తెలిసికొనఁదగు విషయసారము.

"న దేవలోకాక్రమణం నామరత్వమహం వృణే,
ఐశ్వర్యం వాపి లోకానాం కామయే న త్వయా వినా." ౫

అని మూలము. దీనినుండి మన మేమి గ్రహింపవలయును? భక్తుఁ డుపాస్యదేవతను ధ్యానించునపుడు తత్కరుణతప్ప మఱేకోరికను స్మరింపరాదు. స్వర్గాదిసుఖములు బంధహేతు

వులు. దేవత్వముకూడ నట్టిదే. కావున నిష్టదేవతానుగ్రహము మాత్రమే కోరవలయును. అదిమాత్రము వాంఛకాదా యని ప్రశ్నింపరాదు. "అభావధర్మానాద్వైతం నిఘ్నంతి" అన్నపరిభాష యందతెలుంగుదురుకదా. అట్లే భగవత్కారుణయు నని యెఱుంగవలయును.

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన,
మా కర్మఫలహేతుర్భూర్మా తే సంగోఽస్త్వకర్మణి. ౪౭
యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ,
సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే. ౪౮
దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ,
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః. ౪౯
బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే,
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలం. ౫౦
కర్మజం బుద్ధియుక్తాహి ఫలం త్యక్త్వా మనీషిణః,
జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛంత్యనామయం." ౫౧ గీత. ౨ అధ్యా.

అనుభగవద్గీతా వాక్యములు పైనివ్రాసినవిషయము సిద్ధాంతీకరించుచున్నవి.

"కురుష్వ మామనుచరం వైధర్మ్యం నేహ విద్యతే,
కృతార్థోఽహం భవిష్యామి తవ చార్థః ప్రకల్ప్యతే." ౨౨

అని మూలము. దీనికెంతయోరీతుల నర్థములు చెప్పఁబడినవి. శాఖాచంక్రమణన్యాయమున కవి తగినయుదాహరణము లనవచ్చును. కాని యవి వ్యర్థములనరాదు. అహంకారము తొలఁగింప నవి సాధనములే యగును. విశేషమేమని మన మూహింతము. "మా మనుచరం కురుష్వ" నిన్ను ననుసరించి వనముల

సంచరించువానిగా నంగీకరింపుము. "ఇహ వైధర్మ్యం న విద్యతే" ఇందు ధర్మహాని యేవియుఁ గనంబడదు. రాదని యర్థము. "అహం కృతార్థో భవిష్యామి' 'నేఁ గృతకృత్యుఁడ నగుదును "తవచ అర్థః ప్రకల్ప్యతే" నీకును గార్యము సిద్ధించును. అను నీయర్థము దేనిని బోధించు నన్న ప్రశ్నమునకు సదుత్తర మేది యనఁగా శ్రీరామచంద్రా! నాపుట్టుకకుఫలము నిన్ననుసరించితిరుగుటయే. దాన నీవొనరింపఁదగు కార్యమునకు హానిలేదు. నాయొనరింపఁ దగుపనినొనరించి నానిజఫలము జేకూర్తును. నావలని కార్యములు నీకు సిద్ధించును. అనఁగా నిన్ననుసరించి తిరిగినఁగాని రావణవధ సాధనమగు సీతాపహరణ కార్యము కాదు. దాన ధర్మహానిలేదు. అనఁగా సీతాపహరణమున నధర్మవృద్ధి కానేరదు. దానికి నాశమే యగును. ధర్మము రక్షింపఁబడుననుట. నేను జేయఁదగు నతి కాయేంద్రజిద్దానవవిధ్వంసన మొనరింతును. దాన నీకార్యము సిద్ధించును. అనువిశేషార్థ మిందుఁ గానఁబడును.

"స్వే స్వే కర్మణ్యభిరతస్సంసిద్ధిం లభతే నరః,
స్వకర్మనిరతస్సిద్ధిం యథా. విందతి తచ్ఛృణు." ४५ అధ్యా. ౧౮.

అన్నగీతాభిప్రాయము ననుసరించి నేనొనరింపఁదగుకర్మమును జేసినఁగాని కృతార్థుఁడను గానేరను. దాన నీకు లాభమేమ నఁగా నెవరెవరిచే నీయేకార్యములు చేయింపవలెనో యట్లు చేయించి సర్వసాక్షిగా నుండుట యనునదియే. ఇందు నాశ్ర యాశ్రయిభావము చెప్పఁబడినదని కొందఱమతము. కపికిశో రన్యాయము ననుసరించి భక్తుఁడగులక్ష్మణుఁడు శ్రీపరమేశ్వరు ననుసరింపఁగోరుచున్నాఁడు. భగవంతుఁ డాతనిశ్రద్ధను బరీక్షిం పఁగోరి వనములకు రావలదనియె. అంతియగాని యతనిరాక

వలనఁ గలుగఁగల లాభములు తెలియక కాదు. ఇందు సగుణో పాసనము చెప్పఁబడినది. ప్రకృతిపూరుషుల నిరువురను లక్ష్మణుఁ డాశ్రయించుచున్నాఁడు. ఫలాభిసంధిరహిత సత్కర్మరూప సమాశ్రయ మిందు క్తమయ్యెను. సేవాభాగ్యము ననుగ్రహింపు మని భగవంతుని కోరుటయే యిందు లక్ష్మణునియాశయము. వేఱొండు కాదు. మహర్షి వాల్మీకి లక్ష్మణుముఖమునుండి భవిష్య త్సీతాపహరణాదికమును సూచించెను. శిష్యుఁడు సద్గురువు నాశ్రయించి పట్టుదల వదలక వెంటనుండి తెలిసికొనఁదగు విష యమును దెలిసికొనవలయు ననునీతి మన కీభాగము తెలుపు చున్నది. శిష్యుఁడు కృతార్థుఁడగుటయే గురువునకుఁ గోరఁదగు లాభము. అంతియగాని శిష్యసర్వస్వము లాగుట కాదనియు మన మెఱుంగందగు. ఇఁకఁ దర్వాతికథను బఠింతము.

శ్రీరాముఁడు పయనము చేయఁబూని దానములిచ్చుట.

*అంత సౌమిత్రి శుభము లొనఁగూర్పఁగల రామాజ్ఞను గైకొని వేగమే సుయజ్ఞునింటికింబోయి యగ్నిహోత్రమందిర మున నున్న యమ్మునిం గాంచి భక్తిమీఱ నమస్కరించి మిత్రమా! రామమూర్తి వనముల కరుగుచున్నాఁడు. నీవు వచ్చి దుష్కర రాము కార్యమును జూడుమనియె. అమ్ముని వేగమే కృత్యముం దీర్చి సౌమిత్రింగూడిపోయి శ్రీరాముని రమ్యహర్మ్యముం బ్రవే శించెను. హుతాగ్నివలె బ్రహ్మతేజోనిధియగు నమ్మునికి నంజలిం బట్టి జానకింగూడి శ్రీరాముఁడు వలగొనియెను. అమ్మునికిఁ దన యంగదాద్యమూల్యాభరణముల నొసంగెను. అంత సీతా ప్రోత్సాహమున రాముఁడు మఱినిం గాంచి సౌమ్యా! మిత్రమా!

* ఇది ముప్పది రెండవసర్గమునుండి గైకొనఁబడినది.

జానకి నీకళత్రమునకు హారము సువర్ణకంఠహారము నీయఁదలఁచు
చున్నది. వానిం గొనిపోయి యాయమ్మకిమ్ము. వనగమనకుతూహ
లమున జానకి నీకళత్రముకొఱకు నీచేతికిఁ దనరత్నాంగదా
ద్యాభరణములు వస్త్రములు నిచ్చుచున్నది. కైకొనుము.
నామేనమామ యొసంగిన శత్రుంజయనామకగజము గలదు.
దానిని మఱి వేయిగజములతో నీకొసంగుదు. పరిగ్రహింపుము.

అమ్మునియు శ్రీరామదత్తాభరణములఁ గైకొని సీతా
రామలక్ష్మణుల నాశీర్వదించెను. ప్రియవాది శ్రీరాముఁడు సుస
మాహితుఁడగు తమ్ముని గని వత్సా! వేగమే చని యగస్త్య
విశ్వామిత్రకుమారుల నిరువురను దోడుకొనిరమ్ము. వారి నర్హ
విధిం బూజింపుము. మేటివస్తువు లొసంగుము. మఱియు
గోహిరణ్యాదికమున వారలఁ దృప్తులను గావింపుము. తైత్తి
రీయశాఖాధ్యయనపరులకు నాచార్యుఁడగు నొక్కవిప్రుఁడు
నాతల్లి నెప్పుడు నాశీర్వదించుచుఁ గొలిచియుండును. ఆయనకుఁ
దృప్తికలుగ నావాహనాదికము నొసంగుము. సారథిచిత్ర
రథుఁడు పితృసఖుఁడు. చిరకాల మిందే కడపినవాఁడు. వాని
కమూల్యరత్నవస్త్రములను మేఁకలు లోనగుసత్పశువుల నిచ్చి
సమ్మానింపుము. గోసహస్రముగూడ నిమ్ము. కఠశాఖను,
శాలాపశాఖను జదువువారు పెక్కండ్రు గలరు. పలాశదండధా
రులు బ్రహ్మచారులు విరివిగా నున్నారు. అధ్యయనముతప్ప
మఱొక్క కార్యము చేయువారు కారు. మఱికొందఱు కార్య
లంపటులుగాక మేటియాహారమును గోరుదురు. మాన్యులుకూడ
వారిని గారవింతురు. వారి కెనుబదిశకటములనిండ ధాన్యము
రత్నాదివస్తువులు పోసియిమ్ము. భోజనప్రియులుగాన వారికి

ధేనుసహస్రము నొసంగుము. పెక్కండ్రు బ్రహ్మచారులు కౌసల్య నాశ్రయించియున్నవారు. ఒక్కొక్కనికి గోసహస్రముచొప్పున నొసంగుము. తల్లి కానందము గలుగఁ దదాశ్రితులకెల్లఁ దృప్తిగాఁ బదార్థముల నిమ్ము.

అని శ్రీరాముఁ డాజ్ఞాపింపఁగా సౌమిత్రి యట్లే వారల కమూల్యవస్తువుల నిచ్చెను. రామమూర్తి కన్నీరు వదలుచు నిలుచున్న యాశ్రితులం గని వారలకెల్లఁ గొఱంతకలుగకయుండ ధనమిచ్చి నావచ్చువఱకు నాగృహము సౌమిత్రియిల్లు శూన్యములుగ నుండఁజేయక సర్వదా కాపాడుచుండవలయు. అని వగచువారల నూరార్చి కోశాధీశునిం గని ధనముఁ దెమ్మని శాసించెను. సేవకులు ధనమంతయుఁ దెచ్చిరి. ఆధనరాశి చూపఱులకు వింతగొలుపుచుండెను. లక్ష్మణుఁడు సాయ పడఁగా నాధనమంతయు బీదలకిచ్చె. అత్తఱి మిగుల దారిద్ర్యమున గోరోచనము రంగుగలిగిన త్రిజటుఁ డను బ్రాహ్మణుఁడు గార్గ్యవంశజుఁ డుండెను. వన్యవస్తువులను దెచ్చుకొని జీవించువాఁడు. పడినవెన్నుల నేఱికొని బ్రదుకువాఁడు. ఆతనిభార్య నూత్నయౌవన. బీదతనమునఁ గష్టపడుచుఁ బిన్నవారుగా నున్నకొడుకులంగూడి ముదుసలియగుభర్తకడ కరిగి, గడ్డపాఱ లోనగువాని విసరివైచి నాచెప్పునట్లు చేయుము. ధర్మజ్ఞుండగు శ్రీరాముని దర్శింపుము. నీకేదేని లభించును అనెను. భార్యమాట నాలకించి శతరంధ్రములుగా నున్నగుడ్డను గప్పుకొని రామునింటికిం బోయెను. జనులగుంపులో నాత్రిజటుఁడు అంగిరసుఁడువోలె బ్రహ్మతేజమున వెలుంగుచు రామునంతఃపురముఁ బ్రవేశింపఁగా నైదవకక్ష్యవఱకు నెవ్వరు నాతని

నివారింపకుండిరి. ఆత్రిజటుఁడు శ్రీరామునిం గని రాజకుమారా! నీవు విశాలకీర్తిగలవాఁడవు. నేను ధనహీనుఁడను. పెక్కండ్రుతనయులు గలవాఁడ. వనవృత్తి జీవించుచున్నాఁడను. నన్నుఁ గరుణింపుమని వేఁడెను. శ్రీరామమూర్తి నవ్వుచు విలాసముమీఱ నమ్మునితో నార్యా! పెక్కువేలగోవులున్నవి. అందు సహస్రముమాత్రమే చాలునన్న నీయను. అన్నియు వలసిన నిత్తును. ఒక్కమాట వినుము. నీవు చేతిబలము కొలఁది కఱ్ఱను విసరివైవుము. అది యెంతదవ్వునఁ బడునో యంతదనుక నిలువఁగల యన్నిగోవుల నొసంగుదు. అనఁగా నాతఁడు మహోత్సాహమున వేగముగ పైనున్నవలువను నడుమునకు బిగించి కఱ్ఱను వలయాకారముగాఁ ద్రిప్పి త్రిప్పి విసరివైచెను. అయ్యది సరయూనది యవ్వలితటమునఁ గల గోవులను మీఱి వృషభేంద్రముచెంతఁ బడియెను. ధర్మాత్ముఁడు రామచంద్రుఁ డమ్మునిఁ గౌఁగిటంజేర్చుకొని యంతదనుకఁ గల గోవుల నాతని యాశ్రమమునకుఁ దోలికొనిపొండని గోపాలకు నాజ్ఞయిచ్చెను. మరల నామునితో నాగ్రహింపకుము. విలాసార్థ మట్లులంటిని. నీతేజము విశేషించియుంటం జేసి పరీక్షింపఁ గోరి యట్లులంటిని. ఇంక నీకేమి కావలయునో తెల్పుము. తప్పక యిచ్చెదను ఈపలుకు నవ్వులకుగా నన్నయట్లు భావింపకుము. నాద్రవ్యమంతయు బ్రాహ్మణులనిమిత్తమే కూర్పఁబడినది. మీవంటిమహాత్ముల కది యుపయోగింపఁబడిననే యది సఫలమని నాభావము. నాకు దాననే తృప్తికలుగును. అనఁగా నమ్మునియు భార్యతోడ నాగోవులే చాలునని సంతోషించి శ్రీరామునిం బొగడుచు నాశీర్వదించుచుం బోయిరి. శ్రీరాముఁడు పరాక్ర

మార్జితధనము నంతయు సుహృజ్జనులకు నిమ్మని పలుక సౌమిత్రి యట్లే యాచరించెను. ఒక్కఁడైన నాసమానము నొందని వాఁడు లేఁడయ్యెను. త్వరపడి యిందఱికి దానము చేసిన నయ్యది యథాక్రమముగనే సాగెను.

ఆర్యులారా! ఈభాగమున విమర్శించి తెలిసికొనఁదగిన విషయములు ప్రాయికముగా లేవు. ఒక్కటి రెండువిషయములు గలవు. పరికింపుఁడు.

"తత్రాసీత్పింగళో గార్గ్యస్త్రిజటో నామ వై ద్విజః. ౨౯
ఉంఛవృత్తిర్వనే నిత్యం ఫాలకుద్దాలలాంగలీ,
తం వృద్ధం తరుణీ భార్యా బాలానాదాయ దారకాన్. ౩౦
... ...
అపాస్య ఫాలం కుద్దాలం కురుష్వ వచనం మమ. ౩౧
రామం దర్శయ ధర్మజ్ఞం యది కించిదవాప్స్యసి."

అని మూలము. శ్రీరామచంద్రుని కాలమున నెల్లరు సంతుష్టులై యున్నవారనఁగా నింతదరిద్రుఁ డొకఁ డుండవచ్చునా యని కొందఱు ప్రశ్నింతురు. సమాధాన మాప్రశ్నమున కిట్టిది. కరుణాసముద్రుఁడే యైనను భగవంతుఁడు కోరనివారలకు భాగ్య మొసంగఁడు. అడవులలోఁ గాలముపుచ్చుచుఁ దపస్సు చేయువారు ప్రాయికముగా ధనము నాశించువారు కారు. వారలం బిలిచిపిలిచి భగవంతుఁడు ధన మొసంగక వారివైరాగ్యమునకే యానందించుచుండును. త్రిజటుఁడు నట్టివాఁడే. వృద్ధువు. భార్య నిండుజవ్వనముగలది. పెక్కండ్రుకొడుకులు గలది.

"త్రింశద్వర్షో ఉద్వహేత్కన్యాం హృద్యాం ద్వాదశవార్షికీం,
త్ర్యష్టవర్షోష్టవర్షాం వా ధర్మే సీదతి సత్వరః." ౯౪. మను. ౯ అధ్యా.

అన్న మనుస్మృతి ననుసరించి ముప్పదియేండ్లవాఁడు పండ్రెం డేండ్లయీడుగలకన్యకను బెండ్లియాడవలయును. లేక యిరువదినాల్గువత్సరముల వరుఁ డెనిమిదేండ్లకన్యకను బెండిలికావలయును. అనఁగాఁ గన్యకవయస్సునకంటె రెండింతలుగాని యించుకతక్కువగాఁగాని యుండవలయుననిస్పష్టము. అనఁగాఁ బురుషునకు వయోధర్మము చాలకాల ముండుననియు, స్త్రీలకు నవి సత్వరము తగ్గుననియు భావము. సంతానమే యందులకుఁ గారణమగు. కావున నీధర్మము చెప్పఁబడినది. అంతియగాక నియమమున గార్హస్థ్యము సాగించుట పూర్వులయలవాటు. కనుకనే వారు శతవత్సరములపై నిరువదివఱకు జీవించుచుండిరి. ఆర్తవాదులు కారణములుకాఁగా స్త్రీలకు వయస్సువేవేగ ..ఱించుటంజేసి వారు పురుషులవలె దృఢగాత్రలు కాకుందురనుట యుక్తియుక్తమే. చిరకాలము జీవించుటకుఁ బ్రధాన కారణము మనస్తృప్తియే. అది యాశ మానిననే కలుగును. ఆశాపాశబద్ధులుకాక యదృచ్ఛాలాభసంతృప్తులై బ్రహ్మచర్య నియమమును బాటించుచు నుండువా రకాలమృత్యువువాతఁ బడరనుట సత్యము. ఈకాలమున నాధర్మములు చెల్లకున్నవి. కావుననే నూఱువత్సరములవఱకును జీవించువా రరుదుగ నున్నారు. కనుక వివాహపద్ధతులలో వయఃపరిమితి మాఱవలసి వచ్చెను. సముదాయాయుస్సు ఇఱువదేండ్లని యూహింపవలసి యున్నది. అదియు సత్యముకాదని తోఁచుచున్నది. కావునఁ బూర్వధర్మముల నిప్పటివారు పరిహసింపరాదు.

త్రిజటుఁడు వన్యవస్తువులతోఁ గాలముపుచ్చువాఁడు. కావుననే ధనముకొఱకు నోరుల యాచింపక యుండెను.

బహుపుత్రవంతుఁడు కాఁగా భార్య పురికొలుపవలసివచ్చెను. అంతమాత్రమున నామెయం దొక్కదోషము నారోపింప రాదు. బాలురనుబోషించుభార మామెయందే పడునుగదా. కనుక నామె పురికొలిపెను. కుచేలుఁడు జ్ఞానియైనను భార్య పురికొలుప శ్రీకృష్ణునికడకుం బోయెనుగదా. అట్లే త్రిజటుఁడు రామచంద్రుని జూడఁబోయెను. కాని యాతనిసంభాషణము భావగాంభీర్యమును దెలుపుచున్నది.

"నిర్ధనో బహుపుత్రోఽస్మి రాజపుత్ర మహాయశః,
ఉంఛవృత్తిర్వనే నిత్యం ప్రత్యవేక్షస్వ మామితి." 35

అని. ధనహీనుఁడను. పెక్కండ్రు కొడుకులు గలవాఁడను. నీవు రాజపుత్త్రుఁడవు. గొప్పయశస్సుకలవాఁడవు. ఇంతదనుకఁ దాను భార్యప్రోత్సహింప వచ్చినవాఁడనని తెటపఱచెను. అయాచకుఁడను. వనమున సర్వదా వసించువాఁడను. నన్నుఁ గరుణింపుము. అను నీభాగమున నన్ను ముక్తుని జేయుమా యను భావమును దెలిపెను. దీనిచే నైహికాముష్మికములను గోరెనని తేటపడియెడిని. ధనమిమ్మని యడుగక "ప్రత్యవేక్షస్వ" అనుట యేల? ముక్తిగోరె నన్న యర్థము సుసంగతమా యని కొందఱడుగుదురేమో. "రాజపుత్రమహాయశః" అనున దొక్క పదమే కావచ్చును. రాజపుత్త్రుఁ డనుయశస్సుగల యోపరమేశ్వరా యని యర్థమగును. దశరథవంశమున నవతరించిన భగవంతుఁడా నన్నుఁ గరుణింపుము. అనఁగా నాకేమి కావలయునో వానినెల్ల నొసంగుమా యనునర్థ మేర్పడును. చతుర్విధపురుషార్థములు గృహస్థుఁడు యాచింపవచ్చును. ఇందుఁ ద్రిజటుఁడు "ప్రత్యవేక్షస్వ" అని యడుగుటంజేసి నాపూర్వ

కర్మము ననుసరించి యేమేమి యీయఁదగునో వాని నొసం
గుమా శ్రీహరీ! యని యతనిభావమైనట్లు పొడకట్టు-
ఈయర్థము సార్థకమని యెట్లు చెప్పవచ్చునందురేమో.

"తతస్సభార్యస్త్రిజటో మహామునిర్గవామనీకం ప్రతిగృహ్య మోదితః."
అని మూలము.

"వృణీష్వ కించేదపరం వ్యవస్యతి."
ఇంకేమైనఁ గావలసిన నడుగుమని రాముఁ డనఁగా గోవులనుమాత్రము గైకొని మఱేదియుఁ గోరకపోయెను. అని యున్నందున భార్యాతృప్త్యర్థము శిశుపోషణార్థము గోధనమును గోరెననియు, సకలకల్యాణదాయకమగు శ్రీరామచంద్రసందర్శనమే తనకుఁ జాలునని యతఁ డింకేద్దియుఁ గోరకయే పోయెననియు నర్థము స్పష్టమగును. కావున శ్రీరాముని కాలమున నన్నపేదలున్నవారే. ఏమి ధర్మపాలనము? అన్న కుత్సితప్రశ్నమున కవకాశమే లేదని యెఱుంగునది.

మఱొకసందేహనివారణము.

వేలకువేలుగా గోవుల నిచ్చెనని యున్నదికదా. అన్ని గోవుల గైకొనినవా రేమిచేయుదురని కొందఱు ప్రశ్నింతురు. సమాధాన మాలకింపుఁడు. పూర్వకాలము గోవు లోకనాణెముగా నుండెను.

"ఆర్షే గోమిథునం ద్వేవా వరాదాదాయ ధర్మతః,
కన్యాప్రదానం విధివదార్షో ధర్మస్స ఉచ్యతే.
ఆర్షే గోమిథునం శుల్కం కేచిదాహుర్మృషైవ తత్."

మను. 3 అధ్యా.

అన్నమనుస్మృతి గోవు లోకనాణెమని యేర్పడుచున్న

ఇక్కాలమునఁగూడ విశాఖపట్టణప్రాంతములఁ బశువులను సొమ్ములని పిలుచువాడుక ప్రసిద్ధముగనున్నది. పూర్వము గోవులే ధనము. రాజులుకూడ గోధనము విశేషించి చేర్చువారు. మహాభారతమున దుర్యోధనుఘోషయాత్ర యన నెట్టిది? రాజులు గోధనముకలవారనుట కది యుదాహరణము కాదా. మహాటవులు విశేషించిగల యాకాలమున గోధనము మిక్కుటముగ నుండుటకుఁ గొఱంత యేమి యుండును ? మునులుకూడ గోవులను బోషించువారు. హోమధేనువులని వానిని బిల్చువారు. హరిణములఁ బెంచుట మునులయలవాటులలో నొకటి.

"తదంకశయ్యాచ్యుతనాభినాళాకచ్చిన్మృగీణామనఘాప్రసూతిః."

అని కాళిదాసమహాకవి తెల్పెను. కావున గోవు లసంఖ్యలుగా నుండుట విచిత్రముకాదు. అన్నియావుల నాత్రిజటునకు శ్రీరాముఁ డిచ్చెనన్న నబ్బురము నొందవలసినయవసరము కనఁబడదు. ఇఁకఁ దరువాతికథను బరికింతము.

౩ { సీతాలక్ష్మణులఁ దోడ్కొనిపోవ ననుమతిఁ గోర రాముఁడు తండ్రికడ కరుగుట. }

* రామలక్ష్మణులు సీతతోడ సమృద్ధిగా బ్రాహ్మణులకు ధనమొసంగి పిదప సీతతోడ రాజుకడ కరిగిరి. అర్చింపఁబడి పూలహారములుగల కోదండకృపాణాదుల నాయన్నదమ్ములు పట్టుకొనఁగా నవి చూడ శక్యముగాక యెంతయు సీతంగూడి నందున వెలింగెను. త్రోవలనిండ జనులుండుటంజేసి పోవ వలనుపడకయుండెను. జనులు మేడలపైనుండి దీనముఖముల

* ఇయ్యది ముప్పదిమూఁడవ సర్గమునుండి గైకొనఁబడినది.

రామమూర్తిం గాంచుచుండిరి. ఛత్రముకూడ లేకయే శ్రీరాముఁడు పాదచారియై పోవఁగని వగలఁబొగులుచిత్తముల నెన్నియో రీతుల ననుకొనసాగిరి. చతురంగబలములు వెంట రాఁగాఁ బోవు రాముఁ డిపు డొక్కఁడే పోవుచుండఁగా సీతాలక్ష్మణులు వెంటఁ జనుచున్నవారు. ప్రభుత్వసంపదను రాముఁడనుభవించువాఁడు. యాచకులపాలిటికల్పవృక్షము. పితృసేవానిరతుఁడు. కావునఁ దండ్రి చేసినప్రతిన వ్యర్థము కాకయుండఁ జేయనున్నాఁడు. పూర్వము వియద్వీథిని సంచరించుమహాభూతములుకూడ నేజానకిం జూడఁజాలకయుండెనో యాసీత నిత్తఱి రాజమార్గమున నెల్లరుం జూచుచున్నారు. సీత సుకుమారమగు దేహముకలది. చారుచందనచర్చలకే యామె మేను దగినది. అరుణవర్ణమగు శ్రీచందనమునే యామె పూసికొనును. ఇట్టి యీ సీతాదేవి యిఁకమీఁద వేవేగ వర్షాతపమారుతములు రంగు మాఱిపోవఁజేయఁగా నడవుల నుండవలయు భూతావిష్టుఁడు కావుననే రా జిట్లు పలుకుచున్నాఁడు. సత్యము. లేకపోయిన రాజు ప్రియపుత్త్రుని రామమూర్తిని గానకుఁ బొమ్మనునా? వయసువచ్చినకొడుకు దుర్గుణుఁడయినను వనమునకుఁ బొమ్మనఁ దండ్రికి మనసువచ్చునా? సుగుణము లట్లుండనీ. ప్రవర్తనముననే యీలోకమెల్ల లోఁబడునట్లు చేసికొన్న కుమారరత్నమును శ్రీరాముని వనికిం బంపుటగుఱించి వచింపనేల? అహింసయు వాత్సల్యము జాతివిద్యాశీలశమదమములను నీయాఱు గుణములు పురుషోత్తముఁడగు శ్రీరామునకు సొంపుగూర్చుచున్నవి. అట్టి యీరామునకుఁ గొంతమాత్రము హింసగూర్చుటం జేసి ప్రజలెల్లరు తీవ్రగ్రీష్మమున జలములు తగ్గిపోవఁగాఁ

గలఁతనొందుజంతువులవలె నెంతయో పీడితులై యున్నారు. శ్రీరాముఁడు జగదధిపతి. అట్టివానికి వనవాసాయాసము పాటిల్లఁగా మూలము చెడఁగా వృక్షము పుష్పఫలములతో నశించు చందమునఁ దదాధారమగు నీజగత్తంతయుఁ బీడింపఁబడియే యున్నది. రామచంద్రునకు ధర్మమే సారము. కావున నీశ్రీరాముఁడు మనుష్యాదిప్రాణిరూపమగు వృక్షమునకు మూలము. తక్కుంగలజనులెల్లను నందుఁ బూవులు పండ్లు ఆకులు కొమ్మలు నగుదురు. ఆశ్రితులమగు మనము భార్యలతో బంధువులతోను గూడి సౌమిత్రిరీతి రామునివెంట నడవికిం బోవుదము. మన మారామములను భూములను గేహములను వదలి రాముని తోడిసుఖదుఃఖములే యనుభవించుచు ధర్మాకృతియగు నీతని వెనుకఁ బోవుదము.

మనము గృహముల మానిపోవఁగా నందలి నిక్షేపములఁ బెల్లగించుకొనిపోవుదురు. అంగణములు చెడిపోవును. సంపాదించియున్న ధనధాన్యములు పాడగును. మఱియుంగలపదార్థములెల్ల నపహరింపఁబడును. గృహదేవతలు వెడలిపోవుదురు. వివరములు త్రవ్వి మూషికములు విహరించుచుండును. కాపురమున్న లక్షణములు పొడకట్టవు. బలికర్మములు యాగమంత్రశబ్దములు హోమకార్యములు జపములు శూన్యములగును. కలవురాఁగాఁ బాడుపడినట్లున్న మనగృహములఁ గైకేయి స్వాధీనము చేసికొని హాయిగా నుండుఁగాక. రాముఁడున్న యడవి పురమగును. శ్రీరాముఁడు మనము వదలినపిదప నీ పట్టణ మరణ్యమగుఁగాక. మనమెల్ల నీరాముఁడు పోయియున్న యడవికిఁ బోయినపిదప భయంపడి సర్పములు తమబిలముల

వదలి పాఱిపోవును. మృగపక్షులు పర్వతసానుభాగముల మాని పరుగిడును. ఏనుఁగులు సింగములుకూడఁ బాఱిపోవకమానవు. అవియన్నియు వనములవదలి మనము విడిచిపెట్టిన యీయయోధ్యలోఁజేరి కాపురముండుఁగాక. మృగపక్షులకు నివాసమగు నీదేశమును గైకేయియుఁ దత్సుతుఁడు వారిబంధువులును గైకొందురుగాక. మనము సుఖముగా నడవుల శ్రీరామునిం గూడి వసింతము. అని యిట్లు లొండొరులతో మాటలాడుకొనిరి. ఆమాటలనెల్ల శ్రీరాముఁ డాలకించెను. కాని యించుకంతయు వికారము నొందకయుండెను.

అంత రామమూర్తి మందగమనమునఁ బోయి కైలాసమువలెఁ దెల్లనైయుండు రాజభవనముం గాంచెను. వీరభటులు వినీతులయి యందు రక్షకులుగా నుండిరి. రాముఁ డా రాజమందిరమును జేరి యించుకదూరమున దీనుఁడైయున్న సుమంత్రుని జూచెను. రాముఁడు పితృనానతిని గొఱఁతగాక యుండఁ జేయఁబూని యతనిం జూడ వాంఛించి త్రోవయందలిజనులు తన్నుంగాంచి వగచినను దావగవక నవ్వుచున్న యట్లే యెల్లరకుం గనఁబడుచుఁబోయెను. ధీరాగ్రగణ్యుఁడగు నాదాశరథి వనములకుంబోవంగోరి తండ్రి వనమున కరుగుమన్నదిమొదలు దుఃఖమునఁ బరితపించుచున్న సుమంత్రునిం గాంచి తనరాక తండ్రికిఁ దెలుపుటకై యించుకసేపు వేచియుండెను. అంత సుమంత్రునిం గాంచి తానువచ్చి దర్శింపఁ గాచియున్న రీతి రాజునకుం దెల్పుమా యని సుమంత్రునకుఁ జెప్పెను.

మహానుభావులారా! ఈభాగమునఁ గలవిశేషములఁ బరికింతము.

"యాం న శక్యా పురా ద్రష్టుం భూతైరాకాశగైరపి,

తామద్య సీతాం పశ్యంతి రాజమార్గగతా జనాః. రా

అంగరాగోచితాం సీతాం రక్తచందనసేవినీం,

వర్షముష్ణం చ శీతం చ నేష్యంత్యాశు వివర్ణతాం." ౯

అని మూలము. సామాన్యార్థము స్పష్టము. విశేషార్థ మిందేది? ఆకాశగైర్భూతైరపి=దేవతాభేదములచేతఁగూడ, పురా ద్రష్టుం నశక్యా=మును చూడశక్యముగాక యేదేవియుండెనో, తాం సీతాం=ఆసీతాదేవిని, రాజమార్గమునఁగలమానవులు చూచుచున్నారని భావము. అనఁగా భూలోకమున నవతరింపక ముందు కేవల ప్రకృతి యనంబడుచుండు నీదేవిని భూమియందుఁ దిరుగువారిమాట యేటికింగాని వియచ్చరులుకూడ దర్శింపఁజాలకయుండిరి. ఇప్పుడో ఆప్రకృతియే యొక ఆకారమును ధరింపఁగనే మానవులుకూడఁ జూచుచున్నారు. భగవంతునకు మహామాయకు రూపములే లేవనియు, సర్వవ్యాపకులుగా నుందురనియుఁ, గారణాంతరమున నేదో యొకరూపమును ధరింతురనియు నీభాగమునుండి తేలెడిని. అనఁగా భక్తకల్పితరూపమే గాని నియమితరూపము లేదని తాత్పర్యము.. ఈవిషయము శ్రీశంకరభగవత్పాదులుగారు

"క్వణత్కాంచీదామా కరికలభకుంభస్తననతా

పరిక్షీణా మధ్యే పరిణతశరచ్చంద్రవదనా,

ధనుర్బాణాన్ పాశం సృణిమపి దధానా కరతలైః

పురస్తాదాస్తాం నః పురమథితురాహో పురుషికా."

అని తేటపఱచిరి.

"భక్తానాముపకారార్థం బ్రహ్మణో రూపకల్పనా."

అను సూక్తి కలదుకదా. దీనింబట్టి చూడఁగాఁ బ్రకృతిపురుషు అవినాభావసంబంధముచే సర్వవ్యాపకులుగా నుందురనియు,

భక్తులు వారియిష్టానుసారము రూపమును గల్పించుకొని యారాధింప ననఁగా ధ్యానింప నారూపమునఁ బొడకట్టి వారి నుద్ధరింతురనియు సారము. ఇట్టులుండ భగవంతున కొక్క లోకము నొక్కరూపము కలదనియు, నదియే ధ్యేయమనియుఁ గల్పించువారు మధ్వవైష్ణవాదులు గాక మతెవ్వరగుదురు? కల్పితరూపమే భగవంతునకుఁ గలుగు చుండునన్నపుడు మత ద్వేషమునకుఁ దావేలేదని తేలెడిని ఇన్ని మతద్వేషములకు దేవాలయములే హేతువులని తోఁచెడిని. ఆ దేవాలయములు లోని పాషాణవిగ్రహములు సికతాసుధాసమ్మిశ్రపదార్థకల్పిత విగ్రహములు ముక్తినొసంగునని భక్త్యావిశేషములు సమర్పింపుఁ డని బోధించు మధ్వవైష్ణవులు కపటనాటకసూత్రధారులు గాక మతెవ్వరగుదురు? వారిదుర్మతసిద్ధాంతములఁ ద్రోసివైచి భగవంతుని నిర్మలభక్తి నారాధింపవలయునని మనము నిర్ణ యించుకొనవలయును.

"అంగరాగోచితాం సీతాం రక్తచందనసేవినీం,"

అనుదానియందుఁ గలసారము నరయుదము భగవతికి రక్తచం దనమునందుఁ బ్రీతి యని మంత్రములు తెలుపుచున్నవి. రక్త ములు నట్టివే. రక్తవర్ణము రజోగుణస్వభావము. రూపమును ధరించినపుడు భగవంతుఁడు కార్యకరణదక్షుఁడగును. రజోగుణ మునకు స్వభావములగుగుణము లున్నయట్లు నటింపకతీఱదు. భగవతియు నట్లే

"భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీం"

అని శంకరభగవత్పాదులు పొగడిరి. అనఁగా అవతరింపక ముందు భగవతి శుద్ధసత్వగుణప్రధానగా నుండునని భావము.

ప్రస్తుతము మహాప్రకృతి రాక్షసనాశనార్థము సీతారూపమున వెలసినదగుట రజోగుణమును బ్రధానముగాఁగలదని తేటపడ నటించుననియుఁ, దదనుగుణములగు రక్తచందనపుష్పాదుల నామె నారాధింపవలయుననియు మన మెఱుంగవలయును. సాధకులు ప్రాయికముగా ముముక్షువులే కారు ధర్మార్థకామములను గోరువారలుగ నుందురు. వారు శుద్ధసత్త్వప్రధానములగుపద్ధతుల నారాధింపరాదు. ఫలాభిసంధిరహిత సత్కర్మాచరణపరాయణులుమాత్రము పై వ్రాసినపద్ధతి నవలంబింపరు. కాని ఫలమును గోరువారు తదుచితవిధుల నాశ్రయింపవలయును. సారమేమనఁగా సీతాదేవి రజోగుణప్రధానయై యవతరించినమాయ యనియు, రాక్షసనాశనమే ప్రధానముగాఁ గలదనియు సారము.

"అనృశంస్యమనుక్రోశశ్శ్రుతం శీలం దమశ్శమః,
రాఘవం శోభయన్త్యేతే షడ్గుణాః పురుషోత్తమం." ౧౨

అని మూలము. అహింసకత్వము లోనగునాలుగుణములు భగవంతుఁడగు రామునియందుండుట విచిత్రముకాదు. ఎవ్వనియందు నీగుణములుండునో యతఁడు పురుషశ్రేష్ఠుఁడగును. తొలుత లెక్కపెట్టఁదగిన దహింసయని తేలెడిని. అట్టిపరమధర్మము నవలంబించువాఁడు త్తముఁడు కాకతప్పునా?

"ప్రతీక్షమాణోఽపి జనం తదార్తమనార్తరూపః ప్రహసన్నివాథ."

అని మూలము. దీనులై జనులు శ్రీరాముని గాంచుచుండిరి. శ్రీరాముఁడు దీనుఁడుగాక నవ్వుచుండెను. అనఁగా నాయవతారకారణము వనగమనమే యని యెఱుంగక వీరు దుఃఖించుచున్నారే. ఎంత పామరులు? అని నవ్వుచుండెనని తాత్పర్యము.

ఇట్టు లీభాగము సీతారాములతత్త్వము తెలుపుచున్నది. ఇఁకఁ దరువాతికథవంకకు మరలుదము.

15 శ్రీరాముఁడు తండ్రికడ ననుజ్ఞఁ గొనుట.

* జగన్మోహనాకారముగల శ్రీరామమూర్తి యంత సారథిం గాంచి తనరాక తండ్రికిం దెల్పుమనఁగా నాతఁడు కంపితేంద్రియుఁడై లోపలికిం జని నిట్టూర్పులు పుచ్చుచుఁ దపించుచున్న రాజుం గనియె. రాజు రాహుగ్రస్తసూర్యబింబమువడువున నీరుగప్పినయగ్నిచందమున నిర్జలతటాకమురీతి వెంపుమాలి తపించుచుండఁగా సుమంత్రుఁడు గాంచి ప్రాజ్ఞుఁడుగాన దోసిలొగ్గి చెంతకేగి జయాశిషము లొసంగి భయమున మాటలు తడఁబడఁగా మెల్లగా మధురవాక్కుల నిట్లనియె. మహారాజా! పురుషోత్తముఁడగు నీతనయుఁడు ధనమెల్ల బ్రాహ్మణులకు సేవకులకు నొసంగి నీదర్శనమునకై వాకిటనున్నాఁడు. సఖులకడ ననుమతిం గొని నీసెలవు గ్రహింపఁగోరి చూడవచ్చియున్నాఁడు. రాజేంద్రా! రామమూర్తి యడవికింబోవ నున్నవాఁడు. సూర్యుఁడు కిరణాళిఁగూడియున్నచందమున సకలరాజగుణభూషితుఁడగు నారామభద్రుని జూడుము. సత్యధర్మరతుఁడగు నారాజు సారథిం గాంచి సుమంత్రా! ఇపు డిందుఁగలభార్యలం దోడ్కొనిరమ్ము. పత్నులతోడ నారామచంద్రునిం జూడఁ గోర్కి కలదు. అనఁగా నాతఁడరిగి రాజపత్నులం గని తల్లులారా! రాజు మిమ్ముం బిలుచుచున్నవాఁడు. సత్వరము పోఁదగు. అనఁగా బతియానతిమెయి నందఱచటికిం బోయిరి. వారు మూఁడు

* ఇది ముప్పదినాల్గవసర్గమునుండి సంగృహీతము. అధ్యాత్మరామాయణకథయుం నిందంతర్భూతముగనుండు.

వందలపై యొనమండ్రుగానుండిరి. సాధ్వీమణులువారెల్ల రాము నకై విలపించి నేత్రములు రక్తవర్ణములు కాఁగాఁ గౌసల్య చుట్టునుండి మెల్లఁగా నచటఁ జేరిరి రాజేంద్రుఁడు భార్యల రాకంగాంచి సుమంత్రా! శ్రీరామచంద్రుని బిలిచికొనిరమ్మనఁగా నతఁడు సీతారామలక్ష్మణులం దోడుకొనివచ్చి రాజుకడ విడి చెను. దూరమునుండి యంజలింబట్టి యరుదెంచు ప్రియపుత్రునిం గాంచి వగచుచు భార్యలతోఁ దటాలునఁ బీఠమునుండి లేచెను. రామున కెదురుగాఁ బోయెను. దుఃఖతప్తుఁడుగాన రామునివద్దరకుఁ బోవఁజాలక నడువ విస్మృతుఁడై పడెను. అట్టి తండ్రింగని రామలక్ష్మణులు లేవనెత్తఁ జెంతకుం బరువిడిరి. రాజపత్నులొక్కుమ్మడి మొగి నేడ్చిరి. సీతారాములు సౌమిత్రియు నారాజును జేతులంబట్టి యెత్తి దుఃఖించుచు శయ్యాతలంబునఁ గూరుచుండఁబెట్టిరి.

దశరథుఁడు కొంతసేపట్లేయుండి స్మృతిరాఁగా దుఃఖార్ణ వమున మునింగియుండఁగా రామమూర్తి యంజలింబట్టి తండ్రీ! మాకెల్లఁ బ్రభుఁడవు. నీయనుజ్ఞ లేక పోవఁగూడదు. సెలవు వేఁడుదు. దండకారణ్యమునకుంబోవ నున్న నన్ను దుఃఖము లేనినేత్రములం జూడుము. లక్ష్మణునకు ననుజ్ఞయిమ్ము. సీతయు నావెంట వనములకు వచ్చుచున్నది. కాన సీతకు ననుమతి యొసంగుము. ఎన్నివిధములనో రావలదనిచెప్పినను వీరిరువురు నుండ నంగీకరింపక వచ్చుచున్నారు. విశోకుఁడవై మామూ పురకు బ్రహ్మ ప్రజలకు ననుజ్ఞయిచ్చునట్టు లొసంగుము. వన వాసమునకై తొందఱపడు శ్రీరాముని దశరథుఁడు చూచి వత్సా! కైకకు వరమిచ్చి నేను వంచితుఁడనైతిని. నన్ను నిగ్ర

హించి నీవే యయోధ్యకుఁ బ్రభుఁడవుకమ్ము. నావుఁడు వాగ్విశారదుఁడు ధర్మాత్ముఁడు నగు రాముఁడు చేమోడ్చి గిలించి రాజేంద్రా! పెక్కువేలేండ్లు భూమిఁబాలించితివి. అట్టి నీవిపుడు నన్నసత్యవంతునిగాఁజేయుట న్యాయమా? నిన్ను నసృతవచనునిగాఁజేయుట నాకు న్యాయ్యముగాదు. కనుక నే వనముల వసింతును. నేనందు నైదుతొమ్మిదియువత్సరములు వనముల హాయిగా సంచరించుచునుండి ప్రతిన తీఱఁగా మరవచ్చి మీపాదముల నాశ్రయింతును.

అని రాముఁడు పలుకఁగా సత్యపాశబద్ధుఁడగుట రాజు విలపించుచు నిపుడే పంపుమని కైక ప్రోత్సహించుచుండఁ బ్రియపుత్త్రుని గని యిట్లు పలికెను. వత్సా! వనముల కరుగుము. దానఁ బరలోకసత్ఫలము నైహికశ్రేయస్సు నీకుం గలుగుంగాక. శుభముల నొసంగుచు నెట్టిజంతువులవలనను భయము కలుగక యుండు సత్పథము నాశ్రయించి యరుగుము. నాయనా! సద్గుణముల రాఘవులకెల్ల నానందముం గూర్చువాఁడవు. సత్యశీలుఁడవు. ధర్మనిరతచిత్తుఁడవు. ఇట్టి నీకుఁగలిగిన యీవననివాసబుద్ధి మరలింప శక్యమగునది కాదు. నేఁడుమాత్రముపోవరాదుసుమీ రాత్రియు సమీపించుచున్నది. రాత్రియంతయు నిందే యుండుము. ఒక్కదినమైనను నిన్నుఁగన్నులారఁ జూచుచు హాయిగా నుందును. కౌసల్యను నన్నుం జూచుచు నీరాత్రి యిందుండుము, నిన్నుఁ దృప్తినొందింతుము. అంత రేపుదయము పయనము చేయవచ్చును. నాకుఁ బరలోకమున మేలుగోరి నీకుఁ బ్రియములగువానినన్నింటిని ద్యజించి నిర్జనారణ్యములకుం బోవుచున్నాఁడవు. ఇదెంతవారికైనఁ జేయందరముగాదు. నీవద్దాని నొనరించు

చున్నవాఁడవు. నాయనా! నిన్నడవులకుఁ బంపుట నాకెంత మాత్రము సమ్మతముగాదు. సత్యముపై నొట్టుపెట్టి వచింతును. ఈకైక నీఱుగప్పినయగ్నివలెఁ దనమదిఁగల క్రౌర్యమును వెలి పుచ్చక గుప్తముగానుంచి నన్నుఁ జలింపఁజేసి వంచించినది. మున్ను నేను సామాన్యముగా నిచ్చినవరములను విపరీతముగాఁ గోరి మోసగించెను. నీవు కులాచారధ్వంసకురాలగు కైకేయి చెప్పినట్లు యొనరించి యీమోసమునుగూడ ఫలింపఁజేయఁగోరు చున్నవాఁడవు. నీగుణము వర్ణింపఁదగినదే. వత్సా! జ్యేష్ఠపుత్త్రుఁ డవగునీవు నన్ను సత్యవచనునిగా నొనరింపఁగోరుచున్నావు. ఇది యచ్చెరువుకాదు. అంత రామభద్రుఁడు విచారపడుచుఁ బలికిన తండ్రిపలుకు లాలకించి నగచి సోదరుఁడు దుఃఖించుచుండఁగాఁ దండ్రీ! కోర్కులన్నింటిని దీర్చి సంతృప్తునిగా నన్నుఁజేసెదనం టివికదా. ఇపుడు మీరిచ్చునిష్టధర్మముల ననుభవించినను రేపు వానిని నాకుఁ గల్గించువాఁడెవ్వఁడు? కాన నిది యంత మంచిది గాదు. ఈకోర్కులకెల్లమాఱుగా నన్నవ్వలికింబంపిన సంతృప్తి నొందుదు. సర్వసమృద్ధియగు నీదేశము వదలిపోవుదును భరతు నకు దీనినిమ్ము. వనవాసమున మక్కువగల నాతలంపు మార్పు నొందదు. అడిగినవరముల నిచ్చువాఁడవుకదా నీవు. సంతోష మున మున్ను కైకకు వరము లిచ్చితివి. వానిని గొఱంతలేక యుండ నాయమ్మకిచ్చి సత్యసంధుఁడవు కమ్ము. నేను భవదాజ్ఞ నించుకయుఁ దప్పక పాలించుచు వనమునందు, నందుఁ జరించు మునులతోడఁగూడి పదునాలుగేండ్లు వసింతును. నిన్ను నిగ్ర హించి రాజవు కమ్మని నాకుఁ దెలిపితివి. ఇట్టివిచారమించుకయు వలదు. తమ్మునకు రాజ్య మిమ్ము. రఘుకులానందదాయకా!

నామనస్సుఖమునకుగా రాజ్యమును గోరను. నాకోరిక నీయాజ్ఞాపాలనమునందే యాసక్తమగును. దుఃఖింపకుము. అశ్రుజలముల వదలకుము. నదీనాయకుఁడగు సాగరుఁడు కలఁతనొందునా? తత్తుల్యుఁడవగు నీవు కలవిలపాటొందరాదు. రాజ్యసుఖములలో దేనియందును సీతయందును దక్షిణ కామ్యవస్తువులందును వెండియు స్వర్గమునందును రవంతయైన కోరిక లేదు. పురుషశ్రేష్ఠా! సత్యసంధుఁడవు నీవగుటయే నావాంఛ. నీయందనృతదోష మారోపింపఁబడిన నాకుఁ గష్టముగ నుండును. ప్రత్యక్షదైవమగు నీమ్రోల సత్యసుకృతములపై నొట్టుపెట్టి ప్రమాణము చేయుదును. రాజేంద్రా! ఇఁక నిందు నిముసమైన నిలువఁ దరము గాదు. నేనుండలేదనిమాత్రము శోకింపకుము. నాసంకల్పమునకు మార్పు కలుగదు. కైకేయి నన్నడవులకుఁ బొమ్మనికోరెను. నే నంగీకరించితిని. కావున నీయానతిమెయి వర్తించుటయేకాక నాసత్యమును గూడఁ గాపాడుకొనవలయుఁగదా. కనుక వనమునకుఁబోవక మానరాదు. ఇందులకు విచారపడకుము. క్రూరమృగములుగాక మంచిస్వభావముగలజింకలు లోనగుమృగములు నిండియుండఁగా పక్షులు శ్రావ్యముగాఁ గూయుచుండఁగా నలరువనముల విహరింతుము.

తండ్రీ! దేవతలకుంగూడ జనకుఁడే దైవమని శాస్త్రములుద్ఘోషించుచున్నవికదా. మానవులమాట యిఁక వేఱుగఁ జెప్పవలయునా? దైవమన్నభావముచేతనే తండ్రియాన నెఱవెదను. పదునాలుగుసంవత్సరములు గడువఁగా నిందు నన్నుఁ జూతువు. కనుక నీసంతాపము వదలుము. వగచుచున్న యీజనులయార్తిని బాపి దుఃఖము శాంతింపఁజేయు

భారము నీయందున్నది. అట్టి నీవే యిట్లు వగచిన నింక వారి గతి యేమగును? నేను వదలిన రాజ్యమును భరతున కొసంగుము. భవదాజ్ఞం బాలించుచు నరణ్యమునకుం బోయెదను. కొంతకాల మందుందును. పర్వతపంక్తులు నగరములు నరణ్యములు పెక్కులుగలిగి మనోహరసీమలు వెలయఁగా శుభదమై యున్న యీభూమిని వదలి నేను వెళ్లగా భరతుఁడే యంతయు లోఁబఱచుకొని పాలించుంగాక. ఇది నాయిచ్ఛచేఁ జేయఁబడిన దనుకొనకుము. నీవేమి చెప్పిన నది యట్లే సాగఁదగును. సాధుసమ్మతమగు నీయాజ్ఞను బాలించుటయందు నామనస్సెట్లు దృఢముగనున్నదో, యట్లు మంచికోర్కులయందేని, ఇంకను నాకుం బ్రియమగుదానియం దెద్దానియందు నిలువదు. అందుచేత వనగమనము నాకుఁ గష్టముగాఁ దోఁచునని నీవేమాత్రము వగవకుము. నీకసత్యపాపముం గూర్చుటచే నాకు సర్వకామములు సిద్ధించిన నొల్లను అంతియేకాదు. సీతను బ్రాణములనుగూడ నొల్లను రాజ్యముమాట యేటికి? నీసూనృతవ్రతమునకుఁ గొఱంతరానిచందమున నవియెల్లఁ గావలయును. నేను రాజ్యము పోయెనని వగతునేమోయని యూహింపకుము. అనేక భూరుహములు గలయడవులకు నరిగి యందు ఫలమూలముల నశనముగాఁ గైకొనుచుఁ బర్వతములను నదులను సరస్సులను జూచుచు సుఖముగా నుండుదు. నీవును విగతశోకుఁడవై సుఖముగా నిందుండుదువుగాక. అని రాముఁడు పలుకఁగా భరింపరానియట్టిదుఃఖమునఁ బొక్కుచు రాజు ప్రియకుమారా యసు. చేరఁదీసి కౌఁగిలించుకొని విస్మృతుఁడై మూర్ఛమునింగి నిశ్చేష్టుఁడై యుండెను. కైక యొకతుకతప్పఁ దక్కంగల రాజపత్నిని

ల్లనొక్కసారి రోదనము చేసిరి. మూర్ఛిల్లిరి. అందుఁగల జనులు హాహాకారము లొనరించిరి.

మహాశయులారా! ఈభాగమున విమర్శనార్హవిషయములు లేవు. కాని యొకటిరెండుండకపోవు. వానిని బరికింతము.

"స త్వా పశ్యతు భద్రం తే రామస్సత్యపరాక్రమః,
సర్వాన్ సుహృద ఆపృచ్ఛ్య త్వామిదానీం దిదృక్షతే."

అని సుమంత్రుఁడు పలికెను.

"సత్యపరాక్రమస్సు రామస్త్వాం పశ్యతు భద్రం తే."

అని యన్వయక్రమము. సాధుమతుల నెల్ల నడిగి వారి యనుమతినొంది సత్యము పరాక్రమముగల రామమూర్తి నిన్ను నిపుడు గాంచుఁగాక. నీకు భద్రములు గలుగును. భగవతి యిచ్ఛానుసారము సుమంత్రునినోటనుండి యీమాటలు వెలువడెను. సజ్జనులకడ సెలవుపుచ్చుకొని యనఁగా మహర్షుల యనుమతినొంది తనయవతారఫలమును గల్పింపఁబోవుచున్నాఁడనని రాముఁడు తెలిపెనని భావము. దేవకార్యము ధర్మకార్యముగాన వా రామోదించిరి. సత్యపరాక్రముఁడనఁగా సత్యమాధారముగాఁ బరాక్రమముఁ జూపువాఁడని భావము. పితృసత్యము నెఱపఁబూని తనపరాక్రమమును జూపునని సారము. వనగమనమునకు సత్యము హేతువయ్యెనని తాత్పర్యము. శిష్టరక్షణమునకు సత్యము ప్రధానము. అధర్మనాశమునకుఁ బరాక్రమము ప్రధానమనియే సారము. అవి రెండు నెఱపఁ దలఁచి వనములకుఁ బోవుచు శ్రీరామమూర్తి నిన్నుఁ జూడఁ దలఁచెను. ఆపరమేశ్వరుం జూడుము. నీకు భద్రము గలుగును.

అనఁగా దశరథా! వనగమనమునకు ముందుగాఁ దనదర్శన మొసంగఁ దానే యరుదెంచెను. నీకు సకలశుభములు గలుగును.

"భద్రం భద్రమితి బ్రూయాద్భద్రమిత్యేవ వా వదేత్."

అన్నమనుస్మృతివచనానుసారము భద్రవాక్కుల నాసుమంత్రుఁడు పలికెను. భగవద్దర్శనమున సకలభద్రములు ననఁగా దశరథునకుఁ గొంతగా నున్నది యాముష్మికసుఖమే. అయ్యది భగవద్దర్శనమున నపునరావృత్తికముక్తియే. అది కలుగునని వాక్యసారము.

"అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం,
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః. ౫
యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరం,
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః. ౬
తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ,
మయ్యర్పితమనోబుద్ధిర్మామేవైష్యస్యసంశయః." ౭ గీత. ౮ అధ్యా.

అను నీభగవదుపదేశము ననుసరించి స్మరించిననే తత్పదము లభించును. ఇఁక సాక్షాత్కరించిన భగవంతునే చూచిన భద్రముగలుగుటకు సందియమేల?

"సుమంత్రానయ మే దారాన్ యే కేచిదిహ మామకాః,
దారైః పరివృతస్సర్వైర్ద్రష్టుమిచ్ఛామి ధార్మికమ్." ౧౦

అని మూలము. ఇది దశరథునివాక్యము. భార్య సహధర్మచారిణి. సత్కర్మము లామెతోడనే యాచరింపవలయును. అన్న నియమము ననుసరించి యాజన్మమున నిదియే సత్కర్మము కడసారి చేయునది గాన దగ్గరనున్న భార్యలనెల్లం బిలుచుకొని

రమ్మనెను. వారినెల్లరఁ గూడి రామభద్రుని జూడఁగోరెదను. వీరందఱిం గూడి భగవంతుని గాంచి వీరిసంసర్గము వదలుకొని పరమపదమునకుఁ బోవుదునని రాజుభావము. ఈభావము రాజునకుఁ గలదా యనరాదు. అప్రయత్నముగా నాతనినోట వెలువడిన యీయక్షరసముదాయ మాయూహను దెలిపెడిని. ఈభాగమునుండి మన మేమి నేర్చుకొనవలయును? కంఠగతప్రాణుఁ డగునంతదనుక భార్యంగూడియే సత్కర్మము లాచరింపవల యును. తనకుగానరియే కర్మము నాచరింపరాదు. అట్లు పత్నిని వీడిచేసినసత్కర్మము ఫలింపదు అనునీతి యిందుఁ గలదు.

"ఆపృచ్ఛే త్వాం మహారాజ సర్వేషామీశ్వరోఽపి నః,
ప్రస్థితం దండకారణ్యం పశ్య త్వం కుశలేన మాం. ౨౨
లక్ష్మణం చానుజానీహి సీతా చాన్వేతి మాం వనం,
కారణైర్బహుభిస్తథ్యైర్వార్యమాణౌ న చేచ్ఛతః." ౨౩

అని మూలము. ఇవి రామవాక్యములు.

"మహారాజ! త్వాం ఆపృచ్ఛే. నస్సర్వేషా మీశ్వరోఽపి త్వం దండకారణ్యం ప్ర[illegible]తం మాం కుశలేన చక్షుషా పశ్య."

అని యన్వయము. దండకారణ్యమునుగూర్చి పోవుచున్న నన్ను సామ్రాజ్యలక్ష్మి యగుసీతను సాధుదృష్టి నవలోకింపుము. ఈనేత్రములతో మరల మమ్ముం జూడఁజాలవు. మమ్ము నెవ్విధిఁ జూడఁదగునో యట్లు అనఁగా మహాప్రకృతిని బరమేశ్వరునిగా నవలోకింపుమని భావము. లక్ష్మణునిరాకకు సమ్మతింపుము. "సీతా మామన్వేతి" సీత నన్ననుసరించి యడవులకు వచ్చును. సీత రాకకు సమ్మతింపుమని యర్థమునుండి సిద్ధమగును. ఏల

యనఁగా సీతవేఱుగా నుండ వలనుపడదు. అవినాభావసంబంధము వారికిం గలదు. ఈవిషయము సీత యింతకుముందే

"భర్తుర్భాగ్యం తు భార్యైకా ప్రాప్నోతి పురుషర్షభ,
అతశ్చైవాహమాదిష్టా వనే వస్తవ్యమిత్యపి." ౪ సర్గ. ౨౭

అనువాక్యమునఁ దేటపఱచినది. కావుననే రామభద్రుఁడు లక్ష్మణుని రాకకు సమ్మతింపుము. సీత నన్నుఁగూడి యడవులకు వచ్చుననియె. దీనిచే సీతారాములకుఁ జంద్రచంద్రికలకువలె నభేదము స్పష్టమయ్యెనని యెఱుంగందగు.

"నవ పంచ చ వర్షాణి వనవాసే విహృత్య తే,
పునః పాదౌ గ్రహీష్యామి ప్రతిజ్ఞాంతే నరాధిప." ౨౯

అని మూలము. ఇదియు శ్రీరామవాక్యమే. సామాన్యార్థము సులభము. తొమ్మిదిన్నైదువత్సరములు వనమున విహరింతు ననుటంజేసి తొమ్మిదేండ్లు ఒకవిధముగను అయిదేం డ్లొకవిధముగా వనవాసమునఁ గడపుదునని భావము. అనఁగా మొదటఁ దొమ్మిదేండ్లు విహరింతును. ఈమానవదేహమునకు రాఁదగిన విశేషకష్టములు లేవని భావము. తక్కినవైదేండ్లలోనే కొన్ని కష్టములు వచ్చుననియు నందు విహరింతుననఁగాఁ గ్రూరరాక్షసులను విశేషించి హరింతుననఁగా సంహరింతుననియు సారము. ప్రతిజ్ఞాంతము ననఁగా నాయవతారమునకు ఫలమగుదుష్టరాక్షసవినాశనానంతరము పదునాలుగేండ్లు గడువఁగా మరల "పాదౌ గ్రహీష్యామి." పాదుకలను గ్రహింతుననఁగా నాపాదుకలయం దునుపఁబడినరాజ్యమును గ్రహింతునని భావము.

"శ్రేయసే వృద్ధయే తాత పునరాగమనాయ చ,

గచ్ఛస్వారిష్టమవ్యగ్రః పంథానమకుతోభయం. ౩౧
న హి సత్యాత్మనస్తాత ధర్మాభిమనసస్తవ,
వినివర్తయితుం బుద్ధిశ్శక్యతే రఘునందన." ౩౨

అని మూలము. ఇవి దశరథవాక్యములు. "శ్రేయసే=పరలోకహితాయ, వృద్ధయే=లోకాభ్యుదయాయచ" అనివ్యాఖ్య. స్వర్గలోకవాసులహితముకొఱకు మర్త్యలోకవాసులయభివృద్ధికొఱకు నని భావము. పునరాగమనాయచ= రాక్షససంహారము కాఁగా నవతారసమాప్తినొందింపక మరల నయోధ్యకు రావలయునని భావము. అవ్యగ్రః అరిష్టమకుతోభయం పంథానం గచ్ఛస్వ=శుభము, ఎందును భయము లేనిది అయిన మార్గమును. అట్టిదేది? ధర్మమార్గము. అట్టిమార్గమునఁ బొమ్మని దశరథు నభిప్రాయము. సత్యాత్మనః ధర్మాభిమనసః తవ = సత్యస్వరూపము గలవాఁడు. ధర్మమున కభిముఖమగుమనస్సుగలవాఁడు. అట్టివాఁడెవ్వఁడు? సర్వేశ్వరుఁడే అట్టి పరమేశ్వరునకుఁ గలిగినబుద్ధిని మరలింప నెవ్వరికి శక్యమగును? ఎవ్వరికి శక్యము కాదనిభావము. ధర్మసంరక్షణార్థము నీవు పోవుమార్గ మేవిధమునను భయము లేనిది. అనుటచే "వృషో హి భగవాన్ ధర్మః" అనుమనుస్మృతి వచనభావమే రామాయణమునందుఁ గలదు. అనఁగా రామాయణము కేవలకావ్యముగాక సకలధర్మప్రతిపాదకమని భావము.

"దుష్కరం క్రియతే పుత్ర సర్వథా రాఘవ త్వయా,
మత్ప్రియార్థం ప్రియాం స్త్యక్త్వా యద్యాసి విజనం వనం." ౩౫

అని మూలము. రామా! ఇందుఁగలమిత్రమండలమును వదలి నాకుఁ బరలోకమున మేలుగలుగవలయు నన్నవాంఛతో నడవులకు వెళ్లుచున్నావే. ఇదియే నీకుఁదప్ప మఱెవ్వరికి దుష్క-

రమగు కార్యము. అనఁగా నీవడవులకుఁ బోయినఁగాని నాకు మరణము సిద్ధింపఁదనియు, నాకీశరీరతాపములు తీఱి శాశ్వతానందము కలుగఁజేయుటకే నీ వీప్రయాణము సాగించుచున్నాఁడవనియు దశరథునాశయము. ఇట్టిపరిజ్ఞానము రాజునకుఁగలదా యని యందు రేమో. అప్రయత్నముగా భావికాలము పురికొలుపుచుండ మానవులు సంభాషింతురు. ఆమాటలు వారిప్రయత్నములేకయే వెలువడునను భావము మన మెఱుంగవలయును.

“న చ శక్యం మయా తాత స్థాతుం క్షణమపి ప్రభో,
న శోకం ధారయస్వైనం న హి మేఽస్తి విపర్యయః. ౪౯
అర్థితో హ్యస్మి కైకేయ్యా వనం గచ్ఛేతి రాఘవ,
మయా చోక్తం వ్రజామీతి తత్సత్యమనుపాలయే.” ౫౦

అని మూలము. ఇది శ్రీరాముని దృఢాభిప్రాయము. రాజా! ఇఁక క్షణమైన నిలువరాదు. విరాధాదిదానవులకు శాపవిముక్తికాలము సమీపించుచున్నది. నాయవతారమునకు ఫలమదియే. గుహుఁడు లోనగుసుహృదయులను నాసఖ్యముగోరువారలను నయ్యది ప్రసాదింపవలయు. ఈశోకమును వదలుము. నాయత్నమమోఘము. తండ్రీ! కైక వనములకుఁ బొమ్మని నన్నుఁ బ్రార్థించినది. ఈయవతారమున స్త్రీమూలమున నాప్రవృత్తి సాగవలయునని భావము. తప్పక వెళ్లెదనంటిని. ఆసత్యమును బాలింతును. అనఁగాఁ గైక వనములకుఁ బొమ్మని నిర్బంధింపలేదు. ప్రార్థించెను. ఆమె వేఁడికోలు నంగీకరించితి. ఆమెకు వరమిచ్చితి. భగవద్వాక్యము వరమే యగును. అట్టిసత్యమును బాలింతును. అనఁగా వేఁడినవారిని ధన్యులఁ జేయుట నాపని. కైక కోరినది ధర్మరక్షణమహాకార్యము. కాన నంగీకరించితినని రాముఁడు పలికెనని సారము.

"పితా హి దైవతం తాత దేవతానామపి స్మృతం,
తస్మాద్దైవతమిత్యేవ కరిష్యామి పితుర్వచః. ౫౨
చతుర్దశసు వర్షేషు గతేషు నరసత్తమ,
పునర్ద్రక్ష్యసి మాం ప్రాప్తం సంతాపోఽయం విముచ్యతాం." ౫౩

అని మూలము. ఇదియు శ్రీరామానుగ్రహపరిపూరితవాక్యమే. దేవతలుకూడఁ దండ్రిని దైవముగా గౌరవింతురు. కాన దైవవాక్యముగా తండ్రివాక్యమని తలంచి యారీతి మెలంగుదును. అనఁగా తండ్రిమాట మీఱరానిదని భావము. తండ్రిమాటనెపముగా దేవకార్యము సాధింతుననునర్థమిందు సూచింపఁబడియె. పదునాలుగేండ్లు కాఁగా మరల నన్నుఁ గాంచఁగలవు. కాన నీసంతాపమును వదలుము. అని రామమూర్తి తెలిపెను. ఇది యసత్యముకాదా యని కొందఱందురు. రావణవధానంతరము దశరథుఁడు యుద్ధరంగమున శ్రీరాముని గాంచును. ఆభావమే యిట రామమూర్తి తండ్రికిం దెలిపెనని భావము. కానఁ బైదోషము పొసఁగదనుటయే సమాధానము.

"వనం ప్రవిశ్యైవ విచిత్రపాదపం సుఖీ భవిష్యామి తవాస్తు నిర్వృతిః."
అను నీవాక్యమున శ్రీరాముఁడు దశరథునకుం గలసంసారతాపములఁ దొలంగుగాతమని వరమొసంగుచున్నాఁడు. వనముల సుఖముండుదు. నీకు సుఖసిద్ధియగుఁగాక. అపునరావృత్తికమగు సుఖస్థానము లభించుఁగాక యని భావము. ఇట్టు లీభాగము మనకు శ్రీరామమూర్తి మనోభావము తండ్రినుద్ధరింప నెట్లు పలికినదియుఁ దెలుపుచున్నది.

"అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః."
అనుభావమును సూచించుచున్నది. కనుక నట్టిపరమతత్త్వ

మును శ్రీరామనామమును గార్యార్థము ధరించిన భగవంతు నుపాసించి తదనుగ్రహామునకుఁ బాత్రులము కావలయును.

అధ్యాత్మ రామాయణమునఁ గలవిషయము నిఁకఁ బరికింతము. తండ్రియింటికి సీతారామలక్ష్మణులు పోవుచుండఁగా జనులు దుఃఖపడిరనునవి సాధారణము. అట్టిజనులం గాంచి వామదేవముని యిట్లు తెల్పెను.

“మానుశోచథ రామం వా సీతాం వా వచ్మి తత్త్వతః. ౧౦
ఏష రామః పరో విష్ణురాదినారాయణస్స్మృతః,
ఏషా సా జానకీ లక్ష్మీర్యోగమాయేతి విశ్రుతా. ౧౧
అసౌ శేషస్తమన్వేతి లక్ష్మణాఖ్యశ్చ సాంప్రతం,
ఏష మాయాగుణైర్యుక్తస్తదాకారవానివ. ౧౨
ఏష ఏవ రజోయుక్తో బ్రహ్మాభూద్విశ్వభావనః,
సత్త్వావిష్టస్తథా విష్ణుస్త్రిజగత్ప్రతిపాలకః. ౧౩
ఏష రుద్రస్తామసోఽన్తే జగత్ప్రళయకారణం,
ఏష మత్స్యః పురా భూత్వా భక్తం వైవస్వతం మనుం. ౧౪

... ...

స ఏష విష్ణుశ్శ్రీరామో రావణాదివధాయ హి,
గంతాద్యైవ వనం రామో లక్ష్మణేన సహాయవాన్,
ఏషా సీతా హరేర్మాయా సృష్టిస్థిత్యంతకారిణీ,
రాజా వా కైకయీ వాపి నాత్ర కారణమణ్వపి.

... ...

రామరామేతి యే నిత్యం జపంతి మనుజా భువి,
తేషాం మృత్యుభయాదీని న భవంతి కదాచన.

... ...

భక్తానాం భజనార్థాయ రావణస్య వధాయ చ,

రాజ్ఞశ్చాభీష్టసిధ్యర్థం మానుషం వపురాశ్రితః.” అధ్యాత్మ ౫ సర్గము.

కథాభాగము విమర్శింప నక్కఱలేదు. ఇందొక్కరహస్యము కలదు. దానిం దెలిసికొందము. భగవంతుఁడు సత్త్వరజస్తమోగుణముల నాశ్రయించి విష్ణుబ్రహ్మరుద్రనామములం బరఁగుచు వరుసగాఁ బాలనము సృష్టిని, లయమును జేయుచున్నాఁడు. మత్స్యకూర్మాద్యవతారముల నాశ్రయించెను. అతఁడే రావణవధార్థము దశరథునికోర్కెదీర్పుటకు రామనామమున నీయవతారమెత్తెను. ఈసీత జగన్మాయ. సృష్టిస్థితిలయములకు హేతుభూతురాలు అని యున్నదికదా. దీనింబట్టి పరికింపఁగా శ్రీరాముఁడు సీతాదేవియు వైకుంఠమాత్రమున కధిపతియగు లక్ష్మీసహితనారాయణుఁడు కాఁడనియుఁ, త్రిమూర్తులకు జనకుఁడనియుఁ దేలెడిని. యోగమాయయే సృష్టిపాలనసంహారముల నొనరించునది. దశరథుఁడు కైకయు వనగమనమునకుఁ గారణ మేమాత్రముకారు. అనునదియే యిటఁగలసారము. త్రిమూర్తులకు మూలమగుపరతత్త్వమే రామచంద్రుఁడని తాత్పర్యము.మధ్వవైష్ణవులసిద్ధాంత మీభావమును బరికింపఁగా నెగిరిపోవును. సీతారాములనఁగాఁ బ్రకృతిపురుషులనియే తేటపడును. దీనిచేఁ ద్రిమూర్తులలో నొక్క రుత్కృష్టులు రెండవవారు తద్భక్తులు నగుదురన్నభావము నీచమేయని తేలెనుగదా. సర్వమూర్తులు తానగువాఁడే భగవంతుఁడు కాని కొందఱు కాని వాఁడు పరమేశ్వరుఁడగునా? అట్టి రామపరమాత్మయందు నామహాత్మునిసంకల్పశక్తియగు సీతయందు భక్తిగలిగియుండుటయే తరణోపాయమని మన కీయధ్యాత్మరామాయణము బోధించుచున్నది.ఇఁకఁ దరువాతికథాభాగమునకు మరలుదము.

సుమంత్రుఁడు కైకను నిందించుట.

* అట్లు రాజు మూర్ఛిల్ల రాణులందఱు హాహాకారములు చేయఁ గాంచి సుమంత్రుఁడు కోప మాపుకొనఁజాలక తల విదలించుకొనుచు నిట్టూర్పులు పుచ్చుచుఁ జేతులు పిసికికొనుచు దంతఘట్టనశబ్దము వినంబడఁ గోపమునఁ గన్నులెఱ్ఱగా నుండఁగాఁ దనువెల్ల రక్తవర్ణముగాఁ గనంబడ మఱియుఁ గోపమునఁ బెక్కుమార్పులు గలుగఁగాఁ గైకయందు రాజుచిత్తము విరసంబైనదని యెఱింగి తీవ్రబాణములంబోలుపలుకులఁ గైకం గాంచి యిట్లు లాక్షేపించెను. దేవీ! దశరథుఁడు రాజు. జగమునకెల్లఁ బాలకుఁడు. ఇట్టిపతిని మనసారవదలితివిగాన. దుష్టమతివిగాన నీకిఁకఁ జేయరాని దేకార్యముండును? ఇంద్రపర్వతసాగరములంబోలి యప్రధృష్యుఁడగు రాజునుగూడ దుష్టకార్యమున సంక్షోభింపఁజేసితివే. కావున నీవు నల్లభుం జంపుదానవు. ఆపనిచేఁ గులమంతయుఁ బాడుచేయుదానవని నాయాశయము. రాజు సర్వపోషకుఁడు. వాంఛితములనిచ్చువాఁడు. నీకు భర్త. అట్టివాని నవమానింపఁ బూనుట న్యాయ్యము కాదుసుమా! పుత్త్రునైన వదలి పతిననువర్తించుట స్త్రీలకుఁ బ్రధానధర్మము. పుత్త్రకోటులకంటెఁ బతివాంఛ యుత్కృష్టము. రాజు మృతినొందఁగాఁ గ్రమము ననుసరించి జ్యేష్ఠపుత్త్రుఁడు రాజ్యముం బడసి పాలించును. ఆన్యాయము ననుసరించి శ్రీరాముఁడు పుత్త్రజ్యేష్ఠుఁడుగాన రాజ్యపాలకుఁడగుటయే యుత్తమధర్మము. సూర్యవంశముక్తామణియగు రాజు బ్రదికియుండఁగనే కులక్రమాగతధర్మమును

* ఇది ముప్పదియైదవసర్గమునఁ గలదు.

నాశనము చేయంబూనితివి. నీకుమారుఁడు రాజే యగుఁగాక, రాజ్యము నేలుఁగాక. ఎందు రాముఁ డుండఁబోవునో మే మెల్ల రమచ్చటికే పోవుదుము. ఈ దేశమున నొక్కనిర్భుఁడై నను నివసింపఁడని నమ్ముము మర్యాద నతిక్రమించి యెల్లరు లేచిపోవు నంతటి దుష్కార్యము నాచరించుచున్న దానవు. మర్యాద తొలఁగినయిట్టియాచారము పూనినందుల కిప్పుడే భూమి బ్రద్దలు కావలయును. అట్టిదయ్యు నేలొకో పగులకున్న దే ఇంతకంటె నచ్చెరువు కలదా? వసిష్ఠాదిబ్రహ్మర్షులు నీ యీమర్యాదకుఁ గ్రోధమూని నీవు పాడై పోవుదువుగాక యని వాగ్దండనములు ప్రయోగించియుందు రేకదా. చూచువారికి ఘోరములుగా నుండు నీవాగ్దండములుకూడ శ్రీరామచంద్రు నడవులకుం బంపుచున్న నీవంటికఠినురాలిని బాధింపఁజాలకున్న వేలొకో!

తియ్యమామిడిచెట్టుల నెవ్వఁడైనఁ గుతారధార నఱికి వేపచెట్టునకుఁ బాదులుకట్టి పెంచి దానిని బాలచేఁ దడుపుచుండు నేని యది వానికి మధురఫలముల నొసంగునా? చేదుకాయలనే యిచ్చునుగదా. సత్కులమునఁ బుట్టినను నీతల్లి కెట్టిస్వభావ మలవడియెనో నీస్వభావ మట్టిదే యని నేనెఱుంగుదును. నింబవృక్షమునుండి తేనె యొదవదన్నపలుకు లోకప్రసిద్ధముకదా. దుర్మతికి సుపుత్త్రిక కలుగునా? మీతల్లి చేసినపాపకర్మములు మున్నె యంద తెఱుంగుదురు. మాకు నల్లే యిప్పు డెఱుకపడియెను. వరములనిచ్చు నొక్కయార్యుఁడు నీతండ్రికొకయుత్తమవర మిచ్చెను. దానిచే నతనికి సకలప్రాణులపలుకులు చక్కఁగాఁ దెలియసాగెను. తిర్యగ్జంతువులగుపశుపక్ష్యాదులు చెప్పుకొనుమాటలుకూడఁ దెలియఁజొచ్చెను. ఒకానొక

తరుణమున మహాతేజశ్శాలియగు నీతండ్రి తనశయ్యకడఁ గ్రిందిభాగమున జృంభమను నొకజాతిగల చీమచెప్పినమాటలు విని దానియాశయ మెఱింగి పెక్కుసారులు నవ్వెను. అది తన్నుఁ గాంచి నవ్వెనని నీతల్లి తలంచి మృతినొందఁదగినంత కోపముం దెచ్చుకొని పతితో నిట్లు పలికెను. నాథా! శాంత స్వభావముగల నీవి ట్లకారణముగ నవ్వఁ గారణమేమి? తెలియఁ గోరెద ననఁగా నీతండ్రి భార్యతో దేవీ! దానికిం దగినకారణమును దెలిపినచో వెంటనే నాకు మృతి సంభవించును. నిస్సంశయము. కాన నద్దాని నడుగకుము. అని యెంతచెప్పినను వినక నీతల్లి నీవు బ్రదికినను మృతినొందినను సరే. కారణము చెప్పుము. పిదప నన్ను నవమానింప నవ్వలేదనుకొనియెదను. అంత నారాజు భార్యవలనికష్టములను బరిశీలించి తనకు వరమొసంగినయతనికి జరగిన యట్లు తెల్పెను. సాధువర్యుఁడగు నావరదాత రాజుం గాంచి భూపతీ! నీభార్య చచ్చినఁ జావనిమ్ము. పదవి పోయినను బోనిమ్ము. ఏమైనఁగాని నీ వెంతమాత్రము రహస్యమును దెలుపకమనియెను. నిర్మలాత్ముఁడగు నావరదాత చెప్పినమాట నాలించి రాజు భార్యను ద్రోసివైచి కుబేరుని భంగి సుఖముగా నుండెను. నీతల్లివలె నీవుకూడఁ బాపదృ-గలదానవు. కనుకనే దుర్జనపద్ధతి నాశ్రయించి నీతల్లివలె నీవు కూడ నజ్ఞానమున రాజును దుర్విషయములందుఁ బ్రవేశింపఁజేసి పాడుచేయుచున్న దానవు. లోకమునందుఁ దండ్రివలెఁ గొడుకులును దల్లివలెఁ గుమారికలును గుణములుగలిగి పుట్టుదురను ప్రవాదము నిజమని నాకిపుడు తోఁచుచున్నది. నీవట్టి దానవు కావలదు. పతికి లోఁబడి చెప్పినచొప్పున వర్తించు

చుండుము. నాథుఁడు పూనినట్లు రామాభిషేకమునకు నిష్టపడుము. రాముని వనగమనమునకు వగచు ప్రజల కూరట గల్గింపుము. పాపచిత్తులమాటల విని యింద్రునివలెఁ బ్రకాశించు నీనాథు నధర్మమునకుఁ బాలుపడకుండఁ జేయుము. పెద్దవానిని వదలి చిన్నవానికిఁ బట్టముకట్టుటయే యధర్మము కదా!

దేవీ! ఈదశరథుఁడు పాపదూరుఁడు. కాన నీకుఁ జేసిన శపథము వ్యర్థముగఁ జేయఁడు. ఏవిధముగానైన రాజ్యమునకన్న మిక్కిలి వెలగలరత్నభూషణాదు లొసంగి నీవరముల యప్పు దీర్చును. జ్యేష్ఠకుమారుఁడు ఉదారస్వభావుఁడు. సదాచారనిరతుఁడు. క్షత్రియోచితధర్మము నడపువాఁడు. మహాబలశాలి. పట్టాభిషిక్తుఁడు కాఁదగినవాఁడు రాముఁడు కనుక నాతని కాయుత్సవము సాగునట్లు చేయుము. తల్లీ! ప్రభువగు తండ్రిని వదలి రాముఁ డడవులకరుగు నేని దుర్నివారమగు నపవాదము లోకమున నీకుఁ గలుగకపోదు. సర్వసుగుణరాశియగు రామమూర్తి రాజ్యమును రక్షించుఁగాక. నీ పీభేపము వదలుము. అడవికి రాముఁ డరుగ నిం దతనికి నీడగు యోగ్యుఁ డెవ్వఁడు లేఁడు. కనుక నీ రాజ్యమున కతఁడే తగినవాఁడు. జ్యేష్ఠుఁడగు రాముఁడుండ ననుజుఁడగు భరతుఁడు రాజ్యపాలనమునకర్హుఁడు కాఁడు. యువరాజుగ రాముఁ డేర్పడఁగాఁ గోదండధరులలో మేటియగు దశరథుఁడు వంశాచారము ననుసరించి వనమున కేగును. ఇదియే కదా ధర్మము. అని సుమంత్రుఁడు పలికి యాసభయందుఁ గైకేయిని సాంత్వనోక్తులను గఠినభాషణములను గలంచి వైచి యథాపూర్వముగా హస్తయుగము మోడ్చి నిలుచుం

డెను. కైకయు నమ్మాటల కించుకేని కలఁతనొందక యెంతవేఁడుకొన్నను జాలినొందక యత్యుగ్రవదనముతో నుండ నాముఖవర్చస్సు రవంతయైనఁ దేటపడక యథాపూర్వముగనే యుండెను.

మహాశయులారా! ఈభాగమున గొన్ని విశేషములు కలవు. శ్రీరామునియందు నెల్లరు ప్రీతిగలిగియుండుటం జేసి యాపరమేశ్వరుని కగుణాపరత్వము స్పష్టమగును. మంత్రులెల్లరు రాజభక్తిపరిపూర్ణచిత్తులనియు ధర్మప్రియులనియుఁ దేటపడియెడిని. మఱియు మోమోటమిలేక రాజునకుఁ బ్రియపత్ని కైక యన్నభావము మాని ధర్మమందే నిష్ఠగలవారై యాకాలమున రాజుకడ మంత్రులున్నవారనియు విశదమగును. కావున నీభాగమున గలవిశేషవిషయములను బరిశీలింతము. మంత్రులు సభాసదులు రాజాస్థానమున నెట్టివారుండనగు నన్నవిషయము తొలుతఁ బరికించు టుత్తమము.

"మౌలాన్ శాస్త్రవిదశ్శూరాన్ లబ్ధలక్షాన్ కులోద్భవాన్,
సచివాన్ సప్త చాష్టౌ వా ప్రకుర్వీత పరీక్షితాన్. ౫౪
అపి యత్సుకరం కర్మ తదప్యేకేన దుష్కరం,
విశేషతోఽసహాయేన కింను రాజ్యం మహోదయమ్. ౫౫
తైస్సార్ధం చింతయేన్నిత్యం సామాన్యం సంధివిగ్రహం,
స్థానం సముదయం గుప్తిం లబ్ధప్రశమనాని చ." ౫౬

మను. ౭ అధ్యా.

"స మంత్రిణః ప్రకుర్వీత ప్రాజ్ఞాన్ మౌలాన్ స్థిరాన్ శుచీన్,
తైస్సార్ధం చింతయేద్రాజ్యం విప్రేణాథ తతస్స్వయం." ౩౧౨

యాజ్ఞవల్క్యస్మృతి, వ్యవహారాధ్యాయము.

ఇందు మౌలాన్ వంశపరంపరాప్రాప్తులని యర్థము. వంశాచా

రముగా మంత్రిపదము నందఁగలవారని యేర్పడును. మంత్రి యగుటకుఁ దగినయోగ్యత చిన్నతనమునుండియే కలుగవలయు ననియే దీనిభావము. పుట్టుకనుండి మర్యాద నేర్పుకొనవలయునే కాని నడుమ నది యలవడదని తాత్పర్యము. శాస్త్రజ్ఞానముగలిగి పరిశుద్ధప్రవర్తనముకలవారలై యుండవలయుననియే స్మృతుల తాత్పర్యము. అట్టివారు నిర్భయముగా రాజుమ్రోలఁ గష్టసుఖము లను దెలుపఁగలరు. అధికారము కారణాంతరమున నలవడినచోఁ దదనుకూలములగు మర్యాదలు లభించుట దుష్కరముకదా. మోమోటమిలేక మంచిమాటలను జెప్పువా రరుదుగనుందు రని భర్తృహరియే తెలిపెను. సుమంత్రునిచరిత్రమునుండి మన మీనీతిని దెలిసికొనవచ్చును.

"మావమంస్థా దశరథం భర్తారం వరదం పతిం,
భర్తురిచ్ఛా హి నారీణాం పుత్రకోట్యా విశిష్యతే." ౮

అని మూలము. పుత్రకోటులకంటె భర్తయిచ్ఛయే యధికమని భావము. స్మృతులయాశయముకూడ నిదియే. ఈమంత్రి భావము కైక పతిని గష్టపెట్టుచున్నదనియే కాని దేవతాకార్య మునకుఁ దోడ్పడ నవతరించినదని తెలిసికొనఁజాలఁడు. ఇందు స్త్రీలధర్మములుమాత్రమే గ్రహింపఁదగు. భర్తకంటె దైవము లేఁడనియుఁ బుత్రునికొఱకు నట్టిసనాతనధర్మము వదలరాదనియు నిటఁగలసారము. ఇందుల కుదాహరణముగాఁ గైక తల్లిచరిత మునే సుమంత్రుఁడు తెలిపెను.

"పితుస్తే వరదః కశ్చిద్దదౌ వరమనుత్తమం,
సర్వభూతరుతం తస్మాత్సంజజ్ఞే వసుధాధిపః,
తేన తిర్యగ్గతానాం చ భూతానాం విదితం వచః. ౧

తతో జృంభస్య శయనే విరుతాద్భూరివర్చసః,
పితుస్తే విదితో భావస్స తత్ర బహుధా హాసత్." ౧౮

అని మూలము. ఇందు విశేషమేమి? పూర్వకాలమున మంత్ర ప్రభావమున సకలజంతుభాషల నెఱుంగఁజాలినశక్తి యలవడు చుండెను. దేవతారాధన ప్రభావముననే కలిగెనని వారివిశ్వాసము. అది మూఢవిశ్వాసమని కొందఱనవచ్చును. ఈరీతి నను వారిదేమూఢవిశ్వాసమో లేక వారిదే మూఢవిశ్వాసమో దైవ మెఱుంగును. పూర్వులకు మూఢవిశ్వాసమే కలదని యొప్పు కొందము. దానిచేత నహంకారము నశించి భగవంతునియందు భూతులగు దేవతలయందు భక్తి యలవడును. ఆక్షేపించువార లకు నయ్యది నశించి నాస్తికత్వము దురహంకారముఁ గలుగు మహాలాభములు. కైక తండ్రి కొకమహాత్ముఁడొకవరమిచ్చె ననఁగా సర్వభూతభాషణములయభిప్రాయము తెలిసికొనఁదగు శక్తి కలిగెను. ఒక్కనాఁడు శయనించియుండు నారాజు శయ్యకుఁ జెంత నొకచీమ యేమో భాషించెను. దానిభావమె ఱింగి రాజు పలుసారులు నవ్వెను. అని కథాసారము. ఆరాజున కద్దానిభావము విచిత్రముగాఁదోఁచెను కనుక నింతస్వల్పజంతు వున కింత మంచిభావనకలదా యనుసంతోషమున నవ్వెను. అది యెఱుంగక భార్య తన్నుఁ బరిహసించెనని తలంచెను.

చీమలు లోనగునవి క్షుద్రజంతువులని మనము తలంచు చుందుము. కాని మనముకూడ క్షుద్రులమని తలంపము. ప్రతి జంతువునకు జ్ఞానము కలదు. సుఖదుఃఖములు కలవు. తన్నుఁ జక్కఁగా రక్షించుకొనఁదగునుపాయ మయ్యది యెఱుంగఁ జాలు. మననుండి యేల కాపాడుకొనఁజాలదందు రేమో మన

ముకూడఁ గాలము సమీపింపఁగాఁగాని యాపదలు మూఁడు నప్పుడుగాని మనలను రక్షించుకొనఁగల్గుదుమా? కర్మము బల వత్తరము. దానిచేతకు మాఱుచేయ బ్రహ్మాదులకు శక్యము గాదు. తుదకు దానిపోకడ లిట్టివని యెఱుంగఁజాలరు. "గహనా కర్మణో గతిః" అని భగవంతుఁడే తెలిపెనుగదా. ప్రతిజంతువు లోకమునఁ దా నన్నెకెక్కు-వలయునని తలంచును. అది స్వభావము. దానింగూర్చి యాక్షేపించువారికంటె మూర్ఖు లుండఁబోరు. ప్రతిమానవుఁడు తనయాన్నత్యమునే ప్రకటింపఁ జూచును. అది మానవస్వభావము. అట్లే సర్వప్రాణులని యెఱింగినఁ జీమలకు భాషకలదనునమ్మకము కలుగును. అదియే యుత్తమోత్తమగుణము. "స తత్ర బహుధా హసత్" అను విషయము విమర్శింపఁబడగినది.

"న కుర్వీత వృథా చేష్టాం న వార్యంజలినా పిబేత్,
నోత్సంగే భక్షయేద్భక్ష్యాన్ న జాతు స్యాత్కుతూహలీ." ౬౩
మను. ౪. అధ్యా.

అన్నమనుస్మృతివాక్యము ననుసరించి నిష్కారణముగాఁ గుతూహలముకలవాఁడు కారాదు. నిష్కారణముగా నవ్వరాదని తోఁచెడిని. భార్య చెంతనుండఁగాఁ బలుసారు లారాజు నవ్వెను. ఇతరులుండఁగానే కారణము లేనియట్లితరులకుఁదోఁచు నట్లు నవ్వరాదు. అది యొకదురభ్యాసముగాఁ బరిగణింపఁదగి నదియే. దానిచే నెన్నియోయిడుమలు వాటిల్లును. ఉదాహర ణముం బరికింపుఁడు.

"లక్ష్మీస్సరస్వతీ గంగా తిస్రో భార్యా హరేరపి,
ప్రేమ్ణా సమాస్తాస్తిష్ఠంతి సతతం హరిసన్నిధౌ. ౧

చకార సైకదా గంగా విష్ణోర్ముఖనిరీక్షణం,
సస్మితా చ సకామా చ సకటాక్షం పునఃపునః. ౧౮
విభుర్జహాస తద్వక్త్రం నిరీక్ష్య చ క్షణం తదా,
క్షమాం చకార తద్దృష్ట్వా లక్ష్మీర్నైవ సరస్వతీ." ౧౯

స్కం. ౯ అధ్యా ౬.

అను దేవీభాగవతకథ తెలిసినదియే కదా. విష్ణుమూర్తి నవ్వినది నిష్కారణమే యైనను భార్యలెల్ల వేఱువేఱర్థములు చేసికొని పరస్పరము శపించునంతదుస్థ్సితికిం జేరిరి ఈకథ వృథాకలహము వృథాహాసము పనికిరావనియు దాన నెన్నియోకష్టములు వాటిల్లుననియుఁ దెలుపుచున్నది. మనుస్మృతియు నీయర్థమునే బోధించెను. కావున నిష్కారణముగా నవ్వుట దురభ్యాసములలో నొకఁడని తేటపడియెడిని. మహాకవివాల్మీకి సుమంత్రునిమాటలవలన మన కీనీతిని బోధించెనని మనము గ్రహింపవలయును.

"మాతరం తే నిరస్యాథ విజహార కుబేరవత్." ౨౮

అని మూలము. కైకా! అంత నీతండ్రి నీతల్లిని వదలిపెట్టెను. అని కథాసారము. నవ్వుటకుంగలకారణ మడిగినంతన భార్యను వదలవచ్చునా యను ప్రశ్నము రావచ్చును. రాజు నీకావిషయమును దెలిపిన నాకు మరణము సంభవించునని తెలిపినను వదలక

"మ్రియతాం ధ్వంసతాం వేయం మాకృథాస్త్వం మహీపతే." ౨౩

అని పలికిన కారణముననే యా రాజు వదలెను. అట్టియంగనను వదలవచ్చునని స్మృతి తెలుపుచున్నది.

"వంధ్యాష్టమేఽధివేద్యాబ్దే దశమే తు మృతప్రజా,

పిశాదశే స్త్రీ జననీ సద్యస్త్వప్రియవాదినీ.” ౮౧

మను. ౯ అధ్యా

అప్రియవాదిని యగుస్త్రీ సాధ్వి కానేరదు. కాన దానిని వదలి వేయుటయే మంచిది. వదలివేయుట యనఁగా నన్నపానముల నాదరించుటయే యని తాత్పర్యము.

“వివాదశీలాం స్వయమర్థచోరిణీం పరానుకూలాం పరిహాసభాషిణీం,
అగ్రాశినీమన్యగృహప్రవేశనీం త్యజంతి భార్యాం దశపుత్రమాతరం.”

అను నభియుక్తోక్తియుఁ గలదు.

“అర్థాగమో నిత్యమరోగతా చ ప్రియా చ భార్యా ప్రియవాదినీ చ,
వశ్యశ్చ పుత్రోఽర్థకరీ చ విద్యా షడ్జీవలోకేషు సుఖాని రాజన్.”

అను నీతిశాస్త్రము ప్రియవాదిని భార్యయగునేని మంచిదని తెలుపుచున్నది. అప్రియవాదినివి కాఁగూడదని సుమంత్రుఁడు కైకను హెచ్చరించెననియే కథాసారమునుండి మనము తెలిసి కొనఁదగు నీతి.

“సద్యశ్చాద్య ప్రవాదోయం లౌకికః ప్రతిభాతి మా
పితౄన్ సమనుజాయంతే నరా మాతరమంగనాః. ౨౯

నైవం భవ గృహాణేదం యదాహ వసుధాధిపః,
భర్తురిచ్ఛాముపాస్వేహ జనస్యాస్య గతిర్భవ. ౩౦

అని మూలము. తండ్రినిబోలి కొడుకులు తల్లినిబోలి కొమరితలు పుట్టుదురని లోకప్రవాదము కలదని సుమంత్రుఁడు పలికెను. నీతల్లివంటిదానవు కారాదని తెలుపుటయే యతనిసంకల్పము. ఈసామెత కర్మసిద్ధాంతవిరుద్ధ మనవలయును. కర్మముల నెల్ల రొక్కరీతిగా నాచరించువా రుండరు. అదృష్టము కర్మాధీనము గనే యుండును. వానివానికర్మఫలముల వాఁడువాఁ డను

భవించునుగాని యొక్కనిబోలి వేఱొక్కఁడు ఫలము ననుభవింపఁజాలఁడు. లోకులు పోలికలననుసరించి యూహింతురు. అనుభవము ననుసరించి యూహించినను లోకప్రవాదము సత్యము కాదనియే తేలెడిని. తండ్రివంటివారు కొడుకులు తల్లినిబోలిన కొమరితలు కల్గుదురనుట పొరపాటే యనుట న్యాయ్యము. తల్లి దౌష్ట్యము నుగ్గడించుట కైక మనోభావము మాఱునేమో యనుసద్భావముననే యని యెఱుంగ వలయును. దీనింబట్టి శ్రీరాముని సౌజన్యము సర్వభూతాకర్షణ దక్షమని తేలుచున్నది. కైక శ్రీరాముని కార్యమునకు మిక్కిలి సహాయము చేయుచున్న దనువిషయము సుమంత్రుఁ డెఱుంగఁడు. లోకదృష్టిం బరికించియే యిట్లనుచున్నాఁడు కాని కైకయు మంథరయు భగవంతుని ప్రోత్సాహముననే యీ కార్యము నాచరించుచున్నవారని మాయాసమాచ్ఛాదితచేతస్కుఁడగు టెఱుంగఁజాలక సుమంత్రుఁడు వగచుచున్నాఁడని యే యిటఁగలసారము.

"జ్యేష్ఠో వదాన్యః కర్మణ్యస్స్వధర్మపరిరక్షితా,
రక్షితా జీవలోకస్య బలీ రామోఽభిషిచ్యతాం. ౩౦
పరివాదో హి తే దేవి మహాన్ లోకే చరిష్యతి,
యది రామో వనం యాతి విహాయ పితరం నృపం." ౩౧

అని మూలము. ఇందు రాజునకు నుండఁదగులక్షణములు చెప్పఁబడినవి. అందు దాతృత్వము సదాచారనిరతత్వము కులధర్మలక్షణత్వము చెప్పఁబడినవి

"స్వే స్వే కర్మణ్యభిరతస్సంసిద్ధిం లభతే నరః,
స్వకర్మనిరతస్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు." ౪౫
యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతం,

స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః. ౪౬
శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్,
స్వభావనియతం కర్మ కుర్వన్ నాప్నోతి కిల్బిషమ్. ౪౭

గీత. ౧౮ అధ్యా.

శుచినా సత్యసంధేన యథాశాస్త్రానుసారిణా,
ప్రణేతుం శక్యతే దండస్సుసహాయేన ధీమతా. ౩౧
స్వే స్వే ధర్మే నివిష్టానాం సర్వేషామనుపూర్వశః,
వర్ణానామాశ్రమాణాం చ రాజా సృష్టోఽభిరక్షితా. ౩౫
ఇంద్రియాణాం జయే యోగం సమాతిష్ఠేద్దివానిశం,
జితేంద్రియో హి శక్నోతి వశే స్థాపయితుం ప్రజాః." ౪౪

మను. ౭ అధ్యా.

అను నీప్రమాణములం బరికించిన రాజు సదాచారనిరతుఁడు దాత కులాచారములఁ బ్రవర్తించువాఁడుగా నుండవలయు నని తెలుచున్నది. స్వధర్మపరిరక్షకుఁడుగాని రాజు చిరకాలము రాజ్యమును బాలింపఁజాలఁడనుట స్పష్టముగా నీభాగము తెల్పుచున్నది. కులాచారముల రక్షించువాఁడనుటచేతఁ గులాచారములన్నియు నొక్కరీతిగా నుండవని తోఁచెడు. రామాయణకాలమునందును గులాచారములున్నవనిస్పష్టము.అనఁగాఁ గులాచారము లీనడుమవచ్చిన వనువాదము నిస్సారమనియు, నవి యెంతోకాలము నుండియున్నవనియు, నిద్దానిమూలమున స్పష్టమగుచున్నది. భగవద్గీతలయందుఁగూడ

"బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప,
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః." ౪౧

అని యున్నది. జాతిభేదములు తత్తదుచితకర్మములు నుండ

వలయుననియే శ్రీకృష్ణపరమాత్మ యనుగ్రహించెను. దానిని వలదనువారు భగవంతుని గౌరవింపనివారే యని తోఁచెడి. అట్టిపనికిఁ బూనకుందురుగాక యని మనము వారిని బ్రార్థింప వలయును. "రక్షితా జీవలోకస్య" అనువిశేషణము శ్రీరాముని పరమేశ్వరత్వమును వ్యక్తీకరించుచున్నది. తెలిసియొండెఁ దెలియకయొండె నెల్లవారు శ్రీరాముని భగవంతుఁడనియే కొని యాడుచున్నారనువిషయము మన మందఱుఁ బరికింపవల యును. సుమంత్రుఁడు లోకాపవాదము నీవిషయమున విశే షించి వ్యాపించునని పలికెను. దేనికి భయంపడకున్నను లోకాపవాదమునకు భయంపడవలయునని పెద్దలుపలుకుదురు. భగవద్గీతాశాస్త్రమునందును

"అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయాం,
సంభావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే. 34
భయాద్రణాదుపరతం మంస్యంతే త్వాం మహారథాః,
యేషాంచ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్. 35
అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః,
నిందంతస్తవ సామర్థ్యం తతో దుఃఖతరన్ను కిం. 36 అధ్యా. 2

అని శ్రీకృష్ణమూర్తి తెలిపెను. అపకీర్తికంటె మరణమే మేలనియు లోకాపవాదమునకంటె దుఃఖము వేఱుగాలేద నియు నిందు సారము.

"వాంఛా సజ్జనసంగమే పరగుణే ప్రీతిర్గురౌ నమ్రతా
విద్యాయాం వ్యసనం స్వయోషితి రతిర్లోకాపవాదాద్భయం,
భక్తిశ్శూలిని శక్తిరాత్మదమనే సంసర్గముక్తిః ఖలే
యేష్వేతే నివసంతి నిర్మలగుణాస్తేభ్యో నరేభ్యో నమః." 62

నీతిశతకము.

అని భర్తృహరి యుపదేశించెను. ఈవిషయమునే మహర్షి వాల్మీకి సుమంత్రునినోటఁ జెప్పించెను. నీతిసారము రామాయణమని మన మెఱుంగవలయుఁగదా.

"న రాజ్యం రాఘవః పాతు భవ త్వాం విగతజ్వరా,
న హి తే రాఘవాదన్యః క్షమః పురవరే వసేత్." 3-౯.

అని మూలము. రాముఁ డడవులకరిగిన నీపురమున నెవ్వరుండ రని సామాన్యార్థము. ఇందొక్కవిశేషము గలదు. సుమంత్రుఁడు సాధారణమంత్రి మాత్రుఁడు గాఁడు. మంత్రి సారథి యగునాచారము లోకమున నింత దనుక లేదు. ఇతఁడు సారథియునగు. అనఁగా రాజునకుఁ గలయాంతరంగికులలో నీతఁ డుత్తమోత్తముఁడని స్పష్టమగును. ఈసుమంత్రుఁడు పుత్త్రకామేష్టి దశరథుఁడు చేయుటకుముందే

"పుత్రాశ్చ్యాభవిష్యంతి చత్వారోఽమితవిక్రమాః,
వంశప్రతిష్ఠానకరాస్సర్వలోకేషు విశ్రుతాః.
ఏవం స దేవప్రవరః పూర్వం కథితవాన్ కథాం,
సనత్కుమారో భగవాన్ పురా దేవయుగే ప్రభుః. ౧౧.

బాలకాండము. ౧౧ సర్గము.

సనత్కుమారుఁడు తనతోఁ జెప్పినట్లు రాజునకుం దెల్పెను. యోగబలమున నమితాయుర్దాయముగలవాఁడు సుమంత్రుఁడని యీభాగము మనకుం దెల్పెడిని. సనత్కుమారుఁడు దశరథునకు నలువురుకొడుకులు సర్వలోకవిశ్రుతులు కలుగఁగలరని చెప్పినపుడు భగవంతుఁడే యవతరించునని చెప్పియుండునని మన మూహించుట పొరపాటుగాదు. సర్వలోకవిశ్రుతులు నలువురు కలుగుదురని భవిష్యత్ఫలము నెఱింగినమహర్షి భగ

వంతుఁడు ధర్మసంరక్షణార్థ మవతరించునని యెఱుఁగకయుం డునా? అట్టిమహర్షి యితరులకుం దెలుపక సుమంత్రునకు మాత్రమే తెలుపనేల? అని యూహించిన సుమంత్రుఁడు భక్తుఁడని శ్రీరామునకు సారథ్యరూపమగు శుశ్రూష చేసి కృతార్థుఁడు కాఁగోరి దశరథునకుంగూడ సారథియయ్యెనని లెడిని. కనుక శ్రీరామమూర్తి తత్త్వము నెఱింగినవాఁడే. యనక తప్పదు. కాఁబట్టి యీభాగమున విశేషార్థము లేకపోదు. కైక భగవత్కార్యార్థమే యవతరించినదని యెఱింగియే యుండును. కాని యోగమాయాచ్ఛాదితమతిగావున నెఱుం గనియట్లే యామెను నిందించెను. అయిన భక్తునినోట నేరూ పముననైన మంచిమాటలే వెలువడును. కాబట్టియే.

"న హి తే రాఘవాదన్యః క్షమః పురవశే వసేత్."

అని పలికెను. దేవీ! తేపురవశే=నీ యీయోగ్యశరీరమునందు రాఘవాదన్యః=శ్రీరామమూర్తికంటె వేఱొకఁడు, క్షమః = సమర్థుఁడు, న వసేద్ధి=నివసింపఁడుకదా. అని యర్థము. అనఁగా దేవీ! అడవులకు రామునిం బొమ్మనుచున్న దానవు. నీశరీరమున నంతర్యామిగా నున్నవాఁ డెవ్వఁ డనుకొనియెదవు? శ్రీరామ మూర్తియే సుమా.

"ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి,
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా."

అన్న భగవద్గీతార్థమే రామాయణమునఁ గలదు. కనుక దీని నుప పత్తినవలయును. నీ దేహాంతరమునయున్న యీశ్వరుఁడే శ్రీరాముఁడని యెఱుంగుమా కైకా యని సుమంత్రుఁడు తెలిపెననియే యిటఁగలసారము.

"పూషన్నేకర్షే యమ సూర్య ప్రాజాపత్య వ్యూహ రశ్మీన్ సమూహ తేజో యత్తే,
రూపం కల్యాణతమం తత్తే పశ్యామి
యోఽసావసౌ పురుషస్సోఽహమస్మి. ౧౬. ఈశావాస్యోపనిషత్తు.

పురి శయనాద్వా పురుషః=అని నిర్వచనము. ఈయుపనిషత్తు ననుసరించి పురమనఁగా శరీరమని యర్థము స్పష్టము.

"ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః,
యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః. ౧౭
యస్మాత్ క్షరమతీతోఽహమక్షరాదపి చోత్తమః,
అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః." ౧౮

గీత. ౧౫ అధ్యా.

"పురి శయనాత్పూర్ణత్వాద్వా పురుషః."

అని భాష్యము. ఈప్రమాణములన్నియుఁ బై యర్థమునే తెలుపుచున్నవి. ఇట్టు లెన్ని భంగుల నాకైక కను లోకాచారము ననుసరించి బోధించినను మహామాయాప్రోత్సాహిత యగుటచే నాకైక యించుకంతయుఁ జలింపకయుండెను. భగవత్సంకల్పమద్దియేకదా. ఇట్టు లీభాగము మనకుఁ గొన్ని నీతులను బోధించుచున్నది. ఇఁకఁ దరువాతికథను బరికింతము.

సిద్ధార్థుఁడు కైకను హితోపదేశము చేయుట.

*సుమంత్రునివాక్కులఁ గైక సమ్మతింపకపోఁగా రాజు సత్యపాశబద్ధుఁడై ప్రతిజ్ఞాపీడితుఁడై యూర్పులు తీవ్రరూపముల వెడలఁగా సుమంత్రునితో నిట్లనియె. మంత్రీ ! రాముని వెంటఁ జతురంగబలములు నమూల్యరత్నములు లోనగుపదార్థములు పంపవలయును. సిద్ధపఱుపుము. వేశ్యాజనములు రాము

* ఇయ్యది ముప్పదియాఱవసర్గమునుండి గ్రహింపఁబడినది.

ననుసరించిపోవునుగాక. వణిజులు ప్రతివిడిదిపట్టునందును సకల పదార్థముల నునిచియుందురుగాక. రాము నాశ్రయించి యెవ్వారు జీవింతురో, శ్రీరాముఁ డెవ్వారితోఁ గ్రీడించునో వారికిం గొఱంతలేకుండ వలయువస్తువు లొసంగి వెంటనుండఁ బంపుము. ఆయుధధారులు తైలాదులఁ గొనిపోవుభటులు పౌర ముఖ్యులు రామచంద్రునింగూడి పోదురుగాక. ఆటవికులు మార్గముచూపఁ బోవవలయు. బలములంగూడి నాకుమారుఁడు వనముల దుష్టమృగములఁ ద్రుంచుచుఁ దేనియలఁ ద్రాగుచు ననేకతరంగిణులం బరికించుచు రాజ్యవిషయమునఁ జింతలేక హాయిగా నుండుఁగాక. రామభద్రునివెంట ధనధాన్యకోశ ములు పంపవలయును. పుణ్యక్షేత్రములయందు యాగములు చేయుచు విధివిహితముగా దక్షిణల నిచ్చుచు ఋషులతోఁ గూడి రాముఁ డడవిని సుఖముగా నుండఁగలఁడు. మహా భుజుఁడు భరతుఁ డీపురమును బాలించుఁగాక. శ్రీరాముని కోర్కి కనుగుణముగా వలయువస్తువులం బంపుమని యాజ్ఞాపిం చెను. రా జిట్లు పలికినంతన కైక భీతినొంది మోము కాంతి వాయ డగ్గుత్తిక తోఁప దుఃఖము పైకొనఁగా రాజుం గాంచి యి ట్లనియెను.

మహారాజా! నీవు సజ్జనుఁడవు. ఇట్లు చేయరాదు. మను ష్యులు లేక పాడుపడి పయిఁగలతేట త్రాగఁగా శేషించిన మద్యమురీతి యమూల్యవస్తువిరహితమయియుండు నీరాజ్య మును భరతుఁ డంగీకరించునా? అని యిట్లు కైక ల జ్జయినలేక భీషణభాషణములు వినిపింప రాజామె కి ట్లనియె. పగదానవగు నోకైకా! దుర్భరభారము నాపై నిడితివి. మఱియు బాధించు

చున్నదానవే? ఏటికి? సైన్యములు లోనగువానిని రాముని వెంట నంప నాజ్ఞచేయ వలదందువే? ఏల? వరమడుగునపుడే యేల వలదనవైతివి? కాన నిపుడు పలు కంగీకరింప వలనుపడదు. అని క్రోధమున రాజు పలుకఁగా విని యామె పతి తనవాంఛితము నేదోకారణమునఁ బాడుచేయఁ దలఁచెనని రెట్టించిన యాగ్రహమున నతనితో నిట్లనియె. రాజా! ఈవంశమునం దే సగరుఁడను రాజు పెద్దకొడుకు నసమంజసుఁ డనువానిని వనము నకుఁ బొమ్మని వెళ్లఁగొట్టెను. వానితో సేనలం బంపెనా? వనము నకుఁ బోవువాఁడనఁగా నిర్ధనుఁడనియే యర్థము. అట్లే రాముఁడు కూడఁ బోవవలయును. అనఁగా రాజాగ్రహించి సీ! సీ! యని మఱేమియుఁ బలుకక యూరకుండెను. అందఱివా రామాట లకు విసుగుకొనిరి. కైకమాత్ర మవ్వారియీసడింపుల లెక్క పెట్టకయే యుండెను.

అప్పుడె నందేయున్న రాజు మన్నించుమంత్రిసిద్ధార్థుఁడు కడువృద్ధుఁడు పరిశుద్ధాంతరంగుఁడునుగానఁ గైకతో నిట్లు పలి కెను. దేవీ! నీవు తెలిపిన యసమంజసుఁడు దుష్టబుద్ధియై త్రోవలఁ బోంచియుండి బాలురం బట్టుకొనిపోయి నదీజలములఁ బడవైచుచుండెను. వారు మునిఁగినందులకు గుఱుతుగా బుగ్గలులేవఁగా నవ్వుచు నదియే విహారముగా నుండెను. పౌరు లాతనిక్రూరకృత్యముం గని కోపించి సగరచక్రవర్తితోఁ గొడుకునుంచుకొని మమ్మైనఁ బంపుము. లేదేని వానిం బంపు మనిరి రా జులికిపడి వారింగాంచి మీకీభయముగలుగఁ గారణ మేమని ప్రశ్నించెను. వా రాతనిపనినంతయుఁ దెలిపిరి. రాజా పలుకు లాలించి వారికిఁ బ్రియముచేయువాఁడై జ్యేష్ఠపుత్త్రుని

బాలుఁదోలెను. కొడుకు భార్యను బరిజనులను బిలుచుకొని వాహనము నెక్కి పోఁదగునని యాజ్ఞాపించెను. యావ. వము వనముల నుండవలయునని శాసించెను. వాఁడు పాపాత్ముని రీతిగా వనములలోఁ దిరుగుచుఁ గందమూలాదులం ద్రవ్వి కొని బ్రదుకుచుండెను. మహాపరాధము చేసినకొడుకును బరమ ధార్మికుఁడు గావున సగరచక్రవర్తి వదలిపెట్టెను. అసమంజ సునిరీతి నడవులకుం బాఱఁద్రోలఁ దగినపాపమును శ్రీరామ మూర్తి యేమైనఁ జేసినాఁడా? ఈశ్రీరామునియందు దుర్గుణ లేశమేదియుఁ గానరాదు. మాలిన్యము చంద్రునియందు లేనట్లు రామునియందు దోష మణుమాత్రమును లేదు. తల్లీ! రామునం దేదేని దోష మగపడినచో నిపుడు దాఁపక తెల్పుము. రాము నడవికింబంపఁదగిన రాజు పంపును. దౌష్ట్యమనునదియే లేక సన్మార్గమునందే యాసక్తిగలిగియున్నవానిని వదలుటధర్మము గాన, నట్టిదుష్టకార్యమున నింద్రునంతవానికైనఁ దేజము రూపుమాయును. శ్రీరాముని గష్టపెట్టుటఁ జాలింపుము. అధర్మదోష మట్లుండనిత్తము. లోకమునఁ గల్గు నపకీర్తినైన రాకుండఁ జూచుకొనవలయుఁగాదా. అని సిద్ధార్థుఁడుపలుకఁగా విని రాజు వగపుచే మాటలు తడఁబడఁగాఁ గైకతో నిట్లు పలికెను. దుష్టవర్తనముగలకైకా! ఈమంత్రిమాటల నంగీకరింపవా? ఇపుడు నీవు నీమేలును నామేలునుగూడఁ దెలియఁ జాలక యున్నదానవు. కుమార్గము నాశ్రయించి నీచకార్యముఁ జేయుచున్నావు. నీచర్య సన్మార్గమున కనుకూలము కాదుసుమీ. నేనిత్తఱి రాజ్యాదులవదలి నాకొడుకువెంటఁబోవుదును. నీవు

ప్రభువగుకుమారునితో నిందు సుఖముగా రాజ్యము నేలుచుఁ జిరకాలముండుము.

మహాశయులారా! ఈభాగమునఁగల విశేషములఁ బరిశీలింతము.

"రూపాజీవాశ్చ వాదిన్యో వణిజశ్చ మహాధనాః,
శోభయంతు కుమారస్య వాహినీం సుప్రసాదితాః." 3

అని మూలము.

"వాదిన్యః పరచిత్తాకర్షణ చతురవచనాః రూపాజీవాః వేశ్యాః."
అని వ్యాఖ్య.

ఇది దశరథుఁడు చెప్పినవాక్యము. రాముఁడు చతురంగబలములతోఁ బోవలయునని యాజ్ఞాపించి యందు సైనికులను సొంపగుమాటలచే మనస్సులఁగరఁగించుచు వేశ్యలు పోవలయునని రాజు పల్కెను. ఈవాక్యమును బరికించినంతనే యీకాలమున నిట్టియనాచారములు పెక్కులున్నవని తోఁచును. కాని పరిశీలించినయెడలఁ నాయాచారము మంచిదిగనే తోఁచును. అరయుదము. వాదిన్యః రూపాజీవాః. పరచిత్తముల నాకర్షింపఁజాలు చమత్కృతిగలమాటలం బల్కు వేశ్యలనికదా ఈవాక్యమున కర్థము. ప్రాయికముగా సంగీతాభినయములు రెండును దుఃఖమును దొలఁగించి యానందమును జేకూర్పఁజాలునవియే. ఇందు వేశ్యలఁ బంపుట శ్రీరామునకు సంతోషము నుత్పాదింపఁగాదు. సేనలకనియే మూలమున నున్నది. వీరభటుఁడనఁగాఁ బ్రాణముల నర్పించి వీరస్వర్గమును గైవసముచేకొనఁ గోరువాఁడనికదా తాత్పర్యము. అట్టివారలకు నుత్సాహము కలిగించుటకుగా వేశ్యలను రాజులే రక్షించుచుండు

వారు. వారు వాక్చాతుర్యమునను సంగీతాభినయముల చేతను బరుల నుత్సాహవంతులనుగాఁ జేయుచుందురు. అంతియగాని దుర్వృత్తిచే జీవించువారు కారని తోఁచెడిని. దుర్వృత్తిగల వారిని ధర్మరక్షణతత్పరుఁడగు రాజు రక్షించుచు సేనలతోఁ బంపెననుట విశ్వాసపాత్రము కాదు. నాట్యశాస్త్రమున నిష్ణాత లగుస్త్రీలు తదభ్యాసబలమున భగవదారాధనతత్పర లగుదురే కాని వ్యభిచారవృత్తికలవారు కానేరరు. నాట్యకళోపాస నము భగవత్కైంకర్యమే యని యెఱుంగవలయును. ఆజాతి యందుఁ గొంద ఱట్టి నీచవృత్తి యలవఱచుకొనువా రుండ వచ్చును. వారు ప్రాయికముగా నాట్యశాస్త్రారాధనము చేయు వారుగా నుండరని మన మూహింపవలయును.

"భరతశ్చ మహాబాహురయోధ్యాం పాలయిష్యతి,
సర్వకామైస్సహ శ్రీమాన్ రామస్సంసాధ్యతామితి." ౯

అని మూలము. దశరథోక్తి యిది. సోపాలంభోక్తి యని వ్యాఖ్యాత లనిరి. దశరథునిభావ మూహించిన వాస్తవముగనే యనినట్లు తోఁచెడిని. కైకయందు రాజునకుఁ గోపము కలుగ వచ్చును. కాని భరతునియందుఁ గోపముండుటకుఁ గారణము లేదు. కైక భరతునికొఱకు వరములడిగెనుగాన నతనిమూల మునఁగదా యీయనర్థము సంభవించెనన్న యాగ్రహ ముండఁ గూడదా యనవచ్చును. కాని చిన్నటనాటనుండి భరతశత్రుఘ్నులయాశయ మెఱింగినరా జంతటియవివేకముగా నూహిం చునా యని మన మూహింపవలసియున్నది. భరతుఁడు రాజ్య మును బాలించుఁగాక. శ్రీదేవీసహితుఁడగు రామచంద్రుఁడు సర్వకామములతోఁ బ్రయాణము సాగించుఁగాక. అను నీ

వాగ్ధోరణినిబట్టి పరికింపఁగా భావిపాదుకాపట్టాభిషేకము సూచింపఁబడియెడిని. సర్వకామములతో ననఁగాఁ దన పేర రాజ్యమును నిమిత్తమాత్రము రాజుగా భరతుఁడు పాలించుచుండఁగా శ్రీమహామాయాసహితుఁడై రాముఁడు దండకారణ్యములకుం బోవుఁగాక యని దశరథునివదనమునుండి దైవికముగా వాక్కు వెడలెనని తోఁచుచున్నది. ఎల్లవారును రాఁగలఫలమును సూచించుప్రవర్తనము కలవారలే యగుదురనుట స్పష్టము. కావున నానియమప్రకారము దశరథుఁడు పలికెననుటలో వింత యేమియు లేదు.

"ఏవం బ్రువతి కాకుత్స్థే కైకేయ్యా భయమాగతం,
ముఖం చాప్యగమచ్ఛోషం స్వరశ్చాపి న్యరుధ్యత. ౧౦
సా విషణ్ణా చ సంత్రస్తా ముఖేన పరిశుష్యతా,
రాజానమేవాభిముఖీ కైకేయీ వాక్యమబ్రవీత్." ౧౧

అని మూలము. ఆమాటలకుఁ గైక భయపడి రాజున కిట్టులనియె. అని సామాన్యార్థము. "కాకుత్స్థే ఏవం బ్రువతి సతి కైకేయ్యా భయమాగతమ్" అనికదా యన్వయక్రమము. ఇట్లు దశరథుఁడు పలుకుచుండఁగాఁ గైకకు భయముకల్గెను. అనఁగా భగవంతుని యాశయము దండకారణ్యగమనముకాన దానికిఁ గారణభూతురాలు కైకయే కావున నామె మృదుమానసముకలదైనఁ దనకార్యమునకు సాధనాంతరము కావలసివచ్చునని యాలోచించుపరమేశ్వరు నాశయమున నామెకు భయముతోఁచెనని యర్థము స్ఫురించెడు. భయమనఁగాఁ గార్యాతురత్వమని యర్థము. ఆభయమేకదా పట్టినపట్టు వదలక యుండఁజేసినది. భయపడినవారు కార్యమును వదలుకొందురుగాని చేయఁబూనుదురా? కావున భయమనఁగాఁ గార్యపరత్వమనియే

యర్థము. దేవకార్యమునకు విఘ్నము కలుగరా దనుభగవంతుని యూహ ఫలింపకమానదు. కానఁ బరవశయగుకైక యేమి చెప్పిన నది భగవత్స్మృతమనియే మన మూహింపవలయును. కైక నిర్దోషురాలనుట యీభాగము మనకుఁ దెలుపుచున్నది.

"తవైవ వంశే సగరో జ్యేష్ఠపుత్రముపారుధత్,
అసమంజ ఇతి ఖ్యాతం తథాయం గంతుమర్హతి." ౧౬

అని కైక పలికినది. దీనిసారమేమి? రాజా! ధర్మమాలోచింపుము. నీ వేవంశమునఁ బుట్టితివో యావంశముననే పుట్టినపూర్వకాలమున విఖ్యాతిగాంచిన సగరచక్రవర్తి ప్రజాక్షేమమును గోరి కుమారునిగూడ వదలుకొనెను. అనఁగాఁ దమపని ప్రజారక్షణము గోరునదియేకదా. ఇప్పుడు కేవల ప్రజాహితమేకాక ధర్మరక్షణము దేవతాకార్యమునను ననేకకార్యములు ఫలింపవలసియున్నవి. ఇన్ని కార్యములు ఫలింపవలయునన్నకోరికతో శ్రీరాము నరణ్యములకుం బంపుమని కైక పలికెను. సగరచక్రవర్తికంటె నీవికార్యమున మహోపకారము లోకమునకు నొనరించి కీర్తి గడింపుమా యనియే కైక యాశయము. ఇందుఁగలనీతి సిద్ధానిని మనము గ్రహింపవలయును? "రాజా ప్రకృతిరంజనాత్" అన్న నానుడి ననుసరించి రాజు ప్రజలహితమునకై సర్వము వదలవలయుననియు నట్టివాఁడే రాజనం బడుననియు నీతి.

"సమీక్ష్య స ధృతస్సమ్యక్సర్వా రంజయతి ప్రజాః,
అసమీక్ష్య ప్రణీతస్తు వినాశయతి సర్వతః." ౧౭ మను ౭. అధ్యా.

అన్నస్మృతియుఁ బైవ్రాసినభావమునే తెలుపుచున్నది. ప్రజాహితమన ధర్మరక్షణమనియే తాత్పర్యము.

"అదుష్టస్య హి సంత్యాగస్సత్పథే నిరతస్య చ,
నిర్దహేదపి శక్రస్య ద్యుతిం ధర్మనిరోధనాత్. ౨౯
తదలం దేవి రామస్య శ్రియా విహతయా త్వయా,
లోకతోఽపిహి తే రక్ష్యః పరివాదశ్శుభాననే." ౩౦

అని సిద్ధార్థుఁ డనుమంత్రి కైకకుం దెల్పెను. ఇందలినీతి యే మనఁగా. సన్మార్గమున వర్తించుచు దుష్టత్వము లేనివానిని వదలినయెడల నింద్రుని భాగ్యముకూడఁ దగులఁబడును. లోకాపవాదమున కెవ్వఁడుగాని భయంపడక తప్పదని యెఱుంగవల యును. ఇట్టినీతుల నీభాగము తెలుపును. ఇఁకఁ దరువాతి కథాంశమును బఠింతము.

శ్రీరామాదులు వల్కలముల ధరించుట.

*శ్రీరాముఁ డీరీతి సిద్ధార్థుఁడు తెల్పినపద్ధతి నాలకించి వినయజ్ఞుఁడు కావునఁ దండ్రి కిట్లనియె. మహారాజా! నేను భోగములనెల్ల మాని వనమున ఫలమూలాదులభక్షించి జీవించువాఁడ. కొందఱకు భోగము వదలినను సంగము వదలదు. నేనో సర్వసంగములను మానినవాఁడను. కావున నేనలతో నేమిలాభము? భద్రగజమునొసంగి దానియందలి మోహమును వదలినవానికి నడుమఁ గట్టుత్రాటియందు మనస్సుండునే నేమి లాభము? సత్పురుషవరేణ్యుఁడవు. కనుక నే వచించుసద్విషయము నాలకింపుము. పైఁజెప్పినయుదాహరణమురీతిగా రాజ్యాదుల వదలిననాకు సేన యెందులకు? నీవు నాకొసంగినవానినెల్ల భరతునకు నిచ్చుచున్నాను. ఏకార్య మెట్లు చేయవలయునో నే నెఱుంగుదును. నారచీరలు తెప్పింపుము. పదునాలుగుసంవ

* ఇది ముప్పదియేడవసర్గమునుండి గ్రహింపఁబడినది.

త్సరములు వనముల నుండును. మాకెల్లఁ గందమూలాదులు తెచ్చుకొనుటకై వలయుసాధనములు తెప్పింపుము.

అని రాముఁడు పలుకఁగాఁ గైక యంతటనుండు సిగ్గు మాని తానే నారచీరలఁ దెచ్చి రామా! వీనిం దాల్పుమని పల్కెను. పురుషోత్తముఁ డామెయిచ్చినవస్త్రములను రెండింటిని గైకొని యమూల్యవస్త్రముల వదలి మునియోగ్యములగు వానిని ధరించెను. లక్ష్మణుఁడు రామునివలె వానిం గట్టుకొనియెను. పట్టుచీరఁ గట్టుకొన్న జానకి తనకై తెచ్చియున్న వల్కలమును గాంచి వలనుజూచిన హరిణమువలె భయపడెను. సులక్షణములుగల యాసుహాసమాయ తనమనస్సు తత్తఱపడుచున్నను సాధ్వీధర్మము లెఱింగినవిదుషీమణియుఁ దనయనుష్ఠానబలమున లోకమునఁగల పురంధ్రీగణమునకుఁ బాతివ్రత్యధర్మము లెఱిఁగించునదియుఁ గావునఁ గైకయొసంగినవల్కలముల నత్యంతలజ్జాతరంగితాంతరంగ యగుచు గ్రహించి ధరించుచుఁ దామరలంబోలుకన్నులనుండి నీరు గ్రమ్మఁగా గంధర్వరాజువలె మెఱయు ప్రాణేశ్వరుం గాంచి యిట్లనియె. నాథా! అడవులఁ గాపురముండుమునులు నారచీరల నెట్లు తాల్తురు? చెప్పుమని యడుగుచు వానిని గట్టుకొనునుపాయము తెలియక యూరకయుండెను. మరల నాజానకి యావల్కలములలో నొక్కదాని మెడపై వైచుకొని వేఱొకదానిఁ జేఁబట్టుకొని కట్టుకొనుటకు వలనుపడమి సిగ్గుతో నిలుచుండెను.

ధర్మాత్ముఁడగు శ్రీరామమూర్తి యావిధ మెఱింగి సీత దగ్గరకు వచ్చి పట్టుపుట్టము ధరించియున్నదికాన దానిపై నా వల్కలమును గట్టెను. పురుషోత్తముఁ డట్లు నారచీరఁ గట్టుట కన్నులారఁ గాంచి యంతఃపురకాంతలు కన్నీటిధారలు వెల్వ

డఁగా వగచిరి. రామునింగని తండ్రీ! మతిమంతురాలగు జానకి వనముల కరుగవలయునన్న శాసనము లేదుకదా. ఆశాసనము నీకు నొక్కనికేకదా. నిర్జనంబగు నడవికి నీవు పోవఁగా మరల నీవు వచ్చుదనుక నిన్నుం గాంచునట్లు లీబిడం గాంచుచు మానేత్రముల కానందమును జేకూర్చుకొనుచుందుము. ఆ ఫలము మాకుఁ గలిగింపుమా. కుమారా! లక్ష్మణుఁడు తోడుగా నుండ నడవికిం బొమ్ము. కల్యాణముల కాటపట్టగు నీజానకిని ఋషింబోలె వనముల నడిపింపరాదు. మే మొక్కటి వాంఛింతుము. ఆవాంఛితము నెఱవేర్పుము. నీభార్య యిందే యుండునట్లు చేయుటయే యావాంఛితము. నీవుకూడ నుండవలయు ననియే కోరుదుము. ఐనను ధర్మైకవర్తనుఁడవగు నీవు నిలువ నంగీకరింపనని యెఱుంగుదుము. జానకినైన నిట నునిచి పొమ్మని వేఁడిరి. ఎన్నివిధముల వారు వేఁడినను గైక యందుల కంగీకరింపనందున బదులు పలుకక నారచీర గట్టుచునుండెను.

అట్లు సీత వల్కలమును ధరింపఁగా రాజగురువగు వసి ముని లేచి యావస్త్రమును గట్టుకొనవలదని నివారించుచుఁ గైకదిక్కుచూచి యిట్లు పలికెను. కైకా! నీవు మేరమీఱి వర్తించుచున్నదానవు. దుర్మతిఁ బూనితివి. కులధర్మములను బాడుచేయుదానవు. రాజును వంచించుటయేగాక మఱియు మర్యాద వదలి క్రూరత్వమునకుఁ బాల్పడుచున్నదానవు. దుశ్శీలముకలకైకా! జానకి వనమునకుఁ బోవరాదు. రామచంద్రునకుగా సిద్ధపఱచినసింహాసనము నీసీత యధిష్ఠించుఁగాక. రాజ్యముఁ బాలించుచుండుఁగాక. గృహస్థులకు భార్యయే యాత్మయని శాస్త్రము కలదుకదా. శ్రీరామునకు సీత యాత్మ కావున నాతఁడు పాలింపఁదగినరాజ్యమును బాలించుచుండును.

అట్లుగాక సీత రాముని౦గూడి వనమున కరుగునేని మేముం బోయెదము. పౌరులందఱును బోవఁగలవారు. దండనాథులు పోదురు. రాజేంద్రుఁడు తత్పరివారము జనపదవాసులు వారు వీరననేల. యందఱు రామునివెంట నరుగుదురు. భరతశత్రుఘ్నులు వల్కలములందాల్చి వనమునను న్న శ్రీరాము ననుసరించియుందురు. దురాచారమును బూని ప్రజల కహితమును గోరియున్న నీవు నిర్జనమయి పాడుపడిన యీరాజ్యము నీ వొక్కతుకవే యేలుచుండుము. రాముఁ డేచోటఁ బ్రభువుగా నుండఁడో యది రాజ్య మనిపించుకొనదు. రాముఁడుండు చోటు రాజ్యమే కాఁగలదు.

భరతుఁడు దాశరథి యగునేని మనఃపూర్వకముగాఁ దనకుఁ దండ్రి యీయనిరాజ్యముఁ బాలింపఁదగదు. తండ్రి నిట్లు వంచించిన నీవిషయమున మాతృభక్తిని జూపుట యాత నికి న్యాయముకూడఁగాదు. నీవీభూమినుండి వ్యోమమునకెగ సినను బితృవంశప్రవర్తనమును, జ్యేష్ఠుఁడర్హుఁడుండఁగా నను జునకు రాజ్యమొసంగఁగూడ దన్న యాచారమును దెలిసిన వాఁడుగా నున్న భరతుఁడు న్యాయమును వదలి నీవాంఛితము రీతిఁ బ్రవర్తింపఁడు. శ్రీరాము ననుసరింపనివాఁడు లోకము నందే కనఁబడఁడు. ఇఁక భరతునిమాట చెప్పనేల? పుత్త్రుని యందుఁగల నెయ్యమున రామున కిట్టిపాటులు కల్పించి రాజ్య మును నీవు గ్రహించినను రామునియందు భక్తిగలభరతున కిది యెంతమాత్రము సమ్మతముకాదు. విశేషించి యప్రియమే యగును. పశువులు లోనగునవియుంగూడి రాము ననుస రించిపోవుచుండఁగా నీవిపుడే చూడఁగలవు. వృక్షములుగూడ రామాభిముఖములై పోవఁ బూనినట్లుండుట నీకగపడఁగలదు.

దేవీ! ఇంకనైన నీకోడలు సీతకు వల్కలముల మాని యమూల్యాభరణములనిమ్ము. నారచీర యీసీత కిమ్మన్న విధి లేదు. ఇచ్చుటయే యనర్థము. అని పలుకుచు సీతాదేవీ! వానిని ధరింపకుమా యని నివారించెను. మరలఁ గైకం జూచి రాముఁడొక్కఁడే యడవినుండఁదగుననికదా నీవు కోరితివి? జానకియు నట్లే యుండవలయునని కోరలేదుకదా. నిరంతర మలంకారార్హయగుసీతాదేవి భూషణములఁ బెట్టుకొనియే రామునింగూడి యడవినుండుగాఁక. ఉత్తమవాహనములు పరిచారికలు వెంట రాఁగా నమూల్యవస్త్రములతో బంగారుపాత్రములు లోనగు వస్తువులతో వనికేగుఁగాక. వరము వేఁడుతఱి సీతంగూడి రాముఁడడవులనుం బోవలయునని యడుగలేదు. అని మహానుభావుఁడు కులగురువు నగువసిష్ఠముని పలుకుచున్నను సీత ప్రాణేశుని వేషమునే యనుసరించునదియై యతనివలె వనమున నుండఁ గోరినది కాన వల్కలధారణము నుజ్జగింప నెంచకయుండెను.

మహాత్ములారా! ఈభాగమునఁ బెక్కువిశేషములుగలవు. జ్ఞాననిధి త్రికాలవేత్తయు నగువసిష్ఠముని బోధించుధర్మములత్యుత్తమములనుట కే శంకలుండవు. కావునఁ బరికింతము.

"త్యక్తభోగస్య మే రాజన్ వనే వన్యేన జీవతః,
కిం కార్యమనుయాత్రేణ త్యక్తసంగస్య సర్వతః. ౨
యో హి దత్త్వా ద్విపశ్రేష్ఠం కక్ష్యాయాం కురుతే మనః,
రజ్జుస్నేహేన కిం తస్య త్యజతః కుంజరోత్తమం. 3
తథా మమ సతాం శ్రేష్ఠ కిం ధ్వజిన్యా జగత్పతే,
సర్వాణ్యేవానుజానామి చీరాణ్యేవానయంతు మే." ౪

అని మూలము. ఇది రామోక్తము. సామాన్యార్థము సుగమము. విశేషార్థమేది? త్యక్తసంగస్య సర్వతః = సర్వవిధముల

సంగముఁ ద్యజించినవాఁడను. ఎవరితోడ్పాటు నాకు వలదని భావము. నిస్సంగుఁడనని సారము. అట్టి నాకు సైనికులతోడ్పా టేల? సర్వశక్తులుగల నాకేల యొరులసహాయ మనియే శ్రీరాముని యాశయము. వనే వన్యేన జీవతః=వనమునఁగలపదార్థము లనఁగాఁ గందమూలాదులఁ దిని కాలముఁ బుచ్చువాఁడను. ఇయ్యది దీక్షానియమముఁ దెల్పుచున్నది. మహాకార్యము సాధింపఁబూనువాఁడు వ్రతోపవాసము లొనరించి దైవశక్తిని సముపార్జించుకొని కార్యమును సాధింపవలయును. ఆహారనియ మముఁ బాటింపవలయును. మనోబలమును బెంపొందించునవి కందమూలాదులని పెద్దలందురు. సర్వవస్తువుల నిచ్చితిని. నార చీరలే యిపుడు కావలయు. వానిం దెప్పింపుమా యని భావము. మహాకార్యమునకుఁ బూనువారు దీక్షఁ బూనుదురు. దానికి నూత్నవస్త్రములు కావలయును. ఇంతదనుకఁ గలయనుభవము లిపుడు పనికిరావు. క్రొత్తవిధములగువస్త్రములను ధరించి నూత్నసంకల్పమునకుం బూని మునివృత్తి నవలంబించి భగవ దనుగ్రహమునకుం బాత్రులై కార్యము సాధింపవలయు నన్న భావ మిందు సూచింపఁబడినది. "చీరాణ్యేవానయంతు మే" అని రామమూర్తి పలికెను. ఏవకారముచేత శ్రీరాముని దృఢసం కల్పితము సూచింపఁబడినది. వేదవేదాంగపారగుఁడగు రావ ణుని మునివృత్తి నవలంబించియే వధింపవలయునన్న భావము కూడ నిం దిమిడియున్నదని కొందఱందురు. అదియు యుక్తి యుక్తముగనే యున్నదని గ్రహింపఁదగియున్నయది.

"అథ చీరాణి కైకేయీ స్వయమాహృత్య రాఘవం,
ఉవాచ పరిధత్స్వేతి జనౌఘే నిరపత్రపా." ౬

అని మూలము. కైక తానే నారచీరలు తెచ్చి రామా ధరింపు మని యిచ్చెను. జను లేమనుకొందురో యనుల కూడ నామె కుం దోఁపలేదు. అని సామాన్యార్థము. ఇఁక నాలస్యముచేయ రాదు. మాటలతోఁ బ్రొద్దుపోవుచున్నది. అని మహామాయ సంకల్పింపఁగా నయ్యది కైకను బురికొలిపెననియు వెంటనే యామె యానారచీరలు తెచ్చియిచ్చెననియు గ్రహింపఁదగును. అపుడు నారచీర లెక్కడివి? అని కొందఱు ప్రశ్నింతురు. చీర లనఁగాఁ గొందఱు నారతో సిద్ధముచేసినవస్త్రములని యర్థము చెప్పుదురు. చీరశబ్దము సంస్కృతము. చీరవల్కలశబ్దములు సమానార్థకములు.

"చీరాణి కిం పథి న సంతి దిశంతి భిక్షాం నైవాంఘ్రిపాః
పరభృతస్సరితో౽ప్యశుష్యన్."

అని భాగవతము తెల్పుచున్నది.

"పూర్వజస్యానుయాత్రార్థం ద్రుమచీరైరలంకృతః."

అని రామాయణముననే కలదు. చీరశబ్దమునకు "వస్త్రభేదః" అని నిఘంటువులయం దర్థము వ్రాయఁబడినది. వృక్షముల పైభాగమునఁ గలపట్టను జీల్చి నేసినవస్త్రములని కొందఱందురు. ఆయర్థము పరిహాసపాత్రము. వీనినెల్లఁ బరికింపఁగా ధనవంతులు ధరింపయోగ్యములుగాక నిర్ధనులు ధరింప ననువగువస్త్రములని యర్థము తేలెడిని. అవి రాజులు ధరించునెడలఁ గష్టముగనే తోఁచ వచ్చును. తటాలున కైక తెచ్చియిచ్చెననఁగా నర్థమేమి? ఆ వస్త్రములు సులభలభ్యములనియే కాక మఱేమగును? శ్రీరాముఁ డంతకుముందు ధరించువానిని వీనిని బరికించినఁ గ్రొత్తగాఁ దోఁపవచ్చును. కాని చెట్లపట్టలు కావు. మహర్షులుకూడ సులభ

లభ్యములగువానినే ధరింతు రనుకొనవచ్చును. నారికేళవృక్షములయందుఁ గనంబడుచు వస్త్రములవలెఁ దోఁచుచుండునవని కొందఱందురు. అవి ధార్యము లెట్టులగునో తోఁపకున్నది. ఎన్నిభంగుల నూహించినను పైవ్రాసినయర్థమే సుసంగతమని తోఁచెడు.

"అథాత్మపరిధానార్థం సీతా కౌశేయవాసినీ,
సమీక్ష్య చీరసంత్రస్తా పృషతీ వాగురామివ. ౯
సాప్యపత్రపమాణేవ ప్రగృహ్య చ సుదుర్మనాః,
కైకేయీః కుశచీరే తే జానకీ శుభలక్షణా. ౧౦
అశ్రుసంపూర్ణనేత్రా చ ధర్మజ్ఞా ధర్మదర్శినీ."

అని మూలము. కుశచీరే=ఇందుఁ గుశశబ్దమునకు దర్భ యర్థమా కాదా యని ప్రశ్నము. దర్భవలెఁ దాఁకిన మెత్తగానుండనివని యర్థమని కొందఱు పెద్దలభావము. దర్భతో నేసినవని కొందఱందురు. అవి ధార్యములు కావచ్చునా యనుసంశయమంకురింపకమానదు. ముదుకవస్త్రములని యర్థము చెప్పుటయే సమంజసముగాఁ దోఁచెడిని. ధనవద్ధార్యములు కానివని యర్థము.

"తస్యాస్తత్క్షిప్రమాగమ్య రామో ధర్మభృతాం వరః,
చీరం బబంధ సీతాయాః కౌశేయస్యోపరి స్వయం." ౧౪

అనుమూలము పైనివ్రాసినయర్థమును దృఢపఱచుచున్నది. ట్టుపుట్టము మీఁదఁ గట్టెననఁగా నది యమూల్యము ఇది మత్యల్పమూల్యముగా నుండునదియగుటఁ, జూచువారల కేవ ంపు గల్గింపఁజాలునది యని యర్థము. సారము ముదుకవస్త్రము నియే కాని వేఱు కాదు.

"చీరే గృహీతే తు తయా సమీక్ష్య నృపతేర్గురుః,
నివార్య సీతాం కైకేయీం వసిష్ఠో వాక్యమబ్రవీత్." ౨౧

అని మూలము. త్రికాలవేత్తయగుముని యేల యాక్షేపించెనని కొందఱందురు. భావికాలగతుల నరసియే యాక్షేపించెను. రత్నభూషణములఁదాల్చియే సీత పోవలయును. లేకున్నఁ గథాభాగమునకుఁ గొంత బాధ కల్గును. లంకాగమనకాలమున నీ భూషణములసంగతివలని లాభము తేటపడును. ఆవిధ మెఱింగియే ముని కైక నాక్షేపించెనని మన మెఱుంగవలయును. లేక భావికర్మము మునిఁ బురికొలిపెననియు దాన నాతఁడాగ్రహించి పలికెననియు గ్రహింపవలయును.

"న గంతవ్యం వనం దేవ్యా సీతయా శీలవర్జితే,
అనుష్ఠాస్యతి రామస్య సీతా ప్రకృతమాసనం. ౨౩
ఆత్మా హి దారాస్సర్వేషాం దారసంగ్రహవర్తినాం,
ఆత్మేయమితి రామస్య పాలయిష్యతి మేదినీం. ౨౪
అనుయాస్యతి వైదేహీ వనం రామేణ సంగతా,
వయమప్యనుయాస్యామః పురం చేదం గమిష్యతి." ౨౫

అని మూలము. ఇవియును వసిష్ఠోక్తులే. సామాన్యార్థమును బరిశీలించిన ముని కైకయందుఁ గలకోపముచే సీత రాజ్యమును బాలించునని తెల్పెనని తోఁచును. దానికిం దగినకారణముఁ గూడ మునియే తెల్పెను. గృహస్థులకు భార్యయే యాత్మ. రామున కాత్మయగు సీత భూమిని బాలింపవచ్చునని ముని యొసంగిన కారణము. దీనిభావమేమి? పురుషుఁడు నిర్గుణస్థానీయుఁడు. పత్ని ప్రకృతిస్థానీయురాలు. సర్వకార్యము లొనరించునది ప్రకృతి. నిర్గుణుఁడు సాక్షిమాత్రుఁడై చూచుచుండు.

తదాశయ మెఱింగియే ప్రకృతి ప్రవర్తించును. ఆమె ప్రవృత్తిని నిర్దేశించువాఁడు పరమపురుషుఁడు. అనఁగా భగవంతుని సంకల్ప మెఱింగి సర్వకార్యములను బ్రకృతి స్వతంత్రురాలై యొనరించును. ప్రకృతిఁగూడక పురుషుఁ డేకార్యము చేయఁజాలఁడు. శ్రీరాముఁడు రాజ్యము పాలింపఁడు. సీత ప్రకృతిగాన నామెయే పాలించును. అనఁగాఁ బ్రకృతికే యాయధికారము. సీత యంతఃపురమున నుండునదికదా యని యడుగుదు రేమో. లోకదృష్టికి నట్లు తోఁచును. కాని వారిరువురకు విరహ మసంభవము. అను నీభాగమునుబట్టి దంపతికృత్యము స్పష్టము. సగుణమే యుపాస్యము. నిర్గుణము ధ్యానగమ్యము. అనువిశేష మిందుఁ దెలుపఁబడినది. అవయవిని ధ్యానించి పూజించిన నదియెల్ల సగుణమే యనఁబడు. తేజోరూపునిగా భగవంతుని ధ్యానింపవలయును. దీనికే శాక్తమని పేరు. సురామాంసభక్షకులు శాక్తులు గారు. అట్టివారు లేరా యన్న వైష్ణవులలోను గలరు. భ్రష్టు లన్ని మతములయందును గలరు. సురామాంసభక్షణము శాక్తధర్మము కాదు. ప్రకృతి నుపాసించిన సర్వదేవతలను ద్రిమూర్తుల నుపాసించినట్లే యని యెఱుంగవలయు.

"త్రయాణాం దేవానాం త్రిగుణజనితానాం తవ శివే
భవేత్పూజా పూజా తవ చరణయోర్యా విరచితా,
తథా హి త్వత్పాదోద్వహనమణిపీఠస్య నికటే
స్థితా హ్యేతే శశ్వన్ముకులితకరోత్తంసమకుటాః." ౨౫

ని సౌందర్యలహరియందు శ్రీశంకరభగవత్పాదులుగారు నిర్వచించిరి. బ్రహ్మవిష్ణురుద్రేశ్వరసదాశివులను ప్రేతపంచకముపై...

నధివసించును. కావుననే "పంచప్రేతాసనాసీనా" అనుపేరు మహాప్రకృతికిం గల్గెను. ఏమూర్తిని బూజించినను శక్తిని బూజించినట్లే యని యెఱుంగుటయే బుద్ధిమంతులలక్షణము. ప్రకృత్యతీతుండొక్కఁపరమపురుషుండే. ఆతత్త్వము నిర్గుణము. అను నీవిషయము లిద్దానినుండి తెలిసికొనఁదగినవి.

"భరతశ్చ సశత్రుఘ్న శ్చీరవాసా వనేచరః,
వనే చరంతం కాకుత్థ్స మనువత్స్యతి పూర్వజం." ౨౯

అని మూలము. భరతుఁడు రాజ్యము పాలింపక శ్రీరాముని వంటివేషముతో నందిగ్రామమున నుండుననుభావివార్త యిట సూచింపఁబడియె.

"న హ్యాదత్తాం మహీం పిత్రా భరతశ్శాస్తుమర్హతి,
త్వయి వా పుత్రవద్వస్తుం యది జాతో మహీపతేః." ౩౦

అని మూలము. "పితౄన్ సమనుజాయంతే నరా నార్యస్తు మాతర" మ్మనున్యాయము ననుసరించి యీభావమును ముని తెల్పెను. ప్రాయికముగాఁ దండ్రిగుణములే తనయునకు రావలయునని ధర్మము. కాని యింతకంటెఁ గర్మసిద్ధాంతము బలీయము. ఇది సామాన్యశాస్త్రము. కర్మసిద్ధాంతము విశేష శాస్త్రము. అని యెఱుంగవలయును.

రాజు వల్కలములు సీతకు నీవలదని కైకను యాచించుట.

*సీతాదేవి లోకనాథునిభార్యయయ్యు వల్కలధారణము చేయుచుండఁగా నందుఁగల ప్రజలెల్లరు దశరథుని గాంచి యీ

* ఇది ముప్పదియెనిమిదవసర్గమునుండి గ్రహింపఁబడినది.

నీబ్రదుకేమని గట్టిగా నాక్షేపించిరి. ఆధ్వని చెవుల సోఁకఁగా నతఁడు వగచి ప్రాణధర్మకీర్తులయందుఁ దనకుఁ గలసంబంధమును వదలుకొనువాఁడై నిట్టూర్పులు పుచ్చుచుఁ గైకం గాంచి యిట్లనియె కైకా! జానకి వల్కలమును ధరించి పోవరాదు. కోమలాంగికదా సీత. బాలకదా. సుఖములకే తగినదిగాన నడవిలో నుండరాదని గురువు చెప్పినది సత్యము. ఇపుడు జానకి వల్కలధారిణియై యందఱియంతరమున నొకమునిపత్నివలె నిలుచున్నదే. పతివ్రతాశిరోమణియు రాజర్షివర్యుఁడగు జనకచక్రవర్తిపుత్త్రికయు నగు నీకన్య యిట్లుండుట కెవరి కేయపకారము చేసెను? వల్కలమును వేగముగా వదలుఁగాక. ఈవేషమున నడవికి సీత పోవలయునని మునుపు నీకు మాటయిచ్చియుండలేదు. కావున నీమె వస్త్రాలంకారభూషితయై సద్వస్తువులం గయికొని వనమున కరుగుఁగాక. ఇంక నేబ్రదుకుట కర్హుఁడఁగాను. స్మృతి సమీపించినది. ఇట్లున్న నేను నీకతిక్రూరమగు శపథము చేసినాను. అవివేకురాలవుగాన నీవుకూడ రామారణ్యగమనము భరతాభిషేకము నిశ్చయించితివి. ఏమిచేయఁగలను? వెదురుపొదను దానిపుష్పమే కాల్చుచందమున నాశపథమే నన్నుఁ గాల్చుచున్నది. పాపాత్మురాలా! కైకా! నీకేదే నపరాధము రాముఁడు చేసియున్న నడవులకుఁ బంపుటకుఁ దగినంతయపకార మేమిచేసినాఁడు? సీత మృదుచిత్త. భీతహారిణాక్షి! అపరాధ మొనరింప నెఱుఁగనే యెఱుఁగదు. మహాసాధ్వి యిచ్చట నీ కేయపకార మొనరించెను? రాము నడవికిఁ బంపుటొక్కటియే నీయాత్మ యుండునంతదనుక నరకమున దుఃఖము ననుభవించునట్లు నిన్నుఁ జేయఁజాలునుగదా. ఇంకను బాపములు చేయుచున్నదానవే నీగతి యేమగును?

శ్రీరాముఁ డిచ్చోటికిఁ బట్టాభిషేకమునకై రాఁగా నతనితో వల్కలములం గట్టుకొని వనమునఁ బదునాలుగేండ్లుండఁ బొమ్మంటివి. ఊరక యుండినందుననే నందుల కంగీకరించినవాఁడనై తినిగాని సీత నడవికిఁ బంపవలసినట్లు నీవు నన్నడుగలేదు. నేను సరే యనలేదు. సుకుమారయగుజానకి యీ ముదుకవస్త్రములఁ గట్టుకొనుచుండఁగాఁ గాంచుచున్నావు కదా. ఎంతటిపాషాణహృదయవు? ఎంతటిపాపమున కొడిగట్టుచున్నదానవు? అని పలుకుచు నారాజు విలపించుచు నామె మనస్సు మెత్తఁబడనికతన దుఃఖము నంతమును జూడఁజాలక పోయెను. పుత్త్రశోకవేగమున భూమిపైఁ బడియెను. ఇట్లు కైకను బ్రార్థించి పడియున్న తండ్రిం గాంచి శ్రీరామమూర్తి వనమునకుఁ బ్రయాణమై యిట్లు పలికెను.

తండ్రీ! నీవు పరమధార్మికుఁడవు. నాజనని యీకౌసల్య కీర్తిమంతురాలు. వృద్ధురాలు. సుశీల. సంపదగలది. తనకొడుకును నీ వడవికిఁ బంపుచున్నను నిందింపక యూరకున్నది. వరదాతవగు నీవు నాకు వరమొసంగుము. నీవామెను గౌరవింతువు. కాని నేనడవికిఁ బోయినతర్వాత దుఃఖార్ణవమునఁ బడియుండును. ఇట్టియాపద నీవఱకెఱుంగదు. కాన మునుపటికన్న మిన్నగ నీవామెను గౌరవింపందగు. పుత్త్రదుఃఖమునఁ గుందిపోవకయుండ మన్నింతువేని యామె జీవించి యుండఁగలదు. దేవేంద్రతుల్యుఁడవు. కాన నాయెడఁబాటువలన నామె వగచి కృశించి చచ్చి యమపురమునకుం బోవకయుండ నాప్రార్థనమునఁ జేయవలయును. మన్నించుచున్న నామె జీవించియుండును..

మహనీయులారా! ఈభాగమునఁ ధర్మము లుపదేశింపఁబడినవి. వాని నెఱుంగవలయును.

"పుత్రశోకం యథానర్చ్ఛేత్త్వయా పూజ్యేన పూజితా,
మాం హి సంచింతయంతీ సా త్వయి జీవేత్తపస్వినీ." ౧౭

అని మూలము. పూజితా = అనఁగా సన్మానింపఁబడినదని యర్థము. పూలచేఁ బూజింపఁబడినదని కాదు.

"పితృభిర్భ్రాతృభిశ్చైతాః పతిభిర్దేవరైస్తథా,
పూజ్యా భూషయితవ్యాశ్చ బహుకల్యాణమీప్సుభిః. ౫౫
యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః,
యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఫలాః క్రియాః. ౫౬
శోచంతి జామయో యత్ర వినశ్యత్యాశు తత్కులం,
న శోచంతి తు యత్రైతా వర్ధతే తద్ధి సర్వదా. ౫౭
జామయో యాని గేహాని శపంత్యప్రతిపూజితాః,
తాని కృత్యాహతానీవ వినశ్యంతి సమంతతః. ౫౮
తస్మాదేతాస్సదా పూజ్యా భూషణాచ్ఛాదనాశనైః,
భూతికామైర్నరైర్నిత్యం సత్కారేషూత్సవేషు చ." ౫౯

మను. 3 అధ్యా.

అని మనుస్మృతి తెలుపుచున్నది. భర్త భార్యను గౌరవింపఁదగిన పద్ధతి యిద్దానివలన స్పష్టమయ్యెడిని. మాంసంచింతయంతీ = నన్నే చింతించుచుఁ దపస్విని యగు కౌసల్య నీచెంత జీవించును యని శ్రీరామమూర్తి భార్యను భర్త యెట్లు గౌరవింపఁదగునో మనకు బోధించెను. మనుస్మృతి యట్లే తెలిపెను. సకలస్మృతి సారము రామాయణమని మన మూహింపవచ్చును.

"ఇమాం మహేంద్రోపమజాతగర్ధినీం
తథా విధాతుం జననీం మమార్హసి,
యథా వనస్థే మయి శోకకర్శితాం
న జీవితం న్యస్య యమక్షయం వ్రజేత్." ౧౮

అని మూలము. సామాన్యార్థము సుగమము. ఇందొక్క సూక్ష్మ ధర్మము కలదు. శోకముచేఁ దపించి ప్రాణత్యాగముచేయువారు యమలోకమున కరుగుదురు. అనఁగా దుఃఖించుచునే ప్రాణములు వదలరాదు. ఏలనఁగా

"యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరం,
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః."

అన్నగీతాప్రమాణము ననుసరించి దుఃఖమునఁ దపించుచుఁ బ్రాణముల వదలినఁ దదనురూపఫలమే కలుగును. కావున దుఃఖముతోఁ బరితపించి చావకయుండఁ జక్కఁగా నాదరింపుమని రామమూర్తి తెలిపెను. భర్త యుపలాలించినచోఁ బతివ్రతలు పుత్త్రవిషయమునఁ గలవిచారమును మఱతురని యేకదా భావము. ఈభాగమునందు శ్రీరామమూర్తి సంగ్రహముగా భార్యను సంతోషింపఁజేయు పతిధర్మములఁ దెలిపెను. పతియే దైవముగా భావించిననారీమణి భర్త తన్ను లాలింపఁగా నెంతటిచింతనైన మఱచునని స్పష్టము. ఆకారణముననే భార్యకు భ సర్వాధికారము లొసంగి తాను సాక్షిమాత్రుఁడై యుండవయును. మనుస్మృతితాత్పర్య మిదియేకదా. ఇవ్వానిని గ్రహిం తదనుసారముగా మెలంగినవారు శ్రీరామునానతిని శిరసా వహించువా రగుదురు. మన మిట్టిసూక్ష్మవిషయములఁ ద్రోసి పుచ్చక యోజించి తదనుసారముగా మెలంగవలయును.

వనగమనసన్నాహము. కౌసల్య సీతకు నీతిని దెలుపుట.

*శ్రీరామచంద్రుఁడు చెప్పినవాక్యముల నాలకించి దశరథుఁడు సీతారామలక్ష్మణులు మునివేషములఁ దాల్చియుండుటం గాంచి భార్యలతో నల్లె మూర్ఛిల్లెను. అట్టితండ్రిని రాముఁడు చూడనోల్లఁడయ్యెను. కొంతసేపూరకుండి చూచియు నేమియు మాటలాడకపోయెను. రాజు కొంతసేపట్లేయుండి కుమారునే తలంచుకొనుచు విలపించెను. మున్ను నేను పెక్కండ్ర శిశువులం బొలియించియుందును. కానిదేని పెక్కుప్రాణుల హింసించియుందును. కనుకనే నాకీదుఃఖము తటస్థించినది. ప్రారబ్ధము పూర్తియైనఁగాని దేహము నశింపదు. అట్టిసమయము రానుండఁగా నెవ్వానికైనఁ బ్రాణము తనువునుండి వీడిపోవదు. అందుననే కైక నన్నిట్లు దుఃఖములపాలు చేయుచున్నది. ఐనను మరణమింకను రాకున్నదే. ఏల? అగ్నితేజస్సు నడంపఁజాలు తేజస్సుగల నాకుమారుఁడు రాజవస్త్రము వదలి మునులకుఁ దగిన వల్కలములఁ గట్టుకొని నా మ్రోలనుండఁ జూచుచున్న నాకు మృతిలేకున్నది. కపటముపన్ని తన కార్యము ఫలింపఁజేసికొన యత్నించుకైక కొఱకే యిందఱుజనులు దుఃఖించుచున్నారుకదా. ప్రతీకార మేమి చేయవచ్చును? అని బోరున నేడ్చెను.

ఇట్లు విలపించుచు రాజు కన్నుల నీరు గ్రమ్మ రామభద్రా! యని పిలిచి మరలఁ బలుకఁజాలక యుండెను. మరల స్మృతి గలుగఁగా సుమంత్రుని గని నీవుపోయి విలాసార్థమగు స్యందనము మేటిరథ్యములం బూన్చి తెచ్చి రామభద్రు నెక్కిం

* ఇయ్యది ముప్పదితొమ్మిదవసర్గమునుండి కైకొనఁబడినది.

చుకొనిపోయి యీ దేశమున కవ్వల విడిచిపెట్టుము. సాధుగుణుఁడగు కుమారుని దల్లిదండ్రులు చేరి యడవికిఁ బాఱఁదోలుచున్నారు. సత్పురుషత్వమున కిదియే ఫలముకాఁబోలు! ఇది దానికిఁ దగదు. లోకమున గుణవంతుల ప్రవర్తనమునకు ఫల మిదియే యని నాకిపుడు తోఁచుచున్నది. కనుక గుణములుండకుండుటయే మేలు. అని రాజు పలుకఁగా సుమంత్రుఁడాయాజ్ఞ శిరసావహించి వేవేగ రథమును సిద్ధము చేయించి తెచ్చెను. కనకమయమగు రథము సిద్ధముగానున్నదని సుమంత్రుఁడు తెలుపఁగనే రాజు కోశాధిపతిని బిలిపించెను. దేశకాలగతుల నెఱింగి బాహ్యాభ్యంతరములఁ బరిశుద్ధత వెలయ వస్తుతత్త్వ మెఱింగియుండుప్రోడ. కావున రాజుకడ నిలువఁగా నతనితో రా జిట్లులనియె. వనమునఁ బదునాలు గేండ్లు సీత యుండవలయును. కావున నంతకాలమునకుఁ జాలునట్లుత్తమవస్త్రాభరణముల వేగ తెచ్చి సీత కొసంగుము అతఁడు వెంటనే కోశాగారమునకరిగి తగినవాని నన్నింటిని దెచ్చి సీతకర్పించెను. సుజాత యాసీత ప్రయాణమై యాభరణమ్ములఁ దాల్చెను. ఉదయభానుఁ డాకసమును బ్రకాశింపఁజేయుచందమున సీత యాభరణధారణమున గృహమునంతయు మఱింతగాఁ బ్రకాశింపఁజేసెను.

అంతఁ గౌసల్య యాజానకిం బిగియారఁ గౌఁగిలించుకొని మహాకార్యములనే యాచరించు నామెశిరము మూర్కొని యిట్లు పలికెను. అమ్మా! ఈలోకమున దుష్ప్రవర్తనముగలస్త్రీలు కోరినవానినెల్ల నొసంగి పతులు గారవించుచున్నను దైవవశమునఁ గష్టములు గల్గి వారు శ్రమంపడుదురేని యత్తఱి వారిని

బరిగణింపక మెలంగుదురు. ముదెంత సుఖ మనుభవించి పతికి హితముగా వర్తించియు నాకష్టకాలమున దుర్వృత్తి వారిని వదలుదురు. ఇది స్త్రీస్వభావము. అసత్యము పలుకుటయు క్షణ క్షణము మాఱుచుండుటయు వారి నైజము. వారిచిత్త మిట్లుండునని యెఱుంగుట కష్టము. పాపకార్యములనే వారు తలంతురు. వారిప్రేమయు స్థిరమని నమ్మరానిదే. ఒక్కక్షణమున నది తప్పిపోవును. సత్కులోపకారవిద్యలుగాని, అగ్నిసాక్షికముగా గ్రహించినదికాని, లోకమర్యాదగాని స్త్రీలచిత్తమునకుఁదోఁపవు. ధనమునే వారు కోరుచుందురు. వారిమనస్సులు మిగులఁ జంచలములు. కులము ప్రవర్తనము సత్యాదవృత్తి గురూపదేశము చక్కఁగా నాశ్రయించి శాంతిగలిగి వర్తించు కాంతలకుఁ బరమపావనపదార్థము భర్తయే. భర్తకన్న నతిశయవస్తు వేదియు లేదు. కావున నాకుమారుని రామచంద్రుని దండ్రిచే నడవులపాలు చేయఁబడినవాఁడని యవమానింపకుము. దరిద్రుఁడైన ధనవంతుఁడైన నాతని దైవమనియే తలంపుము. అని యుపదేశింపఁగా నామాట ధర్మప్రయోజనమని యెఱింగి సీత యెదుటనున్న యత్తయగు కౌసల్యం గాంచి యంజలి బంధించి యిట్లు పలికెను.

పూజ్యురాలా! తమయానతి మెయి నొనరింతును. భర్తకడఁ బ్రవర్తింపఁదగువిధ మెఱుంగుదు. వినియున్నాను. దుర్వృత్తులతో నన్ను సాటిచేయవలదు. ప్రభ చంద్రుని వదలిపోవనట్లు ధర్మమునుండి యించుకంతయు నేను వదలిపోవఁజాలను. వీణె తంత్రులు లేక ధ్వనింపదు. చక్రము లేక రథము నడువదు. ఆరీతి నారి శతపుత్రవతియైనను భర్త లేనిచో సుఖము

నొందఁజాలదు. వనితకుఁ దండ్రి మితముగా (ననఁగా నైహికము మాత్రము) నొసంగును తల్లియు నంతియ యిచ్చును. భర్త యన్ననో యమితముగా నిచ్చును. ఐహికాముష్మికములనెల్ల నొసంగును. అట్టిభర్త నేస్త్రీ పూజింపకయుండును? అట్టి పాతివ్రత్యధర్మమునే యాశ్రయించి యున్నదానను. సాధ్వీమణుల వలన సామాన్యవిశేషధర్మములనెల్ల వినియున్నదానను. ఇట్టి నేను నాప్రాణేశు నవమానింతునా? స్త్రీలకుఁ బతియే పరమ దైవతముకదా. అని సీత పలుకఁగా సత్త్వగుణప్రధానురాలగు కౌసల్య మనస్సు తృప్తినొందునట్లు కోడలు పలికినవిధ మెఱింగి రాముని వనగమనమునఁ గల్గినదుఃఖముచేతను సీతాపాతివ్రత్యశ్రవణ సంతోషముచేతను గన్నీరు వదలెను. ధర్మాత్ముఁడు పూజ్యురాలగుతల్లికిఁ బ్రదక్షిణము గావించి దోసిలిబట్టి యిట్లనియె. జననీ! దుఃఖింపకుండుము. నాతండ్రిని జూచుకొనుము. వనవాసనియతి వేవే ముగియును. నీవు కన్నులుమూసికొని నిదురించుచుండఁగనే తొమ్మిది యైదు నగునేండ్లు గడచును. ఈ యేండ్లు నీకొకరాతిరి నిద్దురవలె గడచును. అంత వచ్చి మిత్రమండలము పరివేష్టింప సంపూర్ణకాముఁడనై యుండు నన్నుఁ గనఁగలవు.

ఇట్లు శ్రీరామభద్రుఁడు విషయములనెల్లఁ జేర్చి యీపలుకులలో నిమిడించి స్పష్టముగాఁ దెలిపి తల్లులను మున్నూటయేఁబదుగుండ్రను వేలువేలుగాఁ బరికించెను. తల్లి భంగి వగచువారిని గని దోసిలిపట్టి ధర్మ్యముగా నమ్మలారా! ఒక్కచోఁగూడియుండిన చిరపరిచయముచే నొండె నజ్ఞానముచే నొండె నే నేదియే నపరాధ మొనరించియున్న క్షమింప నంగీక

రింపుఁడు. సెలవుతీసుకొనియెడ. అంగీకరింపుఁడు. అని రఘుఁడు ధర్మయుతముగాఁ బలుకఁగా విని యారాజపత్నులు మన స్సులు దుఃఖపూర్ణములు కాఁగా నుండిరి. క్రౌంచగణముంబోలె కంఠరవముల వారెల్లరు విలపించిరి. సకలవాద్యధ్వనుల నిండి యున్న యారాజసౌధము వారెల్లరు చేయురోదనధ్వనులచే నిండియుండెను.

మహాత్ములారా! ఈభాగమున ననేకవిషయములు గలవు. శ్రీరామునిధర్మోపదేశ మిందుఁ గలదు. సావధానముగా విమర్శింతము.

"మన్యే ఖలు మయా పూర్వం వివత్సా బహవః కృతాః,
ప్రాణినో హింసితా వాపి తస్మాదిదముపస్థితం." ౪

అని మూలము. సంచితము ఫలోన్ముఖమై ప్రారబ్ధమను పేరఁ బరఁగును. ఫలానుభవమునందు మానవులు స్వస్వకర్మముల స్మరింతురు. అందుఁ బ్రధానముగా దుష్ఫలానుభవమునపుడు ప్రాక్కర్మముల స్మరింపక మానరు. సత్ఫలానుభవమునపు డహంకారము తమ్ముఁ బైకొనఁగా నూరకయుండుటయు, ఆకారణమునే మూఁడుజన్మములనఁగాఁ గడచినది అప్పటిది రానున్నది యనువానిఫలముల నెఱుంగుదురు. కాని కర్మవశులగుట మరల నట్టికర్మములనే యాచరింతురు.

"ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే,
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి." ౬౭ అధ్యా. ౨.

అనుగీతావాక్యము కర్మము బలీయమనునర్థమును సూచించెడిని.

"ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః,
అహంకారవిమూఢాత్మా కర్తాహమితి మన్యతే." ౨౭ అధ్యా. 3.

అను శ్రీకృష్ణవాక్యము మానవులపరవశత్వాహంకార భూయిష్ఠత్వములఁ దేటపఱచుచున్నది. ప్రకృతమున కీవాక్కుల యాన్వయింతము. పుత్త్రదుఃఖమున రాజు మున్ను తాఁ జేసిన పాపకర్మములను స్మరించుచున్నాఁడు. ప్రాణిహింసలు శిశుహత్యలు తాఁ జేసినట్లు తలంచుచున్నాఁడు. వానికి ఫలమే యీదుఃఖమని నిశ్చయించుచున్నాఁడు. నాస్తికుఁడుకూడ నన్నముదొరకక యాఁకలి బాధింపఁగాఁ దొలిజన్మమున నెవ్వరికే నన్నము పెట్టనిదిన మిదియని భావించును. అంత్యకాలమున నెల్లరు నాత్మదుష్కృతములఁ దలంతురు. కాని దాన లాభమేమి? దుఃఖమే ఫలమగును. కావుననే

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన,
మా కర్మఫలహేతుర్భూర్మా తే సంగోఽస్త్వకర్మణి. ౪౭
యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ,
సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే. ౪౮
దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ,
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః." ౪౯ గీత. ౨ అధ్యా.

అని గీతాచార్యులు తేటపఱచిరి. కర్మముల నాచరించుటకే మానవోత్తముల కధికారముగాని వానిఫలములఁ గోర నధికారములేదు. అనఁగాఁ గోరరాదనుట. ఫలహేతువులగు కర్మములు నీచములు. ఎవ్వారు ఫలాభిసంధిరహితములగు విధివిహితకర్మముల నాచరింతురో వారుత్తములగుచు భగవంతు ననుగ్రహమునకుఁ బాత్రులగుదురు. వారల కేనాఁడును గష్టములు రాకయుండ నాసర్వేశ్వరుఁడే యొనరించును. అట్టి వివేకములేక కర్మముల నాచరించి వానివలన నేవో ఫలముల

నాశించువారు దశరథునివలె నంత్యకాలమున దుఃఖఫలముల ననుభవింతురు. అను నీవిశేషవిషయ మీభాగము మనకుఁ దెలుపుచున్నది. సారమేమనఁగా నితరులశిశువులకు హాని గల్గించినవారు తమశిశువులమూలమున దుఃఖము కలుగఁ దపింతురు. ప్రాణిహింస మహాదరమునఁ గావించి తమరే తుదకు దుఃఖముచే హింసింపఁబడుదురు. అనుసారమును మనము గ్రహింపవలయును. అహింసావ్రతమే యుత్తమవ్రతమనునదియే యిటఁ గలముఖ్యవిషయము. అద్రోహమే దైవీసంపద్గనఁబడును.

"అహింసా సత్యమక్రోధస్త్యాగశ్శాంతిరపైశునం,
దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలం. ౨
తేజః క్షమా ధృతిశ్శౌచమద్రోహో నాతిమానితా,
భవంతి సంపదం దైవీమభిజాతస్య భారత. 3 గీత. ౧౬ అధ్యా.

అని శ్రీగీతాచార్యులు ప్రతిపాదించిరి కదా.

"సా సుజాతా సుజాతాని వైదేహీ ప్రస్థితా వనం,
భూషయామాస గాత్రాణి తైర్విచిత్రైర్విభూషణైః, ౧౭
వ్యరాజయత వైదేహీ వేశ్మ తత్సువిభూషణా,
ఉద్యతోంఽశుమతః కాలే ఖం ప్రభేవ వివస్వతః." ౧౮

అని మూలము. ఈభాగము మనకొక్కవిశేషమును దెల్పుచున్నది. సామాన్యదృష్టి నాలోచింపఁగా నున్నపట్టాభిషేకము చెడఁగా మీఁదు మిక్కిలి వనగమనము ప్రాప్తింపఁగా విశేషించి స్త్రీజాతికి దుఃఖముగలుగుట స్వభావము. జానకి యట్లుగాక మహానందమున నవరత్నభూషణములఁ దాల్చి యాహార్మ్యముఁ బ్రకాశింపఁజేసినది. దీనింబట్టి విమర్శింతము. సుజాతా=చక్కని పుట్టుకగలది. అనఁగా నయోనిజగా నవతరించినది. అనఁగా

భగవతి మాయ యని యర్థము. వనగమనము చేయుతఱి సుజాతానిగాత్రాణి=శాస్త్రమునఁ జెప్పినట్లున్న యవయవములను, విచిత్రైర్విభూషణైర్వ్యభూషయామాస=విచిత్రములనఁగా నితర కాంతాగణాలభ్యములగు నాభరణములచే నలంకరించెను. అనఁగా నాయవయవములకు నితరభూషణము లక్కఱలేకున్నను గార్హ్యార్థము ధరించెనని భావము. రావణునివెంటఁ దన ప్రతికృతి యరుగుతఱి సుగ్రీవాదులముం దీభూషణములఁ బాఱవైచినఁగాని శ్రీరాముని కార్యమునకు ననుకూలము కాదని యూహించియే ధరించెననియే మన మెఱుంగవలయును. దశరథుఁడు తన్ను నంతమర్యాదతోఁ జూచినందున నాయలంకారమున నాగృహమును బ్రకాశింపఁజేసెను. ఖం ప్రభేవ వివస్వతః= సూర్యప్రభ ఆకసమునువలె. ఇచ్చట దశరథునిసౌధ మాకాశముగను, సీతావిభూషణకాంతులు సూర్యప్రభగను సీత సూర్యబింబముగను జెప్పఁబడినది. దశరథునిల్లు శూన్యమగు ననుభావమిందు సూచింపఁబడినది. అనఁగా నిఁక దశరథుఁ డాయింట నుండఁడనియే తాత్పర్యము. మృతి కాసన్నుఁడుగ నున్నవాఁడనుట సారము. సూర్యబింబమనఁగాఁ దేజోరాశి యని యర్థము.

"తేజసాం గోళకస్సూర్యో గ్రహార్క్షాణ్యంబుగోళకాః"

అని సిద్ధాంతమునఁ గలదు. తేజోరాశికి సూర్యుఁడని పేరు. మనకుఁ గనఁబడునది తేజోరాశిగాని సూర్యుఁడనుపురుషుఁడు కాఁడు. ఆ తేజోగోళాధిష్ఠానదేవతకు సూర్యుఁడని పేరు. ప్రకృ[తి]పము సీతారూపము [తే]జోబృందమని యెఱుంగందగు. భగవంతుఁడు తేజోరూపుఁడు. భగవతియుఁ దేజోరూపిణి.

"ప్రాదుర్బభూవ పరమం తేజఃపుంజమనూపమం,
కోటిసూర్యప్రతీకాశం చంద్రకోటిసుశీతలం. ౭౩
తన్మధ్యమే సముదభూచ్చక్రాకారమనుత్తమం,
తన్మధ్యమే మహాదేవీ ముదయార్కసమప్రభామ్." ౭౪

లలితోపాఖ్యానము. ౮ అధ్యా.

"తటిల్లేఖాతన్వీం తపనశశివైశ్వానరమయీం
నిషణ్ణాం షణ్ణామప్యుపరి కమలానాం తవకళాం,
మహాపద్మాటవ్యాం మృదితమలమాయేన మనసా
మహాంతః పశ్యంతో దధతి పరమానందలహరీం." ౨౧

అని శ్రీశంకరాచార్యులు తేటపఱచిరి. అట్టి తేజస్స్వరూపిణి యగు భగవతి సీత దశరథునకుఁ గడసారిచూపుగా దర్శన మొసంగెనని యెఱుంగవలయును. ఇందు దశరథమృతియు నాసౌధభాగ్యక్షతియు భగవతీభక్తానుగ్రహతత్పరత్వము సూచింపఁబడినవి.

"అసత్యస్సర్వలోకేఽస్మిన్ సతతం సత్కృతాః ప్రియైః
భర్తారం నానుమన్యంతే వినిపాతగతం స్త్రియః. ౨౦
ఏష స్వభావో నారీణా మనుభూయ పురా సుఖం,
అల్పామప్యాపదం ప్రాప్య దుష్యంతి ప్రజహత్యపి. ౨౧
అసత్యశీలా వికృతా దుర్గ్రాహ్యహృదయాస్సదా,
యువత్యః పాపసంకల్పాః క్షణమాత్రాద్విరాగిణః. ౨౨
న కులం న కృతం విద్యా న దత్తం నాపి సంగ్రహం
స్త్రీణాం గృహ్ణాతి హృదయమనిత్యహృదయా హి తాః." ౨౩

అని మూలము. కౌసల్య సీతాదేవికి సాధారణముగా స్త్రీలకుఁ గలస్వభావమును దెలుపుచున్నది.

"నైతా రూపం పరీక్షంతే నాసాం వయసి సంస్థితిః,
సురూపం వా విరూపం వా పుమానిత్యేవ భుంజతే. ౧౪
పౌంశ్చల్యాచ్చలచిత్తాచ్చ నైస్నేహాచ్చ స్వభావతః,
రక్షితా యత్నతోఽపీహ భర్తృష్వేతా వికుర్వతే. ౧౫
ఏవం స్వభావం జ్ఞాత్వాసాం ప్రజాపతినిసర్గజం,
పరమం యత్నమాతిష్ఠేత్పురుషో రక్షణం ప్రతి. ౧౬
శయ్యాసనమలంకారం కామం క్రోధమనార్జవం,
ద్రోహాభావం కుచర్యాం చ స్త్రీభ్యో మనురకల్పయత్." ౧౭

మను. ౯ అధ్యా.

అను నీమనువాక్యములు రామాయణాభిప్రాయమునే బోధించు చున్నవికదా. వీని రెండింటిని బరికింపఁగా నేనాఁటినుండియో స్త్రీలస్వభావము స్పష్టమగుచు ఎంతకాలము భర్త వస్త్రాభరణాదులచే సత్కరించినను బతికొకయాపదవచ్చినపుడు వానిని ప్రేమింపక యీసడింతురని యేర్పడినది. పతిని దూషించుటయు స్వభావమని తేటపడినది వారిహృదయ మిది యని గ్రహింపరాదనుటయు నెఱుకపడినది. కులవిద్యాదులు జేసిన మేలు వారి హృదయములను దృప్తిపఱుపఁజాలవను విషయము సిద్ధాంతితమగుచున్నది. వారిమన స్సొకరీతిగా నుండక మార్పునొందు చుండుననియుఁ దెలియవచ్చెడిని. ఈవిషయ మీకాలముననఁగాక పూర్వకాలమునందుఁగూడ స్త్రీస్వభావము ప్రాయికముగా నిట్టిదే యని తోఁచుచున్నది. ఇప్పుడు వారి కొసంగుస్వాతంత్ర్యము ముందెట్టియుపకారము చేయునో పరీక్షింపవలసియే యున్నది. స్త్రీలయనురాగప్రదర్శనము క్షణభంగురమనియే యిటఁ గలసారము.

"సాధ్వీనాం హి స్థితానాం తు శీలే సత్యే శ్రుతే శమే,
స్త్రీణాం పవిత్రం పరమం పతిరేకో విశిష్యతే. ౨౪
స త్వయా నావమంతవ్యః పుత్రః ప్రవ్రాజితో మమ,
తవ దైవతమస్త్వేష నిర్ధనస్సధనోఽపి వా." ౨౫

అని మూలము. శీలము సత్యము గురుజనోపదేశము ఓర్పు అనువానియందు నాసక్తిగలిగి వర్తించు స్త్రీలకుఁ బరమదైవము పతియే. ఇంకొక్కఁడు కాఁడు. అనఁగాఁ బతికంటె నెక్కుడు ప్రేమింపఁదగు వస్తువు లేదని భావము. అట్టి ప్రేమాస్పదుఁడగు భర్తను శ్రీరామచంద్రుని వనములకరుగువాని నవమానింపకుము. అనఁగాఁ బరిహాసోక్తుల నాడకుమని భావము. పతి నిర్ధనుఁడుగాని ధనవంతుఁడుగాని నీకు దైవముకదా. అని పతివ్రతాధర్మములను కౌసల్య తెలిపెను. సీతాస్వభావము పండ్రెండు సంవత్సరములు కౌసల్య పరికించెను. మరల నెందులకీయుపదేశము? అయోనిసంభూతు రాలనియు సీత నెఱుంగును గదా. అస్థిర స్త్రీస్వభావము నియతము కాదని యనుమానించి బోధించెననియు నీమూలమున లోకమునఁ గల స్త్రీలకెల్ల నీయుపదేశము పనికివచ్చుననియు సమాధానము చెప్పవచ్చును. లోకమునకు ధర్మములనెల్ల నుపదేశించునుగదా రామాయణము. కావుననే యాయాయితావుల నాయాధర్మములను దెలిపెనని యెఱుంగందగు.

కపటనాటకసూత్రధారులగుకొందఱు మధ్యవైష్ణవులు కుక్షింభరులై ధనార్జనమునకు సులభోపాయమని శిష్యులం గూర్చుకొని మంత్రోపదేశము చేయుచు యోగులమని చెప్పుకొనుచు భర్తుఁడు పతివ్రతవంటివాఁడనియుఁ బతివ్రత యొక్క భర్తనే నమ్ముకొనియుండులాగున నతఁడుకూడ నొక్కవిష్ణువునే

నమ్ముకొనియుండవలయు ననుచు బోధింతురు. గురూచ్ఛిష్టమే శిష్యులకుఁ బ్రసాదమని వారివాదము. భగవంతుఁడు కర్మపాశములలోఁ దగిలించుననియు గురువు చక్కఁగా ముక్తికిఁ గొనుచుఁబోవుననియుఁ బామరులగుశిష్యులకు బోధింతురు. వారికంటె ద్రోహులు లేరనవలయు. పతియే పరమదైవమని యీ రామాయణమే బోధించెనుగదా. పతివ్రతకు భర్తయే దైవమనఁగా నర్థమేమి? దైవమువలె భావించి తదాజ్ఞఁ దలఁ దాల్పవలయునని భావమా? లేక దైవమే భర్తయని భావమున నారాధింపవలయునని భావమా? భక్తున కిష్టదైవము తండ్రి. తండ్రి కొడుకును రక్షించునట్లు భగవంతుఁడు భక్తులను రక్షించును. పతియే దైవమనఁగా దండ్రి యనియా భావము. ప్రేమమే గురుజనకదైవవిషయమున భక్తి యనం బడును. భర్తయెడఁ బ్రేమమనఁబడును. పతివ్రత పతిని దండ్రిగా భావింపరాదు. దైవముత్కృష్టుఁడని భావించునట్లు తల్లిదండ్రులులోనగుబంధువులలో సుత్కృష్టుఁడనియు నతనియానతిని దక్కినవారిమాటకంటె సుత్కృష్టమని భావింపవలయుననియుఁ దాత్పర్యముగాని పైవారుచెప్పునట్టి యర్థము కాదు. అట్టివారి మాటలఁ జెవియొగ్గి వినరాదు. ఇట్టియుపమానము లితరుల మాటలకు లోఁబడకయుండఁ దమమాటలనే నమ్మవలయు నను దుర్బుద్ధిచేఁ దెలుపు కుయుక్తులుకాని వేఱుకావు. పతిశుశ్రూష కంటె నుత్తమమైనకార్యము లేదనియే యిందలిసారము.

"కరిష్యే సర్వమేవాహ మార్యా యదనుశాస్తి మాం,
అభిజ్ఞాస్మి యథా భర్తుర్వర్తితవ్యం శ్రుతం చ మే. ౨౭
న మామసజ్జనేనార్యా సమానయితుమర్హతి,
ధర్మాద్విచలితుం నాహమలం చన్ద్రాదివ ప్రభా." ౨౮

అని మూలము. ఇవి సీతావాక్యములు. సామాన్యార్థము సుగమము. తమయవతారతత్త్వ మెఱింగినభగవతి గూఢముగాఁ దనయాశయమును దెలుపుచున్నది. అభిజ్ఞాస్మి=విద్వాంసురాలనగుదును. నాయెఱుంగనిధర్మములు లేవని తాత్పర్యము. భర్తృవిషయే యథా వర్తితవ్యమ్=భగవంతునియెడ నెట్లు ప్రవర్తింపఁదగునో యందు విద్వాంసురాలనే యని భావము. నేను భగవంతునిచ్ఛాశక్తినిగాన నాపరాత్పరునిభావ మేదియో నాకంటెఁ దెలిసికొనఁదగినవారు లేరని సారము. మే = విభక్తివిపరిణామమున మయా అని యర్థము చెప్పందగును. మయా శ్రుతంచ = నాచే వినఁబడియెను. అనఁగా మేము సృష్ట్యున్ముఖులము కాఁగాఁ బ్రాక్సృష్టిక్రమమంతయు వేదములు తెలుపునని భావము. వేదములకనాదిత్వ మిద్దానిమూలమున సిద్ధము.

"అగ్నివాయురవిభ్యస్తు త్రయం బ్రహ్మ సనాతనం,
దుదోహ యజ్ఞసిద్ధ్యర్థమృగ్యజుస్సామలక్షణం. ౨౩ మను. ౧ అధ్యా.
కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవం,
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితం." ౧౫ గీత. ౩ అధ్యా.

అను వీనింబట్టి వేదము శాశ్వతమని స్పష్టము. వేదములు కల్పితములనువారు దానితత్త్వము నెఱుంగరు. వేదమనఁగాఁ బరమేశ్వరు నుద్దేశ్యములను దెలుపునవి. వానిమూలమున మనమెఱుంగుదుము గాన వేదము లనఁబడునని నిర్వచనము చేయఁబడియెను. భగవంతుఁడు శాశ్వతుఁడని యంగీకరించినయెడలఁ దదాశయములు సనాతనములనియే యంగీకరింపవలయును. వేదములమూలమున నన్నిధర్మముల నెఱింగినదాననే యని సీత తెలిపెననుటయే యిందుఁగల యర్థవిశేషము.

మామక నేన సమానయితుం నార్హతి=దుష్టవనితాసము దాయముతో సమానముగాఁ జేయఁదగదు. నేను చిదానంద రూపిణినని తలంపుమని హెచ్చరించుచున్నది.

"సుధాసింధోర్మధ్యే సురవిటపివాటీపరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చింతామణిగృహే,
శివాకారే మంచే పరమశివపర్యంకనిలయాం
భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీమ్."

అని శ్రీశంకరభగవత్పాదులు నిర్వచించిరి.

"చిత్ జ్ఞానం తదాకారః ఆనందః నిరతిశయసుఖం తస్యలహరీముల్సేక రూపాం త్వాం కతిచన భజంతి."

అని యన్వయక్రమము. ఇందు సమయమతము చెప్పఁబడినది. సమయమతమనఁగా "అంతరపూజారతిః" మానసికపూజ. ఓ కౌసల్యా! లోకమునఁ దఱచుగానుండు స్త్రీజనముతో సమానురాల ననుకొనకుము ధర్మమునుండి యించుకంతయుఁ జలింపను.

"వృషో హి భగవాన్ ధర్మః."

అని మనుస్మృతి ప్రమాణము కలదు. ధర్మస్వరూపిణినిగా నన్నెఱుంగుమాయని సీత కౌసల్యకు నుపదేశించుచున్నది. "చంద్రాదివ ప్రభా" వెన్నెల చంద్రుని వదలనట్లు అనఁగాఁ జంద్రచంద్రికల కెట్టిసంబంధముకలదో శ్రీరామునకు నాకు నట్టి యవినాభావసంబంధము కలదని తాత్పర్యము. అనఁగా నేను మహాప్రకృతిని. పరమాత్మతత్త్వము నే నెఱిఁగిన ట్లితరు లెఱుంగఁజాలరు. నన్ను మహామాయనుగా నెఱుంగుము. నేను చిదానందస్వరూపిణిని. ఇట్టి నేను లోకమునఁ గనంబడుకులటల

వలెఁ బతి నవమానింతునని యేల పొరపడియెదవు? అది నీవంటి ముదుసలికిఁ దగదు. భర్తయిష్టానుసారముగఁ బ్రవర్తింపనే యవతరించితినని సీత గూఢముగా స్వాభిప్రాయ మెఱిఁగించె నని యెఱుంగవలయును.

"మితం దదాతి హి పితా మితం మాతా మితం సుతః,
అమితస్య హి దాతారం భర్తారం కా న పూజయేత్. 30
సాహమేవంగతా శ్రేష్ఠా శ్రుతధర్మపరావరా,
ఆర్యే కిమవమన్యేఽహం స్త్రీణాం భర్తా హి దైవతం." 31

అని మూలము. తనయుపన్యాసము ముఁగించుచు సీత మఱియు నుక్తార్థమునే తెలుపుచున్నది. మధ్యవైష్ణవ దుర్వాదనిర్వాపణ మిందుఁ గావించినవిధ మెఱుంగఁదగు. ఐహికాముష్మికసుఖ ముల నొసంగుభర్త నేస్త్రీ పూజింపకయుండును? తల్లిదండ్రుల కంటెఁ దనయులకంటె భర్త మిక్కిలి సమ్మానార్హుఁడన్నవిష యమే యిట ముఖ్యము. ధర్మములను విని యెఱింగియున్న నేనేల పతి నవమానింతును? స్త్రీలకు భర్త దైవతముకదా. అనఁగా దేవత నారాధించినట్లు శుశ్రూషలచేఁ దనుపవలయు ననిభావము. భగవంతుని దండ్రిగా భావింపవలయును. అట్లె భర్తను భావింపరాదు. తాను సేవింపఁదగినవారిలో నెల్ల నుత్త మోత్తమునిగా భావింపవలయునని భావము. అంతియకాని సర్వేశ్వరుఁడే లేఁడు. పతియే భగవంతుఁడు తల్లియుఁ దండ్రియు నని కాదు.

"సుప్తాయాస్తే గమిష్యంతి నవ వర్షాణి పంచ చ,
సాసమగ్రమిహ ప్రాప్తం మాం ద్రక్ష్యసి సుహృద్వృతం." 32

రామవాక్య మిది. ఒక్కరాత్రి నీవు నిదురించుచుండఁగాఁ దొమ్మిదియైదునగు సంవత్సరములు గడచును. పితృవాక్యము కొంతగాంచకయుండఁ జెల్లించి వచ్చి స సులఁ గూడియుండు నన్నుఁ జూడఁగలవు. అనునది ప్రాతీతికార్థము. ఇందు రామ చంద్రుని భావమేమి ? క్షణకాలమువలె నీపదునాలుగేండ్లు గడచుననియే యని కొందఱందురు. అది కాదు.

> ''యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ,
> యస్యాం జాగ్రతి భూతానాం సా నిశా పశ్యతో మునేః.'' ౬౯
> ''నిశా రాత్రిః సర్వపదార్థానామవివేకకరీ తమస్స్వభావత్వాత్ సర్వ భూతానాం సర్వేషాం భూతానామ్.'' అని భాష్యము.

అనుగీతావాక్యము ననుసరించి తల్లీ! తమోగుణప్రధానవై యిట్లు పతిమృతికి సుతవియోగమునకు దుఃఖించుచుండునంతలో నావ్రతము పదునాలుగేండ్లు గడచును. నాయవతారఫల మగు దుష్టనిగ్రహపూర్వకశిష్టధర్మపరిపాలన మొనరించి నాకు సాయ పడ నవతరించిన బ్రహ్మాదులయంశమునఁ బుట్టినజాంబవదాదులం గూడివచ్చిన నన్ను నాయపరస్వరూపమనఁబడుజానకిని జూడఁ గలవు. నారాకదనుక నీవు దుఃఖములనే యనుభవించుచుందు వనియు నారాకతో నీదుఃఖము లంతమొందుననియుఁ దాత్ప ర్యము. ఇదియే యీభాగమునుండి గ్రహింపఁదగినసారము. మానవులజ్ఞానకల్పితకార్యములచేఁ గాలమును వ్యర్థముగాఁ బుత్తురు. అదియే తమోగుణకార్యము. ఎప్పుడు జ్ఞానభానూ దయము మనోవ్యోమమున నగునో దుఃఖాంతకాల మదియే యనియు నయ్యది గాకయున్న నాజన్మమంతయు నిద్రావస్థలో నున్నయట్లే భావింపవచ్చుననియు మన మెఱుంగఁదగునీతి. భగవ

దారాధనకుతూహల ప్రాదుర్భావమే జ్ఞానభానూదయమని తాత్పర్యము. ఈవిషయమునే శ్రీరామమూర్తి యుపదేశించె నని మన మెఱుంగుట మంచిది.

"సంవాసాత్పురుషం కించిదజ్ఞానాద్వాపి యత్కృతం,
త సమనుజానీత సర్వాశ్చామంత్రయామి వః." ౩౦

లోకమున కొకసదాచారమును శ్రీరాముఁడు తెల్పుచు న్నాఁడు. ఎంతటివారుకాని స్థలాంతరమున కరుగునపుడు తమ వారి ప్రార్థించునెపమున గృహదేవతలను వృక్షముల నాశ్రయించియుండు దేవతలను మఱియు నెల్లతావుల వ్యాపించి యాయాపాపఫలముల కనురూపమగు బాధలఁ గల్పించు దేవతలను బ్రార్థింపవలయును.

"యే వృక్షేషు సస్పింజరా నీలగ్రీవా విలోహితాః,
యే భూతానామధిపతయో విశిఖాసః కపర్దినః
యే అన్నేషు వివిధ్యంతి పాత్రేషు పిబతో జనాన్,
యే పథాంపథి రక్షయ ఐలబృదా యవ్యుధః
యే తీర్థాని ప్రచరంతి సృకావంతో నిషంగిణః
య ఏతావంతశ్చ భూయాగ్ంసశ్చ దిశో రుద్రా వితస్థిరే."

అనుశ్రుతిప్రమాణము ననుసరించి యాభూతములను వేఁడుకొని పోవలయును. "మిమ్మెల్లఁ బ్రార్థించుచున్నాను. నాయపరాధము లేమూలమునఁ గల్గినను వానిని క్షమింపుఁడు." అని ప్రార్థించి పిదపఁ బ్రయాణము సాగింపవలయు నన్నన్యాయమును శ్రీరామమూర్తి తాను దల్లులఁ బ్రార్థించునెపమునఁ దెలిపెనని తెలియందగు. శ్రీరామునిధర్మోపదేశములు స్వానుష్ఠానరూపము లేకదా. సదాచారములఁ దానాచరించి యా

మూలముననే బోధింప నవతరించినవాఁడని మనము నమ్మవలయును. ఈనీతిని దెల్పెనని మనమేల యూహింపవలయునని ప్రశ్నింతురేమో.

—"వచనం రాఘవస్యైతద్ధర్మయుక్తం సమాహితం,
శుశ్రువుస్తాస్త్రియస్సర్వాశ్శోకోపహతచేతసః." ౩౮

అను నీమూలము పైవ్రాసినయర్థము సత్యమని తెలుపుచున్నది. "సమాహితం సమీచీనార్థయుక్తం." అని గోవిందరాజులు మహేశ్వరతీర్థులు వ్రాసిరి. ధర్మయుక్తము సమాహితము ననఁగా నర్థమేమి? కేవల ముపచారార్థమే యైన నీవిశేషణము వ్యర్థములనియే చెప్పవలసియుండునుగదా. ఇట్టు లీభాగము మనకు శ్రీసీతారాములయాశయములఁ దెల్పుచున్నది. వాని నెఱింగి యాయిరువురదివ్యపాదారవిందముల ధ్యానించుచుఁ దదనుసారముగా మెలఁగవలయునని దృఢసంకల్పము చేయవలయు. ఈభాగమున నధ్యాత్మరామాయణమునందు విశేషము కానరాదు. తరువాతికథను మరలుదము.

శ్రీరామావతారఫలమగు వనప్రయాణము.

*తరువాత సీతారాములు లక్ష్మణుఁడును దోసిలులొగ్గి దశరథుపదములఁ దాఁకి మ్రొక్కి పెద్దలసేవించునవకాశము లేకపోయె నన్నదైన్యము పొడమ వలగొనిరి. సకలధర్మవేత్తయగు శ్రీరాముఁడు తండ్రియనుమతినొందక సీతాసౌమిత్రులం బిలుచుకొనిపోవరాదని యెఱింగి తండ్రిచే ననుమతి వారలకిప్పించి కౌసల్యను వదలిపోవలసివచ్చెఁగదా యనువగపు సుంతభ్రాంతిని గల్పింపఁగా నామెకు నమస్కరించెను. లక్ష్మణుఁడును నమస్కరిం

* ఇది నలుబదియవసర్గమునుండి గ్రహింపఁబడినది.

చెను. పిదపసుమిత్రపాదములం దాఁకి వందనమాచరించెను. సుమిత్రయు నమస్కరించిన లక్ష్మణునిం గాంచి దేహధర్మము ననుసరించి విలపించుచు మహాబాహుఁడగు నతని శిరంబు మూర్కొని యతనికి మిక్కిలి హితముగోరి యిట్లు పలికెను. పుత్త్రకా! కౌసల్యయేరీతి లోకమును రక్షించు కార్యముకొఱకు శ్రీరాముని గనెనో యారీతిగా నేనును సుహృన్నుఁడగు శ్రీరాముని యందు నత్యంతానురక్తుఁడవగు నిన్ను, నన్నంగూడి వనములకరిగి సేవచేయుపొంటెఁ గంటిని. ఇమ్మహాకార్యముకొఱకే దైవము నిన్ను నాయందు సృష్టించెను. అట్టులగుట శ్రీరాముఁడు వనమున ననేకవిచిత్రములు చూచుచుఁ బరవశుఁడై యరుగుచుండఁగా నీవు ప్రమాదంపడక యాతనిం గాపాడుచుండ వలయుఁజుమీ. శ్రీరామునితోడ నేలపోవలయునని ప్రశ్నింతువేమో వినుము. అనఘా! లక్ష్మణా! శ్రీరాముఁడు రాజ్యములోనగునవి లేక విపన్నుఁడయి చూపట్టినను రాజ్యము లోనగునవి కలిగి సంపన్నుఁడై యున్నను శ్రీరాముఁడే నీకు దిక్కు. ఏటికందువేమో చిన్నవాఁడు జ్యేష్ఠునకు లోఁబడియుండుట యీలోకమున సకులనుష్ఠించు ధర్మము. మఱియు ఇట్టి సద్వర్తనము, దానము, యజ్ఞదీక్షఁబూనుట, సంగ్రామములందు దేహము నర్పించుట యనునివియన్నియు మీకులమున కర్హములు. అంతియ కాక చిరకాలమునుండి వచ్చుధర్మములు. కాఁబట్టి దేహము విడిచిపెట్టవలసివచ్చినను శ్రీరాముని రక్షింపవలయును. అని పలికి రామునందే ప్రీతికలిగి యతనితోఁ బయనముచేయ సిద్ధముగ నుండుకుమారుని జూచి వత్సా! పొమ్ము! పొమ్మని పలుసారులు పలికి మరలఁ గుమారునకు గర్తవ్యమెఱిఁగింపఁ దలంచి యిట్లు వాక్రుచ్చెను. నాయనా! శ్రీరాముని దశరథు

నిగా నెఱుంగుము. సీతాదేవిని నన్నుగా నెఱుంగుము. అటవి నయోధ్యనుగా నెఱుంగుము. సుఖముగాఁ బోయిరమ్ము. అని సముచితగతిఁ దెల్పెను.

అంతట సుమంత్రుఁడు వినయవేత్తయగుట నింద్రునికడ మాతలివలె రామునికడ నంజలింబట్టి యిట్లు విన్నవించెను. మహాయశోవిభూషణా! అరదముంగొనివచ్చితిని. ఆరోహింపుము. నీకు భద్రమగుఁగాక. ఎచ్చోటికిఁ బోవలయునందువో యందుఁ బోనిత్తును. పదునాలుగువర్షములుకదా మీ వనవాసము! ఆలాగే కైక మీ కాజ్ఞ చేసెను. కనుక నిఁక నాలస్యమేల? అపరిమితియం దొక్కదినము గతించిన నెంతయో మేలుకదా. త్వరితముగ దాని గడువ మొదలుపెట్టుటయే మంచిదని యూరకుండెను. జానకియత్తగారొసంగిన వస్త్రాభరణముల నలంకరించుకొని మనోమోదము పైకొనఁగా భాస్కరుంబోలి మెఱయుస్యందనము నెక్కెను. కనకరథము హుతవహునివలె మెఱయుచుండుదాని నాయన్నదమ్ములు నధిష్ఠించిరి. దశరథుఁడు కోడలు సీతకు వనము నుండుకాలమును లెక్కించి యంతకాలమునకుఁ దగినవస్త్రాభరణముల నొసంగెను. కొడుకులకు నిరువురకు నాయుధములు కవచముల నిచ్చెను. సీతారామలక్ష్మణులకు రాజిచ్చిన యావస్తువులను బుటికయు గుద్దలియుఁ బదిలముగా రథమునందుఁ జేర్చి వారు మువ్వురురథమెక్కుటం గాంచి వాయుగమనము గలగుఱ్ఱముల నదలించి తోలెను.

రామమూర్తి వనమునఁ జాలకాలము వసింపఁబోవుచుండఁగా నాపురమెల్ల మూర్ఛమునిఁగెను. గజాశ్వములుకూడ స్మృతితప్పిపడియెను. జానపదు లుత్సవార్థ మరుదెంచియున్న

వారు గాన వారునట్లే మూర్ఛిల్లిరి. పౌరు లంత మనస్సులు కలఁత నొందఁగాఁ గింకర్తవ్యతామూఢులై రామునివెంటఁబోవ నుంకించుచుండిరి. వగపెల్లిదమున మదగజములు కుపితములై ఘీంకారము లొనరించెను. పరితపించుచు గుఱ్ఱములు పరుగిడుటం జేసి వానియాభరణములు మ్రోఁగుచుండెను. పురమెల్ల ధ్వనిగల దయ్యెను. అంత బాలురు వృద్ధులు మొదలగువారు శ్రీరాము నెడఁబాసి వగలఁబొగులుచు దప్పిగొన్నవారు జలములకుంబోవు చందమున రామునికడకుం బోయిరి. పరుగువాఱి రామరథ పార్శ్వములందుఁ గొందఱు వెనుకభాగమునఁ గొందఱు నుండి వానిం బట్టుకొని వ్రేలాడుచు రామునిమోమును జూచుచుఁ గన్నీటిధారలు పాఱుచుండఁగా గట్టిగా నోసూతా! పగ్గముల బిగించి పట్టుకొమ్ము. మెలమెల్లన నడుపుము. రామమూర్తి దివ్య ముఖమును గాంతుము. ఇదియే సమయము. మరల నెన్నటికో యదియబ్బును. దేవకుమారునింబురుడించు రామమూర్తి వనమున కరుగుచుండఁ దల్లి మన స్సెంతగట్టిదో శకలములుగాకయున్న దే. అది యయోమయముకాఁబోలును. సీతయు ఛాయవలెఁ బతి వెంటఁ బోవుచున్నది. కనుక నామె కృతార్థురాలయ్యెను. సాధ్వీ ధర్మముల నెఱింగినసీత సూర్యరశ్మి మేరుపర్వతము విడు వనిరీతి నాధర్మమునే చేపట్టినది. లక్ష్మణా! ప్రియవాదియగు శ్రీరామునకు నిరంతరము శుశ్రూషచేయుచునే యుందువు. ఎంతటికృతార్థజన్ముఁడవయ్యా! రాము ననుసరించిపోవుటయే నీకుఁ దపస్సిద్ధి. స్వర్గప్రాప్తికి నీకిదియే మార్గము. ఇక్ష్వాకువంశ మునకు యశస్సుగూర్చుచు నెల్లరకు హితముగావర్తించుచు నున్న రామమూర్తి నాపౌరజానపదులెల్ల నిట్లు మాటలాడుచుఁ బోవుచు నెడఁబాయఁజాలక కన్నీరు వెడలఁ బోవుచుండిరి.

దశరథుఁ డంత వంతఁగుందుచుఁ దనవలె వంతఁగుందు కాంతలంగూడి నాప్రియపుత్త్రు నొకసారి చూచివత్తునని పలుకుచు నిల్లువెడలెను. అత్తఱి గజరాజు బంధింపఁబడఁగా స్త్రీగజములు వగపున గోప్పగా ఘీంకరించుచందమున రామమూర్తి పయనముచేయుచుండ స్త్రీలెల్ల నేడ్చుచుండ నాధ్వని ముందు వినంబడెను. ఆదుఃఖమునకు రాజు రాహుగ్రస్తచంద్రబింబముపగిది వివర్ణుఁడయ్యె. రాముఁడు కదుంగడు ధీరుఁడగుట జనులు వెంబడించుటయు వగచుటయుం జూచియు మది నించుకేఁ గలంగక సుమంత్రుని వేగ రథముఁ దోలుమని శాసించెను. తోలుత రాముఁడు రథము పోనిమ్మనఁగా జనులు నిలుపవయ్యా యని వేఁడఁగా నతఁ డారెంటిని జేయఁజాలక యుండెను. రాముఁడు పయనము సాగింపఁగనే రథవేగజనిత పరాగము పౌరులకన్నీటం దడిసి యడంగెను. పౌరు లేడ్చుచుఁ గన్నీటిఁ గార్చుచు హాహాకారముల వెడలించుచు మూర్ఛిల్లిరి. మత్స్యములు చలింపఁగా నిటునటుకదలు తామరలనుండి మకరందము స్రవించునట్లు వనితానేత్రములనుండి దుఃఖాశ్రువులు పాఱసాగెను. రాజు పురమెల్ల రామగమనమునకు దుఃఖించుచుండఁ గాంచి మఱింత వంత కలుగ మూలచ్ఛేదమునఁబడు మహావృక్షమురీతిఁ దటాలున నేలఁబడియె. రాముని వెనుక నరుగుజనులందఱు దుఃఖించురాజును గని యయ్యో యని మఱింత దుఃఖించిరి. కొందఱు అక్కటా! శ్రీరామా యనిరి. కొంద ఱయ్యో రామునిగన్నతల్లీ యనిరి. రోదనముచేసిరి. అంతఃపురకాంతలు నట్లే యేడ్చిరి. రామమూర్తి యాదుఃఖధ్వని నాలకించి వెనుకఁదిరిగి వారింగాంచుచుఁ దన్నుఁ జూడవచ్చు తల్లిదండ్రులం గనియె. త్రాటఁగట్టివేయఁబడిన గుఱ్ఱపుఁబిల్ల

తనతల్లిని దైన్యమునఁ గనునట్టులు ధర్మపాశబద్ధుఁడు తానగుట నట్లు వగచు జననీజనకులఁ గాంచఁజాలక క్రీఁగంటం జూచు చుండెను. తల్లిదండ్రులు కాలినడకల వచ్చుచు దుఃఖించు చుండం గాంచి సుమంత్రా! ఇఁక రథము వేగపోనిమ్మని యాజ్ఞాపించెను. వారిం గాంచుట రామునకు దుఃఖకరముగనే యుండెను. తోత్రముచే (బరిగోలచే) బొడువఁబడినగజ మా దెబ్బకు నోర్వఁజాలనియట్లు తావారలంగని యాదుఃఖమున కోర్వఁజాలఁడయ్యెను. ధేనువు దూడపైఁగల ప్రీతిచే దానిం గట్టివేసినచోటికిఁ బరువునవచ్చునట్లు కౌసల్యయు రాముఁడున్న యెడకుఁ బరుగునవచ్చెను. హా రామా! హా సీతా! హా సౌమిత్రీ! యనుచుఁ బేరెలుంగునంబిల్చుచు వారికింగల్గిన దుఃఖమునకుఁ గన్నీరు విడుచుచు నిటునటు తిరుగుచున్న తల్లిని బలుసారులు రాముఁడు చూచెను. నిలునిలువుమని రాజుపలుకఁ బోనిమ్ము పోనిమ్మని రాముఁడుపలుక సూతుఁ డేమియుఁదోఁపక యుండెను. సుమంత్రా! నిన్నొకవేళ రాజు నామాట వినకపోయితివేల యనియడుగు నేని ఆమహాధ్వనిలో స్పష్టముగా వినఁబడదయ్యె నని నీవు బదులు చెప్పవచ్చును. ఈయబద్ధమైనఁ బలుకవచ్చుం గాని దురంతదుఃఖము వారనుభవింపఁజూచి యోర్వ శక్యము కాదని రాముఁడు పలికెను. సూతుఁడు రామవాక్యనాలకించి యట్లే చేయఁబూని కూడవచ్చు నంతఃపురజనమున కతనిచే ననుమతి నిప్పించి యాజానేయములగుటఁ వానిందోలెను. జనులు రామునకుఁ బ్రదక్షిణమొనరించి వెనుకకు మరలిరి. అందుఁగలవారలకునెల్ల వారిదేహములు మరలినవేకాని మనస్సులు నేత్రోదకములు మాత్రము మరలఁజాలవయ్యెను. మంత్రులు రాజుంగాంచి వశ్రీరాముని వేగముగా రావలెనని

కోరుదుమో అతనిని దూరముగా వెంబడించి పోవరాదని పల్కిరి. సకలవిధములఁ బొగులుచున్న రాజు మంత్రివాక్కును విని ఆమాట తగియున్నదిగాన రాముని వెంబడింపక తాను భార్యలతోడ బ్రియకుమారునిం గాంచుచుండెను.

మహామతులారా! ఈభాగమున నొకటిరెండువిషయములు విశేషించి విచారింపఁదగియున్నవి. విశేషార్థములు గల భాగములును గలవు. కాన విసుగునొందక విమర్శింతము. లక్ష్మణుఁడు కౌసల్యకుఁ దొలుత నమస్కరించి పిదప సుమిత్రకు నమస్కరించెను. ఆమె తనయునితో నిట్లు చెప్పెను.

"సృష్టస్త్వం వనవాసాయ స్వనురక్తస్సుహృజ్జనే,
రామే ప్రమాదం మాకార్షీః పుత్ర భ్రాతరి గచ్ఛతి." ౫

అనిమూలము. సామాన్యార్థము సుగమము. సుమిత్ర తనయునాచోట నేమియుననలేక మంచిమాటలఁగనే తనదుఃఖమును వెల్లడించెనని కొందఱందురు. కాని యది యంతమంచిది కాదు. సుమిత్ర మతివైభవముకల సాధ్వీమణి. కావుననే కుమారునకు బుద్ధిచెప్పుచున్నది. వత్సా! సుహృ నే = సర్వభూతదయాపరుఁడగు జనునియం దనఁగా శ్రీరామునియందు. అనురక్తః=అనురాగముగలనీవు, వనవాసాయ సృష్టః= వనములవసించుకొఱకే పుట్టింపఁబడితివి. నీపుట్టుకకుఫలము వనవాసమే యని భావము. భ్రాతరిరామే గచ్ఛతి ప్రమాదంమాకార్షీః=శ్రీరాముఁ డడవుల నడుచుచుండఁ బ్రమాదంపడకుము. అనఁగా నీవు సేవించు కర్మమునందు నశ్రద్ధ గలవాఁడవు కాఁగూడదు. అని హితముపదేశించెను. వనములయందు శ్రీసీతారాములకు శుశ్రూష చేయ భగవంతుఁడు నిన్నుఁ బుట్టించెను. ఆకార్యమునందు

శ్రద్ధగలిగియుండుము. అనికదా తాత్పర్యము. ఇది మనకుఁ దెలుపుమార్గ మేది?

మానవు లేకార్యముగాని చేయఁ బూనిరేని శ్రద్ధగలిగియే చేయవలయును. అశ్రద్ధగలిగి చేసినది చేయనియట్లే యగును. ఫలము లేదని భావము.

"అశ్రద్దధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప,
అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని. 3" గీత. ౯ అధ్యా.
"అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్,
అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్య నో ఇహ." ౨౮
గీత. ౧౭ అధ్యా.

అను నీగీతావాక్యములు పైనవ్రాసినయభిప్రాయము నే తెలుపుచున్నవి. శ్రద్ధయనునవి యొకదేవతయని దాని నారాధింపవలయునని వేదము తెల్పుచున్నది. అనఁగా శ్రద్ధయనుగుణము భగవత్స్వరూపముగా భావించి దాని నారాధింపవలయునను దానిసారమేమనఁగాఁ దాను జేయఁబూనుకొన్న కార్యమును లోకులు మెచ్చుకొనవలయునని కాక భగవంతు నారాధించునట్లు చేయవలయుననియే. కావుననే సద్గుణములయందు శ్రద్ధయనునది ప్రధానమయ్యెను.

"శ్రద్ధయాగ్నిస్సమిధ్యతే శ్రద్ధయా విందతే హవిః,
శ్రద్ధాం భగస్య మూర్ధని వచసా వేదయామసి,
ప్రియగ్ శ్రద్ధే దదతః ప్రియగ్ శ్రద్ధే విదా సతః,
ప్రియం భోజేషు యజ్వసు ఇదం మ ఉదితం కృధి,
యథా దేవా అసురేషు శ్రద్ధాముగ్రేషు చక్రిరే, ఏవం
భోజేషు యజ్వసు అస్మాకముదితం కృధి, శ్రద్ధాం దేవా

యజమానాః, వాయుంగోపా ఉపాసతే, శ్రద్ధాగ్ంహృ
దయ్యయాకూత్యా శ్రద్ధయా హూయతే హవిః, శ్ర
ద్ధాం ప్రాతర్హవామహే శ్రద్ధాం మధ్యందినం పరి శ్రద్ధాగ్ం
సూర్యస్య నిమ్రుచి శ్రద్ధే శ్రద్ధాపయేహమా, శ్రద్ధాదే
వానది వస్తే శ్రద్ధాం విశ్వమిదం జగత్ శ్రద్ధాం కామస్య మా
తరం హవిషా వర్ధయామసి.”

అని శ్రద్ధాదేవిని వటువు పూజింపవలయును. ప్రణవశ్రద్ధామేధలు మూఁడును వటువునకుఁ బూజ్యములయ్యెను. ఈవిషయము శ్రీమహాభారతమునందు నెట్టివానియన్నము భోజ్యమను ప్రశ్నమునకు సమాధానము శ్రద్ధగలవానియన్నమే భోజ్యమనియు నదిగలవాఁడే గౌరవజ్యేష్ఠుఁడనియుఁ జెప్పఁబడినవి. ఈధర్మమునే సుమిత్ర కుమారున కుపదేశించెను. భగవంతుని సేవార్థము లక్ష్మణుఁ డవతరించె ననుటచేత నతనికంటె భరతశత్రుఘ్నులు తక్కువయనికాదు. భగవత్కార్యమున కనేకరీతుల సహాయపడువారు సృజింపఁబడిరని యెఱుంగవలయు. అందఱు భగవంతునిదృష్టికి సమానులేయని తాత్పర్యము.

“వ్యసనీ వా సమృద్ధోవా గతిరేష తవానఘ,
ఏష లోకే సతాం ధర్మో యజ్జ్యేష్ఠవశగో భవేత్. ౬
ఇదం హి వృత్తముచితం కులస్యాస్య సనాతనం,
దానం దీక్షా చ యజ్ఞేషు తనుత్యాగో మృధేషు చ. ౭
లక్ష్మణం త్వేవముక్త్వా సా సంసిద్ధం ప్రియరాఘవం,
సుమిత్రా గచ్ఛ గచ్ఛేతి పునః పునరువాచ తం.” ౮

అని మూలము. సామాన్యార్థము సుగమము. విశేషార్థమేమి? ఇందు శ్రీరాముఁడు పరబ్రహ్మమని తల్లి కుమారునకుఁ దెల్పు

చున్నది. అనఘ! అని కొడుకును సంబోధించెను. మహర్షి యీ భావమును మనకుఁ దెలుపుటకె సుమిత్రనోట "అనఘ!" అని పలికించెను. అకృతపాపుఁడవగు నీకు "ఏషగతిః" ఈపరమపురుషుఁడే దిక్కు. రక్షకుఁడని భావము. ఇపుడు వ్యసనమునొందినవాని వలె నుండనిమ్ము. సకలరాజ్యభోగములు గలవాఁడుగానుండ నిమ్ము నీ కీశ్రీరాముఁడే రక్షకుఁడు. తాత్కాలికస్థితిని బరికింప రాదనియు వస్తుతత్త్వమునే పరికింపవలయుననియు సారము. ఇదియే స నులధర్మము. స ను లితనినే నమ్ముదురని భావము. ఎవ్వాఁడు జ్యేష్ఠుఁడో యతనికి లోఁబడుట యనునదియే ధర్మము. సకలలోకములయందు జ్యేష్ఠుఁడెవ్వాఁడు? భగవంతుఁడే. సర్వజ్యేష్ఠుఁ డతఁడేకదా. అట్టిభగవంతునకు లోఁబడివర్తించుట యనఁగాఁ దదారాధనముచేయుచుఁ దదుక్తప్రకారము ప్రవర్తించుటయనునదియే సజ్జనులామోదించు ధర్మమని భావము. భగవదుక్తమేది?

"యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః,
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిం. ౨౩
తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ,
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి." ౨౪ గీత. ౧౬ అ.

అనునదియే భగవదుక్తము. అనఁగా నెవ్వారు విధివిహితములగు కర్మములను భగవత్ప్రీతికొఱకే యాచరించుచు వానిఫలముల నాశింపకయుండుటయే ధర్మమని యిందుఁ గలవిశేషము. ఇది యీరఘువంశమునఁ గలసనాతనాచారము. ఈవాక్యములఁ బట్టి మనము వితర్కింపఁగా సుమిత్ర కొడుకు వనమునకరుగుటకు మనసార సమ్మతించెననియే స్పష్టము. శ్రీరామత ్ర

మా మె యెఱుంగుననియు సిద్ధాంతము. "గచ్ఛ గచ్ఛ" అనుటచే నిఁక నాలసింపరాదనునూహ భగవంతునభిప్రాయమున నామెకుఁ గల్గెనని మన మెఱుంగవలయును.

"రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజాం,
అయోధ్యామటవీం విద్ధి గచ్ఛ తాత యథా సుఖం." ౯

అని మూలము. ఈశ్లోకము ననేకభంగుల నన్వయించి విశేషార్థములు వ్యాఖ్యాతలే చెప్పిరి. ఇన్నియర్థములు మనస్సుననుంచుకొని సుమిత్ర కొడుకునకుఁ దెల్పెనా యని కొందఱందురు. కాని మిత్రనోట మహాకవి వాల్మీకిమునివరుఁడే మాటలం బలికించెను. వెనుకనామె కొడుకునకుఁ దెల్పినభావముచూడఁగా భగవంతుఁడు రాముఁడని యామె యెఱుంగునని తేలెడిని. కావున నామెగంభీరభావము పాఠకుల కనేకార్థములుగలదిగఁ దోఁచెననుట యచ్చెరువు కాదు. విమర్శింతము. ఇందు సుమిత్ర కొడుకును "తాత" అని సంబోధించెను. "తనోతి కులమితి తాతః" అని వ్యుత్పత్తి చెప్పఁబడినది. ఇది వంశోద్ధారకుఁడను నర్థము తోఁపఁజేయుచున్నది. వంశోద్ధారకుఁడనఁగా యశస్సునార్జించినవాఁడు. ఎవనియశఃకాయము లోకమున శాశ్వతముగనుండునో వాఁడు వంశోద్ధారకుఁడని భావము. సామాన్యమానవులకార్యములకుఁ దోడ్పడిననే సజ్జనుఁ డనంబడుచుండఁగా నిఁకఁ బరమేశ్వరుకార్యమునకుఁ దోడ్పడువాఁడు సజ్జనశ్రేష్ఠుఁడు కాకయుండునా? అట్టివానిజన్మమే యత్యుత్తమమని సారము. సామాన్యార్థము స్పష్టముకదా. "పితృసమో జ్యేష్ఠః" అనున్యాయము ననుసరించియన్నను సేవింపఁబోవుట కుత్సాహము చూపుటచే నీవు వంశోద్ధారకుఁడవే యగుదువు. కాన

వత్సా! లక్ష్మణా! ఇఁక నీవు రాముని దశరథునిగా భావింపుము. తండ్రియతఁడే యని భావము. సీతను నన్నుగా నెఱుంగుము. నావలె నిన్నుసీతాదేవి భావించునుగానఁ దల్లి యామెయేయని భావింపుము. అడవి నయోధ్యనుగాఁ దలంపుము. అనఁగాఁ గొఱంతనొందక యుండుమని భావము. యథాసుఖముగాఁ బొమ్ము. ఇదియే సామాన్యార్థము. ఇది కుమారునకుఁ దల్లి చెప్పఁదగినహితమే యనవలయును. ఇది సుమిత్ర సాధుచరిత్రమునే తెల్పుచున్నది. జ్యేష్ఠుఁడు పితృసముఁడని శాస్త్రము విధించునపుడు తత్పత్ని తల్లియే యగును. అరణ్యగమనము తప్పనిసరి కాఁగా నది యయోధ్యయే యని తలంపుమనుట యుక్తియుక్తమే. అనఁగా వత్సా! యీపదునాలుగేఁడులు నిర్విచారముగాఁ గాలముపుచ్చిరమ్మని తల్లి కుమారునకు నుపదేశించుట న్యాయమే.

సుమిత్ర సంస్కృతభాషతో మాటలాడియున్న విశేషార్థములు చెప్పవచ్చును. "రామం దశరథం విద్ధి" అను మొదలగు వాక్యముల నట్లే యామె యుచ్చరించెనా యన్న నౌననుట యెట్లు? ఆకాలమున సంస్కృతమే దేశభాషగా నున్నదన్న వాదము సారవంతము కాదనుకొనువాఁడను. విశేషించి సంస్కృత భాష వ్యాపించియున్నదనుట నిస్సంశయము. మహాకవివాల్మీకి మాయాపాత్రముల కుచితములగుభావములంబొదిగి యీ మహాకావ్యమును వ్రాసెను. కావున నీశ్లోకమునకు విశేషార్థములు చెప్పవచ్చును. ఈయర్థములలో సుమిత్రకు నేది సమ్మతమన్నయెడల సామాన్యార్థమే యనవలయును. ఇం దిదియే యామెకు సమ్మతమగునర్థమని సిద్ధాంతముచేయ వలనుపడదు. కావున నన్నియర్థములు సుసంగతములే యనుకొనవలయు.

ఎవ్వారి కేదియిష్టమో వా రదియే సుమిత్రభావమని నష్ట వచ్చును.

రామం దశరథం విద్ధి. "దశః పక్షీ విహంగమః" అను నిఘంటువుననుసరించి దశరథుఁడు పక్షివాహనుఁడని యర్థము. నాయనా! రాముని విష్ణువుగా నెఱుంగుమనుట. సీతాం మాం విద్ధి=సీతను లక్ష్మీదేవిగా నెఱుంగుము. అటివి నయోధ్యనుగా ననఁగా నపరాజితాఖ్యవైకుంఠముగా నెఱుంగుము. సుఖముగాఁ బొమ్ము. ఈయర్థము సర్వాసంగతముగాఁ దోఁచవచ్చును. కాని చక్కఁగనాలోచించిన యుక్తముగనే తోఁచును ఇది భావనయని తాత్పర్యము. "భావనామాత్రసంతుష్టహృదయః పరమేశ్వరః" అన్నసూక్తి ననుసరించి భక్తు లేరూపమునఁ దన్ను భావింతురో యారూపమునఁ బొడకట్టుటయం దిష్టముకల వాఁడని భావము. రాముని మహావిష్ణువుగా భావింపుము. సీతను మహాలక్ష్మిగా నెఱుంగుము. అటవి నయోధ్యగాఁ దలంపుము. ఈభావము గలిగిన నీకు సుఖముగల్గునని యామె తెలిపెను. మనస్తృప్తియేకదా సుఖహేతువు. "యాదృశీ భావనా యత్ర సిద్ధిర్భవతి తాదృశీ" అన్నసూక్తి ప్రసిద్ధమేకదా. మఱొకవిచిత్రార్థము గలదు. ఆలకింపుఁడు.

రామం దశరథం చ విద్ధి. ఈశ్లోకమున నెందును "చకారము" లేదు. లేకున్నను దశరథపుత్త్రునివలెఁ దెచ్చుకొనవలయును. అనఁగా దీనితరువాతిశ్లోకము "వినయజ్ఞశ్చ" అనుపదము నుండి చకార మప్పుగాఁ గైకొందము. నాయనా! రాము.- జూడుము. దశరథుని జూడుము. ఇరువురకుఁ గల తారతమ్యము నెఱుంగుము. రాముఁడు జ్ఞాతి. దశరథుఁడు తండ్రి. ఎవరికడ నెట్లు మెలఁగవలయునో యోజింపుము. అనఁగా

దండ్రికడ మెలఁగినట్లు రామునికడ మెలఁగరాదని భావము. "మాం జనకాత్మజాం చ విద్ధి" పైనవ్రాసినచకారమునే యిచ్చటికి జరపుకొనుఁడు. నన్నును జానకిని జూడుము. నాదగ్గర వర్తించినట్టులు జనకరాజపుత్త్రికకడ వర్తింపరాదు సుమీ. క్షాత్త్రసంబంధము కాన జాగ్రత్తగా మెలంగుము. గుణముంబట్టి యాలోచించిన నాకంటె సీత నీమేలు కోరునది యని భావమని గోవిందరాజులు వ్రాసిరి. ఇదెంత బాగుండునో పాఠకులే యూహింపఁదగు. అయోధ్యా మటవీం చ విద్ధి. మరల నాచకారమునే తెచ్చి పెట్టుకొనుఁడు. అయోధ్యను అటవిని జూడుము. అయోధ్యకంటె నడవియే కైంకర్యమున కేకాంత స్థానమని గోవిందరాజులు వ్రాసిరి. అయోధ్యలోనున్నయట్టు లడవిలో నుండఁ రాదుసుమీ జాగరూకుఁడవై మెలంగుమని బోధించెనని ప్రకృతమున కనుకూలమగునర్థము. వీనింబట్టి సుమిత్ర యర్ధాంగీకారమున నిట్లు పలికెనని తేలెడిని. వ్యాఖ్యానమున వ్రాసినప్రకారము సీతారాములకు శుశ్రూష లొనరించుచుం బొమ్మని సాగనంపిన ట్లర్థమగును. ఇంకొక్కయద్భుతమగునర్థము.

"దశరథం రామం విద్ధి" మీతండ్రి నుపరతునిగా నెఱుంగుము. లేనట్లే యెఱుంగుము. "మాం జనకాత్మజాం విద్ధి" పతి చావఁగాఁ గైక బాధించుచుండఁగా నిందుండఁజాలక తండ్రి యింటనుండుదానినిగా నెఱుంగుము. "అయోధ్యా మటవీం విద్ధి" అయోధ్యనుండి యందఱు వెడలిపోవఁగా నరణ్యము ర్మానుష్యమగును. కాన నిర్విచారముగాఁ బొమ్ము. దీనియం దొక్కసంశయము కలదు. భరతుఁడు కైక వారిపరిచరులైన

నుండరని సుమిత్ర కెట్లు తెలిసినదని యడిగిన నూరకయుండ వలసినదే. పెక్కండ్రు లేచిపోవఁగా వారు నుండఁజాలక పోవకుందురా యనునదియే సమాధానమో. సుమిత్రకు జ్యోతిశ్శాస్త్రము వచ్చుననియైనఁ జెప్పవలయును. పతి మృతి నొందుననియుఁ దాను దండ్రి యిల్లు చేరుదుననియు నగరము వనమగుననియు నామె యూహించెనన్నచో నన్నుఁ గని పెట్టు కొని నీవిం దేయుండవలయునని యడుగదాయనికొందఱందురు.

ఇంక నొక్క యర్థము. "రామం విద్ధి దశరథం విద్ధి" వత్సా! నీకుఁ దండ్రియు నన్నయు గురువులే. ఒక్కరు పరిచారకులం గూడియున్నవారు. ఒక్కరు పరిచారకులు లేనివారు. ఈయిద్ద ఱిలో నెవ్వరనుసరింపఁదగినవారని యూహించుకొనుము. "మాం విద్ధి జనకాత్మజాం విద్ధి." నే నూరనున్నదానను, సీత యడవిలోనుండునది. ఎవ్వరికిఁ దోడ్పడిన మంచిదో యూహింపుము "అయోధ్యాం విద్ధి అటవీం విద్ధి" ఇందొక్కటి యైహిక సుఖానుభవస్థానము. వేఱొకటి ఆముష్మికసుఖదమగునది. ఇం దేదిశాశ్వతమో యాలోచించుకొమ్ము. శ్రేష్ఠానువర్తనము యుక్తమనియే దీనిసారము.

ఇట్లు లీశ్లోకము తడిపినగోధుమపిండివలె నెట్లు లీడ్చిన నట్లు సాగుచుండును. ఏయర్థమువలసిన నాయర్థము నంగీకరింప వచ్చును. మొత్తముమీఁద సుమిత్ర కుమారుఁడు శ్రీరామునిం గూడిపోవుట కంగీకరించెనని మన మంగీకరింపవలయును. దుఃఖము దేహధర్మము ననుసరించి యించుకగాఁ గలిగినఁ గలుగుఁగాక. ఆమె విశ్వాసమేమో శ్రీరామసేవాధురంధరుఁడు లక్ష్మణుఁడన్న భావము నందేకలదని యూహింప నవకాశము

కలదు. ఒకప్పు డట్టిభావ మామెకు నైజము గాకపోయినను బ్రకృతిపురుషులయుద్ధేశము ననుసరించి కలుగవచ్చును. ప్రపంచములన్నింటి నొక్కసారి మార్చఁగలవారలకు సుమిత్రాశయము మాఱునట్లు చేయుట యొకయద్భుతము కాదు. లక్ష్మణునకు నడవికిఁబోవ ననుమతినొసంగెననుటయే యిందు గల కథాభాగము.

ఇందుగలవిశేష మేమి? మానవుఁడు సద్భావముకలిగి యుండు టుత్తమమనునదియే యిటఁగలవిశేషము. ఉపాసకుఁడు పూజాద్రవ్యములకొఱ కెందఱకడకో పోయి యాచించి తెచ్చి యాయారాధనమునఁ దృప్తినొందు టధమము. అట్లుకాక

“పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి,
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః. ౨౬
యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణం. ౨౭
శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః,
సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి. ౨౮
సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః,
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహం.” ౨౯

గీత. ౯ అధ్యా.

ను నీశ్రీకృష్ణోపదేశప్రకారము భక్తిభావమున మనోవీథి భిమతదేవతాబింబమును నెలకొలిపి భావనారూపభక్త్యుపహృత సకల సత్పదార్థముల నారాధింపవలయును. “అంతరర్చనసుప్రీతా బహిరర్చనలోలుపా” అన్న ప్రమాణము కలదు. “బహిరంతశ్చ కథముద్వాస్యతే విభుః” అన్నసూక్తి కలదు.

"ధ్యానేనాత్మని పశ్యంతి కేచిదాత్మానమాత్మనా,
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే. ౨౪
అన్యే త్వేవమజానంతశ్శ్రుత్వాన్యేభ్య ఉపాసతే,
తేఽపి చాతితరంత్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః. ౨౫
యావత్సంజాయతే కించిత్సత్త్వం స్థావరజంగమం,
క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్తద్విద్ధి భరతర్షభ. ౨౬
సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరం,
వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి. ౨౭
సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థితమీశ్వరం,
న హినస్త్యాత్మనాత్మానం తతో యాతి పరాం గతిం." ౨౮

గీత. ౧౩ అధ్యా.

అను నీగీతోపదేశము పైనవ్రాసినయర్థమునే సిద్ధాంతము చేయుచున్నది. బాహ్యపూజకంటె నాంతరపూజ మహాఫలద మని తెలిసికొనవలయును. ఈవిషయమునే యీభాగమునుండి మనము గ్రహింపవలయును.

"రథమారోహ భద్రం తే రాజపుత్ర మహాయశః,
శీఘ్రం త్వాం ప్రాపయిష్యామి యత్ర మాం రామ వక్ష్యసి." ౧౧.

అని మూలము. అరద మెక్కుము. శుభము కలుగును.

"రాజపుత్ర ఇతి మహాత్ యశః యస్య సః తస్య సంబుద్ధిః."

రాజపుత్రమహాశయః = రాజపుత్త్రుఁడన్న విఖ్యాతిగలయోపరమేశ్వరా! రథమెక్కుటయే యాలస్యము. నీకు శుభములు గలుగును. విజయము కలుగునని భావము. శీఘ్రం త్వాం ప్రాపయిష్యామి = త్వరితముగా నిన్నుఁ జేర్తును. అనఁగా నీవొనరింపఁదగు కార్యములకుఁ గాలము చెంతకు వచ్చుచున్నది. కాన

శీఘ్రమే రథ మారోహింపుము. అని సుమంత్రుఁడు పలికెను. మహాప్రకృతి సుమంత్రునినోటినుండి యిట్లుపలికించెనని తేలెడిని. ఈయర్థ మెట్లూహింపఁదగును? రాముఁడే పలికించెనని యేల యనరాదు? అని యందురేని

"తం రథం సూర్యసంకాశం సీతా హృష్టేన చేతసా,
ఆరురోహ వరారోహా కృత్వాలంకారమాత్మనః." ౧౩

అని మూలము. ఈశ్లోకమే మన కీయర్థమును దెలిపెడిని. సీత సంహృష్టమగుమనస్సుచేత సర్వాలంకారశోభితాంగియై సూర్య ప్రకాశముగలరథము నెక్కెను. ఈసంతోషమునకు హేతు వేమి? సొమ్ములు చీరలు మామగా రిప్పించిరనియే యగునా? ఈసంతోషము కావున్న పట్టాభిషేక మూడిపోయినందునఁ గలుగుదుఃఖమును మించఁగలదా? లోకదృష్టిచే నూహింపుఁడు. సామాన్యదృష్టి పనికిరాదందు రేని సంతోషమునకు వేఱుకారణ ముండకతప్పదు. అ దేది? సర్వకార్యకారణభూతురాలు మహా ప్రకృతియేకదా. తా నవతరించినపని భూభారహరణరూపధర్మ సంస్థాపనమే కాన దాని కనుయాపముగాఁ గైక వరమడుగుట ప్రయాణముచేయ ననువుపడుట యనుకారణములే యాజగ జ్జనని హర్షమునకుఁ గారణములు. శ్రీరాముఁడు నిర్గుణ బ్రహ్మము. సగుణబ్రహ్మ మయ్యెను. అనఁగాఁ దనమాయం గూడెను. కనుకనే ప్రకృతిచేయుకార్యములం గాంచుచుఁ దాను సాక్షిమాత్రుఁడై యుండెను. ఆపరమేశ్వరుని గార్యో న్ముఖునిగ నొనరించునది ప్రకృతియేకదా.

"పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్,
కారణం గుణసంగోఽస్య సదసద్యోనిజన్మసు." ౨౧ గీత. ౧౩ అధ్యా.

అనుగీత మనశ్శోకహిత ముపదేశించును. అదియే యిది యని తలంపుడు.

"జగత్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే
తిరస్కుర్వన్నేతత్స్వమపి వపురీశ స్తిరయతి,
సదా పూర్వస్సర్వం తదిదమనుగృహ్ణాతి చ శివ
స్తవాజ్ఞామాలంబ్య క్షణచలితయోర్భ్రూలతికయోః." ౨౪

అను నీ శ్రీశంకరభగవత్పాదోక్తి ప్రకృతిశక్తిని దృఢపఱచు చున్నది. కనుక మహామాయ యగుసీత తొలుత రథ మెక్కెను. ఆరథారోహణమే యామెకార్యతురత్వమును దెలుపుచున్నది.

"అథోజ్జ్వలనసంకాశం చామీకరవిభూషితం,
తమారురుహతుస్తూర్ణం భ్రాతరౌ రామలక్ష్మణౌ." ౧౪

అని మూలము. సామాన్యార్థము సులభమే. ఇందొక్కవిశేషము కలదు. తొలుత సీత రాజపుత్రిక యని తలంపక భగవంతు నెడఁబాయని సంకల్పశక్తి యని భావింపవలయును. ఆభావము కుదిరినఁగాని సీతాచరిత్రము విశ్వాసపాత్రము కానేరదు. రామాయణము లన్నియు నొక్కరీతిగా నర్థములగుట కాభావమే ప్రధానము. "జ్వలనసంకాశమ్" అని మూలమునఁ గలదు. విశేషార్థ మిదియని యాలకింపుడు.

భగవతికి జ్వాలామాలిని యంగదేవత. యుద్ధకాలముల యందా జ్వాలామాలిని ముందుచుఁ దత్సైన్యము చుట్టుకోట వలె నుండును. దాని నార్పఁ దరముకాదు. సూర్యకాంతిని శీతలోదకముల నార్పఁగలవారుండిన వారు దాని నార్పఁగలరు.

"జ్వాలామాలినికాక్షిప్త వహ్నిప్రాకారమధ్యగా."

అని సహస్రనామస్తోత్రమునఁ గలదు.

"తత్ర గత్వా జ్వలజ్జ్వాలావహ్నిప్రాకారమండలం,
శతయోజనవిస్తారమాలోకయత దుర్మతిః." 3౭

లలితోపాఖ్యానము. 3౭ అధ్యా.

రావణాసురునకుఁబురుషులచేతఁ జావకయుండ వరము లేదు కాన మహామాయ యాయరదమునఁదనజ్వాలామాలినిని దేజోరూపమున నావహింపఁజేసెను. అపు డారథము జ్వలనసకాశముగాఁ జూపట్టెను. తొలుదొలుత సీతాదేవి తానే యారథమును మనస్సంతోష ముప్పొంగ నెక్కెను. తరువాత మండుచున్న యగ్నివలె నొప్పురథమును సోదరులు రామలక్ష్మణు లెక్కిరి. సర్వకార్యములు ప్రకృతివిశిష్టుఁడయియే పరమేశ్వరుఁడు చేయుననియుఁ, బ్రకృతి నెడఁబాసినపు డనఁగా బ్రపంచేచ్ఛలేనితఱిఁ దా నూరకయుండుననియు దీనిసారము. అట్టి దుఃఖాకరమైన ప్రయాణమున హర్షము సీతాదేవికిఁ బొడమఁగారణమేమనఁగా దానవతరించినఫలమును జూపుట కదను దొరకినదనియేగాక మతేమగును? ఈభాగమునుండి యీవిషయమును జక్కఁగా గ్రహించి సీతాదేవిని మహామాయగా భావించి యారాధింపవలయును. ప్రకృత్యతీతుఁడై ప్రకృతివిశిష్టుఁడై యొకప్పుడును భక్తరక్షణము చేయుచు ధర్మమును రక్షించుచునుండు భగవంతుఁడు శ్రీరాముఁడై యవతరించెనని తలంచి యారాధింపవలయును.

"కృతకృత్యా హి వైదేహీ ఛాయేవానుగతా పతిం,
న జహాతి రతా ధర్మే మేరుమర్కప్రభా యథా." ౨౪

అని మూలము. ఇందొక్కని శేషము కలదు. జనులందఱు సీతం గాంచి యిట్లు పల్కిరి. నీడవలెఁ బతి ననుసరించుచున్నది. కాన సీత ధన్యురాలు. ధర్మమునఁగల యాసక్తిని వదలదని వారు పొగడిరి. "కృతకృత్యా హి" అన్న వాక్యమునసార మేమి? కార్యముల నొనరించునది సీతయే యనియు, శ్రీరాముఁడు సాక్షిమాత్రుఁడనియుఁగదా. మేరుపర్వతమును సూర్యప్రభ వదలనియట్లు అని యుపమానము చెప్పఁబడినది మేరుపర్వతమును సూర్యప్రభ వదలకయుండుట సంభవము. అట్లే యిసమాడ నసంగతమా యని కొంద ఱడుగుదురు. ఖగోళశాస్త్రము ననుసరించి పురాణముల కథలు లేవు. సామాన్యులకు సూర్యుఁడు లోకబాంధవుఁడని తెలుపుటయే పురాణములప్రాధాన్యము. గ్రహగతతత్త్వమెఱుంగవలయునన్న ఖగోళశాస్త్రము చదువుకొనవచ్చును.

"యద్యదుద్దేశేన ప్రవృత్తస్తత్తదంశ ఏవ ప్రమాణమ్."

అన్న న్యాయము ననుసరించి యే గ్రంథ మేవిషయమును దెలుపు నభిప్రాయమున నారంభింపఁబడినదో యావిషయమునఁనే యది ప్రమాణము. నడుమనడుమ వచ్చువిషయములతత్త్వము ప్రమాణముగా నద్దానినుండి గ్రహింపరాదు. పురాణములు కథారూపముల లోకులకు నీతులను సదాచారములను బోధింప నేర్పడినవి. అంతియగాని ఖగోళశాస్త్రతత్త్వ మిదియని వచింప వ్రాయఁబడినవి కావు. కావున మేరుపర్వత మున్నయట్లు దాని చుట్టు గ్రహములు తిరుగనట్లు చెప్పఁబడియె. దానినుండి గ్రహింపఁ దగుసార మేమనఁగా భూగోళమునకుఁ బరమోపకార మొనరించు గ్రహగోళములు కావున నాగ్రహములు పూజ్యములు. అందు సూర్యుఁడు గ్రహరాజు. త్రిమూర్త్యాత్మకుఁడు.

కావున నారోగ్యమును గోరువారెల్ల సూర్యు నారాధింపవలయు ననువిషయమే. "స ర్వేషాం మేరురుత్తరః" అన్న ప్రమాణము ననుసరించి భూగోళమున సర్వోన్నతస్థానమునకు మేరువని పేరు. అను నీభావము గ్రహించిన నేబాధలుండవు.

సీతయే ప్రధానమని చెప్పుటచేత శాక్తమిందు సిద్ధాంతము చేయఁబూని యీపుస్తక మారంభింపఁబడినదా యని కొందఱనుమానింపవచ్చును. కాని నాభావ మది కాదు. సగుణుఁడయినఁగాని భగవంతుఁ డే కార్యము చేయఁదలంపఁడు. త్రిగుణాత్మికయే మహామాయ, ప్రకృతియు ననఁబడు.

"దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా."

అని శ్రీభగవద్గీతోక్తి ననుసరించి యూహించినఁ బై మాట సార్థకమే యగునుగదా. భగవంతుఁడు ధర్మరక్షణార్థము శ్రీరామరూపమున నవతరించినపుడు తన్మాయయు సీతారూపమున నవతరించెను. ఇంతవఱకు నెల్లరు నాభావము నంగీకరింతురుగదా. సీతకు ముందు రాఁగలకష్టములన్నియు నామె పూతచారిత్రమునకుఁ గళంకముఁగల్గించునవిగనే యుండును కావునఁ దత్త్వమేమియని విచారింపవలసివచ్చినది. భగవన్మాయ సీత కాదంపు రేని యయోనిజాత యన్నమాట యెగిరిపోవును. భూమిలో నొక్కపెట్టియలోఁ గన్యక దొరకెనన్న నెల్లరు నవ్వవలసినదే. దానిని నమ్మించుట కుపాయమేమి? ఆమె భగవచ్ఛక్తి కాన నేరూపమున నేచోటనుండిన నుండఁగలదని చెప్పుట తప్ప మార్గాంతరము లేదు ఈవిషయము నధ్యాత్మరామాయణమే తెల్పెను. ఇందు నాకల్పించిన దేమియు లేదు. పూర్వుల భావమును దెలుపుటయే కాని క్రొత్తసిద్ధాంతము కాదు.

ఈవిషయమును విమర్శింపకపోయిన శ్రీరామాయణ ముత్తమ గ్రంథమని యెట్లు తెల్పఁజాలుదురు? మహాలక్ష్మియని యెట్లు సిద్ధాంతముచేయఁగల్గుదురు? కావున సీతాచరిత్రము పరమపావనమని శ్రీరామాయణము ననుసరించియే తెల్పుట న్యాయాశయము. కావున నిందు సంశయింపఁదగిన దేదియు లేదు. పరమతద్వేషమే ప్రధానముగాఁగల పాషండులగుకొందఱు మధ్వవైష్ణవులకు సరిపడకయున్నమాత్రమున నియ్యది తత్త్వము కాకపోదు. శిష్యులవంచించి ధనమునార్జించు కుమతులయభిప్రాయము మనము తిరస్కరించుటయే న్యాయము.

"అహో లక్ష్మణ సిద్ధార్థస్సతతం ప్రియవాదినం,
భ్రాతరం దేవసంకాశం యస్త్వం పరిచరిష్యసి. ౨౫
మహత్యేషా హి తే సిద్ధిరేష చాభ్యుదయో మహాన్,
ఏష స్వర్గస్య మార్గశ్చ యదేనమనుగచ్ఛసి." ౨౬

అని మూలము. 'సతతం ప్రియవాదినం' అనువిశేషణము శ్రీరాముఁడు పరమేశ్వరుఁడని తెల్పుచున్నది. సతతము ప్రియముగా మాటలాడువాఁ డెవ్వఁడు? పరిపూర్ణుఁడు. భగవంతుఁడొక్కఁడే పరిపూర్ణుఁడు. ఇతరులు కారు.

"సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః,
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహం." ౨౯

గీత. ౯ అధ్యా.

అన్నగీతావాక్యము ననుసరించి యెవ్వానికి మిత్రామిత్రులు లేరో సర్వము సమానముగాఁ దోఁచునో యతఁడే పరిపూర్ణుఁడు. అట్టి పరమేశ్వరుని సేవించుచున్న యోలక్ష్మణా! నీవే సిద్ధాఁడవు. అనఁగా సకలమనోరథుఁడవు. నీకంటె లోకమునఁ గృత

కృతార్థు లెవ్వారు కలరు? భగవత్సేవకన్నఁ బరమపురుషార్థ మొసఁగుమార్గ మేదికలదు? అంతకంటెఁ దపస్సిద్ధియేది? దానికంటె నభ్యుదయ మేది? భగవంతు ననుసరించి పోవుటకంటె స్వర్గమార్గమును జూపునదేది? అన్నింటికంటె భగవత్సేవ యుత్తమమనువిషయ మిద్దానినుండి మనము గ్రహింపవలయును.

“వృద్ధాంశ్చ నిత్యం సేవేత విప్రాన్ వేదవిదశ్శుచీన్,
వృద్ధసేవీ హి సతతం రక్షోభిరపి పూజ్యతే.” ౩౮ మను. ౭ అధ్యా.
అభివాదనశీలస్య నిత్యం వృద్ధోపసేవినః,
చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యాయశోబలం.” ౧౨౧
మను. ౨ అధ్యా.

అని నీమనుస్మృతియుఁ బైభావమునే తెలుపుచున్నది.

“చతుర్విధా భజంతే మాం జనాస్సుకృతినోఽర్జున,
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ. ౧౬
తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే,
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమహం స చ మమ ప్రియః. ౧౭
ఉదారాస్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతం,
ఆస్థితస్స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిం.” ౧౮
గీత. ౭ అధ్యా.

అను నీశ్రీకృష్ణోపదేశము భగవదనుగమనమాహాత్మ్యమును దేటపఱచుచున్నది. దీనిసారమేమి? భగవత్సేవయే ప్రధానముగాని యితరమేదియుఁ గాదని నమ్మి యెవ్వరు భగవంతు ననుగమింతురో వారే ధన్యులగుదురు. స్వర్గమార్గము వారలకే కనఁబడును. భగవత్సేవ యనఁగాఁ బాషాణావిగ్రహములపూజ కాదని యెఱుంగవలయును.

"ప్రశాంతాత్మా విగతభీర్బ్రహ్మచారివ్రతే స్థితః,
మనస్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః. ౧౪
యుంజన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః,
శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి." ౧౫ గీత. ౬ అధ్యా.

అన్న శ్రీకృష్ణోపదేశము ననుసరించి యోగియై యుపాసించు వాఁడనియే యర్థము. పాషాణపూజ యత్యల్పఫలమనియే సారము. పాషాణపూజయే ప్రధానమని బోధించుట పామరులవంచించి ధనమార్జించుటకే యని యెఱుంగవలయు.

"నాశ్రౌషమితి రాజానము పాలబ్ధోఽపి వక్ష్యసి,
చిరం దుఃఖస్య పాపిష్ఠ మితి రామస్తమబ్రవీత్." ౪౭

అని మూలము. ఇది రామచంద్రవచనము. సుమంత్రా! రథము నిలుపుమను తండ్రిమాటరీతి నిలుపక రథముఁ దోలుము. మరల నీవు రాఁగా నాతండ్రి యేల నామాటప్రకారము రథము నిలుపక రథముతోలితివని యాక్షేపించినయెడల జనుల కలకలమున వినఁబడలేదని బదులుచెప్పుము. ఏలయనఁగా నా తండ్రి యనుభవించు నీదుఃఖమును జాలసేపు చూడఁజాల కున్నాఁడను. అని రాముఁడు సారథికిం జెప్పెనని మూలార్థము. "అనృతం నోక్తపూర్వమ్మే" అన్న రామమూర్తి యసత్యముం బలుకుమని మంత్రిని బ్రోత్సహించెఁగదా. ఇది భగవంతునకుఁ దగినమార్గమేనా? అని ప్రశ్నము రావచ్చును. దుఃఖము చూడఁజాలననునదియే సమాధానమందుమేని శ్రీరాముఁడు అస్మాదృశుఁడే యగును. విశేషమేమి? అని యాక్షేపింపవచ్చును. సమాధానమేమనఁగా వినుఁడు.

దశరథునకు మృతికాల మెంతదగ్గరనున్నదో శ్రీరాముఁ డెఱుంగును. ఎంతకాలము తన్నుంజూడక దుఃఖించిదుఃఖించి శాపఫల మనుభవించి చావవలయునో యెఱుంగును. కర్మసిద్ధాంతము మార్పరాదన్న శాసనము తనదే. తానొక్కనిమేషమైన నిఁక నిలువఁదరముగాదని భావించెను. పుత్త్రుని జూడవలయు నన్నవాంఛ నిర్భరము కాఁగా నిలుపుమా రథమునుసూతా యని రాజాక్రోశించెను. ఆమాట యిరువురకు వినఁబడియె. నిలుపుడమన్నఁ బోనిమ్మని రామాజ్ఞ. దాని నొనరింపక యుండవలనుపడదు. సూతుఁ డేమిచేయుటకుఁ దోఁచక యూరకుండఁగా రాముఁ డీపలుకు చెప్పెను. సామాన్యదృష్టి నాలోచించిన నిది యసత్యమునకుఁ బురికొల్పెననియే తోఁచును. కాని సూక్ష్మదృష్టింబరికించిన నిది సత్యేతరము కాదనియే తోఁచును. అన్నింటికంటెఁ గర్మమార్గము బలిష్ఠమైనది.

"సత్యం బ్రూయాత్ప్రియం బ్రూయాన్న బ్రూయాత్సత్యమప్రియం,
ప్రియం చ నానృతం బ్రూయాదేష ధర్మస్సనాతనః." ౧౩౮
మను. ౪ అధ్యా.

అని మనుస్మృతి తాత్పర్యము.

"సత్యమ్. అనర్థాననుబంధి యథాభూతార్థవచనమ్. ప్రియహిత ప్రమాణదృష్టశ్రుతార్థ భాషణం వా. అని. విధిముఖప్రతీతివిషయ ఇతి వేదాంతమతమ్. యథార్థజ్ఞానవిషయ ఇతి నైయాయికాః."

సర్వతంత్రసిద్ధాంతపదార్థలక్షణసంగ్రహము.

అనర్థమునకు సంబంధింపక జరగినది మార్పక తెల్పువాక్యము సత్యమనంబడును.

"యథార్థకథనం యచ్చ సర్వలోకసుఖప్రదం,

తత్సత్యమితి విజ్ఞేయమసత్యం తద్విపర్యయమ్."

పాద్మము. క్రియాయోగసారము. ౧౬ అధ్యా.

"సత్యం చ సమతా చైవ దమశ్చైవ న సంశయః,
అమాత్సర్యం క్షమా చైవ హ్రీస్తితిక్షానసూయతా,
త్యాగో ధ్యానమథార్యత్వం ధృతిశ్చ సతతం దయా,
అహింసా చైవ రాజేంద్ర సత్యాకారాస్త్రయోదశ."

మహాభారతము. రాజధర్మప్రకరణము.

అని శబ్దకల్పద్రుమము. ఇతరులకు బాధింపనియర్థము సత్యమని ఁలెడిని. దీనిసారమే మనుస్మృతి తెల్పెను. ఈప్రమాణముల ననుసరించిచూడఁగా తెలిసినదానినిగాని చూచినదానినిగాని వినినదానింగాని దాఁపక యొకటివానిమనస్సు నొవ్వకయుండఁ దెలుపునది సత్యశబ్దార్థము. ఇపుడు రామమూర్తి సుమంత్రునకుఁ దెల్పిన దసత్యముకదా యందురా? జనుల మాటలసందడిలో రథము నిలుపమన్నమాట వినఁబడలేదన్నందున దశరథున కపకారము కలుగదు. ఆమాటవలన సూతునకు లాభములేదు. కాన నిది యసత్యస్వరూపము కాదనవలయు. దశరథుఁడీ ప్రశ్నము చేయఁడనియుఁ దన్నే స్మరించుచు దుఃఖించుననియు శ్రీరాముఁ డెఱుంగును. కావున సుమంత్రుఁ డబద్ధమాడవలసినంత యవసరమే లేదని శ్రీరాముఁ డాలోచించి సర్వజ్ఞుఁడు కానఁ దనకు నద్దాన నపకీర్తి రాదని యూహించియే పురికొల్పెనని మన మూహింపవలయును. చక్కఁగా నాలోచించిన దశరథుఁడే యాప్రశ్న మడిగి సుమంత్రుఁడే సమాధానము చెప్పియుండినచో నిది యసత్యమే యనయును. ఆప్రసక్తి లేనందున నిందు నాదోషము పొసంగ లేదని

మనము తలంపవలయును. దశరథుఁడు మృతినొందును. సుమంత్రుఁడు రాఁగా నీమాట ప్రశ్నింపఁడు. కావున నసత్య మాడ వలయునని పురికొల్పినదోషము నాకు రాదు. అని శ్రీరాముఁ డెఱుంగును. కర్మమార్గము భగవంతునకుఁ దెలియదన రాదు కదా. ఇది యొకమార్గముగా సమాధానము. మఱొక్కరీతిగా నాలోచింతము. దశరథునకు దుఃఖము హెచ్చుచున్నది. రథము నిలిపి మరల నతని నాశ్వాసించి ప్రయాణము చేయు నంతయవకాశము లేదు. దుఃఖభారము నాపుటకు వేఱు మార్గము కానరాదు. తండ్రితో మాటలాడుట కతనికర్మము ననుసరించి రామున కవకాశములేదు. కావున రాజాజ్ఞ మీఱఁ జాలక వగచుచూతున కిట్లు రాముఁడు తెలిపెనను కొన్నను బాధలేదు. సర్వజ్ఞుఁడు శ్రీరాముఁడు కాఁ డనుకొనుచో నిది యసత్యమే యనక తప్పదు. ఆస్తికు లెవ్వరట్టిమాట శ్రీరాముని విషయమై పలుకరుగాన నిదియు సమాధానమే యనవలయును. తనమాటకుఁ దగిన కారణమును రామమూర్తియే తెల్పెను గదా.

"యమిచ్ఛేత్పునరాయాంతం నైనం దూరమనుప్రజేత్,
ఇత్యమాత్యా మహారాజమూచుర్దశరథం వచః." ౫౦

అని మూలము. సాగనంపుపద్ధతి యిందుఁ గలదు. ఎవ్వరు వేగముగ రాఁదలంచి ప్రయాణము సాగింతురో వారిని దూరముగాఁ బోయి సాగనంపరాదు. అనఁగా వారితో మాటలాడుచుఁ జాలదూరము పోరాదని భావము. వారిప్రయాణమున కభ్యంతరము గల్గింపరాదని సారము. ఉదకముండుతావుదనుక సాగనంపవలయునని స్మృతి శాసించుచున్నది. ఆ ధర్మమునే రామాయణము మనకుఁ దెలుపుచున్నది.

“ఓదకాంతాత్ స్నిగ్ధో జనోఽనుగంతవ్యః.”

అని యభిజ్ఞానశాకుంతలమునఁ గాళిదాసు వచించెను. ఇట్టు లీరామాయణభాగము మన కనేకరహస్యవిశేషములఁ దెలుపుచున్నది.

“తిష్ఠ తిష్ఠ సుమంత్రేతి రాజా దశరథోఽబ్రవీత్,
గచ్ఛగచ్ఛేతి రామేణ చోదితోఽచోదయద్రథమ్.”

అని యధ్యాత్మరామాయణమునఁ గలదు. అసత్యశంకకు నవకాశమే యిందుఁ గానరాదు. ఇది యధ్యాత్మరామాయణము కదా, ఇంతకంటె విశేష మీభాగమున నిందుఁ గనఁబడదు. ఇఁకఁ దరువాతికథను బరికింతము.

అపశకునములు పొడమఁగాఁ బ్రజలు దుఃఖించుట.

* శ్రీరాముఁడు జననీజనకులకు నమస్కరించి యడవికిఁ బ్రయాణముచేయఁగనే రాజుంగూడియున్న యంతఃపురకాంతలంద ఱొక్కపెట్టున రోదనధ్వనులు కావించిరి. దిక్కులేనికరుణకుఁ బాత్రులైయుండు నీజనుల కెవ్వఁడు దిక్కైయుండెనో యట్టిరక్షకుఁ డిత్తఱి నెచ్చోటి కరుగుచున్నాఁడో? లేనినిందలఁ దనపై నారోపించినను గోపమూనక, ప్రజలకుఁ గోపము గలుగుపనుల వేనిని జేయక, తనపైఁ గోపమూనువారల మనోవృత్తిని మార్చును. అట్టిమహాత్ముఁడు రాముఁ డెచ్చోటికో పోవుచున్నాఁడు. మనలఁ దల్లివలె భావించి ప్రవర్తించును. అట్టిసత్పుత్త్రుఁ డెచ్చటికో పోవుచున్నాఁడు. కైక నిర్బంధమున రాజు వనములకుఁ బొమ్మనఁగా నెల్లరకు రక్షకుఁడగు శ్రీరామ

* ఈయది నలుబదొకటవ సర్గమునఁ గలదు.

మూర్తి యాయాజ్ఞను దలఁదాల్చి యెచ్చటి కేగుచున్నాఁడో; అక్కటా! రాజునకు బుద్ధి తగ్గినది. సకలజనప్రియుండగు శ్రీరాము నడవికిఁ బంపుచున్నాఁడుగదా. అని పలుకుచు దూడ నెడఁబాసిన ధేనువువలె విలపించిరి. ఆరోదనధ్వని విని పుత్త్రశోకాతురుఁడగు రాజు మఱింత దుఃఖించెను.

రాముఁ డడవికిఁ బోయెనే యన్నచింతచే యజ్వలు హోమము చేయమానిరి. త్రేతాగ్ను లంతర్హితములయ్యెను. గృహస్థులు తమయిండ్ల శయనింపరైరి. ఏపనియు మాని ప్రజలు చింతించుచుండిరి. ముందుగనే సూర్యుఁ డస్తమించెను. గజములుకూడ నాహారమును దినకుండెను. ధేనువులు దూడలకుఁ బాలీయకుండెను. తల్లులు తమ ప్రథమకుమారుఁడు వచ్చినను సంతసముం జూపకయుండిరి. ఇక్ష్వాకువంశకూటస్థుఁడై నక్షత్త్రాకారమున నున్న త్రిశంకువు కుజగురుబుధులు తక్కిన క్రూరగ్రహములు కొన్ని సంగమముచేతను, కొన్ని దృష్టిచేతను, కొన్ని వక్రగతిచేతను జంద్రునిగూడియుండెను. నక్షత్రకాంతి ణించెను. గ్రహతేజస్సులు తగ్గెను. కోసలదేశనక్షత్రమగు విశాఖధూమముచే నావరింపఁబడినచందమున మలినముగఁ గనఁబడెను. మేఘములఁగూడిన మహావాయువు వేగమున సముద్రముప్పొంగునట్లు రామమూర్తి వనమునకుఁ బోవఁగనే యయోధ్య తీరుతప్పినది. దెసలెల్ల ధూమావృతములయ్యెను. ముఁ డడవికిం బోవఁగనే యితరకారణములు లేకున్నను సులు వగచిరి. వారి కాహారవిహారములందు నిష్టము లేకుండెను. జుం దలంచుకొనుచు నెల్లరుఁ జింతించుచుండిరి. అంతియ క వారిండ్లకుఁ బోవక రాజమార్గములయందే యుండిరి. ంతోష మెవ్వారికిని గలుగకుండెను. వాయువు శీతలత్వమును

బాసెను. చంద్రుఁడు చక్కఁగాఁ గనఁబడకయుండెను. సూర్య కాంతి మాసెను. శిశువులు పాలుద్రావ మానిరి. భార్యలు పతులయెడఁ బ్రీతిమానిరి. సోదరప్రీతి యలరదయ్యెను. ఎల్లరు రాముని నే తలంచుచుండిరి. రామునిమిత్రులు దుఃఖముప్పొంగ నేమియుం దోఁపక భూమింబడి లేవకయుండిరి. త్రిలోకాధి పతియగు నింద్రుఁడు లేకయుండినచో భూమండలము తోడ్పాడు లేక కలతనొందుచందమున రాముఁ డడవికింబోఁగా నగరము శోకాక్రాంతమై యాక్రందనధ్వనుల నిండియుండెను.

మహాత్ములారా! ఈభాగమునఁ గొన్ని విశేషములు గలవు. పరికింతము.

"విశాఖస్థ సధూమశ్చ నభసి ప్రచకాశిరే." ౧౨

అనిమూలము. కూటస్థుఁడగు నిక్ష్వాకు రాజు విశాఖయందుఁబుట్టి నందున నయ్యది కులనక్షత్రముగఁ బరిగణింపఁబడినది. ఇందుఁ జెప్పఁబడిన వికారములన్నియు శ్రీరామునివియోగమునఁ గలుగుటంబట్టి వానిం బరికింపఁగా సర్వభూతాంత ర్యామియగు రామునకు విచారము కలిగినపుడు కలిగినవనియు నితర కారణ మేదియు లేదనియుఁ దెలియవచ్చెడిని. ఇది శ్రీరాముని భగ వత్త్వమునే తెలుపుచున్నవి.

"యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున,
న తదస్తి వినా యత్స్యాన్మయా భూతం చరాచరం. ౩
యద్యద్విభూతిమత్సర్వం శ్రీమదూర్జితమేవ వా,
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోంశసంభవమ్. ౪
అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున,

"విష్టభ్యాహమహం కృత్స్నమేకాంశేన స్థితో జగత్." ४౨

గీత. ౧౦ అధ్యా.

అను నీశ్రీకృష్ణోపదేశము పై విషయమును మనకుఁ దోఁపఁ జేయుచున్నది. మనస్సు నొచ్చిన శరీరమంతయు నొచ్చునట్లు భగవంతునకుఁ గష్టముగలిగినట్లుండఁగా సకలభూతములకుఁ గష్టమే కలిగెనని మన మూహించుట పొరపాటుగాదు. ఎంత మంచివారైనను సర్వభూతరంజకులుగ నుండఁజాలరనుటయే సత్యముకదా. తిర్యగ్జంతువులు కూడ దుఃఖించెననుటయే శ్రీరామునిసర్వాంతర్యామిత్వమును దేటపఱచుచున్నది.

దశరథుఁడు శోకించుట.

* శ్రీరామచంద్రుఁడు నగరమునుండి పోవుచుండఁగనే రథధూళి యెంతదనుకఁ గనంబడుచుండెనో యంతదాఁక రాజు రాముని దెసనే కనుచుండెను. ఆధూళి చాలసేపు రాజునకుఁ బ్రియము సుంతగ్రాైన జేయఁగోరి రేఁగినట్లే యుండెను. తుద కది యడంగఁగా రాజు శరీరము కలఁతనొంద వగ పెల్లునఁ గ్రిందఁబడెను. కౌసల్య యతని లేవనెత్తఁబూని దక్షిణహస్తమును బట్టుకొనియెను. కైక భరతునియందే ప్రీతిగలదిగాన రాజు నెడమపార్శ్వమున నిలువఁబడి యూరకయుండెనుగాని లేవనెత్తఁ బ్రయత్నింపదయ్యెను. ధర్మనిరతుఁడగు రాజు కైకం గాంచి కైకా! దుష్ప్రవర్తనము కలదానవు. నన్నుం దాఁకవలదు. నిన్నిఁకఁ జూడనొల్లను. భార్యవు కావు. నీకు నాకును బంధుత్వమే లేదు. నీతోడిసంబంధమే కాక నీకడనుండి బ్రదుకువానికింగూడ నేను రాజనుగాను వారు నాకు భృత్యులు కారు.

* ఇది నలుబదిరెండవ సర్గమునఁ గలదు.

కేవలార్థాసక్తురాలవు. ధర్మమునందు నీకుఁ బ్రీతియే లేదు. కావున నిన్నుఁ ద్యజించెదను. అది సాధ్యమా యందువేమో. వివాహసంబంధమునఁ గలిగెడి యైహికాముష్మికముల నన్నింటిని గూడఁ ద్యజించుచున్నాఁడను. భరతుఁ డక్షయమగు నీ రాజ్యమును బడసి యానందించువాఁడగునేని యతఁడు నాకొసంగు తర్పణాదులు నాకుం జేరక నశించుఁగాక యని యూరకుండెను.

అంతటఁ గౌసల్య ధూళింబొరలాడిన ప్రాణనాథుని లేవనెత్తి దుఃఖించుచు నాతనిం బిలుచుకొని మరలెను. కొడుకు మునివేషమూని యడవికిం బోవుట తలంచుకొని యథార్మికోత్తముఁడు బుద్ధిపూర్వకముగ బ్రాహ్మణుని వధించినవానిచందమున, నగ్నిని గరమున స్పృశించినవానిపగిది మిగుల ననుతాపము నొందుచుండెను. రాముని యనసి మరిగిన త్రోవను అడుగుపెట్టినపుడెల్ల దిరిగితిరిగి చూచుచు దుఃఖించుచు సూర్యబింబము రాహుగ్రస్తము కాఁగా నున్నయట్లు కౌసల్యయు రాజును దేజము దూలియుండిరి. రాముఁ డయోధ్యను దాఁటిపోయెనని యెఱింగి దశరథుఁడు దుఃఖావేశమున నాకుమారుని దీసికొనిపోయిన యుత్తమహయములయడుగులు త్రోవవెంటఁ గనంబడుచున్నవి. కాని యా రామమూర్తిమాత్ర మగపడలేదు. దివ్యచందనము నలందిన యుత్తమాంగనలు వింజామరలు వీచుచుండఁగా మృదులములగు తలగడలయం దుండఁదగిన నా ప్రియకుమారుఁడు ఘోరారణ్యముల వృక్షముక్రింద దారువో పాషాణమో తలగడగా నిడికొని శయనింపఁగలఁడు. తప్పని దీమాట. నా జ్యేష్ఠకుమారుఁడు దీనుఁడై ధూళి తనువునిండ నలముకొనఁగా నిట్టూర్పులు పుచ్చుచు

నేలనుండి లేచును సర్వలోకనాథుఁడా రాముఁడు నేలఁబరుండి లేచిపోవుచుండఁగా వనచరులు నిజముగాఁ గాంచఁగలరు. జనకునిప్రియపుత్త్రిక సీతాదేవి నిరంతరసుఖానుభవమునకే తగినది. అట్టియామె ముండ్లపై నడుగిడి యవి గ్రుచ్చుకొనఁగా బాధలం గుడుచుచుఁ బోవఁగలదు. అడవుల నెన్నఁడే నెఱుంగనియాసీత మహాక్రూరజంతువులభీషణధ్వనుల విని భయమునొందఁగలదు.

కైకా! నీవాంఛితములు ఫలించెనా? ఇఁక విధవవై రాజ్యమేలుము. నేనుమాత్ర మాపురుషోత్తము నెడఁబాసి యెంతమాత్రము బ్రదుకనొల్లను.అని యిట్లు రాజు విలపించుచుండఁగా జనులు గుంపులుగాఁ జుట్టుకొనిరి. బంధువు చావఁగా స్నానము చేసివచ్చువానివలె నమంగళముగా నున్న యానగరమును బ్రవేశించెను. గృహములు మార్గములు శూన్యములై యుండెను. బలాఢ్యులు రామునివెంటఁ బోవఁగా మిగిలినదుర్బలులు కనంబడుచుండిరి. అట్టి యాశూన్యనగరమును గాంచి రాముని స్మరించుచు నేడ్చుచు రాజు మేఘమండలమును సూర్యుఁడు ప్రవేశించునట్లు తనగేహమును జొచ్చెను. మహాసర్పముండుట నెవ్వారికిం గలంపరాకయుండినమడుపును సర్పమును గరుత్మంతుఁ డెత్తుకొనిపోవఁగా సులువుగా నెల్లరు ప్రవేశించునట్లు సీతారామలక్ష్మణులచేఁ బూజ్యమైయుండి వారడవికింబోవఁగా శత్త్రువులకుం గూడ సులభగమ్యమై యాగేహముండెను. రాజంత విలపించుచు మాటలు తడఁబడుచుండఁగా నర్థబాహుళ్యము లేనిచప్పిడిమాటల మహాదైన్యమున రా జిట్లు పలికెను.

నన్ను వేగముగ రామునితల్లి యగుకౌసల్యయింటికిం గొనిపోవుదురుగాక. వేఱొకచో నామనస్సు శాంతి గాంచదని పలికెను. ఆమాట శిరసావహించి మార్గముచూపువార లా

కౌసల్యయింటికిం దీసికొనిపోయిరి. అం దారాజు శాంతునిచందమున నుండెను. అంతట నారాజు శయ్యపైఁబరుండియు శాంతిఁగానక కలఁతనొందుచుండెను. తనయు లిర్వురు కోడలు లేకయుండుట నాగేహము చంద్రుఁడు తారాగ్రహములు నక్షత్రములులేని యాకాశమువలె నుండెను. ఆరాజప్పుడు కౌసల్యనుగాంచి గట్టిగా నక్కటా! శ్రీరామా! నన్ను వదలిపోవుచున్నావే యని యాక్రోశించి రామచంద్రుఁడు మరలరాఁగా నాలింగనముచేసికొని నేత్రపర్వముగాఁ జూచుభాగ్యము గల పురుషులు సుఖమున నాతఁడు వచ్చునంతదనుక జీవించియుండఁగలరు. వారు సుఖమున నాలింగనముచేసికొని వనమునుండి వచ్చిన శ్రీరాముని జక్కఁగాఁ జూడగలరు. నాకు నట్టిభాగ్యము గలుగదని శోకించెను. మఱియుఁ దనకు విలయకాలరాత్రివలె భయముగొలుపునట్లు తోఁచుచున్నరాత్రి రాఁగా రాజు నడిరేయిఁ గౌసల్యం గని యిట్లు పలికెను. ఆతనికంఠస్వరము నిర్భరపరితాపము నొందియున్నచందముగ నుండెను. కౌసల్యా! నాదృష్టి రామునననుసరించియే పోయియున్నది. ఇంకను మరరాలేదు. కనుక నిన్నుఁ జూడఁజాలకయే యున్నాఁడను. నీవు నాపైఁ గోపమూనక కరుణగలిగి యుండవలయు. నీహస్తముచేత నన్ను స్పృశింపుము. అద్దానిచే నాసంతాపము రవంత తగ్గును. అనఁగా నాదేవి శయ్యపైఁ బొరలుచు శ్రీరాముఁ దలంచుచు వగచుచున్న యాదశరథునిం గాంచి చెంతఁ గూర్చుండి చింతించుచు వేఁడియూర్పులు పుచ్చుచు నతికష్టము తోఁచినందున మిక్కిలి శోకించెను.

మహామతులారా! ఈభాగము విశేషార్థభూయిష్ఠ మవలయును. కాన వానిం దెలిసికొనఁ బ్రయత్నింతము.

"యావత్తు నిర్యత స్తస్య రజోరూపమదృశ్యత,
నైవేక్ష్వాకువరస్తావత్సంజహారాత్మచక్షుషీ." ౧

అని మూలము. అయోధ్యానగరము దాఁటఁబూనఁగనే శుద్ధ సత్వగుణము మఱుఁగుపఱచి రజోగుణప్రధానుఁడుగ భగవంతుఁడు చూపెట్టెను. ఆరూపమే దశరథునికన్నులకుఁ గనంబడియెను. దానిం గాంచుచునే యుండెను. దృష్టిని మరలించుకొనఁజాలఁడయ్యెను. అనఁగా రథము కనంబడలేదు. రథము నావరించి పరమేశ్వరుతేజస్సు వెలయుచుండఁగా దానిని రాజు కనుంగొనియె.మరణము సమీపించుచుండువారలకు మున్నున్న సత్వగుణము తొలఁగి రజోగుణము పొడకట్టును. అ_తి సంసారమునఁ బ్రీతి మెండగును. అహంకారము హెచ్చును. మఱింతదాపునకు మృతికాలము రాఁగాఁ దమోగుణము హెచ్చును. ఇది నైజము. అట్టిదుష్టకాలమునఁ బూర్వపుణ్యవశమున నెవ్వానికి భగవంతునిపై నిష్టము కలుగునో వారే తరింతురు.

"అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం,
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః." ౨
గీత. ౮ అధ్యా.

అని శ్రీకృష్ణమూర్తి బోధించెనుగదా. దశరథునకుంగూడఁ దమోగుణము వ్యాపించునా యందురేని మునిశాపమున నాకష్ట మనుభవించియేకాని మృతినొంద నతఁడు శక్తుఁడు కాఁడు. కాని యాతాపము ననుభవించి భగవంతుని గన్న తండ్రి గావున నాశ్రీరామమూర్తినే తలంచుచుఁ బ్రాణముల వదలఁగలఁడని మనమెఱుంగవలయును. అనఁగా శ్రీరామమూర్తి యప్పటితేజస్సు రాజునకుఁ గనంబడుచుండఁగా నవ

శుఁడై చూచుచుండెననియు నెంతకాల మారూపమును దర్శించుభాగ్యముకలదో యంతదనుక దానిం గాంచుచుండె ననియు నిందలివిశేషము.

"కైకేయి మా మమాంగాని స్ప్రాక్షీస్త్వం దుష్టచారిణీ,
న హి త్వాం ద్రష్టుమిచ్ఛామి న భార్యా న చ బాంధవీ. ౬
యే చ త్వామనుజీవంతి నాహం తేషాం న తే మమ,
కేవలార్థపరాం హి త్వాం త్యక్తధర్మాం త్యజామ్యహం." ౭

అని మూలము. దశరథునివాక్కు లివి. దైవకార్యము నెఱవేర్ప నవతరించినకైకను దత్త్వమెఱుంగఁజాలక దుష్కర్మవశమున విభ్రాంతుఁడై రాజామెను దూఱుచున్నాఁడు. కాని విధివశమునఁ గొన్నిమాటలు సత్యముగనే వెడలినవి. మరణకాలమున భావము మార్పునొందునుగదా. కైకా! నన్ను స్పృశింపకుమా నీవు. దుష్టచారిణివి. దుర్వృత్తిగలదానవని సామాన్యార్థము. "చరగతిభక్షణయోః" అన్న ధాతువునుండి "చారిణీ" అనుపద మేర్పడినది. దుర్జనులనడంచుదానవని యర్థము. భగవత్కార్యనిర్వహణమున నరిషడ్వర్గముల జయించినదానవని భావము. అట్టి నీవు నన్నుఁ దాఁకవలదనునా యందులేమో. కేవల శాపఫలము ననుభవించుస్థితియందున్న వాఁడు కానఁ దానేమనుచున్నాఁడో యతఁడెఱుంగఁడని మన మూహింపవలయు "న భార్యా త్వం." నీవు భార్యవు కావు. అనఁగా నేను నిన్ను భరించుకాలముపోయినది. మన యీ సంబంధము తెగిపోవనున్నది. కాన "త్వం న బాంధవీ" అని రాజు పలికెను. అనఁగా నిన్నింకఁ జూడఁగోరను. మృతికాలము దాపురనున్నది. శ్రీరామునే తలంచుకొనుచుందును. నీవిపుడు

నా దేహమును స్పృశించిన నేమేని వికారములు గలుగునేమో. కనుక మనకున్న సంబంధమునే వదలుచున్నాఁడని భావము. ఈభావ మాతనిదే యనవచ్చునా యందురేమో. మునివర్యుఁడు మహాకవివాల్మీకి యీభావము నిందిమిడించెనని యెంచవలయును. లేకున్న నామెను దుర్వృత్తి గలదానవని రాజునోటఁ బలికించునా? కైక సాధ్వి కాదనవచ్చునా? కాదన్నచో శ్రీరాముఁడామెను సంభావించుట యసంగతము కాదా. అట్లు కాఁగూడదుకదా. కాఁబట్టి యేమాత్రమున్నను మంచియర్థమును గ్రహింపవలయునని నాయాశయము.

"ద్రక్ష్యంతి నూనం పురుషా దీర్ఘబాహుం వనేచరాః,
రామముత్థాయ గచ్ఛంతం లోకనాథ మనాథవత్." ౧౮

అని మూలము

"లోకనాథం మహాబాహుం రామం నూనం,
ద్రక్ష్యంతి వనేచరాః పురుషాః."

అని "అనాథవదుత్థాయ గచ్ఛంతమ్." అనియు వరుస. సకలలోకనాథుఁడయ్యు నతఁడు కానియట్లు పోవుచున్న రామమూర్తినాయరణ్యవాసులు చూడఁగలరు. "అనాథవత్" ఇందు సామాన్యార్థము గ్రహింపరాదు. "న విద్యతే నాథోయస్మాత్సః అనాథః. అనాథ ఇవ అనాథవత్" అని గ్రహింపందగు. ఎవ్వనికంటె నింకొకఁడు రక్షకుఁడు లేఁడో యతఁ డనాథుఁ డనఁబడు. అట్టివానివలెనని భావము. సర్వరక్షకునిగా వనచరులెల్ల రామమూర్తిని గాంచఁగలరనియే యిందుఁగలవిశేషార్థము వనములవసించువారనుటచే లోకవ్యవహారసంబంధము లేనివారని యర్థమగును. సర్వకాలము భగవంతునే ధ్యానించువారని తెలియందగును.

పౌరులకంటె జానపదులకంటె వనవాసు లుత్తములని భావము. ఏల? మానవవ్యవహారసంబంధము లేకుండుటయే యుత్తమత్వమునకుఁ గారణము. సర్వసంగపరిత్యాగ మొనరించినవారే భగవద్ధ్యానమున నిలుకడ గలవారలు కాఁదగుదురు. అట్టివారనఁగా మునులని యర్థము. మునులు శ్రీరామమూర్తి లోకరక్షకరక్షకుఁడని భావించి నేత్రఫలముగఁ గనుఁగొందురనియే యిందలిసారము. మన మేమి నేర్చుకొనఁదగు?

భగవంతుని ధ్యానించునపుడు జనసంసర్గము పనికిరాదు. ఏకాంతస్థలము కావలయును. అందుఁ గూరుచుండి యోగాభ్యాసమున బుద్ధి నిలుకడంగాంచఁగా హృదయకమలాంతరమున నాదివ్యమూర్తి నావేశింపఁజేసికొని యానిరుపమ తేజోమూర్తిని ధ్యానింపవలయు. జనసంసర్గము ధ్యానయోగమునకు భంగకరమని తెలియందగు.

"యోగీ యుంజీత సతతమాత్మానం రహసి స్థితః,
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః. ౧౦
తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః,
ఉపవిశ్యాసనే యుంజ్యాద్యోగమాత్మవిశుద్ధయే." ౧౨ గీత. ౬ అధ్యా.

అని భగవద్గీతలు బోధించెడిని. 'రహసిస్థితః' అనఁగా నేకాంతస్థలముననుండి యని యర్థముకదా. అట్లుగాక కొందఱు వేషధారులై గడ్డముం బెంచి యోగులమని దాసులమని భక్తులమని చెప్పుకొనుచుఁ దమకంటెఁ బామరులు తమ్ము వెంబడింపఁగా, వారిమూలమున ధనములాగుచు యోగము నభినయించుచు నెన్నియో పేరులంజెప్పి ధనము సేకరించి రహస్యవర్తనమునఁ దమవారి కొసంగుచుఁ బైకి నిష్పక్షపాతులని తోఁచునట్లు

నటించుచుఁ దిరుగుచుందురు. అట్టి పాషండులు చూచునది దేవళములలోనిపాషాణమునే యని యెఱింగి వారిసంగతికిం బోక మెలంగవలయును. అట్టిపాషండులయుపదేశము నాలకింపఁ జెవులకుం బని కల్పింపరాదు.

"సుఖితా బత తం కాలం జీవిష్యంతి నరోత్తమాః,
పరిష్వజంతో యే రామం ద్రక్ష్యంతి పునరాగతమ్. 32
అథ రాత్ర్యాం ప్రపన్నాయాం కాళరాత్ర్యామివాత్మనః,
అర్ధరాత్రే దశరథః కౌసల్యామిదమబ్రవీత్." 33

అని మూలము. దశరథునకు మృత్యువాసన్నమయ్యెనని యెఱింగెను. నిమిత్తములనఁగా మనోవ్యాపారాదులు దానినే తెలుపుచుండెను. శ్రీరాముఁడు మరలవచ్చినంతదనుక జీవించియుండువారే సుఖితులు. వారే ధన్యులు. ఏలయనఁగా శ్రీరామమూర్తిని దర్శింపఁగలరని తనమరణమును దాఁదెల్పుచున్నవాఁడని యెఱుంగనగు.

"ఆత్మనః కాళరాత్ర్యామివ రాత్ర్యాం ప్రపన్నాయాం సత్యామ్."

కాళరాత్రి యనఁగా సంహారరూపిణి శక్తి యని యర్థము. తమోగుణమయి యని భావము. సత్త్వగుణప్రధానమగు విష్ణునాకృతింగొని రక్షించుచు రజోగుణప్రధానమగు బ్రహ్మయాకృతిం గొని సృజించుచుఁ దమోగుణప్రధానమగు రుద్రునాకృతిం గొని సంహరించుచు మూలప్రకృతియే యొప్పునని భావము.

"సృష్టికర్త్రీ బ్రహ్మరూపా గోప్త్రీ గోవిందరూపిణీ,
సంహారిణీ రుద్రరూపా తిరోధానకరీశ్వరీ."

అను ప్రమాణము పై దానిని దృఢపఱచుచున్నది. రక్షించువారే సంహారింతురా యని కొందఱు ప్రశ్నింతురు.

"కాలః పచతి భూతాని కాల స్సంహరతి ప్రజాః."

అను సూక్తియు,

"కాలోఽస్మి లోకక్షయకృత్ప్రవృద్ధో,
లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః."

అని గీతయుఁ దెలుపుచున్న విషయమేది? భగవంతుఁడు కాల రూపుఁడని సృష్టిస్థితిలయములు చేయువాఁడని యేసమయమున నేదిముఖ్యమో యారూపమునువహించునని తాత్పర్యముకదా. కావునఁ గాళరాత్రి యనఁబరఁగునది పరిపాలించునది కారము కలది కారాదన్న యాక్షేపము నిరాధారమని యెఱుంగవల యును. నడిరేయి కాఁగా రాజు కౌసల్యతోఁ దనవృత్తాంతము నిట్లు తెలిపెను. అనఁగా మృత్యువాసన్నమగుచున్నదని యాతఁ డెఱింగెననియే యిట ముఖ్యము.

"రామం మేఽనుగతా దృష్టిరద్యాపి న నివర్తతే,
న త్వాం పశ్యామి కౌసల్యే సాధు మా పాణినా స్పృశ."

అని మూలము. అనేకార్థములను బోధించుచున్నదని దీనికి వ్యాఖ్యాతలు పెక్కురీతుల భావములను దెలిపిరి వానిం జర్చించుటవలన లాభములేదు. హానిసారము గ్రహింతము మృతికాలమున నొక్కొక్కయింద్రియమే తనతనవ్యాపార మును మానుకొనును. అది యెఱింగి మెలంకువపడి మానవుఁడు తరణోపాయమును వెదకికొనవలయును. అనఁగా భగవంతుని మనగపీఠమున నెలకొలిపి కొలువవలయును. ధ్యానించుచుండ వలయునని సారము.

"ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి,
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా. ౬౧
తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత,
తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతం." ౬౨
గీత. ౧౮ అధ్యా.

అని భగవంతుఁ డుపదేశించినచందమున దేవాలయమునఁ గల పాషాణవిగ్రహమునుగాక సర్వాంతర్యామియైన పరాత్పరుని ధ్యానింపవలయును.

"యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరం,
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః. ౬.
అభ్యాసయోగయుక్తేన చేతసా నన్యగామినా,
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్. ౮
కవిం పురాణమనుశాసితారమణోరణీయాంసమనుస్మరేద్యః,
సర్వస్య ధాతారమంచిత్యరూపమాదిత్యవర్ణం తమసఃపరస్తాత్." ౯
గీత. ౮ అధ్యా.

అని శ్రీకృష్ణమూర్తి చెప్పినప్రకారము భగవంతుని దేజో రూపునిగా ధ్యానించుచుఁ బ్రాణముల వదలిన నాతేజస్సే తమోగుణమును నాశముచేసి పరమపదమును బ్రాపింపఁజేయు నని యేర్పడుచున్నది.

దశరథునకుఁ జక్షురింద్రియము తనపని మానుకొను చున్నది. కౌసల్యా నీవు నాకగపడుట లేదని పలికెఁగదా. అనఁగా నాయింద్రియము స్వవ్యాపారవిరతిం బొందుచున్న దని రామమూర్తి ననుసరించిపోయిన నాదృష్టి యింతదనుక మరలలేదనఁగా భావమేమి? నాచిత్తము శ్రీరామునియందే

యాసక్తమైయున్నదనియే. మరల లేదనఁగా విషయాంతరమునఁ బ్రసక్తిగాంచలేదని యర్థము. ఇఁకఁ ద్వగింద్రియము (చర్మము) కూడఁ దన వ్యాపారము మానుకొనుచున్నదేమో పరీక్షించుకొందును. నీవు కరమునఁ దాఁకుము. సుఖస్పర్శముగ నుండునదికదా నీహస్తము. నిర్మలచిత్తముగలవారిహస్తము పరులకు స్పర్శసుఖమునే కల్గించునని పెద్దలందురు. క్రూరులచిత్తము పరదుఃఖకరముకదా. మరణచిహ్నములలోఁ ద్వక్చక్షురింద్రియములు స్వప్రవృత్తిని మానుకొనుటయే ప్రధానచిహ్నములు. వాని నెఱింగినవారు తరణోపాయము నాలోచించుకొందురు. దీనిసారమేమి?

ఏయింద్రియముగాని యేకార్యమున నియోగింపఁబడునో యాకార్యమునే చేయుచుండవలయును. ఇతర కార్యము నెఱుంగకయుండవలయును. అపుడే యది యాకార్యమున శ్రద్ధకలదిగ నున్నదని మనము గ్రహింపవచ్చును. యోగి యుపాస్యదేవత యందు మనస్సునిలిపి దానినే గాంచుచుండును. ఇతరులు పిలుతురు. ఆశబ్దము శ్రోత్రేంద్రియగోచరము కారాదు. అనఁగా మనస్సు శ్రోత్రేంద్రియమునఁ బ్రవర్తింపకున్నదని భావము. మనస్సు చేరకయున్న దాని కేశక్తియు లేదు. ఒక్కపని చేయుచు రెండవకార్యమునుగూడ నాయింద్రియ మెఱుంగునేని యది కార్యమున శ్రద్ధగలదిగాదని యెఱుంగవలయును. యోగమునకుఁ బరీక్షయిదియే. దశరథుఁడు స్వకీయాయుదంతమును బరికించుచున్నాఁడనుకథ మన కీపరీక్షను దెలుపుచున్నది. పరాకాష్ఠ యన నదియే. ప్రతికార్యమునందు నేకాగ్రత కుదురవలయును. ఇట్టిపరీక్షలమూలమున దానివాస్తవ మెఱింగి

యందుఁగలకోఱంతను దీర్చుకొనవలయును. ఇదియే యీభాగ మునుండి నేర్చుకొనఁదగినవిషయము.

కౌసల్య దుఃఖించుట.

* తరువాతఁ బుత్త్రదుఃఖమునఁ గుంది కౌసల్య తల్ప మునఁబడి పొరలాడుచుండుపతిం గాంచి యిట్లుపలికెను. మహా రాజా! కైకేయి శ్రీరామచంద్రునకు స్వకీయకుటిలప్రవృత్తిరూప విషముఁబెట్టెను. ఇఁక నెమ్మదిగాఁ గుబుసమువదలిననాగుఁబాము వలె నుండఁగలదు. దృష్టికి శృంగారముగ నామె యుండును. శ్రీరాము నడవిపాలుచేసి వాంఛ ఫలింప సుఖమునొందినది. ఇంకమీఁద నామె గృహాగతభుజంగమువలె నెక్కుడు బాధలు గలుగఁజేయఁగలదు. భరతునకు రాజ్యమీయక తప్పకపోయిన యపుడు రాము నడవులకుఁ బాఱఁదోలుటకంటె నన్నము పెట్టక భరతునకు దాసునిగానుండుమని యాజ్ఞాపించినను బాగుండును. ఆస్థితియందు నాకొడుకు భిక్షమెత్తుకొని జీవించుచు నాకుఁ గనఁబడుచున్నైన నుండునుగదా. అట్లు చేయక యడవిపాలు చేయనేల? రాజా! యజ్ఞముచేసినవిప్రుఁడు దేవతల కీఁదగినహవిర్భాగమును నజ్ఞానమున రక్కసులకు నిచ్చి నట్లు మర్యాదమీఱి నీవు రాముని బాఱఁదోలి యతనిరాజ్య మును గైక కిచ్చితివికదా. రాజలక్షణములుగలరాముఁడు సీతాలక్ష్మణులంగూడి ధనుర్ధారియై యడవిని బ్రవేశించు చున్నాఁడు. కైకమాటను బాటించి వన మనఁగా నెట్టిదో యెఱుంగనిసీతను రామలక్ష్మణులను వనమునఁ గాపురముచేయు నట్లు విడిచితివి వారిగతి యేమగును? సుఖింపఁదగువారెల్ల నడ

* ఇది నలువదిమూఁడవసర్గమునఁ గలదు.

వుల నెట్లు జీవింపఁగలరు? నాకుమారుఁడు సీతాసౌమిత్రుల తోడ నాదుఃఖములు తొలఁగునట్లు రాఁగాఁ జూచునంత యదృష్ట మిపుడే కలుగునా? ఒక్కరాత్రి యెందో నిద్ర పోయి వచ్చినవారివలెవారు మరలివచ్చి సకలశృంగారములంగులుకు నీ నగరమును బ్రవేశింపనుండ నీపౌరు లెదుర్కొనుకాల మెప్పుడు వచ్చును ? ఎప్పు డీపౌరు లానందమున మునిఁగి తేలుదురు? ఆఁబోతు ధేనువుంగూడి వచ్చినట్లు సీతను బురస్కరించుకొని రథముపైఁ గూరుచుండి యీరామచంద్రుఁ డెపు డీనగరమును బ్రవేశించును? పరవీరులంజెండు నాకుమారులు రాఁగా జను లెత్తటి రాజమార్గములందుఁ బుష్పములఁ జల్లుదురు? సర్వాలంకారశోభితులై వారు నగరముం జొచ్చుచుండఁ గన్నులార నే నెప్పుడు చూడఁగలను? కన్యకలకు విప్రులకుఁ బుష్పఫలముల నొసంగుచు నాకుమారు లెప్పుడు నగరమునకుఁ బ్రదక్షిణము చేయుదురు? జ్ఞానవృద్ధుఁడు దేవతలవలె నిగువదియొండ్లయీడుగలవానివలె నుండువాఁడు నగు నా రామమూర్తి మూఁడేండ్లబాలునివలె ముద్దులు మూటఁగట్టుచు రాఁగా నే నెపుడు చూతును? నేనుతొలిజన్మమునఁ గ్రూరమతినై శిశువులు పాలు త్రాగఁబూనియుండఁ దల్లులపాలిండ్లుగోసివైచియుందును. సంశయము కలుగదు. కనుక నే యీదుఃఖము నాకుఁ గలిగినది. సింహము దూడను బొలియించి దానితల్లిని దూడలేనిదానినిగా నొనరించినచందమున బిడ్డలపైఁ బ్రీతిగలనన్నుఁ గైక బిడ్డలు లేనిదానినిగాఁ జేసినది. లేకలేక యొక్కకుమారుఁడు గలిగెను. వాఁడు సకలకల్యాణగుణములకుఁ బుట్టినయిల్లు. సకల విద్యావంతుఁడు. అట్టి నాకొడుకు వదలి జీవింపనొల్లను. నా చిన్నారికుమారుని జూడఁజాలనేని బ్రదుకుటకు నాకు దైవము

శక్తినియ్యదు. గ్రీష్మకాలమున సూర్యుఁడు భూమిని దపింపఁ జేయులాగునఁ బుత్త్రవియోగజనితపరితాపాగ్ని మండి నన్ను మఱింత తపింపఁజేయుచున్నది.

సుమిత్ర కౌసల్య నోదార్చుట.

* ఈరీతి విలపించుచున్న సాధ్విని గౌసల్యం గని ధార్మికురాలగు సుమిత్ర ధర్మ్యముగా నిట్లు పలికెను. పూజ్యురాలా! రాముఁడు సకలసద్గుణవంతుఁడు. పురుషోత్తముఁడు. ఆతనింగుఱించి నీవు దుఃఖింప న్యాయముకాదు. దాన లాభమేమి? దైన్యమునఁ గలుగుఫల మేది? మహాబలుఁడగు నీ కొడుకు పెద్దలు పట్టుదలతో నాచరించునదియు మహాఫలవంతము నగుధర్మమును బూని తండ్రి కసత్యదోషము కలుగకయుండునట్లు సత్యప్రతిజ్ఞునిగాఁ జేయువాఁడై రాజ్యమును మాని వనమునకుఁ బోయెను. అంతియగాని యింకేమియుఁగాదు. అట్టి సత్కార్యము నొనరింపఁబోయియుండఁగా నాతని దలంచి వగవరాదు. అనఘుఁడు ప్రాణి దయాపరుఁడు నగులక్ష్మణుఁ డతనికి సేవలు చేయఁబోయెను. ఇవి లక్ష్మణునకు మహాలాభము. కాన వానింగూర్చికూడ వగవరాదు. సుఖార్హురాలగుసీతయు వనవాసకష్టములు తెలిసియుఁ బతివ్రతగావున స్త్రీలకుఁ బతియే దైవమని తలఁచి పతికష్టములఁ బోఁగొట్టఁబూని యడవికిఁ బోవుచున్నది. కాన ధర్మము నాశ్రయించిన సీతనుగుఱించియుఁ జింతింపరాదు. ధ్వజమును ద్రిప్పునట్లు విఖ్యాతిని బ్రపంచమునం దెల్లకడల వ్యాపింపఁజేయుప్రభువు శ్రీరాముఁడు కాన నతనిఖ్యాతి సకలభూతములకుఁ దెలియును. ఇంద్రియముల

* ఇది నలువదినాల్గవసర్గమునఁ గలది.

జయించి యాశ్రితరక్షణవ్రతధనము కలిగియుండు శ్రీరాముని కన్ని మేలులు కలుగును. సకలశ్రేయస్సులు గలుగునట్టి రాముని గుఱించి చింతింపవలదు.

శ్రీరాముని త్రికరణశుద్ధిని, నసమానమహత్త్వమును, దెలిసి భాస్కరుఁ డాతనిశరీరమును దనయుష్ణకిరణముల నించుకంతయు తపింపఁజేయఁడు పవమానుఁడు సర్వదా తగినయట్లు చల్లఁదనము వేఁడిమిని గల్గించుచు హితముగా వీచుచు వనకుసుమపరిమళముల వెదఁజల్లుచుండును. పాపములకు దూరముగనుండు శ్రీరాముని జంద్రుఁడు రాత్రులయందుఁ దుహినకిరణముల నింపుగలుగ సేవించుచుండు. నీకుమారుఁడు శంబరాసురునికుమారుని జంపఁగాఁ గాంచి సంతుష్టుఁడై చతుర్ముఖుఁడు దివ్యాస్త్రము లొసంగెనుగదా. అట్టిశూరుఁడగు రాము నొకరు రక్షింపవలసిన యవసరమే లేదు. బాహుబలమే యాతనిం గాపాడును. కావున నతఁ డడవినివసించిన నింటనున్నయట్లే హాయిగానుండును.

పదునాలుగేండ్లు భరతుఁడు రాజ్యముచేసి ప్రజల లోఁబఱచుకొనఁగా నవ్వల రాజ్యము రామున కెట్లువచ్చునని యనుమానింతువేమో. రామునిబాణములకు లక్ష్యమైన నెట్టిశత్రువులైనను బ్రదుకరు. అట్టి వీరాగ్రేసరునకు భూమి యెట్లు లోఁబడకయుండును? సకలరాజలక్షణసంపన్నుఁడగు రామమూర్తి దేహప్రకాశముఁ జూడఁగా నరణ్యవాసముం దీర్చి వేవేగ రాజ్యమును బాలించునని నాకుఁ దోఁచుచున్నది. దేవీ! శ్రీరాముఁడు సూర్యునకు సూర్యుఁడు, అగ్నికి నగ్ని, ప్రభువులకుఁ బ్రభువు, సంపత్తికి సంపత్తి, కాంతికిఁ గాంతి, కీర్తికిఁ గీర్తి,

ఓర్పున కోర్పు, దేవతలకు దేవత, భూతముల కాదిభూతము.
అట్టి రామున కెందుఁగాని ప్రతిబంధకము లేవేని కలుగఁగలవా?
నగరమును విడిచి రాముఁ డడవికిం బోవుచుండఁగా నెల్లరు
దుఃఖించిరో యా రాముఁడే సీతాలక్ష్మణులతో రాజ్యలక్ష్మితోఁ
గూడివచ్చి పట్టాభిషిక్తుఁడు కాఁగలండు. అపజయమే యెఱుం
గని శ్రీరాముఁడు మునివేషమూని నారచీరలుగట్టి వనమున
కరుగుచుండఁగా సీతవలె రాజ్యలక్ష్మియు వెంబడించియే
పోయెను. ఆ రామునకు దుర్లభ మేది యుండును? విలుకాం
డ్రలో మేటియగులక్ష్మణుఁడు బాణఖడ్గాద్యాయుధములు
దాల్చి రామునకు ముందుఁ దానే పోవుచున్నాఁడు. అట్టి
శ్రీరామునకు లభింపరాని దేదియుండును? ఆర్యా! రాముఁడు
వనవాసము యథావిధిగా నెఱవేర్చి రాఁగా నీవు చూడఁగల్గు
దువు. ఇట్టి యజ్ఞానము దుఃఖము వలదు. సత్యమునే చెప్పు
చున్నానుగాని వేఱుగాదని నమ్ముము. నిష్కళంకయశస్సుగల
దానవు. మరలివచ్చిన శ్రీరాముఁడు నీపాదములకుఁ దలసోఁక
వందనమాచరించునపుడు చంద్రునివలె మనస్సు చల్లఁజేయఁగా
నీవు కన్నులారఁ గాంచఁగలవు. పట్టాభిషిక్తుఁడగు రాముని
జూచి యానందబాష్పముల వదలఁగలవు. తల్లీ! రామున కించు
కయే నశుభము కలుగునని నాకుం దోఁపలేదుసుమీ. కావున
ట్లు నీవు వగవవలదు. శీఘ్రకాలముననే నీవు సీతారాములను
క్ష్మణుని జూడఁగలవు. నిర్దోషురాలవగు నీవు నిన్నేగాక
క్కినవారిం గూడ నాశ్వాసింపవలసినదానవు. అట్టి కాలమే
ఱువి. ఈసమయమున నీవే యీలాగున మనమునఁ గుందు
న్నదానవే. ఏల? శ్రీరాముని గుమారునిగాఁ గాంచిన
వంటిదానికి దుఃఖము తగునా? సన్మార్గవర్తనము గలవారిలో

రాముని మించువా రెందేని కలరా? మిత్రబృందముంగూడివచ్చి రామమూర్తి నీకు నమస్కరించుచుండఁగా మేఘములు వర్షించు నట్లు నీవానందబాష్పములు శీఘ్రమే వదలంగలవు. వాంఛి తార్థముల నొడఁగూర్చు నీకుమారుఁడు తామరలవంటికరముల నీపాదముల నొత్తఁగలఁడు. మ్రొక్కు నకుమారు నానందబాష్పముల నీవే తడుపంగలవు. అని యనేకభంగుల మాటలచే నుప చారము చేయుశక్తిగల సుమిత్రాదేవి కౌసల్య నూఱడించి యూరకుండెను. కౌసల్యయు నామె యాశ్వాసించుచుండ దుఃఖ మును వదలియుండెను.

మహాశయులారా! ఈభాగమున నిమర్శింపఁదగు భాగము లనేకములు గలవు. ఈసర్గమంతయు సుమిత్ర కౌస ల్యకుఁ జేయుహితోపదేశము కలదు. దీనింబట్టి సుమిత్ర "రామం దశరథం విద్ధి" అనుశ్లోకమునఁ గుమారునకుఁ జెప్పిన విషయ మనేకార్థములు గలదని పల్కువారియాశయములు సఫలములే యని తోఁచును.

"ఇదం ధర్మే స్థితా ధర్మ్యం సుమిత్రా వాక్యమబ్రవీత్." ౧.

అని మూలము.

"జన్మాంతరసుకృతవశేన తారామందోదర్యోరివ సుమిత్రాయాః పరతత్త్వ జ్ఞాన మస్తీతి సంప్రదాయః."

అని గోవిందరాజులు వ్రాసిరి. తారామందోదరులకుఁ బరతత్త్వ జ్ఞానము కలదనుట కెట్లు ప్రమాణములు కనఁబడవో యీపె యందుఁ గలవనుటకుంగూడ నట్లే సంప్రదాయార్థములని లేని పోనియర్థములు కొన్ని పలుకుట మతాచారప్రవర్తకులకు సహ జము. కాని యవ్వానివలన లోకమున కపకారమేమియు లేదు

గాన వాని నాక్షేపింపరాదు. ఏది యెట్లున్నను గొందఱు పురంధ్రీమణులకుఁ దత్త్వజ్ఞానము కలదన్నందున మనకు గౌరవమేకదా. కొన్నితావుల నిట్టిసంప్రదాయార్థములు పరమతాచారదూషణపరములుగా నుండును. ఆరూపముగా నాలుగు డబ్బు లార్జించుకొనువారు కొందఱు వేషధారులు గలరు. వారికి నిముక్తియేగాని దాతలకుఁ బుణ్యము కలుగకపోదు. ప్రకృత మనుసరింతము. 'ధ స్థితా' అనఁగా ధర్మనిష్ఠగలదని యర్థము. కౌసల్య దుఃఖించునట్లు దుఃఖింపక తదుపశమనార్థము ప్రయత్నించుటంజేసి పెద్దలవలన ధర్మమార్గము లెఱింగిన సాధ్వి యని తెలియవచ్చెడిని.

"తవార్యే సద్గుణైర్యుక్తః పుత్త్రస్స పురుషోత్తమః,
కిం తే విలపితేనైవం కృపణం రుదితేన వా." ౨

అని మూలము.

"ఐశ్వర్యస్య విభూషణం సుజనతా శౌర్యస్య వాక్సంయమో
జ్ఞానస్యోపశమః శ్రుతస్య వినయో విత్తస్య పాత్రే వ్యయః,
అక్రోధస్తపసః క్షమా ప్రభవితుర్ధర్మస్య నిర్వ్యాజతా
సర్వేషామపి సర్వకారణమిదం శీలం పరం భూషణం." ౮౩

అని భర్తృహరి చెప్పినట్లు సుమిత్ర కౌసల్యకు రామునియందుఁ గల సుగుణసంపత్తిని దెలిపి సద్గుణున కెందును బాధలొదవవని తెల్పుచున్నది. పురుషోత్తమః = ఉత్తమపురుషుఁడు. విశేషణోత్తరపదకర్మధారయ సమాసము. పురుషులలో నుత్తముఁడని యర్థము చెప్పరాదు. అట్టిమహాత్మునిగూర్చి విచారింపనేల? అనఁగా నెవ్వఁడు సుగుణవంతుఁడో యతని కెందునేబాధలు కలుగవని భావము. సత్వరజస్తమోగుణములతోఁ

గూడి యవతరించిన భగవంతుఁడుకదా. అట్టివానింగూర్చి దుఃఖింపఁ బనిలేదని రహస్యార్థము. తెలిసి సుమిత్ర చెప్పినదా యన్నఁ బరమేశ్వరానుగ్రహమున నాసమయమున నట్టిమాటలే తమయంతన దొరలుచుండునని మన మెఱుంగవలయును.

"అరణ్యవాసే యద్దుఃఖం జానతీ వై సుఖోచితా,
అనుగచ్ఛతి వైదేహీ ధర్మాత్మానం తవాత్మజమ్." ౬

ఈపలుకు సీత యడవుల నివసించినదికాదని సుమిత్ర యెఱుంగును. అడవిఁ గలుగుదుఃఖముల నెఱింగియు విదేహరాజ కన్యక సుఖానుభవమునకుఁ దగినదయ్యును ధర్మాత్ముని నీకుమారు ననుసరించిపోయెను. అని సామాన్యార్థముకదా. ఇందు జానకి యనక "వైదేహీ" అని మహర్షి ప్రయోగించెను. ఆపదమే జ్ఞానశక్తి యనునర్థ మిచ్చును. అరణ్యవాసమం దే దుఃఖముగలదో యది యెఱింగి యనఁగా నడవులఁ దావసించి నపుడు రాక్షసులకుఁ గలుగఁబోవుదుఃఖముల నెఱింగినదని భావము. సుఖోచితా=సుఖము చేకూర్పఁదగినది. మునులకు దేవతలకు సుఖముఁ జేకూర్పఁదగినది. అనఁగా దుష్టరాక్షస సంహారమున శిష్టులకు సుఖముఁ గల్పింపఁదగినదని భావము. సర్వబ్రహ్మాండనాయికయని సారము. అట్టి జ్ఞానశక్తి ధర్మమే యాత్మగాఁగల, అనఁగా "వృషో హి భగవాన్ ధర్మః" అను మనుస్మృతివాక్యము ననుసరించి ధర్మమే యాత్మకలవాఁడు. అనఁగా రూపహీనుఁ డగుపరమేశ్వరుఁడని యర్థము. "తవాత్మజమ్" నీకుమారుఁడుగా నున్నవాఁడని యర్థము. నీకుమారుఁడుగాఁ గనంబడురాము ననుసరించిపోయెను. కనుక నామెయే యాతనికి నతఁడే యామెకు సహాయము. ఇతరు లక్కఱలేదని

భావము. సీత సహాయురాలై యుండఁగా నీవేల రామమూర్తిం గూర్చి విచారించెదవని తెలిపెనని మన మెఱుంగవలయు. దీనిచేఁ బ్రకృతిపురుషులు సీతారాములని మనము గ్రహింపవలయును.

"వ్యక్తం రామస్య విజ్ఞాయ శౌచం మాహాత్మ్యముత్తమం,
న గాత్రమంశుభిస్సూర్యస్సంతాపయితుమర్హతి." ా

అని మూలము. శ్రీరామమూర్తిదగు నగ్నిసంబంధమగు తేజస్సును, అనుపమాన సర్వనియంతృత్వాదిలక్షణమగు మహత్త్వము నెఱింగి సూర్యుఁడు తనయాతపముచేఁ దపింపఁజేయఁజాలఁడు. అనఁగా

"ఆదిత్యానామహం విష్ణుర్జ్యోతిషాం రవిరంశుమాన్,
పవనః పవతామస్మి రామశ్శస్త్రభృతామహమ్."

అనియు,

"దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా,
యది భాస్సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః."

అనియుఁ గల భగవద్గీతావాక్యములను బరికించినఁ దెలియఁ జాలు భగవద్రూపమును సూర్యుఁడు తపింపఁజేయునని యేల భ్రాంతిపడియెదవని సుమిత్రయాశయమని మన మూహింపవచ్చును. ఈ రెండు తేజస్సు లొక్కటినిదే కావునఁ దన్నుఁ దానెట్లు బాధించును? అనునదియే యిటఁగలపరమార్థము.

"ధ్యాయేత్సదా సవితృమండలమధ్యవర్తీ నారాయణస్సరసిజాసనసన్నివిష్టః" అనిసూక్తియుఁ బ్రసిద్ధమేకదా. ఇందు నారాయణశబ్దమునకు మధ్వవైష్ణవులు చెప్పెడు త్రిమూర్తులలో నొకఁడగు విష్ణువు కాదనియుఁ ద్రిమూర్తులను బుట్టించు మహాప్రకృతి యెవని

సంకల్పమో యట్టి భగవంతుఁడనియు నర్థమును గ్రహింప వలయు. ఇట్లే వాయుచంద్రులవిషయమునను గ్రహింపందగు. రవిచంద్రు లిరువురు మహాప్రకృతి తాటంకములని యెఱుంగ వలయు.

"తాటంకయుగళీభూతతపనోడుపమండలా."

అని ప్రమాణము.

"దదౌ చాస్త్రాణి దివ్యాని యస్మై బ్రహ్మా మహాజనే,
దానవేంద్రం హతం దృష్ట్వా తిమిధ్వజసుతం రణే." ౧౧

అని మూలము. ఇదిచూడఁగనే యసంగతముగాఁ దోఁచును.

"కదాచిద్రామో దండకారణ్యం గత్వా వైజయంతం పురం నిరుధ్య దశరథ విరోధీభూత శంబరసుతం హతవాన్. తేన ప్రీతో బ్రహ్మా రామాయ దివ్యాస్త్రాణి దదా విత్యవగమ్యతే."

అని గోవిందరాజులు మహేశ్వరతీర్థులు వ్రాసిరి. దీనివలన ననేకసంశయము లుదయించును. సుమిత్ర యీమాట చెప్పు టకుముందే యీయుద్ధము సాగియుండవలయుఁగదా. విశ్వామిత్రుఁడు శ్రీరామునిఁ బంపుమా యని దశరథు నడిగినప్పటివా రిరువురసంభాషణముం బట్టి చూడఁగా నంతకుముం దీవిషయమునకుఁ బ్రసక్తియే లేదని తేలెడిని సీతాకల్యాణానంతరము రాముఁ డయోధ్యనున్న పంద్రెండేండ్లలో నెపుడో సాగియుండ వలయు. ఇంత గొప్పయుద్ధము సాగియుండినయెడల నద్దాని వాల్మీకి వ్రాయకయుండునా యని కొందఱందురు. ఆప్రశ్న మసంగతమన రాదు. దండకారణ్యమునకు శ్రీరామమూర్తి యరిగినట్లు పై గాథ తెలుపుచున్నది. ఆమార్గము రామలక్ష్మణులకుఁ గ్రొత్తయైయున్నవని ముందు రామాయణముననే చదువ

వచ్చును. దశరథునకుఁ దెలియకయుండ నీయుద్ధము సాగి యుండదుకదా. చతురంగబలములతోఁ బంపక యన్నదమ్ము లను రాజు పంపడుకదా. అపుడు దండకారణ్యము రామలక్ష్మణులకుం బ్రాంతదియే యగుంగాని క్రొత్తది కాదు. ఇవన్నియు నొకదాని కింకొక్కటి విరుద్ధముగానున్నవి. "స్థితస్య గతిశ్చింతనీయా" యన్నన్యాయము ననుసరించి యెట్లో సమాధానము చెప్పవలెనని వ్యాఖ్యాతలు వ్రాసిరని యూహింప నవకాశ మేర్పడుచున్నది.

"యదా వ్రజతి సంగ్రామం గ్రామార్థే నగరస్య వా"

అన్నవాక్యమును దీనికి బలిగా నీయఁబూనినను మహాభూతము వంటి యీప్రశ్నమునకుఁ జాలదనియే తోఁచెడిని. వ్యాఖ్యాతలు వ్రాసినపుడు మూల మిది ప్రక్షిప్తమనుటకు నోరాడకున్నది. నాయాశయ మీశ్లోకము ప్రక్షిప్తమనుటయే మంచిదని. ముందే మీనాధారము దొరకిన వ్రాయుదును. ఇపుడిది సరిపఱచుయోగ్యత లేదనియే యంగీకరింతును. వ్యాఖ్యాతలు మహాత్ములు కాన వారిబుద్ధులకిది సరియనియే తోఁచి యుండును. నావంటియల్పమతులకిది తగినసమాధానముగాఁ దోఁపకయున్నది. సమయమొదవిన వ్రాయుదును. ఇప్పటికి మన్నింపుఁడు.

"సూర్యస్యాపి భవేత్సూర్యో హ్యగ్నేరగ్నిః ప్రభోః ప్రభుః,
శ్రియశ్శ్రీశ్చ భవేదగ్ర్యా కీర్తిః కీర్త్యా క్షమా క్షమా.
దైవతం దేవతానాం చ భూతానాం భూతసత్తమః,
తస్య కే హ్యగుణా దేవి రాష్ట్రే వాప్యథవా పురే.

పృథివ్యా సహ వైదేహ్యా శ్రియా చ పురుషర్షభః,
క్షిప్రం తిసృభిరేతాభిస్సహ రామోఽభిషేక్ష్యతి." ౧౭

అనుమూలము

"పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః,
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ. ౫
పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రానశ్వినౌ మరుతస్తథా,
బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత. ౬
ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరం,
మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి." ౭ గీత. ౧౧ అధ్యా.

అనుసీగీతాశాస్త్రవిషయమునే తెలుపుచున్నది. భగవంతుఁడను నది యిదియే తెల్పుచున్నదికదా. పృథివి సీత లక్ష్మి యను మూవురతో శ్రీరాముఁడు పట్టాభిషిక్తుఁడు కాఁగలఁడు. అనఁగా భావమేమి? ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తులను మూవురంగూడి యయోధ్యానగరమున నభిషిక్తుఁడగుననియే. అనఁగా మహామాయంగూడి యని సారము. ప్రకృతి సర్వకార్యము లొనరింపఁ దానసాక్షిమాత్రుఁడై సర్వదా మహానందరూపుఁడై యుండుననియే యిందలివిషయము. ఇఁకఁ దరువాతికథ నాల కింపుఁడు.

రాముఁడు పౌరుల నాశ్వాసించుట.

* అంతఁ బరాక్రమశాలి జనరంజనము చేయ వలంతియు నగు శ్రీరాముఁడు వనమున కరుగుచుండఁ బౌరులు వెంబడించి పోయిరి. శ్రీరామునిమిత్రబృందము నంతఃపురకాంతాజనము

* ఇయ్యది నలుపదియైదవసర్గమునఁ గలదు.

ప్రయాసమున మరల్పఁబడిరి. పౌరులుమాత్రము మరలక వెంట వెంటనే పోవుచుండిరి. శ్రీరాముఁ డవ్వారలకు నాహ్లాదమును గల్గించువాఁడు. కాన వారు పోవలవదని యెంత యభ్యర్థించినను సత్యసంధుఁడు కాన మరలక పోవుచునే యుండెను. వెంటవచ్చు వారలం గాంచి నెయ్యముపొలయఁగా నయోధ్యావాసులకు నాయం దే ప్రీతిగలదో గౌరవబుద్ధిగలదో దానినంతయు నా ప్రీతిని బురస్కరించుకొని విశేషముగా భరతునియం దునుపం దగును. కైకకానందముగూర్చు నాభరతుఁడు సత్ప్రవర్తనము కలవాఁడు. కావున మీకెల్లఁ బ్రియహితముల నుచితరీతి నొనర్పఁగలఁడు. చిన్నవయస్సుగలవాఁడైనను జ్ఞానమున వృద్ధుఁడే. మృదుస్వభావుఁడు. పరాక్రమశాలి. కాన మీకు భయము పొదలకయుండఁ గాపాడఁగలఁడు. రాజగుణాలంకృతుఁడు. మహారాజాతని యువరాజుగా నియమించెను. మనమెల్ల రాజాజ్ఞ శిరసావహింపవలయుఁ గాన భరతుని రాజుగా నంగీకరింపవలయును. నేను వనముననుండునుగాన మీరెల్ల మహారాజు సంతాపములపాలుగాక యుండఁ జూచుచుండందగును.

ఇట్లు రాముఁ డెంత చెప్పినను వారు మరలక రామా! దశరథుఁడు తొలుత నిన్నే యువరాజుగా నొనరించెను. కనుక నామాటను నీవు మేముకూడ సార్థకముగాఁ జేయవలయును. అని పలుకుచుఁ దమభావముల వెల్లడించిరి. కన్నీరుధారగాఁ గాఱుచుండఁగా వెంటవచ్చుచుండుట గాంచువారల కాసోదరు లిరువురన్నేహపాశముల వారల బంధించి యీడ్చుకొనిపోవుచున్న ట్లగపడియెను. జ్ఞానవయోబ్రహ్మవర్చస్సుల వృద్ధులగు బ్రాహ్మణులు తలలు వణఁకుచుండఁగా దూరమునుండియే యోయాజానేయములారా! ఇటు మరలవలయు. పోవలదు.

ప్రభువగు శ్రీరామునకు హితము చేయవలయును. జంతుసంతతి నశ్వములకుఁ జెవులు మిగులఁ బెద్దవి. మాకోరికలఁ దెలిపితిమి. మా యీప్రార్థనను మీకు వినవచ్చును. ఇఁక నవ్వలంబోవక మరలుట న్యాయ్యము. సకలసద్గుణాభిరాముఁ డగు రాముఁడు పురమునకుం గొనిపోవఁదగినవాఁడే కాని యడవులకుఁ దీసికొని పోవఁదగఁడు. అని వగచుచుఁ బలుకుచుండ నాలకించి యావృద్ధ బ్రాహ్మణుల రాక కోర్వఁజాలక శ్రీరాముఁడు రథమునుండి తటాలున దిగెను. వృద్ధబ్రాహ్మణవాక్యములవినియు రథమునఁ బోవుట న్యాయముకాదని తలఁచి వారి నాశ్వాసింపఁబూని మరలిన వ్రతభంగమగునన్న యూహ సీతాలక్ష్మణులతోఁ గాలి నడకలఁ బోవుచుండెను. రథమునుండి వారి నాశ్వాసింప నంగీకరింపక నడిచిపోవుచుండఁగాఁ గాంచి వారు దుఃఖమునఁ బొగులుచు ని ట్లనిరి.

రామచంద్రా! బ్రాహ్మణసేవ నీకత్యంత ప్రీతికరముకదా. మేము నీవెంటవచ్చుచున్నాము. అగ్నిహోత్రముల మోచికొని వచ్చుచున్నారము. శరత్కాలమేఘములవలెఁ దెల్లగానుండు మా యీఛత్రములు వాజపేయయాగమునఁ గల్గినవి. నీవెనుక నివియు వచ్చుచున్నవి. నీకు ఛత్రములేదు. ఎండసోఁకి నిన్ను బాధింపకయుండ మే మీవాజపేయయాగలబ్ధములగు వీనింబట్టి నీడఁ గల్గింతుము ఇంతదనుక నేచింతలులేక వేదము పఠించుచుండిన మాబుద్ధు లిపుడు వనవాసము చేయ వ్యాపించుచున్నవి. మహాధనము మాకు వేదములే. అవి మాహృదయములో నిమిడి యున్నవి. కళత్రములను బాతివ్రత్యమే కాపాడును. మేము కాపాడనక్కఱలేదు. కాన భార్య లిండ్లయందే యుందురు. నిన్ను మరలించి పిలుచుకొనిపోవ దృఢనిశ్చయముగలిగి

యున్నాము. వనమునకేపోదునని యిుఁకఁ బట్టుపట్టకుము. పితృవాక్యపాలనమే ధర్మమని యెంచి యడవికింబోయిన మాకిందు ధర్మరక్షణనిమి_్త మేమియుండును? బ్రాహ్మణప్రార్థనము నంగీకరించుట ధర్మము. దాని నీవే యొప్పుకొనవేని యింతకంటె మిక్కిలి కోరఁదగిన దేమియుండును? నిశ్చలధర్మానుష్ఠానతత్పరుఁడవు. శ్వేతశిరోజములుగల మేము తలలు మేదిని సోఁకమ్రొక్కుచుఁ బ్రార్థింతుము. ఇంకనైన మరలిరమ్మా. నీవెంటవచ్చు మాలోఁ గొందఱు యజ్ఞములు చేయఁగోరి వలయుసంభారముల నేకరించినవారుగలరు. నీవు రాకున్న నవి సాగవు. రాకయున్న వానికి విఘ్నముగావించినట్లే యగును. శ్రీరామా! మేమే కాదు. చరములగుతిర్యగ్జంతువులు స్థావరములగువృక్షములు లోనగునవి నీయందు భ_్తికలిగియున్నవి కాన నిన్ను వేఁడుచు రమ్మనుచున్నవి. అట్టివానియెడ స్నేహముంజూపి వానివేఁడికోలు సఫలముగావింపుము. వృక్షములు నీవెంట రాఁబూనినవి. వాని పాదము లనఁబడుమూలములు కదలనందున వాయువేగమునఁ బొడవుగా లేచిన కొమ్మలతో ధ్వనిచేయుచున్నవి. దానింజూడగా నెత్తుగాహ_స్తము లె_త్తి నీతోడ రాఁజాలకపోయితిమే యని యాక్రోశించుచున్నయూహ పొడమెడిని. పక్షులుకూడఁ దమచర్యలమాని యాహారముమాని యొక్కచోటనుండి సకలభూతదయాపరుఁడవగునిన్ను మరలుమని వేఁడుచున్నవి. అని యిట్లు పలుకుచున్న వారలంగాంచి తమసానది తానుగూడ రామమూర్తి నడ్డగించు దానివలెఁ గనంబడియె. సుమంత్రుఁ డంత నలసిన యు_త్తమాశ్వములను విప్పి యలసటలువాయ భూమిపైఁ బొరలించి నీరు త్రాగించి నీటిచే వానిని గడిగి మేయుటకై త్రిప్పెను.

మహాజనులారా! ఇందుఁగలవి శేషములఁ బరికింతము.

"ఏవమార్తప్రలాపాంస్తాన్ వృద్ధాన్ ప్రలపతో ద్విజాన్,
అవేక్ష్య సహసా రామో రథాదవతతారహ." ౧౭

అని మూలము. తన గమనమునకుఁ దపించువృద్ధబ్రాహ్మణుల యాలాపములు విని రాముఁడు రథమునుండి దిగెను.

"వృద్ధాంశ్చ నిత్యం సేవేత విప్రాన్ వేదవిదశ్శుచీన్,
వృద్ధసేవీ హి సతతం రక్షోభిరపి పూజ్యతే. ౩౮." ౭ అధ్యా.
"ఊర్ధ్వం ప్రాణా హ్యుత్క్రామంతి యూనస్స్థవిర ఆయతి,
ప్రత్యుత్థానాభివాదాభ్యాం పునస్తాన్ ప్రతిపద్యతే. ౧౨౦
అభివాదనశీలస్య నిత్యం వృద్ధోపసేవినః,
చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యాయశోబలమ్." ౧౨౧

మను. ౨ అధ్యా.

అను నీస్మృత్యాచారమునే శ్రీరామునియాచారము తెల్పుచున్నది. వృద్ధభూసురులు నడిచి వచ్చుచుండఁగా దాను రథమెక్కిపోరాదనియు నయ్యది క్షేమమును గూర్పదనియు శ్రీరామునియాశయము. మనకు సదాచారమును దెల్పెడిని.

"యా హి నస్సతతం బుద్ధిర్వేదమంత్రానుసారిణీ,
త్వత్కృతే సా కృతా వత్స వనవాసానుచారిణీ." ౨౪

అని మూలము.

వేదములఁ బఠింప నుపయోగించుచున్న బుద్ధి యిత్తఱి వనవాసోన్ముఖమగునట్లు చేయఁబడినది. అనఁగా వేదాభ్యాసమునకు ఫలము పరమాత్మవగు నిన్నేకాంతవాసమున నారాధింపఁగల్గుటయే యని తాత్పర్యము. వేదపఠనమున సత్కర్మాచరణపరాయణత్వ మలవడును. దాన భగవత్సేవ చేయఁదగుపద్ధతి తెలియఁగలదు. దాని నాశ్రయించి యేకాంతమున ధ్యానిం

చినఁ దదనుగ్రహమునకుఁ బాత్రుఁడు కావచ్చును. అనువిషయ మిందు సూచింపఁబడును. భగవత్సేవచేయుభాగ్యము ఫలాభి సంధిరహితసత్కర్మాచరణమునఁ గల్గునని భావము. అన్నిశ్రేయస్సులకు విధివిహితకర్మాచరణమే ప్రధానమని మన మెఱుంగ వలయును.

"హృదయేష్వేవ తిష్ఠంతి వేదా యే నః పరం ధనం,
వత్స్యంత్యపి గృహేష్వేవ దారాశ్చారిత్రరక్షితాః." ౨౫

అని మూలము. దీనిభావమేమి? వేదములే నిరుపమానధనము. వి హృదయముననే యున్నవి. అనఁగా వేదార్థము హృదయ గతము కావలెను. భగవంతుని వేదవేద్యుని హృదయపీఠమున నిలుపుకొనవలయుననియేకదా. మాభార్య లిండ్లయందే యుందురు. ప్రవృత్తియే వారిని రక్షించును. అగ్నిహోత్ర ములతోఁబోవు బ్రాహ్మణులమాట లివి. భార్యలు గృహముల నయోధ్యయందుండ నగ్నిహోత్రము లడవిలో నెట్లుసాగును? శాస్త్రవిరుద్ధముకదా యని ప్రశ్నింపరాదు. భగవద్ధ్యానమున నాసక్తి కుదురఁగా నీస్మృతులయాచారములు తొలఁగును. వైరాగ్యసంపత్తి కుదురును. సామాన్యధర్మములే యాగము లొనరించుట లోనగునవి.

"యదహరేవ విరజేత్తదహరేవ ప్రవ్రజేత్"

అని ప్రమాణము కలదుకదా. వైరాగ్యముదయింపఁగనే సంసా మును ద్యజింపవలయునని దీనిసారము. "దారాశ్చారిత్ర క్షితాః" అనునది విమర్శింపఁదగినది. పాతివ్రత్యము రక్షిం ఁగా వారు గృహములనుందురనికదా దీనియర్థము. స్త్రీలను

బురుషులు రక్షించుటకు శక్యమే కాదనియు వారిప్రవర్తనమే వారిని గాపాడవలయుననియు దీనిభావము.

"న కశ్చిద్యోషితశ్శక్తః ప్రసహ్య పరిరక్షితుం,
ఏతైరుపాయయోగైస్తు శక్యాస్తాః పరిరక్షితుం. ౧౦
అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైవ నియోజయేత్,
శౌచే ధర్మేఽన్నపంక్త్యాం చ పారిణాహ్యస్య వేక్షణే. ౧౧
అరక్షితా గృహే రుద్ధాః పురుషైరాప్తకారిభిః,
ఆత్మానమాత్మనా యాస్తు రక్షేయుస్తాస్సురక్షితాః. ౧౨

"యాస్తు ధర్మజ్ఞతయా ఆత్మానమాత్మనా రక్షంతి, తా ఏవ రక్షితా భవంతి. అతో ధర్మాధర్మఫలస్వర్గనరకప్రాప్త్యాద్యుపదేశేనాసాం సంయమః కార్యః ఇతి ముఖ్యరక్షణోపాయకథనపరమిదమ్."

అని వాఖ్య. స్త్రీలను బలవంతముగా రక్షింప నెవ్వారికిని సాధ్యము కాదనియు విద్య చెప్పి ధర్మస్వరూపము నెఱింగించి యధర్మాచరణమునకు నరకప్రాప్తఫలమని బోధించి ఆత్మజ్ఞానము కలిగించుటయే వారిని రక్షించునుపాయమని దీని భావము. ఈభాగము మన కేది తెల్పుచున్నది? సద్విద్య స్త్రీలకు నేర్పవలయునని ఆత్మజ్ఞానము కలిగింపవలయుననియు ధర్మకార్యములెల్ల నామెమూలమున జరపుచుండవలయుననియు దాని మూలమున వారిబుద్ధి సన్మార్గముననే ప్రవర్తించుననియు నదియే వారిని రక్షించునదియు నంతియ కాని భయమున వారికి దుష్ప్రవర్తన మలవడకయుండఁ జేయ సాధ్యమే కాదనియు దీనిసారము. ఆర్యులారా! స్త్రీధర్మము లెంతచక్కఁగా మనకు రామాయణము తెలుపుచున్నదో చూడుఁడు. లోకానుభవమున నివి యెంతచక్కఁగా నున్నయట్లుతోఁచునో యోజింపుఁడు. మ...

పూర్వులయాచారము లెంత మంచివిగ నున్నవో తలంపుఁడు. వాని నభ్యసించిన లోకయాత్ర యెంత చక్కఁగా సాగునో పరికింపుఁడు. శ్రీరామునిచరిత్రము మనకు సకలసదాచారములను బోధించుచున్నది. మానవజీవితమునకు ముఖ్యములగు ధర్మములన్నియు సంగ్రహముగ నిందుఁ గలవని మనము నమ్మవలయును.

"యాచితో నో నివర్తస్వ హంసశుక్లశిరోరుహైః,
శిరోభిర్నిభృతాచారమహీపతనపాంసులైః." ౨౭

అని మూలము. ఇవి విప్రప్రవరులమాటలు. వెండ్రుకలు హంసల వర్ణము గలవయ్యెను. అట్టి మేము తలలు భూమిసోఁక మ్రొక్కి నమస్కరించి ప్రార్థింతుము. మాయభ్యర్థనము నంగీకరించి ప్రయాణము చాలింపుము. అని ప్రార్థించిరి. వేదవేదాంగపారంగతులగుబ్రాహ్మణులుకూడ నమస్కరింతుమనిరి. ఇట్లనఁదగునా. అని ప్రశ్నము. వేదాంతవేత్తలు కనుక క్షత్రియకుమారుఁ డనుభావమున నమస్కరింపలేదు. పరతత్త్వమన్న జ్ఞానముననే నమస్కరించుచున్నారు. ఇదియే సమాధానము. ఇందు నమస్కారపద్ధతి తెలుపఁబడినది. భూమిధూళి తనువు సోఁకనట్లు నమస్కరింపవలయుననఁగా సాష్టాంగనమస్కారమని యర్థము. పరతత్త్వమనునర్థ మెక్కడఁ గలదందు రేని "నిభృతాచార" నిశ్చలధర్మానుష్ఠానము చేయువాఁడా యని యర్థము. ధర్మస్వరూపా యని సారము. భగవంతుఁడా యని ఫలితార్థము జ్ఞానదృష్టికి జాతి గోచరింపదు. అందుఁగల పరమాత్మకళయే గోచరించును.

"ప్రణమేద్దండవద్భూమావాశ్వచండాలగోఖరమ్,"

అని శ్రీభాగవతము ౧౧ స్కం.

"విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని,
శుని చైవ శ్వపాకే చ పండితాస్సమదర్శినః."

అను గీతావాక్యము,

"సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని,
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః."

అనుగీతావాక్యము ఇందులకుఁ బ్రమాణములు. జ్ఞానులు సర్వాంతర్యామి యగుభగవంతునినే గాంతురు. బాహ్యరూపమును బరికింపరు. వారే జ్ఞానులు.

కొందఱు యోగివేషధారులు తమమతచిహ్నములఁ దాల్చి సేవించినఁగాని భగవంతుఁడు ప్రీతుఁడు కాఁడంచుఁ బామరులగుశిష్యులకు బోధించి ధనము లాగుదురు. "భగవత్సేవకుఁ జిహ్నము లవసరములే. అవి లేకున్న నది పూజగాదు" అనుటకంతె నవివేకప్రసంగములేదు. బాహ్యచిహ్నము లక్కఱలేదు. నిర్మలమన స్సొకటియే కావలయును. త్రిపుండ్రముగాని యూర్ధ్వపుండ్రముగాని మఱియే యితరచిహ్నములుగాని రవంతయైన నక్కఱలేదు.

"నాహం వేదైర్న తపసా నదానేన న చేజ్యయా,
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి యన్మమ. ౫౩
భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున,
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప. ౫౪
మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః,
నిర్వైరస్సర్వభూతేషు యస్సమామేతి పాండవ." ౫౫ గీత. ౧౧ అధ్యా

అను శ్రీకృష్ణవాక్యములు భగవదారాధనక్రమముఁ దెలుపుచున్నవి. ఇంచుకంతయైన బాహ్యచిహ్నములవిషయము

చెప్పఁబడినదా? పామరులకుఁ దొలుత భగవంతునియందుఁ బ్రీతిగల్గింపఁ గొన్ని చిహ్నములు మనవా రేర్పఱచిరి. ఆమార్గమునఁ బ్రవర్తింపఁబూనినవారల కవియేల?

"పత్త్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి,
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః."

అన్న శ్రీకృష్ణవాక్యమునందు బాహ్యచిహ్నములమాటయే లేదు. స్థిరబుద్ధిగలవారు భక్తిమెయి ధ్యానించినఁ బరమానందమందుదురనియేకదా భగవంతుఁడనియెను. క్షుద్రతమములగు చిహ్నములు భక్తున కేటికి? ద్రవ్యార్జనపరులకే యవి యుపయోగించును. కపటయోగుల కవి ప్రాణాధారములు. పాపార్చకుల కవ్వి మూలధనములు. భక్తుల కవియేల?

"ధర్మధ్వజీ సదా లుబ్ధశ్ఛాద్మికో లోకదంభకః,
బైడాలవ్రతికో జ్ఞేయో హింస్రస్సర్వాభిసంధకః. ౧౯౫
అధోదృష్టిర్నైష్కృతికస్స్వార్థసాధనతత్పరః,
శఠో మిథ్యావినీతశ్చ బకవ్రతచరో ద్విజః. ౧౯౬ మను. ౪ అధ్యా.

బైడాలవ్రతికుఁడు బకవ్రతుఁడు ననునిరువురుమహాత్ములు లోకమునఁగలరని మనువు చెప్పెను. ఈయిరువురిలక్షణములుగలవారొక్కరుగనే యిపుడుండువారు పెక్కండ్రు గలరు. భగవంతునిపేరుచెప్పుకొని యాతనినామముల నమ్ముచు ధనముప్రోగుచేసి ధర్మకార్యము లొనరింతుమని ధర్మమును నిలువఁజేయుచు శిష్యులఁ జేరఁదీయుచు ధర్మము లుపదేశించునట్లు నటించుచు బంధువులకు లోలోన ధనమొసంగుచు సర్వస్వము భగవంతున కర్పింతుమని ప్రల్లదములు పలుకుచు నామాటలనే గాలములవైచి నిష్కపటమత్స్యములంబట్టి వళపఱచుకొనుచు

శిష్యులందఱు తమ్ము పూజించునట్లు పురికొల్పుచు ఛాయాపట ములయందు యోగులవలెఁ గనఁబడుచుందురుమహాత్ములు. కొందఱు బకవ్రతులు బైడాలవ్రతులు కలరు. భక్తులగువారు వారిమాయావాగురులకుఁ జిక్కరాదు.

"భక్తిమంతి హి భూతాని జంగమాజంగమాని చ,
యాచమానేషు రామ త్వం భక్తిం భక్తేషు దర్శయ." ౨౯

అని మూలము.

"ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరం,
మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి." గీ అధ్యా. ౧౧

అన్న యీభగవదుక్తినే యీభాగము మనకుఁ దెలుపు చున్నది. మానవులవలెఁ బ్రవర్తింపఁజాలనివృక్షాదులుకూడ శ్రీరామునియందుఁ బ్రీతిగలవనుటచే నవికూడ శ్రీరాముని వనగమనమునకు వగచుచున్నవని భావము. వానికోరికందీర్పు మా. అనఁగా మృగములు పక్షులు వృక్షాదులు భగవంతు నారాధింపఁజాలవని కొందఱందురు. అది మిగులఁ బొరపాటు. మానవు లారాధించుపద్ధతులు వేఱు. పశువులు లోనగునవి యారాధించుమార్గములు వేఱు. ప్రతిప్రాణియు భగవదారా ధనముచేయు నవకాశము లుండక తప్పవు. లేవన్న నందున్న భగవత్కళకు ఫలమేమి? పూర్వపుణ్యము పరిపక్వముకాఁగా నవి యాస్థితియందే భగవంతు నారాధించును. దాన నవియుఁ గడతేఱును. అట్లుగానిచో భగవంతుని సర్వసమత్వ మూడి పోవును. వరుసగా మానవజన్మమెత్తి యందు విప్రత్వమునొంది జ్ఞానియై ముక్తినొందవలయు నన్న వాక్యముల కర్థమేమని ప్రశ్నింపవచ్చును. అదియు నొకమార్గము. పాలెపురుపు, సర్ప

ము, ఏనుఁగు ననునవి భగవంతునియం దైక్యమైనట్లు స్కాంద పురాణమునఁ గలదు. అట్టికథ లెన్నియో పురాణములయందుఁ గలవు. అవియన్నియు నపసిద్ధాంతములుగావు. వానినెల్లఁ బరి శీలింపఁగా నేయేకర్మము లొనరించి యేజన్మములనెత్తినను సత్కర్మవశమున నాజన్మముల కుచితమైన సేవావిశేషముల నన్నియు భగవదనుగ్రహమునకుఁ బాత్రములు కావలసినవే యని సిద్ధాంతము.

"అనుగంతుమశక్తాస్త్వాం మూలైరుద్ధతవేగినః,
ఉన్నతా వాయువేగేన విక్రోశంతీవ పాదపాః. 30
నిశ్చేష్టాహారసంచారా వృక్షైకస్థానవిష్ఠితాః,
పక్షిణోఽపి ప్రయాచంతే సర్వభూతానుకంపినం." 31

అని మూలము. వృక్షములకుఁ గొమ్మలు చేతులు. వాయువేగ మున గొమ్మలు పైకిలేవఁగా శ్రీరామా! వనమునకుఁ బోవలదని వృక్షములు ప్రార్థించుచున్నవని తాత్పర్యము. "అశ్వత్థ స్సర్వ వృక్షాణామ్." అన్నగీతావాక్యము ననుసరించి వృక్షము లన్నింటిలో నుండుభగవదంశమునకంటె నశ్వత్థమునందు నధి మిక్కిలిగనున్నదనికదా భావము భగవంతున కించుక విచారము కలుగఁగా నెల్లజంతువులకుం గల్గెనన్న విచిత్రమేమి? పక్షులు కూడ నాహారము మానియున్నవన్నను విచిత్రమేమి? ఒక్క మనస్సునకు దుఃఖము కలుగఁగా సకలేంద్రియము లాకులము లగునట్లు భగవంతుఁడించుకవిచారము నభినయింపఁగా నన్నియు దానినే గాంచునని మన మెఱుంగవలయును. అట్టిజ్ఞానముననే మానవుఁడు సముద్ధరనుఁడగు. అదియే భగవంతుననుగ్రహము నకుఁ బాత్రునిగాఁ జేయును.

శ్రీరాముఁడు పౌరులకుఁ దెలియకుండఁ ప్రయాణము సాగించుట.

*అంత శ్రీరాముఁడు తమసానదీతీరమును జేరి సీతం గాంచుచు సౌమిత్రితో నిట్లుపలికెను. సోదరా! మనము చేయఁ దగువనవాసకాలమున నిదియే తొలి రేయి. వనభాగమున మనకు రానున్నది. నీవు సౌఖ్యాదులం దలంచుకొనియేని సీత బడలికలఁ దలంచుకొనియేని కలవిలపాటొందరాదు. వనము లివిగో చూడుము. రాత్రి రానుండఁగా మృగపక్షులు నన్ని భాగములనుండి తమనివాసముల కరుదెంచి యందు శయనింపఁ బూనుచున్నవి. దాన నడవులు శూన్యములై తేజస్సుదూలి మృగపక్షులు చేయుశబ్దములచే విలపించుచున్నట్లున్నది. ఇత్తఱి నయోధ్యయందుఁ గలవారెల్ల మనరాకకై వగచుచుందురు. సంశయమేల? ప్రజలెల్ల గుణవిశేషములంబట్టి రాజునందును మనయందును భరతశత్రుఘ్నులయందును విశేషానురాగము కలవారలుగ నున్నారుగదా. తండ్రిని యశోధురంధరులగు తల్లిని దలంచుకొనఁగా నాకు దుఃఖము కలుగుచున్నది. నాకొఱకు వారు విలపించి విలపించి వరుసగా గ్రుడ్డివారే యగుదురేమో. అనిన నొక్కవిధముగ విచారము తొలంగు చున్నది. ధర్మాత్ముఁడు భరతుఁడౌట ధర్మార్థకామయుక్తములగు మాటలుచెప్పి నాతల్లిదండ్రులవిచారమును భరతుఁడు తగ్గింపఁ గలఁడు. ఆతఁడు క్రూరుఁడుకాఁడని తలంచుకొన్నపుడెల్ల నాకు వారింగుఱించినచింత తొలంగుచున్నది. లక్ష్మణా! నీవు నావెంట వచ్చుటచే మంచిపని చేసినవాఁడవైతివి. నీవు రాకయున్న

---

* ఇది నలువదియాఱవ సర్గమునఁ గలదు.

సీతారక్షణార్థము వేఱు సహాయము వెదుకవలసియుండును గదా. ఆశ్రమ మిపుడు తప్పినది.

ప్రియసోదరా! నేఁడు వనవాసప్రారంభదినము పరమపావనమగు తమసానదీతీరమే యిది. కాన నుపవాసము చేయఁదగు. ఈ రేయి జలపానమే చేసియుందును. అనేకవన్యాహారములున్నవి. కాని నన్ననుసరించివచ్చువారి విచారము తలంపునకు రాఁగా నవి రుచ్యములు నాకుఁ గానోపవు. జలమే నాకిపుడిష్టము. శ్రీరాముఁ డిట్లు సౌమిత్రికిం జెప్పి సుమంత్రునితో నోసౌమ్యా! పరాకులేక గుఱ్ఱములఁ గాపాడుము. అనఁగా నతఁడు రవి క్రుంకఁగానే అశ్వముల బంధించి ఆహార మొసఁగి వానిదాపున నుండె. మఱియు నతఁడు మంగళకరమగు సాయంకాలము సంధ్యనుపాసించి రాత్రియగుటం గని సౌమిత్రిం గూడియున్న రామునకు శయ్య నాయత్తము చేసెను. తమసాతీరమునఁ బర్ణరచితశయ్యం గాంచి లక్ష్మణసీతాసహితుండై యందు శయనించెను. అన్నయు జానకియు నిద్రపోవుటం దిలకించి సౌమిత్రి సుమంత్రునితో రామగుణములు వర్ణించి చెప్పెను. అట్లు చెప్పుచు నా రేయి యంతయు మేల్కా-నియేయుండెను. సూర్యుఁ డుదయించెను. రాముఁడు తనవెంటవచ్చినవారితో ధేనుసముదాయములు నిండియుండు నానదీతీరమున నారాత్రియంతయు నుండెను. అంత శయ్యనుండి లేచి ప్రజలనందఱం గాంచి లక్ష్మణా! మనయందలి ప్రీతిచే గృహాదులయందు నపేక్షమాని చెట్లక్రింద నిందుఁ బరుండిన యీ ప్రజలం జూడుము. వీరి శ్రద్ధనుజూడఁగాఁ బ్రాణములఁగూడ వదలుదురుగాని పూనికను వదలరు. వీరు లేవకముందే మనము చప్పుడుగాకయుండ నరదమెక్కి- నిర్భయమార్గమునఁ బోవుదము. అట్లులైన వీరెల్ల

నన్నుంగూర్చి చెట్లక్రిందనైన శయనింపకయుందురు. రాకొమరులు తమమూలమున మనుజులకు దుఃఖముకలుగఁగా వానిని దమరు పోఁగొట్టఁబడుంగాని తమదుఃఖములను వారలకు గల్గింపరాదుగదా.

అనఁగా సౌమిత్రి ధర్మస్వరూపుఁడగు రామునిం జూచి మహాప్రాజ్ఞుఁడవగు నీపల్కు నాకు సమ్మతమె. వేగమ రథమెక్కుము. అంతట శ్రీమంతుఁడా రాముఁడు సారథిం గాంచి నీవు సమర్థుఁడవు. రథ మాయత్తము చేయుము దానినెక్కి యడవికిఁ బోయెద. శీఘ్రముగఁ బొమ్ము అని తెలుపఁగా నాసారథి యతిత్వరితముగా నుత్తమాశ్వంబులం బూన్చినరథముం దెచ్చి దోసిలొగ్గి రథికవర్యా! ఇదిగో రథము తెచ్చితిని. నీవు సీతాలక్ష్మణులం గూడి యెక్కుము. నీకు శుభంబగుంగాక. అనఁగా నా రాముఁడు శరచాపములుపూని కవచాదులంగొని రథమెక్కి వేగముగఁ బ్రవహించుచు సుడులుగలిగిన యానది నుత్తరించెను. అవ్వలిగట్టునదిగి శివమై యకంటకమగు దారినిబోయెను. తనవెంటవచ్చు ప్రజల నేమఱించుటకై సారథింగని సుమంత్రా! నీవొక్కండవే రథమెక్కి యుత్తరపుదిక్కున కరుగుము. అపుడు పురజనులు నేనయోధ్యకేపోయితి ననుకొందురు. ఒక్కగడియనే పట్లుపోయి రథమును మరలించి మఱియొకత్రోవనరమ్ము. నేను వనమునకుఁ బోవుట పురజనుల కెఱుకపడకయుండులాగున నుపాయము గావింపవలయు. అని రామమూర్తి తెలుప సారథి తదుక్తప్రకారమే యొనరించి మఱొకమార్గమున నరదము మరలించి తెచ్చి నిలుపఁగా రాఘవులిరువురు జానకియు దాని నెక్కిరి. తపోవనమున కరుగుత్రోవనుబట్టి రథముం దోలెను. ఆసారథి యాకాలమున శుభనిమిత్తములం గాంచ నెంచి దాని నుత్తరదిక్కునకుఁ

గొంత పోవనిచ్చెను. దానినెక్కి వా రడవులం గాంచుచుం గొంతదూర మరిగిరి.

మహాత్ములారా! ఈభాగము శ్రీరామమూర్తికరుణా పరత్వమును దెలుపును. స్థాలీపులాకన్యాయము ననుసరించి యించుక విమర్శింతము. ప్రజల వంచించి రాముఁ డరణ్యమున కుంబోయె ననుచో నిది శ్రీరామునకుఁ దగునా యనునాక్షే పము వచ్చును.

"అతో భూయోఽపి నేదానీమిక్ష్వాకుపురవాసినః,
స్వపేయురనురక్తా మాం వృక్షమూలాని సంశ్రితాః. ౨౨
పౌరా హ్యాత్మకృతాద్దుఃఖాద్విప్రమోక్ష్యా నృపాత్మజైః,
న తే ఖల్వాత్మనా యోజ్యా దుఃఖేన పురవాసినః." ౨౩

అనునివి శ్రీరామవాక్యములు. ఇవి శ్రీరాముని కర్మసిద్ధాంత పరత్వము నుపపాదించుచున్నవి. అప్పటిపౌరులెల్ల శ్రీరాముని విరహము నోర్వఁజాలనివారనుట స్పష్టముకదా. వారిమన స్సులు శ్రీరాముని సర్వవ్యాపకత్వము నెఱుంగఁజాలకున్నవి. భగవంతునింగూడి వనములఁ జరించి తత్సంగతి మెలంగుచుఁ దన్మహత్త్వము నెఱుంగఁజాలినసత్కర్మములు వా రాచరించిన వారు కారు. హృదయకమలకర్ణికారమున నామహాత్ముని తేజో రూపమును నెలకొలిపి ధ్యానించునంతటిపుణ్యము చేసినవారు కారు కావున వారు తనతో నుండవలసినవారు కారు. తన్నే తలంచుచు విచారమునఁ గుందవలసినకర్మములు చేసినవారు. కావున నాకర్మఫలముల వారనుభవించునట్లు చేయుట భగ వంతునిపని గావున నట్లే యొనరించెననియే సమాధానము. మఱియొక్కనీతి యిందుఁగలదు. ఇతరులు దుఃఖపడుచుండఁ

దాను దానిఁ దీర్పవలయుననియు నయ్యవి విశేషించి క్షత్రియ కుమారునకుఁ గృత్యమని యాశయము. తనదుఃఖము నితరులకుఁ గల్గించుట యవివేకము. ఇది రాజధర్మముగనే తోఁచును. కాని యితరులకుంగూడ నుపలక్షణవిధిచే నిది నీతిని బోధించును. తనవలన నితరులు కష్టపడరాదనుటయే యిట ముఖ్యము. ఇతరులకు శ్రమము కలిగింపని కార్యములనే చేయవలయును. అనఁగా నితరులను బాధించుకార్యము లేవియుఁ జేయరాదనియే యిందుఁగలసారము. అహింసావ్రతసిద్ధాంత మిదియే.

"అహింసా సత్యమక్రోధస్త్యాగశ్శాంతిరపైశునం,
దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలం.
తేజః క్షమా ధృతిశ్శౌచమద్రోహో నాతిమానితా,
భవంతి సంపదం దైవీమభిజాతస్య భారత." 3

అను నీగీతాశాస్త్రమునాశయమే యిందుఁగలదు. దైవీసంపద్విచారమున నహింస తొలుతఁ జేర్కొనఁబడినది. అహింసాధర్మమున నన్నిధర్మము లిమిడియున్నవని భావము. ఇతరులకు దుఃఖమును గల్గింపరాదనఁగాఁ దనకార్యముమూలమున నితరులు శ్రమంపడరాదనికదా తాత్పర్యము. ఇట్లు రామాయణము విమర్శించుకొలఁదిని ధర్మములు విశేషించి తెలిసికొవచ్చును. శ్రీరామచంద్రునభిప్రాయము పరులను బాధించుకారములు చేయరాదని తేలెడిని.

పౌరులు రామునిం గానక యయోధ్య కరుగుట.

* బల్లున తెల్లవారెను. పౌరులు శ్రీరామునిం గాన శోకించి నిశ్చేష్టులైరి. కన్నీరు స్రవించుచుండ నలుదిక్కుల

* ఇది నలువదేడవసర్గమునఁ గలదు.

గాంచుచు రథధూళినైనం గాంచఁజాలక మిగుల విలపించిరి. మిక్కిలి ప్రియుఁడగు రాముఁడు తమ్మేమఱెంచిపోవుటంజేసి దీనులై యొండొరులతో నిట్లు చెప్పుకొనిరి. ఈపాడునిద్ర యేటికివచ్చెను? రామునిం జూడకుండఁజేసిన దీనిద్రయేకదా. ఆమాన్యుఁడాశ్రితుల నిష్ఫలమనోరథులఁ జేయువాఁడు కాఁడు. అట్టికరుణానిధి యీభక్తుల వదలి వనమున కెట్లు పోయెను? కన్నకొడుకులం దండ్రి కాపాడుచందమున మనల నిరంతరము కాపాడురామమూర్తి మనల దిగనాడి యెట్లు పోయినాఁడు? ప్రాయోపవేశముపూని ప్రాణముల నిందే వదలుదము. మరణదీక్షఁబూని యుత్తరదిక్కుంగుఱెంచి పోవుదము. అంతియకాని రామునివదలి బ్రదుకఁజాలము. వలసినన్ని శుష్కదారువులున్నవి. చితింబేర్చుకొని యగ్ని రగిలించి మన మందుఁబడిచచ్చుట యుత్తమము. అయోధ్యకుంబోయిన నడిగినవారికి బదులేమని చెప్పుదుము? మహాభుజుని రాముని బిలుచుకొని పోయి యడవిలో వదలివచ్చితిమనికదా చెప్పవలయు. అది తగునా? మనము రాముఁడు లేక పురికింబోయిన నందుఁగలవారెల్ల దుఃఖమునఁ దపించుటమాత్రము సత్యము. రాముఁడు మనోనిగ్రహముకలవాఁడు. అట్టివానితోడ నగరమునుండి బయలువెడలితిమి. ఇపు డాతని దిగనాడి మనమే యెట్లు పురముఁ బ్రవేశింతుము?

అని యిట్లు పలుకుచు దూడనువదలిన గోవ్రాతమురీతిఁ బలవించిరి. తరువాత వారు రథమార్గమునుబట్టి కొంతదూరము పోయి పిమ్మట నది కనంబడక పోవఁగా విషాదనిమగ్నులై యింకేమిచేయవచ్చును? దైవముకూడ మనయెడ ద్వేషించెను. అని యేడ్చుచు మరలిరి. వచ్చినదారింబట్టి దుఃఖించుచునే పోయి

యయోధ్యం జేరిరి. అందుఁగలపుణ్యపురుషులెల్ల వగలఁబొగులు చుండిరి. పురమున సమ్మార్జనాదులు లేకయుండ మఱింత వగచిరి. హ్రదముననుండు భుజంగమును గరుత్మంతుఁడు తన్నుకొని పోయిన నది యెట్టులుండునో యట్లు శ్రీరామచంద్రుఁడు లేని కతన నగరము చులకనగానున్నదే యని యూహించుచున్న యాపౌరులకు నాపురము చంద్రుఁడు లేని రాత్రినలె జలములు లేనిసముద్రముకరణిఁ గనుపట్టెను. ఆదుఃఖావేశమున వారు తమయెదుటనుండువారు తమవారో యితరులో కనుఁగొనఁ జాలకయుండిరి.

మహాజనులారా! ఈభాగమున విమర్శించి తెలిసికొనఁ దగిన దేదియుఁ గానరాదు. సర్వజనుల రంజించువాఁడు రామ చంద్రుఁ డన్నభావమునే యీభాగము దృఢపఱచుచున్నది. కావునఁ దరువాతిభాగమును బఠింతము.

—● మహాజనులు రాముని గూర్చి వగచుట. ●—

* పౌరులందఱు రాముని వదలిన వగలవెంపున దిక్కుఁ దోఁపక కృశించుచు నట్టె మూర్ఛిల్లిరి. గృహముల కరిగి యాలు బిడ్డలం గాంచి మఱింత వారింగూడి వగచిరి. మిత్రసందర్శనము దుఃఖము నడంపఁజాలదయ్యెను. ఎట్టియపూర్వవస్తువులు దొ కినను సంతసింపకయుండిరి. వ్యాపారము నిలిచిపోయి పురము పాడుపడినట్టులుండెను. అన్ని కార్యములు సాగకుండెను. గృహ స్థులు శయనింపక రామునే తలంచుచుండిరి. రత్నములు దొ కినను మోదమందకుండిరి. ప్రథమకుమారుఁడు వచ్చినను సంతస మొదవకుండెను. అంతటఁ బురంధ్రీమణులు విలపించుచు నిండ్ల

* ఇది నలువదెనిమిదవసర్గమునఁ గలదు.

కర్షు డెంచినభర్తలం గాంచి యంకుశములచే నేనుఁగులం బోడుచుచందమున మనస్సు నొవ్వఁజేయుమాటలచేఁ దూల నాడిరి. ప్రాణేశులారా! శ్రీరామమూర్తిని నేత్రఫలముగాఁ జూడలేనివారలకు గృహము లేటికి? పత్ను లేల? వారికి ధనపుత్త్రులచేఁ బ్రయోజనమేమి? సుఖము లెందులకు? సీతాదేవింగూడి యడవికింబోయినయన్నకుఁ బరిచర్య చేయ నరిగినలక్ష్మణుఁ డొక్కండే యీలోకమున సత్పురుషుఁడు. రామమూర్తి యెందెందు స్నానము చేయునో యవియెల్లఁ బుణ్యవంతములు. నదులు వనములు వృక్షరాజము లామహాత్మునకు సంతోషము జేకూర్పఁజాలును. ఆరాముఁ డడవికేని కొండలకేని పోయిన నవి సంతోషమునఁ బ్రియాతిథిం బూజించుసజ్జనుల లాగునఁ బూజింపకయుండవు. వనస్పతులు భూషణములవలెఁ బూవుగుత్తులుగలిగి భృంగఝంకారములు చెలంగ రామున కానందమును గూర్పఁగలవు. పర్వతములన్నియు శ్రీరాముని గన్న ప్రీతిచే నాకాలముననుండు దివ్యప్రసూనముల నింపుఁ గూర్పంగల్గును. అవియు మఱియు సెలయేళ్లం గనఁబఱచుచు నిర్మలజలముల నీఁగలవు. మహాభుజుఁడగు రాముఁ డెందుండునో యందు భయమే యుండదు. కాన మనమెల్ల నిపుడే పోయి శ్రీరామునిం గాంతము. మహాప్రభువగు నతనిసేవయే సౌఖ్యమొసంగును. నాథుఁ డతఁడే. గతి యన నతఁడే. మేమెల్ల జానకీదేవికి సేవలు చేయుదుము. మీరు శ్రీరామునకు శుశ్రూష లొనరింపుఁడు.

అని యీరీతి నాపౌరపురంధ్రీమణులు దుఃఖాతురలై పలుకుచు మరల నిట్లు పలికిరి. మనయోగక్షేమముల నారాముఁడు లేని యీపురము వాసయోగ్యము కాదు.

స్తము. కాన నిందు వసింపనేల? దీనఁ బ్రీతియేమికల్గును? అధ్వర మున కునికిపట్టగు నైకకే యిది తగును. మాకుఁ బ్రాణముల యింపుగావు. కొడుకులేల? భాగ్యముకొఱకుఁ బెనిమిటిని వద లినకైకయే దేనినైన వదలఁజాలదా. ఆమె బ్రదికియుండఁగా నీ రాజ్యమునఁ బ్రాణము లుండుదనుక సేవకులవలె వసింపనోపము. పుత్త్రులసాక్షిగా నిది సత్యము. శ్రీరామునే యడవికింబంపిన దుర్వృత్తురాలగు కైకకడ నెవ్వరు సుఖముగా నుండఁగలరు? ఈరాజ్యము దిక్కులేక ధర్మము లేక పాడుపడియున్నది. ఒక్క కైకకారణమున నిది నశింప సిద్ధముగా నున్నది. రాజు బ్రదుకఁ జాలఁడు. అతఁడు చావఁగా నంతయునశించుననుటయ చ్చెరువా? మాకుఁ బుణ్యము క్షీణించినది. మీరుకూడఁ గేవలదరిద్రులే. ఈవిషయము నాలోచించి విషమునైన ద్రావుఁడు. లేకున్న రామునననుసరింపుఁడు. వలనుపడదేని పేరుకూడఁ దెలియనట్టి దూరదేశమునసైన నుండుఁడు. రాజు కపటమూని సీతారాముల నడవికింబంపినాఁడు. పశువులను గటికవానికి వశముచేయునట్లు మనలనందఱ భరతునివశమున నుండఁజేసినాఁడు. ఇది యకా ర్యము కాకపోవునా? కాదని యెవ్వారైన ననఁగలరా? మోహానా కారుఁడగు రాముఁ డెందున్న నాభాగము మిగులఁ బ్రకా శించును.

ఇట్లు పౌరకాంతామతల్లులు పలవించుచుండిరి. అంత సూర్యుఁ డస్తమించెను. రాత్రి యరుదెంచెను. అగ్నిపూజా కార్యము సాగదయ్యెను. వేదాధ్యయనాదికార్యములు నిలిచి పోయెను. అంధకారముపూసినట్లు క్రమ్ముకొనియెను. వర్తకులు తమకృత్యములమానిరి. సంతోషము లేదయ్యె. నక్షత్రములు లే యాకసమువలె నయోధ్యయుండెను. పుత్త్రులను దోఁబుట్టువుల

నడవులకుంబంపిన వగచునట్లు స్త్రీలు రామునిం దలంచి దుఃఖించిరి. పుత్రభ్రాతలకన్న వారికి రాముఁడే యెక్కుడుకదా. పురమున నెందును సంతోషమును గల్గించు కార్యమే సాగకుండెను. శుష్కసాగరముభంగి నానగరము చూపట్టెను.

మహాత్ములారా! ఈభాగమునఁ గూడ విశేషములు లేవు. ఇందుఁ గులకాంతలు పెనిమిటుల దూఱుజాడలు గోచరించును. అవి శ్రీరామునిపైఁ గలమహాభక్తిని సూచించునే కాని యసాధ్వీత్వమును దెలుపవు. శ్రీరామవియోగము దుస్సహమనియే యీభాగము మనకు బోధించునే కాని యితరవిషయమును గాదని మనము గ్రహింపవలయును. ఇప్పట్టు శ్రీరాముని సర్వాంతర్యామియగు నీశ్వరుఁడని దృఢము చేయుచున్నది. కావున మనముకూడ వారివలె నాభగవంతుని హృదయారవిందమునుండి కదలనీయక నిలుపుకొనఁ బ్రయత్నింపవలయు. అదియే దృఢభక్తి యనుపించుకొనును. అద్దాని నలవరించుకొనుట మనకు విధి.

శ్రీరాముఁ డడవికింబోవుచు సుమంత్రునితో భాషించుట.

*అట శ్రీరామచంద్రుఁడు పితృనానతిఁ దలంచుచు నారాత్రిశేషమును బయనమున ముగించి తెల్లవాఱునప్పటికిఁ జాలదూరముపోయెను. అంతఁ బ్రాతస్సంధ్యనుపాసించి యుత్తరకోసలదేశసీమాంతభాగముం జేరెను. భూములు సస్యములు విత్తుటకై చక్కఁజేయఁబడియుండెను. వృక్షములు పుష్పించియుండెను. వానింగాంచుచు మహాగ్రామములందును బల్లియల

* ఇది నలువదితొమ్మిదవసర్గమునుండి గ్రహింపఁబడినది.

యందును గోపురముందుజను లాడుకొనుపలుకు లాలకించుచు గు ములు వడివడింబోవుచున్నను వానిగమనవైచిత్రి నందలి వి షములం దిలకించుచు మందగమనమునఁ జనినయట్లు చాల దూరముపోయెను. జనపదవాసు లారామమూర్తిం గాంచి యయ్యో! దశరథమహీపతి యెట్టివాఁడు? కామమునకే లోఁబడియెను. క్రూరురాలు కైక యెంతపాపాత్మురాలు. నిరంతరము పాపములే చేయుచుండును. సకలసద్గుణములు గలరాముని వనములకుఁ బంపినదే. కులతాంతలమర్యాద నతిక్రమించెను. క్రూరకార్యమున నాసక్తిగలది. కాఁబట్టియే మహాభాగ్యవంతురాలగు జానకిని గష్టములుపాలుచేయఁబూనినది. రాజునకుఁ బ్రీతిలేదు. కనుకఁ బ్రజారంజకుఁడై నిర్దోషుఁడై యుండు నాత్మజుని శ్రీరాముని ఎదల నిష్టపడియెఁగదా. అని మాటలాడుకొనిరి. రాముఁడు వారిమాట లాలకించుచుఁ గోసలదేశమును దాఁటిపోయెను.

అంతట నారాముఁడు స్వాదూదకములుగల వేదశ్రుతి యనునది నుత్తరించి దక్షిణదిక్కున కభిముఖుఁడై కొంతదూరముపోయి గోమతీనదిని దాఁటెను. అందుఁగలజలము పానార్హము. దానిసవ్యభాగమున సహస్రసంఖ్యలు గోవులుండును. ఆనది గంగానదీమూలమున సముద్రగామిని యయ్యెను. నెమిళ్లు హంసలు ధ్వనిచేయుచుండుటం జేసి, యింపుగానుండు స్యందికానది నుత్తరించి మున్ను మను విక్ష్వాకువున కొసంగినది విశాలము నవాంతరజనపదములుగలదియు నగుకోసలదేశమును రామమూర్తి సీతకుం గనఁబఱచెను. హంసధ్వనివంటిధ్వనితో సూతా యని పిలిచి యింక నెపుడు మరలివచ్చి జననీజనకులం గూడి పుష్పితమగు సరయూనదీతీరవనమున వేఁటలాడుచు

విహరింపఁగలను? పెద్దలు వేఁట నంగీకరింపరందు వేమో. వనమున వేఁట పరలోకసుఖదము కానిదైనను రాజుల కీలోకమున నింపుఁగల్గింప నేర్పడియున్నది. సదాచారనిరతు లగుమానవులు శ్రాద్ధాదికాలములయందు మాంసార్థము వేఁటను గోరుచుందురు. ధానుష్కులు లక్ష్యశుద్ధికొఱకు దీనిని గోరుచుందురు. అయినను నేను మృగయావిహారమును విశేషించి కోరను. సరయూనదీతీరమున రవంత వేఁటచేయఁగోరెదను. సర్వదా దీని నొనరించిన దోషము కల్గు. కొంచెము చేసిన దోషము రాదు. అట్టివేఁట యుక్తకాలమునందుఁ జేయుట రాజర్షిసమ్మతమే. దీని వంటి వినోదకేళి వారి కింక నొకటిలేదు. అని యీరీతి మధురోక్తుల నాయావిషయములఁ దెల్పుచు మార్గము గడచిపోవుచుండెను.

మహాత్ములారా! ఇందు విశేషములు కొన్ని గలవు. వానిం దెలిసికొందము.

"కదాహం పునరాగమ్య సరయ్వాః పుష్పితే వనే,
మృగయాం పర్యటిష్యామి మాత్రా పిత్రా చ సంగతః". ౧౫

అని మూలము. తల్లితోఁ దండ్రితోఁ గూడి సరయూనదీతీరమునఁ గల కాననములు పుష్పించియుండ నెపుడు వేఁటలాడఁగలను? అని సుమంత్రునకు రామచంద్రుఁడు తెలిపెను. దీనిచే రామునిభావమేమి? ఇఁక నీయవతారమున జననీజనకులంగూడి మృగయావిహార మిందు సాగింప వలనుపడదని భావము. దీనిచేఁ బితృమరణము సూచింపఁబడినది. సర్వజ్ఞత్వమున కిది యుదాహరణము.

"రాజర్షీణాం హి లోకేఽస్మిన్ రత్యర్థం మృగయా వనే,
కాలే వృతాం తాం మనుజై ర్ధన్వినామభికాంక్షితాం. ౧౬

నాత్యర్థమభికాంక్షామి మృగయాం సరయూవనే,
రతిర్హ్యేషాతులా లోకే రాజర్షిగణసమ్మతా" ౧౭

అని మూలము.

"దశ కామసముత్థాని తథాష్టౌ క్రోధజాని చ,
వ్యసనాని దురంతాని ప్రయత్నేన వివర్జయేత్. ౪౫
కామజేషు ప్రసక్తో హి వ్యసనేషు మహీపతిః,
వియుజ్యతేఽర్థధర్మాభ్యాం క్రోధజేష్వాత్మనైవ తు. ౪౬
మృగయాక్షో దివాస్వప్నః పరివాదః స్త్రియో మదః,
తౌర్యత్రికం వృథాట్యా చ కామజో దశకో గణః. ౪౭
పైశున్యం సాహసం ద్రోహఈర్ష్యాసూయార్థదూషణం,
వాగ్దండజం చ పారుష్యం క్రోధజోఽపి గణోఽష్టకః. ౪౮
ద్వయోరప్యేతయోర్మూలం యం సర్వే కవయో విదుః,
తం యత్నేన జయేల్లోభం తజ్జావేతావుభౌ గణౌ." ౪౯

మనుస్మృతి ౭ అధ్యా.

అను మనుస్మృతిప్రమాణముల ననుసరించి వేట కామము వలనఁ గలుగుదుర్వ్యసనమనియు దాని కాధారము లోభమనియు దానిని బ్రయత్నపూర్వముగా వదలవలయుననియు నేర్పడుచున్నది. రామాయణమునందు శ్రీరామమూర్తియే వేట రాజర్షిసమ్మతమని చెప్పెను. ఇందేది సత్యము? అని ప్రశ్నించువారుందురు. ఇందు శ్రీరామునాశయ మేమనఁగా శ్రాద్ధాదికార్యార్థము వేటసల్పుట పాపహేతువు కాదనియు సదాచారనిరతులగు మానవు లద్దాని నాకాంక్షింతురనియు రాజర్షులుకూడ విహారార్థము వేటనభిలషింతురనియు నట్టి సనాతనశిష్టాచారము ననుసరించి తానుగూడ వేటాడఁగోరుదు

ననియు నైయున్నది. అయ్యది విశేషించి చేయక ప్రాద్ధుపోకకుఁ జేయుట దురాచారము కాదనియు శ్రీరామునాశయము. దీని సారమేమి?

"నాత్మార్థం పాచయేదన్నం నాత్మార్థం పాచయేత్పశూన్,
దేవార్థం బ్రాహ్మణార్థే వా హన్యాన్నైవ హ్యపశూన్ ద్విజః"

అను ప్రమాణము ననుసరించి అతిథి దేవతాపూజకొఱకుఁ జేయు విధివిహితహింస యహింసయే యని తేలెడిని. పూర్వకాలము శ్రాద్ధాదికార్యములకు మేధ్యపశుమాంసము విధివిహితమైయున్నది. అయ్యది ప్రయత్నసాధ్యము కాని యప్రయత్నలభ్యము కానేరదు. వేఁట హింసాకర్మమే. అయ్యది బ్రాహ్మణునకు విహితము కానేరదు. మనుష్యులను బాలించు రాజు మానవులసుఖముపొంటెఁ జేయుకార్యములు పాపమును గల్గింపఁజాలవు. క్రూరమృగబాధ లేకుండఁజేయుటకై హరిశ్చంద్రాదిచక్రవర్తులు వేఁటసల్పిరని పురాణములు తెల్పుచున్నవి. అదియుఁ గొలఁదిగఁ జేయవలయుననియు సర్వకాల మాకార్యముననే ప్రయత్నించి మానవపాలనాదికార్యములు వదలరాదనియు శ్రీరాముఁడు తెలిపెను. కావున మనుస్మృతిభావమునకు శ్రీరామునాశయము భిన్నము కాదనియే తేలెడిని. ధర్మవిరుద్ధమగుమాట శ్రీరాముఁడు తెల్పెననుటయే మహాపాపమని గ్రహింపందగు.

శ్రీరామమూర్తి గంగాతీరము చేరుట

* అంత శ్రీరామచంద్రుఁడు మహాబుద్ధివైభవముకలవాఁడు కావున నట్లు మాటలాడుచుఁ గోసలదేశము సరిహద్దు

* ఇది యేఁబదియవసర్గమునఁ గలదు.

చేరంబోయి యయోధ్యాభిముఖుండై దోసిలొగ్గి యిట్లు పలికెను. కాకుత్థ్సవంశభూపాలురచేఁ బాలింపఁబడుచుండు నో నగరవర్యమా! నిన్ను వీడుచున్నాను. నీయం దెవ్వారు నివసించియున్నారో, నిన్నెవ్వా రేలుచున్నారో యాదేవతలను గూడ వీడ్కొనుచున్నాఁడను. వనవాసనియమమునఁ గడపఁ దగుపదునాలుగేండ్లు జరపి నాప్రభువగుతండ్రిఋణము చెల్లించి తల్లిదండ్రులంగూడి మరల నిన్ను దర్శింతునని ప్రార్థించెను. రాముఁ డంతట నేత్రములు రక్తవర్ణమునఁ జూపట్టగాఁ దన్నుఁ గనవచ్చినజానపదులు రథవేగమున దూరమునకుంబోవఁగా వారిని బిలుచుటకై కుడిచేయి యెత్తి వారు కన్నీటిధారల వదలుచుండుటెఱింగి దాన మఱింత తనమోమున నాకన్నీటి ధారలు ప్రవహింపఁగా వారల కిట్లనియెను. జానపదులారా! మీరు నాయెడలఁ దగినట్లుగా స్వామి నన్నభావమున నాదరమును దయను గనఁబఱచితిరి. నన్నుం గాంచుచుండుటం జేసి మీకంతకంతకు దుఃఖము చెలరేఁగుచున్నది. చాలసేపు దుఃఖించుటయు మంచిదికాదుకదా. కావున గృహకృత్యములఁ దీర్చుకొనంబొండు. మేమును గార్యసిద్ధికొఱకు సెలవుతీసికొందుము. అని శ్రీరాముఁడు పలుకఁగా విని వా రాశ్రీరామునకుఁ బ్రదక్షిణముచేసి నమస్కరించి గట్టిగా విలపించుచుఁ జూపులు తృప్తింగాంచమి మఱిమఱి కాంచుచు నేడ్చుచుండఁగా రేయి సమీపించినందున సూర్యుఁడు మఱుఁగుపడునట్లు శ్రీరాముఁడు చాలదూరముపోయెను.

కోసలరాష్ట్రగ్రామములు ధనధాన్యసంపత్ప్రవృద్ధములు. వానికిందగినట్లే మానవులు మహోదాతలు. కావున నిర్భయముగా వారుందురు. ఆగ్రామములందు దేవాలయములు యూపస్తంభ

ములు నెల్లతావులం గనంబడుచుండును. అందు నుద్యానవన ములు మామిడితోఁటలు మిక్కిలియుఁ గలవు. సరోవరములు లోనగుజలాశయములయందు నీరు సమృద్ధిగానుండును. జనులు తృప్తిగలిగి ధనవంతులై పుష్టిగలిగియుందురు. ధేనువ్రాతములు విశేషించి యందుండును. పల్లెలు నగరములవలె సొంపుగా రాజులకునుజూడందగియుండును.మఱియు నందెందుఁజూచినను వేదనాదములే వినఁబడుచుండును. అట్టిగ్రామములం గాంచుచు శ్రీరాముఁడు వానిం గడచిపోయెను. ఉద్యానము లిరుదెసల నిండియుండఁగా జూడఁదగిన యామధ్యేమార్గము ననుసరించి విశేషరమ్యస్థలములు గనంబడినను ధీరుఁడుగాన లోభమున వానిని చూడకయే పోయెను. ఆదేశదక్షిణభాగమున నిర్మలోదకముగలిగి పరమపావనమై ఋషులకు సేవ్యమై త్రిలోకములం బ్రవహించునదియై ప్రకాశించుగంగానదిని దర్శించెను. దానితీరముల నాశ్రమము లనేకములుండెను. క్రీడాకాలముల యందు దేవకన్యలు వచ్చి యానదియందుఁ గలమడుఁగుల యందు జలక్రీడలాడుచుందురు. దేవదానవగంధర్వకిన్నరు లందుఁ జరించుచు సంతసించుచుందురు. గంధర్వులభార్యలు సర్వర్తువులందు నందు జలకము లాడుదురు. ఆజలము పరిశుద్ధముగనే యుండును. దేవవిహారయోగ్యములగు క్రీడాపర్వతములు వందలకొలంది గలవు. దేవతలకుఁ బనికివచ్చునుద్యానములు లెక్కకు మించియుండును. దేవతలఁ బూజింపఁదగు పద్మము లందుఁ గనుపట్టును. కొన్ని తావుల జలము పాషాణములపైఁ బడి ప్రవహించునపుడు కలుగుశబ్దమే దానినవ్వువలెఁ గనంబడుచుండును. నురుగులు నది తేటగా నవ్వినజాడలఁ దెలుపుచుండును. కొన్ని తావులయందు నున్నతభాగ

ములనుండి తగ్గుభాగములకుం బరుగిడు ప్రవాహము దానిజడలవలెఁ గనుపట్టుచుండు. సుడులు మిక్కిలిగ నుండు. కదలక గంభీరముగఁ గొన్నియెడలఁ గన్పడును. అతివేగముగా జలమొక్కచో బాఱుచుండు. ఒక్కొక్కతావున మృదంగనాదముంబోలి ధ్వని గల్గుచుండును. కొన్ని తావులఁ బిడుగులచప్పుడులాయన్నట్లు ధ్వని వినంబడు. దేవత లందు స్నానముచేయుదురు. కువలయములు కన్నులపండువు చేయుచుండు. కొన్నిచోట్ల నిసుకదిప్పలు కనుపట్టు. తెల్లనియిసుక తళతళలాడుచుండును. జలవిహంగమములు కోలకోలమనికూయుచుండును. చక్రవాకాదు లొక్కయెడ విహరించుచుండు. ఎన్నియో పక్షులు సంతోషమున నందందు విహరించుచుండు. వృక్షవాటికలొక్కొక్కతావునఁ బుష్పహారములు వేసికొన్న దానిచందము కనంబడంజేయుచుండును. అనేకజలప్రసూనములు వికసించి చూపరులకు నేత్రపర్వము గల్గించుచుండు. ఆనదియొడ్డునంగల వనాంతరములయందు మత్తిల్లి గజములు ఘీంకారములుచేయుచుండును. పూలగుత్తులు ఫలములు చిగురుటాకులు తన్నావరింప నన్నదియుండుటంజేసి వలయునని భూషణముల నలంకరించుకొన్న యొకసొగసులాడివలెఁ గనంబడును. విష్ణుపాదమునుండి జాఱినదొట దివ్యస్వరూపముకలదియై పాపదూరయై యానది తన్నాశ్రయించినవారలపాపములను దూలగొట్టుచు భగీరథుని తపోమహత్త్వమున శంకరుజటాజూటమునుండి దిగి పక్షినాదములువెలయ భూభాగమునం బ్రవహించి సాగరపత్నియై యలరారుచుండును.

శ్రీరాముఁడు శృంగిబేరపురమునకుఁ బోవుచుండి దాన్ల చెంతనున్న యాగంగాతరంగిణిం జేరెను. ఆమహాత్ముఁడు

తరంగములుగల మహాహ్రదములవెలయు మందాకినిం జూచి సుమంత్రున కిట్లనియె. మనమిందే నివసింతము. దీనిచెంతనే పెద్దగారచెట్టు చిగిరించి పుష్పించియున్నది. కనుక నిందే వసింతము. ఎల్లప్రాణులకు దీనియుదకము సమ్మానింపందగినది. మన మిద్దానిం గనుఁగొందము. సుమంత్రుఁడు లక్ష్మణుఁడు నా మాటల కంగీకరించి గారచెట్టుకడకుం బోయిరి. ఇక్ష్వాకు వులకుం బ్రమోదముంగూర్చు శ్రీరాముఁడు రథము రమ్య వృక్షము కడకుంబోవఁగనే రథము దిగెను. సీతాలక్ష్మణులు దిగిరి. సారథి రథముదిగి యశ్వముల విప్పి రామునికడ నంజలి బంధించియుండెను.

గుహుఁడు రాముని దర్శించుట.

ఆదేశమును గుహుఁడు పాలించుచుండెను. నిషాదు లకుఁ బ్రభువు. బలశాలి. రామునకుఁ బ్రియమిత్రుఁడు. ఆతఁడు శ్రీరామమూర్తి తనదేశమునకు వేంచేయుట నాలకించి కుల వృద్ధులు మంత్రులు లోనగువారు రాఁగా శ్రీరాము దర్శింప వచ్చెను. దూరమున నాతనిం గని శ్రీరాముఁడు సోదరునిం గూడి యెదుర్కొనిపోయెను. గుహుఁడు నారచీరలుకట్టియున్న యాశ్రీరామభద్రునిం గాంచి వగపెల్లున నాలింగనముచేసికొని శ్రీరామా! అయోధ్యవంటిదే నీకు నాపట్టణమగును. ఏమిపని నేఁజేయవలయును? అనతిమ్ము. ప్రియాతిథి యెవ్వనికి దొర కును? నీయాగమనము నాపూర్వపుణ్యఫలమే. అని పలికి రుచ్య ములగునన్నాదులు కొనివచ్చి యర్ఘ్యమును దెప్పించి యో మహాప్రభూ! నీకు స్వాగతము. ఈనావనరాజ్యమంతయు నీది.

మేము నీకింకరులము. నీవే మాకుఁ బ్రభుఁడవు. ఇఁక నీ రాజ్యము నీయిష్టానుసారము పాలింపుము. భక్ష్యములులోనగు పదార్థము లివిగో ఆరగింప నవధరింపుము. ఉత్తమశయనము లివియే యున్నవి. గుఱ్ఱములకు నాహారము గలదు. అని గుహుఁడు విన్నవింపఁగా రామమూర్తి యతని కిట్లనియె.

గుహా! కాలినడక నరుదెంచి రాజ్యముం గైకొనుమని మాయెడఁగలసున్నేహమును గనఁబఱచితివి. ఈమాత్రమునసే సకలార్చనములు మాకుఁ జేసినట్లే యయ్యెను. ప్రమోదము గల్గెను. అని యాతని నాలింగనము చేసికొని యదృష్టవశమున నీవు బంధువులంగూడ నీరోగుఁడవై సుఖముగా నుండం గాంచంగల్గితిని. నీరాజ్య ముపద్రవరహితమై యున్నదియా? మిత్రులకుం గుశలమా? ధనాగారము . . . ణతం గాంచక దినదినాభివృద్ధి నొందుచున్నదికదా? ప్రీతిచే నేదేది నానిమిత్తము సమకట్టితివో దానినెల్ల నాకుఁ జేసినట్లేయని యంగీకరించి నీకే మరలనిచ్చెద. ఏటికందువో యిపుడు ప్రతిగ్రహము మాని వర్తించుచున్నాఁడను. కారణమేమనఁగా పితృవాక్యమును బాలించుధర్మమునందే మదినిలిపియున్నాను. కానఁ దండ్రియానతిచొప్పున దర్భలు నారచీరలు ధరించి ఫలములఁ దినుచు నడవులఁ జరించుచుఁ దపమొనర్చుచుండఁదగినవాఁడను. అశ్వములకు వలయునాహారము నొక్కదానినే యిపుడు కోరుచున్నవాఁడను. ఇంకొక్కటి నాకు వలదు. ఇది యొనర్చిన నన్నెల్లభంగులఁ బూజించినవాఁడవగుదువు. ఈఘోటకములు నాతండ్రికి మిక్కిలి సంతసము నొదవించునవి. వీనిం బోషించితి వేని నన్నుఁ బూజించినట్లగును. దాన వేయిభంగుల నన్నుఁ నర్చించినట్లగును.

ఆగుహుఁ డప్పుడే తనసేవకులం బిలిపించి గుఱ్ఱములకుఁ బాలు నీరు త్రాగించి గడ్డి వేసితెండని పంచెను. శ్రీరాముఁడు నారచీరనే యుత్తరీయముగా నమర్చుకొని సాయంసంధ్య నారాధించి లక్ష్మణుఁడు పోయి తెచ్చినగంగాపావనజలమునే యాహారముగా భావించి త్రాగెను. పాదములంగడిగికొని యాచమనము చేసి జానకింగూడి భూతలమున శయనించెను. సౌమిత్రి గుహుఁడున్నకడకుంబోయి యాగారచెట్టుదగ్గరకు వచ్చెను. గుహుఁడు సుమంత్రునిఁగూడియుండి శ్రీరామచంద్రుని సద్గుణములం గొనియాడి లక్ష్మణుఁడు చెప్పఁగా నాలకించుచుఁ గార్ముకమును ధరించి ప్రమాదంపడక శ్రీరామునిం గాపాడు పొంచి నారేయియెల్ల మేలుకొనియుండెను. తరువాత శ్రీ రామమూర్తి సుఖార్హుఁడే యగుటనట్లు పుడమిపై శయనించి యుండుటంజేసి చక్కఁగా నిద్దురపట్టనందున నారాత్రి పెద్ద దిగాఁ దోఁపఁగా నెట్లో గడపెను.

మహాశయులారా! ఈభాగము విమర్శనార్హవిషయ ములు గలదియే. ఆయాయితావుల విమర్శించి యందలివిశేష ముల నెఱుంగుదము.

"అయోధ్యాభిముఖో ధీమాన్ ప్రాంజలిర్వాక్యమబ్రవీత్. ౧
ఆపృచ్ఛే త్వాం పురిశ్రేష్ఠే కాకుత్స్థకులపాలితే,
దైవతాని చ యాని త్వాం పాలయంత్యావసంతి చ. ౨
నివృత్తవనవాసస్త్వామనృణో జగతీపతేః,
పునర్ద్రక్ష్యామి మాత్రా చ పిత్రా చ సహ సంగతః. 3

అని మూలము. ఇందలివిశేషములెవ్వి? నగరములు ధనధాన్య సంపన్నములుగను నిరుపద్రవములుగా నుండుటకుం గారణము

దైవతము లన్వానిని బాలించుటయే. నగరనిర్మాణమున దిక్సాధనముచేసి యెనిమిది దెసల నెనమండ్రు దేవతల నావహింపఁజేసి యాపురరక్షణముచేయఁ బ్రార్థింపవలయును. వాని నానగరవాసు లారాధించుచుండవలయును. ఆదేవత లాభక్తుల కోర్కులు ఫలింప నందుండి పాలింతురు. ఎంతదనుక నట్టి క్రమము సాగునో యంతదనుక నానగరము క్షీణింపదు. నిరోగమై యుండును. ఆదేవత లానగరమును గాపాడుచు నందే యుందురు. ఈనియమము భరతఖండమునకే యేర్పఱుపఁబడియెనా, ఎల్లతావులకుంగూడ నియమింపఁబడినదా? అను ప్రశ్నము కలదు. సమాధానము నాలకింపుఁడు. గ్రామదేవతలనుట యందఱెఱింగినయదియేకాని క్రొత్తమాటకాదుకదా. నేఁటికింగూడ వాని నారాధించునాచారము కలదు. మహానగరములు శాస్త్రాదులు నిర్మించినపుడు దిగ్దేవతలను స్థాపించి దానికిఁ జిహ్నములుగా నాలయములు కట్టించియున్నారు. వానికే అష్టశక్తులని పేరు. ఆదేవతల నారాధించుపద్ధతు లనేకరీతులం గనుపట్టెడిని. అట్టి పూజాదులు సాగుచుండునంతదనుకనే యానగర మభివృద్ధిని గాంచుచుండును. అది క్షీణించుకొలది నిదియు క్షీణించును. దేవతలు కాపాడుచుందురన్న విశ్వసింపనివారల కీభావము నచ్చదు. అంతమాత్రమున నీసిద్ధాంతము తప్పనరాదు. ఈ సిద్ధాంతమునే శ్రీరాముఁడు తెలిపెను. ఇట్టియాచారము ద్వీపాంతరములయందుఁగలదా ? అందలినగరములు వృద్ధిగాంచుట లేదా? అను ప్రశ్నమునకు సమాధానము వినుఁడు.

ద్వీపాంతరములయందును మార్గాంతరమున దేవతాపూజలు చేయఁబడును. క్రొత్తభవనమునఁగాని క్రొత్తనగరమునఁగాని ప్రవేశించునపుడు వారికి నెవ్వరియందు నెక్కుడు విశ్వా

సము కలదో వారిం బిలిపించి దేవతాప్రార్థనపూర్వకముగా నా ప్రవేశోత్సవము జరపుదురు. అదియే పూజాపద్ధతి యీ దేశము నందని మనము విశ్వసింపవలయును. దేవతలే లేరన్న యూహాలు వారికింగల్గినఁ దొలుత నాప్రార్థనము నేల జరపుదురు? అట్టివే మార్గాంతరము లనఁబడునవి. విగ్రహములఁ బూజించునాచారములు కొన్ని తావులనుండును. స్తోత్రమునే పూజగా భావించు నాచారము కొన్ని స్థలముల నుండును. ఇందేదియుత్తమ మను వాద మిపు డనవసరము. వారివారియోగ్యత ననుసరించి యది యుండునని మన మూహింపవలయును. మొత్తముమీఁద దేవతాద్వేష మెవ్వారికి లేదనియు వారి నారాధించుపద్ధతులు వేఱనియు మనము విశ్వసింపవలయును.

పురమునకు శ్రీరాముఁడు నమస్కరించెనుగదా. ఏల? అనఁగా స్థలముగాని వృక్షాదులుగాని మతేదికాని యెవ్వారి కుపకారము చేయునో యదియెల్లఁ బూజ్యము. దానిని భగవత్స్వరూపముగా భావించి పూజింపవలయును. కృతజ్ఞత యనునదియు నొకవిధమగు పూజయే. కృతజ్ఞతలేనిపూజ నిష్ఫల మగుటయేగాక దుష్ఫలముకూడ నొసంగును. తమపూర్వులకుఁ దనకును దరువాతివారికింగూడ నాధారభూతమగు నయోధ్యను దేవతగా భావించి శ్రీరామమూర్తి ప్రీతిపూర్వకముగా సెలవడిగెను. అనఁగా నీసదాచారమును మనకు నేర్పెనని మన మూహింపవలయును. మనముకూడఁ గొంతకాలమైన నేగృహమునసుండుమో దానిని వదలిపోవునపుడు దేవతాబుద్ధిచే సెలవడిగి పోవవలయును. అదియే వర్ధిష్ణువులమార్గము. ఈభాగము నుండి మన మీసద్విషయమును నేర్చుకొనవలయును.

భావము. విష్ణుమూర్తిపాదమునుండి గలిగినదని కొందఱు వాదింతురు. భగవంతునిపాదమే సకలప్రపంచమునని భావించిన బాధయేమి? మధ్యవైష్ణవులు కొందఱు విష్ణుపాదప్రక్షాళనోదకమే గంగయనియు, దానిని శంకరుఁడు తలపై ధరించెననియుఁ బల్కుచు శివునికంటె విష్ణు వెక్కుడందురు. అంతకంటె నీచమగునభిప్రాయము వేఱొండు లేదు. వారికిఁ జక్కని సమాధానము బదరీనారాయణక్షేత్రమే. అందే నారాయణుఁడు శంకరునిగుఱించి తపస్సు చేసెను. శివునిదయకుఁ బాత్రుఁడై వరములఁ బొందెను. అట్టియల్పవాదములకు సమాధానమే యక్కఱ లేదు. ఎవ్వరి కేదేవతయందు భక్తి యెక్కువగనుండునో వారి కాదేవతయే భగవంతుఁడగును. అనఁగా సర్వదేవతామయుఁ డాయొక్కపరమాత్మయే యని భావము. ఈసిద్ధాంతమున దుర్మతాభిమానమునకు స్థలమే లేదు. కావుననే మహాత్ము లొక్కదుర్వాదమునందును బ్రవేశింపరు.

"అవిదూరాదయం నద్యా బహుపుష్పప్రవాళవాన్,
సుమహానింగుదీవృక్షో వసామోఽత్రైవ సారథే." ౨౭

అని మూలము. నదీతీరమున నించుక చెంత పూవులు చిగురుటాకులుగల తాపసవృక్షము కనంబడుచున్నది. అందు నివసింతము. మునులకు నుపయోగించునది కాన నాయది తాపసతరు వనంబడియెను. పరోపకారము నొనరించుప్రతివస్తువునందును భగవత్కళ యధికముగా నుండుననియు దాననయ్యది మహాత్ములకు వాసార్హమయ్యెననియు భావము. ఇందే యుండుమనఁగా నా తేజస్సీవృక్షమునందు విశేషించియున్నది. కాన నిదియే నాకు సంతోషము గల్గించుచోటు. "అత్రైవ"

అనుటచే. నీచెంత దీనినిమించినస్థానము లేదని భావము. మంచి శిల్పముచే నేదియుఁ బావనముకాదు. పావనమనఁగాఁ బరో పకారాది సద్గుణములుగలదియే యగును. వేటిలోక కారణమునఁ గానేరదు. వేషభాషలచేతఁగాని గడ్డముపెంచుట లోనగు బాహ్యచిహ్నములచేతఁగాని మానవుఁడు పవిత్రుఁడు కాఁడు. నిర్మలమనస్సుచేతనే పావనుఁడగు. భగవంతుఁడు బాహ్య చిహ్నములం గన నూహింపఁడు. పరిశుద్ధమనస్సు నే పరికించును. అది గల్గినయెడల నందే నివసించియుండును.

"తత్ర రాజా గుహో నామ రామస్యాత్మసమస్సఖా,
నిషాదజాత్యో బలవాన్ స్థపతిశ్చేతి విశ్రుతః"

అని మూలము.

"బ్రాహ్మణాద్వైశ్యకన్యాయామంబష్ఠో నామ జాయతే,
నిషాదః శూద్రకన్యాయాం యః పారశవ ఉచ్యతే." ౮

మను. ౧౦. అధ్యా.

మనుస్మృతిప్రకారము నిషాదజాతి నీచవాచకమని తేటపడును. పూర్వము చక్రవర్తులు కొండయందు నడవులయందు నుండు మానవులకు నాటవికులనే ప్రభువులనుగా నియమించి వారి వలనఁ దక్కిన దేశములకుఁగాని బాటసారులకుఁగాని బాధలు లేకుండఁ జేయుచుండిరి. వారు కప్పముగా నందుదొరకు తేనె లోనగువస్తువులఁ దమప్రభువులకుఁ బంపుచుండిరి. అటవీ రాజ్యములు పశుధనాకీర్ణములు. క్షామబాధ యెఱుంగనివి. అందుండువారలకు దైవభక్తి మెండు. హింసాకర్మమున వారికి విసుగు తోఁపదు. ఈవిషయము పురాణాదులవలనఁ దెలియ వచ్చెడిని.

గుహుఁడు హీనజాతిప్రభవుఁడు. శ్రీరామున కాత్మసముఁడు. అనఁగా మిత్త్రుఁడని భావము.

"శూద్రప్రేష్యం హీనసఖ్యం హీనయోనినిషేవణం,
తథైవాశ్రమే వాసః పరాన్నపరిపుష్టతా. ౨౪౧

అను యాజ్ఞవల్క్యస్మృతిప్రకారము హీనజాతిసఖ్యము పనికిరాదనియు, నది యుపపాతక మనఁబడుననియుఁ దేటపడుచున్నది. మహాకులప్రభవుఁడగు శ్రీరామున కిది తగునా యని యాక్షేపించువారు కలరు. సమాధానము వినుఁడు. రాజవర్యులే యాటవికులకుఁ బ్రభువుగా నందు బలవంతుని రాజుగా నియమింతురు. వానితో విరోధించిన లాభములేదు. కావున నీపాతకములు రాజుగా నివారికని చెప్పనలయును. ఇది సామాన్యమగు సమాధానము.

"సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః,
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహం. ౨౯
అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్,
సాధురేవ స మంతవ్యస్సమ్యగ్వ్యవసితో హి సః. ౩౦
మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః,
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేఽపి యాంతి పరాం గతిం." ౩౨

భగవద్గీత. ౯. అధ్యా

అను నీశ్రీకృష్ణోపదేశము ననుసరించి భగవంతునిదృష్టికి జాతిభేదములు గానరావు. నిర్మలచిత్తుఁడే యాదృష్టికిం బాత్రుఁడగును. ఎవ్వారు భగవంతుని భక్తిభావమున సేవింతురో వారు సదాచారవంతులుగాక కుత్సితాచారవంతులే యైనను వారు సాధువులే యగుదురు. పాపజాతిసంభవులైనను దన్నే నమ్మిన

వారైనచో ముక్తులగుదురని తేలెడిని. గుహుఁడు పరమపావన హృదయుఁడు. కావున నతనితో సఖ్యముచేయుట నీచకార్యము కాదు. శూద్రప్రేష్యము హీనసఖ్యము లోనగునవి మానవ మాత్రులకు నుపపాతకములగునుగాని భగవంతుఁడగు శ్రీ రామమూర్తికింగావని యెఱుంగునది. వేషభాషల ప్రాధాన్య మల్పదృష్టులకుంగాని సర్వసాక్షియగు భగవంతునకుఁ గాదు.

"స్వాగతం తే మహాబాహో తవేయమఖిలా మహీ,
వయం ప్రేష్యా భవాన్ భర్తా సాధు రాజ్యం ప్రశాధి నః." 3౭

అని మూలము. ఇది గుహుని మనోభావమును దెలుపుచున్నది. సామాన్యార్థము సుగమము.

"మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,
మామేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః." 3౮

గీత. ౯ అధ్యా.

అను శ్రీకృష్ణోపదేశమునకు నుదాహరణభూతుఁడగువాఁడు గుహునిరీతినే యుండవలయును.

"అఖిలా ఇయం మహీ తవ వయం ప్రేష్యాః భర్తా భవాన్ నః రాజ్యం సాధు ప్రశాధి."

అనువాక్యములభావ మేమనఁగా ఈపృథ్వియంతయు నీది. నీ యష్టమూర్తులలో నొక్కటికదా. మేమెల్ల నీకింకరులము. మమ్ము భరించువాఁడవు నీవు. కనుక మమ్ములను రాజ్యమును జక్కఁగాఁ బాలింపుము. మాయొక్క రాజ్యమని యర్థముకాదు. ...ది గర్వమును దెలుపును. అట్టిమాట గుహుఁ డనఁడుకదా. సాధు ప్రశాధి. అనఁగా ననేకబ్రహ్మాండము లేలు నాకీస్వల్ప రాజ్యమా యనరాదు.

"పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి,
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః."

అన్నతమవాక్యమునే యనుసరించి మీరొసంగినదానిని మీకే యర్పించితిని. దాని నాదరమునఁ గైకొని చక్కఁగాఁ బాలింపుము. మమ్ముఁ బాలింపుమనఁగా నన్ను నన్నాశ్రయించినకళత్రాదులను గృతార్థులనుగాఁ జేయుము. రాజ్యం ప్రశాధి. ఈ రాజ్యము మహారణ్యమునడుమ నున్నది. దీనిని దమపాదారవిందస్పర్శమున సుగమముగాఁ జేయుమా యని భావము. మహాత్ము లేచోటఁ గాలూనుదురో యదియే పుణ్యక్షేత్రమనియే యిందుఁగలతాత్పర్యసారము. అనఁగా మహాదేవా పరమేశ్వరా శ్రీరామచంద్రా! ఈభూమియంతయు నీది. నీయానతిమెయి నిందున్నవాఁడను. సేవకుఁడను. సర్వమును భరించువాఁడవు నీవు. నాపుణ్యోదయమున నేఁటి కరుదెంచితివి. మమ్ముఁ గింకరులనుగాఁ జేకొని పాలింపుమని గుహుఁడు భగవత్తత్త్వము నెఱింగినవాఁడుగానఁ దదుచితముగాఁ బ్రార్థించెను. ఫలాభిసంధిరహితసత్కర్మమనఁగా నిట్టిదే. ప్రభుకుమారా! ఈనాటికి వచ్చితివి. నాకుఁ గావలసిన విన్ని. వాని నొసంగుమని కోరువారు పామరులు. భక్తు లట్లు గోరరు. నన్నుఁ బాలింపుమనఁగా

"అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం"

అన్నభగవదుక్తి ననుసరించి తన్నే నమ్మినవా రడుగకపోయినను వారికిఁ గర్మానుసారములగుఫలముల నొసంగువాఁడు భగవంతుఁడు కాన నతఁడే యొసంగును. వేఱే ప్రార్థన మేల? సర్వజ్ఞునకు దెలియనివిషయము లుండవు. కావున భక్తులు సత్కర్మము

నాచరించి తత్ఫలము భగవంతున కర్పింపవలయుననియు నా మహాత్ముఁడే యతనికి ననుభవార్హములగు ఫలముల నొసంగు ననియు మన మెఱుంగవలయును.

"తస్మాదసక్తస్సతతం కార్యం కర్మ సమాచర,
అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః. ౧౯
యే మే మతమిదం నిత్యమనుతిష్ఠంతి మానవాః,
శ్రద్ధావంతోఽనసూయంతో ముచ్యంతే తేఽపి కర్మభిః. ౩౧
గీత. 3 అధ్యా.

అన్న గీతావాక్యములే పైనివ్రాసినయాశయమును దృఢపఱచు చున్నవి.

"గుహమేవం బ్రువాణం తం రాఘవః ప్రత్యువాచ హ,
అర్చితాశ్చైవ హృష్టాశ్చ భవతా సర్వథా వయం. ౪౦
పద్భ్యామభిగమాచ్చైవ స్నేహసందర్శనేన చ."

అని మూలము. ఇందొక్కవిశేషార్థ మిమిడియున్నది. విమర్శింతము. కాలినడకతో నీవు వచ్చుటచేతను స్నేహభావము కనఁబఱచుటచేతను మేము పూజింపఁబడితిమి. మిక్కిలి హృష్టుల మైతిమి. నీవు మమ్ము సర్వథా పూజించినట్లే యయ్యెను. అనఁగా నీరామవాక్యసార మేమి? అహంకారవిరహితుఁడై భగవంతుని దివ్యకళ విశేషించియుండుచోటికి భక్తిభారమున శ్రమము నెఱుఁగక పోవుట. స్నేహభావమున భగవత్పదమును దర్శించుట యనునివి రెండును భక్తునిమనోభావమును దేటపఱచును. సామాన్యముగ మానవులు దేవతాదర్శనమునకుం బోవునపుడు వస్త్రాభరణాదుల నెవరిదగ్గరనైనఁ దెచ్చుకొనియైన ధరించి పోవుదురు. వారు భగవంతునికడఁ గూడ దమయైశ్వర్యగర్వమును

జూపఁగడఁగువారగుట వారిం గాంచి భగవంతుఁడు ప్రమో
దమందఁడు. కపటభక్తులనియే భావించును. అచ్చోటనే యహం
కారమును జూపువారింకెందు నర్థానిం జూపరు? కావున భాగ్య
స్వరూపుఁడగు పరమేశ్వరుఁడు స్నేహభావమున నహంకారము
వదలి దర్శింపఁదగినవాఁడు. వారికే యాత్రాఫలము సిద్ధించును.
వేడుకఁగా యాత్ర చేయువారలకు ఫలము నిష్ఫలమే.

"నిర్మమో నిరహంకారస్సమదుఃఖసుఖః క్షమీ." ౧3 అధ్యా. ౧౨

అన్న భగవద్వాక్యమే యిందులకుఁ బ్రమాణము. అహంకార
ప్రదర్శనము భక్తినభినయించుట యనునివి ధనాశాలంపటుల
యుపాయములని తలంపవలయును. ఈకాలమున భక్తులమని
పొగడుకొనుచు భూషణాంబరములం దాల్చి భగవత్కైంక
ర్యము చేయుటకని డబ్బులాగువారెందఱో కలరనుట సార్వ
జనీనముకదా. ఇప్పట్టున నొకవిషయము స్మృతికిం దగులు
చున్నది.

"ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి,
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా."

అన్న శ్రీభగవద్వాక్యమును బఠించుచు నుపన్యసించుచు నేదో
యొక భగవత్కైంకర్యము చేయుదుమని పలుకుచుఁ దమ
గుట్టు పరులెఱుంగఁజాలరని యానందించుచు నెల్లరచే మ్రొ
క్కించుకొనుచు భగవంతుఁడు కనఁబడి తమకేదో విషయమును
దెల్పుచునే యుండునని చెప్పుచు ధనము బంధువులకొఱ
కార్జించి వారలం బోషించువారు కలరుగదా. వారలకాశ్లోకము
భగవదుక్తమనువిశ్వాసము కలదని మనము నమ్మవచ్చునా? ఆః
వారికపటనోపదేశములకు లోఁబడవచ్చునా? లోఁబడువారు

కేవల మూఢులు కారా? వారికిని వీరికిని ఫలము తుదకు దుష్ఫలమే కాక మఱేమగును? భగవంతుఁడు కనంబడి నా కీపదార్థములు కావలెనని యడుగునా? అది నమ్మఁదగినదే యగునా? "పత్రం పుష్పం ఫలం తోయం" అన్నది భగవంతుఁడే కదా. లేక గడ్డము పెంచుకొన్న దాసరియా? సర్వేశ్వరుఁడు తనకలిగినపదార్థమును భక్తిమై నర్పించువానినే ప్రేమించునుగాని తననుగూడ వంచింపఁ దలఁచువానిని ప్రేమింపఁడు. ఇది నిశ్చితము. నిర్మలభక్తిగలగుహుఁడు ఈ రాజ్యము నీది. మేము నీ దాసుల మనియెను. మనము కూడ లోకవంచకులవలెఁ బ్రవర్తింపఁబూనక భక్తిభారమున నాసర్వేశ్వరుని శ్రీరాముని గుహునివలె నారాధించి కృతార్థులము గావలయును. పైని వ్రాసినవిషయము నెట్లు శ్రీరామమూర్తియే తెల్పెనో యీ క్రిందివాక్యము చిత్తగించినఁ దేటపడును.

"యత్త్విదం భవతా కించిత్ప్రీత్యా సముపకల్పితం,
సర్వం తదనుజానామి న హి వర్తే ప్రతిగ్రహే. ४३
కుశచీరాజినధరం ఫలమూలాశినం చ మాం,
విద్ధి ప్రణిహితం ధర్మే తాపసం వనగోచరం." ४४

అని మూలము. తొలియర్ధశ్లోకమునందే పైభావము స్పష్టము. తరువాత శ్రీరాముఁడు భక్తలక్షణములు తెల్పుచున్నాఁడు. శ్రీరామావతారమునఁ దానొనరించి వానినే యితరులకుం దెల్పుటయేకదా మార్గము. దీనిభావ మేమనఁగా ప్రతిగ్రహము మాని యనఁగా నేదియుఁ దనకుఁ గావలయునన్న కోర్కినుండి తొలఁగి దొరకినవస్త్రమును దృప్తిమాలి ధరించి యితరులకు బాధకల్పింపనిపదార్థముల భుజించి ధర్మమార్గమును వదలక జన

సంగతికి దూరమై తపోవృత్తిచే ననఁగా భగవద్ధ్యానముచేఁ గాలము గడుపవలయును. అట్టివాఁడే భక్తుఁడు. అనునదియే యిటఁగలవిశేషము.

"న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః,
మాయయాఽపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః. ౧౫
చతుర్విధా భజంతే మాం జనాస్సుకృతినోఽర్జున,
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ. ౧౬
తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే,
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః." ౧౭

గీత. ౭ అధ్యా.

అను నీగీతావాక్యములే శ్రీరామునియాశయమును వెల్లడించుచున్నవి. అప్రతిగ్రహీతృత్వమే భక్తునిలక్షణము. ప్రతిగ్రహణము ధనాశను వృద్ధిచేయును. అది జ్ఞానమునకుఁ బ్రతిబంధకము. కాన నద్దాని మానుటయే యుత్తమమార్గము. ధనము కొంచెము మిచ్చినం దిట్టే యెక్కువగా నొసంగిన భూషించువారు జ్ఞానులా? లోకవంచకులా? రెండవవారే యగుదురుగదా. ధనసంబంధమునుమాని యదృచ్ఛాలాభసంతుష్టుఁడై సర్వదా భగవంతుని శ్రీరాముని సేవింపవలయును. అదియే యుత్తమమార్గము. ఈఘట్టమున నధ్యాత్మరామాయణమున నెట్లు చెప్పఁబడినదో తెలిసికొందము.

"సఖాయం స్వామినం ద్రష్టుం హార్దాత్తూర్ణం సమాపతత్,
ఫలాని మధుపుష్పాది గృహీత్వా భక్తిసంయుతః,
రామస్యాగ్రే వినిక్షిప్య దండవత్ప్రాపతద్భువి.
... ...
ధన్యోఽహమద్య మే జన్మ నైషాదం లోకపావన,

బభూవ పరమానందస్సంస్పృష్ట్వా తేంగం రఘూత్తమ.
నైషాదరాజ్యమేతత్తే కింకరస్య రఘూత్తమ,
త్వదధీనం వసన్నత్ర పాలయాస్మాన్రఘూద్వహ.
ఆగచ్ఛ యామో నగరం పావనం కురు మే గృహమ్.
గృహాణ ఫలమూలాని త్వదర్థం సంచితాని మే
అనుగృహ్ణీష్వ భగవన్ దాసస్తేఽహం సురోత్తమ.''

అధ్యాత్మరా. ౫ సర్గము.

''భక్ష్యం భోజ్యం చ పేయం చ లేహ్యం చేదముపస్థితం,
శయనాని చ ముఖ్యాని వాజినాం ఖాదనం చ తే.'' 38

శ్రీమద్రామాయణము ౫౦ సర్గము.

చతుర్విధాహారపదార్థములఁ దెచ్చితిని. శయ్యాదులు గలవు. గ్రహింపుమాయని రామాయణమునందును, పండ్లు తేనె పుష్పములు లోనగువస్తువులు నీకొఱకు సంపాదించి తెచ్చితిని. పరిగ్రహింపుమని యధ్యాత్మ రామాయణమునందును గలదు. నిషాదునియింట క్షత్రియులు భుజింతురా యనుశంక కవకాశము రామాయణమునఁగలదు. అధ్యాత్మ రామాయణమున నద్దానికిఁ జోటే లేదు. మొదటిది చరిత్రప్రధానము. రెండవది తత్త్వప్రధానము. కావునఁ దమపని నారెండును జక్కఁగా నెఱవేర్చినవి. లోకపావన అనువిశేషణము మిక్కిలి చక్కఁగా నున్నది. లోకపావనుఁడవు కనుకనే నాయీనిషాదజాతిసంభూతిని ధన్యముగా నొనరింపుమా యని ప్రార్థించెను. ఫలమూలములారణ్యకము లారోగ్యాయుఃప్రదములు. అవి యర్పించుట యటవీరాజ్యపాలకునకుఁ దగినదియే.

''రామస్తమాహ సుప్రీతో వచనం శృణు మే సఖే,
న వేక్ష్యామి గృహం గ్రామం నవ వర్షాణి పంచ చ,

దత్తమన్యేన నో భుంజే ఫలమూలాది కించన,
రాజ్యం మమైతత్తే సర్వం త్వం సఖా మేఽతివల్లభః."

అధ్యాత్మరా. ౫ సర్గము.

ఇది గుహునకు శ్రీరామమూర్తి చెప్పినసమాధానము. న్యాయ్యముగనున్నది. చెలికాఁడా యని గుహుని బిలిచెను. సెబాస్. పరమేశ్వరాశయ మెంత బాగున్నది? భగవంతునకు భక్తునికంటెఁ బ్రియుఁ డొకఁడు లేఁడనుట సిద్ధాంతము.

"అనపేక్షశ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః,
సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః. ౧౬
యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి,
శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః. ౧౭
సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః,
శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సంగవివర్జితః. ౧౮
తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్,
అనికేతస్స్థిరమతిర్భక్తిమాన్ మే ప్రియో నరః. ౧౯
యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే,
శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః." ౨౦

గీత. ౧౨ అధ్యా.

అన్నగీతావాక్యములు భక్తునకుఁ బరమేశ్వరునకును గలసంబంధము తేటపఱచుచున్నవి. భక్తునకంటెఁ బరమేశ్వరునకు సఖుఁడు లేఁడు. భగవంతునకంటె భక్తునకు శరణము వేఱు లేఁడు. కావున నే పరస్పరసఖ్యము ముఖ్యము. ఇఁక నవ్వాలిచరిత్రము ను బఠింతము.

గుహుఁడు సౌమిత్రితో భాషించుట.

*సౌమిత్రి భ్రాతృరక్షణమున నాసక్తిగలిగి మనఃపూర్వకముగా మేల్కొనియుండఁగాఁ గాంచి గుహుఁడు విచారమునఁ గుందుచు నతని కిట్లనియె. ఆర్యా! రాజకుమారుఁడవగు నీవేల మేలుకొనియున్నాఁడవు? అది మంచిదిగాదు. ఈ శయ్యపై సుఖనిద్ర చేయుము. బడలికలు వాపుకొనుము. ఆటవికులముగానఁ గష్టపడుట మాకువిధి. నీవనఁగా సుకుమారుఁడవు. శ్రీరామునికొఱకు మేమెల్ల మేల్కొనియుందుము. నాకు శ్రీరామునికంటెఁ బ్రియముఁ గూర్చువాఁ డొక్కఁడు నీలోకమున లేఁడు. ఇది సత్యము. రామచంద్రానుగ్రహముననే విశాలకీర్తిని ధర్మము నర్థము నార్జింపఁగోరుచున్నాఁడను. రామప్రసాదమునే కోరువాఁడనుగాన నాబంధువులంగూడి నిదురనుండి లేచుదనుక మేలుకొనియుందుదు. రక్షించుభారము నాది. ఈయడవిలో నాయెఱుంగనితావులు లేవు. విరోధి యెవఁడువచ్చినను నాకుఁ దెలియకయుండదు. రహస్యభాగములెల్ల మేమెఱింగినవే కానఁ జతురంగబలయుతుఁడై పగవాఁడు వచ్చినను మే మాపఁగలము.

ఆమాటలు విని లక్ష్మణుం డిట్లనియె. అనఘా! ధర్మైకనిరతుఁడవు. ఇట్టి నీవు రక్షించుచుండఁగా మా కేభయము గలుగును? మహారాజకుమారుఁడు శ్రీరాముఁడు భూతనయంగూడి నేలఁ బరుండియుండఁగా నిద్దుర నాకువచ్చు నెట్లు? ఊఱట యెట్లు గల్గును? సురాసురు లొక్కటియైవచ్చిన నెవ్వని నోర్వఁజాలరో యట్టిశౌర్యనిధి సీతంగూడి శాద్వలముల హాయిగా

* ఇయ్యది యేఁబదియొకఁడవసర్గమున నున్నది.

శయనించియున్నవాఁడు. చూడుము. దశరథుఁడు ఎన్నియో
తపములుసలిపి యజ్ఞములొనర్చి యెన్నియోకష్టములకులోనై
యేసత్పుత్త్రునిగాంచెనో సకలశుభలక్షణములుగల యాశ్రీ
రాముఁడు వనమునకుఁబోవఁగా రాజిఁక నెంతకాలము బ్రదుకఁ
గలఁడు? ఈభూమియుఁ ద్వరితముగ విధవ కాఁగలదు. సత్యము
అంతఃపురకాంతలు రోదనములుచేసి యలసి యూరకయుం
దురు. నాగృహము నిశ్శబ్దముగా నుండునని తలంచెదను.
కౌసల్యయు దశరథుఁడు నాతల్లియు జీవించియుందు రను
నూహ నాకు లేదు. బ్రదికిన నీయొక్కరాత్రియే యనుకొం
దును. రేపు బ్రదుకరు. నాతల్లికి నింకొక్కఁడు శత్రుఘ్నుఁడు
కుమారుఁడు గలఁడు. కాన వానియందుఁ గలస్నేహమునఁ
బలుసారులు చూచుకొనుచు జీవింపవచ్చును. ఆమెవిషయ
మును నాకు విశేషించి చింతలేదు. కాని కౌసల్య శ్రీరాముని
వంటికొడుకు వదలి బ్రదుకఁజాలదు. అదియే నాకు దుస్సహ
దుఃఖము. రాజునందు ననురాగము గల ప్రజ లయోధ్యయం
దున్నవారు. ఎంతో శృంగారముగనుండు నయోధ్య రాజు మర
ణింపఁగా విపత్తునొంది చెడఁగలదు. రాజు మహాత్ముఁడగుకుమా
రునిం గాంచకయున్నఁ బ్రాణములతో నుండుటెట్లు? రాజు
మృతినొందఁ గౌసల్యయు మృతినొందు. పిదప నాతల్లియుఁ
జచ్చు. అక్కటా! నాతండ్రి రాజ్యమున శ్రీరాము నభిషేకించి
తనవాంఛితము తీర్చుకొనకయే నశింపఁగలఁడు. కనుక సకల
ప్రయోజనములు మించిపోయినవి. ఇపుడు వానిం దలంచిన
లాభమేమి? నాతండ్రి కుమారునివిషయమున నేముద్దుముచ్చ
టలు తీర్చుకొనకయే నశింపఁగలఁడు. తండ్రి చావఁగా నతనికిఁ
జేయవలసినప్రేతకార్యములు సాగింపఁదగునపుడు కృతార్థులగు

రాజకుమారులకే తండ్రికి సంస్కారములు చేయుభాగ్యము కల్గును. మేమట్టిధన్యులము గాము.

అయోధ్యానగరము సకలవిధముల సొంపుగులుకుచుం డును. జనులెల్ల సుఖవంతులుగా నుందురు. కాని రాజు బ్రదికి యుండునా? అతఁడు జీవించియుండఁగా మేము వనవాస వ్రతము ముగించి మరలివచ్చి సువ్రతుఁడగు నామహారాజును జూతుమా? మాయన్న వనవాసము గడపివచ్చి తండ్రి క్షేమ ముగనుండఁగా నతనింగూడి యయోధ్యం బ్రవేశింప నేను బ్రవేశింతునా? అని యిట్లా రాకొమరుఁడు దుఃఖార్తుఁడు రోదనముచేయుచుండ రాత్రి గడచెను. లక్ష్మణుఁడు చూపిన నెయ్యమునకు మెచ్చుకొని గుహుఁడు శ్రీరామునకుఁ గల్గిన విపత్తునకు భీతుఁడై వగచి మనస్సు దిటవుతప్పఁ గన్నీరువిడి చెను.

మహాత్ములారా! ఈభాగమున విమర్శించి గ్రహింపఁ దగినవిశేషము లేవియు లేవు. సౌమిత్రికి శ్రీరామునియెడఁగల ప్రేమాతిశయము వెల్లడియగును. అతని మాటలపొందికం గాంచిన శ్రీరామవియోగము తల్లిదండ్రులకు దుర్భరమనియు. దాననే వారు మృతినొందఁగలరనియుఁ దోఁచెడిని. సౌభ్రాతృ త్వమన నిట్టిదేకదా. "పితృసమో జ్యేష్ఠః" అన్నసూక్తి లక్ష్మ ణుఁడు చక్కఁగా నెఱుంగును. లోకమున రామలక్ష్మణులవంటి యన్నదమ్ములుండిన నెంతశాంతముగను సుఖముగను గాలము సాగునోకదా. ధనాశ యనుపిశాచ మావేశింప సోదరసంబం ధము తుదముట్టి నశించుచున్నదికదా. ఇంతకంటె దుఃఖింపఁ దగినవిషయ మేమి కలదు? ఆచంద్రతారార్కముగా యశస్సు నిలుపఁదగినది ప్రేమమేకాక మత్తేమికలదు? అద్దాని నెవ్వరా రా

ధింతురో వారే మహాత్ములు. ఆకాలమే మంచికాలము. ఆదేశమే వాసార్హ్యము. అట్టికాలము మనభరతఖండమునకు మరల వచ్చుఁగాక.

శ్రీ రాముఁడు జడలుదాల్చుట, గంగాసంతరణము.

* తెల్లవారెను. శ్రీ రాముఁడు లక్ష్మణునింజూచి వత్సా! భాస్కరుఁ డుదయించుసమయ మిది. భగవతిరాత్రి కడచినది. భరద్వాజపక్షియుఁ గోకిలము కూయుచున్నవి. అడవినుండి మయూరధ్వనులు వినఁబడుచున్నవి. ఈగంగ సాగరగామిని గాన మిగుల జవమునఁ బాఱుచున్నది. దానిం దాఁటుదము. అనఁగా నాలక్ష్మణుఁడు మహాత్మా యీనది నూరక దాఁట సాధ్యము కాదు. సాధనమేదేని గావలయును. అనఁగా విని రాముఁడు గుహునింబిలిచి ఈయాశయము తెలిసినదికదా. అనిపిలిచి యడిగెను. గుహుఁడు శ్రీ రాము నానతిని తలదాల్చి మంత్రులం బిలువనంపి సులువుగా నది దాఁటింపఁదగునట్టి నావను బరికరములతోఁ దెచ్చి కర్ణధారునితోడ రేవునకుం జేర్పింపుఁడని యుత్తర్వుచేసెను. వారల్లే యప్పుడే యొనరించిరి. అంజలి బంధించి గుహుఁడు శ్రీ రామునిమ్రోల నిలువంబడి మహాత్మా! తమయానతిమెయి నౌక సంసిద్ధముగనున్నది. ఇంకేమి చేయందగునో యానతిందు. శ్రీ రామా! సాగరగామిని గంగను దరింప నాయత్తమైయుండు నీయోడ నెక్కుమని విన్నవించెను.

శ్రీ రామమూర్తి గుహుం గని నాకోర్కి ఫలింపఁజేసితివి. వనవాససాధనములను సీత యాభరణాదుల నందుఁ

* ఇది యేఁబదిరెండవసర్గమునఁ గలదు.

జేర్పుము. అనిపలికి తమ్మునింగూడి కవచమును దాల్చి తూణీర ఖడ్గశరాసనములం జక్క నమరించి జానకిం గలిసి నదికిఁ బోవు త్రోవ నాశ్రయించి పోయెను. భృత్యధర్మములను శ్రీరాముఁ డెఱుంగును గాన సుమంత్రుఁ డతనికడకుం బోయి యడంకువ నంజలిం బట్టి నేనేమి చేయవలయును? అని వేఁడెను. శ్రీరాముఁడు తనదక్షిణహస్తమున సుమంత్రుని దాఁకుచు మంత్రీ! నీవు కడు వేగమ రాజుకడకరుగుము. ఆతని నేమఱక కాపాడుచుండుము. ఇంతదూరము రథము నెక్కించి నన్నుఁ గొనివచ్చితివి. ఇఁకఁ బాదచారినై వనమునకుం బోయెద. నీవు మరలి యయోధ్యకుం బొమ్ము. అనఁగా నతఁడు తనకు సెలవిచ్చెనని యెఱింగి పిలుచుకొనిపోనొల్లఁడయ్యెఁగదా యన్న దుఃఖమున నిట్లనియెను. నీవంటిమహాపురుషుఁడు తమ్మునితో భార్యతోఁ క్షుద్రజనుఁడువలె వనముల వాసము చేయుట లోకమం దెవ్వానికైన సమ్మతము కాదు. నావంటివాని కది సమ్మతమగునా యని చెప్పనేల? దైవకృతమగు నీవిపత్తును మార్ప నెవ్వరికి సాధ్యము కాదు. బ్రహ్మచర్య మవలంబించి వేదములఁ బఠించి దయగలిగి యార్జవమున వెలయు నీవంటిమహాపురుషున కిట్టివ్యసనము వచ్చునేని బ్రహ్మచర్య వేదపాఠ దయాళుత్వ నిష్కాపట్యములవలన ఫలముగల్గునని నే నించుకయు నూహింపను. మహావీరా! నీవు సోదరునిం గూడి సీతాసహితుఁడవై పితృవాక్యమును బాలించుపొంటె వనముల నివసించి త్రిలోకములమించిన శ్రీమహావిష్ణువవలెఁ బృథుకీర్తినొందఁగలవు. త్రిలోకజయమున సద్గతి కేగఁగలవు. నీపట్టాభిషేకమునకు విఘాత మొనరించి కైకయు, నిద్రపోవుచుండఁగా జెప్పకయే వచ్చి నీవును బౌరుల వంచించితిరి. ఇఁక వగలపాలై పాపాచారముగల కైకకు లోఁబడి వర్తింపఁగల.

వార్యము కావున మాతులమే మైతిమి. అని సుమంత్రుఁడు పలికి శ్రీరాముఁ డడవి నుండవలసివచ్చి వన్న దుఃఖమున రోదనము చేసెను. పిదప నశ్రుపాతమునకుఁ బాచితముగా నాచమనము చేసి పరిశుద్ధుఁడై యుండు సారథిం గాంచి శ్రీరాముఁడు మధు రోక్తులఁ బెక్కు-సారె లూఱడించుచు నిట్లు పలికెను.

ఇక్ష్వాకువంశమున జన్మించినవారలకు నీకంటె నెక్కు-డగుమిత్రుని నెవ్వాని నేఁ జూడలేదు. నీవు మాతండ్రి నన్నుఁ దలంచుకొని దుఃఖపడకుండునట్లు చేయుచుండుము. ఆతఁడు శోకించుచున్న వాఁడు. ముదుసలి. నికామ కామపీడితుఁడు. కను కనే నేనిట్లు చెప్పుచున్నాఁడను. రాజు కైకకుఁ బ్రీతిగల్గింపఁగోరి యేమేమి యానతిచ్చినను వానినెల్ల నించుకయు ననుమానింపక చేయవలయును. ప్రభువులు కామక్రోధముల నేయేకార్యముల యందు మనస్సు ప్రవర్తించిన నవి ఫలించుటకేకదా రాజ్య మును బాలింతురు. మంత్రివర్యా! ఎట్టు లేకార్యము చేసిన రాజు ప్రీతినొందునో దుఃఖముకలుగు నవకాశము లేకయుండునో దానినట్లే చేయుచుండుము. ఇంతదనుక నాతండ్రి దుఃఖ మెట్టిదో యెఱుఁగఁడు. ముదుసలి పూజ్యుఁడు. స్వాధీనేంద్రి యుఁడు. అట్టి రాజిపుడు దుఃఖములపాలైనాఁడు. కనుక నీవు నాకు మాఱుగా మ్రొక్కి యిట్లు పలుకుము. "అయోధ్యనుండి విడిపోయితిమి. వనమున నుండవలయునన్న దుఃఖము నాకు లేదు. సీతకును సౌమిత్రికిని గూడ లేదు. పదునాలుగేండ్లు గడువఁగా నాలసింపక మేమెల్ల వచ్చి మిమ్ము దర్శింతుము." అని. సారథీ! ఇట్లు తండ్రికిఁ దల్లులకుం గైకకుం దెల్పి తరువాత సీతయు నేనును లక్ష్మణుఁడును జెప్పినట్లుగాఁ గౌసల్యకు మాయా రోగ్యము నమస్కారములు తెల్పుము. నాతండ్రితో భరతుని

వేగ పిలిపించి రాజ్యమున నునిచి కౌఁగిలించుకొమ్ము. ఆసుఖమున మాసంతాపము తొలఁగఁగలదు. అని మామాటలుగాఁ బల్కుము. తరువాత భరతునితో వత్సా! నీవు రాజువిషయమున నెట్లు ప్రవర్తింతువో యట్లే తల్లులవిషయమున నించుకంతయు భేదములేక వర్తింపుము. కైకయి శత్రుఘ్ననందలి ప్రీతిచే సుమిత్రయుఁ గన్నతల్లులవలె నెట్లు విశేషించి ప్రీతితోఁ జూడఁదగియున్నారో యట్లే నాతల్లియగుటంజేసి కౌసల్యయు నీకు మిక్కిలి మన్నింపఁదగినది. తండ్రికిఁ బ్రీతిగల్గింపఁగోరి యావరాజ్యము నంగీకరింతువుగాన నిహపరసుఖములను బ్రజలకు రాజునకుం గూర్పఁజాలుదువు. అని నేను జెప్పితినని తెల్పుము.

అని పలికి శ్రీరాముఁడు తన్నుఁ బురమునకుఁ బోవునట్లు చేయఁగా నాసుమంత్రుఁడు శోకించుచు వాని నాలకించి యిట్లు పలికెను. మహాత్మా! అనుమానముమాని నేమిచెప్పితినో యది స్నేహభావముననేయని గ్రహింపవలయు. సేవాధర్మము నతిక్రమించి నీపైఁగల కూర్మిమెంపున నాచెప్పినమాటలన్నియు భక్తుఁడనని తలంచి నన్ను మన్నింపందగు. నిన్నిటవదలి నేనెట్లు పురమునకుంబోవుదును. ఒకప్పుడందులకు నేను సాహసించినను గొడుకు నెడఁబాసిన స్త్రీవలె నిన్ను నెడఁబాపుకొను నాయయోధ్యకు నొంటరిగా నేనెట్లుపోవఁగలను? అందుఁగలప్రాణికోటులు నిన్నుఁ గూడిన యీస్యందనము నిప్పుడు నీవులేకుండఁ జూడఁగనే దుఃఖము పెల్లున హతములగునే. పౌరులు నన్నుమాత్రము చూచి మిక్కిలి దుఃఖింతురుగదా. అందలివారెల్ల దూరమున నున్న నిన్నే తలంచుచుఁ దమముందున్నరీతి భావించుకొనుచు నాహారమును వదలియుందురనుట యథార్థము. పౌరులదుఃఖ

మును నీవే చూచియున్నవాఁడవుకదా. నేను నీవు లేనిరథము దోలుకొనిపోవఁగా వేయింతలుగా దుఃఖమున విలపింతురుగదా. మీతల్లి కౌసల్యతో నేమని పల్కుదు? నీకుమారుని తల్లీ! మాతులగృహమున వదలివచ్చితినందునా? అబద్ధము నెట్లు పల్కుదు? వనములో డించివచ్చితినని నిజముచెప్పుదునా? అది యప్రియముకదా. సత్యమైన నప్రియము నెట్లు పల్కుదు! నామాట విన్నంతనే యాదేవి యసువులంబాయునే! మిమ్ము మువ్వురను వహించివచ్చిన యీయుత్తమాశ్వములు మీరులేమి నేనుదోలిన నెట్లు లీడ్వఁగలవు? కాఁబట్టి నేను నిన్ను వదలి యయోధ్య కరుగనోపను. నీవెంటనుండ నానతిమ్ము. నాప్రార్థనము నంగీకరింపవేని రథముతో నగ్నింజొత్తును. శ్రీరామా! నీతపమునకు విఘ్నముగావించు క్రూరజంతువులం బొలియింతును. మహాత్మా! పురుషోత్తమా! నీవు రాజ్యాభిషిక్తుండవై భూమిం బాలించుచుండఁగా నీకొఱకు సారథినై దానం గలుగుసుఖము దౌర్భాగ్యుఁడనగు నాకు లభింపకపోయెను. అదిలేకున్నమానె. నీతో వనవాసముచేయుచు నీకు సారథినై పరిచర్యాసుఖమునైన నొందఁగలనని యాశించుచున్నాఁడను. వనముల నీచెంత నుండఁగోరెద. ఇద్దాని కనుమతింపుమా. నాచెంతనుండుమను నీప్రియవాక్యము చెవులపండువుగా విన వాంఛింతును. ఈగుఱ్ఱము లడవిలో నిన్ను సేవించునేని ముక్తి నొందును. నేను నీకు శుశ్రూషలు చేయఁగోరుదును. అయోధ్యమాటయేల? నీవు లేక దేవలోకము లభించినను నాకు వలదు. నీసేవయే నాకుఁ గావలయును. దుష్కర్మము లొనర్చినవాఁడు దేవలోకమునకుఁ బోవ నర్హుఁడుకానిచందమున నిన్నుఁ బాసి నే నయోధ్యాపురమునకుఁ బోవఁజాలను. వనవాసనియ

మము ముగియఁగా నిన్నీ రథముననే యెక్కించుకొని యయో ధ్యకుం దీసికొనిపోవలయునని నాకుఁ గోర్కి కలదు. వనమున నిన్నుంగూడియుందు నేని నా కీపదునాలుగేండ్లు నిమేషకాల తుల్యములుగా గడచును. నిన్ను వదలియుండినన వియే నూఱేం డ్లుగా నాకుం దోఁచును. భృత్యవాత్సల్యముగల నీవు భక్తుఁ డను భృత్యుఁడను నగు నన్ను రానంగీకరించిన మర్యాదమీఱి యిక ప్రభుకుమారుని నిన్ను ననుసరించియుందును. ఇందేయప రాధము లేదు. నన్ను వదలుట నీకుఁ దగదు.

అని యిట్లు దీనుఁడై వేఁడుచున్న యాసుమంత్రునిం గాంచి శ్రీరాముఁ డిట్లు పలికెను. సుమంత్రా! నీవు ప్రభువిశ్వా సముగలవాఁడవు నాయందు నీకు విశ్వాసముకలదని యెఱుంగు దును. కాని నిన్నిపుడు రావలదని మరల నయోధ్యకుం బంపుటకుం గలకారణము నాలకింపుము. నీ వయోధ్యకుం బోవఁగా నాపిన్నతల్లి రాముఁ డడవుల కరిగెననునమ్మకము గల దగును. ధర్మాత్ముఁడగు నాతండ్రిని గుఱించి యసత్యవాదియని సందియ మొందకయుండును. తనకుమారుఁడు భరతుఁడు రాజ్య మేలుచుండఁగా వృద్ధినొందిన యారాజ్యమును బాలింపవలయు ననియే నాకోరిక. ఈలాభమునుగోరియే నిన్నుఁ బంపఁగోరుచున్న వాఁడ. ఇదియేగాక మఱికొన్ని ప్రయోజనములుకూడఁ గలవు. నాకు రాజేంద్రునకు దీనఁ బ్రియము చేకూరుఁగాన నీవిపు డయోధ్య కరుగుము. ఏయేమాట లెవ్వరెవ్వరికిఁ జెప్పుమంటినో వానినెల్ల నక్లే తెలుపుము. అని పలికి పలుమాఱు లాతని నాశ్వాసించుచు గుహునిం గని యుక్తి కనురూపముగా నిట్లు తెలిపెను. ఆర్యా! న న్నిందుండుమంటివి. జనసాంద్రమగు నిందుండుటనాకు న్యాయ్యముకాదు. తప్పక యాశ్రమములం దే

యుండందగు. తండ్రియాజ్ఞయు నట్టిదే. కావున నేను మునుల కుచితమగు వ్రతమునుబూని నాజనకునకు విశేషించి సీతాలక్ష్మణులకు మేలుగలుగ జడలుదాల్చి వనమున కరిగెదను. మఱ్ఱిపాలు తెమ్ము. అనఁగా నాగుహుఁడు మఱ్ఱిపాలు తెచ్చియిచ్చెను. తొలుత నాపాలతో లక్ష్మణుఁడు జడలుదాల్చునట్లుచేసి పిదపఁ దాను జడలు దాల్చెను. వల్కలముల ధరించి జడలదాల్చి గుహునితో రాజ్యపాలనము చాలఁ గష్టమే యగుఁజుమీ. కావున నీవు చతురంగబలములయందును గోశమునందు దుర్గములయందు దేశమునందు నించుకయైనను బ్రమాదములేక యుండవలయును.

తరువాత రఘుకులాలంకారుఁడు శ్రీరాముఁడు గుహుని వీడ్కొని తత్తఱపాటులేక సీతాసౌమిత్రులంగూడి ప్రయాణము సాగించెను గంగానదియొడ్డున నోడ కనఁబడఁగా నది వడివడిం బాఱుచున్నదిగాన నోడ నెక్కియే దాని దాఁట నూహించి పురుషసింహా! ఈయోడ కదలవచ్చి యిట నిలిచి యున్నది తొలుత నీవెక్కి భయస్వభావముగల జానకిని మెల్లగ నెక్కింపుము. అనఁగా మతిమంతుఁడు గావున ముందు సీతాదేవి నెక్కించి వెంటఁ దానెక్కుటయన్న భావమగుటం జేసి తానెక్కెను. తరువాత శ్రీరాముఁ డెక్కెను. గుహుఁడు బంధువులం గాంచి యోడను మీర లావలిగట్టునకుం జేర్పుఁడని శాసించెను. శ్రీరాముఁ డాయోడపైఁ గూరుచుండి బ్రాహ్మణక్షత్రియులకు జపింపఁదగిన "దైవీంనావమ్" అను నారోహణమంత్రము నాత్మహితార్థము జపించెను. శ్రీరామమూర్తి సీతాసహితుఁడై యాచమించి మహానందమున శరీరము పులకరింపఁగా విధిననుసరించి యాగంగానదికి నమస్కరించెను.

కాంతిమంతుఁడు లక్ష్మణుఁడు నమస్కరించెను. రాముఁ డంత గుహుని సుమంత్రుని వీడ్కొలిపి నౌక నెక్కి యిఁక నడుపుఁ డని నావికులకు నానతీయ వారు జాగరూకులై మంచితెడ్లం గైకొని జనమలర దాని నడుపఁగా నవ్వలియొడ్డున నవి చేరెను. అనిందితభూజాత నదీమధ్యభాగమున కాయోడవచ్చినంతట దోసిలొగ్గి గంగాతరంగిణిం గాంచి జననీ! ధీశాలియగు నీదాశరథి నీసంరక్షణముమూలమునఁ బదునాలుగేండ్లు పూర్ణముగా నడవులనుండి నిరంతరాయముగా వ్రతము గడిపి సోదరుని నన్నుంగూడి మరల నిచ్చోటికి రాఁగా క్షేమయుక్తి మరలి వచ్చినందులకై నావాంఛితములు ఫలింప నిన్నుఁ జక్కఁగాఁ బూజించెదను. దేవీ! నీవు త్రిలోకముల సంచరింతువు. బ్రహ్మలోకమును నీవు చూచియేయుందువు. ఈలోకమున సాగరపత్నివై యున్నావు. సుప్రసిద్ధురాలవు. కల్యాణీ! నమస్కరించెద. వినుతింతును. పురుషోత్తముఁడు క్షేమముతో మరలవచ్చి రాజ్యము స్వీకరింపఁగనే నీకుఁ బ్రియముఁ గూర్పఁదలఁచి లక్ష గోవులను వస్త్రములను మృష్టాన్నమును బ్రాహ్మణుల కొసంగుదును. దేవీ! నే నయోధ్యకు మరలఁజేరి పరిశుద్ధచిత్తమున నీకు సహస్రకుంభసంభృత మద్యమును అన్నముకొఱకు మాంసమును సమర్పించి పూజింతును. నీతటమున నేయే దేవతలుందురో వారలనందఱఁ బూజింతును. నీయొడ్డునఁగల మణికర్ణికా ప్రయాగాదితీర్థరాజములను, గాశ్యాది దేవాలయములను బూజించెదను. పాపరహితురాలవగు నోగంగా దేవీ! పాపదూరుఁడగు నీ శ్రీరామమూర్తి వనవాసవ్రతముచేసి నన్ను సోదరునింగూడి మరల క్షేమమున నయోధ్యను నీయనుగ్రహమునఁ జేరుఁ

గాక అని ప్రార్థించెను. అని యాసీత గంగను బ్రార్థించుచు దక్షిణతీరముం జేరెను.

అవ్వలియొడ్డు చేరఁగనే శ్రీరాముఁ డాయోడను వదలి సీతాసౌమిత్రులతోఁ బ్రయాణము సాగించెను. లక్ష్మణుం గాంచి రాముఁడు నేఁడు మొదలు నీవు జనులున్నను లేకయున్నను రక్షణమునందుఁ బ్రమాదములు లేకయుండుము. కని విని యెఱుఁగని నిర్మానుష్యవనభాగమునకుఁ బోవుచున్నాము. కనుక సంరక్షణకార్యమున నించుకయేఁ బ్రమాదము పనికిరాదు. లక్ష్మణా! నీవు ముందు పోవుచుండుము. సీత నీవెనుక వచ్చును. మీయిరువురం గాపాడుచు వెనుక నేను వత్తును. ఇట్టితావుల మనము పరస్పరము కాపాడుకొనుచుండవలయును. ఏకార్యమైనను దదుచితకాలము దాఁటఁగా మరల దానిని జక్కఁగా నిర్వహింప సులభము కాదు. కావున నుచితసమయమున హెచ్చరికగలిగియుండవలయును. జానకి యిపుడు జనసమ్మర్దములేక సస్యములులేక యారామములులేక భయజనకమై హెచ్చుతగ్గులు గలిగియుండునడవిని బ్రవేశించుచున్నది. ఇపుడు వనవాసకష్టము నెఱుంగఁగలదు. అనఁగా లక్ష్మణుఁడు తదాజ్ఞాప్రకారమే ముందుగాఁ బోయెను. సీతయు నావెనుకఁ జనియె. వారిద్దఱకుఁ దరువాత శ్రీరాముఁడు నడిచెను.

శ్రీరాముని వదలి చూచువారలకు జాలిపుట్టించుచు దీనుఁడై సుమంత్రుఁడు శ్రీరాముఁ డవ్వలిగట్టు చేరువఱకు నందే యుండి యనిమేషదృష్టులం గాంచుచు నతఁడు దూగముగాఁ బోవ దృష్టుల మరలించుకొని వగచెను. శ్రీరాముఁ డంత గొంతదూరము పోయి సస్యసమృద్ధమై జను లుత్సాహవంతులుగా నున్నదగు వత్సదేశమును జొచ్చెను. అందు వా

రాఁకలిపోడసూపఁగా సీత నొక్కతావున నునిచి వేఁటకుం బోయి యాయికుపురు సూకరమును, మనుఁబోతును, దుప్పిని, నల్లచాఱలుగలదుప్పిని వధించి వానియందలి పరిశుద్ధమాంసమును గొనితెచ్చి సీతంగూడి సాయంకాలమగుటంజేసి త్వరపడి యొకవృక్షముంజేరి యందు విడిసిరి.

మహాశయులారా! ఇప్పట్టునఁ దెలిసికొనఁదగిన విశేషాంశములు కలవు. వాని విమర్శించి కనుఁగొందము.

"భాస్కరోదయకాలోఽయం గతా భగవతీ నిశా,
అసౌ సుకృష్ణో విహగః కోకిలస్తాత కూజతి. ౨
బర్హిణానాం చ నిర్ఘోషశ్శ్రూయతే నదతాం వనే,
తరామ జాహ్నవీం సౌమ్య శీఘ్రగాం సాగరంగమాం." 3

అని మూలము. ఇవి శ్రీరామవాక్యములు. భగవతీ నిశా గతా= షడ్గుణైశ్వర్యసంపన్నురాలగురాత్రి గతించెను. భగవతీ యను విశేషణము శ్లోకపూరణార్థమా యన్నఁ గాదు. "నిశా రాత్రిః సర్వపదార్థానామవివేకకరీ" అని భాష్యము. ఎల్లప్రాణులకుఁ దమోబాహుళ్యమున నజ్ఞానమును గల్పించునది యని యర్థము. అట్టినిశ గడచెను. అనఁగా భావమేమి? ఇంతదనుక నాపూనిన కార్యము చేయఁ బూనిక కలుగదయ్యెను. ఇంక జాగ్రత్పడవలయును.

"యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ,
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః." ౬౯
గీత. ౨ అధ్యా.

అన్నగీతావాక్యానుసారము రేయియంతయు నెల్లరు నిద్రించుచుండ మేల్కాని యాలోచించితిని. కార్యము నిశ్చిత

మయ్యెను. రాత్రియు గతించెను. ఆమె భగవతి. మహామాయ. గడచెను. అనఁగా నన్నుం బురికొల్పి తనపనిని నిర్వర్తించి విరమించినదని యర్థము. నావలనఁ గాఁదగినకార్యములు చేయింపఁ బూనుకొన్నదని సారము. భారద్వాజపక్షియుఁ గోయిలయుఁ గూయుచున్నవి. వనమున నెమిళ్లు ధ్వనిచేయుచుండఁగా వినఁబడుచున్నది.

మానవులను నిద్రనుండి మేలుకొలిపి ప్రవృత్తిమార్గమునకుం బురికొలుప నెన్ని యోపక్షులు ప్రయాసపడుచున్నవి. వానికి మానవులు కృతజ్ఞులుగా నుండవలయును. ఉషఃకాలమాసన్నమగుచున్నదనియు, నేల నిద్రపోయెదననియు, మనుజులు మేలుకొనునంతవఱుక వాయసములు కుక్కుటములు లోనగునవి యెంతో ప్రయాసపడుచున్నవి. వనముల నేల యవి ధ్వనిచేయుచున్నవి? అందు మానవు లుండరుకదా. ఆరీతిగా ధ్వనించుట వానికలవాటు అని కొందఱందురు. గ్రామములయందు వాయసాదులు మేలుకొని యితరులం బురికొలుపును. మహారణ్యములయందును భగవంతు నారాధించు జంతువు లనేకములుగలవు. ఆపూజాపద్ధతి వేఱుగానుండు నని మన మెఱుంగవలయును. గరుడపక్షి కృష్ణా యని ధ్వనిచేయును. అదియే దానియారాధనమార్గము. ఎన్ని యోపక్షులు గోలు దోలుత లేవఁగనే భగవంతుని దెలిసియో తెలియకయో వాడుకచొప్పున బ్రార్థించుననని యోగులు పలుకుదురు. శ్రీకాళహస్తీశ్వరమాహాత్మ్యమున నీవిషయము కనంబడును. పురుపులుకూడ భగవంతు నారాధించెనని చెప్పఁబడినదే. కుమారజాతి యగుసర్పముకూడ నీశ్వరు నర్చించెనుగదా. ఇఁక మానవేతరప్రాణులు భగవంతుని సేవింపవనుట యెట్లు? ఆసేవాపద్ధతి యిట

దని మన మెఱుంగము. మన మెఱుంగని విషయములన్నియు శూన్యప్రాయము లనరాదు. ఈవిషయమున మానవులకుఁగల యజ్ఞానాహంకారములగుఱించి చింతింపవలసినదియే కాని గర్వింపరాదు. ప్రకృత మనుసరింతము.

పక్షులు లోనగుజంతువులకు మానవు లప్పుపడియున్నవారు. వానియప్పు తీర్పవలసియున్నది. భూతయజ్ఞ మెందులకు? ఆయప్పు తీర్చుటకేకదా. పంచమహాయజ్ఞములలో భూతయజ్ఞ మొక్కటిగ నిర్ణయింపఁబడినది. "భూతాని బలికర్మణా" అని స్మృతి చెప్పుచున్నది. యజ్ఞములు ఫలమును గోరి చేయఁదగునవి. హింసాప్రధానములు. కావున స్వర్గాదిలోకప్రాప్త్యర్థ మవ్వాని నాచరింతురు. బ్రహ్మయజ్ఞాదులైదును హింసాలేశము కూడ లేనివి. కావుననే మహాయ ము లనుఖ్యాతిఁ గాంచినవి.

"స్వాధ్యాయేన వ్రతైర్హోమైస్త్రైవిద్యేనేజ్యయా సుతైః,
మహాయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః." ౨౮

మను. ౨ అధ్యాయము.

"మహాయజ్ఞైః పంచభిర్బ్రహ్మయజ్ఞాదిభిః యజ్ఞైః జ్యోతిష్టోమాదిభిః."

అని కుల్లూకభట్టు.

అట్టిమహాయజ్ఞములలో భూతయజ్ఞ మొక్కటిగఁ బరిగణింపఁబడినది. పంచమహాయజ్ఞములను వదలి జ్యోతిష్టోమాదులొనరించి కుండలాలంకృతులయి ఖ్యాతిగలవార మను కొందురు. ఇస్సీ! ఎంత యసంగతము! ఎంత దారుణము!

"నిత్యకర్మరతానామేవ నైమిత్తికకర్మణ్యధికారః"

అని నియమము పెద్దలచేఁ జేయఁబడినది. ఏల? సంధ్యావంద
నము మాని యితర శ్రౌతకర్మముల నాచరించు నధికారము
గలదా? అట్టు లాచరించిన నవి "అవిధినా కృతమకృత" మ్మను
న్యాయమున నిష్ఫలములే. అంతియకాక దుష్ఫలములేయగు.
చేయనట్లే యని యూహింపఁదగు. కనుక నే గీతాశాస్త్రమునందు

"యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః,
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిం. ౨౩
తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ,
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి." ౨౪ గీత. ౧౬ అధ్యా.

అని శ్రీకృష్ణపరమాత్మయే బోధించెను. కనుక విధివిరహిత
ముగ నాచరించుకర్మములు నిష్ఫలములగుటయేగాక దుష్ఫల
ములుగూడ నగునని యెఱుంగవలయును. భూతయజ్ఞ మేతి
కనఁగా మన కెన్నెన్ని రీతులనో తోడ్పడు చుండుపక్షులు లోనగు
వానియప్పు తీఱుటకని మన మెఱుంగవలయును. కాలజ్ఞానము
పక్షులకున్నయట్లు మానవులకు లేదనుట రూఢము. వాని
కున్నంత యింద్రియనిగ్రహము మానవులకు లేదనుట సిద్ధాం
తము. పక్షులధ్వనులు వానిపైనుండి వ్యాపించు వాయువు మాన
వుల కెంతో యారోగ్యమును గలిగించి యానందమును గల్గిం
చును. కనుక వానియప్పుతీర్చుకొనక తప్పదు. ఈవిషయమును
శ్రీరామమూర్తి స్థాలీపులాకన్యాయము ననుసరించి మనకుఁ
దెలిపెను.

తొలిసంధ్య నుపాసించి శ్రీరాముఁడేక గంగానదిని
దాఁటుదమని లక్ష్మణునకుఁ దెల్పెను. "సాగరంగమామ్" అన్న
విశేషణ మొకవిశేషము నెఱిఁగించుచున్నది. సముద్రమునఁ
గలియునదులే మహానదులని పిల్వఁబడఁదగినవి. తక్కినవన్నియు

నుపనదులు. నదీశబ్దము స్త్రీలింగము. సముద్రశబ్దము పుంలింగము. భర్తృసంయోగము కలిగినఁగాని నదికిఁ బావనత్వము లేదు. అను నీకారణముచేత శ్రీరామమూర్తి మనకొక్కనీతిని దెల్పుచున్నవాఁడు. ఏమనఁగా. భర్తను గూడకయున్న స్త్రీ కులట యనంబడును. తత్సంగతి మెలఁగినచోఁ బతివ్రత యనఁబడును. అని.

"పతిం యా నాభిచరతి మనోవాగ్దేహసంయతా,
సా భర్తృలోకానాప్నోతి సద్భిస్సాధ్వీతి చోచ్యతే."

అని మనుస్మృతియుఁ దెలుపుచున్నది. ఈవిషయమున నభిప్రాయభేదము కానరాదు. కావునఁ బతి నెడఁబాయనినాతి పతివ్రత యనంబడును. ఆమెయశస్సు చిరకాలము నిలుచును. అట్టియశస్సు నార్జించుటకే పురంధ్రీమణులు ప్రయత్నింపవలయును.

"అసత్యమపి నైవాహం బ్రూయాం వచనమీదృశం,
కథమప్రియమేవాహం బ్రూయాం సత్యమిదం వచః." ౪౬

అని మూలము. సత్యమైన నప్రియము పలుకఁజాలను. ప్రియమైన నసత్యము పలుకఁజాలను. అని సుమంత్రునితోట మహర్షి పలికించెను. ఈయర్థమునే

"సత్యం బ్రూయాత్ప్రియం బ్రూయాన్న బ్రూయాత్సత్యమప్రియం,
ప్రియం చ నానృతం బ్రూయాదేష ధర్మస్సనాతనః."

అని మనుస్మృతి తెల్పెను. సత్యము ప్రియమునగుదానిని దెలుపవలయునని అప్రియమగుసత్యమును జెప్పరాదని, ప్రియమైన నసత్యమును బలుకరాదని దీనితాత్పర్యము. ఇతరులు తన మాటలమూలమున నార్తులుగాకయుండవలయుననియే యీ

యుపదేశఫలము. మాటలాడునపుడు కర్ణకఠోరము హృదయతాపకరము నగునట్లు సత్యమునైన బలుకరాదు. హితముగా నసత్యమును బలుకరాదు. అని మన మీభాగమునుండి నేర్చుకొనవలయును.

"భవిష్యంతి వనే యాని తపోవిఘ్నకరాణి తే,
రక్షేన ప్రతిబాధిష్యే తాని సత్త్వాని రాఘవ." ౫౦.

అను నీమూలము మనకొక క్రొత్తవిషయమును దెలుపుచున్నది. మానవు లెట్లు సత్కార్యములకు విఘ్నము లొదవించి యానందింతురో అట్లే వనమునుండి తప మాచరింపఁబూనినను క్రూరమృగములు తపోవిఘ్నము చేయఁ బ్రయత్నించును. "శ్రేయాంసి బహువిఘ్నాని" అన్నసూక్తి సార్థకమే కదా. అనఁగా దపస్సు సకలపాపముల నశింపఁజేసి భగవద్దర్శనలాభమును గూర్చునది. కావున నట్టిదాని కీతఁడు పాత్రుఁడగునా కాఁడా యని భగవంతుఁడు పరీక్షించును. అనఁగాఁ గ్రూరమృగదర్శనము, వానిభయంకరధ్వనులు వినఁబడుట, లోనగు బాధ లెన్నియో కలుగఁగా వానికి నోర్చుకొని తపమొనరింపవలయును. ఏల యీపరీక్ష. భగవంతునకని యడుగవచ్చును. తన్ను దర్శించునంతజ్ఞానము కలదా లేదా యని విమర్శింపవలదా. ఎవ్వానికి మనస్సు సర్వభూతముల నంతర్యామియగు నాపరతత్త్వమునే చూచునో యాతనికిఁ గ్రూరాక్రూరభేదము లుండవు. ఆస్థితియందున్నవాఁడా లేదా యనియే యీపరీక్ష.

"సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని,
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః." ౨౯
గీ. ౬ అ.

అనికదా గీతాశాస్త్రము తెల్పుచున్నది. అట్టిపరీక్షలలో నాటి తేటినవాఁడే భగవద్భక్తుఁడగును. ఆతనినే కరుణించి పరాత్పరుఁడు సంసారార్ణవమునుండి యుద్ధరించును. శంకరుఁడే శ్రేష్ఠుఁడని యొక్కఁడు విష్ణువే శ్రేష్ఠుఁడని యొక్కఁడు వాదించుచుఁ బరస్పరము శివవిష్ణువుల దూషించుచు నుండువారు భక్తులా? జగద్వంచకులా? ధనదాసులా? వీరి కేమని పేరు పెట్టవలయునో తెలియరాకున్నది. సమదర్శనుఁడు కానివాఁడు నా భక్తుఁడు కాఁడని శ్రీకృష్ణపరమాత్మ బోధించుచుండఁ జిహ్వాములు లేకున్న భగవంతుఁడు భక్తులననుగ్రహింపఁ డనుప్రేలు వారలెంతధనదాసులో యోజింపుఁడు. పరమేశ్వరుఁ డన్నిమతములవారలయందు సమబుద్ధికలవాఁడు. అందెవ్వరు ధనాశావిరహితులో నిర్మలాత్ములో తనను సర్వత్ర కాంతురో వారి నుద్ధరించును. విష్ణుమూర్తినే యారాధించినఁగాని వాంఛలనొసంగఁ డనుమూర్ఖులు కలరు. ఇతరమతములవారు తమమతధర్మముల ననుసరించి భక్తియుక్తి నారాధించినచో వారలం గరుణింపఁ డనవచ్చునా? అన్నచో నతఁడు భగవంతుఁ డెట్టులగును? సర్వరూపములు తానై యంతట వెలయువాఁడుకదా భగవంతుఁడు. కావున నట్టి నీచోపదేశములకు దూరముగనుండి యెవ్వరికేరూపము నేనామము ప్రియముగనుండునో యారూపమున నానామమున నాపరమేశ్వరు ధ్యానించిన వినుతించిన నతఁడు ప్రసన్నుండగును.

"ఇమే చాపి హయా వీర యది తే వనవాసినః,
పరిచర్యాం కరిష్యంతి ప్రాప్స్యంతి పరమాం గతిం." 13

అను నీమూలము భగవదుదేశమును దేటపఱచుచున్నది. స్కాందమహాపురాణమున శ్రీశంకరుఁడు సాలెపురువునకు

భుజంగమునకు గజమునకు ముక్తినొసంగునట్లు గలదు. తిర్య గ్జంతువులకుంగూడ ముక్తికలుగునా యని కొంద ఱాసడింతురు. అట్టివారి నోరుమూయించుటకే యీశ్లోక మిందుఁ బొందు పఱుపఁబడినది. ఇదియు నేల యప్రమాణము కాఁగూడదందు రేని వారు నాస్తికులే యగుదురు. వారివాదముల నేయాస్తి కుఁడు నాలకింపఁడు. వనమున నివసించు నీకు నోశ్రీరామా! యీగుఱ్ఱములు శుశ్రూష సలుపునేని పరమగతి నొందును. శుశ్రూషయనఁగా వంగివంగి దండములు పెట్టుట కాదు. దేవాల యముల నలికి ముగ్గులు పెట్టుట కాదు. ఏవాని కేది యర్హమో యావిధమున భగవంతు నారాధించుట యని యర్థము. వంగి వంగి దండములు సమర్పించు దాసులు ధనదాసులే. మనశ పూర్వకముగాఁ బరమేశ్వరుని సేవించుటయే భక్తి. ఏజంతు వైనను భగవదనుగ్రహమునకుఁ బాత్రమైన ముక్తినొందును. తోలుతిత్తినిబట్టి ముక్తి దొరకదు. ఒడలు కనఁబడకుండఁ దులసి పూసలహారములు ధరించినంతమాత్రమున భక్తుఁడు కాఁడు.

"అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ,
నిర్మమో నిరహంకారస్సమదుఃఖసుఖః క్షమీ. ౧౩
సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః,
మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్తస్స మే ప్రియః. ౧౪
అనపేక్షశ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః,
సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః." ౧౬

గీత. ౧౨. అధ్యా.

"ఆరభ్యంత ఇత్యారంభాః ఇహాముత్రార్థాని కామహేతూని కర్మాణి సర్వా రంభాః తాన్ పరిత్యక్తుం శీలమస్యేతి సర్వారంభపరిత్యాగీ యో మద్భక్త స్స మే ప్రియః" అని భాష్యము.

అని శ్రీకృష్ణమూర్తి యర్జునునకుం దెల్పెను. ఇట్టివారే భక్తులని సిద్ధాంతముచేసెను భగవద్భక్తి యిది కాదన్నచో నొక నమస్కారము. సర్వకర్మవిముఖుఁడై అనఁగా వానిఫలములం గోరక యాశవదలి యితరులను ద్వేషింపక

"తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్,
అనికేతస్స్థిరమతిర్భక్తిమాన్ మే ప్రియో నరః." ౧౯
గీత. ౧౨. అధ్యా.

అన్నగీతావాక్యము ప్రకారము తన్నొరులు దూషించినను భూషించినను సమముగా భావించుచు దొరకినదానితో సంతుష్టినొందుచు నుండువాఁ డెవ్వఁడో వాఁడు భగవద్భక్తుఁడని నమ్మవలయును. అంతియకాని ధనము కొంచెమిచ్చిన నోటికి వచ్చినట్లు తిట్టుచు నెక్కువ యొసంగిన భట్టురాజువలెఁ బొగడుచుఁ గ్రొత్త క్రొత్త కార్యము లారంభించి లోకము నుద్ధరింతు మని ప్రకటించి ధనములాగుచు సర్వము భగవదర్పణము చేసితి మని కన్నులు తేలవైచుచు భగవంతుని ధ్యానించునట్లు నటించి యెవ్విధనమున ధనము లాగవచ్చునా యని యోజించుచు నప్పటికిఁదగినట్లు లేదోయుక్తిఁ బన్నుచు యోగులమని జ్ఞానులమని నిస్సంగులమని భక్తులమని సమయోచితముగా శ్రోతలయోగ్యతను గనిపెట్టి డంబములుపలుకుచుండు ధనదాసులు భక్తులగుదురా? వారు రహస్యమృష్టాన్నభుక్తలే యగుదురు. అట్టివారినుడుల నవలంబించి యథాశక్తి న్యాయము ననుసరించి నిర్మలచిత్తమున భగవంతుని సేవించుచుండిన నాకరుణానీరధి జాతి నాలోకింపక వేషభాషల లెక్కింపక నిర్మలచిత్తమునే పరికించి యానందించి ముక్తినొసంగు ననువిషయము మన మీభాగమునుండి గ్రహింపవలయును.

"తవ శుశ్రూషణం మూర్ధ్నా కరిష్యామి వనే వసన్,
అయోధ్యాం దేవలోకం వా సర్వథా ప్రజహామ్యహాం." ౫౪

అని మూలము. వనమునవసించి నీకు శుశ్రూష శిరస్సుచేఁ జేయు చున్నాఁడను. అయోధ్యనుగాని తుదకు స్వర్గమునుగాని వదలు దును. అనఁగా నీసేవయే ప్రధానమనుట. ఇందొొక్క విశేషము కలదు. శిరస్సుచే సేవచేయుట యనఁగా భావమేమి? వనవాస మున విశేషమేమి? ఏకాంతస్థలమునఁ గూరుచుండి సహస్రార కమలగతుండయి తేజోరూపమున వెలయుభగవంతు నాంతర దృష్టిచేఁ దిలకించుటయే యుపాసించుట యని యర్థము.

"మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం
స్థితం స్వాధిష్ఠానే హృది మరుతమాకాశముపరి,
మనోఽపి భ్రూమధ్యే సకలమపి భిత్వా కులపథం,
సహస్రారే పద్మే సహ రహసి పత్యా విహరసి."

అని శ్రీశంకరభగవత్పాదులుగారు తేటపఱచిరి. మూలాధార స్వాధిష్ఠానమణిపూరకానాహతవిశుద్ధాజ్ఞాత్మకములు షట్చక్ర ములు. ఇవి పృథివ్యగ్నిజలవాయువ్యోమ మనస్తత్త్వాత్మక ములు. ఈతత్త్వము లాయాచక్రములయందుఁ దన్మాత్రత్వ మున నుండును. తన్మాత్రలనఁగా గంధరూపరసస్పర్శశబ్దాత్మక ములు. ఆజ్ఞాచక్రస్థితమగు మనస్తత్త్వముచేతఁ బదునొకం డింద్రియములు గ్రహింపఁబడును. ఇ శ్లోకవింశతితత్త్వములు ప్రతిపాదింపఁబడినవి. పతితోసహస్రారకమలమునందు విహరింతు వనుటంజేసి తత్త్వచతుష్టయము సూచింపఁబడియె. మాయా శుద్ధవిద్యామహేశ్వరసదాశివాత్మకమే తత్త్వచతుష్టయమని యెఱుంగందగు. పైవానితోఁ గలిసి పంచవింశతితత్త్వము లయ్యెను. ఇవి ప్రాకృతము లనంబడును. మాయ మహేశ్వరునిం

గూడి యతనికి జీవత్వము నాపాదించును. ఆజీవుఁడు ప్రాకృతుఁడే యనంబడును. శుద్ధవిద్యయన్ననో సదాశివునింగూడి సాదాఖ్యకళయని వ్యవహరింపఁబడును. కనుక భగవతి చతుర్వింశతి తత్త్వముల నతిక్రమించి సదాశివునితోననఁగా నిరుపద్రవ తత్త్వముతోఁగూడి విహరించుచు నిరుపదాఖ్యతత్త్వమనంబడుచుఁ బరమాత్మ యని వినుతింపఁబడును. అట్టి నిరుపమాన తేజోరూపము ననఁగాఁ బ్రకృతిపురుషైక్యరూపమునని యర్థము. దానిని ధ్యానించుట యని తాత్పర్యము. ఇదియే నిరుపమానభగవత్సేవయని యెఱుంగవలయును. ఇదియే తపస్సు. యోగమతసారమిదియే.

"ధన్యానాం గిరికందరే నివసతాం తేజః పరం ధ్యాయతామ్."

అని భర్తృహరిచెప్పినవాక్యభావ మిదియే. శిరస్సుతో నిన్ను సేవింతుననఁగా నిన్ను నాంతరపూజావిధి ధ్యానింతునని సుమంత్రునియాశయము. అంతజ్ఞానము సుమంత్రునకుఁగలదా యందురమో. మహర్షులను సేవించినప్రాజ్ఞున కీమాత్రము తెలియదేమో యని సంశయించుట మనదౌర్భాగ్యముననే యనుకొనుట మంచిది. ఈయర్థమును దృఢపఱచు శ్రీరాముని వాక్యముల నాలకింపుఁడు.

"జానామి పరమాం భక్తిం మయి తే భర్తృవత్సల,
శృణు చాపి యదర్థం త్వాం ప్రేషయామి పురీమితః. ౬౦

.. ..

నేదానీం గుహా యోగ్యోఽయం వాసో మే సజనే వనే,
అవశ్యం హ్యాశ్రమే వాసః కర్తవ్యస్తద్గతో విధిః.
సోఽహం గృహీత్వా నియమం తపస్విజనభూషణం,
హితకామః పితుర్భూయస్సీతాయా లక్ష్మణస్య చ. ౬౫

జటాః కృత్వా గమిష్యామి న్యగ్రోధక్షీరమానయ.”

అని మూలము. సుమంత్రా! నాయందు నీకుఁగలభక్తి నెఱుంగుదును. దాని ననుసరించి తోడ్కొనిపోవలసినదే. కారణాంతరము లనేకములు గలవు. వానినెల్ల నీకుఁ జెప్ప వలనుపడదు. ఒక్క కారణము చెప్పెద నని శ్రీరామమూర్తి చెప్పెను. ఈ వాక్యములు పైనవ్రాసినయాశయమును దృఢపఱచుచున్నవి కదా. కావున నదియే భగవంతుని సేవించు నుత్తమమార్గము.

గుహునితో శ్రీరాముఁ డిట్లు చెప్పుచున్నాఁడు. మనుజులుండుతావున నిపుడు నేనుండఁదగదు. తాపసు లుండఁదగు తావులనే యుండవలయును. కావున మునిజనులకుఁ దగిన నియమమును గ్రహించి తండ్రికి హితము చేయఁగోరినవాఁడనై జడలు ధరింతును. అనఁగా భావమేమి? నిర్జనారణ్యములనే యే నుండవలయును. విధితంత్రముననుసరించి తాపసాశ్రమముల నుండఁదలఁచితిని. అనుటచే శ్రీరామమూర్తి లోకుల కొకహితము దెల్పఁ బూనెను. మహాకార్యముల నొనరించువారు భగవత్కరుణకుఁ బాత్రులు కావలయును. దైవతేజస్సు మిక్కిలి గల్గినఁగాని యాకార్యము సాధింపఁజాలరు. ఆతేజస్సు యోగమువలనఁగాని సిద్ధింపదు. యోగము నభ్యసింప నేకాంతస్థలము కావలయును. అందులకరణ్యములు గిరికందరములు ముఖ్యములు. యోగికానివాఁడు భగవత్తేజస్సు నారాధింపఁజాలఁడు.

“తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః,
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున.”

అని భగవంతుఁడే పలికెను. ఇపుడు శ్రీరాముఁడు నిర్జనారణ్యముల నియమమూని తనతేజోరూపమును దానే యుపాసింపఁ

బూనెను. ఏల? ఈమూర్గమత్యుత్తమమని లోకులకు నుపదేశించుటకే యని యెఱుంగవలయును.

"భూయస్సీతాయా లక్ష్మణస్య చ హితకామః"

అనుచోఁగల విశేషమేమి? రాముఁడు జడలుదాల్చుట సీతాదేవికి మిక్కిలి హితము. ఆమెసంకల్పము ఫలించును. అనఁగా మహాతపశ్శాలియగు రావణాసురుని దపోవేషధారియగు శ్రీరాముఁడే సంహరింపవలయును. లక్ష్మణునకు హితముకొఱకనఁగా లక్ష్మణునకు శాశ్వతకీర్తిగలుగుట కొఱకని యెఱుంగవలయును. అదియే మహాప్రకృతిసంకల్పము. అది నెఱవేఱవలసినదే. కావుననే జడలు దాల్చెనని తెలిసికొనందగు.

"పుత్రో దశరథస్యాయం మహారాజస్య ధీమతః,
నిదేశం పారయిత్వేమం గంగే త్వదభిరక్షితః. ౮౩
చతుర్దశ హి వర్షాణి సమగ్రాణ్యుష్య కాననే,
భ్రాత్రా సహ మయా చైవ పునః ప్రత్యాగమిష్యతి. ౮౪
తతస్త్వాం దేవి సుభగే క్షేమేణ పునరాగతా,
యక్ష్యే ప్రముదితా గంగే సర్వకామసమృద్ధినీ. ౮౫
... ...
ప్రాప్తరాజ్యే నరవ్యాఘ్రే శివేన పునరాగతే. ౮౭
గవాం శతసహస్రాణి వస్త్రాణ్యన్నం చ పేశలం,
బ్రాహ్మణేభ్యః ప్రదాస్యామి తవ ప్రియచికీర్షయా." ౮౮

అని మూలము. ఇది సీతాకృతగంగాప్రార్థనాదికము.

"దశరథస్యపుత్రోఽయం త్వదభిరక్షితః. మహారాజస్యనిదేశం పారయిత్వా."

అని యన్వయక్రమము. ఓగంగాదేవి దశరథమహారాజపుత్త్రుఁడు శ్రీరాముఁడు నీచే రక్షింపఁబడి అని యర్థము. ఇందుఁగలవిశేషమేమనఁగా దేవతాప్రార్థనము చేయునపుడు నీవే సర్వాధారస్వరూపవని తలంపవలయు. ఇపుడు గంగాదేవినే సర్వకారణ

ముగా సీత భావించెను. దీనిచేత నెవ్వఁడైన నే దేవతను బ్రార్థించి నను త్వదన్యమేదియు లేదని తలంపవలయునను విషయము తేలెడిని. అదియే భావనయందుఁ గలవిశేషము.

"సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః,
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే." ౩౧

గీత. ౬ అ.

అనుగీతాశాస్త్రముకూడఁబై వ్రాసినదానినే దృఢపఱచుచున్నది. ఈభావనచేత దేవతాద్వేషపిశాచము నశించును. రాముఁడు శ్రేష్ఠుఁడు. శివుఁ డుత్కృష్టుఁ డనుదుర్వాదములు చేయువారి నోళ్లు మూతపడును. ఈ దేవతాద్వేషమే కొందఱకుఁ బది రూపాయలు దొరకునట్లుచేయుచున్నది. కాని యది యాముష్మిక భంగకరము. ధనమే మర్యాద నిచ్చునన్న దాసులు కపట యోగులు సంతోషించిన సంతోషింతురుగాక. మతసారముల నెఱింగిన పెద్దలాదుర్వాదము నాలకింపరనుట రూఢము.

"సురాఘటసహస్రేణ మాంసభూతౌదనేన చ,
యక్ష్యే త్వాం ప్రయతా దేవి పురీం పునరుపాగతా. ౮౯
యాని త్వత్తీరవాసీని దైవతాని వసంతి చ,
తాని సర్వాణి యక్ష్యామి తీర్థాన్యాయతనాని చ." ౯౦

అని మూలము. ఇందు సురాశబ్దము క్షత్రియార్హమద్యవాచకము. మాంసశబ్దము మేధ్యపశుమాంసవాచకము త్రేతాయుగమున క్షత్రియాదులకుఁ గ్రీడోచితమద్యములు కొన్ని చెప్పఁబడినవి. బ్రాహ్మణుల కని చెప్పఁబడలేదు. మాంసములు కొన్ని బ్రహ్మక్షత్రియవైశ్యులకు స్మృతులచే నిర్ణయింపఁబడినవి. "యదన్నం పురుషో భుంక్తే తదన్నం తస్య దేవతాః" అన్నసూక్తి ననుసరించి విధివిహితముగాఁ బామారగింపఁదగువస్తువుల వారిదేవతలకు నైవేద్యము పెట్టవచ్చును. ఆయాచారమునే

సీతవాక్యము బోధించుచున్నది. మహానదులతీరమునందు నేయే దేవత లుందురో యేయేతీర్థములు గలవో దేవతాస్థానములు గలవో వానినెల్ల నారాధింతునని సీత ప్రార్థించెను. అనఁగా మహాత్ములారాధింప నావాహనము చేసియుండు దేవత లందే యుందురు. కనఁబడనందున వేరనరాదు. యోగదృష్టికి వారగపడుదురు. కొన్ని యేండ్లకుమునుపు మీచరణసేవకుఁడగు నీతఁడు గౌతమీతీరమున సంధ్యవందనముచేసి యిష్టదేవత నుపాసించుచుండఁగా నందేయున్న మహావృక్షమునిండ దివ్య తేజోరాసులగు దేవత లగపడిరి. పరిశీలించిచూచుచు వారిని బలుకరింపఁబూనునంతలో నదృశ్యులైరి. ఈమాట విశ్వాసపాత్రము కాదన్నను బాధలేదు. నాటంగోలె నీతఁడు దేవతలెల్లతావులం గలరన్నవిశ్వాసము కలవాఁడయ్యెనని విన్నవించుచున్నాఁడు.

"అగ్రతో గచ్ఛ సౌమిత్రే సీతా త్వామనుగచ్ఛతు,
పృష్ఠతోఽహం గమిష్యామి త్వాం చ సీతాం చ పాలయన్.
అన్యోన్యస్యేహ నో రక్షా కర్తవ్యా పురుషర్షభ." ౯౬
"నహి తావదతిక్రాంతా సుకరా కాచన క్రియా."

అని మూలము.

"ఆదానస్య ప్రదానస్య కర్తవ్యస్య చ కర్మణః,
క్షిప్రమక్రియమాణస్య కాలః పిబతి సంపదః."

అన్నసూక్తిమూల మీశ్రీరామవాక్యమే యని యెఱుంగవలయు. ఏకార్యముగాని సమయముదాఁటక యుండఁజేయుట సులభముకదా. అనునదియే యిందుఁగలనీతి. మీవెనుక సీతను నిన్ను (లక్ష్మణుని) బాలించుచు వచ్చెదను. అనఁగా సర్వరక్షకుఁడనై మీవెనుక వత్తునని భావము. ఇట్లనుటచే నెల్లరకర్మవర్తనములఁ గనిపెట్టుచు వారివారి కనువగుఫలముల నొసంగుచు సర్వమును జూచుచునుందునని సారము. ఇట్లనుటచే

పరేశ్వరత్వ సర్వకారణత్వములు నిరూపింపఁబడియెను. ఇఁక నీఘట్టమున నధ్యాత్మరామాయణమును బఠింతము.

"తచ్ఛ్రుత్వా లక్ష్మణః ప్రాహ సఖే శృణు వచో మమ. ౪
కః కస్య హేతుర్దుఃఖస్య కశ్చ హేతుస్సుఖస్య వా,
స్వపూర్వార్జితకర్మైవ కారణం సుఖదుఃఖయోః. ౫
సుఖస్య దుఃఖస్య న కోపి దాతా పరో దదాతీతి కుబుద్ధిరేషా,
అహం కరోమీతి వృథాభిమానస్స్వకర్మసూత్రగ్రథితో హి లోకః. ౬
సుహృన్మిత్రార్యుదాసీనద్వేష్యమధ్యస్థబాంధవాః,
స్వయమేవాచరన్ కర్మ తథా తత్ర విభావ్యతే. ౭
సుఖం వా యది వా దుఃఖం స్వకర్మవశగో నరః,
యద్యద్యథాగతం తత్తద్భుక్త్వా స్వస్థమనా భవేత్. ౮
న మే భోగాగమే వాంఛా న మే భోగవివర్జనే,
ఆగచ్ఛత్వథ మాగచ్ఛత్వభోగవశగో భవే. ౯
యస్మిన్ దేశే చ కాలే చ యస్మాద్వా యేన కేన వా,
కృతం శుభాశుభం కర్మ భోజ్యం తత్తత్ర నాన్యథా. ౧౦
అలం హర్షవిషాదాభ్యాం శుభాశుభఫలోదయే,
విధాత్రా విహితం యద్యత్తదలంఘ్యం సురాసురైః. ౧౧
సర్వదా సుఖదుఃఖాభ్యాం నరః ప్రత్యవరోహ్యతే,
శరీరం పుణ్యపాపాభ్యాముత్పన్నం సుఖదుఃఖవత్. ౧౨
సుఖస్యానంతరం దుఃఖం దుఃఖస్యానంతరం సుఖం,
ద్వయమేతద్ధి జంతూనామలంఘ్యం దినరాత్రివత్. ౧౩
సుఖమధ్యే స్థితం దుఃఖం దుఃఖమధ్యే స్థితం సుఖం,
ద్వయమన్యోన్యసంయుక్తం ప్రోచ్యతే జలపంకవత్. ౧౪
తస్మాద్ధైర్యేణ విద్వాంస ఇష్టానిష్టోపపత్తిషు,
న హృష్యంతి న ముహ్యంతి సర్వం మాయేతి భావనాత్." ౧౫

సర్గము. ౬

శ్రీరామమూర్తి పవ్వళించియుండుతఱి సాగిన గుహలక్ష్మణుల సంభాషణ మిది. ఇయ్యది విశేషించి కర్మసిద్ధాంతమును బోధించు

చున్నది. దీని నెఱింగిన ద్వేషమూనునవకాశము నశించును. అహంకారము తొలంగును. కర్మము భగవత్స్వరూప మను జ్ఞానము లభించును.

ప్రాయికముగా మానవులు తమరనుభవించుకష్టముల కితరులు హేతుభూతులని యూహింతురు. ఆకారణమున నత నిపై ద్వేషమూని దానిని మించినకష్టమును వారికిఁ గల్గింపఁ బ్రయత్నింతురు. తమ రేసమర్థులమని యహంకారమును బూను దురు. సుఖము లనుభవించునపుడు తమకృత్యము లే యందులకుఁ గారణములని తలంతురు. దాన మఱింత యహంకారము వారి మదులఁ బొడలును. తమ రొనరించు ప్రయత్నము లెంతదృఢతమ ములైనను ఫలింపక యవి వ్యర్థములు కాఁగా నపుడైనఁ గర్మము బలవత్తమమని భావింపక యితరు లాకార్యములఁ బాడుచేసి రనియే యూహింతురు. సులభప్రయత్నమున మహాప్రయత్న సాధ్యకార్యము ఫలించినపుడది తమశక్త్యతిశయమున ఫలించె నని మిగుల గర్వింతురు. అజ్ఞానులనుట కింక వేఱేమి యుదాహర ణము కావలయును? ఆవిషయమున నీసంభాషణము మిక్కిలి తగియున్నది. కర్మము భగవత్స్వరూపము. దానిత్రిప్పులకు లోనుగానివా రుండరు. హరిహరబ్రహ్మాలే కర్మఫలముల నను భవింతురన నిఁకఁ దక్కినవారిమాట యేటికి?

"న హి కశ్చిత్క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్,
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః. 5
నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః,
శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః." 8

గీత. 3 అధ్యా.

అను నీభగవద్వాక్యములు కర్మము బలవత్తరమని తెలుపు చున్నవి. కర్మగతులు దురూహములని మాత్ర మెఱింగినవారు

సుఖముగనుందురు. ద్వేషభావ మానునవసరము వారలకు లేక యుండును. అపుడు వారు తొలిజన్మమునఁ జేసియున్న కర్మములు ఫలముల నీఁజాలుననియు వాని ననుభవింపక తప్పదనియు వారలకుం దోఁచును. దాన నహంకారము తొలఁగును. తమ కష్టముల కితరులు కారణభూతులు కారనుభావము పొడకట్టును. ఆభావమే నిర్మలజ్ఞానముఁ గల్గింపఁ గారణమగును. ఆజ్ఞానము భగవంతునితత్త్వ మెఱిఁగించును. దాన ముక్తు లగుదురు. కావునఁ గర్మమార్గము సర్వాధారమని మన మెఱుంగవలయు. సత్కర్మముల నాచరించునపుడు వానివలన నిట్టిలాభములు వలయుననిమాత్ర మాశింపరాదు.

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన,
మా కర్మఫలహేతుర్భూర్మా తే సంగోఽస్త్వకర్మణి. ౪౭
యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ,
సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే. ౪౮
దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ,
బు శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః." ౪౯

గీత. ౨ అధ్యా.

అను నీగీతావాక్యము లీవిషయమునే దృఢపఱచుచున్నవి. ఇట్టివిషయము లీసంభాషణమునుండి మనము గ్రహింపవలయును.

సీత గంగాదేవిని బ్రార్థించినవిషయము మాంసము సురాఘటములు సమర్పించువిషయ మీ రెండింటియందు సమానమనియే భావింపవలయును.

"ఆయాస్యామ్యుదితం సత్యం నాసత్యం రామభాషితం,
ఇత్యుక్త్వాలింగ్య తం భక్తం సమాశ్వాస్య పునః పునః.
నివర్తయామాస గృహం సోఽపి కృచ్ఛ్రాద్యయౌ గృహం,

తత్ర మేధ్యం మృగం హత్వా పక్త్వా హుత్వా చ తే త్రయః,
భుక్త్వా వృక్షతలే సుప్త్వా సుఖమాసత తాం నిశామ్."

౬ సర్గము.

"నాసత్యం రామభాషిత" మ్మనునదియే మనము గ్రహింపఁదగినది. అసత్యము శ్రీరామునోట వెడలదని భావము. శ్రీమద్రామాయణమునందు "అనృతం నోక్తపూర్వమ్" అని కలదు. సత్యవచనమునకు నుదాహరణమే శ్రీరామాయణమని యెఱుంగవలయును. గంగానదిం దరించి సీతారామలక్ష్మణులు పోయి యొకవృక్షమూలమున విడియుట పవిత్రమృగమాంసమును భక్షించుట యనునవి రెండింటియందు సమానమే యనవచ్చును. మునివృత్తినుండువారలు మాంసము భక్షింపవచ్చునా యనుప్రశ్నమున కింతకుముందే సమాధానము వ్రాయఁబడినది. మరల వ్రాయనక్కఱ లేదు.

మహాత్ములారా! యిట్టు శ్రీరామాయణభాగము భగవత్తత్త్వమును జక్కఁగా బోధించుచున్నది. శ్రీరామచంద్రుని సర్వేశ్వరత్వ సర్వకారణత్వాదుల వెల్లడించుచున్నది. మఱియు జానకీదేవిమహత్త్వమును బోధించుచున్నది. ఇట్టి తావుల బఠించునపుడు కథయందే కాక తత్ప్రతిపాదితవిషయసారమందు మనస్సునునిచి వానినెఱింగి తదుక్తప్రకారము ప్రవర్తింపవలయును. శక్యమైనఁగదా యన్న యథాశక్తి న్యాయముగలదు గదా. శక్తివంచనసేయక దేవతాంతరద్వేషమువదలి భగవంతుఁడు సర్వమతములవారలకు నుపాస్యుఁడే యని నిశ్చయించి యేరూపమునఁబూజించినను నిర్మలభక్తియుండిన ఫలము సమానమే యని తలంచి యారాధించి కృతార్థులము కావలయును. శంకరుఁడు శ్రీరామతారకోపాసకుఁ డన్నమాట వినఁ

బడఁగా నెంతటియుత్సాహము కలుగునో శ్రీరాముఁడు శంకరమంత్రోపాసకుఁ డన్నమాట వినినప్పు డంతటియుత్సాహమును గాంచుచు భగవంతు నారాధింపవలయును. శ్రీరాముఁడు నిర్లిప్తుఁడనియు మహాప్రకృతియగు సీతాదేవి సర్వకార్యముల నిర్వహించుచుండఁదాను సర్వసాక్షి కావునఁ జూచుచుండుననియు మన మెఱుంగవలయును. ఇపుడు శ్రీ సీతారాములు తమయవతారఫలమును లోకమునకుఁ గల్గింపఁ బ్రయాణముచేసి దీక్షవూనిన ప్రథమదినమే యిది. తరువాతి కథను మఱియొక ప్రకరణమునఁ బఠింతము. ఏభాగము పఠించినను నిశ్చలభక్తితో నర్థము నరయవలయును. భగవత్తేజోరూపమును ధ్యానింపవలయును. బాహ్యపూజాసక్తిఁ దొలఁగి మనోవీథి భగవంతుని నిలిపి ధ్యానింపవలయును. అదియే భగవంతునియనుగ్రహమునకుఁ బాత్రునిగాఁ జేయును.

అసితకమలభాసా భాసయంతం త్రిలోకం
దశరథకులదీపం దైవతాంభోజభానుం,
దినకరకులబాలం దివ్యకోదండపాణిం
కనకఖచితరత్నాలంకృతం రామమీడే.
వామే కోదండదండం నిజకరకమలే దక్షిణే బాణమేకం
పశ్చాద్భాగే చ నిత్యం దధతమభిమతం చాపతూణీరభారం,
వామేఽవామే లసద్భ్యాం సహమిళితతనుం జానకీలక్ష్మణాభ్యాం
రామం శ్యామం భజేఽహం ప్రణతజనమనఃఖేదవిచ్ఛేదదక్షమ్.
అంభోధరశ్యామలమంబుజాక్షం, ధనుర్ధరం వీరజటాకలాపం,
పార్శ్వద్వయే లక్ష్మణమైథిలీభ్యాం, నిషేవ్యమాణం ప్రణమామి రామం."

దుష్టధ్వంసనదీక్షాపరిగ్రహము నాల్గవప్రకరణము సంపూర్ణము.

చెన్నపురి : వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము—1933.